శ్రీ శంభు భారతము

(ఛత్రపతి శంభాజీ పద్య ప్రబంధము)

రచన : " సింహరాజ్ "

శింగరాజు శ్రీ రామకృష్ణ ప్రసాదరావు



కృతికర్త : సింహరాజ్

శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు

కృతికర్త ధర్మపత్ని:

శ్రీమతి శింగరాజు (వేములపాటి) సీతాలక్ష్మి

అంకితము

కృతికర్త :

డా॥ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు

కృతి స్వీకర్త్రి : కృతికర్త అక్కగారు

శ్రీమతి పొన్నలూరు (శింగరాజు) శారదాంబ

కృతికర్త ధర్మపత్ని :

శ్రీమతి శింగరాజు (వేములపాటి) సీతాలక్ష్మి

ఉ॥ అమ్మకు, అమ్మలేని తన మాత్మకు సోకగనీని నాన్నకున్
అమ్మను మించి మమ్ములను నర్మిలి సాకిన మేనయత్తకున్
ఉమ్మడి కాపురమ్మునకు నూతము పిన్నికి, పిన్న తండ్రికిన్
అమ్మయె అక్క అయ్యెనను అక్కకు నీ కృతి అంకితమ్మగున్ ॥

కృతికర్త తండ్రి
శ్రీ శింగరాజు సుబ్రహ్మణ్యం గారు

"ఆర్షధర్మరక్షక" "స్వరాజ్యవర్ధన" "విద్వత్కవి"

"ధర్మవీర" "మహావీర"

"ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే"

మహారాజె చరిత్ర

(శంభాజీ పద్య ప్రబంధం)

రచన :

"సింహరాజ్"

(శింగరాజు శ్రీరామ కృష్ణ ప్రసాద రావు)

ధర్మవీర, మహావీర, శ్రీ ఛత్రపతి శంభాజీ భోసలే మహరాజె చరిత్ర

(శంభాజీ పద్య ప్రబంధం)

ప్రథమ ముద్రణ :
2023

వెల : రు. 400/-

సర్వహక్కులు గ్రంథకర్తవి

ప్రతులకు :
"సింహరాజ్"
శింగరాజు శ్రీరామ కృష్ణ ప్రసాద రావు,
బాలాజి నగర్,
నెల్లూరు - 524 002.
సెల్ : 7995949680

ముద్రణ : డి. టి. పి.
వాసవి గ్రాఫిక్స్
జొన్నలగడ్డవారి వీధి,
నెల్లూరు - 524 001.
సెల్ : 9247559954

పీఠిక
ప్రబంధ సుగంధం

శతావధాని కొండపి మురళీకృష్ణ
జీవిత బీమా సంస్థ, నెల్లూరు

ఇది ఛత్రపతి శ్రీ శంభాజీ ప్రబంధము. ఛత్రపతి శివాజీ కుమారుడైన శంభాజీ చరిత్రను సముజ్జ్వలంగా కవితీకరించి సృజింపబడిన మహా పద్య ప్రబంధము. ఇక కవి ప్రముఖ వైద్యులు. అశేష పాండిత్య శేముషీ దురంధరులైన శ్రీ 'సింహరాజ్' గారు 'పంచతంత్రంలో ప్రపంచం'ను సృష్టించి, ఇంకా అనేక శతకములు, ఖండకావ్యములు రచించిన అనుభవంతో పద్యకావ్యం సృష్టించడంలో అందెవేసిన చేయి. పద్యరచనలో, కావ్యరచనలో తన అపార అనుభవాన్ని రంగరించి ఈ అద్భుత మహాకావ్యాన్ని, ప్రత్యక్షర మనోజ్ఞంగా, రసజ్ఞ హృదయరంజకంగా, సరస్వతీ మంజు మంజీర మోహన రవశింజితంగా, అలంకార సుందరంగా, ఔచిత్య బంధురంగా సృష్టించి రసజ్ఞ లోకానికి అందిస్తున్నారు శ్రీ 'సింహరాజ్' కవిగారు.

చరిత్రను కావ్యంగా వ్రాయడం ఒక అసిధారావ్రతం లాంటిది. చారిత్రక సత్యములకు భంగం కలగకుండా ఘట్టములను మలచుకుంటూ, రసస్ఫోరక సన్నివేశాలను సృజించుకుంటూ రచనను చేయవలసి వస్తుంది. ఈ అసిధారావ్రతాన్ని, కావ్యనిర్మాణ క్రతువును అత్యంత నైపుణ్యంతో, సమర్థవంతంగా ఆద్యంతం నిర్వహించారు, తమ యొక్క కావ్య నిర్మాణ శిల్పకౌశల్యంతో అపారమైన శబ్దాధికారంతో, వర్ణనా వైవిధ్యంతో శ్రీ 'సింహరాజ్'గారు.

అనేక చారిత్రక గ్రంథములను పరిశీలించి, పరిశోధించి, చారిత్రక విశేషాంశాలను నిర్ధారించుకుని తదనుగుణంగా ప్రణాళికను యేర్పరచుకొని యీ బృహత్కావ్యమును సహృదయ సంభావ్యంగా, భవ్యకవితాబంధంగా రచించారు కవితల్లజులైన శ్రీ సింహరాజ్‌గారు.

ఛత్రపతి శివాజీ చరిత్రను శ్రీ గడియారం వెంకట శేషశాస్త్రిగారు 'శివ భారతం'గా వెలయించారు. ఆ కావ్యము వీరికి అత్యంతాభిమాన పాత్రము.

ఆ శివాజీకి ఆత్మజుడై తండ్రి స్థాపించిన ధర్మసామ్రాజ్య నిర్వహణలో తండ్రి దగ్గరనుండి పుణికిపుచ్చుకున్న శౌర్యప్రతాపాలను ధర్మసంరక్షణా యజ్ఞంలో సమిథలుగా సమర్పించిన మహావీరుడు శ్రీ శంభాజీ. వీరి చరిత్ర యీ కవిశేఖరుని చేతిలో "శివకుమార భారత"మై రూపుదిద్దుకొన్నది, వన్నెలద్దుకున్నది.

రెండు వేలకు పైగా పద్యములతో ప్రకాశించే యీ బృహత్కావ్యంలో ప్రతి పద్యమూ ధారాశుద్ధికీ, భావసమృద్ధికీ అద్దం పట్టేదే. అద్భుతమైన మహా కావ్యరచనా శిల్పాన్ని మూటగట్టేదే.

"ఇవి 'సిరా'తో లిఖించి నట్టివగు నక్క
రములు కావు – నా శంభాజి రక్త బిందు
వులె 'లిపి'గ మారి తమ గాథ తెలుగునందు
తెలియఁజేసె నీ భువిలోని తెలుగు ప్రజకు".

అంటూ ఆరంభంలోనే యీ కావ్యగాథా స్వరూపాన్ని మొత్తం యీ పద్యంలో నిబంధించారు కవివర్యులు.

తన శౌర్యప్రతాపాలతో అనేక యుద్ధములలో విజయమును కైవసం చేసికొని, ధర్మసామ్రాజ్య నిర్వహణలో పునీతుడైన యీ 'శంభాజీ' 'మొగలాయీల కుట్రకు, మోసానికి బలియైపోయిన చరిత్ర' యిది యని 'రక్తబిందువులె లిపిగ మారి' అన్న వాక్యంలో నిబంధించారు. కథాసర్వస్వ సూచనను ధ్వనింప చేశారు.

ఎట్టి పరిస్థితులందును చెక్కుచెదరని, వసివాడని లక్ష్యశుద్ధి, ప్రతాపములను అలంకార సుందరంగా అభివర్ణిస్తూ, "శంభాజీ" శీలాన్ని, ఆత్మవ్యక్తిత్వ వైభవాన్ని కన్నులకు కట్టించారు యీ పద్యంలో –

"ఆతడు సాహితీ సమర ప్రాంగణ నిస్తుల చక్రవర్తి – ని
ర్వాత ప్రదేశ నిశ్చల ప్రభాప్రతిభాసిత దీపకందళం
బాతని లక్ష్యశుద్ధి – భిదురాహతి నైనను తూలనట్టి దా
చేతినిశాత హేతి – రణసింహుడు – 'శంభు'ని శీలమిట్టిదౌ."

ఈ క్యావంలో వర్ణనలు సందర్భోచితంగా, సుమనోజ్ఞంగా, అలంకార బంధురంగా చోటుచేసుకున్నాయి. 'వర్ణనా నిపుణః కవి' అని అలంకారికు

లన్నట్లుగా కవితా శేముషికి నికషోపలములై, యీ కావ్యములో వర్ణనలు ప్రకాశిస్తున్నాయి. శంభాజీ మహావీరుడైన మహారాజే గాక, కావ్యములను రచించిన కవి కూడా. శంభాజీ చేసిన వర్ణన మిషతో రాధా దేవి కైశ్యశోభను అద్భుతంగా, పరమసుందరంగా వర్ణించారు. ఆ పద్యం యిదీ –

"మునిమాపువేళలో వినువీధిఁ బరగెడి
యసితాభ్రముల వన్నె నతకరించి
ముప్పేట యల్లిక నొప్పి మూపున వేణి
కాలాహివలె యాడ కటినిదాటి
పట్టుదారపు గుంపు పసమీరు జడకొస
యాదోక కొనకుచ్చు నపహసింప
జంబూఫలాగ్రస్థ బంభర భంగియై
ధూమ్రమేచక వర్ణ ధామ మొలయ.
యిరులు కురియు రాధ కురుల సిరులుఁ జూచి
కృష్ణుడను 'నో ప్రియా! నీదు కేశభరము
కమ్మకస్తురి వలపులు క్రమ్ముకొనగ
నీడనిడు నాకు నీ యెండవేడి దొలచి"

శంభాజీ మహారాజు యొక్క హాలిక పక్షపాతమును గూర్చి ప్రస్తావిస్తూ, మన్నును బంగారుగా మార్చే హాలికుని ఎంత స్వభావసుందరంగా, మనోహరంగా వర్ణించారో చూడండి యీ పద్యంలో.

"శ్రమకోర్చి చెమటోడ్చి జనత యాకలిఁ దీర్ప
మన్ను హొన్నుగ మార్చు మాంత్రికుండు
మోకాళ్ళు దాటని ముదుక పంచెను దాల్చి
యిలకు పట్టువలువ లిచ్చు దాత
యత్యనావృష్టుల యత్యయమును గెల్చి
'మరువు' 'తరిగ' మార్చు కఱుదులాడు
తాను నంబలి త్రాగి మేను దయ్యనివారి
కమృతాశన మిచ్చు హాలికమణి
యట్టి వారినోట యహి ఫేనమును బోయు
రీతి, పన్నులొడుచు నీతి తగునె?"

దైవాంశ లేనిచో రాజు కాలేడన్నది "నా విష్ణు పృథివీ పతిః" అను ఆర్యవాక్యములో ప్రతిపాదితమైనది. శంభాజీలో ఆయా దేవతల లక్షణములు, ఆయా దేవతాంశలుగా ప్రతిఫలించి ప్రకాశించాయో హృదయంగమంగా వర్ణించారు. చూడండి.

"తన యగపాటును గని నగు నెలవంక
　　డంబంబు నడచు 'హేరంబు' నంశ
కొమరు ప్రాయమునందె యమర సైన్యములకు
　　నాయకుండైన 'షాణ్మాతు'రాంశ
లంకేశు పతనము క్ష్వింకాళిచే సంభ
　　విల్లు నని శపించు 'భృంగి' యంశ
జగములఁ గాపాడ క్షణమాలసింపక
　　హాహలంబును మ్రింగు 'హరుని' యంశ
భువన భాండములను మోయు భవుని మోయు
తందరెరుగక చరియించు 'నంది' యంశ
యన్ని యంశలు తన నిప్పుడావహించి
హిందురాజ్యరక్షకు తన న్ముందు నడపు.

సందర్భమునకు సముచితములైన పదముల నెంపిక చేసికొని ప్రయోగించడంలో కవి ప్రతిభ ద్యోతకమౌతుంది. అద్భుతంగా పదములను ప్రయోగించి తద్వారా ధ్వనిని సాధించే చమత్కారం చేసిచూపించారీ పద్యంలో.

"ఎన్నొ నెపములు చూపించి పన్నులేసి
అనువుగా వానిరాబట్టు చణకజుండు." –

అధికమైన పన్నులను రైతులపై వేసి అన్నదాతలైన హాలికులను బాధిస్తున్నారు మంత్రులు అని వివరించే సన్నివేశములో 'పన్నులేసి' అనే పదాన్ని ప్రయోగించారు. 'ఏయు' అన్న శబ్దమునకు 'బాణములను వేయు' – అని అర్థం. ప్రభుత్వం వేసే యీ అధికమైన పన్నులు బాణాలవలె హాలికుల మనస్సుల్లో గుచ్చుకొంటూ బాధిస్తున్నాయనే ధ్వనింప చేస్తున్నది, 'ఏయు' పదప్రయోగం.

అదేవిధంగా సందర్భానుసారంగా కవితా గౌరవమును పెంచేవిధంగా యెన్నో నూతన పదబంధాలను ప్రయోగించి తమకున్న అపారమైన శబ్ధాధికారమును ప్రదర్శించారు కవి అనేక సందర్భములలో. ఆయా శబ్దాలకు అర్థములను గూడా అథఃసూచికలో అందించడం పాఠకునికి అదనపు సౌకర్యమూ, ఆనందమూను.

ఈ విధంగా పద్యాలను ఉదాహరిస్తూ పోతే ప్రతిపద్యమును ఉదాహరించ వలసి వుంటుంది. ప్రతి పద్యం రమణీయమే, ప్రతి పద్యం రసానందాస్వాదమే.

కవితా సుధాకలశముగా మలచి, యింతటి మహత్తర చారిత్రక బృహత్కావ్యాన్ని సంతరించిన కవిరాజులకు నా కవితాభినందనలు, నమస్సుల నందజేస్తున్నాను.

ఆనందము, సందేశము కావ్యపు ప్రయోజనములని ఆలంకారికుల మతము. ఈ మహాకావ్యము ఆ రెండు ప్రయోజనములను సమగ్రంగా అందిస్తున్నది. భవ్యమైన రసానందమును అందించడంతో పాటుగా యేకత్వము వలన ధర్మరక్షణ, విజయములు అందుతాయనే దివ్యసందేశాన్ని అందిస్తున్నదీ కావ్యం.

"ఈ కృతి యాంధ్ర భూజనుల కెల్లరకు న్నొక మేలుకొల్పునౌ
"ఏకత" యొండె భారత మహీతలికెల్లను రక్షయంచు, ధ
ర్మైక నిబద్ధ బుద్ధులయి యార్షప్రబోధిత మార్గచారులై
మేకొని నిల్పగా భరత మేదిని స్వేచ్ఛ ననశ్వరమ్ముగన్."

ఆర్షమార్గ సంచారులై ప్రవర్తిల్లుటకు అమృత సందేశాన్ని అందిస్తున్నది, యీ వీర చారిత్రక సుందర కావ్యం.

"ఆంధ్ర సారస్వత రసజ్ఞ హృదయములలో సుస్థిరమైన స్థానము నలంకరించి, ఈ సుమధుర కావ్యము సరస్వతీ కంఠాభరణముగా ప్రకాశిస్తుంది" అని నిస్సందేహంగా విశ్వసిస్తున్నాను.

సాహిత్య బాంధవ్యంతో పాటుగా, సమీప బాంధవ్యముతో సోదర బంధం గూడా నాకు వీరితో ఉన్నది. ఈ మహాకవికి తమ్ముడనైనందుకు గర్విస్తూ, ఈ

మహాగ్రంథము గురించి నాల్గు మాటలను వ్రాసే అవకాశము నాకు కలుగజేసినందులకు వారికి ధన్యవాదములు. నమస్సుల నందజేస్తున్నాను.

“కమనీయ మహదాశు గంగా ప్రవాహమై
ధారాళమైన పద్యధార వెలయ
రసమయ మాధురీ లలిత ప్రవాహమై
సౌందర్యయుత పద్యశైలి మెరయ
నవనవోన్మేషమై కవితా విలాసమై
శబ్దాధికారమ్ము సౌరు మీర
చారిత్రకోజ్జ్వల భూరిప్రసారమై
సృజనైక శిల్పంబు చిన్నె చూప

నీ మహాప్రబంధ సుగంధ భూమసీమ
సృష్టిఁ గావించి మించె శ్రీ “సింహరాజు”
రమ్యగురు మహాకావ్య నిర్మాణ ఛవికి
ప్రణతిఁ జేసెద శ్రీ ‘సింహరాజ’ కవికి.

శతావధాని
కొండపి మురళీకృష్ణ

కృతికర్త వక్కణ

ఇది "ధర్మరక్షక", "ధర్మవీర", "మహావీర" "శ్రీ ఛత్రపతి శంభాజీ మహారాజే" చరిత్ర. పద్య ప్రబంధంగా ఆంధ్రపాఠక లోకానికి సమర్పితమౌతున్నది. శ్రీ శంభాజీ, ఛత్రపతి శ్రీ శివాజీ జ్యేష్ఠ పుత్రుడు. శ్రీ శివాజీ నిర్యాణానంతరం శ్రీ శంభాజీ ఛత్రపతిగా గద్దెయెక్కి 9 సంవత్సరాలు మాత్రమే పరిపాలించినా, ఆయన ప్రభావం ఒక శతాబ్దంపాటు మహారాష్ట్రులకు స్ఫూర్తిదాయకమై నిల్చింది.

విచిత్రం యేంటంటే శ్రీ శివాజీ మహరాజును గురించి తెలియని వారు భారత దేశంలో లేరు. కానీ శ్రీ శంభాజీ మహరాజును తెలిసిన వారు భారత దేశంలో ఒక "మహారాష్ట్ర"ను తప్పిస్తే, వ్రేళ్ళమీద లెక్కపెట్ట తగినంత మంది గూడా ఉండరు. ఇది చరిత్ర ఆయనపట్ల చేసిన అన్యాయం.

శ్రీ శంభాజీ చరిత్రను పరికిస్తే, ఆయనకు జననం నుండి వీర మరణం వరకు "విధి" అన్యాయం చేయడమే, పనిగా పెట్టుకున్నదా! అని అనిపిస్తుంది.

శంభాజీ తన రెండేండ్ల వయస్సుకే తల్లిని కోల్పోయాడు. పితామహి జీజియాబాయి, తన కొడుకు శివాజీ స్థాపించిన హైందవీ స్వతంత్ర రాజ్యానికి కాబోయే జ్యేష్ఠ ఔరసుడు తన పెద్దమనుమడని, తల్లి లేని పిల్లవాడని అతి గారాబంతో పెంచింది. అత్తగారి అనురాగానికి అంతగా నోచుకున్న ఆ జ్యేష్ఠ ఔరసుడు 'శంభాజీ'ని, అతని యేడుగురు సవతి తల్లులు అంతే గారాబంగా చూచుకొన్నారు. శ్రీ శివాజీకి ఎనిమిది మంది భార్యలు. పట్ట మహిషి సాయిబాయి శ్రీ శంభాజీ తల్లి. తన నాల్గవ కాన్పులో శంభాజీని కన్న రెండేండ్లకే కన్నుమూసింది. శంభాజీకి ముందు సాయిబాయికి ముగ్గురు ఆడపిల్లలు. అంటే శంభాజీకి ముగ్గురు అక్కలు. వారు కూడా శంభాజీని ఎంతో ప్రేమగా చూచుకునే వారు. ఆ విధంగా తల్లిని చిన్నప్పుడే కోల్పోయినా, శ్రీ శంభాజీ కుటుంబం నుంచి అంతులేని ఆప్యాయత, అనురాగాలు అందుకుని పెరిగాడు. శ్రీ

శివాజీ గూడా తన కుమారునికి యే విషయంలోను లోటు చేయలేదు. తీతికలేని రాజ్య వ్యవహారాల్లో, రాజ్య విస్తరణలో, నిరంతరం యుద్ధాల్లో పాల్గొన వలసి వస్తున్నా, తన తల్లి జీజియా బాయి పెద్ద మనుమడి పాలన, పోషణ బాధ్యత పూర్తిగా వహించడం వలన నిశ్చింతగా ఉండగలిగాడు.

శ్రీ శివాజీ నిరక్షరాస్యుడైనా, కొడుకును అనేక భాషలలో, శాస్త్రాల్లో, విద్వాంసుల సహాయంతో పండితుణ్ణి చేయగలిగాడు. యుద్ధ విద్యల్లో సాటి లేని పోటరిగా దిద్దగలిగిన గురువుల్ని నియమించాడు. ఇక జీజియాబాయి సరేసరి. తన కొడుకు శివాజీకి నూరిపోసినట్లే శంభాజీకి సైతం ఆమె రామాయణ, భారత, భాగవతాదులు, ఇంకా అనేక పురాణ గాథలు, భారత వీరుల కథలు చెప్పి అతి చిన్నవయసులోనే తన పెద్దమనుమణ్ణి ఆర్షధర్మం పట్ల తిరుగులేని గాఢ ప్రత్యయం ఉన్న భారతీయుడిగా, అంతులేని దేశభక్తి అణువణువున నింపుకున్న ఒక ఉత్తమ స్వాతంత్ర్య వీరునిగా తీర్చి దిద్దింది. ఎట్టి గడ్డు పరిస్థితులలోనూ శంభాజీ లోని యీ ఉత్తమ గుణాలు, చెదరక అస్ఖలితంగా నిల్చి యీ మహావీరుని వ్యక్తిత్వాన్ని మేరు శిఖరోన్నతంగా నిలువ బెట్టాయి. శ్రీ శంభాజీ కేవలం పండితుడేగాదు, గొప్ప కవీ - గ్రంథ కర్త గూడా.

శ్రీ శంభాజీ అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎనిమిదేండ్ల వయస్సులోనే రాజా జయసింగ్ నాయకత్వం క్రింద ఐదు వేల గుఱ్ఱపు దళానికి మన్సబు దారుగా, బీరార్ జాగీర్దారుగా ఉండవలసి వచ్చింది. అంత చిన్న వయస్సు లోనే అంత పెద్ద బాధ్యతలను మోయవలసి రావడం ఒక్క శంభాజీకే చెల్లింది.

పదేండ్ల వయసులో తన తండ్రితో పాటు "ఆగ్రా" లో ఔరంగజేబు బందీగా ఉండి, తప్పించుకొనడం - ఆ తర్వాత, తన తండ్రి కొంత ముందు జాగ్రత్తకై తనను ఒంటరిగా "మధుర" నగరంలో ఒక విప్రగృహంలో అతిథిగా కొంతకాలం పాటు ఉంచడం - ఇవన్నీ ఏది, ఎందుకు జరుగుతున్నదో పూర్తిగా తెలుసుకోలేని వయసులో జరిగిపోయాయి.

తిరిగి మళ్ళీ పన్నెండేళ్ళ వయస్సులో ఔరంగజేబు కుమారుడు "మౌజమ్" కొలువులో "ఔరంగాబాదు"లో ఐదువేల గుఱ్ఱాల మన్సబు దారు పదవిలో నియమితుడు కావడం - అంటే సాధారణ బాల్యానుగుణమైన జీవితం గాక, అసాధారణ బాధ్యతాయుతమైన జీవితాను భవాలకు - అంత సులభంగా అర్థం చేసుకోలేని

వయసులో గుఱి కావలసి వచ్చింది.

ఈ విధంగా చిన్న వయసులోనే అంత పెద్దరికాన్ని మోయడం, శంభాజీ మనస్తత్వంలో, ప్రవర్తనలో చాలా మార్పును తెచ్చింది. ఒక రాజకుమారుడుగా తన పట్ల మరాటా రాజ్యం యెడల బృహత్తరమైన బరువు బాధ్యతలు ఉన్నాయని, వాటిని తాను సక్రమంగా నెరవేర్చ వలెనంటే తాను చాలా కఠినంగా, నిక్కచ్చిగా, ముక్కుసూటిగా ప్రవర్తించ వలసి ఉంటుందనే ఒక ధృఢ నిశ్చయానికి వచ్చాడు.

ఆ సమయంలో తన తండ్రితో సంప్రదించ కుండానే రాజ్య వ్యవహారాల్లో తన పరిధిని మించిన జోక్యం చేసుకున్నాడని అనిపిస్తుంది. శ్రీ శంభాజీ తన తండ్రి శ్రీ శివాజీ వలెనే కర్షక పక్షపాతి. అందువలన శ్రీ శంభాజీ "పన్నులు రాబట్టడంలో అధికారులు అవినీతికి పాల్పడి, పేద కర్షకులను వేధిస్తున్నారు" అనే అభిప్రాయానికి వచ్చి, తన తండ్రి యెంతో గట్టిగా విశ్వసించే, గౌరవించే "అష్ట ప్రధానుల" పై అవినీతి ఆరోపణలతో వారిని చాలా అవమాన పరచి, తన తండ్రి ఆగ్రహానికి గూడా శంభాజీ గుఱి అయ్యాడు.

కర్షకులు, సైనికులు, పేద కార్మికుల పట్ల శంభాజీకి ఉన్న గాఢమైన సానుభూతి అతనిని అధికార వర్గానికి, ధనిక వర్గానికి శత్రువును చేసింది. శ్రీ శివాజీకి పేదలపట్ల సానుభూతి ఉన్నా, ధనిక వర్గాన్ని వ్యతిరేకం చేసుకోలేదు. ఆ తండ్రి లౌక్యం, తెలివి తేటలు, సమయస్ఫూర్తి శంభాజీలో లోపించాయి.

అదిగాక శంభాజీ యౌవన చాపల్యం వలన కొన్ని వ్యసనాలకు లోనై నాడనే విషయం గూడా ఆతని శీలం మీద నీలి నీడలు క్రమ్మేలాచేసి, అమాత్య, అధికార, ధనిక వర్గాలకే గాక తన తండ్రికి గూడా తనపైన నమ్మకం పోయేలా ప్రవర్తించాడని చరిత్రకారుల వ్రాతలు చెప్తున్నాయి.

యీ పై కారణాలవల్ల అమాత్య వర్గం శంభాజీకి వ్యతిరేకమై అతనిని శ్రీ శివాజీ తర్వాత సింహాసనానికి దూరంచేసి ఆతని తమ్ముడైన "రాజారాము"కు పట్టం కట్టాలని కుట్రచేశారు శ్రీ శంభాజీ దీనిని సహించలేక, తనకు వ్యతి రేకంగా పని చేస్తున్న మంత్రులను, అధికారులను క్రూరంగా చంపించాడు. అది సమాజంలో శంభాజీపైన వ్యతిరేకతను మరింత యెక్కువ చేసింది.

శ్రీ శంభాజీ తండ్రి తర్వాత గద్దెయెక్కి తొమ్మిది సంవత్సరాలు మాత్రమే పరిపాలించాడు. ఔరంగజేబు 'దక్కను'ను జయించాలని, స్వయంగా రంగంలోకి దిగాడు. శంభాజీ పరిపాలనా కాలం అంతా యుద్ధాలతోనే గడచి పోయింది. భయమూ, ఓటమీ రెండూ యెఱుగని శ్రీ శంభాజీ శతాధిక యుద్ధాలలో అన్నింటిలోనూ విజేతగానే నిల్చినా, ఔరంగజేబు అపారమైన సైన్య, ధన బలంతో శ్రీ శంభాజీని క్రమక్రమంగా బలహీన పరచగలిగాడు. లంచాలతో మరాటాలను వశపరచుకొని, శ్రీ శంభాజీ అంతర్గత శత్రువులను తనకు అనుకూలురను చేసికొని, చివరకు మాయోపాయంతో అమిత పరాక్రముడు, సాహస విక్రమార్కుడూ - అదే సమయంలో ముందు వెనుకలు చూడని, అత్యావేశ పరుడూ, అమాయకుడూ యైన శ్రీ శంభాజీని బంధించ గలిగాడు. చివరకు అతి దారుణంగా శ్రీ శంభాజీని చంపించాడు.

శ్రీ శంభాజీకి మహారాష్ట్ర చరిత్రలో రావలసిన అత్యున్నత స్థానం రాక పోవడానికి కారణం కేవలం అతని దురదృష్టమే. ఎన్ని కారణాలు చెప్పినా, విధి యనుకూలించని నాడు, నరుడు నిస్సహాయుడౌతాడు.

చరిత్రకారులు గూడా శ్రీ శంభాజీ విషయంలో త్వరపడి, సరియైన విశ్లేషణ లేకుండా ప్రతికూలమైన వ్రాతలు వ్రాశారు. యే యిద్దరు చరిత్ర కారులను తీసుకొన్నా వారిలో యేక వాక్యత లేదు. ఎవరెన్ని చెప్పినా శ్రీ శంభాజీ భారతీయ సనాతన ధర్మ రక్షణకు చేసిన త్యాగం - తన తండ్రి స్థాపించిన హైందవీ స్వతంత్ర రాజ్య సుస్థిరతకు పడిన ప్రయాస - చరిత్రలో సముజ్జ్వలంగా నిల్చిపోతాయి. శ్రీ శంభాజీ మఱుగున పడిన మాణిక్యం.

ఇక ఈ 'శంభాజీ మహరాజు' చరిత్ర రచన ఎందుకు పద్య రూపంలో వ్రాయవలసి వచ్చిందంటే - 1943లో శ్రీ శివాజీ చరిత్ర పద్యరూపంలో మహా కవి గడియారం వేంకటశేషశాస్త్రి గారు "శివభారతం" పేరిట మహోద్గ్రంథం వెలయించారు. అది శ్రీ శివాజీ పట్టాభిషేకంతో మంగళాంతం ఐంది. అందులో శ్రీ శంభాజీ ప్రసక్తి నామ మాత్రంగా ఉంది. అందువలన తండ్రిని మించిన మహావీరుడు శ్రీ శంభాజీ చరిత్ర గూడా ఆంధ్రులకు పద్య ప్రబంధంగా అందిస్తే బావుంటుందని చేసిన ప్రయత్నం ఇది.

ఆంధ్ర భాషలో మహావీరుల చరిత్ర పైన వచ్చిన పద్యకావ్యాలు తక్కువేమీ కాదు. నాకు తెలిసినంత వరకు ఆ గ్రంధముల పట్టిక ఇక్కడ ఇస్తున్నాను.

ఆంధ్ర పద్య సారస్వతంలో పద్య రూపంలో వచ్చిన చారిత్రక ప్రబంధములు

1) ఆంధ్ర పురాణము – శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి

2) రాణా ప్రతాప చరిత్ర
3) వీరమతి చరిత్రము
4) వీర సింహ విజయము
} – శ్రీ దుర్భాక రాజశేఖర శతావధాని

5) శ్రీ శివభారతము (ఛత్రపతి శివాజీ చరిత్ర)
6) రఘునాధీయము (రఘునాథ నాయకుని చరిత్ర)
} శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి

7) శ్రీ మదాంధ్రాభ్యుదయము – (విజయనగర సామ్రాజ్య స్థాపన)
8) శ్రీ కృష్ణ రాయాభ్యుదయము – (శ్రీకృష్ణ దేవరాయల చరిత్ర)
} శ్రీ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ

9) చంద్రగిరి దుర్గము – శ్రీ అమ్మిశెట్టి లక్ష్మయ్య
("తిరుపతి" దగ్గర ఉన్న "చంద్రగిరి" రాజుల చరిత్ర)

10) కాకతీయ తరంగిణి – శ్రీ యార్లగడ్డ వేంకట సుబ్బారావు

11) ఉయ్యాలవాడ నరసింహారెడ్డి – శ్రీ పాణ్యం నరసరామయ్య కవి

12) బుడ్డా వెంగళరెడ్డి చరిత్ర (ద్విపద) – శ్రీ బందుమియ్య

13) సీతారామ రాజీయము – శ్రీ మల్లేల గురవయ్య
(అల్లూరి సీతారామ రాజు చరిత్ర)

14) మంగళ పాండే – శ్రీ అబ్బరాజు శ్రీనివాసరావు
(1847 ప్రథమ స్వాతంత్ర సంగ్రామ ప్రారంభకుడు)

15) ఝాన్సీబాయి
16) ఆంధ్రప్రశస్తి (ఆంధ్ర వీరుల కథలు)
17) శివార్పణము (శ్రీ శివాజి చరిత్ర)
} – శ్రీ విశ్వనాధ సత్యనారాయణ,

18) పలనాటి భారతము – శ్రీ యేటుకూరి వేంకట నర్సయ్య

19) కాటమరాజు చరిత్ర (ద్విపద) – శ్రీ తంగిరాల వేంకట సుబ్బారావు (సంపాదకుడు)

20) రామరాజీయము – శ్రీ అందుగుల వెంకయ్య (క్రీ.శ. 1650) (అళియ రామరాయల చరిత్ర)

21) రంగరాయ చరిత్ర – శ్రీ దిట్టకవి నారాయణ కవి (కీ.శ. 1790) (బొబ్బిలి వెలమ వీరుల చరిత్ర)

22) విశ్వనాథ నాయకుడు – శ్రీ శంఖవరం రాఘవాచార్యులు

23) పురుషోత్తముడు – శ్రీ చిటిప్రోలు కృష్ణమూర్తి

24) పృద్వీరాజ విజయము – శ్రీ బీర్నీడి ప్రసన్న

25) వందేమాతరం (భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర) – శ్రీ ముదిగొండ వీరభద్రయ్య

ఇంకా యెన్నో నాకు తెలియనివి ఉండి ఉండవచ్చు. శ్రీ తంగిరాల వేంకట సుబ్బారావు యీ వీరగాథా సాహిత్యంపై అశేషమైన కృషి చేశారు, చేస్తున్నారు. అంతే గాకుండా స్వాతంత్ర్య వీరులపైన పద్య కావ్య ఖండికలూ చాలా వచ్చాయి. అందువలన శ్రీ శంభాజీ చరిత్రను పద్య కావ్యంగా పరిచయం చేయాలనే తలంపు కలిగింది.

హిందూ మహారాష్ట్ర స్వతంత్ర రాజ్య స్థాపన, పరిరక్షణలో తన తండ్రి శ్రీ శివాజీని మించి పోయే ఔరసత్వ స్ఫూర్తితో త్రికరణ శుద్ధిగా పరిశ్రమించి, విమత కుమతుల స్వదేశీ స్వార్థపరుల కుట్రకు బలియైపోయిన అమర వీరుడు శ్రీ "ఛత్రపతి శంభాజీ మహారాజె" స్మృత్యంకంగా ఆంధ్ర దేశానికి ఆంధ్ర భాషలో ఆ వీరుడి చరిత్ర పద్య ప్రబంధంగా సమర్పిస్తున్నాను. శ్రీ శంభాజీ వీర, విక్రమ, స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తి సకల భారతదేశానికి ఆదర్శపథ దర్శిని కావాలి.

స్వస్తి

"సింహరాజ్"

కృతికర్త వంశగానం

సింహరాజ్

మా యీ "శింగరాజు" వంశానికి మూలపురుషునిగా పేర్కొనబడే వ్యక్తి "కోట శింగరాజు". ఈయన ప్రసిద్ధి వహించిన ముప్పది రెండు మంది నియోగి మంత్రుల సీస మాలికలో పేర్కొనబడ్డాడు. "కోట శింగరాజు మాట వాసియెగాని గంగమాంబవలన గణుతికెక్కె". బహుశా ఆ పరమసాధ్వి "వంద నలయదు వేవురు వచ్చిరేని" అన్నంత ఓరిమీ, ఔదార్యానికి కాణాచియై యుంటుంది. ఆయన పేరు "శింగరాజు" మా వంశానికి స్థిరపడిపోయింది ఆనాటి నుంచి, అని అంటారు.

ఇక సాహిత్య పరంగా చూస్తే మా "శింగరాజు" వంశంలో ఇద్దరు ప్రసిద్ధ వ్యక్తుల పేర్లు సాహిత్య చరిత్రలో లేఖ్యారూఢమయ్యాయి. వారు 1) శింగరాజు వెంకట సుబ్బయ్య, 2) శింగరాజు దత్తాత్రేయులు. వీరు ఆంధ్ర సాహిత్య చరిత్రలో మొట్టమొదటి "వచన రామాయణ" కర్తలని శ్రీ ఆరుద్ర గారు తమ సమగ్రాంధ్ర సాహిత్యంలో వ్రాశారు.

మా నాన్న "శ్రీ శింగరాజు సుబ్రహ్మణ్యంగారు" నా చిన్నప్పుడు వీరిద్దరి పేర్లు మన వంశవృక్షంలో ఉన్నాయని చెప్పడం నాకు గుర్తున్నది. వీరు రచయితలని చెప్పినట్లుగా గూడా గుర్తుంది. అందువలన శ్రీ ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యం చదివేటప్పుడు వీరిరువురి పేర్లు మా నాన్నగారికి చూపిస్తే ఆయన యెంతో సంతోషించారు.

ఆ తర్వాత మా "శింగరాజు" వారిలో కవిగా పేరు తెచ్చుకొన్నది మా నాన్నగారి పెత్తండ్రి "శ్రీ శింగరాజు కృష్ణయ్య గారు". వీరు నిస్సంతు. వీరు "గుడిపాడు" అనే కుగ్రామంలో హైయ్యర్ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా ఉండేవారు. చాలా స్వల్ప భూవసతి. మెట్టపొలం. అందువలన సంసారం జరుగుబాటు అంతంత మాత్రంగా ఉండేదట. ఐనా ఆయన నిరంతర సాహిత్య వ్యాసంగంలో ఉండేవారని, ఆయన మిత్రులు గూడా సాహిత్య ప్రియులనీ మా నాన్న గారు తమ పెద తండ్రిని గురించి చెప్తుండేవారు. ఆయన యెప్పుడూ యేవో రచనలు చేసే వారనీ, ఆయనను గొప్ప 'కవి' యని బంధు మిత్రులు ప్రశంసిస్తూ ఉండే వారని గూడా మా నాన్న చెప్పేవారు.

అయితే ఆయన సాహిత్య కృషి అంతా ఆయన నివసించే పూరిల్లు అగ్ని ప్రమాదానికి గురియైనందు వలన ఏమీ మిగలకుండా పోయింది అని చెప్పాడు మా నాన్న.

ఇక మా తండ్రిగారు శ్రీ శింగరాజు సుబ్రహ్మణ్యం. ఈయన బాల్యంలోనే పితృవియోగం సంభవించి నందువలన సంసార బాధ్యతల బరువుతో విద్యాభ్యాసం యైదవ తరగతితో ఆగిపోయింది. ఐతే వంశ సంస్కారనేపథ్యం వలన, కవిత్రయ భారత, పోతన భాగవతములు ఆయనకు హృదయ కవిలె. మార్కండేయ పురాణము, తెలుగు పద్యముల భగవద్గీత – యివన్నీ ఆయనకు కంఠోపాఠం. ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, దాశరధీ శతకం – యివన్నీ ధారణలో ఉండేవి. ఈ సంస్కారంతో ఆయన యతి ప్రాసలు లేని గణ బద్ధమైన పద్యాలు అల్లేవాడు. అన్నీ ధారణలోనే ఉండేవి. నేను విన్న పద్యం ఒకటి ఉదాహరిస్తాను కొలదిగా . . .

"ఈ లోకంబొక నాట్య మందిరము జీవుల్ పాత్రధారుల్ అధిష్ఠానుండీశ్వరుడు . . . నాకు పద్యం పూర్తిగా జ్ఞాపకం లేదు. వ్రాసి పెట్టుకున్న నోట్ బుక్ యెక్కడో పోయింది. ఆయన వ్రాసిన యీ కొలది పద్యాలు పూర్తిగా ఆధ్యాత్మిక సంబంధమైనవే.

బహుశా యీ పైతృక సంపన్నేపథ్యం నన్ను కవిగా, గ్రంథకర్తగా చేసిందేమో ననుకుంటున్నాను.

నేను నా 13వ యేటనే తేటగీతి పద్యంతో కవితా సాధన మొదలు పెట్టాను. మొదటి పద్యమే ఛందోవ్యాకరణ రీత్యా నిర్దోషంగా ఉందని మా గురువుగారు "శ్రీ కొమాండూరి రామానుజాచార్యులుగారు" ఆశీర్వదించారు. నాకు ఊహ తెలిసినప్పటి నుండీ ఆంధ్ర, సంస్కృతాంగ్ల సాహిత్యాలతో నా అనుబంధం నిర్విరామముగా సాగిపోతున్నది నేటి వరకు. ఇందుకు నా పూర్వజులకు నేనెప్పుడూ అధమర్ణుడినే.

మ॥ కవిగా పేరులభించియు న్నొరులకున్గాన్పింప నొక్కక్షరం
బవశేషింపక సాహితీ ఫలము సర్వం బగ్గి పాలౌటకెం
త వెతంగూరెనొ, వార్ధకమ్మున దురుద్ధారమ్మునౌ నష్టమి
ట్లవుటన్ మా "పెదతాత కృష్ణయ" యన న్నాయూహ యేర్చున్ననున్॥

– *"సింహరాజ్"*

కృతజ్ఞతాంజలి

సింహరాజ్

నా యీ "శ్రీ శంభు భారతము" (ఛత్రపతి శంభాజీ పద్య ప్రబంధము) ను ఆమూలాగ్రం పరిశీలించి, తద్రచనా వ్యగ్రతలో, నా ప్రమత్తత వలన దొరలిన ఛందో వ్యాకరణ స్ఖాలిత్యములను గుర్తించి చూపి, వానిని నేను సవరించుకునే అవకాశం కల్పించిన కవిమిత్రులు విద్వాన్ శ్రీ అగ్యస్త్యరాజు సుబ్బారావుగారు, శతావధాని చి॥ కొండపి మురళీకృష్ణకు నా ప్రగాఢ కృతజ్ఞతలు. అంతేగాక శతావధాని, ఆశుకవి చి॥ కొండపి మురళీకృష్ణ యీ ప్రబంధ హృదయాన్ని ఆవిష్కరించే, "ప్రబంధ సుగంధం" అన్న శీర్షికతో చక్కని పీఠికను గూడా సంతరించాడు, ఆంధ్రదేశంలో ప్రసిద్ధిగన్న అవధానుల వరుసలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆశుకవీ, శతావధాని. సాహితీ బాంధవ్యమే గాక, నాకు సోదర బాంధవ్యంగూడా ఉన్న చి॥ కొండపి మురళీకృష్ణకు వాత్సల్య పూర్వక శుభాశీస్సులు.

నా యీ "శ్రీ శంభు భారతము" (ఛత్రపతి శంభాజీ పద్యప్రబంధం)ను అభ్యర్థించగనే సహానుభూతితో పరిశీలించి తను అమూల్యాభి ప్రాయాలను ప్రకటించిన ఆంధ్ర సాహితీ మేరు శిఖర ప్రాయులైన మహా పండిత, కవి ప్రకాండులకు, నా సవినయ, ప్రశ్రయ కృతజ్ఞతాభి వందన శతములర్పించు కుంటున్నాను.

1) ప్రొఫెసర్ తంగిరాల వెంకటసుబ్బారావు, ఎమ్.ఎ., పి.హెచ్.డి.,

2) పండితకవి, బహుగ్రంథకర్త శ్రీ డా॥ రేవూరు అనంత పద్మనాభరావు, ఎమ్.ఎ., పి.హెచ్.డి., విశ్రాంత డైరెక్టర్ జనరల్, ఆల్ ఇండియా రేడియో, ఢిల్లీ.

3) విద్వత్కవి సార్వభౌమ, వ్యాకరణ విద్యావారిధి శ్రీ డా॥ బేతవోలు రామబ్రహ్మం, ఎమ్.ఎ. పి.హెచ్.డి., బహుగ్రంథకర్త

4) శతావధాని, ఉభయభాషా వాఙ్మయ పయోధి, శ్రీ డా॥ సూరం శ్రీనివాసులు, ఎమ్.ఎ.(సంస్కృతం), పి.హెచ్.డి., బహు గ్రంథకర్త.

5) హంస అవార్డు గ్రహీత, అష్టావధాని శ్రీ నరాల రామిరెడ్డి

6) శ్రీ డా॥ సి.వి. రామచంద్రరావు, ఎమ్.ఎ. (హిస్టరీ) పి.హెచ్.డి., విశ్రాంత చరిత్రో పన్యాసకులు, చరిత్ర పరిశోధకులు, బహు చారిత్రక గ్రంథ కర్త.

7) శ్రీమతి డా॥ వసుంధర, ఎమ్.ఎ. (తెలుగు) పి.హెచ్.డి.

8) విద్యాన్ శ్రీ అగస్త్యరాజు సుబ్బారావు, శ్రీదేవీ భాగవత పద్య కావ్యకర్త.

9) శ్రీ డా॥ చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్.ఎ (తెలుగు) పి.హెచ్.డి., విద్వత్కవి, బహు గ్రంథ కర్త.

10) శ్రీ పోలవరపు లక్ష్మీనరసింహారావు, ఎమ్.ఎ., ఎమ్.ఇడి., కవి, గ్రంథ కర్త, ఆంధ్ర పద్య సారస్వత పరిషత్, నెల్లూరు శాఖ అధ్యక్షుడు.

11) శ్రీ దేవరకొండ మురళీకృష్ణ, వాగ్గేయ కారుడు, షట్చక్రవర్తి చరిత్ర వచన ప్రబంధ కర్త.

12) ప్రసన్నకవి శ్రీ ఉన్నం జోతివాసు

విధాతకు కృతజ్ఞతా నివేదనము

ఉ॥ రోగము, రొష్టులేని యొడలున్, సమయానికి చేతికందు ద్ర
వ్యాగమము, న్మదూహ తన భావము నొక్కటె యౌ ద్వితీయతో
సాగు కుటుంబ జీవన ప్రశాంతి, వసింపబవంతి కల్మినే
డీగతి సాగె నా రచన మిందుల కున్విధికిన్కృతజ్ఞుడన్ ॥

విషయసూచిక

వ.నెం.	వివరం	పేజి నెం.
1	అభవస్తవం	2
2	సరస్వతీ సంస్తుతి	3
3	తెలుగు నుడికి గిడిగిళ్ళు	4
4	తెలుగు పద్యాలు	5
5	ఆంధ్ర సాహితీ సుకవి ప్రశంస	6
6	స్వవిషయము	7
7	చరిత్రకారుల విచిత్రపు పోకడ	7
8	అంకితము	8
9	దైవస్తుతి	9
10	భోసలే వంశ చరిత్ర	9
11	ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజీ మహారాజె చరిత్ర కథా ప్రారంభము	
12	ఛత్రపతి శంభూజీ ప్రప్రపితామహుడు	10
13	ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజి మహారాజే ప్రపితామహుడు "మాలోజీ భోస్లే "	11
14	షాజీ భోసలే వివాహము	12
15	ధర్మవీర - మహావీర - ఛత్రపతి శంభాజీ పితామహుడు 'షాజీ'	13
16	మొగలులు అహ్మద్ నగర్ ఆక్రమించుట	14
17	"లఖుజీజాధవ్" హత్య - అహ్మదునగరులో వచ్చిన మార్పు	14
18	'ఆదిలుషా' మొగలులతో సంధి చేయుట	17
19	అహ్మద్ నగర్ - లఖుజీ జాధవ్ - షాజీ భోస్లలే	18
20	షాజీని బంధించుటకు అతని మామ 'లఖుజీ జాధవు' వచ్చుట	20
21	ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజే జననము	21
22	ఛత్రపతి శివాజీ మహారాజె బాల్యము	21
23	బాల శివాజీకి తల్లి జీజియా దేశభక్తి నూరిపోయుట	23
24	రెండవ ఇబ్రహీమ్ ఆదిలుషా	25

25	ఛత్రపతి శివాజీ హైందవీ రాజ్యస్థాపనా ప్రయత్నము	28
26	ఛత్రపతి శివాజీ యుద్ధయాత్రా ప్రారంభము	31
27	ఛత్రపతి శివాజి అగ్రజుడు శంభాజీ వీరమరణము	32
28	ఛత్రపతి శివాజీ తండ్రి షాజీ నిర్యాణము	32
29	ఛత్రపతి శివాజి "జావళి" ని ఆక్రమించుట	33
30	ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజీ జననము - మహావీర 'శంభాజీ' ప్రశంస	34
31	ఛత్రపతి శివాజి అఫ్జలుఖానుని వధించుట	37
32	బాజీ ప్రభు ఆత్మార్పణము	37
33	షాజాదా ఔరంగజేబు దక్కనుకు రాజప్రతినిధిగా వచ్చుట	38
34	షాజహాను అస్వస్థత - ఔరంగజేబు ఢిల్లీకి మరలి పోవుట	39
35	షైస్తఖాను శివాజీపై యుద్ధము ప్రకటించుట	40
36	ఛత్రపతి శివాజీ సూరతు ముట్టడి	42
37	ధర్మవీర - మహావీర - ఛత్రపతి 'శంభాజీ మహరాజె' బాల్యము	42
38	ఔరంగజేబు జయసింహుని శివాజీ పైకి పంపుట	45
39	ఛత్రపతి శివాజీ, రాజా జయసింహునకు వ్రాయించిన లేఖ	47
40	రాజా జయసింగు ఛత్రపతి శివాజీకి వ్రాయించిన ప్రత్యుత్తరము	49
41	రాజా జియసింగు పాదుషాకు పంపిన లేఖాంశములు	51
42	పాదుషా ఔరంగజేబు నిర్ణయము	52
43	శివాజీ మొగలులతో చేరి బీజాపూరుపై యుద్ధము చేయుట	52
44	ఛత్రపతి శివాజీని దిలేర్‌ఖాను అనుమానించుట శివాజీని వధింప ఆలోచన చేయుట	53
45	రాజా జయసింహుడు శివాజీని సమర్థించుట	54
46	శివజీ మొగలులతో చేసుకున్న సంధిని గూర్చి చర్చించుట	54
47	వీర నేతాజీ పాల్కర్ ముందు బీజాపూర్, తర్వాత మొగలుల చేరుట	55
48	ఛత్రపతి శివాజీ ఆగ్రా ప్రయాణము	55
49	రాజా జయసింగు తన కుమారునకు లేఖ వ్రాయుట ఆగ్రాలో రామసింగు శివాజీని ఆమతించుట	56
50	పది యేండ్ల బాల శంభూజీ - ఆగ్రాలో అనుభవములు	56
51	ఛత్రపతి శివాజీ ఔరంగజేబు సభలో ప్రవేశించుట	57

52	శ్రీ శివాజి 'ఆగ్రా' నిర్బంధము నుండి తప్పుకొనుటకు ప్రయత్నము ప్రారంభించుట	60
53	శ్రీ శివాజి, శంభాజీలు గృహనిర్బంధము నుండి తప్పించుకొనుట	63
54	శ్రీ శివాజీ, శంభూజీ మాఱు వేషములతో పయనించుట	65
55	శ్రీ శివాజీ, శంభాజీలు మధుర చేరుట	65
56	శ్రీ శివాజి శంభాజీకి కృత్రిమ అంత్యేష్టి జరిపించుట	66
57	శ్రీ శివాజీ రాయగడము చేరుట	67
58	జీజియా శివాజీని తన మనుమని గూర్చి యడుగుట	67
59	శివజీని జయసింహుడే తప్పించెనని ఔరంగజేబు ఆగ్రహించుట	68
60	రాజా జయసింహుని పశ్చాత్తాపము	69
61	రాజా జయసింగు నిర్యాణము	71
62	ఔరంగజేబు శివాజీని బుజ్జగించుట	71
63	ఔరంగజేబు శంభాజీని ప్రశంసించుట	72
64	శివాజీ ఔరంగజేబు సౌమనస్యమునకు సంతోషించుట శంభాజీ షాజాదా మౌజము కొల్వులో చేరుట	72
65	శంభుజీని బంధించుటకు ఔరంగజేబుకుట్ర - షాజాద మౌజము కుట్ర బహిర్గతము చేసి శివాజీని, శంభుజీని, ప్రతాపరావులను రక్షించుట	75
66	'ఔరంగజేబు' చేసిన కుట్రకు 'శివాజీ' అగ్రహము చెందుట	76
67	శ్రీ శివాజీ జైత్ర యాత్ర	77
68	శ్రీ శివాజీ 'సూరతు'ను కొల్ల గొట్టుట	78
69	శ్రీ శివాజీ పట్టాభిషేకము - శ్రీ శంభాజీ యువరాజ పట్టము	79
70	శ్రీ శివాజీ రాజ దండము - దాని విశిష్టత	80
71	శ్రీ శంభాజీని యువరాజుగా పౌరులు ప్రశంసించుట	81
72	శ్రీ శివాజీ పట్టాభిషేక వార్తవిని ఔరంగజేబు ఆగ్రహాదగ్రుడగుట	81
73	జీజాబాయి నిర్యాణము	82
74	"మహావీర శంభాజీ" భావ సంఘర్షణ తన తండ్రి శివాజీకి తనపైన ప్రేమ కలదా? లేదా? అనువిచికిత్స	83
75	"ఔరంగజేబు" ప్రతీకారేచ్ఛ	86
76	అష్టప్రధాని వ్యవస్థపై శంభాజీ అసహనము	88

77	శంభాజీ అమాత్యుల అవినీతి - హోలికుల దుస్థితిని గూర్చి విచారించుట	90
78	శంభాజీపై అపనిందారోపణము-శ్రీశివాజీ నేర విచారణసేయుట	91
79	న్యాయ విచారణలు - శంభూజి నిరపరాధిగా తేలుట	92
80	ఆర్థిక సచివుడు అణ్ణాజీదత్తో శంభూజీపై అపనిందలు వేయుట	92
81	అణ్ణాజీ మఱియు ఇతర మంత్రులు అవినీతిని శంభూజీ విమర్శించుట	92
82	శంభూజీ పై అపనిందలు పెచ్చరిల్లుట	93
83	శంభాజీ మనస్తత్వము - నేపథ్యము	94
84	శంభాజీ ప్రవర్తనపై శ్రీ శివాజీ అసంతృప్తి	96
85	అణ్ణాజీ దత్తో మన క్లేశము	96
86	అణ్ణాజీ, తదితరామాత్యులు 'శివాజీ' కడకేగి తమ యిబ్బందులు చెప్పకొనుట	96
87	శ్రీ శివాజీ మంత్రుల నూరడించుట	98
88	శ్రీ శివాజీ శంభాజీ విషయమై పశ్చాత్తాపడుట	99
89	శ్రీ శివాజీ భవిష్యత్కార్యాచరణ నిర్ణయించుట	100
90	శ్రీ శివాజి శంభు భార్య "యశూబాయితో" శంభుని గూర్చి చర్చించుట	100
91	శ్రీ శివాజి శంభు దంపతులను, శంభు అత్తవారిల్లు శృంగారపూరునకు పంపుట	101
92	తండ్రి నిర్ణయమును వినిన శంభాజీ కోపావేశము	102
93	శ్రీ శివాజీ తాను రాజధానిలో లేని సమయమున అచటి అధికారమును మంత్రులకు, అధికారులకు పంచుట	104
94	శంభాజీపై వచ్చు నేరారోపణలకు శివాజీ తీవ్ర హృదయ వేదన	105
95	శంభాజీ పై సవతి తల్లి "సోయరా" విద్వేష కారణము	105
96	శ్రీ శివాజీ దక్షిణాశా జైత్ర యాత్ర	108
97	శ్రీ శివాజీ సైన్యము సత్ప్రవర్తనకు జనులు ఆనందించుట	109
98	శ్రీ శివాజీకి హైదరాబాదులో ఘన స్వాగతము	111
99	శ్రీ శివాజీ శ్రీశైలక్షేత్ర దర్శనము	112
100	శ్రీ శివాజీ 'జింజీకోట' ముట్టడి	113
101	మహావీర శంభాజీ కొంకణ భూమిలోని శృంగారపూరు ప్రవేశము	119

102	వీర శంభాజీ "మల్లఖంబ్" పోటీలోపాల్గొని తన, శరీర పటుత్వము ప్రదర్శించుట	119
103	శ్రీ 'శంభాజీ' కవితా, పాండిత్య వైభవములు	120
104	వీర శంభాజీ హోలిక పక్షపాతము	122
105	'వీర శంభాజీ' శృంగారపురమున ఒంటరి తనమును అనుభవించుట	124
106	మహావీర శంభాజీ, కవికలశుల పునస్సమాగమము	125
107	హిందూరాజులలో అనైక్యత	128
108	కవికలశు - శంభాజీల సంభాషణము	129
109	'షాహజాదు మోజము' తన తండ్రిని (ఔరంగజేబు) పద భ్రష్టుని చేయుటకు పన్నాగము పన్నెనని కలశుడు చెప్పట	130
110	'వీర శంభాజి' తన తండ్రి 'శివాజీ' తనను కర్ణాటక జైత్ర యాత్రకు వెంటకొని పోలేదని విచారించుట	131
111	'మహావీర శంభాజి' రచించిన "బుధభూషణము" లోని ఈశ్వరుని స్తవము	132
112	శివతాండవము	133
113	హాలహల భక్షణము	134
114	శ్రీకృష్ణ జననము	135
115	శ్రీ శంభాజీ గత స్మృతుల యంతర్మధనము	136
116	మహావీర "శంభూజి" ప్రతిజ్ఞ	139
117	"మహావీర శంభూజీ"కి పుత్రికా జననము	141
118	శ్రీ శివాజి యింత వరకు మాతామహుడు మాత్రమే అయ్యాడు-ఇపుడు తొలిసారిగా పితామహుడయ్యాడు శ్రీ శివాజీ ఆరు నెలల తర్వాత శంభాజీని మందలించుచు లేఖ పంపుట	141
119	శ్రీ శంభాజీకి దిలేరుఖాను ఆదర పూర్వక మైన లేఖ వ్రాయుట	143
120	'మహావీర' శంభాజీకి భార్య యశూబాయి హితబోధ	145
121	"వీర శంభాజి" మొగలుల శిబిరమునకు చేరుట	147
122	శంభాజీ, దిలేరుఖాన్లు బహదూరు గడమును ముట్టడించుట	150
123	వీర శంభాజీ బహదూరు గడముపై దండెత్తి నందుకు పశ్చాత్తాప పడుట	152
124	దిలేరు ఖాను మరాటా బందీలను అతి క్రూరముగా శిక్షించుట	152

125 శ్రీ శంభాజీ మరాటా బందీలకు వేయబోవు కఠిన
శిక్ష ఆప ప్రయత్నించుట 153
126 వీర శంభాజీ విన్నపమును దిలేరుఖాను నిరాకరించుట -
శంభాజీ పశ్చాత్తాపము 154
127 వీర శంభాజీని బంధించి ఢిల్లీకి పంపమని ఔరంగజేబు ఆదేశించుట 155
128 శ్రీ శంభూజీ దిలేరుఖానుతో 'పన్హాలా'గడముపై
దండయాత్రకు ప్రయాణమై మధ్యలో తప్పించు కొనుట 159
129 "వీర శంభాజీ" ప్రాణములను "మునిసిబుఖాను" రక్షించుట 160
130 శ్రీ శివాజీ, శంభాజీని చూచుటకు 'పన్హాలా'గడ మునకు వచ్చుట 162
131 శంభాజీ తండ్రితో నిష్ఠూరముగా పలుకుట 163
132 శ్రీ 'శివాజి' వీర శంభాజీ "రాజనీతి", "రాజ ధర్మమును"
గూర్చి ప్రబోధించుట 169
133 రాజ సింహాసనము యొక్క సాంకేతికమైన అంతరార్థము 171
134 శ్రీ శివాజీ రాయగడమునకు మరలి పోవుట 172
135 శ్రీ 'శివాజీ' 'వీర శంభాజీ'ని పూర్తి నిర్దోషిగా యెంచెననుటకు
వీలు లేదు 172
136 శ్రీ 'శివాజీ' 'సోయరాబాయి'ల కుమారుడు
'రాజారామ రాజు' వివాహము 172
137 తమ్ముడు 'రాజారాము' 'వడుగు'నకు గాని, 'పెండ్లి'కి గాని
శంభునికి పిలుపు లేకుండుట 173
138 వీర శంభాజీ తనపై నీలాపనిందలు వ్యాప్తిచేయు అమాత్యులు,
సవతి తల్లి ప్రవర్తన పట్ల ఆవేదన వ్యక్తముచేయుట 174
139 వీర శంభాజీ "పన్హాలా" ప్రాంతమునకు సుబేదారుగా తండ్రిచే
నియుక్తు డగుట-"హిరోజి" శంభాజీపై కొంత అనాదరము చూపుట 176
140 "ఔరంగజేబు" భావి దక్కను దండయాత్ర నెదుర్కొన
మరాటులు సిద్దపడుట 177
141 శ్రీ శివాజి 'జల్నా' ప్రాంతములను కొల్లగొట్టుట 178
142 శ్రీ శివాజీని రణ మస్తఖాను అడ్డగించుట - శ్రీ శివాజి
తప్పించు కొనుట 178
143 శ్రీ శివాజీ ఆరోగ్యము క్షీణించుట 179

144	ఛత్రపతి శ్రీ శివాజీ మహరాజే అస్తమయము	179
145	"ఛత్రపతి శివాజి" మరణ వార్తను అమాత్యులు, "సోయరాబాయి" అతి గోప్యముగా ఉంచుట	180
146	"ఛత్రపతి శ్రీ శివాజి" మరణ వార్తను "వీర శంభాజీకి" తెలియకుండ దాచుట	180
147	ఛత్రపతి శ్రీ శివాజీ అంత్యక్రియలు "సబజిభోస్లే" యనెడు తద్వంశీకుడు చేయుట	181
148	'సోయరాబాయి' తన సోదరుడు సైన్యాధిపతి హంబీర రావును పిలిపించుట	182
149	హంబీరరావు మోహితే శివాజీ భార్య 'పుతలబాయి'ని చూడబోవుట	183
150	ఛత్రపతి శివాజీ అస్వస్థతను గురించి 'మోహితేకు' పుతలీబాయి వివరించుట	183
151	వీర శంభాజీని నియంత్రించుటకు అణ్ణాజి, సోయరాబాయిల కుట్ర	184
152	తనకుమారుడైన రామరాజుకు ఛత్రపతి పట్టము కట్టరమ్మని 'సోయరాబాయి' తన సోదరుడైన హంబీరరావు మోహితేను పిలిపించుట	185
153	'వీర శంభాజీ'కి తన తండ్రి మరణ వార్త తన సవతి తల్లి పుతలీబాయి ద్వారా తెలియుట - వీర శంభాజీ తీవ్ర మానసిక సంక్షోభము	186
154	సైన్యాధిపతి "హంబీరరావు మోహితే"ను "అణ్ణాజి దత్తు", "మోరోపంతు పింగళే"లు చూడవచ్చుట	190
155	హీరోజిఫర్జందు ఖజానా సొమ్మును సంగ్రహించి పారిపోవుట	193
156	వీర శంభాజిపై ప్రజాభిమానము వెల్లి విరయుట	194
157	వీర శంభాజి పరిదేవనము	194
158	వీర శంభాజీ రాయగడము ప్రవేశించుట	195
159	పుతలీబాయి జరిగిన విషయమంతయు శంభాజీకి వివరించుట	196
160	వీర శంభాజి రాయగడు రాజధానిగా పరిపాలన పగ్గములు చేగొనుట	197
161	'వీర శంభాజీ' 'పన్హాలా' గడము నుండి రాయగడమునకు వచ్చుదారిలో ప్రయాణ విశేషములు	198

162 కోశ ధనము నపహరించిన హీరోజి ఫర్జాందు పట్టుబడుట -
శంభాజి అతనిని క్షమించుట 198
163 శ్రీ శివాజి మృతి వార్త మరాటా రాజ్యమున సంచలనము కల్గించుట 199
164 వీర శంభాజీ తన పేరిట ఆజ్ఞలను దుర్గాధిపతులకు పంపుట 199
165 రాయగడు ప్రవేశ సమయమున శంభాజీకి జరిగిన
స్వాగత సత్కారములు 200
166 రాయగడమున 'తక్మకుతోకు' భృగు పాతము - ద్రోహులకు
మరణ శిక్ష 201
167 వీర శంభాజి తన సవతి తల్లి 'సోయరాబాయి'ని చూడబోవుట 202
168 తమ్ముడు రాజరాము అన్న శంభాజీని కావిలించు కొనుట 203
169 సభాంగణమున మంత్రుల నేర విచారణము-శంభూజీ తీర్పు 204
170 కవికలశుడు శంభాజీ రాజనీతిని క్షమాగుణమును ప్రశంసించుట 208
171 మొగలు బాద్షా ఔరంగజేబు స్వయముగా దక్కనుపై
దండయాత్రకు రాదలచుట 208
172 ఔరంగజేబు నెదుర్కొనుటకు శంభాజీ సమర సన్నాహము 209
173 మొగలు, మరాటా భూభాగ వర్ణనము 211
174 'వీర శంభాజీ' 'ఔరంగజేబు' నెదుర్కొను వ్యూహము ఆలోచించుట 213
175 "వీర శంభాజీ" తన తండ్రికి వేదమంత్రోక్తముగా
అపర క్రియలు చేయుట 214
176 పుతలీబాయి శ్రీ శివాజీ చితిపై సహగమనము చేయుట 215
177 ధర్మవీర, మహావీర, శ్రీ శంభాజి మహరాజే పట్టాభిషేకము 215
178 "ఛత్రపతి శ్రీ శంభాజీ మహరాజే"కు కొంకణ తీరవాసులు,
"సిద్దీ"ల వలన తమకు సంభవించుచున్న కష్టములు
విన్నవించుకొనుట 220
179 ఛత్రపతి శంభాజీ తన పట్టాభిషేకానంతరము చేసిన తొలి
దండయాత్ర 221
180 ఛత్రపతి శంభాజీ 'సూరతు'ను కొల్లగొట్టుటకు
వచ్చుచుండెనను ప్రచారము ప్రజలలో వ్యాపించుట 221
181 బుర్హానుపూరు కొల్లగొట్టుటకు హంబీరరావు, మోహితే,
శంభాజీలు పన్నిన వ్యూహము 225

182 బుర్హానుపూరు కొల్లగొని తిరిగి పోవునపుడు హంబీర
రావు ఔరంగబాదుపై దండెత్తెదనని శంభాజీని వీడ్కొనుట 228
183 సభలో "ఛత్రపతి శంభాజీ" దణాయుడు 'హంబీరరావు
మోహితే'ను సత్కరించుట 231
184 చిరానుభవ పరులైన వృద్ధజనుల భయము - వీర శంభాజీ
ఔరంగజేబును గురించి ఆత్మ ప్రత్యయము సభలో ప్రకటన 231
185 షాజాదా అక్బరు తన తండ్రి ఔరంగజేబును సింహాసనచ్చుతుని చేసి,
తాను సింహాసన మెక్కుటకు శంభాజీ సహాయము కోరుట 233
186 రాజస్థాను నందు 'అక్బరు'ను 'దుర్గాదాసురాఠోడు'
కలుసుకొనుట 234
187 ఔరంగజేబు భేదోపాయ ప్రయోగమునకై ఒక అసత్యపు లేఖ
సృష్టించుట 235
188 అక్బరు మేల్కాంచి శిబిరములు వట్టి పోవుట చూచి ఆశ్చర్యపడుట 237
189 ఛత్రపతి శంభాజీకి సమర్థ రామదాసు లేఖ వ్రాయించుట 239
190 ఛత్రపతి శంభాజీ, షాజాదా అక్బరుకు 'కొంకణు' నందు వసతి
యేర్పాటు చేయుట 241
191 షాహజాదా 'అక్బరు' 'కొంకణము'నకు వచ్చిన విషయము
తెలిసి "అణ్ణాజీ" శంభాజీకి వ్యతిరేకముగా కుట్రను పన్నుట 242
192 "వీర శంభాజీ" "షాజాద అక్బరు"ను తన నుండి యేమి
యాచించిరని యడుగుట 243
193 "వీర శంభాజీ" అపరాధులను శిక్షింప బూనుట 245
194 నేర విచారణ - శిక్ష 246
195 "వీర శంభాజీ" సవతి తల్లి "సోయరాబాయి"కి మంత్రుల
శిక్ష వార్త తెలియుట-అపరాధ భావముతో
భయముతో ఆత్మహననమునకు పాల్పడుట 248
196 "వీర శంభాజీ"కీ విషయము తెలిసి తీవ్ర పశ్చాత్తాపమొందుట 248
197 ఔరంగజేబు దక్షిణ దేశ దండయాత్రా సన్నాహము 249
198 'హుస్సేనలీఖాను' తన శౌర్యముతో సాధించిన ఘనకార్యములు 251
199 రామ్‌సెజ్ కోట ముట్టడి - మొగలుల వైఫల్యము 252
200 "రామ్సెజ్" దుర్గము 254

201	రామ్సెజు దుర్గమును షాబుద్ధీను ముట్టడించుట	254
202	రామ్సెజు గడములోని మరాటా వీరుల వీరోచిత ప్రతి స్పందన	255
203	"రామ్సెజు" కోటలో శతఘ్నుల సంఖ్య తక్కువ యని "ఆసుజీ" తెల్పుట	256
204	"రామ్సెజు" కోటలో శతఘ్నుల సంఖ్య పెంచుటకు దారు శిల్పి ఉపాయము చెప్పుట	257
205	రామ్సెజు దుర్గనేత "సూర్యాజి జడే" యుద్ధ సన్నాహము	258
206	మొగలుల మంచె కూలి పోవుట	259
207	రామ్సెజు కోటపై జరిగిన దుస్సంఘటనలో త్వష్ట మరణము	259
208	'షాబుద్ధీన్' సైన్యమునకై వచ్చిన సామగ్రిని మరాటులు కొల్ల గొట్టుట	259
209	"బహదూరు కోకల్తాషు" రామ్సెజు గడమును జయింప క్రొత్త వ్యూహములు పన్నుట	260
210	రామ్సెజు కోట గెలుచుటకై యొక తాంత్రికుడైన యశ్వపాలుని వ్యూహము మొగలు సేనా పతులు అనుసరించుట	265
211	అశ్వపాలుని తంత్ర ప్రయోగము విఫలమగుట-మొగలుల ఓటమి	268
212	రామ్సెజు గడము అజేయముగా నిలబడుట	268
213	దుర్గనేత "సూర్యాజీ జడే' దుర్జయుడై నిలబడుట	269
214	రామ్సెజ్ కోట యుద్ధ వీరులకు శంభాజి యందించిన సత్కారము	269
215	ఛత్రపతి మహావీర శంభాజీ మైసూరు యుద్ధము	269
216	తొలిసారి మైసూరి వారితో యుద్ధములో మరాటుల యోటమి	270
217	ఔరంగజేబు దక్షిణ దేశ ప్రవేశము	271
218	ఔరంగజేబు దురాక్రమణతో మరాట రాజ్యమునకు శుల్కములు తగ్గిపోవుట	272
219	తొలుత శంభాజీ ఔరంగజేబుతో పోరాడుటకు కర్ణాటకనృపుని సఖ్యము కోరుట	273
220	శంభాజీ సఖ్య ప్రతిపాదనము కర్ణాటక ప్రభువు నిరాకరించుట	273
221	వీర శంభాజీ 'బనవరు'ను ముట్టడించుట	274
222	చికదేవరాయలు మరాటులకు ధానుష్కసేన లేదని గ్రహించి అర్ధవృత్త వ్యూహము పన్నుట	275
223	ఛత్రపతి శంభాజీ తిరుచిరాపల్లి ముట్టడి	277

224	విలుకాండ్ర ధాటికోర్చుటకు శంభాజీ పన్నిన వ్యూహము	277
225	"తిరుచిరాపల్లి" కోటపై యుద్ధము	280
226	ఛత్రపతి శంభాజి తిరుచిరాపల్లి విజయానంతరము కర్ణాటక, తమిళ దేశములందు యిరువది కోటల నాక్రమించు కొనుట	282
227	చిక్కదేవరాయలు ఛత్రపతి శంభాజీని ఆక్షేపించుట	283
228	ఛత్రపతి శంభాజీ చిక్కదేవరాయలకు తగిన సమాధాన మిచ్చుట	283
229	చిక్క దేవరాయలు ఛత్రపతి శంభాజీతో సంధి చేసికొనుట	283
230	చిక్క దేవరాయలు స్వయముగా ఛత్రపతి శంభాజీ సన్నిధికి రాకుండుటకు కారణము తనకు "శివాజీ చేతిలో అష్టలు ఖాన్గతి" పట్టునని భయపడెనని సభలో హాస్యోక్తులు చెలరేగుట	284
231	ఛత్రపతి శంభాజీ రాయగడమునకు మరలుట	284
232	జంజీరా కోట - సిద్ధీలతో యుద్ధము	285
233	జంజిరా కోట శత్రుదుర్భేద్యమై నిల్చుట	285
234	ఛత్రపతి శివాజీ నౌకాబల ప్రాముఖ్యము గుర్తించుట	286
235	కొంకణ తీరవాసులైన కర్షకులు "సిద్ధీ"ల వలన తమకు కలుగు కష్టములు శంభాజీతో విన్నవించుకొనుట	287
236	'జంజిరా' కోటను జయించుటకు శ్రీ శివాజీ చేసిన ప్రయత్నములు విఫలమగుట	288
237	ఛత్రపతి శంభాజీకి పోర్చుగీసులు, ఆంగ్లేయుల కపట వైఖరి బెడదగా పరిణమించుట	290
238	ఛత్రపతి శంభాజీ గొప్ప నావికా దళమును నిర్మింప ప్రయత్నించుట	290
239	నౌకాశాస్త్ర విజ్ఞాని "జంగేఖాను" అరబు దేశము నుండి శంభాజీకి సాయపడుటకు వచ్చుట	292
240	శంభాజీ బానిసలకు విముక్తి కలిగించుట	292
241	శంభాజి 'జంజిరా' ను గెల్చుటకు 'రఘునాధ దేశ పాండేను నియమించుట	292
242	ఉండేరిపై దేశపాండే దాడి చేయుట - దేశపాండే ఘోర పరాజయము	293

243 ఔరంగజేబు శంభాజిపై యుద్ధమునకు సిద్ధీలను, పోర్చు
గీసులను, పురిం గొల్పుట "హుస్సేనలీఖాను"ను
రాయగడముపై దండెత్తుటకు ఆజ్ఞ యిచ్చుట 295
244 "మొగలు", "మరాటా"ల రాజ్య తారతమ్యము 296
245 "జంజిరా"పై "శంభాజీ" దాడి ప్రారంభము 296
246 ఛత్రపతి శంభాజీ స్వయముగా జంజిరాపై యుద్ధమును దిగుట 298
247 ఛత్రపతి శంభాజీ 'జంజిరా' యుద్ధమునకు లోబడదని
ఉపాయము చేత సాధ్యపడు మార్గము ఆలోచించుట 299
248 శంభాజీ, జంజీరాను గెల్చుటకు భేదోపాయము ప్రయోగించుట 299
249 'జంజీర' కోటలో కొండాజి ఫర్జాందు గుట్టు బయలై ఆతడు
అక్కడ చంపబడుట 300
250 వీర మరణము చెందిన 'కొండాజీ ఫర్జాందు' నకు ఛత్రపతి
శంభాజి అత్యంత ఘనముగా అంత్యక్రియలు జరుపుట 301
251 జంజిరాలో కొండాజి ఫర్జాండు గుట్టు రట్టగుటకు కారణము 301
252 మరాటా, సిద్ధీల సముద్ర యుద్ధము కొనసాగుట 302
253 జంజిరాకు సరకులు వచ్చుట - హుస్సేనలీఖాను
రాయగడముపై దండెత్తుట 303
254 ఛత్రపతి శంభాజి గతమును, భవిష్యత్తుని గూర్చి చింతించుట 304
255 ఛత్రపతి శంభాజీ పోర్చుగీసులపై యుద్ధ సన్నాహము 305
256 "ఛత్రపతి శంభాజీ" "అహమదనగర్"లో బందీలుగానున్న తన
భార్య, బిడ్డలు, అక్కను విడిపింపవలెనని నిశ్చయించుట -
హంబీర రావు హితోపదేశము 307
257 ఔరంగజేబు చిన్నకొడుకు షాజాద అక్బరు తండ్రిని పదభ్రష్టుని
చేసి తానె ఢిల్లీ చక్రవర్తి కావలెననుకొనుట 308
258 "ఛత్రపతి శంభాజి" "అక్బరు"నకు సైనిక సహాయము
చేయుటకు తన నిస్సహాయతను వెల్లడించుట 310
259 ఛత్రపతి శంభాజీ "హసనలీఖానును" తఱిమివేయుట 311
260 ఛత్రపతి శంభాజీకి పుత్ర జననము 312
261 పెక్కురు మరాటా ముఖ్యులు మొగలులతో చేరుట 312

262	"పన్హాలా" "కోట వద్ద" "షాజాదా అజము" పరాజయము కాని తన తండ్రి ఔరంగజేబుకు తాను గెల్చితినని వార్త పంపుట	313
263	'పోర్చుగీసులతో' మరాటా వారి యుద్ధము	313
264	రాయగడమున ఛత్రపతి శంభాజీ విశ్రాంతి గొనుట వీర సేనాధిపతి "హంబీరరావు మోహితే" చూడవచ్చుట, ఆతని వీర కృత్యములు	315
265	పోర్చుగీసు రాజప్రతినిధి కపట ప్రవృత్తి	317
266	గోవా పాలకుడు "శంభాజీ" గత ప్రవర్తనను విమర్శించుట	318
267	గోవా పాలకుడు "కొండెడి ఆల్వోరు" ప్రతి వ్యూహము	319
268	"కొండెడి ఆల్వోరు" పోండా కోటపై యుద్ధము చేయుట	320
269	శంభాజీతో యుద్ధములో పోర్చుగీసుల పరాజయము - పలాయనము "సెయింట్ ఎస్తేవామ్" కోట మరాటులకు లోబడుట	322
270	పారిపోవు గోవా రాజ ప్రతినిధిని శంభాజి వెంబడించుట	323
271	ఛత్రపతి శంభాజి తనకు ప్రాణ దానం చేసిన 'ఖండోజి బల్లాలుకు ప్రగాఢ కృతజ్ఞత వెల్లడించుట	324
272	మహావీరుడు "కృష్ణాజి కంక్" వీర స్వర్గమలంకరించుట	325
273	రాష్ట్రతినిధి కొండెడి ఆల్వోరు రాజధానిని పానాజి నుండి "మార్మ గోవా"కు మార్చుట	327
274	"ఛత్రపతి శంభాజీ" భారత దేశము నుండియే పోర్చు గీసులను సమూలముగ పారద్రోలవలెనని నిశ్చయించుట	328
275	ఛత్రపతి శంభాజీ మత సామరస్య భావన	329
276	గోవా రాజ ప్రతినిధి 'ఆల్వోరు' తన వరుస ఓటములకు క్రుంగి పోయి "బామ్ జీసస్ చర్చిలో సెయింట్ జేవియరు" మృత దేహమునకు మ్రొక్కుకొనుట	330
277	రాయబారి "ఏసాజీ గంభీరరావు" పోర్చుగీసుల నిర్బంధము నుండి స్వేచ్ఛ పొందుట	331
278	పోర్చుగీసులు ఛత్రపతి శంభాజీతో సంధికై దిగివచ్చుట	331
279	పోర్చుగీసులకు సహాయముగా 'షాజాదా మౌజము' లక్ష సేనతో వచ్చుట	332

280	శంభాజీ రాయగడములో లేడని తెలిసి షాబుద్ధీను రాయగడముపై దండెత్తుట	332
281	షాబుద్ధీను అధిక ధనములు, బిరుదములు యిచ్చి మరాటా దుర్గాధిపతుల నెందరినో వశపరచుకొనుట	334
282	"షాబుద్ధీను" పై "కవికలశు" విజయము	334
283	షాజాదు "మౌజము" లక్ష సేనతో 'గోవా' ను చేరుట	336
284	'షహజాదుమౌజము' సేనపై "సామంతువాడి" యొద్ద మరాటులు దాడిసేయుట	337
285	ఛత్రపతి శంభాజీతో పోర్చుగీసులు సంధి చేసికొనుట	337
286	'షాజాదామౌజము' పోర్చుగీసుల నిర్లక్ష్య వైఖరిని నిందించుట	337
287	గోవాప్రాంతములో షాజాద మౌజము సాగించిన విధ్వంసము తమకే తీవ్ర నష్టము కల్గించుట	339
288	షాజాదుమౌజమునకు 'గోవా' దండయాత్రలో కలిగిన తీవ్ర ఆశాభంగము	340
289	ఛత్రపతి శంభాజీ తీవ్ర వైఫల్యములు	340
290	ఔరంగజేబు అగణిత ధనముతో పాటు జమీందారీలు బహూకరించియు మరాటా వీరులను ప్రలోభపెట్టి తన వైపుకు త్రిప్పకొనుట	341
291	'ఛత్రపతి శంభాజి' తన సేనాధిపతులకు దుర్గ రక్షకులకు మ్లేచ్ఛుల దురాగతములను వివరించి తెలుపుచు, లేఖలు వ్రాయించి పంపుట	341
292	ఛత్రపతి శంభాజీ మరాటులను స్వాతంత్ర పోరాటమునకై పురికొల్పుట	343
293	ఛత్రపతి శంభాజీ "పోర్చుగీసు" వారితో "ఆంగ్లేయులతో" సంధి చేసికొనుట	344
294	"ఔరంగజేబు" "బీజాపురము"పై దండెత్తుట	345
295	ఔరంగజేబు ఆగ్రహించుట	347
296	మహారాష్ట్ర కఱవు (క్రీ.శ. 1686-87)	347
297	చిక్కదేవరాయలు మరాటులకు వ్యతిరేకముగా ప్రవర్తించుట	348

298 'ఛత్రపతి శంభాజీ' చినబావ 'హర్జీమహాదికు' ఎదురుతిరిగి
స్వతంత్రత ప్రకటించుకొనుట 348
299 'ఛత్రపతి శంభాజీ' కర్ణాటకలోని
'చిక్క దేవరాయలపై' యుద్ధమునకు వెడలుట 349
300 కరవు నెదుర్కొనుటకు వీలైనన్ని చోటుల నుండి 'శంభాజీ'
ధాన్యము సేకరించుట 349
301 'జింజీ' ప్రాంతము నుండి మరాటకు సరిపడు ధాన్యము వచ్చు
వ్యవస్థ యాగిపోవుటకు 'హర్జీమహాదికు' పితూరీ కారణమగుట
- 'హర్జీ మహాదికు' పైకి యుద్ధమునకు సైన్యమును పంపుట 350
302 షాజాదు అజము బీజాపురముపై ముట్టడి చేయుట 351
303 బీజపూరుకు కుత్బుషాహి మరాటాలు సాయపడుట 352
304 ఔరంగజేబు తన వరుస యోటములను దలచి తన
యుద్ధ వ్యూహములపై పునరాలోచనము చేయుట 353
305 పాదుషా గోల్కొండపై దండెత్త నిర్ణయించుట 353
306 "అక్కన", "మాదన్న"ల హత్య 356
307 "మౌజము" సారధ్యములో మొగలు భటులు
హైదరాబాదును దోచుకొనుట 356
308 బీజపూరుకోట ఔరంగజేబునకు లోబడుట 357
309 బీజపూరు సైన్యాధ్యక్షులు "షార్జఖాను"ను కొల్వునుండి
తొలగించమని ఆ లేఖలో 'ఆదిల్షా'ను 'ఔరంగజేబు' ఆదేశించుట 358
310 కీ॥శే॥ ఆదిలుషా పుత్రి షహ్రాబాను ఔరంగజేబు లేఖ చూచి
మండిపడుట 358
311 బీజపూరు రాజ్యములో వెల్లివిరిసిన మత సామరస్యము 361
312 ఔరంగజేబు గోల్కొండ ముట్టడి 362
313 గోల్కొండ కోటపై యుద్ధము 363
314 నైఋతి ఋతుపవనముల వర్షములకు మూసీ నదికి
వరదలు వచ్చుట - మొగలుల కష్టములు 364
315 షాహజాద "మౌజము"ను పాదుషా కఠినముగా శిక్షించుట 366
316 తన కుమారుడు మౌజము పయి ఔరంగజేబునకు తీవ్రమైన
అనుమాన ముండుటచే నతనిని ఘోరముగా శిక్షించుట 366

317 "మూసీ" నది వరదల వలన మొగలు సైనికులు
యిబ్బంది లెదుర్కొనుట 367
318 ఔరంగజేబు తానిషా అబులుహసను ను భయపెట్ట జూచుట 369
319 "అబులుహసను తానిషా" కు అత్యంత విశ్వాస పరుడైన
సచివుడు "అబ్దుల్లపాని" రాజద్రోహమునకు కడంగుట 370
320 "అబుల్‌హసను తానీష" కు అత్యంత విశ్వాసపాత్రుడైన
మరియొక మంత్రి "షేక్‌నిజాము" రహస్యముగా
ఔరంగజేబును కలిసికొనుట 371
321 ఔరంగజేబు తలపాగ ధరింపకుండుటకు కారణము 371
322 'షేక్ నిజాము' 'శంభు'ని బంధింతునని శపథము చేయుట 373
323 రాజద్రోహి 'అబ్దుల్లపాని" తెఱచి యుంచిన బిలమార్గమున
మొగలులు గోల్కొండలో ప్రవేశించుట-"తానిషా"పరాజయము375
324 హైదరాబాదు నవాబు అబులుహసను, బీజపూరు నవాబు
'సికందరుషా' దౌలతాబాదు చీకటి కొట్లలో బందీలగుట 376
325 'ఛత్రపతి శంభాజీని' పట్టుకొనుటకు పాదుషా పన్నిన వల 376
326 "వాయ్" యుద్ధము 376
327 మరాటులు పాతబడిన ఆయుధములతో యుద్ధము చేయుట 377
328 'వాయి' రణ క్షేత్రములో 'బహిర్జీనాయకుడు' 'హంబీర రావుకు'
కన్పించి, 'శంభుజీ'ని బంధించుటకు 'పాదుషా' పన్నిన కుట్రను
చెప్పట 378
329 మరాటులు షార్జఖాను సైన్యమును యడవులలోని కాకర్షించుట 380
330 వీర హంబీరరావు మోహితే అస్తమయము 380
331 వీర 'హంబీరరావు మోహితే వ్యక్తిత్వము' 'ఛత్రపతి
శంభాజీ' పట్టాభిషేకమున వెన్నుదన్నుగ నిల్చుట 381
332 "వాయ్" యుద్ధములో మొగలుల ఓటమి 381
333 హంబీరరావుమృతికి ఛత్రపతి శంభాజీ తీవ్రముగా దుఃఖించుట 382
334 ఔరంగజేబు బీజాపూరుకు వచ్చుట 383
335 'షాజాదా అక్బరు' 'కలలు కల్లలై' 'పారశీక దేశము'నకు ప్రవాస
మేగుట - దుర్గాదాసు రాఠోడు ఆశాభంగము 383

336 ఔరంగజేబు హెచ్చుగా ధనము, వతన్లు, జాగీర్లు, పదవులు
వాగ్దానము చేసి మరాటా దుర్గపతులను లోబఱచుకొనుట 384
337 మరాటా రాజ్య విస్తీర్ణము తగ్గిపోవుట - ఆదాయము తగ్గుట
శంభాజీ కదలికలకును స్వేచ్ఛ తగ్గుట 385
338 శంభాజీని బంధించుటకు 'ముకర్రబు', 'రుస్తుముఖాన్ల'
తీవ్ర ప్రయత్నము 385
339 'శంభాజీ'పై మరాటా జమీందార్ల ద్వేషమునకు కారణము 386
340 బీజపూరులో మహమ్మారి వ్యాధి చెలరేగుట (ప్లేగు) ఔరంగజేబు
అహ్మాద్ నగరుకు తరలుట 387
341 'ఛత్రపతి శంభాజీ'కి గాని, 'కవికలశునకు' గాని తమపై జరుగు
కుట్రను గురించి తెలియక పోవుట 388
342 'ఛత్రపతి శివాజీ', 'ఛత్రపతి శంభాజీల'పై 'షిర్కె' కుటుంబము
వారి కోపమునకు కారణము 388
343 శ్రీ శివాజి యల్లుడు గణోజీరావు షిర్కె తన బావ మరిది యైన
ఛత్రపతి శంభాజీని తన సుబా "దభోలు"ను తనకీయమని
యడుగుట 389
344 ఛత్రపతి శంభాజి 'వతనుదారీ'కి వ్యతిరేకి యగుట 389
345 'కవికలశు' 'షిర్కే'ల మధ్య వివాదము - 'కలశు'పై గణోజి
దాడిచేయ బూనుట - 'శంభాజీ' కవికలశుని పక్షమును
వహించి 'విశాల గడము'నకు వెడలుట 390
346 'షిర్కె' - 'మొగలులు' కలిసి చేసిన మోసపూరిత పన్నాగము 390
347 రాయగడమును వీడుట ప్రమాదమని శంభాజీని భార్య
యశూబాయి ఆప ప్రయత్నించుట - అదియె
'యశూబాయి'కి భర్త కడ చూపు యగుట 390
348 ముకర్రబుఖాను (షేక్‌నిజాము) శంభూజీ కదలికలపై గట్టి
కాపుదల యుంచుట 392
349 'శంభాజీ' కొద్ది సేనతో 'విశాల' దుర్గమును చేరుట 392
350 ఛత్రపతి శంభాజీ తనకు యెదురగుచున్న యిబ్బందుల
నన్నింటిని తలచుకొని జగదంబ కరుణను కోరి ప్రార్థన చేయుట 393
351 ఛత్రపతి శంభాజి సర్వ సేనాపతి మల్హోజి ఘోర్పడేను ఇతర
మంత్రులను సంగమేశ్వరమునకు రమ్మనుట 394

352 ముకర్రబుఖాను (షేక్‌నిజాము) వ్యూహము 394
353 ఛత్రపతి శంభాజి పోబడి గూర్చి ముకర్రబుఖానుకు గల యెఱుక 395
354 ఛత్రపతి శంభాజీ కవికలశునితో కలిసి సంగమేశ్వరమునకు
వచ్చుట 395
355 'శంభాజీ' విజయమునకు 'కవికలశుడు' 'కాళికామాత' పూజ
చేయుట 396
356 శంభాజీ కవికలశుల గాఢ మైత్రి 396
357 కవికలశుడు కాళికాంబను పూజించుటకు వెడలుట -
శంభాజీ దేవరూఖు లో "సోల్జాయి" మాతను కొల్వఁ బోవుట 397
358 'ముకర్రబుఖాను' సంగమేశ్వరమును చుట్టుముట్టుట 397
359 పడమటి కనుమలలోని భయంకరారణ్య మార్గములు 398
360 తనకు బావ, బావమరది యైన 'ఛత్రపతి శంభాజీ'పై
'గణోజిషిర్కే'కు గల వైమనస్యమునకు కారణము 400
361 ఛత్రపతి శంభాజీకి ముకర్రబుఖాను ఆకస్మిక దాడిని గూర్చి
చారులు యెఱింగించుట - శంభాజీ విస్మితుడగుట 401
362 సేనాధిపతి మల్హోజి ఘోర్పడే శంభాజీని తక్షణమే
అ ప్రదేశము వీడి పొమ్మని చెప్పుట 401
363 మరాటా సర్వసైన్యాధిపతి "మల్హోజి ఘోర్పడే" వీర
స్వర్గమలంకరించుట 402
364 ఛత్రపతి శంభాజీ మొగలులు కొంకణములో ప్రవేశించినచో
వారి యునికిని గూర్చి తన బావమరిది షిర్కే తనను
హెచ్చరించునని విశ్వసించి యుండుట 402
365 కవికలశునిపై మొగలులు దాడి చేయుట 403
366 ఛత్రపతి శంభాజీని మొగలులు బంధించుట 404
367 ఔరంగజేబు న్యాయ నిర్ణయ సభను చేయుట 407
368 శత్రులచేత చిక్కి నందులకు 'శంభాజీ' పశ్చాత్తాపము 407
369 ఛత్రపతి శంభాజీ కవికలశు బంధితులైన మరునాటి
సూర్యోదయము 409
370 ఔరంగజేబు శంభూజీతో గర్వోక్తులు పలుకుట 409
371 ఛత్రపతి శంభాజీ పాదుషాను తీవ్రముగా ఉపాలంభించుట 410

372 'ఔరంగజేబు' అమాత్యులు పెదబావ 'మహద్జినింబాల్కరు'ల శంభాజీకి హితోపదేశము చేయుట 411
373 పాదుషా ఆర్థిక శాఖా మాత్యుడు 'శంభాజీ'కి పాదుషా నిబంధన లెఱిగించుట 412
374 ఛత్రపతి శంభాజి రుహల్లాఖానుకు, తన బావ 'మహదాజి'కి యిచ్చిన ప్రత్యుత్తరము 413
375 ఛత్రపతి శంభాజీ, కవికలశు నాల్కలను మొగలు భటుల ఛేదించుట 415
376 'వీర శంభాజీ' 'కవికలశుల'కు కనులు పొడిపించుట 416
377 నిరంతర జగదంబ నామ జపము శంభు కలశులకు నొప్పిని తెలియ కుండ చేయుట 417
378 'వీర శంభాజీ' 'కవికలశు'లకు పాదుషా పెట్టించిన చిత్రహింస 417
379 దారుణ శిక్షలు ఆచరణలో పెట్టు భటులు శంభాజీని లొంగి పొమ్మని బ్రతిమాలుట 418
380 వీర శంభాజీ ప్రత్యుత్తరము 418
381 వీర శంభాజీ కలశుల చర్మ రహిత దేహములను ఇత్తడి పులిగోళ్లతో చీల్చుట 419
382 వ్యాఘ్రనఖ ప్రయోగ ఘట్ట పరిసమాప్తి 419
383 అంత్య ఘట్టము - శంభాజీ కలశుల కాల్సేతులు నఱకించుట 420
384 ఛత్రపతి శంభాజి కవికలశుల శిరచ్ఛేదమును చేయుట 420
ఉపసంహారము 421
385 మధు బదురుక్ - తులాపూరు 421
386 'బాపుబువా' 'శ్రీ శంభాజి' శరీర శకలముల ప్రోది చేసి అంత్య క్రియలు జరిపించుట 421
సింహావలోకనము 422
387 శ్రీ కవికలశ్ వృత్తాంతము 424
388 కవికలశునిపై మరాటా మంత్రుల యీర్ష్యా ద్వేషములు 425
389 వీర శంభాజీకి సంభవించిన సంకటములు 426
390 వీర శంభాజీని బంధించుటకు శత్రువుల పన్నాగము 427

391 విద్వన్మణి కవికలశ్ క్షాత్ర పార్శ్వము 429
392 రాయగడము నుండి 'శంభాజీ' కలశునికి
సాయపడుటకై బయలుదేరుట 429
393 వీరశంభాజీ ఆర్జవగుణమే యతని శత్రువగుట 431
354 వీర శంభాజీ - కవికలశుల ప్రగాఢ మైత్రీ బంధము 432
395 నిరాధారమైన అపోహలతో ఔరంగజేబు శంభాజీపై కక్ష
పెంచుకొని శిక్షింప బూనుట 433

అనుబంధం - 1

396 సర్వ సైన్యాధిపతి శ్రీ ప్రతాపరావు గుజర్ 434
397 జానకీ రాజారామ పరిణయము 437

అనుబంధం - 2

398 సర్వసేనాధిపతి, మహావీర హంబీరరావు మోహితే 438
399 వెల్లూరు కోటపై విజయము 439
400 వీర శంభాజీకి హంబీరరావు మోహితే సర్వసైన్యాధిపతి యగుట 440
401 వీర 'శంభాజీ', హంబీర రావు మోహితే బుర్హానుపూరును దోచుట 440
402 వీర హంబీర రావు రణమస్తఖానుతో జరిగిన
యుద్ధములో గాయపడుట - ఓటమి 440
403 మహావీర "హంబీరరావు" వీరస్వర్గతి 441
404 తారాబాయి, రాజారాముల పరిణయము 442
405 ధర్మవీర, మహావీర శ్రీ శంభాజీ భోసలే మహారాజే
చేసిన ఆత్మార్పణము-మరాట రాజ్యముపై ప్రత్యేకముగా భారత
భూమిపై సార్వజనీనముగా కల్గించిన సాంస్కృతిక, చారిత్రక,
ధార్మిక, ఔరసత్వ ప్రభావము 443
406 ధర్మవీర, మహావీర, "ఛత్రపతి శ్రీ శంభాజీ మహరాజే"
చరిత్ర సంపూర్ణం. 434
407 కృతికర్త ప్రవర 445
408 మిత్ర పరామర్శ 445
409 ఏతద్గ్రంథ రచనకు ఆధార గ్రంథములు 446
410 కృతికర్త పరిచయము 447
411 కృతికర్త ఇతర రచనలు 447
412 సహృదయ హృదయం (పండితాభిప్రాయాలు) 448

తే॥గీ॥ ఇవి సిరాతో లిఖించి నట్టివగు నక్క
రములు కావు – నా శంభాజి రక్త బిందు
వులె – లిపిగ మారి తమ గాధ తెలుగునందు
తెలియజేసె నీ భువిలోని తెలుగు ప్రజకు !

తే॥గీ॥ హిందు ధర్మమ్ము రక్షింప నెట్టులుండ
వలెనొ జీవించి చూపె శివాజి భోస్లే !
హిందు ధర్మమ్ము రక్షింప నెట్టు లుండ
వలెనొ మరణించి చూపె శంభాజి భోస్లే !

అభవస్తవం

సీ॥ ఇఱ్ఱి తాలుపు వంక బుఱ్ఱపై మెఱయంగ
పుఱ్ఱెల దండలు నఱ్ఱు నిండ
కఱ్ఱి కరిగరుసు గరగర చీరగా
జెఱ్ఱిపోతులు పైడి చేర్లు గాగ
పుఱ్ఱయోర యొడల కఱ్ఱి దేవత నిల్వ
మొఱ్ఱిపంటి పెదబ్బి మురిపె మొలుక
పెను చిఱ్ఱ జుట్టులో మినువఱ్ఱుమిట్టాడ
కొఱ్ఱు దాలుపు కుఱ్ఱ కురువు నెక్క॥

తే॥గీ॥ నఱ్ఱ "నంది" యఱ్ఱెత్తి ఱేనరయు చుండ
తెఱ్ఱనోటి మెకము గుఱుగుఱ్ఱు మనగ
చిరికను తెఱచి పిసవెఱ్ఱి దొరను నేర్చి
మంచు మిఱ్ఱున కొల్వుండు మన్నె కొలుతు ॥ 1

సీ॥ ఇల్లొను రజతాద్రి యిలటపల్లునిగను
విల్లొను దండెత్త పీయు నగము
మోయు ప్రాసంగ్యమ్ము భువన విహరణకు
మోయు ప్రాఁజదువులు పురహరణకు
నెఱుక యెంగిలి భక్త మిల భక్త తృప్తికి
విసము ప్రాశము జగత్పీధమునకు
లేలిహములు మేని మేలైన తొడవులు
కొడుకుల యెక్కిడుల్ కొక్కు, కేకి ॥

తే॥గీ॥ విషధరధరుడు విషమాస్త్ర విద్విషుండు
విషమనేత్రుడు విషభోక్త విషమ వేషి
యనెడు విషమములన్ని నీ యాటె గాని
సమతతో సృష్టిసాగించు శర్వ శరణు ॥ 2

సరస్వతీ సంస్తుతి

సీ॥ ప్రాచేతస వ్యాస పరమ సంయమి సిద్ధ
వాక్కుల మార్దవ ఫణితి నేర్చి
భాస, కాళీదాస, భవభూతి, భారవి
వరకావ్య మాధుర్య సరణి నెఱిగి
పాణిని వ్యాకృతి, పాతంజల వ్యాఖ్య
సూత్రాలతో వచశ్శుద్ధి తెలిసి
భరతమున్యానంద వర్ధన, మమ్మటా
లంకృతుల తళుకులన్ని గఱచి ॥

తే॥ యవనిపై కల్గు భాషల యందు సగము
పాలునకు "మూలభాష" గా ప్రథను గాంచి
యన్నిదేశాల జనముల మన్ననగొను
నమరభారతి పదముల కంజలింతు ॥ 3

సీ॥ ఆదికవి, కవిబ్రహ్మ, ప్రబంధ పరమేశ్వ
రుల యొడిలో ముద్దులొలుకు మొలక
సోమననాచన - సోమన పాల్కుర్కి
గారాముసేయు బంగారు బాల
శ్రీనాథ, పోతన, చినవీర, జక్కనల్
గోము మీరగ పెంచు కొమిరెమిన్న
యలసాని, కృష్ణరాయ, తెనాలి, తిమ్మన
భట్టుమూర్తుల ప్రియ ప్రౌఢపుత్రి ॥

తే॥ తరతరమ్మునకొక వింత తళుకు గుల్కి
యాధునిక కవితతి క్రొత్త యొాసు దిద్ద
"దేశభాషలలెస్స" నాఁ దేజరిల్లు
తెలుగు పలుకుల తల్లిని గొలుతు నెపుడు ॥ 4

తెలుగు నుడికి గిడిగిళ్ళు

ఆ॥వె॥ 'తెనుగు', 'తెలుగు', 'నాంధ్ర'మను పేరులేవైన
మనసుకింపు గొలుపు మధుర భాష
పదియు నైదు కోట్ల ప్రజల వాడుక భాష
దేశ భాషలందు తెలుగు లెస్స ॥ 5

ఉ॥ వెన్నకె మార్దవమ్ము గఱపెన్ మరి "పాపయశాస్త్రి" పద్యముల్
మన్నన పొందె "వేదుల" సమానులు లేరని వృత్తకల్పన
న్నెన్ని యుగాలకున్మఱువ నేరితరమ్ముగు "రాయప్రోలు" వా
రన్న నవీన పద్యకళకాద్యుడు హృద్యపదాభి రమ్యతన్ ॥ 6

ఉ॥ "దువ్వూరు రామిరెడ్డి" కవిధూర్వహుడెట్టుల నింపెనో గదా !
మవ్వపుతెన్గు మాధురిని మందికి విందులు సేయుకైతలో
రవ్వలు రాల్చి చూపె కవిరాణ్మణి "జాషువ" పద్యమందె - తా
నెవ్విధి తెన్గుకే తెనుగు నేర్పెనొ "తుమ్మల" జూచి నేర్వనొ ॥ 7

శా॥ ఎన్నె"న్నప్పయ దీక్షితుండు" మును నాంధ్రత్వమ్ము, నాంధ్రోక్తియు
న్నెన్నోపుట్టువులన్ గడించిన కడున్ హెచ్చౌ తపోలబ్ధిగా
విన్నారా! తమిళుండునయ్యు మహుడా విద్వాంసుడేమాడెనో
యెన్నండైనను తెన్గునున్ మనకనంతేశాప్తిగా నెంచుడీ ॥ 8

ఉ॥ బాసలలోన పశ్చిమ ప్రపంచము నం "దిటలీ" నుడుల్ శ్రవో
ల్లాసము కల్గ జేయునటు లాంధ్రము గూడ "అజంత భాష"గా
వాసికి నెక్కెతూరుపు ప్రపంచము నందని 'జే-బి-హాల్డెనె'
వ్డో సెలవిచ్చె నేడుతలపోయుడికన్ మన తెల్గు వెల్గులన్ ॥ 9

శా॥ 'సీ.పీ.బ్రౌను' మహాశయా తెనుగు నా జీవమ్ము సేవింపగా
యే పుణ్యమ్మొనరించె నాంధ్రప్రజ నిన్ప్రేరేపగా నాడు నీ
ప్రాపే లభ్యము గాకయున్న బహుళాంధ్ర గ్రంధ సందోహమే
రూపున్మాసి నశించిపోయెడిది - యూరున్ పేరు లేకుండగన్॥ 10

అనంతేశాప్తి=అనంత ఐశ్వర్య ప్రాప్తి

తెలుగు పద్యాలు

ఉ॥ "మంకుతనమ్ముమాని కనుమా! వలపూరెడు చూపుతోడనా
వంక" యటంచు వాలుజడ పట్టుచు లాగెడు చిన్నవాని "చా
లింక సరాగమాగు"మని లెంపను మీటెడు కుఱ్ఱదాని - యా
జంకెన వాడి చూపు లెగజల్లెడు మంకెన లాంధ్రపద్యముల్ ॥ 11

ఉ॥ చండ గదాప్రహారములు చంపక హారములట్టు లెంచుచున్
తొండములెత్తి ఘీంకృతుల దుస్సహనాదము వైరిగుండెలన్
పిండియొనర్ప - నేలపయి పేరెము దీసెడు కొండలట్లు - వే
దండ విహార ధోరణుల దార్చుతలంపున కాంధ్ర పద్యముల్ ॥ 12

చ॥ ఖర కరవాల ఘాతముల కాయము గాయపు క్రంతలయ్యు ముం
దుఱుకుచు కాళ్ళతో పగర దొమ్మల వ్రీలగతన్ని గొంతుకల్
కొఱుకుచు దంత సంహతిని - గుండియలాగెడు హేషభీషణో
ద్ధుర సమరాశ్వ వేగగతితో సరితూగును నాంధ్రపద్యముల్ ॥ 13

ఉ॥ వైరుల యంపగాతలకు, బల్లెపు పోట్లకు, కత్తి వ్రేట్లకున్
జీరుకు లేక రక్తమున జీర్వమునుంగగ శత్రు సేనపై
మీరుచు దేశరక్షణకు మేనును, ప్రాణము లొడ్డి పోరు - ఆ
వీరులు చేయునట్టి రిపు భీకర నాదము లాంధ్ర పద్యముల్॥ 14

ఉ॥ వానలు లేక వత్సములపాటు పొలమ్ములు నెండి పోవగా
దీనులు నౌచు హాలికులు తిండికి, తీర్థముకైన నిట్టునై
గ్లానిని చెంద - సుంకములకై యధికారులు బల్మిచేయగా
బూనిన-దిక్కు లేక జనమొల్కెడు నశ్రులు నాంధ్ర పద్యముల్॥ 15

(అంపగాత=బాణపు దెబ్బ; జీరుకు=తొట్రుపాటు; జీర్వ=శరీరము)
(వత్సములు=సంవత్సరములు; నిట్టు=కఱవు).

ఆంధ్ర సాహితీ సుకవి ప్రశంస

కవిత్రయం లేనిదే ఆంధ్ర పద్య సాహిత్యం లేదు.

చ॥ తెలుగు నుడిన్ వెలుంగునకు తేరగ దీవియచూపు నన్నయన్
తెలుగును వేమడుంగులుగ ధీనుతి పాత్రముఁజేయు తిక్కనన్
తెలుగునకున్ ప్రబంధ కళ తెచ్చిన యాద్యుడు నెఱ్ఱనార్యునిన్
కొలువక తెల్గుకైసరులు గుండెయ? చెర్వుయ? గంటమూనగన్ ॥16

ఆశుకవితా శేషఫణులు - అవధాన కవితా విభూషణులు -
కొప్పరపు సోదర కవుల ప్రశస్తి

ఉ॥ జంటగ కొప్పరంపు సహజన్మ కవిద్వయి తెన్ను బాసలో
గంటకు నైదు నూఱ్ఱ కధికమ్ముగ నాశువు తోడ పద్యముల్
తొంటి మహాకవీట్కవనధోరణి మించు కవిత్వ ప్రౌఢితో
దంటలునై వెలార్చిన బుధాగ్రణులెప్డు వసింత్రు నా మదిన్ ॥ 17

చ॥ తెలుగు నుడిన్ కవిత్వమును తీర్చగ కూర్చగ నెట్టి ప్రక్రియన్
వలచిన నేమి? యోగ్య రసవంతము చేయుటయే ప్రధానమౌ
కొలిచెదనట్టి సత్కవుల కొండిక లైనను పెద్దలైన – నీ
తెలుగు చిరాయువై మనెడు తెన్నును చూపెడు వారి నందరిన్॥ 18

చ॥ అనితర సాధ్యరీతి "గడియారము వెంకట శేషశాస్త్రి" వ్రా
సిన "శివభారతాఖ్య" కృతి చెప్పును "శ్రీ శివజీ చరిత్రమున్"
గొనబగు పద్యకావ్యముగ కూర్చుచు నిర్వచనమ్ముగా తెలుం
గునుడుల తీయ మెల్లరకు తెల్లముచేసె నవీన తిక్కనై॥ 19

ఉ॥ దట్టులునౌ కవీశ్వరులుదాసులునౌచు చరిత్రపట్ల వా
కట్టయినట్లు వీరవరగాథలు వస్తువుచేసి కబ్బముల్
కట్టరు – కామమెక్కొలుపు గాధల బూజుకు మోజు చూపుచు
న్నట్టి తరమ్ము వారలు ననాదృతి చూపెదరన్న భీతితో॥ 20

ఉ॥ వీరులగాథ తేర్చుకొని విశ్రుత విస్తృత పద్యకావ్య శో
భారమణీయ తన్నొసగి వ్రాసియునందరి ముందు నాంధ్ర వా
క్కారమ యిట్టిదంచు – కృతిపై చవిఁబెంచగ చూపినట్టి ఆ
గౌరవనీయులైన కవికర్తలె నాకిట మార్గదర్శకుల్ ॥ 21

(కొండిక=చిన్నవాడు; తెన్ను=దారి) (ఉదాసులు=నిరాసక్తులు) కర్త=బ్రహ్మ

స్వవిషయము

ఉ॥ ఉన్నత పాఠశాల తెలుగొజ్జలు పాఠ్యప్రణాళికా విధి
న్నెన్నిక చేసి చెప్పినదదే తెలుగంచు ప్రతుష్టి నందకే
నెన్నియొ పద్య గద్య కృతు లెప్పుడదే పనిగా పఠించుచు
న్నన్నుడులమ్మ యాశిషము లంది రచించితి పద్యకావ్యముల్ ॥ 22

మ॥ పదమూడేడుల ప్రాయమందె కవితాప్రారంభమున్ చేసి - న
ల్వది యేండ్లీడున "పంచతంత్రి" తెనుగుంబద్యమ్ములన్ వ్రాసి-డె
బ్బది మూడేండ్ల వయస్సులో నిపుడు శంభాజీ ప్రబంధమ్ము కూ
ర్చు దశంజేరితి శారదాంబ కరుణా లోక ప్రసారమ్మునన్ ॥ 23

ఉ॥ పాతిక యేండ్లక్రింద తలపయ్యె - మరాట ప్రవీరు శంభుజీ
పూత చరిత్ర - మై గగురువున్ కలిగించెడు వీరగాధ - నా
పాత మహోగ్ర వీరరస బంధురమై యెదపిండివేయు తా
పాతిశయిత్వకారినొక పద్యప్రబంధముగా ఘటింపగన్ ॥ 24

ఉ॥ గద్యము నందు చెప్పదగు గాధను పద్యము నందు చెప్పు-నా
విద్యకు పెద్ద పీటనిడు వేడుక పెద్ద-తెలుంగు వారికా
హృద్యమునౌ సబాముసకు నెంతయు పొంగుచు శంభుజీ ప్రబం
ధోద్యమమిట్లు పూనుటకు నూహముసేసితి పద్యప్రక్రియన్ ॥ 25

చరిత్రకారుల విచిత్రపు పోకడ

చ॥ వలిపము ముండ్ల కంప పయి వ్రాలిన దానిని చిన్గు లేకయున్
తొలగగజేయ కష్టపడు ధోరణిబోలు "మరాట గాధయున్
పలు విధముల్ చరిత్రమును వ్రాసెడు వారల రీతు లారయన్
కలదని యొక్కడన్న నదికాదను నింకొకడేది సత్యమో ! ॥ 26

అంకితము

కృతికర్త డా॥ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు

కృతి స్వీకర్త్రి : కృతికర్త అక్కగారు శ్రీమతి పొన్నలూరు (శింగరాజు) శారదాంబ

కృతికర్త ధర్మపత్ని శ్రీమతి శింగరాజు (వేములపాటి) సీతాలక్ష్మి

ఉ॥ అమ్మకు, అమ్మలేని తన మాతృకు సోకగనీని నాన్నకున్
అమ్మను మించి మమ్ములను నర్మిలి సాకిన మేనయత్తకున్
ఉమ్మడి కాపురమ్మునకు నూతము పిన్నికి, పిన్న తండ్రికిన్
అమ్మయె అక్క అయ్యెనను అక్కకు నీ కృతి అంకితమ్మగున్ ॥ 27



దైవస్తుతి

శా॥ శ్రీలందేలెడు భారతక్షితి కుదీచీ దిక్కునన్ కాపుగా
ప్రాలేయాచల పంక్తున్నిలిపియున్ ప్రాక్పశ్చిమావాచులన్
తాలోత్తాల తరంగ దుస్తరణ విస్తారాబ్ధి తార్తీయ ర
క్షాలంబమ్ము నొసంగినట్టి త్రిజగత్కర్తన్ సదా కొల్చెదన్ ॥ 28

ఉ॥ కోవిదులంబొనర్ప నరకోటికి విద్యలొసంగు నట్టి వా
ణీ వికచాంబుజాక్షిని – గణేశుని, యా శివదేవునిన్, హయ
గ్రీవుని, వేదమాతను, గిరీశతనూజను కొల్తు సత్కవి
త్వావహ కావ్య నిర్మితి కళాఢ్యునిగా నొనరింప నన్నిలన్ ॥ 29

శా॥ శ్రీమంతంబగు భారతోర్వియెడ హృత్సీమన్ "ప్రసూ"భావనా
శ్రీమంతం బొనరించి – భారత జనస్వేచ్ఛాపహారార్థులై
యే మార్గమ్మున వచ్చి ముట్టినను, మాయింపంగ నా దుష్టుల
న్నా ముక్కంటియె పుట్టెనోటు। శివజీయై వెండి శంభాజియై॥ 30

భోసలే వంశ చరిత్ర

చ॥ "హొయసల రాజవంశ్యులని" యొక్క విపశ్చితుడున్, "శిశోదియా నృపా
న్వయులని" యొక్క పండితుడు నాడ, మఱొక్క చరిత్రవేత్త యా
శయమున "భోసలే" కులుల సంతతిదెల్ల మరాట "కుంభి" శా
ఖయె యగు–వారు హాలికులుగా పరిగణ్యులు వృత్తిచే నిలన్ ॥ 1

చ॥ "హొయసల" యన్నమాట రుతి కుద్దిగతోచును "భోసలే" యనం
గ యులివు గూడ – దేవగిరి స్కందులు యాదవులంచు భోసలా
న్వయులని గూర్చి చెప్పుదురు – పండితులిన్ని విధాల నాడి ని
శ్చయమనలేరు–భోన్సలుల జాతి "మరాట"యు, "కుంబి" వంశమౌ॥ 2

(ప్రసూభావన=మాతృభావము; పుట్టెనోటు=పుట్టె కాబోలు)
(విపశ్చితుడు=పండితుడు; కందువ=వంశము) రుతి, ఉలివు=ధ్వని
(స్కందులు=రాజులు)

ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజీ మహారాజె చరిత్ర

కథా ప్రారంభము

ఛత్రపతి శంభూజీ ప్రప్రపితామహుడు

బాబాజీ భోన్సలే (కీ.శ. 1549-1597)

ఉ॥ శంభుని గూర్చి చెప్పుటకు సాగెడి ముందు, తదీయ శూరతా
గుంభితమైన భోన్సలుల గొప్పను గూర్చి వచింపనౌను, ప్రా
రంభమునందె - శంభునకు ప్రప్రపితామహుడైన "బాబజీ"
జృంభణమున్ గుఱించి తగు చింతన సేయుచు ప్రశ్రయమ్మునన్॥ 3

శా॥ ఈ "భోన్లేన్స" కులమూల పూరుషునిగా నెంచన్ వలెన్ ముందు-"బా
బా"భూస్వామి ప్రసిద్ధనామమునె-శంభాజీ కృతిన్వ్రాయు కా
ర్యాభోగమ్మున కెందరో మహులు గోత్రస్వాములున్నన్నకుం
ఠాభిఖ్యానము వంశ కర్తగను రూఢమ్మయ్యె "బాబాజి" కే ॥ 4

శా॥ "దేవల్గాము"ను "హింగ్నిబెర్ది" యనగా ద్విగ్రామముల్" 'పూణె'దా
పౌ విశ్వంగల యట్టి వానిపయి తా "పాటిల్" పదమ్మంది - ఆ
పై వృద్ధింగనె "భోన్సలే" కులుడునౌ "బాబాజి"-తద్వంశమున్
తావర్ధింపగ పుట్టె నగ్రసుతుగన్ "మాలోజి" "బాబాజి"కిన్ ॥ 5

(ప్రప్రపితామహుడు=ముత్తాత తండ్రి; ప్రశ్రయము=గౌరవము)
(విశ్వ=భూమి; పాటిల్=గ్రామాధికారి బిరుదు) (అభిఖ్యానము=కీర్తి)
(ఆభోగము=ప్రయత్నము)

ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజి మహారాజే ప్రపితామహుడు "మాలోజీ భోస్లే"

(జననం క్రీ.శ.1592 - మరణం క్రీ.శ. 1670)

శా॥ "మాలోజీ"కి కనీయుడైఁ గొనియె జన్మంబున్ 'విఠోజీ' తొలిన్
యేలీలన్ రఘురామునింగొలిచెనో నిర్ణిద్రుడై లక్ష్మణుండ
ట్లోలిన్న న్నకు తోడు పాటుగను నెన్నో యుద్ధముల్ చేయుచున్
'జే'లందన్నెను పోషకప్రభులనున్, జ్యేష్ఠున్ ప్రతాపార్హుడై ॥ 6

శా॥ "మాలోజీ"మును సింధుఖేడు క్షితినిన్ మన్సీలు జాధవ్ కులుల్
పాలింపన్నట "రౌతు" గా కొలువు సంపాదించి యా పిమ్మటన్
"మాలిక్ అంబరు" నహ్మదానగరు ప్రామాత్యుండు తానీయగా
'యేలూరున్' 'దెరహాది' 'కన్నరదు'లన్ యేలెన్ 'వతన్దారు'గన్ ॥ 7

శా॥ "మాలిక్ అంబరు" నంతఁబోక మరియున్ మాలోజి కహ్మద్‌నగర్
పాలుండైన "నిజాముషా" కు కడు మెప్పొనట్లుగా చెప్పియున్
మాలోజీకిడ చేసె తెల్లటిగ "పూనాయున్" "సుపా" జాగిరు
ల్లా, లోకన్ "శివనేరి" "చాకణు" ముఖంబౌ కోటలున్ దక్కగన్ ॥ 8

మ॥ "ఫలతన్" భూమికి దేశ్‌ముఖుండయిన "జగ్‌పాల్‌రావు నింబాల్కరుం"
డలఘుండాతని సోదరీమణిని పెండ్లాడంగ 'మాలోజి' - త
త్ఫలితమ్మా యిరు వంశముల్ కలియుచున్ బాంధవ్యబంధమ్ముకున్
బలుపుంగూర్చిరి శాంతిప్రేమముల కావాసమ్ము కల్పించుచున్ ॥ 9

మ॥ పతి 'మాలోజి'కి, ధర్మపత్నియగు "దీపాబాయి" కెన్నేండ్లొ సం
తతిలేకున్న - యతండహమ్మదు నగర్ "దర్గా" కు "పీర్షాషరీఫ్"
యతికింజెందిన దౌ సమాధియది మ్రొక్కర్పింపగా "దీపయున్"
ఋతువున్ తప్పి సుత ద్వయమ్ము గనియెన్ రెండేండ్ల కొక్కొక్కరిన్॥ 10

('జే'లు=విజయములు)

(మన్సీలు=దొరలు; వతన్దారు=జమీందారు; ప్రామాత్యుడు=ప్రధానమంత్రి)

(తెల్లటి=బహుమానము; లోకన్=లోపలిప్రదేశము; దక్కుట=లభించుట)

శా॥ పేరుల్ పెట్టిరి బొట్టెలిద్దరి కెదన్ విశ్వాసముప్పొంగ యా
"పీరూషా" యతిపట్ల - "షాజి" యనుచున్ పేర్వెట్టి పెద్దబ్బికిన్
పేరున్ నిర్ణయముంబొనర్చిరి "షరీఫ్జీ" యంచు చిన్నబ్బికి
దారిందీర్చిరి దీప-తత్ప్రతియు నా "దర్వేషు" నప్పంతయున్ ॥ 11

షాజీ భోసలే వివాహము

మ॥ చిననాడాషహాజీని చూచిన "లఖూజీజాధవు"ండెంతయున్
చనవొప్పారగ మా "జిజా"ను నితనిన్ చక్కందనమ్మొప్పు జం
టనుగా చూతుమటన్న సంతసిలి "మాటన్ నిల్పుకో బావ" యం
చును మాలోజియు పట్టుబట్టె యటులే చూడంగనయ్యెన్ తుదిన్॥12

మ॥ 'లఖుజీ' నల్వురిలోనమాటవరుసన్ లక్ష్యమ్ము లేకుండ నా
డ - 'ఖరారియ్యది, మాటపై నిలుదు నేడం' చాడె 'మాలోజి'యున్
'లఖుజీ'కిన్ మది 'భోసలే'లనిన నిర్లక్ష్యమ్ము - 'మాలోజి' కొ
ల్వు ఖలమ్మంచు దలంచు, నిప్పుడతడాలోచింప సాగెన్ వగన్॥ 13

మ॥ అది "నింబాల్కరులా" కళించి తమ మేనల్లుండు 'మాలోజి'కిన్
మదికించన్-లఖుజీకి చెప్పిరిటులన్ "మాలోజి" పూనా సుపా
మొదలౌ జాగిరులున్ననేక గడముల్ పొందెన్ మహమ్మద్నగర్
సదమందాతని కెంతొ గౌరవము-నిశ్శంకన్ సుతన్ యీదగున్"॥ 14

శా॥ ఆపై 'షాజి'కి 'జీజియా'కును వివాహంబయ్యె కన్విందుగన్
పూపప్రాయమునందె దంపతిగ సంపూర్ణాను రాగమ్మునన్
దాపై స్నేహితులట్లు వర్తిలుచు యుక్త ప్రాయమంగమ్ములన్
ప్రాపింపన్ నవ యౌవనోదయకిల ప్రారంభులై రాపయిన్ ॥ 15

మ॥ నయనాస్త్రామలభక్తి పూర్ణుడగుటన్ మాలోజి "ఘృష్ణేశ్వరా
లయ" జీర్ణోద్ధరణమ్మొనర్చెను, "వెరుల్" గ్రామాంకమందున్ - జలా
శయ నిర్మాణమొనర్చె భక్తతతి మెచ్చంగన్ "శిఖర్శింఘణా
హ్వాయమౌ ప్రోలున-నిట్టులెంతొ సుకృతమ్మార్జించె ధర్మాత్ముడై॥ 16

(ఖలము=హీనము; వగ=విచారము)
(పూపవయసు=లేత వయసు; కిల=సయ్యాట)

శా॥ మాలోజీ 'యహమద్నగర్ దణి', సమిత్కర్కుండు - బీజాపురీ
పాలుండంపిన సైన్యమున్నెదిరి తత్పాంస్యాజిరమ్మందు తా
వ్రాలెన్నేలకు వీరనాకగతి సంప్రాప్తింప-సైన్యమ్ములున్
జాలిందూలగ - "ఇందపూరు" కడ సంస్తవ్యోత్తమశ్లోకియై ॥ 17

ధర్మవీర - మహావీర - ఛత్రపతి శంభాజీ పితామహుడు

షాజీ భోన్సలే (క్రీ.శ. 1594 - 1664)

మ॥ పదిరెండేడుల ప్రాయమందెయిదె వప్త్రాయోగ మాషాజికా
యదనన్నాతడు 'నహ్మదానగర' సైన్యంబందు నుద్యోగి - ఆ
పదమందట్టులె సాగి వింశతి సమప్రాయంబునందే సమ
స్తదళాధ్యక్షునిగా పదోన్నతిని పొందంగల్గె యోధాగ్ర్యుడై ॥ 18

శా॥ ఐనన్ 'షాహజి' 'అహ్మదా'నగర రాజ్యంబందు తాపొందుస
న్మానంబందెదియో యతౌల్యము నెదన్ భావించి తానంత నా
స్థానమ్మున్ విడనాడి చేరెను మొగల్ సైన్యమ్ములో - నాజులన్
తానున్ దక్షిణ భూజిగీషువులతో తాత్పర్యుడై పాల్గొనన్ ॥ 19

శా॥ ఆపై నేకతమో మొగల్ కొలువు పాయన్నెంచి 'యహ్మద్నగర్'
భూపాస్థానికి క్రమ్మఱెన్ తనకు నా భూమిన్ మహామంత్రియున్
ప్రాపైయుండిన 'మాలికంబరుకు' దాపై షాజి యాజిస్థలిన్
మాపెన్ ఢిల్లి చమూసమూహ విజయోన్మాదమ్ము నామూలమున్॥ 20

(నయనాస్త్రుడు=శివుడు; ప్రోలు=పట్టణము) పాంస్య+అజిరము=యుద్ధ భూమి (సమిత్కర్కుండు=యుద్ధములో సూర్యుడు (అనగా సూర్య సమాన దుర్నిరీక్ష్యుడు;) ఉత్తమశ్లోకి= గొప్ప కీర్తి గలవాడు)

(ఎయిదు=కలుగు; వప్త+అయోగము=పితృ వియోగము; సమ= సంవత్సరము)

(అతౌల్యము=అసమానత్వము; జిగీషువు=జయింప నిచ్ఛగలవాడు)

మ॥ అటులయ్యున్ 'అహమద్నగర్' కొలువు తానాశించు సంతృప్తికా
వటముంగాదని యెంచి షాజియును సేవంజేయ "బీజాపురీ"
పుటభేదమ్మును చేరె యాదిలుషహా ప్రోపున్ మదిన్నమ్మి-యం
తట నానాటికి రాజకీయ కలుషత్వమ్మెక్కుడయ్యెన్నటన్ ॥ 21

మ॥ మరలెన్నంతట 'షాజి' - 'యాదిలుషహా' ప్రమందన్ 'బిజాపూరు'లో
చొర'నహ్మాద్నగరమ్ము' కొల్వునపుడచ్చో మంత్రిగా "మాలికం
బరు" సూనుండు "ఫతా" ప్రభుత్వ విధి నిర్వర్తింపగా షాజి తా
నురవైనట్టి పదోన్నతిన్గనుచు తోడుండెన్ "ఫతాఖానుకున్"॥ 22

మొగలులు అహ్మద్ నగర్ ఆక్రమించుట

శా॥ ఆలో 'షాహజహా' 'నహమ్మదుపుర' మ్మాపోశనమ్ముంగొనెన్
తోలెన్ వైరిని, వారితో పెనగ నుత్తుంగాబ్ధి వీచీఘటా
భీలంబౌ మొగలాయి సైన్యమసదే? వేవిచ్చెన్ షహాజీ బలం
బాలంబందున నిల్వలేక - విజయంబయ్యెన్ మొగల్రాజుకే ॥ 23

"లఖుజీజాధవ్" హత్య - అహ్మాదునగరులో వచ్చిన మార్పు (క్రీ.శ.1570-1629)

మ॥ ఒకనాడా 'యహమద్నగర్' జనులకున్ యూహాతి రేకమ్ముగా
నొక దుర్వార్త వినంగనయ్యె - 'లఖుజీ'న్నుగ్గాడిరేహంతలో
సకుటుంబమ్ముగ' - నంతయుగ్రతకు వ్యాజమ్మేదొ యూహింపనే
రికి సాధ్యమ్ము? 'నిజాముషా'యె యిపుడీరీతి న్వధింపింపగన్॥ 24

తే॥గీ॥ దేవగిరి యాదవకులాబ్ధి రేవెలుంగు
దేవగిరి దుర్గ జైత్రుడు ధీరవరుడు
'అహ్మదునగర్' 'నిజాముషా' యాణియమున
"లఖుజి" మణిదీపమందురు లాతులైన ॥ 25

(ఆవటము=అనుకూలము) (తోలు=మాయించు)
(షాహజహాన్=షాజహాను (ఢిల్లీ సుల్తాన్) (ఆణియము=రాజ్యము)

తే॥గీ॥ 'లఖుజి' 'సింధుఖేదు'కు దేశముఖుడు – మరియు
నెన్నొ జాగీర్ల కాతడు నేలికగును
చాటు పోరున యతనికి సాటిలేరు
నిట్టి పెంపు 'నిజాముషా' కీసు పెంచె ॥ 26

తే॥గీ॥ శ్వశురునిట్లు సపుత్ర నప్తముగ చంపు
నా నిజాముషా దుర్వ్యవహారమునకు
గ్రక్కదలె షాజి నిబ్బరమక్కతమున
వీడెను నిజామ్ కొలువు ప్రాత లూడుపనగ ॥ 27

కం॥ 'అహమద్నగరము' వీడుచు
'షహజీ' కొలువంగ చేరె 'షాహజహాను'న్
యహరహము నాహవములను
సహవీరుండగుచు చేసె శౌర్యము మెఱయన్ ॥ 28

కం॥ షాజీ సేవకు బహుమతి
గా "జున్నరు" "సంగమేరు" క్ష్మాభాగములన్
తా జాగీరులుగానిడె
'షాజానుం'డాత్మలోన సంతృప్తుండై ॥ 29

తే॥గీ॥ అహ్మదునగరు మంత్ర్యగ్రుడౌ "ఫతా" హ్వ
యుండు,కీల్బొమ్మ సుల్తాను నొకని నిల్పి
మొగలుపాదుషాతో చెల్మి మొగినొనర్ప
నతడు షాజి జాగీర్లను "ఫత" కు నిడియె॥ 30

శా॥ దానన్షాజి మొగల్ నియోగమును నుత్సర్జించి రోషమ్ముతో
"పూనా" ప్రాంతము కొల్లగొట్టగను –కోపోద్రిక్తులై ఢిల్లిరా
ట్సేనల్ వానిని పట్టగాఁదొడర 'షాజీ' చేరబోయెన్ వెసన్
తా "జున్నర్" పరిపాలకాలయము, తత్కాలాత్మరక్షార్థమై ॥ 31

(రేవెలుంగు=చంద్రుడు; ఆణియము=రాజ్యము; లాతులు=శత్రువులు)
(చాటుపోరు='గెరిల్లా' యుద్ధము)
(నప్త=మనుమడు; లూడుపు=పాదరక్ష)

శా॥ చేరెన్ పిమ్మట 'షాజి' బీజపుర రాట్సేవార్థ – మావేళలో
వారుణ్యాశ గలట్టి భూమినిఁమరాట్వాడన్ "మహాదుర్గ"యన్
పేరన్ గల్గెను ఘోర కాటకము – నా 'బీజాపురీ' సేనలున్
పోరన్ మార్కొనిరా మొగల్ నృపుబలంబున్ 'దౌలతాబాదుకై'॥ 32

తే॥గీ॥ మొగలుసేన 'బీజాపురి' మూక కపుడు
గట్టి యోటమినే నంటగట్టె ననిని
షాజి చేరెను మహరాష్ట్ర శామనముకు
పూణె, నాసిక్, త్రియంబకుపొలములేల ॥ 33

ఆ॥వె॥ సహ మరాటులైన జాగీరుదారులు
షాజికాజులందు సాయపడిరి
'ఘటగె', 'కాటె', 'కంకు', 'గైక్వాడ్', 'మహాదికు'
'వాఘె', 'మోహైౖ', 'చవను' 'పన్ద్రె'లాది ॥ 34

ఆ॥వె॥ కానివీరి యండ ఖాయము గాకుండె
మబ్బులోని నీరమట్టులుండి
యెపుడు వీరిసాయమెడ మౌనొ తెలియదు
నమ్మకుండఁగాదు – నమ్మరాదు॥ 35

తే॥గీ॥ షాజి అహ్మదునగరరాజంచు "ముర్త
జా" యను నతని కీల్బొమ్మ శాస్తఁజేసి
'మాహు' లీదుర్గముననుంచె – మరల మొగలు
లనిని యవ్వారిఁదటిమిరి యచటునుంచి ॥ 36

ఉ॥ దౌలతబాదు చుట్టుగల ధారుణి పల్లెల కొల్లగొట్టుచున్
వాలిక చూపు షాజిని నివారితు జేయగ ఢిల్లి పాదుషా
యాలమునన్ జితున్ సలిపి యాతని జాగిరు లెల్ల గొంచు పో
ద్రోలెను బీజపూరు జొటు, తొల్లిటి సుస్థితి యెల్లఁబోవగన్ ॥ 37

(వారుణ్యాశ=పడమటిదిక్కు)
(శామనము=దక్షిణదిక్కు)
(శాస్త=రాజు) (వాలిక=వాడిమి)

'ఆదిలుషా' మొగలులతో సంధి చేయుట

చ॥ ఇది యిటులుండ బీజపురి యేలికయున్ మొగలాయి వారి సౌ
హృదమునకగ్రపీఠ మిడనెంచి పెనంగుట మాని వారితో
తదుపరి షాహజీకి యటతప్పెను తొల్లిటి పట్టు కొల్వునం
దదె యదనంచు పాదుషయు హార్దమె కోరెను బీజపూరుతో ॥ 38

శా॥ షాజీ కంతిమమందు దక్కిన దొకే జాగీరు పూనా - యటన్
జీజాబాయి శివాజితో కలిసి తాఁజేరంగ-'ఖాండ్దేవు' - దా
దాజీ వారికి నండగా నిలిచె - విద్యావేత్త సద్విప్రుడు
న్నోజై బాల శివాజికి న్నతని వీరోత్తంసుగా దిద్దుచున్ ॥ 39

శా॥ బీజాపూరుకు దక్షిణాశఁగల పృధ్వీ ఖండమందీశవి
భ్రాజ ద్రాజ్యము 'గోలుకొండ'ను 'కుతుబ్షా' యేలుచుండన్ - మొగల్
రాజేంద్రుండతనిన్ జయించి కొనె హైద్రాబాదు రాద్ధానిగా
తేజంబొల్కెడి "గోలుకొండగడు" స్వాధీనమ్ముగా ధృష్టుడై॥ 40

చ॥ పిడుగటుపడ్డ వ్రేటునకు వ్రీలుచు చీలుచు "తాళికోట" లో
నడగిన 'హంపి - సాళ్వ, తుళువాన్వయ రాజ్యము చిన్నముక్కలై
విడివడ - పాళెగార్లచట పెత్తనముంగొని 'నాయకాఖ్యులై
పుడమిని యేల కేంద్రక ప్రభుత్వము లేమి నరాజకమ్ముగాన్ ॥ 41

ఉ॥ ఆ లొసుగే యవాక్ధరణి నంతయు లోగొను దారిగాఁ జిగీ
షాళువులై బిజాపురపు షా బలముల్ చెలరేగ - 'షాజి'యున్
వాలును దూసి నాయకులపై బడి వారల నోడగొట్టి త
త్పాలకులన్ బిజాపుర నవాబు విధేయులఁజేసె నత్తఱిన్ ॥ 42

ఉ॥ ఆతని యుద్ధ నైపుణికి హర్షమునొందుచు బీజపూర్ నవా
బాతని కిచ్చె జాగిరుగ యామ్యదిశాంతర 'బెంగుళూరు' భూ
మీతలమెల్ల నేలనటు మీదట షాజియు నిర్వదేండ్లు నం
దే తిరమైన వాసముగ నిల్చె 'మరాట' కు పోవజాలకన్ ॥ 43

(ఓజు = గురువు)
(ఈశ=ఐశ్వర్యము; గడు=కోట; ధృష్టుడు=ధీరుడు)
(అవాక్ధరణి=దక్షిణదేశము; జీగిషాళువు=జయేచ్ఛాలోలుడు)

శా॥ షాజీ యంతననేక యుద్ధములలో సాధించి భూ ఖండముల్
బీజాపూరు నవాబు రాజ్యమున కర్పింపంగ ఆదిల్‌షహా
షాజిన్నెంతయుగారవించి "తనరాజ్యశ్రీకి 'షాజీ' యె యే
యోజన్ చూచిన పట్టుగొమ్మయని యెంతో మెచ్చె 'దర్బారు'లో ॥44

శా॥ షాజీయున్ సకుటుంబుడై స్థిర నివాసమ్మొండె బెంగ్ళూర, న
చ్చో జేరెన్ తనచుట్టు బాంధవసుహృత్శుశ్రూషకార్థ్యాళి, 'శం
భాజీ' 'జీజియ' జ్యేష్ఠ పుత్రుడు - 'తుకాబాయిన్' ద్వితీయోఢగా
షాజీ చేకొనె-యామెకిద్దరు సుతుల్ 'సంతాజి', 'యేకోజియున్' ॥45

అహ్మద్ నగర్ - లఖుజీ జాధవ్ - షాజీ భోన్సలే

తే॥గీ॥ 'లఖుజి జాధవు' చాలకాలమ్ము 'నహ్మ
దునగరు' నవాబు రాజ్యమందుచ్చతరము
లైన పదవుల యందుండి - యా ప్రభుతను
వచ్చు మార్పులు నచ్చక బాధపడుచు ॥ 46

తే॥గీ॥ సుమములమ్మిన చోట కాష్ఠముల నమ్ము
దుస్థితి కలుగు మార్పు నెదురగఁ దలచి
యల్లుడౌ 'షహాజీ'యును నచట మంచి
పదవి యందున్కి యొకనాడు కదిసి చెప్పె ॥ 47

ఉ॥ "చూడుము షాజిఁ నేడు మనక్షోణిపుడైన 'నిజాముషా' స్థితిన్
'బోడిక'యైన వీని చనవూని తదంబయె రాజ్యపాలనన్
నేడొనరించు చుండె - యవినీతి పరుండు 'ఫతా' వజీరుగా
పోడిమిచూడ, నీవిధి ప్రభుత్వము చెల్లదు పెద్దకాలమున్॥ 48

చ॥ మొగలులు గ్రద్దచూపులను మోపిరి యీ పురి నాక్రమింపగా
తగు తరుణమ్ము నందు - నిక దండుగమారి దణాయ లెందరో
మిగిలిరి పేరుకున్ - విజయమెట్లు లభించును భూమిజానికిన్
మిగిలితి వీవు యొక్కడవె మేటిమగండవు వీరి సేనలన్॥ 49

తే॥గీ॥ ఒంటిగా పోరి మొగలులు గెంటగలవె
నీకు వెనుదన్నుగా గట్టి మూక యేది।

(ఊఢ=భార్య) బోడిక=బాలుడు; శుశ్రూషకులు=సేవకులు;
అర్థి=యాజకుడు; తనవు=అధికారము; ఊని=పూని; పోడిమి=ప్రవర్తన

భోగలాలసులవినీతి పూర్ణ చరితు
లెంత కాలము భూమిని యేలగలరు? ॥ 50

తే॥గీ॥ రమ్ము నాతోడ మొగలు కొల్వందుఁజేర
త్వాదృశ శుటీరులను నెట్టి ప్రభువుగాని
సాదరమ్ముగ కొల్విచ్చి సత్కరించు
నీ 'నిజాముషా'యని లెక్క యేమిమనకు" ॥ 51

చ॥ అని తనమామ పల్కెడు హితాలపనమ్ముల నాలకించు 'షా
జీ'ని కెరలింపగా, 'ససురుజీ'। తమ బోంట్లిటు నాడజెల్లునే
'దణి'వగు నీదు నూతమున ధారుణి అహ్మదుపూరు రాజ్యమి
ట్లు నిలిచి యుండె – నీ తలపులొప్పునె దానిని వీడి పోవగా ॥ 52

ఉ॥ అన్నము పెట్టి సాకిరిక – యందరికన్నను పెద్ద కొల్వులన్
మున్నుగ నీకెయిచ్చిరతి – ముఖ్యములౌ పరిపాలనా విధుల్
నిన్ను వినీతి మైయడిగి నేతలు నాచరణ మ్మొనర్చు చుం
ద్రిన్నియు విస్మరింప తగునే"? యని, 'షాజి'యనంగ–మామతో॥ 53

తే॥గీ॥ 'లఖుజి'యనె – "నీకు నిజము తెల్లమగు దినము
పెద్ద దూరములో లేదు వినుము షాజి
పాము పడగ నీడను కప్పు వైన మగును
నీ నిజాముషామాత కొల్వెటిగి కొనుము" ॥ 54

తే॥గీ॥ అని వెడలి 'లఖుజి' మొగలులందు జేరి
'య హ్మదునగరు'పై దండయాత్ర కపుడు
షాజహానును పురిగొల్పు జతన మందు
పూర్తిగా మగ్నుడైయున్న వార్త దెలిసి॥ 55

తే॥గీ॥ ఆ నిజాముషా, యతని సహాయగణము
మొగలు చక్రవర్తికి లొంగి పోవదలప
'షాజి' తాను నవాబుతో సంప్రదించి
రణముచేయుదమనుచు ధైర్యమును చెప్పె ॥ 56

(త్వాదృశ=నీవంటి; శుటీరులు=శూరులు) (ససురుజీ(హిందీపదము)=మామగారు) (ఆలపనము=మాట; కెరలించు=బాధపెట్టు) (దణి=సేనాపతి)

కం॥ షాజీ సాహస ధోరణి
రాజజనని నాగ్రహమున రౌలగఁజేసెన్
భూజనులు సచివులందరు
నాజిని వద్దనిరి - షాజి యభిమత మణగెన్ ॥ 57

తే॥గీ॥ తనకు వ్యతిరేకమయ్యె వాతావరణము
'నహ్మాదు నగర' య రాజకీయముల ననుచు
షాజి గర్భవతియగు 'జీజాను', జ్యేష్ఠ
సుతుడు శంభునింగొని శీఘ్రగతిని వెడలి ॥ 58

తే॥గీ॥ తన 'సుబా' యౌ 'సుపా' కేగ దారిబట్టె
వెనుక తఱుముకొనుచు వచ్చు పృతనఁగనుచు
నడుమ "జున్నరు" నందు మిత్రుడగు "శ్రీని
వాసరావు కడ నునిచె స్వజుని, సతిని ॥ 59

తే॥గీ॥ 'శ్రీనివాసరా' వంపె 'జీజియ'ను, నామె
కొడుకు శంభును, శివనేరు గడముఁజేర
"దాదుజీ కొండదేవ"ను ధరణిసురుడు
వారికండగా నుండగ పయనమైరి ॥ 60

షాజీని బంధించుటకు అతని మామ 'లఖుజీ జాధవు' వచ్చుట

మ॥ మొగలుల్ 'షాజి'ని వెంబడించి తఱుమన్ మోమోట లేకుండ పం
పగ, షాజీ శ్వశురున్ 'లఖూజి' నతడా ప్రాంతమ్ము నందున్న య
ట్టి గడీ "శివనేరు" లోస్వసుత యుండెన్నన్న వార్త న్నెఱిం
గి గవేషించుచు నేగె యాపె కడకక్షీణానురాగమ్ముతో ॥ 61

ఉ॥ ఏగెను పెద్దకాలము దృశించియు కూతు ససత్త్వఁ గన్నులన్
దోగెను నశ్రుపూరమున దొప్పగ తండ్రియు - వారి భాషణల్
సాగెను చాలప్రొద్దు - సుతసాహస ధైర్య స్వతంత్ర వృత్తికిన్
వీగెను తండ్రిబెట్టు - నెదవేగెను స్వీయనియోజ్య వృత్తికిన్ ॥ 62

శా॥ కూతున్ వీడ్కొని యేగె యా'లఖుజి' సంక్షుబ్ధాత్ముడై వెన్కకున్
శాతాస్త్రమ్ములు చీల్చినట్లగుచు, 'జీజా' పల్కు హిందూధరా
స్వాతంత్ర్యమ్మును గూర్చి వాక్యములెదన్ సంవర్త ఝంఝానిలో
ద్ధూత ప్రోన్నతభంగ సంఘయుత పాథోరాశిగాఁ జేయగన్ ॥ 63

ససత్త్వ=గర్భిణి; నియోజ్యవృత్తి=సేవక వృత్తి; వేగు=సంతాపించు; స్వజుడు=కుమారుడు

ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజే జననము

క్రీ.శ. 1630 - 1680

మ॥ 'శివనేరి'న్ ప్రసవించె నొక్క సుతునిన్ 'జీజీ' ప్రభాతాబ్జ భాం
ధవ సంకాశ విభాసితాంగు 'శివజిన్' ధన్యాత్మయై పూతయై
భవితవ్యం బొనగూర్చి 'హిందు' శిథిల ప్రాయార్ష ధర్మమ్మునున్
స్తవనీయ స్థితికెత్తి వెల్గునిడు నాశాజ్యోతికిన్ మాతయై ॥ 64

మ॥ 'శివనేరి'న్నొక వత్సరత్రయ మెదన్ చింతించున్నుండియున్
లవలేశమ్మును శాంతి లేమిని మొగలై స్సైన్యమ్ము చుట్టున్నుప
ద్రవకారుల్ భయపెట్టుచుండ నెటులో తానున్ శివాజీయు నా
శివనేరిన్ విడి "కొండనాగడము" సక్షేమమ్ముగా చేరియున్॥ 65

ఉ॥ "కొండన" కోట సైతమును కోల్పడనొప్పక ఢిల్లి పాదుషా
దండును పంపి చుట్టుకొన దాటుచు 'కొండన' దుర్గమంతట
న్నుండగనుండ 'షాజి' యట కంపిన వీరులు కోట లెన్నొ యె
క్కండిగ 'పట్టి' నెత్తుకొని, కాయము హూనమునయ్యె 'జీజ'కున్॥ 66

తే॥గీ॥ అంత 'మొగలు' 'బీజాపూర్ల'కయ్యె సంధి
షాజి స్థిరపడె 'యాదిలుషా' కొలువున
కాని 'శివనేరి' కోట మొగలుల వశము
నగుట, 'జీజియా' 'పూనా'కు నరుగ వలసె॥ 67

ఛత్రపతి శివాజీ మహారాజె బాల్యము

మ॥ పొదువన్ పట్టుచు పట్టినిన్ యొడిని తా బోధించె జీజాంబయు
న్నెదలో నాటగ రామ భారత కథానేకేతిహాసమ్ములన్
చదువున్ సామును రాజనీతి మొదలౌ శాస్త్రార్థముల్ నేర్పుచున్
విదునిన్ చేసెను 'కొండదేవు' గురుడై నెమ్మిన్ శివాజీ చౌఅన్॥ 68

(పట్టి = కుమారుడు; చౌఅ=బాలుడు)

శా॥ షాజీకిన్ పితురార్జితమ్మగు మహీ సంపత్తు 'పూనా', 'సుపా'
నా జాగీరులు - కాని యందు గడులన్ పాలించు వారందరున్
బీజాపూర్ సురతాణిచే నియమితుల్ - వ్రేలెత్తి చూపంగ లే
డా జాగీరుల 'సేవ్యుడైన' - యిది చట్టంబప్డు బీజాపురిన్ ॥ 69

మ॥ "శివనేరున్ విడి" 'పూణె' కేగుటకు షాజీయున్ నియామింపగా
'శివజీ బాలుని' తోడ 'జీజియ' గురూజీ కొండ దేవుండు గూ
డ వెసన్ 'పూణె' పురిన్ ప్రవేశమగుచున్ దంబైన వేశ్మమ్మునన్
నివసింపన్ తగినట్లు నేర్పరుప శాంతిన్నుండి రా మేడలో ॥ 70

ఉ॥ చిన్నతనమ్ము నందె 'శివజీ' కి వివాహము చేసె 'జీజ' - యా
కన్నియ సుందరాంగి, చెలికత్తె శివాజికి బాల్యమందు - నా
పిన్నను "సాయిబాయి" నతి ప్రీతిని 'కోడలు' గా గణించి - ప్రే
మన్నవ దంపతిన్ మిగుల మన్నన సేయుచునుండె-'పూణె' లో॥ 71

శా॥ 'షాజీ' ముం'దహమద్ నగర్' మరియు 'బీజాపూర్' 'మొగల్' కొల్వులన్
వాజి శ్రేణికి నాయకుండగుచు నప్పార్థుల్ నియోగింపగా
నాజిక్షేత్రములన్ విజేతగను శౌర్యాటోపమున్ చూపి, ద్వి
డ్రాజీర్ష్యాగ్నికి లక్ష్యమై గొనియె పల్జాగీర్లు 'మారాట'లో ॥ 72

శా॥ షాజీ తానొకకొల్వుకాడగుట బీజాపూరు నాస్థానినే
యోజన్ వీలును కల్గకున్కి కననధ్యూఢన్, ద్వితీయాత్మజున్
రాజాలండగుటయ్యె - 'బెంగుళుపురి'న్నప్డున్కిచే - దాన నెం
తో జాలమ్మగు వచ్చిపోవగ, "పుణే" దూరమ్మునందుండుటన్॥ 73

మ॥ శివజీ పెండ్లికి కన్నతండ్రియగు 'షాజీ' - యన్న 'శంభాజి'యు
న్నవకాశమ్మిసుమంత లేని కతనన్ రాలేమిచే షాజియున్
శివజీ, బీజియ, సాయిబాయి లను పిల్చెన్ బెంగుళూరేగు దెం
చి వసింపన్నట కొన్ని వత్సములవాక్సీమన్ విలోకించుచున్ ॥ 74

(చొళి=బాలుడు) (సేవ్యుడు=యజమాని) (వత్సము=సంవత్సరము)
(పార్థులు=రాజులు; ద్విడ్రాజి=శత్రు సమూహము)
(అధ్యూఢ=మొదటిభార్య) (అవాక్సీమ=దక్షిణ ప్రాంతము)

ఉ॥ 'జీజ', 'శివాజి'యున్ తిరిగి చేరిరి 'పూణె'కు బెంగుళూరు యా
త్రాజనిత స్మృతుల్ మతిని తారటలాడగ నా 'శివాజి'యున్
యోజన సేయుచుండె తన యుద్యమముల్ మునుముందుకేగనే
యోజప్రణాళికా రచన యొప్పునొయన్న ప్రగాఢ యోచనన్॥ 75

మ॥ పిత జాగీరున యున్న దుర్గతతి యా బీజాపురీ వారి నే
తృతకేలోబడి యుండె నిందనుక - యాతీరున్నిప్డు మార్పంగ తా
జతనమ్మున్ పొనరించుచో, తొలుతనేసైన్యమ్ము కూర్పన్వలెన్
వెతకంగా వలె దారులందులకు భావిన్ భారత స్వేచ్ఛకై ॥ 76

బాల శివాజీకి తల్లి జీజియా దేశభక్తి నూరిపోయుట

ఉ॥ పుట్టిన నాటి నుండి తన పుత్రు మనమ్మున, భారతీయమై
నట్టి మహర్షి భాషితసనాతన సర్వ పురాణ గాధలం
దొట్టి మహేతి హాసముల ధూర్వహులౌ రఘు రామ కృష్ణులం
దెట్టి మహత్త్వముల్ గలవొ యింపుగ జీజియనింపె రేబవల్॥ 77

సీ॥ గ్రైస్య వీరుని 'యలెగ్జాండరు' నెదిరి యా
పిన 'పురుషోత్తమ' వీరగాథ
'ఘోరీ'ని పోరున పారద్రోలియు గూడ
వంచితుడౌ 'పృధ్వి' ప్రభుని చరిత
'బాబరున్' తాకి దుర్భగతనోడిన 'హేము'
ప్రథమ హైందవ చక్రవర్తి కథను
'నక్బరున్' నిర్నిద్రు డగునట్లు చేసిన
'రాణాప్రతాపు' శౌర్యంపు సుద్ది ॥

తే॥గీ॥ చివ్వకేగి మేవాడ్ రాజ సింహు వలన
చిక్కునంబడ్డ 'ఔరంగజేబు' సోద
యన్నియును చెప్పి - భారతీయాత్మ గౌర
వమ్ము విలువ తెల్పె - చిఱు శివాజి కంబ॥ 78

(అవాక్సీమ=దక్షిణదేశము; సోద=కథ)

కం॥ రక్తమ్ముడుకును - చెమరున
సిక్తమ్మగు దేహయష్టి - చేతులు బిగియున్
సక్తియు పెరుగు శివాజికి
ప్రాక్తన భారత యుధకధలన్ వినుచుండన్ ॥ 79

శా॥ "హిందూ దేశ'మటంచు చెప్పుదురు - కానీ 'హిందు రాజ్య'మ్మటం
చెందున్ చెప్పరు - కారణమ్మెదియొ ఆ చిన్నారి భోన్స్లేకు - ని
బ్బందిన్ పెట్టు సమస్యయౌ - తనకుటుంబమ్మందు వీరోత్కర
మ్మందొక్కండును హిందురాజ్యమును సంస్థాపింపగాగల్గెనే?॥ 80

ఉ॥ పిన్నతనమ్మునందె యనిపించె శివాజికి - లోపమంతయు
న్నెన్నగ సాధుభావులగు నీ భరత ప్రజయందె యున్నద
ట్లున్నను నైకమత్యమున కోరిమిలేక పరస్పరమ్ము పో
రన్నదుముల్ బిగింత్రు - పరరాజుల పెత్తనమోర్తు భీతులై॥ 81

తే॥గీ॥ అనుచు తలపోయు - "మనహిందు నస్వతంత్ర
తాస్థితిని" మార్చు రాజ పథమ్మదేది
యనుచు ప్రశ్నించు కనిపించు నార్యజనుల
ప్రతియొకడు తెల్లబోవు నా ప్రశ్న వినుచు ॥ 82

తే॥గీ॥ అంత మొగలు, బీజాపూర్లకయ్యె సంధి
షాజి స్థిరపడి పిలిపించె బీజ పూరు
నకుసతీ సుతులచ్చోటనిక పయి తన
తోడ కలిసి యుండంగ కొన్ని యేడులెలమి॥ 83

తే॥గీ॥ 'జీజియాబాయి' కప్పుడే చిక్కెయదను
తన సుత జ్యేష్ఠ 'శంభాజిం'దనివి తీర
కాంచి ముదమొంద - సవతి 'తుకాయు', ఆమె
సుతులు - భర్త 'షాజి' సకుటుంబ సుఖముంగనిరి॥ 84

(దుర్భగత=దౌర్భాగ్యము)
(సక్తి=ఆసక్తి; యుధ=యుద్ధము)

రెండవ ఇబ్రహీమ్ ఆదిలుషా

తే॥గీ॥ మత విభేదము లేనాడు మదిని గొనడు
'హిందు' 'ముస్లిము' 'భిద'కు జాత్యంధుడతడు
నతడె 'రెండవ ఇబ్రహిమాదిలు షహ'
షాజి నామతించు నెపుడు సాదరముగ ॥ 85

ఉ॥ ఆవిభు దేహయాత్రకు ననంతరమప్పటి బీజపూరు వా
తావరణమ్ము పాలక మతాధిక తాంధక భావనావిల
మ్మై వెడ ధోరణుల్ ప్రబలమై యొక వర్గము నన్యవర్గము
న్నేవముగా కనందొడగి "రీరు పరాజిత జాతి" యంచునున్॥ 86

మ॥ పదునాల్గేండ్ల శివాజి బీజపురిలో వాహ్యాళిగా పోవుచున్
చదుకమ్మందున నాలఁజంపియు దదస్రార్ద్రమ్మునా చోటనే
గుదిగా గట్టుచు ఖండితాంగములు నాకొక్కెమ్ములన్ వ్రేల కం
డ్లెదుటన్నందరిముందు నమ్మట నసహ్యించెన్ మదిన్ఁబొక్కుచున్॥ 87

సీ॥ హిందు పూజారులన్ హీనముగాఁజూచి
యెగతాళి చేయ పెట్రేగు వారు
పరమ పవిత్ర దేవాలయమ్ముల నెంచి
పట్టుబట్టి మయిల పరచువారు
హిందువుల్ గౌరవించెడు గోవులను బహి
రంగముగ వధించి యానువారు
హిందు యౌవతమును యేమార్చి యో లేక
బలిమినో యీలువు తొలచువారు॥

ఆ॥వె॥ నిట్టి యాగడములనెన్నింటినో చూచె
జరుగు చుండగ దిన చర్య యట్లు
నడ్డుకొనగ తనకు నర్హవయసు గాదు
నూరకుండ నెడద యోర్వలేదు॥ 88

(భిద=భేదము); (చదుకము=చతుష్పథము; ఆలు=ఆవులు)
దేహయాత్ర=మరణము

మ॥ మతమున్ మారిన పూర్వ హిందువులె దుర్మార్గ ప్రవృత్త్యాత్ములై
క్షతిగూర్పన్ తమ వారికిట్లు – 'తురకాష్టున్ ఫార్సియారబ్బులా'
దృతితోడన్ 'బహుతచ్చు, 'ఖూబు', 'సెహబాస్', 'దేఖోవహవ్వా'యటం
చతులంబౌ బహుమానముల్ యొసగి రెచ్చంజేతు రాతుచ్ఛులన్॥ 89

ఆ॥వె॥ ఎప్పటివలె వాహ్యాళికి నేగి శివజి
కోట వెలుపలగనె గోవుత్రోటి నొకడు
కోయుచుండంగ ధేనువు కూయి నిడగ
తాళలేక శివాజి యా దస్యుఁదునిమె॥ 90

మ॥ "కడు దుస్సాహసమియ్యదంచు, నదుపాజ్ఞల్లేక షాజీ సుతుం
డడరెన్ ముస్లిమునే వధింప, నిటలేరా 'కాజి'యున్, పాదుషా
తొడుసేదైనను కల్గినన్ జనులకున్ తూర్ణంబుగా న్యాయము
న్నొదగూర్పన్నిపుడీ కుమారుడగు నొక్కోఁప్రాడ్వివాకుండిటన్! ॥ 90ఎ

ఆ॥వె॥ అనుచు బీజపూరు నందలి మల్కలు
నలుక చూపిరి బహిరంగముగనె
షాజిగూడ తన తనూజుని దుడుకును
కనుచు మదిని యెంతొ కలత నొందె ॥ 92

తే॥గీ॥ బీజపురమున మత భేద బీజమొకటి
నాటుకొనెనని యెఱిగి యారాట మొదవి
ఆదిలుషహాయు తక్షణ మామతించె
షాజినిన్ శివాజిని తన సభకుఁజేర॥ 93

ఉ॥ "గోవధ దోసమే శివజీ! కొండిక వైనను దోషకారికిన్
నీవె విధించినావు వధనే తగు శిక్షగ – మెచ్చినాడ – నీ
పై విధియింతు నిట్లు నిక బాహిరపోవగ నాదు రాజ్యమం
దేవగనైన గోవధము తెచ్చును దోషికి మృత్యుదండమున్" ॥ 94

తే॥గీ॥ అట్లు ప్రకటించి సుల్తాను ననియెనపుడు
"నధిక సంఖ్యాకులైనట్టి హైందవులను
సోదరులటంచు ముస్లిముల్ చూడవలయు
మతసమరసతయే నాదు మతము సుమ్ము" ॥ 95

(త్రోటి=గొంతు; తొడుసు=బాధ; ప్రాడ్వివాకుడు=న్యాయనిర్ణేత; స్వజుడు=కొడుకు; మల్కలు=తుఱకలు)

చ॥ “వేరి మత భావనలను నొప్పింపజనదు
వీలు నైనంత వరకు నొప్పింప వలయు
నెందరో హిందువులు జీవితేచ్ఛ వదలి
నాదు రాజ్య విస్తరణకుపాదులైరి” ॥ 95

చ॥ ఇటులెటులో శివాజి యొనరించిన దుందుడుకౌ విచేష్టయ
ప్పటికటుకప్పబడ్డ దొకపాటుగ పాదుష యోర్మిచేత - యిం
కిటుల చిరమ్ముగా నిలదు నీ కృతకమ్మగు శాంతి - ముస్లిముల్
కటుకమనస్కులున్-క్షతనగమ్ములు - జాగృతి తప్పదీపయిన్॥ 96

చ॥ శివజికి సాయిబాయికిని జీజియ పెండిలి చేసె ‘పూణె’ లో
వివహము వేడుకల్ కనగ వీలును చిక్కక పోయె షాజికా
నెవమున తానెపుత్రునకు నిప్పుడు ‘సోయరబాయితో’ ద్వితీ
య వివహముంబొనర్పగను నాయితుడయ్యెను షాజి యోజతో॥ 97

శా॥ హిందూద్వాహ మహెూత్సవ క్రమము తారీక్షింప బీజాపురిన్
సందోహమ్ములునై జనమ్ములు భటుల్, సర్దార్లు, నుమ్రావులున్
వందుల్ మందియు వచ్చియుండ నటుపై ‘పాద్షా’యె యేతేరగా
‘విందై’, ‘షాజికి తత్కుటుంబమునకు న్విందయ్యె డెందమ్ములన్॥ 98

మ॥ శివజీ యుండిన యల్పమౌ వ్యవధిలో శీఘ్రమ్ముగా నేర్చె తా
నవలీలన్నసిచాలనమ్ము, జవనాశ్వారోహణా నైపుణిన్
యువలే యచ్చెరు వంద లేత వయసందుత్థాన క్రీడాళువై
స్తవనీయమ్మగు ప్రజ్ఞచూపె కడుమెచ్చన్ బీజపూరు ప్రజల్ ॥ 99

మ॥ శివజీ పోకడలన్ని చూచుచును షాజీ నిర్ణయించెన్ మదిన్
యువప్రాయంబు ప్రపూర్ణమౌచు తనువున్నొత్తుంగ లేదిప్పుడే
యెవరున్నాపగ జాలనంత చలమున్నేపున్ ప్రదర్శించె నే
నవకాశమ్మిడి చూతునంచు సుతునంపన్నెంచె తా పూణెకున్॥ 100

(క్షతనగమ్ములు=దెబ్బతిన్నపాములు) (ఓజ=ఉత్సాహము)
(విందు=అతిథి, విందు= మృష్టాన్నము) (వివహము=వివాహము)

మ॥ సుతునిందోడ్కొని 'జీజియాంబ' 'పుణె'లో జొచ్చెన్వసింపంగ - స
న్నుత చారిత్రుడు 'కొండదేవు' నట తానుండెన్ క్రియాశీలుడై
ప్రతిగాషాజికి 'పూణె' 'కొండన' ధరాప్రాంతంబు పాలింప త
ర్పిత లోకుండయి-షాజి కాదిలుషకున్ విశ్వాస్యుడౌ కార్యియై ॥ 101

ఛత్రపతి శివాజీ హైందవీ రాజ్యస్థాపనా ప్రయత్నము

తే॥గీ॥ శివజి తన తండ్రి జాగీర్ల శిష్టి తానె
పూని 'దాదాజి కొండదేవు' గురు వరుని
సూచనలు మేలిమాటల చొప్పు నాక
ళించి, మేలు కీళ్ళరసి, వర్తించె నెఱిని ॥ 102

ఉ॥ హైందవ రాజ్యమేర్పఱచు టన్నది లక్ష్యము గాగ - నందుకై
ముందుగ యే విధానములు ముఖ్యములో గమనించుచున్ - గత
మ్మందు మరాట భూమి నొకరైన స్వతంత్రతకై దొడంగిన
ట్లెందును గానరామి తనదే తొలి యుద్యమమౌట నెంచుచున్॥103

చ॥ అటునిటు చూచుచుండ పితరార్జితమైన గడమ్ములన్నియున్
బటువుగ కానవచ్చెనయినన్నట నుండెడు దుర్గపాలకుల్
కటికి బిజాపురంపు తుఱకల్ రిపుభీకరులట్టి వారినో
ర్చుటకడు దుర్ఘటమ్ము - రణశూరులు కల్గిన సేన లేనిచో ॥ 104

తే॥గీ॥ ఇట్లు తల పోయుచు శివాజి యెదుట నున్న
యద్రి యెత్తున్న భావి కార్యప్రణాళి
కలకు రూపమీయంగ యే వలను కలదొ
యనుచు చూడగ సహ్యాద్రి కనులఁబడియె॥ 105

శా॥ సహ్యాద్ర్యాళిని యావరించిన ప్రవేశాసాధ్య సాంద్రాటవిన్
సాహ్యంబుండిన యప్డెలోకి చనగా సామ్ముఖ్యమౌ - మానవా
నూహ్యంబౌ ఖరకంటకావృత భువిన్నూరిండ్ల నుంద్రెప్పుడున్
బాహ్యంబౌచును నవ్యనాగరికతా ప్రాంతమ్ముకున్-మావళుల్ ॥ 106

(శిష్టి=పరిపాలనము; సుష్ఠు=యుక్తముగా; సాహ్యము=సహాయము; సామ్ముఖ్యము=అనుకూలము) నెఱి=ఉత్సాహము

ఉ॥ ఒక్కొకడొక్క యుక్కుతునకో? ప్రళయానల విస్ఫులింగమో?
దిక్కరిదంతమో? ప్రఖర ధృంభుగభస్తియొ? విష్ణు చక్రపు
న్నక్కసమౌ యరమ్మొ? శితకల్కి కరాసియొ? భిద్రమోయన
న్నుక్కలులై తనర్తు రని నుద్ది యెఱుంగని మావళా భటుల్॥ 107

ఉ॥ 'కోలి' కులమ్ము వారికిని - 'కుంబి' తెగంగల వారికొక్కటే
మూలము - మావళేల కులమున్నదె యందురు - సహ్యాభూధ్ర ప్రాం
తేలను సేద్యమందున లభించెడు ధాన్యము - గొడ్డు గోదకున్
చాలిన మేత కల్గి మనసాగెద రేబది రెండు లోయలన్॥ 108

చ॥ హలికులునైన మావళుల నందరినప్పుడు నొక్క త్రాటిపై
నిలువగచేసి వారలకు నిక్కము వెల్లడి చేసె - "చూడుడీ
బలిమిని తుర్కతేండ్లు తమ ప్రాభవమున్ మనపైన రుద్దియున్
కొలువగ తమ్ము స్థానికులు - కుల్కుచు నుండిరిపైడి గద్దెలన్॥ 109

ఉ॥ వారి విలాస జీవనపు పాదిట మీరొనరించు దాస్యమే
యారసి చూడుడప్పసము నన్నము నీరము మాని చేలలో
యేరులబట్టి దుక్కిదుని యేతము ద్రొక్కుచు నీళ్ళు పెట్టి యే
తీరున మీరు సేదవడ దేహళి చేరునొ ధాన్యరాశులున్ ॥ 110

ఆ॥వె॥ ఒకడు 'వతనుదారు' నొకడు 'జమీందారు'
'దేశముఖుడు' నొకడు 'దేశపాండ్య'
'మాలి' 'పాటిలటులె' 'మాలికు' 'పాదుషా'
సున్ని చేతురు మిము పన్నులేసి ॥ 111

ఉ॥ క్రొవ్వుచు పట్టుగద్దియల కూర్చొని హుక్కనుపీల్చు చోరులం
దెవ్వరి యబ్బ సొమ్మనుచు నెంతొశ్రమంపడి కూర్చుకొల్చు పై
టివ్వన వాలి రాబడి హరింతురు పన్నుల పేరుపెట్టి - యీ
నెవ్వసహింతురేల? యరినిన్ దమియింప పరాక్రమించుడీ॥ 112

(ధృంభుగభస్తి=సూర్యకిరణము; అరము=అంచు; భిద్రము=పిడుగు)
(ఏరు=నాగలి; దుని=దున్ని; సేద=శ్రమ; దేహళి=ఇల్లు)
(కొల్చు=ధాన్యము; నెవ్వ=బాధ) శిత=వాడియైన

శా॥ ఎన్నాళ్ళీ యవనాధిపత్యము చలాయింపౌను? బోయీలమై
పన్నెత్తన్ సయితమ్ము బీతుగొని తత్పల్యంకిక ల్మోతుమే?
యెన్నో యుద్ధములందు పాలకుల గెల్పింపగ పోరాడి రే
తన్నైపుణ్యమునేడు చూపుడిట స్వాతంత్ర్యార్జనార్థాజికిన్॥ 113

ఆ॥వె॥ అనుచు మావళేల నందరఁ గుమిగూర్చి
దేహదార్ఢ్యముగల తెంపరులకు
చివ్వకు తగు కఠిన శిక్షణ మిప్పించి
కొంత కొంత దళము కూర్చి కొనియె ॥ 114

ఆ॥వె॥ చాటు పోటు నందు రాటుదేలె శివాజి
యట్టి యనిని ఘనులు – "నయ్య", "తాత"
శత్రుసేన లధిక సంఖ్యాక మైనప్డు
చాటు యుద్ధ మొకటె చదురుయగును ॥ 115

సీ॥ ఏరు పట్టుటెగాదు హేతిని బట్టంగ
ముల్లు కోలనె కాదు బల్లెమూన
గిత్తలనే గాదు కత్తలానులదోల
పొలముదునుటె గాదు కలను దున్న
గడ్డపారనె గాదు గండ్రగొడ్డలి నెత్త
కుజము లెక్కుటె గాదు కోటలెక్క
గడ్డి మోపులె గాదు గండశిలలు మోయ
నేటలనే గాదు నెదిరినేయ ॥

ఆ॥వె॥ యుడుత లొకటెగాదు నుడుములఁ బెంచంగ
శ్వానములకు వైరి పసినిమప్ప
కొండ కొమ్మలటుల కోటకొమ్మలుఁ బ్రాక
మంచి శిక్షగొనిరి మావళీలు ॥ 116

(చాటు పోటు=మాటున దాగి చేయు యుద్ధము (గెరిల్లా యుద్ధము)
కత్తలాని=గుఱ్ఱము; పసి=వాసన; కలను=యుద్ధము) దును=దున్ను
తెంపరి=వీరుడు; ఏరు=అఱక

ఛత్రపతి శివాజీ యుద్ధయాత్రా ప్రారంభము

మ॥ పదునారేండ్ల వయస్సునన్ తొలుత గెల్వన్ 'తోరణా' కోట – న
య్యదినూల్కొల్పెను వెంట వెంట గొనదుర్గాళిన్ 'పుణే' చుట్టు –న
య్యదనన్ 'కొండనయున్' 'పురందర' టులే యా 'చాకణున్' పొంది యా
పొదిఁ "బారామతి" "యిందపూరు" ను సుపాభూముల్ కొనెన్ చుల్కనన్॥117

ఆ॥వె॥ 'తోరణా' గడమున దొరకె శివాజీకి
యంతు లేని యంత అర్థరాశి
నిధిని వ్యయము చేసి నిర్మింప చేసెను
దాయలు చొఱలేని రాయగడము॥ 118

ఉ॥ బోఁడిగ 'పూణె' ప్రాంతమును పూర్తిగ లోగొని కొంకణమ్ముకై
పాణిపినద్ధ జైత్ర శుచి బాలకుడొచును నాక్రమించె 'క
ళ్యాణి' పురమ్ము నావిని – దురాగ్రహమొప్పగ బీజపూర్ సుర
త్రాణుడు షాజినప్పుడు నదంత్రుని చేయుచు 'కార'లోనిడెన్॥ 119

తే॥గీ॥ తండ్రి బంధితుడైన వార్తను నెఱింగి
యాపి వైచెను తన జైత్ర యాత్ర శివజి
తన విజృంభణమున కెప్డు తల్లి 'జీజ'
గురువు 'కొండ దేవు'ల యియ్య కోలు లేదు॥ 120

ఉ॥ "చేతులు కట్టుకొంచుడుగ చేతలు, హిందు స్వతంత్ర రాష్ట్రమే
రీతిగ రూపు దిద్దుకొను? రెండు కరమ్ములు మోడ్చి మ్లేచ్ఛ భూ
నేతల కాళ్ళకున్నెఱగు నిర్బలులన్ వరియించునే జయ
శ్రీ – తరవారిదూసి రిపు శీర్షములన్ తరిగేయ కుండినన్"॥ 121

(నూల్కొల్పు=ప్రోత్సహించు; పొది=వరుస; కొనెన్=పొందెను)

(పినద్ధ=ధరించిన; జైత్ర=జయశీలము; బాలకము=కంకణము; అదంత్రుడు=అస్వతంత్రుడు; కార=చెఱసాల)

(ఈయకోలు=అంగీకారము)

తే॥గీ॥ కత్తి యొఱనుండి తీయక గడపె శివజి
యేడెనిమిదేండ్లనిని మాని - వీడు కొనియె
'మానె', 'షిర్కె', 'మోహితె', 'ఘోర్పడే' 'నిమబలు
కరు' యు, సామంతు, 'దేశముఖా' దిమైత్రి ॥ 122

తే॥గీ॥ దాన నాదిలుషా కడు తనివి చెంది
'షాజి'కిన్ బెంగుళూరు మొఖాసా "నొసంగె
వెండి' 'దొడ్డబల్లాపూరు' వీడునిచ్చె
"సీర" 'కోలారు' 'హొూస్కోటె' సీమలిచ్చె ॥ 123

ఛత్రపతి 'శివాజి' అగ్రజుడు 'శంభాజీ' వీరమరణము

(శ్రీ శివాజీ తన అన్న 'శంభాజీ' పేరునే తన పెద్ద కుమారునకు పెట్టెను)

తే॥గీ॥ 'జీజియా' కును, 'షాజీ'కి జ్యేష్ఠ సుతుడు
వీరవర్యుడు 'శంభాజి' పితకు, తోడు
నీడ యై యుండె బెంగుళూర్ వీడు నందు
నతడు 'కనకగిరి రణమంద'మరుడయ్యె॥ 124

ఛత్రపతి శివాజీ తండ్రి షాజీ నిర్యాణము

ఉ॥ భారత భూస్వతంత్రతకు పాదయి నిల్చెడు నట్టి రాజ్యమా
కారము దాల్ప దోహదముగా తన వంతు ప్రయత్నముల్ 'మరా
టారస' పైన చేయగ దృఢవ్రతుడైన శివాజి ధోరణిన్
మారదటంచు చూచి తుది మారు 'శివాజి'ని 'షాజి' వీడ్కొనెన్॥125

తే॥గీ॥ అటు పయి శివాజీనిక యయ్య చూచు
నట్టి యవకాశమే లేనిదయ్యె తుదకు
కడకు నొక నాడు నాకస్మికముగ షాజి
మ్రందె నొకచోట 'మృగయా' ప్రమాదమందు ॥ 126

(అనిసేత=యుద్ధము చేయుట; వీడుకొను=త్యజించు)
(రస=భూమి) (మృగయా=వేట)

ఉ॥ 'షాజి' గతించినందనుక శాంతము బూనిన యా శివాజి ఘో
రాజుల బీజపూర్ గడము లన్నియు గెల్చెను పిమ్మటన్ ప్రతి
చీ జగతీధ్ర పంక్తి ఘన శృంగ గుహాభృగు సాంద్ర కానన
భ్రాజిత జావళీ ధరణిపై ప్రసరింపగ జేసె చూపులన్॥ 127

ఛత్రపతి శివాజి "జావళి" ని ఆక్రమించుట

ఉ॥ 'జావళి' 'మాబలేశ్వరము' చాయను నుండెడు దుర్గమాటవీ
స్థావర పీవర స్థలము - క్షత్రియ వంశ్యుడు "చంద్రరావు మో
రే" విభుడా 'మొఖాస'కును - లెంకల లెంకగ బీజపూరు బా
ద్షా విధృతి న్మెలంగు, నరి తప్పక కట్టి 'ఖజాన'నింపుచున్ ॥ 128

శా॥ "మోరే" జాతికి 'మౌర్య' రాజకులమే మూలమ్ము నా ప్రత్యయా
ధారమ్మైన వినిర్ణయమ్ము బలమై దర్పోద్ధతిన్ చూపునా
'మోరే' వంశ్యులు "భోసలే" లనిన నిమ్నోద్దేశమే కల్గియు
న్నారట్లేమది "చంద్రరావు" 'శివు' డన్నన్ హీనునట్లుంగనున్॥ 129

మ॥ శివజీ హైందవ రాజ్యమూలుకొలుపన్ చింతింప - బీజాపురీ
ధవునిన్ కొల్చుచు, వాని ప్రాపున "వతన్దార్లై" "జమీన్దారులై"
యవనాధీశుల బంటులై గొలుచుచు న్నాత్మాభిమానార్ధము
న్నవగాహింపక పందలెంచిరి స్వతంత్రాలోచనే తప్పుగా ॥ 130

ఉ॥ సామముచేత జావళి వశమ్మగు టెంతయు దుశ్శకమ్ము - మో
రే మదమత్తు డాత్మ ప్రవరెప్పుడు గొప్పగ నెంచు -భేదమో!
యామొగితప్ప దండమొ! - యెదైనను తప్పదటంచనుంగులన్
యామల మంపె మోరె కడ కాతని చిత్తమెఱుంగ గోరుచున్॥ 131

(ఆజి=యుద్ధము; ప్రతీచి=పడమర; జగతీధ్రపంక్తి=పర్వత శ్రేణి; భృగు=చఱియ) స్థావరము=కొండ

(పీవరము=బలసినది; విధృతి=ఆజ్ఞ; అరి=కప్పము)

(ప్రత్యయము=నమ్మకము; శివుడు=శివాజీ)

(ఊలుకొలుపు=స్థాపించు; అవగాహించు=తెలిసికొను)

(దుశ్శకము=అశక్యము; ప్రవర=గోత్రము; మొగి=విధము; యామలము= ఇద్దరు)

ఆ॥వె॥ 'శివజి' 'మహదు' వద్ద సేనతో విడియంగ
"చంద్రరావు" 'బాజి శ్యామరాజు'
తోడకుట్ర పన్నె - తోడ్తో శివాజీని
బంది చేయ - యిది శివాజి యెఱిగె ॥ 132

ఆ॥వె॥ శివజి ప్రణిధులపుడు చేరి 'మోరే' గీము
సచివులనుజులతని సరస నుండ
పల్కునపుడు, 'మోరె' పారుష్య విషమొల్క
చెండి రందరినట శివజి బంట్లు ॥ 133

ఆ॥వె॥ 'చంద్ర రావు మోరె' స్వర్గతు డయ్యెను
'జావళి' వశమయ్యె సర్వ నిధుల
తోడ- 'రాయగడము' గూడ దక్కెను - పశ్చి
మాబ్ది కొంకణముల కదియె దారి॥ 134

ధర్మవీర - మహావీర ఛత్రపతి శంభాజీ జననము

మహావీర 'శంభాజీ' ప్రశంస

క్రీ.శ. 1657, మే 14 - 1689 (పరిపాలనా కాలము 1681 - 1689)

తే॥గీ॥ సాయి బాయి, శివాజీల జంపతికిని
తొలుత ముప్పురు పుత్రికల్ కలిగి రోలి
బొడమె పిదపపురందరు గడము నందు
వీర 'శంభాజి', శివజీకి నౌరసుండు ॥ 135

తే॥గీ॥ "ఆయి" యని కన్న తల్లిని వాయి విప్పి
యెచ్చరింపగ లేని రెండేళ్ళ వయసు
నందె - మాతృ వియోగము పొందె నతడు
శంభుజీ దెంతొ దురదృష్ట జన్మమయ్యె ॥ 136

ఉ॥ మలకల కొల్వులందు బ్రది మంతయు నుంకువ చేసి బిగ్గరన్
పలుకుట కైన నోడి తలవాలిచి 'జోహు'కు మంచు మ్రొక్కు పం
దలు నెటు చూడ మందలుగ తారసమౌ నటువంటి దుస్థితిన్
తొలచగ తొట్టదొల్త నసి దూసిన జోదు శివాజి యొక్కడే ॥ 137

(ఆయి = తల్లి (మహరాష్ట్రభాష)

ఉ॥ అంతటి వీర కేసరికి నంగజుడై జనియించి నట్టి దు
ర్దాంత పరాక్రమక్రముదరాళకరాళ భయాన కాజులం
దంతట తానె యౌచు బెడిదంపడిదమ్మును వీచి యేచుకా
లాంతక 'శంభుజీ' పదములంబడుటే బ్రతికించు వైరులన్ ॥ 138

సీ॥ శివసమారబ్ధ హైందవ ప్రజా స్వాతంత్ర్య
సామ్రాజ్య రక్షాద్రిసార దుర్గ
మొగలు దుష్ప్రాభవామూల శిఖాసము
త్ఖాతక్రియా చణ ఖాత్ర కోటి
కీనాశ, కీనాశ కీలాల పానతుం
దిల భూప వన దవ దీదివిశిఖ
యవినీతి మార్గ సమార్జిత ధనమత్త
దురధికృతజనాబ్ద ధూననమ్ము ॥

తే॥గీ॥ 'కన్నడ' 'విజపుర' 'హ్మాద్నగ' 'ర్మొగలు'న్నృ
పాళి రాజ్యకాంక్షా దివాస్వప్న భంగ
కరణ దారుణ రణ రణత్కాంస్య భేరి
వీర శంభాజి దూసిన విచ్చుకత్తి ॥ 139

సీ॥ నిర్నిరోధమ్ముగ నింగికి నెగసెడు
మేఛ్ఛాగ్నికి యుగాంత మేఘకోటి
పంచమకార దుర్వ్యసనమత్తమలక
గజమదమణచు సింగంపు కొదమ
మహారాష్ట్ర భారమ్ము మాంసలాంసముపైన
కడదాక మోసిన కర్మయోగి
వేద ధర్మాపగ వేగమ్ము నాగెడు
కుటిల తౌరుష్క్యాద్రి కులిశ ధార॥

(అద్రిసారము=ఉక్కు; ఖాత్రకోటి=గునపము అంచు; కీనాశ=లోభి, రాక్షసుడు; కీనాశుడు=పేదవాడు; కీలాల=రక్తము; భూప=రాజులు; వస=క్రొవ్వు; దవదీదివి=దావాగ్ని; దురధికృతులు=దుష్టులైన అధికారులు; ధూననము=గాలి)

ఆ॥వె॥ యోధనమ్మె గాదు బోధమందును గూడ
అగ్రగణ్యుడగు కుశాగ్ర బుద్ధి
కదనకర్తయయ్యు గ్రంధకర్తయు గూడ
'శంభుజీ'కి సాటి శంభురాజె॥ 140

సీ॥ ఔరంగజేబును యామ్యాశ కీడ్పించె
ఢిల్లి భోగముల మాటెత్త కుండ
వెలలేని శిఖిరత్న పీఠిని విడనాడి
యున్ని కంబళుల కూర్చుండ బెట్టె
చదలంటు మణి మయ సౌధముల్ స్వప్నమై
మొరటు చప్రములందు మునుగ జేసె
చీకిరి మంగోలు చిన్న కండ్ల కపటి
చోరేక్షణముల కన్నీరు నింపె॥

తే॥గీ॥ పుడమి యంతయు నోడిలోన పడతలంచు
నెల్లలేని దాహార్తు గొంతెండ బెట్టె
యెడ తెగని యుద్ధములకు ప్రేరేచి యతని
పృతనలను గొప్ప చీకాకు పెట్టె శంభు॥ 141

సీ॥ ఎనిమిదేండ్లప్పుడె యెదిరి శిబిరమున
న్యాసమైయున్న ధైర్యామరాద్రి
పదియేండ్లకే హైందవ స్వతంత్ర రాజ్యార్ధ
మధిపులగుమిగూర్చు మంత్ర వివరి
ద్వాదశాబ్ద ప్రాయ దశ 'నాగ్ర' నౌరంగ
జేబును మాయ చేసిన నెరవరి
షోడశ వర్షుడై శూరులౌ యరులను
నోడగొట్టిన మహాయోధ పేషి ॥

తే॥గీ॥ ఇర్వదొక్కేండ్లకు మరాట యేలికయయి
రాజకీయ సామాజికార్థ విషయమ్ము
లందు పట్టుకై మంత్రుల యండగొనుచు
'ఛత్రపతి' బిరుదుకు గూర్చె సార్ధకతను॥ 142

(నెరవరి=సమర్ధుడు; పేషి=వజ్రము) (న్యాసము=వినిమయము)

ఛత్రపతి శివాజి అఫ్జలు ఖానుని వధించుట
(క్రీ.శ.1659)

ఉ॥ వచ్చె 'ప్రతాపదుర్గ'కు శివాజి నణంపగ 'బీజపూరు షా'
పుచ్ఛగ, బుద్ధియందు నెనుబోతగు 'నఫ్జలుఖాను' మాంసలుం
దుచ్ఛతరాంగుడచ్చట కడున్క్షతి గూర్చెను 'తుల్జమాత' ది
వ్యాచ్ఛ నివేశనమ్మునకు, పాపల-వృద్ధులఁ చంపె నిర్దయన్ ॥ 143

తే॥గీ॥ 'కనకగిరి దుర్గము'న నిజాగ్రజుని 'శంభు
జీని' కుట్రపన్ని వధించె చెనటి కపటి
వీడె 'యఫ్జలు ఖాను'డన్బెరసు, మున్ను
వానిని దునుమగా పట్టుబట్టె 'శివజి' ॥ 144

తే॥గీ॥ ఉక్కివుడగు నఫ్జలుఖాను వ్యూహ మెఱిగి
యామతించె ప్రతాపగడ్ యంఘ్రి తలికి
కౌగిలించుచు నసిదూయు ఖాను కడుపు
వాడిలోహంపు పులి గోళ్ళ వ్రచ్చె శివజి॥ 145

బాజీ ప్రభు ఆత్మార్పణము (క్రీ.శ.1660)

సీ॥ కొంకణ ప్రాంతమ్ము 'కొల్హాపూర్' పై కెత్తి
వచ్చి 'పన్హాలు'గడి పట్టుకొనగ
బీజపూర్ షాహి పంపిన 'రుస్తుము జమాను'
సేనాని ననిలోన చిత్తు చేసి
యాపైన 'సిద్దిజోహార' నియెడు దణి
'పన్హాలా' దుర్గమ్ము పట్టవచ్చి
దుర్గమున్జేరెడు మార్గమ్ముల న్మూసి
నిత్యావసరములన్నిల్వరింప ॥

తే॥గీ॥ 'పన్హాలా' దుర్గమున్వీడి బయటి కేగ
నడరె శివజీ నిశాతమ మడరువేళ
'సిద్ది' యడ్డగింపంగ "బాజీ ప్రభుండు"
శివజి సేనాని, వానితో చివ్వకడరె ॥ 146

(చివ్వ = యుద్ధము) బెరసు=క్రూరుడు

చ॥ శివజి "విశాల దుర్గము"ను చేరెడు నంతకు "సిద్దిజోహరున్"
రవ బెసగంగ నీక సమరమ్మున బాజి ప్రభుండు నాపె - స్వీ
యవపువు పెక్కు నాయుధ ప్రహారములందిని జల్లెడయ్యు - స్వా
సువులదొరంగె వించు, శివు సుస్థత తెల్పు ఫిరంగి మ్రోగగన్ ॥ 147

తే॥గీ॥ 'బాజి' యాత్మార్పణమున 'శివాజి' బ్రదికె
హైందవీరాజ్యమునకె నవాయు వొదవె
సిద్ది జోహారు 'పన్హాలా' సీమ గొనుచు
బీజపూరు పరువు నిలబెట్టె కొంత॥ 148

తే॥గీ॥ 'బాజి ప్రభు దేశపాండ్య', 'పులోజి' యు, 'శివ
సింగు జాధవు' డిత్యాది సింహబలులు
తనను తప్పింప "ఘోడ్ఖిండు" కనుమ యొద్ద
అరులనొడ్డి ప్రాణములను దొరగిరచట॥ 149

తే॥గీ॥ నాటగోలె "ఘోడ్ఖిండను" చోటునకును
పేరు "పావనఖిండ"ని పెట్టబడియె
శివజి ప్రాణముల్ రక్షింప సివము బూని
నట్లుపోరిన యమర వీరాంకితముగ ॥ 150

షాజాదా ఔరంగజేబు దక్కనుకు రాజప్రతినిధిగా వచ్చుట

తే॥గీ॥ బీజపురి సేన శివజితో పెనగు వేళ
చేరె దక్కను, ఔరంగజేబు - షాజ
హాను మూడవ కొమరుడు - నయ్యపనుప
మొగలు ప్రతినిధిగా పెద్ద మూక తోడ॥ 151

తే॥గీ॥ 'శివజి' మొగలులసేనలో చేరి తాను
పోరె బీజపూరునణచు పూన్కితోడ
కాని మొగలులచే తనకబ్బులబ్ధి
కలికమునకేని లేకున్కి కానబడియె ॥ 152

సుస్థత = క్షేమము

తే॥గీ॥ దాన శివజి మొగలులపై దండునెత్తి
'జున్నరు'ను కొల్లగొనియెను - హొన్నులు నొక
మూడు లక్షలు - ద్విశతాశ్వములు లభింప
కనలి 'షాజాద'నిపె 'నసీర్ఖాను' ననికి ॥ 153

ఉ॥ ఆ సమయమ్మునందు నభమంతయు గ్రమ్మినప్రావృషేణ్య సాం
ద్రాసితగర్జదంబుధర ధాటికి ధారణి ధ్వాంత ఛన్నమై
యేసమయమ్మహమ్మొ? నిశ యెయ్యదెఱుంగకరాక నింగియే
వాసడలించె నా గురిసె వర్ష మహర్నిశ మేకధారగన్ ॥ 154

కం॥ 'అహమద్నగర' ప్రాంతపు
మహీతలమ్మంతమూడు మాసము లొకటే
వహినడుసై యుద్ధభట ని
వహమ్మదుగిడుట సహితము నభద్రమ్మయ్యెన్ ॥ 155

షాజహాను అస్వస్థత - ఔరంగజేబు ఢిల్లీకి మరలి పోవుట

కం॥ ఔరంగజేబు పితరుని
యారోగ్యంబా సమయము నందె చెడుటచే
నేరుగ ఢిల్లీనవశ్యము
చేరవలసి యున్కి తాను చెచ్చెఱ జనియెన్ ॥ 156

శా॥ ఔరంగ్జేబొగి ఢిల్లికేగియట రాజ్యాకాంక్షతో భ్రాతలన్
'దారా', 'షూజ', 'మురాదు'లన్ చమరి పిత్రాజ్ఞన్తృణప్రాయతన్
పారన్వైచుచు తండ్రికే స్వగృహ నిర్బంధమ్ము నేమించుచున్
చేరెన్నెమ్మిలి గద్దె - చాటుచును తానే సార్వభౌముండునాన్॥ 157

తే॥గీ॥ అప్పటికె కొంత బలహీనమైన బీజ
పూర్ 'బడేబేగము', మొగలు భూమి జాని
నడుగు కొనెను, శివాజిదుందుడుకు నడప
నతడు 'సరె' యని మాతులున్ యామ్య కంపె ॥ 158

(వాసడలించు=నోరుతెఱచు; మాతులుడు=మేనమామ; యామ్య=దక్షిణ దిక్కు)

షైస్తఖాను శివాజీపై యుద్ధము ప్రకటించుట కీ.శ.1663

ఉ॥ వచ్చెను షైస్తఖాను నురవౌ చమువుంగొని 'పూణె' వీడులో
చొచ్చెను నిర్విరోధముగ - సూటిగ 'లాల్ మహల'ంతికమ్ముగా
పుచ్చుకొనెన్ నిరంకుశపు పోకడ చూపుచు - చక్రవర్తియే
పుచ్చిన 'మేనమామ' నను పోతరమున్ వెలలించుచున్ సదా॥ 159

మ॥ 'శివజీ యన్నను' నేలిదమ్ముగమదిన్ చింతించి యివ్వాని నే
నవలీలన్ దమియింపనో, యితడొకో 'ఔరంగజేబు'న్నెది
ర్చు వతారయ్యెను వ్రేలెడంతటి మనుష్యుండౌర ! పెట్రేగె, నే
బవరం బందున వీని గర్వమతి చేడ్పాటొంద చేతున్ననెన్ ॥ 160

ఉ॥ వచ్చిన షైస్తఖానునకు ప్రాపుగ 'దావుదు ఖాను' వచ్చె - పై
పెచ్చుగ 'సిద్ది జోహరు'ను బీజపురమ్మున నుండి వచ్చె - యీ
ముచ్చులు మూగురుంగలసి పూణె 'సుపా'లను కొల్లగొట్టి - పె
న్పిచ్చురగిల్చిరా నగర నీవృత భూముల పౌరహంతలై ॥ 161

తే॥గీ॥ షైస్తఖానుడు భర్త్సించు సరణి చూచి
పూణె వాసులొక్కుమ్మడి పుల్లగిలిరి
సిగముతో నూగు పోతురా జీతడనగ
వేసె పొలికేక లాపూణె వీధులందు ॥ 162

శా॥ 'పూనా'లో శివు బాల్య యౌవన దశల్ పూర్ణాభివృద్ధింగనె
న్నా నేలన్ ప్రతియంగుళమ్ము శివజీ హస్తస్థ సౌవీరమౌ
ఖానుండానిన 'లాల్మహల్' బసకు 'మున్ ఖావంద్' శివాజీ యె-నే
డా నింద్యుండిటురజ్జులాడె, శివజీ ధాకన్ కనన్ నేరుగా ॥ 163

(ఉరవు=ఎక్కువ; పుచ్చుట=పంపుట; పోతరము=పొగరు)

(ఏలిదము=తేలికగా; వతారి=సమర్థుడు; అటి=నశించి; చేడ్పాటు= భంగపాటు)

(నీవృతము=పల్లె)

(భర్త్సించు=భయపెట్టు; పుల్లగిలు=భయపడు)

(హస్తస్థ సౌవీరము=అరచేతి రేగుపండు; ఖావంద్=యజమాని; ఆనిన=ఆక్రమించిన; రజ్జులు=వాచాలత; ధాక=విజృంభణ)

తే॥గీ॥ షైస్త ఖానుని దినచర్య సరళి నంత
గూఢచారుల వలన బాగుగ నెఱింగి
మొనను పన్నెనదాటున ముట్టు కొనగ
షైస్తఖానుని బసను నిశార్ధమందు ॥ 164

కం॥ ఆరేయి పూణె వీడున
యూరేగింపయ్యె నేదొ యుద్వాహముకై
చేరెను శివాజి చిరుపరి
వారముతో నందు మారు బారిసములతో ॥ 165

మ॥ నడురే 'లాల్మహ'లందు నాడు రమజాన్పర్వంపు 'పాకక్రియల్
నడువన్ బానసమందు-ఖాన్ శయనశాలన్నిద్దురంగూరె - బ
ల్విడి ప్రేమన్ రమణుల్ వలంగొనగ, నవ్వేళ న్నహెూ! దొంగలం
చడరెన్ గాటపు సద్దు - నెవ్వడెఱుగండచ్చోటనేమాయెనో॥ 166

మ॥ శివజీయే మునుముందు సందడిని సృష్టించెన్ స్వసైన్యమ్ముతో
నవలన్ గందరగోళమేపయిన తానా'ఖాను' శయ్యాగృహం
బవలీలన్ గుర్తును బట్టి యట్టి ప్రబలధ్వాంతమ్ము నన్ఖానుని
న్నవలోకించియు కత్తినేయ నతడూటాడెన్ గవాక్షర్తిలో॥ 167

ఆ॥వె॥ సోరణమ్మునందు దూరి పారెడు వేళ
షైస్త ఖానుపైన శాతహేతి
వీచె శివజి కాని వ్రేళ్ళు మాత్రమె తెగి
యాయువుండి 'ఖాను' నవలబడియె ॥ 168

తే॥గీ॥ షైస్తఖానుని గర్వమ్ము నస్తమింప
యతని యప్రయోజకతకు నలుకతోడ
మాతులుని పంపె బంగాళ మహికి 'బాద్షా'
'వంగమడి యొద్ద బావయు పరుడెయగును'॥ 169

(బారిసము=వేషము) (బానసము=వంటయిల్లు; సద్దు=సవ్వడి) బల్విడి=అతిశయము (ఏపు=ఎక్కువ; అంధము=చీకటి; ఊటాడు=పారిపోవు; గవాక్షి+ఋతి= కిటికీగుండా; ఋతి=త్రోవ) (సోరణము=గవాక్షము; శాతహేతి=వాడికత్తి)

ఛత్రపతి శివాజీ సూరతు ముట్టడి

తే॥గీ॥ షైస్తఖానుని తనపైకి సమరమునకు
పంపు ఔరంగజేబుని తెంపు జూచి
తగు ప్రతీకారమొనరింప తలచె శివజి
వారి కభిభూతి తనకు లాభమ్ము కలుగ॥ 170

కం॥ సూరతు నగరము మొగలుల
భూరి వ్యాపార కేంద్రముగ నుండునటన్
బేరముల వలన ధనమా
సారమునై కురియు చుండు సతతమవిరతిన్ ॥ 171

తే॥గీ॥ అట్టి సూరతు నగరము ముట్టి శివజి
కొల్ల గొట్టె బందరువున నెల్ల ధనము
హాని లేకుండ జనమాన ప్రాణములకు
కటక రక్షి 'ఇనాయతు ఖాను' పాఱె ॥ 172

ధర్మవీర - మహావీర - ఛత్రపతి 'శంభాజీ మహారాజె'

బాల్యము

తే॥గీ॥ చంటి బిడ్డను విడిచి ప్రసత్వరి జనె
సత్వరమ్మున పొందంగ స్వర్గ పదవి
కన్న బిడ్డ కన్నను దివి మిన్నయౌనె
'కర్మఫలమవశ్యానుభోక్తవ్యమె' గద॥ 173

సీ॥ అద్దాల బిడ్డని యచ్చట ముచ్చట
లల్లారు ముద్దుగా నరయు పెరిమ
వేళకు పాలును విహితమౌ బువ్వను
త్రావింప తినిపింప తగిన యోర్పు
మెత్తని వెచ్చని పొత్తుల ననువుగా
మార్చి మార్చి పఱచు మంచి శ్రద్ధ

(ప్రసత్వరి=తల్లి) మన్మ=మనుమడు

లాలిపాటలతోడ డోలల న్నిసుగును
నిదుర గూరగజేయు నెఱతనంబు॥

తే॥గీ॥ ఇన్ని పనులును సాజమై కన్నతల్లి
కొదవు - సవతులు, దాదుల కున్నెయిలను?
'బామ్మ'గా మన్మ యాలన పాలనమ్ము
'జీజియా' చూడ శివజి నిశ్చింతుడయ్యె ॥ 174

సీ॥ వ్యూహముల్ పన్నుచు నాహవము లొనర్చి
సయ్యొద్ధ కుదిరిన నియ్యకొనుచు
నింట, బయట పగతే జాడ నడతురో
వారికదలికల పసిని బట్టి
యాహార నిద్రల నఖిల కార్యము లందు
కాయ రక్షణ పైన కన్నుగల్గి
రాజ్య కోశ, సమాజ, ప్రాణ సంకటముల
మంత్రుల మంతన మాలకించి॥

తే॥గీ॥ క్షణము తీరని పాలనా కార్యభార
వహనమున డస్సి - కొడుకును పల్కరించి
లాలనము చేయ సమయమే చాలదయ్యె
నా కొఱంత దీరె శివాజి కంబ వలన॥ 175

చ॥ కొడుకును ముద్దుసేయుటకు కొంచెము తీరిక చిక్కెనేని - యా
బుడుతను కౌగిలిన్ కదియ బూనుచు బుజ్జవమొప్ప - పట్టి క్రొ
న్నుడులకు, తప్పటడ్గులకు నూతన బాల్యము వచ్చినట్లు తా
నడుగుల వేయుచున్ నుడువునట్లె శివాజి ప్రమోది తాత్మమై ॥ 176

ఉ॥ బంగరు మేనిచాయ సితపద్మ దళాంబక యుగ్మతిగ్మము
న్నుంగరపున్నెరుల్ తిరిగి యొప్పుల నొప్పెడు బారెడున్నెఱుల్
చెంగున సింగపుంగొదమ చెయ్వుల దూకుడు చూపు వైఖరుల్
ఖంగున మ్రోయు వాక్సరణి కా నిసుగందు 'శివుండె' కన్పడెన్ ॥ 177

(ఉంగరపున్నెరి=ఉంగరములవలె వంపుకలిగి; నెఱుల్=కురులు) మన్మ=
మనుమడు; సయ్యొద్ధ=సయోధ్య; తిగ్మము=కాంతి

శా॥ 'శంభూ' యంచు సవిత్రి పిల్వ నెదలో సంతోషమేరీతిగన్
జృంభించున్ననునట్టి యా యనుభవ శ్రీలబ్ధికిన్ జీవితా
రంభమ్మందున నుండియే మిగుల దూరమ్మయ్యె - వాత్సల్యమన్
లంభంబెందరి కబ్బు? మార్చగలమే లాలాటికాలేఖనల్?॥ 178

ఆ॥వె॥ 'చదువు', 'సంత' లందు 'సాముగ', 'గరిడీల'
యాటపాటలందు నాజి కళను
నశ్వ రోహణమున, యసిచాలనమ్మున
యారితేరె శివజి యౌరసుండు॥ 179

ఉ॥ తల్లికి దూరమైన కొలతన్నెదకెన్నడు సోకనీయకన్
తల్లికి మాత్రమే పరిమితమ్మగు నెమ్మిని మించు నెమ్మితో
'యిల్లడనున్న పెన్నిధిగ' నెంతయు పూచిగ జాగరూకత
'న్నల్ల'యు, బామ్మయై పెనిచె నర్మిలి మన్మనిశంభుఁ 'జీజ'యున్॥ 180

తే॥గీ॥ శివజికెట్లుతాను చిన్నతనము నుండి
యైతిహాసిక యుగపు మహా పురుషులు
రామకృష్ణాది వీరుల రమ్య గాధ
లు వినిపించె నటులె నప్త చెవులనించె॥ 181

చ॥ శివజియు శంభుజీకి తగు శిక్షణ నీయగ - పోరులందు నె
క్కువగ పరిశ్రమానుభవ గుంఫితకౌశలులౌ పడాలులన్
వివిధ శితాస్త్ర చాలన ప్రవీణత - స్వాజిర రక్షణార్థమై
కవచము లాదిగా తొడుగు కందువ నేర్పగ నుంచె కొల్వునన్॥ 182

తే॥గీ॥ చిన్నతనము నందు శ్రీశివాజీకిని
చదువు కొనగ వీలు కుదర లేదు
నిరత యుద్ధ భయము నిలువ నీకున్కిని
స్థిరనివాస మెచట చిరముగామి॥ 183

(ఇల్లడ=న్యాసము; అల్ల=అమ్మ; పూచి=బాధ్యత) లంభము=లాభము
(నప్త=మనుమడు) లాలాటిక=నుదుట; సంత=వేద పాఠము
(పడాలులు=సైన్యనాయకులు; అజిరము=శరీరము; కందువ=నేర్పు)

తే॥గీ॥ ప్రథమ యౌవన దశయందె పవలు రేలు
శివజి రాజ్య విస్తరణకై తివురు కతన
యుద్ధ విద్యల ప్రావీణ్యమొందె గాని
చదువులందున నభివృద్ధి సాగలేదు॥ 184

ఉ॥ కావున శంభు కేవలము కట్టుపకాసగు యుద్ధ వీరుడే
కావుట గాదు - పండిత ప్రకాండుడు నౌటయు తండ్రియాశ-యు
చ్చావచ శాస్త్ర సంహితల సారమెఱుంగగనైక భాషలన్
వావిరియైన నైపుణము ప్రాప్తిలగా నియమించె యొజ్జలన్॥ 185

తే॥గీ॥ సంస్కృతము - పార్శి - మాతృ భాషా మరాటి
భోజపురి, యుర్దు భాషలన్పూర్ణ దీక్ష
తోడచదువ, వ్రాయగ నేర్చె తోష మొదవ
జేజికి, పిత, కోజలకు శంభాజి బాలు ॥ 186

ఔరంగజేబు జయసింహుని శివాజీ పైకి పంపుట
క్రీ.శ.1665

ఉ॥ 'మాతులు' భంగపాటు హతి మాయక పూర్వమె - సోకె విద్యుదా
ఘాతము వోలె సూరతు నగర్ చుర - యల్గుచు పాదుషా బల
స్ఫీతుని రాజపుత్ర జయసింహుని పంపె శివాజి పైకి, దు
ర్జాతునణంచు డంచు తగు సైన్యమునిచ్చి మరాట భూమికిన్॥ 187

మ॥ జయసింహుండధినేత 'నంబర'ను రాజస్థాను నందున్న కొం
చియమౌ భూశకలమ్ముకున్-మొగలు రాజేంద్రుండు 'షాజాను' నెం
తయు విశ్వాసముతోడఁగొల్చె తొలుతన్, తత్పుత్రునిన్నట్టె ప్ర
త్యయ మొప్పారగ గొల్చు వార్ధకము దాపౌ చుండియున్ వీరుడై॥ 188

(కట్టుపకాసు=అచంచలుడు; ఉచ్చావచము=పెద్దవీ, చిన్నవీ; నైక= అనేకములైన)

(జేజి=బొమ్మ; ఓజ=గురువు) (చుర=దోపిడి)

తే॥గీ॥ హిందు వాతడు - శివజీయు హిందు వగుట
నయ, భయ, జయములను సమన్వయము చేసి
దారికిందేర శివజీని - యేరి పంపె
తన దళపతుల యందు నుత్తముడటంచు ॥ 189

ఆ॥వె॥ అనుభవమ్మునందు నాహవమ్ముల యందు
నురుబలాధికుడు వయోధికుడును
మేటి వీరులకును "మీర్జ రాజా జయ
సింహు" రంహ మోర్చు చేవలేదు ॥ 190

కం॥ తన నీడ తానె నమ్మని
యన్నృజుం డౌరంగజేబు నంపెను జయసిం
హునిపై వేగును నడపగ
దణిని, దిలేర్ఖానను నొక తౌరుష్క్య మణిన్ ॥ 191

తే॥గీ॥ శివజి యనుచరులను రణాజేయ వీర
వర్యులగు దళపతులను ప్రక్కకీడ్చ్చె
వివిధ మార్గముల ప్రలోభ పెట్టి సింగు
చేవ జావగారగ శివసేనకపుడు ॥ 192

ఉ॥ అట్టి దణాయడిప్పుడు దవానలమట్లు శివాజి కోటలన్
ముట్టి వశమ్ము చేసికొని మోహరమందున నుగ్గునూచమౌ
నట్టు శివాజి మూకలను నట్టిటు చేసి పురందరమ్ముచే
పట్టగ ముట్టడించిన - శివాజి యొడంబడె సంధి సేతకున్॥ 193

తే॥గీ॥ 'రాజ జయసింహుడే' వచ్చు రణమునకని
ముందె వార్తను వేగులు నంద జేయ
శివజి బాగుగా యోచింప - బవర మందు
గెలుపు సాధ్యమ్ము కాదని తెలివిడయ్యె ॥ 194

తే॥గీ॥ శివజి యప్పుడు జయసింహు చేతి కందు
నటుల 'రఘునాథ పంతుచే' నంపె లేఖ
యుత్తరము జూచి 'సింగు'నిట్టూర్పు విడిచె
యెంతొ గుంజాటన వడె నా వృద్ధుయెడద॥ 195

ఛత్రపతి శివాజీ, రాజా జయసింహునకు వ్రాయించిన లేఖ

ఉ॥ "ఓ జయసింహరాట్తిలక! యుత్తమ క్షాత్రకులోద్భవుండ వీ
యోజ శితాసితో నెవరి యూపిరి తీయగ నుద్యమించితో
ధీజిత దీదివీ! యరయుదేని యరాతులు లేరు నీకిట
న్నీజనులెల్ల చూడుమిట-హిందువులే-భవదస్ర బంధులే ॥ 196

సీ॥ భరత ఖండంబున పౌరుషముప్పొంగు
పోతుగడ్డ తమరి పుట్టినిల్లు
నెత్తిన నిశితాసి యెదిరి శిరమ్మును
దొరలింప కొఱలోన చొఱని నేల
ప్రాణమ్ముకన్నను మానమ్మె యురవంచు
సధ్రినాశ్లేషించు స్త్రైణ ధరణి
యుగ్గుతో ననిఁదల యొగ్గని శౌర్యము
త్రావి యెదుగు వీరతనయ ధాత్రి॥

తే॥గీ॥ వీరభట సింహనాదాతి భీషణమ్ము
సమరకరి, హయోష్ట్రనిచయ సంకులమ్ము
ధ్రువరణక్షత రాడస్రరోహితమ్ము
మఱతె? మీదు రాజస్థాన మహిత చరిత॥ 197

ఉ॥ భారతదేశమెల్ల తన పాలనలో మనియుండ నొక్కటై
భారత చక్రవర్తియను పట్టము తానొకడే ధరింపగన్
కోరిన తప్పుగాదు-ప్రజకున్ సమభావముతోడ మేళ్ళుచే
కూరగఁ జేసినన్, తృణమె కొండగ జూతురు, మెత్తురందరున్ ॥198

మ॥ సమ భావమ్మవురంగజేబునకు నా జన్మమ్ముగా నభ్రపు
ష్పమె - యవ్వాని సబామునన్ స్వమత పక్షప్రేమ గాఢమ్ము-న
న్యమతమ్మున్నొక గడ్డి పోచవలె హైన్యంబంచు భావించు సా
జమునౌ దుర్గుణమున్నదంచు ప్రజకున్ స్పష్టమ్ముగా కన్పడున్॥199

(సధ్రి=అగ్ని; స్త్రైణము=స్త్రీసమూహము)

ఉ॥ మీరలు వాని కొల్వునను మేలితరమ్మున నున్నవారు - నా
ఘోరమణుండు నేపనికి బుచ్చిన చెచ్చెఱ పూర్తి సేయగన్
పేరెము లెత్తుచుందురది భృత్యుల ధర్మమె కాని యాజ్ఞలన్
తీరుచు వేళ మంచి, చెడు తేర్చుట సజ్జన ధర్మమౌ కదా!॥ 200

సీ॥ జీజియా పన్నును ఛీకొట్టి నారేమొ?
నిల్వరింపగ ప్రయత్నింప రైరి
తైర్థిక శుల్కమున్ తప్పని యనిరేమొ?
దానినడ్డుకొనగ తలపరైరి
'కాశీ', 'మధుర'లకు గాసిసేయ వగచి
రేమొ? యాపుటకు మీ రేగరైరి
జంధ్యములను త్రెంప - జన్నిగట్టుల చంప
కినిసి నారేమొ? రక్షింపరైరి ॥

తే॥గీ॥ హిందువులపైన ప్రతిదిన మిట్టి ఘోర
మైన నేరములు జరుపునట్టి పాదు
షాను తలపైన మోయ మీ స్వాంతమెట్టు
లొప్పె చెప్పుడీ జయసింహ యోధవర్య॥ 201

ఉ॥ హిందు స్వరాజ్యమున్ నిలుప నెంచితి నిప్పుడు మీరు వచ్చినా
రెందులకైన గాని, యిపుడీరె భుజమ్ములకెత్తుకొంచు నీ
హిందు స్వరాజ్యమున్ నిలుప నేడుగడౌచెకిమీడులౌచు మా
యందు దయన్ సరే యనిన నందరు సిద్ధమె మిమ్ము గొల్వగన్॥ 202

తే॥గీ॥ రాజపుత్రాగ్రణివి నీవు రాజవైన
మిమ్ముగొల్చుట మాకు గర్వమ్ము సుమ్ము
శస్తహైందవ సామ్రాజ్య స్థాపనమ్ము
భవదమల కరాంబుజ సంభవమ్ము నౌత॥ 203

రాజజయసింగు ఛత్రపతి శివాజీకి వ్రాయించిన ప్రత్యుత్తరము

ఆ॥ "శివజి" లేఖ జూచి చిత్తమార్ద్రమునయ్యె
సముచితోత్తరమిడ చాలతడవు
యోచనమ్ముచేసి యుత్తరమిడె జయ
సింగు శివజి విమల చిత్తమలర॥ 204

ఉ॥ "శ్రీ శివజీ నరేంద్ర! చిరజీవివి కమ్మిదె నాదు నాశిషం
బీశివరప్రసాదుడవు నేది యసాధ్యము నీకు – నీదు లే
ఖాశయమున్ గ్రహించితిని – యాశలు ప్రగ్గ వయస్సునాది – యే
లేశము శక్తియున్న నది తేని సపర్యల చెల్లగా వలెన్ ॥ 205

తే॥గీ॥ నిజము! 'ఔరంగజేబు' దుర్నీతి పరుడె
యైనరాజపుత్రులము నాద్యంతముగను
మొగలు రాజుల సేవలో మునిగి నాము
తేలినను మాదు శవములే తేలవలయు॥ 206

ఉ॥ బిడ్డలనిచ్చి "మామ"లను పెద్ద పవాడము లందుకొంటి మా
సొద్దును చూపువారలను చుల్కన చేసితి మేము చూడగన్
సద్దను చేయకుండ మనసాటి సనాతన హైందవ ప్రజ
న్నెద్దెతనాన మల్కదొరలేచగ నిర్బలులైతి మాపగన్ ॥ 207

తే॥గీ॥ ఎట్టులును భ్రష్టులైతి మింకేటి బ్రతుకు
తరతరమ్ములు మాపయి కఱలు నిలిచె
యెంత యుదికిన వెల్లౌనె యెలుగుతోలు?
బయలుచేయు మా దుష్ప్రథన్ భావి చరిత॥ 208

కం॥ శ్రీకృష్ణుడెంత చెప్పిన
నాకర్ణించియును కర్ణుడంధనృపసుతు
న్నేకాకి చేసి వీడెనె!
మా కర్మమ్మిది మము విడుమా శివరాయా!" ॥ 209

తే॥గీ॥ అంత సంధియొనర్పగ నర్హమైన
భాషణములు జరిగెను – శివాజికి జయ
సింహునకు దిలేర్ఖానుకు – స్నేహ పూర్వ
కముగ – సంధ్యంశముల నిర్ణయమును జరిగె ॥ 210

చ॥ ఇరువదిమూడు దుర్గముల నిచ్చెను – పంచ సహస్ర సంఖ్యలో
హరులనొసంగె – నష్ట పరిహారముగా నొక నాల్గు లక్షల
గ్నిరజపు హొన్నులన్నిడెను – కేసరి శాబకతుల్యు శంభుజిన్
గిరవుగ నప్పగించె జయికిన్ జయసింగుకు సంధి మేరకున్॥ 211

తే॥గీ॥ ఇట్టు లెనిమిది యేండ్లకే యేగె 'శంభు'
న్యాసముగనుండి జయసింగు నదుపు నందు
నైదువేల గుఱ్ఱపుదండు కధిపుడౌచు
నచట 'మన్సబుదారుగా' నధికృతి గొనె ॥ 212

తే॥గీ॥ మరియు 'బీరారు' జాగీరు మహిపుడయ్యె
మొగలుసేనలతో గూడి తెగువ జూపి
బీజపూరు సేనలతోడ భీమరమున
పోరి జయములు కల్గించె పోషకులకు ॥ 213

తే॥గీ॥ తల్లిలేని బిడ్డడిని లేతవయసందె
పూచిగా నుంచుకొనుచు కొంపోవ రిపులు
తల్లడిలె "జీజియా బాయి" యుల్లమెంతొ
పిన్నతల్లులు నశ్రుల వెల్లియైరి ॥ 214

తే॥గీ॥ అప్పుడా 'రాయగడమె' సమార్ద్రమయ్యె
పౌరులెల్లరు వగవ శివాజి భంగ
పాటు గనుచును – శంభాజి వైరి శిబిర
మునకు న్యాసమ్ముగా నుండ చనుటచూచి ॥ 215

ఈశి=భవాని; అగ్నిరజము=బంగారము; గిరవు=పూచీ; జయి=విజేత
(న్యాసము=తాకట్టు)
(భీమరము=యుద్ధము)

తే॥గీ॥ పిదప 'జయసింహు'డిటుల భావించెనెదను
'శివజి' వంటి వీరు నదుపుసేయు తలపు
తగదు – భేరిని జోకొట్టు పగిది యగును
స్నేహభావమ్మునకులొంగు 'శివజి' యనుచు॥ 216

తే॥గీ॥ శివజి పాదుషా ప్రభుతకు శిరమునొగ్గి
యతనికి సుబేదారుగా యామ్యనున్న
పాదుషాకుదక్కను పరిపాలనా భ
రమ్మడగునని జయసింగు నమ్మె గాన ॥ 217

తే॥గీ॥ అట్టి భావమె తెలుపుచు నంపె కమ్మ
పాదుషాకు సమాచారవహుల చేత
యావులింపకె ప్రేవుల యంతు దెలియు
పాదుషా జాబు చదివె నిర్భావముగను ॥ 218

రాజాజయసింగు పాదుషాకు పంపిన లేఖాంశములు

మ॥ "శివజీ యంతటి వీరుడే మొగలు రాజేంద్రాధిపత్యమ్మునో
ర్చి వశుండైనను నంతకన్న మరివేరేశ్రేయమేముండవా
క్భువికిన్ మీరిడు ప్రాతినిధ్యమును తాబూనంగ – నిశ్చింతులై
వ్యవధానమ్ముగ మీరలుత్తర భువిన్ పాలింపు డాలంపనా! ॥ 219

తే॥గీ॥ ఇపుడె శివజీని మీసభ కేగుదెంచి
మిమ్ము సేవింప నాతడు మేకొనునటు
లతని గౌరవింపుడు మీరలర్హ ఫణితి
యతడు నుచితజ్ఞుడు వినీతుడనుచు దోచు"॥ 220

(యామ్య=దక్షిణము)
(అవాక్భువి=దక్షిణ దేశము)

పాదుషా ఔరంగజేబు నిర్ణయము

తే॥గీ॥ అనెడు జయసింహు మాటల కాత్మనెంతొ
కాలము మననమున్జేసి కడకు బాద్ష
వల్లె యనియెను-నాతని యుల్లమందు
యోచనములు కదలు చుండె త్రాచులట్లు ॥ 221

తే॥గీ॥ ఎటుల జూచిన శివజీకి స్వేచ్ఛయిడిన
ముందు ముందు యిబ్బందులు మూడుననుచు
నంబరేశు కాలంపనా యాజ్ఞనిడియె
శివజి 'నాగ్రా' పురమునకు చేర్పుమనుచు ॥ 222

తే॥గీ॥ కపటి 'ఔరంగజేబు' తానెపుడొ తలచె
'శివజి'నాప్తునునకుఁబంప చివ్వసేయ
లేనిచో బందియై చెఱలోన మ్రగ్గ
కానిచో కటికకు కంబుకమ్ము నొగ్గ॥ 223

కం॥ కానీ జయసింహున కను
మానము రాని విధిచూపె మైత్రి శివజితో
హీనుండౌరంగ్జేబా
లానమ్మను కొన విషాహిలాగై కఱచున్ ॥ 224

శివాజీ మొగలులతో చేరి బీజాపూరుపై యుద్ధము చేయుట

చ॥ కుదిరినవెన్క సంధి తనకున్ జయసింగు,దిలేరు ఖాన్లకున్
కుదర సహస్రమిమ్మడిగ నుక్కలులౌ భటులైదు వేలతో
కదనముచేయ బీజపుర కాంతునితో నవురంగజేబుకై
కదలె శివాజి యాజి కడికండలు సేయగ వైరి వీరులన్ ॥ 225

(చివ్వ=యుద్ధము; కంబుకము=మెడ)
(ఆలానము=త్రాడు)
(కుదరము=గుఱ్ఱము; ఇమ్మడి=రెండింతలు)

మ॥ తనతో వచ్చిరి 'శంభుజీ' మరియు 'నేతాజీ' ముఖానేకులౌ
మొనగాండ్రందరు దట్లు జక్కొనిపి - మున్ముందేగి 'ఫల్తన్' సహో
జననేతన్ శివజీకి శ్యాలుడగు 'బాజాజీ' ని యోడించి యా
తని జాగీరును యాక్రమించిరి జయధ్వానంబులన్ రేగుచున్॥ 226

కం॥ 'బాజాజీ' నాయకుడు, శి
వాజీ యగ్రసతి "సాయిబాయి" సహజుడే
బీజాపురాశ్రితుడగు - శి
వాజీ యన 'నెదురు చుక్క' వానికి నెపుడున్ ॥ 227

తే॥గీ॥ బీజపూరు పౌజులతోడ నాజియందు
పెనగుచున్నట్లె కనిపించి, పెడగ జనగ
"పన్హాళా' కోటముట్ట నన్పంపు"డనుచు
కోరి, 'జయసింగు' ననుమతి గొనియె శివజి ॥ 228

ఛత్రపతి శివాజీని, దిలేర్‌ఖాను అనుమానించుట శివాజీని వధింప ఆలోచన చేయుట

తే॥గీ॥ కాని నేతాజి వంటి విక్రమియు లేమి
'పన్హాళా' కోట సాధింప వశముగాక
'శివజి' మును విశాల గడునుచేరి, పిదప
"రాయరీ"కేగె 'జయసింగు' నీయకొనగ॥ 229

శా॥ 'బీజాపూరును పొద్దు, గెల్తు ననుచున్,బీరమ్ములన్ పల్కినే
డే జాడన్ చనెనో శివాజి మనలన్నేమార్చునట్లున్నదా
యోజంజూచిన, వానిఁగూల్త'మను దుష్టోహన్ దిలేర్ఖానుడున్
తాఁజేయం జయసింగు నాపి యతనిన్ ధర్షించి చెప్పెన్నిటుల్॥ 230

(దట్లుజక్కొనిపి=నడుము పట్టీలు బిగించి; శ్యాలుడు=బావమరిది; సహ=భూమి)

(ఎదురుచుక్క=ప్రతికూలము)

(పౌజు=సేన; పెడగ=దూరముగా) (విక్రమి=వీరుడు)

(కూల్చు=చంపు; ధర్షించు=త్రోసివేయు)

రాజా జయసింహుడు శివాజీని సమర్థించుట

మ॥ "శివజీ పాదుష యాజ్ఞకొగ్గుచు నవాచీ భూమిపై ఢిల్లి ప్రా
భవమున్ సాగగ జేయ రాట్ప్రతినిధిత్వమ్మూను నుద్యోగియై
బవరంబందున ఢిల్లి సేనలకు తోడ్పాటౌచు - సుంకమ్ములే
యవరోధమ్మును లేక రానతడు సాహ్యంబౌను ఢిల్లీశుకున్॥ 231

ఆ॥వె॥ అతని వలన మనకు యామ్య భారతమందు
ఢిల్లి పాలనమతి తేలికగును
దక్షిణ దిశపైన తీక్షవీక్షణ మింక
బఱప పాదుష కవసరము రాదు" ॥ 232

ఆ॥వె॥ అనుచు నపుడె పంపె ఔరంగజేబుకు
ఉత్తరమును వ్రాసి - యుత్తముడగు
శివజి వంటి వీరు సేవలు గొనుటకు
యోచనమ్ము చేసి యుద్యమింప ॥ 233

శివజీ మొగలులతో చేసుకున్న సంధిని గూర్చి చర్చించుట

ఉ॥ రాతిరులుంబవళ్ళు నవిరామముగా సముపార్జితమ్ము నౌ
భూతలమెల్ల లాతులకు పున్నెముకన్నటులప్పగించి - చే
జేతుల, నిప్పుడీగతి విజృంభణ దేనికి? ఢిల్లి పాదుషా
కై, తలలిత్తుమే వృధగ క్రమ్మఱు దంచు పడాలు లాడగన్ ॥ 234

తే॥గీ॥ ఇదియు నిక్కమే సుమి! మనమేల- యున్న
కోటలన్నియు పోగొట్టు కొంటి మిపుడు
మన విరోధులఁగూడి సమరమొనర్ప
నేల? యని శివాజి యని కెడగ నుండె ॥ 235

(అవాచీభూమి=దక్షిణభూమి; బవరము=యుద్ధము)
(యామ్య=దక్షిణదిక్కు)
(పడాలులు=సేనాపతులు)

వీర నేతాజీ పాల్కర్ ముందు బిజాపూర్, తర్వాత మొగలుల చేరుట

తే॥గీ॥ తుఱక దొరల పక్షమ్మున దురములందు
హైందవ భటులు పోరిరి - హైందవ నృపు
ల కొలకు తుఱక భటులు నాలము నొనర్చి
రాకలిని తీర్చుటకు, మత మన్న మిడదు ॥ 236

శా॥ 'నేతాజీ' యను వీరుడౌ తన చమూనేతన్ యవిశ్వాస్యతా
హేతూదాహరణమ్ము చూపి కొల్వును తొలంగించన్ శివాజీ - యదే
ప్రాతింగాగొని 'నేతజీ', కి బృహదర్థంబిచ్చి బీజాపురీ
నేతం గొల్వగ నామతించి రతడు స్వీకొంచు చేరంజనెన్ ॥ 237

తే॥గీ॥ 'అంబరు పతి'కి 'నేతాజి' యతులశక్తి
తెలియుగావున బీజపూర్ కొలువు మాని
రమ్మనుచు పిల్చి ఘన ధన రాశులిచ్చి
గొప్ప పదవినిడి మొగలు కొల్వుఁజేర్చె ॥ 238

ఛత్రపతి శివాజీ ఆగ్రా ప్రయాణము క్రీ.శ.1666

తే॥గీ॥ దరిమిల "యవురంగ్‌బాద్ సుబేదారు చేత
లక్ష రూప్యములు శివాజి తక్షణంపు
వెచ్చ మాగ్రాపురమునకు వచ్చుటకును
పాదుషా చేత యిప్పింపబడియె నపుడు ॥ 239

తే॥గీ॥ శివజి తన వెంట పరిమిత సేన గొనుచు
జ్యేష్ఠ సుతుడైన శంభాజి చెంత నుండ
వెడలె సోత్సుకుడై 'ఆగ్ర' వీడుఁజేర
మాస పర్యంత మభియాన మపుడు చేసి ॥ 240

(ప్రాతి=అనుకూల్యము; ఈకొను=ఇష్టపడు, ఒప్పకొను)
(అంబరుపతి=జయసింగు) (దరిమిల=ఆతర్వాత; వెచ్చము=వ్యయము)
(అభియానము=ప్రయాణము)

రాజా జయసింగు తన కుమారునకు లేఖ వ్రాయుట

ఆగ్రాలో రామసింగు శివాజీని ఆమతించుట

కం॥ 'శివజీ' ఆగ్రా యానము
దవులన్నుండ జయసింగు తనయున కొక జా
బు విలిఖితము చేసి పనిచె
సవినయముగ రామసింగు చదివె పితమదిన్ ॥ 241

చ॥ "శివజిని యామతింపుము విశిష్ట విధిన్ యొక రాజు నట్టులన్
సవినయమౌ విధానమున సాగగ చేయు సమస్త సేవల
న్నవసరముల్ గ్రహించి తగినట్లు చరింపుము సావధానత
న్నవిరతి వెన్నుగాపు వయి యారయు చుండుము వేయి కన్నులన్"॥242

కం॥ అనియెడు జనకుని మాటకు
పని వినియెను రామసింగు పరమవినీతిన్
కొని వచ్చి శివాజీ నొక
ఘనసౌధమతనికి బసగ కావించె వెసన్ ॥ 243

పది యేండ్ల బాల శంభూజీ - ఆగ్రాలో అనుభవములు

తే॥గీ॥ 'బాల శంభు'కు 'శివజీ'కి భారతోర్వి
యుత్తరదిశాటనమ్మిది క్రొత్త యగుచు
నెవరి వయసుకు మేధకు తవినయట్టి
వింత యనుభూతు లొదవె ఆ వీటి యందు ॥ 244

మ॥ పదియేండ్లైనను నిండి నిండనిది యౌ పౌగండ ప్రాయంబునం
దిదమిద్ధమ్మని దేనియుంగుఱిచి తానే నిర్ణయింపంగ లే
ని దశన్ బామ్మయొ, తండ్రియో తనకు మంచిన్, చెడ్డ బోధించి ఆ
పదలన్ సోకగ నీయనట్టి దశ శంభాజీ చనెన్ "ఆగ్రకున్" ॥ 245

చ॥ ఎనిమిది యేండ్ల నాడె తన కెవ్వరు నేదియు నేర్పి నేర్పకుం
డినదశయందె న్యాసమగు తేవను నంబరు రాజు కట్టడిన్
పనిచిన కార్యముల్ సలిపి పంచ సహస్ర తురంగ తండమున్
అనినతి నేర్పుతో నడపు నాశ్విక నేతయు నయ్యె వీకతో॥ 246

చ॥ అపుడపుడేవొ భావనలు నా చిఱు శంభుని లే యెదందలో
నపచములై చెలంగునొక - నవ్యప్రబోధ ప్రభోదయమ్మెదో
రెప రెపలాడుచుండె - పసి ఱెక్కల నార్చెడు పక్కిపిల్ల చా
డుపున, నవోది తైణము కడున్వడి లేవదొడంగురీతిగన్ ॥ 247

ఛత్రపతి శివాజీ ఔరంగజేబు సభలో ప్రవేశించుట

చ॥ ప్రతన మహార్ఘ రత్న ఘృణి రాజిత హేమ శిఖండి పీఠికా
స్థితుడవురంగజేబు సభఁజేరె సమీకధనుంజయుండు - భూ
పతులు నమాత్యులున్ దణులు పార్షదులున్ తెరవెన్క స్త్రైణము
న్నతుల కుతూహలాత్ములయి యారయు చుండ శివాజి నత్తఱిన్॥ 248

తే॥గీ॥ సింహగంభీరుడు శివాజి శిరము వంచి
ప్రభువు ముందర ముమ్మాఱు ప్రణతిఁజేసె
మతి భవానిని స్మరియించి, పితను, గురుల
దలచి - రాట్సభాచారమ్ము తప్పకుండ ॥ 249

తే॥గీ॥ శివజి వెనుకనె తనయుడు చిట్టి శంభు
తండ్రి యాహార్య మెట్లట్టె తాను దాల్చి
నడుము దట్టీకి ప్రక్కన పిడెము చెరివి
తలను వంచక, కనుచు సభ్యులను, నడచె ॥ 250

తే॥గీ॥ చూచి చూడని యట్లుగా చూచుచుండి
శివజి రాకను - ప్రక్కనే చిఱుత శివజి
వలెనె నడచుచు పులిపిల్ల వాలకమున
యున్న 'శంభు'ని గని 'బాద్షా' యుల్ల మదిరె ॥ 251

(స్త్రైణము=స్త్రీ సమూహము) అర్ఘము=మూల్యము, విలువ
(ఆహార్యము=వేషభూషలు; పిడెము=బాకు) స్త్రైణము=స్త్రీ సమూహము

ఉ॥ వివిధములైన కాన్కలను విట్ప్రతికేవిసమర్పమట్టి గౌ
రవమున యప్పనమ్ములిడి క్రమ్మఱునట్టి శివాజికిన్ సభా
భవనము నందు నిల్వదగు ప్రాంతము చూపెను రామ సింహుడున్
శివజియు దానినిన్ తనకు నిమ్నపుటంతరువంచెఱుంగుచున్॥ 252

చ॥ కనలుచు "నాదుపట్టి సరిగా పది యేండ్ల వయస్సు వాడు - తా
నునయిదు వేల గుఱ్ఱములనున్ నియమించ గలట్టి వాడు-నిం
కను ననుగొల్చునట్టి గమికాంద్రురలో ఘనుడైన 'నేతజీ'
యును గలడేను వేల కుదరోత్కరమున్ నడపించు దట్టుడై ॥ 253

ఉ॥ నేను స్వతంత్ర రాజునను నిక్కము నీ విపుడొప్ప కుండ ని
మ్మే నవమానితున్ సలుప మేకొని నావిట నన్ను - దక్కనం
దేను భవత్ప్రభుత్వమున కీకొని సేవ నొనర్ప బూనినన్
కానవు మంచి చెడ్డలని గర్జిలి వీడె శివాజి తత్సభన్ ॥ 254

ఉ॥ "ఏమది? ఏమి యాయె"నని యేమియెఱుంగని వాని పోలికన్
వేమఱు కండ్లు మూయుచును విచ్చుచు నేటను గుంటనక్క యె
ట్లేమరకుండ చూచి చూడనటు లెత్తులు వేయును దాడిచేయగా
నామెయి తానమాయకత నద్భుత రీతి నటించె పాదుషా॥ 255

తే॥గీ॥ షైస్తఖాను సోదరి పాదుషాను కోరె
శివజి 'షైస్తఖాను'నకు చేసిన దురితము
నకును మరణ శిక్ష విధింప నర్హమనుచు
దాని నాలంపనా మదిన్ తలచు చుండె ॥ 256

మ॥ గతమందెప్పుడు పాదుషా కొలువునన్ కంఠంబు నిట్లెత్తి యా
ర్చుతుటారిన్ కనలేదు - పెద్దలు 'వజీర్లున్' గొప్ప 'కాజీలు' నున్
సతమల్లాను జపించు మౌల్విజనులున్, సర్దార్లు, యుమ్రావులున్
భృతమైయున్న సభన్ మరాట హాలికుండిట్లెద్రునే పాదుషన్ ॥ 257

(గమికాడు=సేనాధిపతి; కుదరము=గుఱ్ఱము)
(తుటారి=తుంటరి; భృతము=నిండిన; ఎద్రు=ఎదిరించు)

తే॥గీ॥ అనుచు 'తుర్కి', 'ఫార్సి', 'అరబు', 'ఆఫ్ఘను'లగు
పారదేశిక, స్థానిక భటులు రేగ
కడుపు కూటికి తొత్తులౌ కారణమున
యూర్కొనగబెట్టె పాదుషా యొక్క దృశిని॥ 258

మ॥ శివజీ యాగ్రహవృత్తి నా సభను చూచీ చూడనట్లున్న యా
యవురంగుండహికంట బడ్డ యెలు కన్యాధ్వమ్ము లేనట్లు నా
శివజీ యేడను బోగలండనుచు శిక్షింపన్ మదిన్నెంచుచున్
పవలున్ రేలును కాపునుంచి గృహనిర్బంధమ్ము చేసెన్ వెసన్॥259

చ॥ పితరుని గూడి శంభుడు నివేశన మందు వసింప - కాపుకా
యితులయి బంట్లు చుట్టుకొను చెవ్వరినైన శివాజి దర్శనా
గతుల బరీక్ష చేసి గర, ఘాతినులాది ప్రమాద కారులే
వితమునగూడ లోన జొఱ వీలునొసంగక యుండ్రి కన్కనిన్॥ 260

కం॥ శివజీ గృహ నిర్బంధ
మ్మువల నతనిని వధియింప నాలోచన యా
యవురంగ జేబు నెదను పు
రువట్లు తొలచునని యంబరూర్విపు డెఱుగున్ ॥ 261

కం॥ తన పదవి నిల్పుకొనుటకు
ననుజుని నగ్రజుల చంపె నాత్మజు నొకనిన్
యునిచెన్ చెఱలో - పితకే
వనటను కల్గించె - బాద్ష - వదలునె శివజీన్? ॥ 262

మ॥ 'జయసింగ'ప్పుడు జాబు మూలమున నిష్కర్షమ్ముగాదెల్పె నా
'శివజీ'కే చిఱుగాయమైనను - నవాచీ భారతోర్విన్, జ్వల
ద్దవమై రేగు మరాట వీరజన దౌర్హార్దమ్ము దుర్దాంతమై
యవలన్మీకు నసాధ్యమౌ గెలుపు 'యామ్యక్షోణి'నంచున్ వెసన్॥ 263

(తొత్తులు=సేవకులు; దృశి=చూపు)
(గరము=విషము; ఘాతిని=చంపునది; కన్కని=జాగరూకత)
(అంబరూర్విపుడు=జయసింహుడు)
(అవాచీ=దక్షిణదిశ; జ్వలద్దవము=మండు కార్చిచ్చు, దౌర్హార్దము=శత్రుత్వము)

తే॥గీ॥ 'అంబరీశు'ని యాప్తోక్తి నవధరించి
తగు నిపుడిదని "శాంతి" ముసుగు ధరించి
శివజి గూర్చి తాను కలుగఁజేసి కొనక
వీర భటులను కాపుంచి యూరడిల్లె ॥ 264

చ॥ స్వయముగ తానె పిల్చి యొక సౌధమునుండుట కిచ్చి -వెండి దు
ర్నయుడయి యేదియున్ పయికి నాడక లో కపట ప్రయత్నుడై
'ఖయిదుగ' మార్చి, ప్రాఘుణ నికాయమునాపి పరీక్ష సేయుచ
త్యయము నొనర్చు నట్టిడుల యట్లు 'శివాజి'ని చూచె పాదుషా ॥ 265

ఉ॥ శంభుజి చూచుచుండె తన సమ్ముఖమందు 'జహాపనా' యవ
ష్టంభము, తంద్రి యోర్మియును, సంభ్రమమున్, ధృతి, నీతి-క్షాత్రసం
రంభుడు, సాహసాంకుడెద రౌలగ శంభుజి నిశ్చయించె సం
స్తంభితు జేయ పాదుషను దక్షిణ ధాత్రిని శాశ్వతమ్ముగన్ ॥ 266

శ్రీ శివాజి 'ఆగ్రా' నిర్బంధము నుండి తప్పుకొనుటకు ప్రయత్నము ప్రారంభించుట

ఉ॥ గద్దఱియౌ శివాజి కట కన్పడ భావి విపత్కర స్థితుల్
యద్దమునందు చూచువహి - "నామొగలాయి పురమ్ము చేరుటే
గ్రద్ద నఖమ్ములం దిఱుకు కౌజుకు నుద్దిగ ముద్ది యేర్పడెన్
గ్రద్దన గడ్డకెక్కెడు ప్రణాళిక పన్నవలె"న్నటంచునున్ ॥ 267

తే॥గీ॥ నాటి నుండియు శివజి యా నగర మందు
ప్రథిత రాజ్యాధికారుల పరిచయమ్ము
మాన్యులౌ మతాధిపతుల మంతనములు
ముమ్మరమ్ముగ సాగింప మొదలు పెట్టె ॥ 268

(దుర్నయుడు=దుష్టుడు; ప్రాఘుణులు=అతిథులు; అత్యయము=నేరము)
(అవష్టంభము=అహంకారము; సంభ్రమము=కలత; ధృతి=ధైర్యము)
(గద్దఱి=నేర్పరి; ముద్ది=ఆపద; గ్రద్దన=వెంటనే) అంబర్+ఈశుని=అంబరీశుని

చ॥ దినమున కొక్కరీతిగను తేనియ లూరెడు తీపి భక్ష్యముల్
మును విని యుండనట్టి కడు మోదము గూర్చెడు వింత భోజ్యముల్
యనితర దేశలభ్యముల నద్భుత షడ్రస పూర్ణ పాకముల్
యనిశము కాన్కగా నగర మందలి పౌరులకంపు ప్రీతితో ॥ 269

తే॥గీ॥ వివిధ ఫలములఁదెప్పించి వేడ్కఁబంచు
పట్టువస్త్రములున్నికంబళుల నొసగు
'నాగ్ర', 'ఢిల్లి', 'మధుర' నగరాగ్రణులకు
వినయ భక్తి తత్పరుడయి ప్రీతి నించు ॥ 270

తే॥గీ॥ తనకు పహరాను కాచెడి తలవరులను
స్నేహ భావమ్ముతో చూచి శివజి వారి
కమితముగ ఫల, భక్ష్య, ధనముల నొసగి
వారి నమ్మకమును, నెమ్మి చూఱగొనియె ॥ 271

కం॥ వింతయగు నిట్టి కాన్కల
నంతముగా పంచు శివజి యాంతర్యముదౌ
యంతు నెఱుంగమి లోలో
చింతిలె ఔరంగజేబు చిత్రమిదంచున్ ॥ 272

తే॥గీ॥ పాణకలంత పెద్ద పుటికల యందును
గుండు జల్లలంత గుమ్మలందు
వంటకములనన్ని బహునైపుణిగ దిద్ది
ప్రతి దినమ్ము నంపు పలురుచులను॥ 273

తే॥గీ॥ వీవధము మధ్య యష్టికి వ్రేలగట్టి
వంటకములున్న బుట్టల భారములను
బలియులిరువురు కావడి బ్రద్ద రెండు
మొనలనెత్తి యంసములపై మోయుచుండ్రి ॥ 274

(వీవధము=కావడి; యష్టి=కర్ర)

తే॥గీ॥ ఆరెకులు కావడుల మోయు వారినాపి
తీవ్రముగ బుట్టలన్, వైవధికులఁగూడ
నరసి భక్ష్యరాశియె యున్కి నవ్వుకొనుచు
పోవననుమతించుచు నుండ్రి పూట పూట ॥ 275

చ॥ జరుగుచునుండె ఘస్రములుశ్రామములై - ప్రతి ప్రొద్దు ఖాద్యపుం
బరువులు మోయు కావడులపారముగా పురమందు బోవ-కో
వురపు భటాళికిన్ విసుగు పుట్టెను - నొండును, రెండు బుట్టలన్
బిరిన పరీక్ష చేసి కయి వీచుచునుండిరి నవ్వులాటగా ॥ 276

తే॥గీ॥ అప్పటికె మూడు మాసములయ్యె - శివజి
తన కొలకు నల్గురైదుగురనుచరులను
మాత్రముంచి తక్కిన వారి మగిడి "దక్క
ను" నకు చననంపె - జీజియా పనివినంగ ॥ 277

తే॥గీ॥ అంత తనకేదొ రుగ్ణత యనుచు శివజి
సెజ్జపై చేరి పలువురు వెజ్జులకును
వార్తలంపించి రప్పించి వైద్యమంది
నట్లు నటియించె కొన్నాళ్ళు వ్యాజరుజను॥ 278

తే॥గీ॥ పిదప జబ్బు కుదిరెనని వెజ్జులకును
మరియు వివిధ దేవతలకు మాన్యులైన
పూజరులకు కృతజ్ఞతా పూర్వకముగ
భూరిదానములిచ్చెను భూరి విధిని ॥ 279

తే॥గీ॥ అట్లు తన కొలకేతెంచియరుగు వారి
తో తన గృహమునన్నొదత్రొక్కిడయ్యె
యారెకులు సుస్తిగ నుండెడు నట్టి వేళ
నదె విముక్తికి నదనంచు నరసె శివజి ॥ 280

(ఆరెకులు=రక్షకభటులు; వైవధికులు=కావడి మోయువారు)
(ఘస్రములు=దినములు, శ్రామములు=నెలలు; కోవురము=కావలి)
(రుగ్ణత=అనారోగ్యము; వెజ్జు=వైద్యుడు; వ్యాజరుజ=దొంగజబ్బు)
(సుస్తి=సోమరి)

శ్రీ శివాజి, శంభాజీలు గృహ నిర్బంధము నుండి తప్పించుకొనుట

ఉ॥ అంతట నొక్కనాడునిక "యాగ్ర" ను వీడగ నెంచి యేరికా
వంతయు శంకలేనటుల వర్తిలుచున్ నొక బొట్ట యందు మే
నంతయును న్నిమిడ్చి శివు డాత్మజుడింకొక బుట్ట యందు తా
నెంతయు గుట్టుగా నొదిగి యిద్దరు వీడును వీడి రుమ్మడిన్॥ 281

తే॥గీ॥ శివజి యస్వస్థుడై యున్న స్థితిని గనుచు
నచటి పరిచారకులు పదు నడలు జూచి
యారెకులు తాము వారికి సాను భూతి
చూపు చుండిరి శోధన మాపి వైచి॥ 282

తే॥గీ॥ శంభు, శివజీలు దాగొన్న 'సజ్జ'ల జత
ముందు వెడలిన బొట్టలయందు జూచి
యచటి వస్తువు లెప్పటి యట్లె నొట
భటులు పోనిచ్చి రన్ని కావడుల నపుడు॥ 283

తే॥గీ॥ అచ్చముగ శివజిని పోలునట్టి వాడు
గాన - 'హీరోజి ఫర్జాందు' - కట్టె నపుడు
శివజి వేషము - తలనొప్పి నెవము చెప్పి
బైరవాసము ముసుగుతో పడక వేసె " 284

తే॥గీ॥ ఐననితరులకు ననుమ రాని విధిని
ప్రావరమునుండి యొక చేయి బయలనుంచె
శివజి ముద్రిక తొడిగిన చేతి వ్రేలు
నందరును జూడ - నొకతొత్తు నడుగు లొత్త ॥ 285

(శోధనము=పరీక్ష)

(సజ్జ=బుట్ట)

(నెవము=నెపము; బైరవాసము=దుప్పటి)

(అనుమ=అనుమానము; ప్రావరము=దుప్పటి; తొత్తు=సేవకుడు)

కం॥ అటులే శంభుని బూమెను
నటియింపగ మరియొకండు - నాటకమునకున్
ఘటియించిరి రక్తి - శివజి
భటులు విముక్తి గనిరి నట పారీణులునై ॥ 286

తే॥గీ॥ నగరమును ముందుగా దాటిన యనుచరు
లచట యేర్పాటు చేసిన యశ్వములను
నెక్కి శివజి, శంభాజీలు నేగిరపుడు
'నాగ్ర' కైదుకోసుల దూరమౌ 'కొటిక' కు॥ 287

కం॥ 'పాపము' 'శివజీ' కెంతటి
తాపమ్ము కలిగెనని పరితాప పడుచు నా
గ్రా పౌరు లచటి భటులును
చూపించిరి సానుభూతి చుట్టములటులన్ ॥ 288

తే॥గీ॥ కొంత తడవైన పిదప పై గుడ్డ తీసి
వైచి హీరోజి ఫర్జాందు బయటి కరిగె
తక్కుపరిజను లందరు నొక్క డొక్క
డా 'యవి'ని వీడి వెసంతెరమాయమైరి ॥ 289

ఉ॥ బారెడు ప్రొద్దు దాటియు శివాజి గృహమ్మున యెట్టి సందడి
న్నారయ జాలమిన్ భటులు నచ్చెరువందుచు పోయి చూడ నె
వ్వారలు గానరామి శివు పానుపు బోసిగ నున్కి చూచుచు
న్నారెకులున్ భయాకులులునై పరువెత్తిరి నన్ని దిక్కులన్ ॥ 290

కం॥ ఆ నగరాధిపు "ఫౌలాద్
ఖాను"ను ఔరంగజేబు గట్టిగ దూఱెన్
ఆ నెఱజాణ శివాజీ
తానేడ జనెనొ యెఱుగని 'ద్రాబ' వటంచున్ ॥ 291

(కోసు=1 1/2 మైలు; కొటిక=గ్రామము) అవి=ఇల్లు
(అచటు=ఆచోటు; తెరమాయమగు=అదృశ్యమగు)

తే॥గీ॥ వడిగ 'యాగ్ర' నెల్లెడల జల్లెడను బట్టి
యెంత గాలించినను గూడ యంతు బట్ట
దయ్యె - శివజి యేగిన జాడ - యద్దుకతగ
యెల్ల మొగలుల మొగములు తెల్లఁబోవ॥ 292

శ్రీ శివాజీ, శంభూజీ మాఱు వేషములతో పయనించుట

ఆ॥వె॥ కొటిక యందు నొక్క కుంభ కారుని యింట
శివజి, శంభుజీలు సేద దీరి
పిదప తైర్థికులుగ వేషమ్ములను దీర్చి
వారణాసిఁజేర పయనమైరి ॥ 293

శా॥ కాశీక్షేత్రము మెట్టి పుణ్యతమ గంగా స్నానమున్ చేసి వి
శ్వేశున్నంబను 'నన్నపూర్ణ' నఘ నాశిన్ భక్తితో గొల్చి 'డుం
ఢీ' శానాగ్రసుతున్ నిజోద్యమములన్ నిర్విఘ్నమున్ సేయగా
నాశీర్వాదము లీయ మ్రొక్కియట కొన్నాళ్ళుండగా నెంచియున్ ॥294

ఉ॥ వాసిని పుణ్యతీర్థములఁబాటియె లేనటువంటి 'కాశి'లో
వాసము సేత పూర్వభవ భాగ్యమె కాని - మొగల్ చరుల్ సునా
యాసముగా నిటన్ తమను నంకన పోల్తురు గాన కాశినిన్
బాసి చనన్వలెన్మధుర పట్నము కయ్యది లగ్గటంచునున్ ॥ 295

శ్రీ శివాజీ, శంభాజీలు మధుర చేరుట

చ॥ మధుర ప్రయాణమెంతయు శ్రమాస్పదమై బహు నిమ్నగాళి, వీ
వధమునకడ్డమై తటీయ వాటము తోచమి, నావికాళికి
న్నధిక ధనమ్మునిచ్చి తెరువందెదురౌ పలుచిక్కులన్నెదో
విధమున నోర్చి తత్పుర ప్రవేశము చేసిరి తండ్రి బిడ్డలున్॥ 296

(అడ్డుకతత=పాడుపుకథ) (అంకన=ఆనవాలు; పోల్చుట=గుర్తుపట్టుట; 'డుంఢీ' శానాగ్రసుతుడు=డుంఠి వినాయకుడు) నిమ్నగ=నది; వీవధము=దారి

మ॥ రుసికిన్దీటగు భూసురోత్తముడు 'మోరోపంతు పింగ్లేజి' తా
వసతిన్ కూర్చెను స్వీయ గేహమున శంభాజీ, శివాజీలకు
న్నసమానాదరమేదురమ్మయిన యయ్యాతిథ్య వాత్సల్య వి
శ్వసనీయ వ్యవహారశైలి శివజీ స్వాంతమ్మునున్ లోగొనెన్॥ 297

మ॥ పదియేండ్లైనను పూర్తిగాని పసి శంభాజీ పురోయాన మం
దెదురౌ గాసికి నోర్వలేడనుచు, తానేకాకియై పోయినన్
కుదియున్ శంకలు చూచు వారలకు – చిక్కుల్ కల్గినన్ బాపుకో
చదరమ్మౌ – సుతుతోడి పైన మరికిన్ శంకావహంబంచునున్॥ 298

శా॥ మోరోపంతు కనీయ నందనుడు సమ్మోదావహాజానజో
దారాంతర్యుడు, 'కాశి పంతు' ప్రియ మిత్రంబయ్యె శంభాజీకిన్
వారిన్జూచి శివాజి నెమ్మదికి సాంత్వంబయ్యె – శంభాజికిన్
దూరమ్మై చనగల్గు గుండె దిటవున్ తోడ్తో ప్రవర్ధిల్లగన్ ॥ 299

శ్రీ శివాజి శంభాజీకి కృత్రిమ అంత్యేష్టి జరిపించుట

తే॥గీ॥ శంభు తనతోడ లేమికి సందియమ్ము
శాత్రవులకు కలుగ కుండ – "శంభుడెదియొ
జబ్బుతో నుండి కాలగోచరుడునయ్యె"
ననుచు చాటె తన నెఱుగు నందరకును ॥ 300

తే॥గీ॥ మఱియు నంత్యేష్టి జరిపించె మంత్ర తంత్ర
వేత్తలౌ విప్రులను బెట్టి విధియుతముగ
శ్రద్ధతోడ శివాజి నిజాత్మజునకు
తీర్థతటమున– జనులు సందియములుడుగ॥ 301

కం॥ మోరో పంతుని యింటను
గారాబుసుతుండు శంభు, కాశీ పంతున్
వేఱిమి నెఱుగని మైత్రీ
పారమ్యత మెలగ, శివజి పయనమ్మయ్యెన్ ॥ 302

శ్రీ శివాజీ రాయగడము చేరుట

ఉ॥ రాయగడమ్ము చేరుటకు రాత్రులునుంబవళుల్ విరామమే
నీయక దుర్గమాధ్వముల నిత్యతమోపిహితాటవీస్థలుల్
పాయక వెల్లువై వడిగ బాఱెడు నేఱుల నెత్తు కొండలన్
'హెూయ'ని మ్రోగు కందరము లొక్కటి నొక్కటిగా క్రమించుచున్॥ 303

కం॥ శివజీ 'గోసాయీ' బూ
మెవేసి గోసాయి సాధు మేళకమందు
న్నెవరికి యనుమానము రా
ని విధిననుకరించి వారి నెగుచుచుఁ జనియెన్ ॥ 304

తే॥గీ॥ పోవు దోవయందు తనను పోల్చుకున్న
వారు–పూజరి, గ్రామణి, పల్లె జనుడు
గుఱపు బేహారి – వీరికి కొండయంత
యొడమెనిడి – శివాజీ రాయగడము చేరె ॥ 305

జీజియా శివాజీని తన మనుమని గూర్చి యడుగుట

చ॥ కొడుకును కౌగిలించి కనుగోనల కారెడు నశ్రులాగి – "యె
ట్టిడు నెటులైతి వెట్టుల శఠించితి వాయవురంగ జేబు నె
క్కడ మనుమందు? నా కెపుడు కన్నులలో కదలాడు బొట్టె – యె
ట్లొడబడె నీ మనమ్మతని యొంటిగ వీడుచు నిట్లు రాకకున్"॥ 306

తే॥గీ॥ అనుచు పలవించు జీజియా యంఘ్రులంటి
జరిగినట్టి వృత్తాంతము జనని హృదికి
నాటునటుల చెప్పె శివాజి – నప్త శంభు
మధుర విప్రుల యింటిలో మసలు విధము ॥ 307

(క్రమించు = దాటు) బూమె=మారువేసము
(ఎగుచు=అనుసరించు) మేళకము=సమూహము
(ఒడమె=ధనము)
(నప్త=మనుమడు)

తే॥గీ॥ శివజి వెన్క రెండు నెలల వ్యవధిలోనె
'శంభుజీ', 'కేశొ పంతు', 'కృష్ణాజి జనని'
ఎన్నొ తిప్పలు బడి దారి నెట్ల కేల
కరుగుదెంచిరి 'రాయరీ' గడమునకును ॥ 308

చ॥ మధుర పురమ్ము వీడి గమమల్లన 'యుజ్జని' చేరినంత – వీ
వధమున, 'తుర్కకార్యి' తమపై యనుమంగొని, 'శంభు' జూపి, యే
విధమున నీకనుంగునన? బిడ్డడటంచన పంతు, నాదు స
న్నిధి నొక పుల్లె నానుదెరనిద్దరనందిని, ముక్తులైరటన్ ॥ 309

శివజీని జయసింహుడే తప్పించెనని ఔరంగజేబు ఆగ్రహించుట

ఆ॥వె॥ ఆగ్ర నగరమందు నాగ్రహోదగ్రుడై
రగులు చుండెను 'యవురంగజేబు'
చేత చిక్కినట్టి 'శివజి' మాయమగుట
తన తల తొలగించు ననువు తోచి ॥ 310

ఉ॥ వెంటనె రామసింగుఁ పిలిపించుచు సన్నిధి కిట్టులాడె – "నీ
యంటునగాదె యా శివజి కంతటి ధైర్యమువచ్చె తారగన్
గొంటులు నీవు నీదుజనకుండును, వంచన చేసినారు – మీ
వంటి కృతఘ్నులన్ కొలువు వారిగ చేర్చుట నాదె దోసమౌ" ॥311

తే॥గీ॥ అనుచు రామసింహు కొలువునపనయించి
తొల్లి యిచ్చిన బిరుదముల్ తొలగ జేసి
అన్ని జాగీర్లు మాన్యముల్ సున్న జేసి
ధనము మానము రెంటికి దవ్వు జేసె ॥ 312

గమము=ప్రయాణము; కార్యి=ఉద్యోగి; ఉజ్జని=ఉజ్జయని; అనుంగు=బంధువు; ఆను=తిను; పుల్లె=ఆకు, విస్తరి; ఎర=ఆహారము) అనువు=విధము; (అంటు=స్నేహము; తారు=పాటిపోవుట; గొంటులు=దుష్టులు)

చ॥ అటు జయసింహుపైన తన యాగ్రహమున్ ప్రసరింప జేయుచున్
"కుటిలత చూపినావు తుద కో జయసింహ! శివాజి కీవు నెం
తటి యుపకారమో తలచి యాతని నాకడ కంపినావు - మీ
నటన మెఱింగితంచు వెస నాతడు నూడని బాడె ముచ్చటుల్॥ 313

తే॥గీ॥ ఇపుడు నీ యధికృతిని తగ్గించు చుంటి
వేగ దక్కను విడిచి నీ విటకు రమ్ము
చూచుకొందమా పైనిక సొడ్డు లేవొ
యెన్నగ పరోక్షమందేల? యెదుట నిలుము"॥ 314

ఆ॥వె॥ అనెడు ములుకులట్టి 'ఔరంగజేబు'ని
మాటలకును మనసు తూటు వడియె
కండ బలమె తప్పు, కౌటిల్యమెఱుగని
రాజపుత్రు గుండె గాజువాఱె ॥ 315

రాజా జయసింహుని పశ్చాత్తాపము

శా॥ "మానప్రాణములా జహాపనుని సామ్రాజ్యాభివృద్ధ్యర్థమై
పాణంబొడ్డుచు మేము - హిందువులకున్ ప్రాణాంతకంబైన సు
ల్తా నాజ్ఞల్ తలదాల్చి వాని నెరవేర్పన్ సిద్ధమై, బాధ్యతల్
పూనంజంకగలేదు-నిట్టి మాపయిని తామోపెన్-కృతఘ్నుత్వమున్॥ 316

చ॥ చిలుకకు చెప్పినట్లు 'శివజీ' పలు మారులు చెప్పె, నీ మొగల్
ఛలకుని వీడి హిందువుల స్వామ్యము కల్గిన రాజ్యమొండు నె
క్కొలుపగ - కాని దేశమునె కొల్లగొనన్దెగి సర్వ సంపదల్
వలతిగఁజేసికొన్న నెఱ, 'పాదుష' నెట్టు జయింప శక్యమౌ? ॥317

(ఊడనిబాడెన్=పారిపోయెను)
(తూటువడు=దెబ్బతిను; గాజువాఱు=మసకబారు)
(పాణము=పణము)
(వలతి=వశము; ఛలకుడు=మోసగాడు, నెక్కొల్పు=స్థాపించు; నెఱ= నేర్పరి)

ఉ॥ బుక్కెడు బువ్వ కోసమయి పోరెడివారికి హిందు - తుర్కలు
న్నొక్కటె - క్షుత్పిపాసలవి యూఱడినప్పుడె తాము నెవ్వర
న్నిక్కము జ్ఞప్తికిందగులు - నెవ్వరి నైనను తట్టిలేపి యే
ప్రక్కన మీరు నిల్తురని ప్రశ్నను వేసిన చూపు 'తుందమున్' ॥ 318

ఆ॥వె॥ జాతి మతముల కయి లాతివారి నెదిర్చి
పోరినారు రాజపుత్రు లెపుడు
నైకమత్య మచట యగుపడనందున
భంగపడుచు నరికి లొంగినారు ॥ 319

చ॥ తురకలు హైందవేభ్యులను - తుర్కమహీపులఁ హిందు సైనికుల్
పరువడిఁగొల్చుటన్ గనమె? పాపము! హైందవ జాతి దైన్యము
న్నఱగ గ్రహించి వారల మతాంతరులన్నొనరింత్రు-సొమ్మునున్
వెఱపును-బల్మి-యే వెరవు వీలగునో యవియెల్ల పన్నుచున్ ॥320

మ॥ నిజమే, యైక్యతలేని కారణమునన్ యీ నాడు హిందూ స్వరా
జ్యజనిన్ కన్నులఁజూచు భాగ్యమును నోచన్ లేదు యీ హైందవీ
ప్రజలేనాడిది యాకృతింగొనునొ నీపై యున్న దా భారమిం
క జనాళింగదలింపుమో శివజి ! వీకన్ స్వేచ్ఛకై పోరగన్॥ 321

తే॥గీ॥ అస్తమించెను నా భవిష్యమ్ము నేడు
రామ సింగు జీవితమును అవ్వయాయె
చెనటి ఔరంగజేబుని చేరి కొలిచి
యిట్టులైతి మిల చరిత్ర హీనులముగ"॥ 322

(తుందము=కడుపు)

(ఇభ్యులు=రాజులు; మహీపులు=రాజులు; పరువడి=శ్రద్ధ; పన్ను=వ్యూహాలు రచించు; అఱ=లోపము)

(జని=పుట్టుక; వీక=పట్టుదల)

రాజా జయసింగు నిర్యాణము

తే॥గీ॥ అనుచు శివజీకి తనమనో వ్యధను తెలిపి
యంబరేశుడు ఢిల్లీకి యరుగునపుడు
నధ్వమధ్యము నందు "బుర్హానుపురి" ని
స్వర్గతుండయ్యె వ్యధలన్ని సమసిపోవ ॥ 323

ఔరంగజేబు శివజీని బుజ్జగించుట

తే॥గీ॥ పంజరమ్మున చిక్కిన పక్కియెగిరి
పోవ 'బాద్షు' వ్యాధుడు మనో వ్యాధితోడ
పెక్కు దినములు చింతించి వేరు దారి
లేక తుదకు సయోధ్యకే మోకరిల్లె ॥ 324

శా॥ 'ఔరంగ్‌బాదు'కు పంపెనాత్మజుని షాహ్జాదా "ముయజ్జమ్మునున్"
పేరెంబెత్తెడి శూకలాశ్వము వలెన్నీడున్వెయింగల్గు వా
డా రాజప్రతిహస్తకాధికృతి తోడన్జేరగానద్భుతా
గారమ్మున్ వసురత్న శోభితమటన్ కల్పించె వాసార్ధమై ॥325

మ॥ శివజీ కప్పుడు లేఖ బంపె యవురంగ్జేబుండు "ఓ వీరుడా!
స్తవనీయంబగు నీదుధైర్యమున్ మెచ్చన్ మాటలే లేవు – నీ
దవు ధీశక్తియు, యుక్తి, శౌర్యముల ముందస్మచ్ఛమూపాళిలో
తవునంచొక్కడు గూడ నిల్వడని నిర్ద్వంద్వమ్ముగా చెప్పెదన్ ॥ 326

కం॥ 'రాజా' బిరుదముతో వి
భ్రాజిత యశుంజేతునిను ప్రపంచమ్మెఱుగన్
నీ జతను 'షాజాదా
మౌజము' ప్రాపగు నవాచి మహిఁబాలింపన్ ॥ 327

(శూకలాశ్వము=అడవి గుఱ్ఱము; రాజ ప్రతిహస్తకాధికృతి=రాజ ప్రతి నిధిగా అధికారము) ఈడు=యవ్వనము

ఔరంగజేబు శంభాజీని ప్రశంసించుట

మ॥ పదిరెండేళ్ళ వయస్సెయైనను భవత్స్వచ్ఛందజుండైన "శం
భు" దణా పెద్దల నేరితో నయిన తాఁబోలున్ - నిను న్మించు వా
డదిరా! వీని యవక్రవిక్రమపు ఛాయల్ చూచితిన్ సింగపుం
గొదమట్లుండెను వాని రీవి సభికుల్ కొండాడగామత్సభన్॥ 328

తే॥గీ॥ అనుచు మిపుదు శంభాజీని యైదువేల
గుఱపు దడమున కధిపుడై కొలువు నందు
'రాజప్రతి' ముయజ్జము' యువరాజు నాయ
కత్వమునను' మన్సబుదారు కాగలండు॥ 329

శివాజీ ఔరంగజేబు సౌమనస్యమునకు సంతోషించుట

శంభాజీ షాజాదా మౌజము కొల్వులో చురుట కీ.శ.1668

ఆ॥వె॥ అంత శివజి తలచె 'యౌరంగజేబు'ని
సౌమనస్య మొలుకు సరణి జూచి
మారెనేమొ? కొంత యౌరంగజేబిప్డు
స్నేహబుద్ధి చూపె ద్రోహముడిగి ॥ 330

తే॥గీ॥ పిదప మంత్రులను పిలిచి పెద్ద ప్రొద్దు
మంతనము లాడెను విషయమంత చెప్పి
దీని యౌగాములు పదే పదే తఱచుచు
మంచి దనిరి కొట్టకొసకమాత్యవరులు ॥ 331

శా॥ కానీ జీజియ పుత్రు వైఖరికి నల్కంబూనె - "ఓహెూ శివా
జీ! నీ కంటికి నెట్లుఁదోచు మనయీ చిన్నారి పన్నెండు నేం
డ్లైనన్ నిండగ లేదు - శంభుకపుడే ఔరంగబాద్ కొల్వులో
న్తానే బాధ్యత మోసి చూపుననుచున్ భావించితో చెప్పుమా! ॥ 332

ఆ॥వె॥ పుట్టినపుడె తల్లి బుజ్జవ మెడలెను
నెనిమిదేండ్ల కంబరేశుఁగొలిచె

(స్వచ్ఛందజుడు=కుమారుడు; దణాపెద్దలు=సేనానాయకులు)
(అనుచుము=పంపుము; రాజప్రతి=రాజప్రతినిధి)

పది సమముల 'కాౖగ' బందీగ మారెను
ద్వాదశాబ్దుల కిక దక్కుటేదొ ! ॥ 333

ఆ॥వె॥ అనుచు నస్రాబ్దులౌ యంబ యంబకములు
కాంచియును, శివాజి యెదగట్టి పరచి
ఆయి! హిందూ స్వతంత్ర రాజ్యార్ధమిపుడు
చిన్న శంభుని పెద్దను చేతు ననుచు ॥ 334

శా॥ శంభాజీ నపుడంపె నా శివజి షాజాదా "ము అజ్జమ్" విభున్
దంభాపేతుని, నూత్నయౌవన దశోత్సాహాంతరున్ - తద్వయో
రంభ ప్రాకృత దైహికాను భవ సంరంభాత్ము - మైత్రీప్రియున్
శుంభచ్ఛ్రీ విజితేంద్ర వైభవయుతున్ చూడన్, కొల్వునంజేరగన్॥ 335

ఉ॥ ఆయువరాజు సౌధ సుషమాతిశయమ్మునకా స్వరాట్కుబే
రాయతనమ్ములే నత శిరమ్ములు నౌననంజెప్పనేల, నిం
కే యవులా నికాయ్యమున కీదృశమంచును - నుర్వి సర్వమం
దే యిరవైన గాని కొరవేయగు పోల్పగ నా బవంతితో ॥ 336

ఉ॥ 'ఫారశి' దేశ చిత్రనవ వర్ణ విభాసిత రత్న కంబళ
శ్రీరమణీయ కుట్టిమవిశిష్టము - కర్బురకుడ్యకాంతి వి
స్మేర మనర్ఘనైక మణి మేదుర పాదిక మద్భుతోన్నత
ద్వార సమేత హర్మ్యవిభవమ్మున కచ్చెరు 'వందె శంభుడున్'॥ 337

సీ॥ ఏయెడ పొడగన్న హేమ, రౌప్య చిరత్న
రత్నరచిత వస్తు రాశి మిసిమి
ఏ చాయ చూచిన నిక్షు శరాసన
బాణ సన్నిభలైన పడతి పిండు

(అంబకములు=కన్నులు; ఆయి=మరాటా భాషలో 'అమ్మ' కు సంబోధనము)

(స్వరాట్=ఇంద్రుడు; ఆయతనము=ఇల్లు; అవి=ఇల్లు; నికాయ్యము= ఇల్లు; ఈదృశము=సమానము)

ఏ తెన్ను కనుగొన్న నెన్నెన్నొ వన్నెల
చీనాంబరమ్ముల జిలుగు వెలుగు
ఏ వంక తిలకింప నెదురగు మధు పూర్ణ
స్వర్ణచషకముల జవర యులివు॥

తే॥గీ॥ నెట్టి కక్ష్యను వీక్షింప తట్టి పిలుచు
షడ్రసోపేత పంచ భక్ష్యములగములు
నృత్య గాన వినోద నిర్నిద్ర మగుచు
రేబవళ్ళును యువరాజు గృహముచెలగు ॥ 338

కం॥ టోపీలు కుట్టి యమ్ముచు
పాపఘ్ని 'కొరాను' ప్రతులు వ్రాయుచు నెపుడున్
జాపసరముత్రిప్పుచు, "జిం
దాపీర"ను 'బాద్షు' కిట్టి తనయుడు కలిగెన్ ॥ 339

ఉ॥ అట్టి సుఖోపభోగ విషయాస్పదమౌ యువరాజు జీవిత
మ్మెట్టెదురన్ కనుంగొనుచు నేమని యెంచెనొ శంభు బాలుడా
చిట్టి మనంబునందు వికసించిన భావన లెట్టి వౌనొ? యే
దట్టు డెఱుంగు-కేవలము ధాతయె తప్ప మనుష్య మాత్రులన్॥ 340

ఉ॥ ద్వాదశ వర్షప్రాయు డగు బాలుడునయ్యును 'శంభు' నిత్యమున్
సాదనతో ఖళూరికను సాధన చేయుచు నైక యుద్ధవి
ద్యాదర బుద్ధియై యొడలి దార్ఢ్యము పెంపొనరించుకొంచు తా
మూదల యయ్యె పెద్దలకె, ముఖ్యముగా గడిదేర పోరులన్॥ 341

ఉ॥ ప్రాంశు శరీరయష్టి - తను వర్ణము నీడగు తప్త శాతకుం
భాంశువు తోడ - చూపఱు ప్రభావితులయ్యెదు సుందరాస్య శీ
తాంశుడు - మాంసలాపఘను - డాజిరిపూత్కర దుర్నిరీక్ష్యతి
గ్మాంశుడు-శంభు తేజమును కన్నుల త్రావెద రెల్ల వారలున్॥ 342

జిందాపీర్=మతధర్మ వేత్త (సాదన=నైపుణ్యము; ఖళూరిక=గరిడిశాల; మూదల=ఆదర్శము) (ప్రాంశు=ఎత్తైన; యష్టి=శలాక; శాతకుంభము=బంగారము; చూపఱు = ప్రేక్షకులు; శీతాంశుడు=చంద్రుడు; తిగ్మాంశుడు=సూర్యుడు)

శా॥ పన్నెండేడుల లేత యీడుగల 'శంభాజీ'ని 'షాజాదు' తా
మన్నించున్ తనతో సమానునిగ సన్మైత్రిన్ ప్రదర్శించుచు
న్నెన్నోమారులు వెంటకేగునపుడున్ వెన్వెంట గొంపోవు శం
భు న్నత్యాదరమొప్ప-శంభుడిటులన్ ముఖ్యుండునయ్యె న్నటన్॥ 343

తే॥గీ॥ క్రూర మృగముల వేటాడు కొఱకు ముందు
వేటలకు మత్తు మందు తిన్పించి - పిదప
యెరగనుంచగ వాని భక్షించి మత్తు
గొన్న మృగముల చంపుటే గొప్పవేట॥ 344

చ॥ ఇదిగని శంభుజీ యడిగె - "యిట్లు మృగమ్ముల మత్తిలంగ జే
సి దునుము టేమి గొప్ప" యని - చెచ్చెఱ రాట్సుతుడిట్లు వాకొనెన్
"ఇదియొక రాజనీతి - రిపు లేమరి యుండగ చేసి వారలన్
హదమొనరించుటే కుశలమౌ యొక పద్ధతి రాజ్య కాంక్షికిన్"॥ 345

ఉ॥ ఇప్పటిదాక శత్రు నెదిరించెడు పద్దతులందు వంచనన్
తప్పని, తప్పుగానిదను తార్కిక వాస్తవమప్డు చెప్పె క
న్విప్పుగ శంభుకా మొగలు వీరుడు - రాజతికమ్ము నందుయే
తప్పుడు దారులైన యవి ధర్మము లౌనని గూడ తాననెన్ ॥ 346

తే॥గీ॥ ఆర్జవము, నీతి, ధైర్య సాహసము లివియె
వీర లక్షణములనుచు విశ్వసించు
శంభు కౌరంగజేబు విజయ పరంప
రల వెనుక గుట్టు మట్లిప్డు తెలివిడయ్యె ॥ 347

శంభుజీని బంధించుటకు ఔరంగజేబుకుట్ర - షాజాద మౌజము కుట్ర బహిర్గతము చేసి శివాజీని, శంభుజీని, ప్రతాపరావులను రక్షించుట

తే॥గీ॥ ఇట్లు కాలమ్ము గడువ యున్నట్లె యుండి
యొక్క నిశిని "మౌజము" తన యొద్దకపుడు

(వెంట=వేట; వేట=క్రూరమృగములకు 'ఎర' గాంచు జంతువు)

రమ్మ" నుచు వార్తను ప్రతాపరావు గుజరు
కంపె శంభుజీ దణికి వేగరుల చేత॥ 348

తే॥గీ॥ తదుపరి ప్రతాప రావు కాతండుఁ జెప్పె
"మజ్జనకుడు శివజిని, శంభాజిని మిము
బంధితులఁజేసి "గ్వాలియర్" బందిగముకు
పంప నాజ్ఞలిడిన వార్త వచ్చెననుచు ॥ 349

శా॥ కానీ నా చెలియైన శంభుని మిమున్ కాపాడగా నెంచితిన్
యీనాడే, యిపుడే హుటాహుటిగ మీరేగన్ వలెన్ రాయగడ్
సేనా వారము,నీవు జాగృతులునై చిన్నారి శంభాజికిన్
పైన మ్ముందున యే యపాయములు దాపైనన్ నివారించుచున్"॥ 350

తే॥గీ॥ అనుచు నార్ద్ర భావమున తానపటి కపుడె
పరులెఱుంగనట్లౌరంగబాదు నుండి
శంభుని ప్రతాపరావు రక్షణము నందు
తక్షణమె పంపె షాజాదుదారుడగుచు ॥ 351

'ఔరంగజేబు' చేసిన కుట్రకు 'శివాజీ' అగ్రహాము చెందుట

చ॥ జరిగిన దంతయున్ తెలిసి చండతరాగ్రహ వీతి హోత్ర మం
తరమును గాడ - శంభునకు తప్పిన ప్రాణప్రమాద గాధ - ని
ర్భరమగు నూఱట న్నిడగ - రక్కసుడౌ యవురంగ జేబు ము
ష్కరత నెఱుంగు నా శివజి కాదగు కార్యములెంచె నాపయిన్॥ 352

చ॥ "తొలి జయసింగు మాధ్యమముతో తన 'నాగ్ర'కు నామతించియున్
కొలువున చిన్నబుచ్చి చెఱకున్ సరిపోలెడు కాపువెట్టి నన్
వెలుపలికేగ నీక యటు పిమ్మట యాఫ్ఘనుకంపి - మాతృ భూ
తలి కెడ సేయగా దలచె - దౌష్ట్యమనంగ నికేమి కావలెన్॥ 353

తే॥గీ॥ పది శరత్తుల బుడుత 'శంభాజి'ని సయి
తమ్ము - నదుపులో నుంచి, హైందవము తొలచి

తురక సర్దారుగా భారతోత్తరధర
నొక కొలువు నీయ దలచె యీ యుక్తివుండు॥ 354

శా॥ ఆపై మేమునెదోయుపాయమున కారావాసమున్ బాయ - దా
నే పన్నాగము తోడనో మము నిరోధింపంగ బూనెన్ - భవా
నీ పాదమ్ముల నమ్ముకొంచు నెటులో నిర్మూలితాతంకతన్
మా పేరన్నడు గేసినాము - మరుజన్మంబెత్తినట్లన్నటుల్ ॥ 355

ఆ॥వె॥ మమ్ము నిగ్రహించు మార్గమ్ములే లేక
సంధి చేసికొనియె శాంతుడగుచు
నా స్వతంత్రత నెద నంగీకరించుచు
'రాజ' బిరుదిడె యవురంగజేబు॥ 356

ఉ॥ పుట్టుక తోడనే విసపు పుర్వగు వాడెటులైన మమ్ములన్
మట్టును బెట్టగా తగిన మార్గములన్ వెదుకాడుచుండి యి
ప్పట్టున శంభు కశ్వపతి బాధ్యత నిచ్చిన యట్లె నిచ్చియున్
తుట్టతుదన్ వధింప నిటు ద్రోహపు నూహము చేసెనద్దిరా॥ 357

తే॥గీ॥ ఆట కట్టయ్యె వానికీనాటి నుండి
నా స్వతంత్రత కింకెట్టి నట్టు లేదు
మొగలు పాలన మికపైన ముగిసినట్లె
సలిపె దీనాటి నుండి నా జైత్రయాత్ర"॥ 358

శ్రీ శివాజీ జైత్ర యాత్ర

ఉ॥ "కొండన కోట" గెల్చె నడగొండ వలెన్ బలియైన తానజీ
భండన భూమిలో నసులు బాసియు - తోరణ కోటలోగె - యా
మెండున నెన్నొ దుర్గముల మీద కషాయ పటధ్వజాళితో
నిండిన నింగితోచె ననునిత్యమనస్తమితార్క ధామతన్ ॥ 359

(పేర=భూమి)

(నట్టు=ఆటంకము)

(మెండున=విధమున)

తే॥గీ॥ కదలె కటకము 'పన్హాలా' గడము గెల్వ
పటుతరాజిని గడమేమొ వశిత మయ్యె
గాని భండన గాండీవి కనులు మూసె
దణిలలో కౌస్తుభమణి ప్రతాప రావు ॥ 360

శ్రీ శివాజీ 'సూరతు'ను కొల్ల గొట్టుట (క్రీ.శ.జనవరి 1664)

కం॥ మొగలుల ప్రభుతకు నార్థిక
ముగ, వాణిజ్యమందు మూల స్థానం
బగు నగరము 'సూరతు' పా
తగలించిరి మొగి మరాటులర్థము గొనుచున్ ॥ 361

శా॥ ఆపై 'సాల్హెరు' కోట ముట్టగ మరాటానీకినుల్ వారల
న్నాపంగన్ మొగలాయి సైన్యములపారానీక సామగ్రితో
పై పడ్డన్ తుములాహవమ్ము జరిగెన్ పక్షద్వయమ్మందునన్
మోపౌ నష్టము సంభవించె శకటేభోష్ట్రాశ్వ సైన్యాదులన్ ॥ 362

ఉ॥ పీనుగు పెంటలై పడెను వేలముతో హయకుంజరోష్ట్రముల్
ప్రాణములన్ మిగుల్చుకొని పాఱిరికొందరు భీత సైనికుల్
వేనకు వేల సైనికుల లెక్కదిగెన్ శతమాన సంఖ్యకున్
లోనుపడెన్ మరాటుల బలోద్ధతి కాగక 'సాల్హె' రంతటన్ ॥ 363

తే॥గీ॥ ఆరువేల గుఱాలొంటె లసుర చయము
శకటములు, తిండి దినుసులు, స్వర్ణ, రజత
మణిమయ విభూషణాదిక మౌ యమూల్య
వస్తు వితతి మరాటుల పరమునయ్యె ॥ 364

తే॥గీ॥ "బగలాన్" సీమను కొండకొమ్ము నెలవై వాసించు "సాల్హేరు" కో
ట గడింపన్ భయదాహవమ్మున మరాటా వీరులే జేతలై
మిగిలున్నట్టి యనేక దుర్గలటులే మీద్రై ప్రతీచ్యబ్ధి తా
కగ రాజ్యావధి విస్తరించిరి శివక్ష్మాభృచ్చమూనాయకుల్ ॥ 365

(దణి=సేనాధిపతి) (అనీకిని=సైన్యము; అనీకము=యుద్ధము)
(వేలము=సైన్యము) (దుర్గ=దుర్గము; మీదు=వశము) అసురము=ఏనుగు(వై.ని)

శ్రీ శివాజీ పట్టాభిషేకము - శ్రీ శంభాజీ యువరాజ పట్టము (క్రీ.శ.1674 జూన్ 6)

తే॥గీ॥ 'రాయగడు' కోట పర్వతాగ్రమ్ము పైన
కడు విశాలమౌ బయలులో కట్ట బడియె
గ్రావ వప్ర కంధావాట కఠిన మగుచు
రమ్య హర్మ్య సభాట్టక రాజితముగ ॥ 366

ఉ॥ ఆ దినమందు రాయగడమందలి పౌరులె కాదు - సర్వ హిం
దూదధి మేఖలన్ మనుచునున్న సనాతన ధర్మ నైష్టికుల్
మోదము నొందగా దగిన ముఖ్యముహూర్తము - నాడు శ్రీ శివుం
డౌదలదాల్చె "ఛత్రపతి' యై, తత 'హిందు స్వరాజ్య' భారమున్॥ 367

ఉ॥ అందలి రాట్సభా భవన మందము లొల్క నలంకృతమ్మునై
విందొనరింప ప్రేక్షిజన వీక్షల కా సువిశాల శాలలో
సుందరమౌ సమున్నతవిశుద్ధ సువర్ణ వితర్దికోపరిన్
పొందగు దైవమందిరము పోలెడు కొ్రప్పు పైడి గద్దియన్ ॥ 368

సీ॥ రత్న ముక్తాహార రాజి రాజితమైన
'భగవా' మెఱుగు తలపాగ తోడ
వెలదివెన్నెల లొల్కు వెలిపట్టు నంగీయు
నఱుత ముక్తావళి సరులతోడ
గట్టిగా నడుముకు కట్టినధట్టిలో
డాప్రక్క ఛురిక, ఖడ్గముల తోడ
చక్కగా తీర్చిన శ్మశ్రు కూర్చములతో
చుఱుకుగా కదలెడు చూపుతోడ ॥

తే॥గీ॥ కనుల తోనె జీజాంబ దీవనలు గురియ
జ్యేష్ఠ పుత్రుడు శంభాజి చెంత నడువ
గంధ సింధుర గంభీర గమన మొలుక
నేగి శ్రీ శివాజీ యధిష్ఠించె గద్దె ॥ 369

తే॥గీ॥ 'కాశి నుండి వచ్చి పురోధ' 'గాగభట్టు'
శాస్త్ర చోదిత పద్ధతిన్ జరిపె 'యిష్టి'
తగినయాగమ మంత్ర తంత్రములతోడ
శివుని యవభృధ స్నాతుని చేసెనపుడు॥ 370

శా॥ శ్వేతచ్ఛత్రము నీడ "ఛత్రపతి" యై సింహాసనం బెక్కి "తా
నేతద్భవ్యముహూర్త కాంక్షియగుచున్ యిన్నాళ్ళు వేచెన్ - జన
వ్రాతంబీపయి క్షత్రియాన్వయునిగా భావించి మన్నింత్రు భూ
నేతల్ తన్నికసాటి భూపకునిగా నెంత్రంతరంగమ్ములన్" ॥ 371

తే॥గీ॥ అని శివాజీ ప్రగాఢమౌ తనివి తోడ
"గాగ భట్టు" కు తగినన్ని కాన్కలిచ్చి
విప్రసంతర్పణలు, ధేను వితతి సేవ
లాది షోడశ దానములపుడొసంగె ॥ 372

శ్రీ శివాజీ రాజ దండము - దాని విశిష్టత

ఉ॥ రాజత రాజ దండము కరమ్మున దాల్చె శివాజి - దానిపై
రాజిలు పైడి గుబ్బపయి వ్రాయ బడెన్నొక పిల్లచేప - యా
పై జళుకించు పెద్ద 'తిమి' వక్త్రము విప్పుగ - తక్కెడొండు - వి
భ్రాజిలు 'ఓం' యటన్నలిపి - రాట్పరిపాలన తీరు తెల్పగన్ ॥ 373

సీ॥ పృథుక మత్స్యము బీద బిక్కిని తెల్పును
రాజ ధర్మము వారి రక్షణమ్ము
వివృత వక్త్ర తిమియు - పీడకులకు గుర్తు
క్షితిపు ధర్మము - వారి శిక్షణమ్ము
'తుల' సూచిక యగు తులిత న్యాయమునగు
ప్రభువు ధర్మము సర్వ ప్రజల కిడగ
'ఓం' లిపి చెప్పును నొక్కడే యఖిలాండ
కోటి బ్రహ్మాండాధి రాట్టటంచు ॥

(రాజత=వెండితో చేయబడిన; జళుకించు=భయపెట్టు; తిమి=
తిమింగిలము)

తే॥గీ॥ సర్వతంత్ర స్వతంత్రుడౌ సౌర్వ భౌము
చిహ్నమారాజదండము చేతబట్టి
యన్య రాజులు దాల్ప భయపడుచుండ
స్వేచ్ఛ, నిర్భయతను చూపె శివజి యొకడె ॥ 374

శ్రీ శంభాజీని యువరాజుగా పౌరులు ప్రశంసించుట

మ॥ పదునేడేడుల యౌవనుండయిన శంభాజీ – శివాజీకి తా
సదృశుండౌను మరాట భూమి యువరాజై యేలగానంచు – స
మ్ముదితాత్ముల్ ప్రజలెల్ల 'జై' యనుచు సంభూషింప జీజాంబయు
న్నెదపొంగారెడు ప్రేమతో మనుమనిన్ దీవింప వెల్గెన్ సభన్॥ 375

శ్రీ శివాజీ పట్టాభిషేక వార్త విని ఔరంగజేబు ఆగ్రహోదగ్రుడగుట

మ॥ శివజీ భారత పూతవార్ధి తిమియోషిద్వారుపస్పర్శితా
చ్ఛ వరాంగుండయి, గౌర'ఛత్రపతి' గా సర్వస్వతంత్రత్వయు
క్త విశిష్టమ్మగు పట్టధారియయి, ముక్తారాతి రాడ్కారణా
త్త విపజ్జాలుడు నౌచు కూర్చొనియె భద్రాసంబున న్నంచునున్॥ 376

ఆ॥వె॥ వార్త చేరె కుటిల వర్తనుడౌ మొగ
ల్విభుని చెవికి – వేగు లెఱుకఁజేయ
మండిపడియె తనదు మౌళియే పడినట్లు
శివజి మకుట ధారి యవుట తెలిసి ॥ 377

తే॥గీ॥ "భారతమున కేకచ్ఛత్ర పతిని నేను
గలుగ 'ఛత్రపతి' ననుచు పలుక నెవడు
వీడు? కాడు, గుట్టలు నిండు బీడు నేల
జాన బెత్తెడు! శివుడొక చక్రవర్తి ! ॥ 378

(పూత=పవిత్రమైన; తిమియోషిత్=నది; వారుపస్పర్శితము=నీట స్నానము చేయబడిన; వరాంగము=శిరస్సు, భద్రాసము=సింహాసనము)

(కాడు=అడవి)

ఉ॥ అంతియగాక తాతఁగుదునంచు ధరించెను రాజ దండ మా
వంతయు భీతిలేక - యఖిలావని నేలు "అలంపనా" యొకం
డంతటి గౌరవమ్మునకు నర్హుడు పూనగ రాజదండమే
సుంతయొ నేల చెక్కగల క్షుద్రుడితండొక సార్వభౌముడా? ॥ 379

తే॥గీ॥ అనుచు కనలుచు శివజీని యణచు కొఱకు
నానుపానులన్వేషించి యదను చూచి
యనువు కుదిరిన శివు రాజ్యమాక్రమింప
తఱిని వేచియుండె కటఖాదకము పగిది ॥ 380

జీజాబాయి నిర్యాణము

తే॥గీ॥ శివజి పట్టాభిషవమహోత్సవము జరిగి
సరిగ పదునొకండు దినము లరిగి నంత
రాజమాత జీజాబాయి ప్రమయ మొందె
కొడుకు, కోడండ్రు మనుమలు కుమిలి పోవ॥ 381

తే॥గీ॥ తల్లి లేని "శంభాజీ"ని యెల్ల లేని
ప్రేమ వెల్లిని తేల్చుచు పెంచె బామ్మ
జీజియా మనుమని తన జీవమట్లు
నేటి కతడు పదేడేండ్ల మేటి యయ్యె ॥ 382

చ॥ సుతుడు శివాజి కన్నకల సూనృతమయ్యెను - నేటికిన్ స్వతం
త్రత గల హైందవీయమగు రాజ్యము నేర్పడ, శౌర్యమున్ సమ
ర్థతగల యట్టి ఛత్రపతి రాజుగ యేల్పడి చేయగా, నధో
నత శిరులౌచు శాత్రవులు నమ్రత నేర్చి యణంగి యుండగన్ ॥383

తే॥గీ॥ తన పతియు నగ్రసుతుడును దౌల నుండ
యొంటిగా కనీయు శివాజి యున్నతి కయి
కష్టములనెన్నొ నోర్చియు కడకు గెల్చి
జీజియా పండువయసున చేరె దివికి ॥ 384

(కటఖాదకము=నక్క) (ప్రమయము=అస్తమయము)

"మహావీర శంభాజీ" భావ సంఘర్షణ

తన తండ్రి శివాజీకి తనపైన ప్రేమ కలదా? లేదా? అనువిచికిత్స

ఉ॥ అమ్మను చేరె బొమ్మ - సవతమ్మలు నేవురు గూడ నెంతయున్
నెమ్మిని చూచుచుండ్రు తన నిప్పటికైనను సొంత బిడ్డగా
యమ్మను విస్మరించునటు లాలు 'యశూ' సహితమ్ము బత్తి, నె
య్యమ్ముల వర్తిలున్నయిన నంతర శూన్యము పాయదెన్నడున్॥ 385

మ॥ తనకున్ తొమ్మిది యేండ్ల పాయముననే తాకట్టుగా నంబరేం
ద్రునకున్ నాటి 'పురందరమ్ము' పణబంధోరీకృతార్థమ్ముగా
ననుచారున్ పొనరించి యాయుకము నందర్ధాంక పర్యాప్తమౌ
ఘన కంఖాణ దళాధినాయకునిగా కావించి నారర్భకున్ ॥ 386

తే॥గీ॥ అంత పిన్నతనము నందె యెంత మంది
యైదువేల గుఱ్ఱముల దళాధిపులయి
కదన భూమిని నిల్వగా గలరు జగతి
తండ్రి శివజి యీ మాత్రము తలపలేడె ! ॥ 387

ఉ॥ ఆపయి 'ఆగ్ర' లోన 'చెఱ' యందున చిక్కువడంగ తండ్రియే
యౌపయికమ్ముతో విపద నావల నెట్టుచు మారువేసముల్
నైపుణితో ధరించి శమనాశను గూఱిచి పోవువేళ త
న్నా పయనమ్మునన్ 'మధుర' యందునిచెన్ పితయొక్క దేగుచున్॥ 388

తే॥గీ॥ ఉపరి తమయున్కి గుట్టుగా నుంచు కొఱకు
జబ్బుపడి శంభుడెడలె నంచఖిల దిశల
వార్త చాటెను జనుల విశ్వాసము కయి
యపర కర్మలు చేసె గంగౌఘతటిని ॥ 389

(పాయము=వయస్సు; అంబరేంద్రుడు=రాజు జయసింహ; పణబంధము = ఒప్పందము; ఊరీకృతము=అంగీకారము; ఆయుకము=పదివేలు; పర్యాప్తము= పరిమితి, నిష్పత్తి; కంఖాణము=గుఱ్ఱము)

(ఔపయికము=ఉపాయము; విపద=సంకటము; శమనాశ= దక్షిణదిక్కు)

(ఎడలు=మరణించు)

చ॥ ఒక పితగా శివాజి మది యూహము లేయవి యైన - యాత్మర
క్షకయి నిరంతరమ్ము కనుగల్గియు నుండుట మేలెగాని - యి
ట్టి కరణి జీవయుక్తసుతు డీల్గెనటంచును వార్త చాటుటే
రికి నయినన్ సహింపగల రీతియె? క్రూరము లౌర! రాడ్విధుల్॥ 390

ఉ॥ ఉన్నను, నూడినన్ సుతుడు - నొక్కటెయౌనొ! పితాజి భావనన్
మున్నుగ నాత్మ రక్షణమె ముఖ్యమునై మధురన్ ద్విజాతి యిం
టన్నను నిల్పె గూఢముగ, నందను డక్కడ రుగ్ణుడైన - యా
పన్నుడునైన రక్షణకు బాధ్యుడెవండని వప్త యెంచెనో?॥ 391

ఆ॥వె॥ తలచుకొన్న కొలది తలబరువెక్కును
నుత్తరములు లేని యోచనముల
తండ్రి తలపు తీరు తనకిప్పటికి గూడ
యంతుబట్ట దొక్క యణువు నంత ॥ 392

చ॥ ఎనిమిది యేండ్ల పాయముననే బుడతన్తన నంబరేశుతో
పనిచెను నాడె తానచట పంచ సహస్ర హయాధి నేతగన్
తన పసియీడు మీరు శిత నైపుణితో వహియించె బాధ్యతల్
వినుతి యొనర్ప పెద్దలె ప్రవీణుడితండని కార్య ధుర్యతన్ ॥ 393

ఉ॥ ద్వాదశ హాయనుండనక తండ్రి తనన్నవురంగబాదుకు
న్నాదను గట్టి చేసికొని యంపెను - నచ్చటి పాలకుండు షా
జాదు 'ముయజ్జమున్' కొలువ - శైశవప్రాయ మటంచు జేజి న
న్నాదు కొనంగ జూచెనయినన్ పిత యానతి రామబాణమే ॥ 394

ఉ॥ ఆయవురంగజేబు సుతుడైన'ముయజ్జమ' పేత కల్మషుం
డా యపదేశి పాదుషకు నాత్మజుడెట్టుల నయ్యె? తండ్రిగో
మాయువు - సూను డెంతయు నమాయియు-మిత్రునిగా తనన్వయో
స్థాయిని గూడ చూడక సదా సముదారత నాదరించె తాన్ ॥ 395

(ద్విజాతి=బ్రాహ్మణుడు; రుగ్ణుడు=వ్యాధి గ్రస్తుడు)
(ఆద=మనస్సు; రామబాణము=తిరుగులేనిది)
(అపదేశి=మాయగాడు; అమాయి=అమాయకుడు; గోమాయువు= నక్క)

శా॥ ఆబాల్యమ్మ్మగ నిట్లు తానెపుడు ప్రాయాతిక్రమమ్మైన వా
యాబెట్టౌ పనులయ్యయానతి నవశ్యంబయ్యె చేయంగ, వి
ద్యాబుద్ధుల్ వికసింపచేసినదియున్నాతంౖడియే - లౌకికం
బౌ బోధమ్మును పెంపు చేసినదియున్నా వప్తయే యెప్పుడున్ ॥396

చ॥ పితయన తాదలంచునొక వేల్పుగయాతని మాట వేదమే
పితరుని బాటలో నడచువేడ్కయె గాని మరొక్క భావమే
మతిని జనింపదెప్డు స్వపమందయినన్ - తనపైన తండ్రియున్
సుతునిగ గాఢ వత్సలతచూపున? బాధ్యతగా తలంచునా?॥ 397

చ॥ తికమకపెట్టు యోచనలు తిక్కను రేపు మనమ్ము నందు - తం
డ్రికి తనపైన గాఢమగు ప్రేమము నున్నదొ? లేదొ? యన్నశం
కకు గురియైనమానసము - కమ్మటమై జ్వలియించుచుండ-శం
భుకు నెదవిప్పి చెప్పుకొన భూమిని లేరెవరాంతరంగికుల్ ॥ 398

ఉ॥ "భారవి" బాటలోన తన భావనలున్ చనుచుండె నేమొ? యం
చారయుచుండు నాత్మగతి 'శంభుజి' - తండ్రికి యగ్ర సూనుడే
గారముసేయ ముఖ్యుడగు గాదె? సుతున్ క్రమశిక్షణమ్ములో
తీరిచి దిద్దగా తగిన తీరిదియేమొ యటంచు శాంతిలున్ ॥ 399

చ॥ "పితరు మనమ్ము నందు తలపెట్టిదొ? నాపయి" యన్న శంక సం
తతమును శంభు లేత యెడదన్ ములుకై వెతపెట్టు చుండు - తా
నతనికి యగ్ర సూనుడును, యౌరసుడున్, యువరాజటన్న స
మ్మతి కలదా? మదీయ పితమానస మందని విస్మితుండునౌ॥ 400

తే॥గీ॥ ఇట్లు శంభుతలపు లాటుపోట్ల వలెను
క్రుంగి, పొంగుచు నుండియు గూడ నెపుడు
వప్తయెడ భక్తి ప్రేమ భావనలె గాని
క్షణ మయిన ప్రతికూల యోచనమె లేదు॥ 401

మ॥ పదియేడేండ్ల వయస్సు నన్గనియె వప్తన్ పట్టపు్ౖరాజుగాఁ
బదిలంబయ్యె స్వతంత్ర హైందవ ధరా భాగమ్ము నిర్వార్యమై

బెట్టు=కఠినము; బోధము=జ్ఞానము; వప్త=తండ్రి; కమ్మటము=కొలిమి

యదె, 'శంభాజి' 'శివాజి' యౌరసుడటంచమ్మె తనన్ చూపుచున్
సద మందెల్లరునైక కంఠ్యముగ నుచ్చైర్నాదులై 'జే'లిడన్ ॥ 402

తే॥గీ॥ తనివి, గర్వమ్ము, భావి బాధ్యతల స్పృహయు
తండ్రి యెడల ప్రగాఢ కృతజ్ఞతయును
నల్లి బిల్లిగ భావమ్ము లల్లు కొనుచు
చిన్ని శంభాజి యెదదలో చెలగెనపుడు ॥ 403

"ఔరంగజేబు" ప్రతీకారేచ్ఛ

కం॥ "రాజా" బిరుదముతోడ, శి
వాజీ నౌరంగజేబవాక్భారతపృ
థ్వీ జేతగ గుర్తించిన
యోజనునటియించె కుటిల యోచన తోడన్॥ 404

కం॥ ఆ వెనుక తన కుమారుని
పావుగఁజేసికొని 'శంభు' బంధింపంగన్
తావేసినట్టి యెత్తు వి
తావిత యయ్యె 'షహజాద' దాక్షిణ్యముచే ॥ 405

శా॥ ఆపై "ఛత్రపతిత్వ" పట్టధరుడై యాడంబరం బొప్ప తా
నాపీయూపల సింహ పీఠిపయి యజ్ఞస్నాతుడై వేదమం
త్రోపేతాశిష పూతుడౌచును సమస్తోర్వీ జనామోదయు
క్తాపన్నాభినవద్విజత్వ యశుడై గ్రాలెన్ 'శివాజీ' సభన్ ॥ 406

కం॥ ఆవైభవమ్ము వినుచును
దావానలమట్లు నీర్ష్య దహియింప నెదన్
త్రోవలు వెదకుచు నుండెను
కావరి యౌరంగజేబు కారింప శివున్ ॥ 407

(అవాక్భారత పృథ్వి=(అవాక్+భారత పృథ్వి) = దక్షిణభారత దేశము)
(పీయు=బంగారు; ఉపలము=రత్నము; ఆపన్న=కలిగిన)
(కావరి=దుష్టుడు; కారించు=బాధించు)

తే॥గీ॥ "హిందు దేశమునే తలక్రిందుఁజేసి
కాఫిరుల "దారులు హరబు" "మాఫిఁ"జేసి
"దారులిస్లాము" గా మార్చ దలచు చుండ
దాపురించె శివాజి "సైతాను" వోలె ॥ 408

తే॥గీ॥ "బీజపూరు సుల్తా" నొక పిల్లవాడు
"తానిషా కుతుబ్షా" భోగ తత్పరుండు
నిరువురును నొక దెబ్బకే యీల గరవ
దక్కు 'దక్కను' తనకని తలచు చుండ॥ 409

కం॥ హిందూ స్వతంత్ర రాజ్యము
నందరమునుఁజూచు చుండ నవితతి వోలెన్
పొందించె నిర్భయుండయి
పందలుగా జేసి మమ్ము పాలించునికన్ ॥ 410

తే॥గీ॥ నుఱుము చేసెద శివజీని తఱిమి తఱిమి
బూది చేసెద మహరాష్ట్ర భూమినంత
చెల్లునే వీడు నౌరంగజేబు ముందు
సామజము నెదుర్కొనబూను దోమయగును"॥ 411

కం॥ అని తన యక్కస మంతయు
పనిబూని శివాజిపైన ప్రకటించుచు, యో
పని యీర్ష్యానల మెదలో
పొనలగ నౌరంగజేబు పొగులుచునుండెన్ ॥ 412

(దారుల్హరబు=కాఫిరుల రాజ్యము; మాఫి=తొలగించు; దారులిస్లాము=ముస్లిముల రాజ్యము)

(అవితతి=గొఱ్ఱెలు)

(అక్కసము=కోపము; పొనలు=మండు; పొగులు=వ్యధచెందు)

అష్టప్రధాని వ్యవస్థపై శంభాజీ అసహనము

తే॥గీ॥ సుకరముగ సులభముగను సుస్థిరముగ
రాజ్యపాలనసాగు నేర్పాటు చేయ
యధికృతి పరిషత్తు నొకటి యష్ట సంఖ్య
గలప్రధానులతోడ నెక్కొలిపె శివజి ॥ 413

సీ॥ పెద్ద ప్రధానిగా "పింగ్లె మోరో పంతు"
'పీష్వ' యై చేయు సర్వేక్షణమ్ము
"నీలొసోన్ దేవ" ను - నెఱ, 'మజుమ్దారుగా'
యార్థికామాత్యుడై యరయు 'ములుగు'
'అణ్ణాజి' 'సర్నివిస్' అన్ని శుల్కములకు
సచివుడై 'వహులను' సంతరించు
'హంబీర మోహితే' యఖిల సేనానియై
'సర్‌నౌబత'న మొనన్ జతను పఱచు॥

తే॥గీ॥ "వకియనెవిస"న దత్తోజి పంతు - నాంత
రంగిక వ్యవహార శాఖాధిపతియు
నారయ విదేశ వ్యాపృతులట, "దబీరు"
గా "సుమంతు సోనోపంతు" గ్రంధిహరుడు॥ 414

తే॥గీ॥ న్యాయ శాఖకు 'నీరజీ' వ్యాపృతుండు
ప్రధిత "రఘునాథ రావుజీ" పండితుండు
నగ్రపౌరోహితుండునై వ్యవహరించు
నిటుల వెలయు నష్ట ప్రధాని వ్యవస్థ ॥ 415

చ॥ తమతమ శాఖలందు వితతానుభవజ్ఞులమాత్యులందరు
న్నమల హృదంతరుల్ శివజి యాశయమైన స్వతంత్ర హిందు రా

(పీష్వ=ప్రధానమంత్రి; నెఱ=చతురుడు; ములుగు=బొక్కసము; వహులు= లెక్కలు; మొన=సేన; వ్యాపృతులు=వ్యవహారములు; గ్రంధిహరుడు= అమాత్యుడు)

(వ్యాపృతుడు=మంత్రి)

జ్యమహిత సౌధ దార్ఢ్యమున కాదరువై నిలు నుక్కుకంబముల్
సమర కళాపటుల్ చణకజాభులు రాజ్యరథ ప్రచోదనన్ ॥ 416

చ॥ 'ఉగ' యభివృద్ధియౌ కొలది యొప్పమి పెంపగు చుండె శంభుకున్
తగ దధికార మష్టక ప్రధానుల కందు ప్రజోపకర్తలై
తెగువను చూపువారు మృగతృష్ణనుఁబోలుదు రర్థలోభమే
యగపడు వారలందనుచు నప్పనమాత్మదలంచు నల్కమై ॥ 417

ఉ॥ "పన్నులు దండు" శాఖ పరిపాలన సేసెడి మంత్రి 'యణ్ణజీ'
విన్ననువొప్ప పేద, రయి భేదము నెంచక నైకరీతులన్
పన్నులు గుంజుటందు కఠినత్వము చూపుచు బిక్క సేద్యగాం
డ్రెన్ని విధాల వేడినను నీకొనడెన్నడు 'రాయితీ' లిడన్ ॥ 418

తే॥గీ॥ 'వతనుదార్లు', 'జమీందార్లు', 'పాటిలులు' ను
'దేశముఖులు' భూములపై నధికృతి గలిగి
స్వేచ్ఛగా పన్నులంగొంచు పీడకులయి
వర్తిలుచు నుండ్రి శివజి యేల్బడికి ముందు ॥ 419

ఉ॥ పండిన పండకున్న హలి వర్గము తిన్నను, పస్తులుండినన్
దండుచు పన్నులన్ పయిగ దండుగలన్ గొని మంచి, చెడ్డలే
కుండ విలాస జీవితము కోసము నిండుగ నింపి బండరుల్
పిండిరి పేదకాపులను ప్రేతములట్లొనరించుచున్ దొరల్ ॥ 420

మ॥ ఇగ భూస్వాములు, పాళెగార్లు ప్రజకున్ స్వేష్టానుసారమ్ముగ
న్నగచాట్లన్ కలిగించు పద్ధతులకు న్నాటంకమున్ పెట్టగా
తగు సన్నాహము చేసె శ్రీ శివుడమాత్యాళిన్ నియామించి వే
రుగ శుల్కమ్ములు దండు శాఖనొకటిన్ రూపొందగాఁ జేయుచున్॥ 421

ఉ॥ కోడె వయస్సులో యువలకున్ సహజమ్మగు దూకుడెచ్చి నో
నాడె విమర్శనాత్మకమునౌ పదజాలముతోడ మంత్రులన్
గాడగ వారిడెందములు - క్రచ్చఱవారును శ్రీ శివాజికిన్
గోడునుచెప్పుకొన్న, విని, కోపము చెందెను శంభుజీపయిన్ ॥422

(చణకజుడు=చాణక్యుడు; విన్ననవు=నేర్పు; రయి=ధనికుడు; బిక్క=పేద)

శా॥ తానెంతో మది విశ్వసించెడి యమాత్యాళిన్నలక్ష్యమ్ముగా
లోనుంజేయును శంభు డిప్పుడిపుడే లోకమ్ములో పోకడల్
తానీక్షించుచు మంచి చెడ్డల విభేదమ్మున్ గ్రహింపంగ తా
నానేటున్కనలేక, కల్పనములన్ నందించు నేకాకియై ॥ 423

ఆ॥వె॥ వివిధ శాస్త్ర వితతి వేత్తృత నార్జించె
నైక భాషలందు నైపుణిగనె
యుద్ధ విద్యలందు సిద్ధహస్తుండయ్యె
అన్ని కళలయందు నారితేరె ॥ 424

తే॥గీ॥ అని విచారించి శివాజి యాత్మజుపయి
నలుక వీడి సాంత్వనపు పానలను నొడివి
యాతనికి హితబోధ చేయంగ దలచె
సమయమారసి తగు బుజ్జవమును చూపి ॥ 425

శంభాజీ అమాత్యుల అవినీతి - హాలికుల దుస్థితిని గూర్చి విచారించుట

ఉ॥ పన్నులు వేయుటందు గల పద్ధతి గూర్చియు ప్రశ్నలేసె - యా
పన్నులు నౌచు హాలికులు వచ్చిరి నేరుగ శంభు వద్దకే
విన్నపముల్లొనర్ప-తమ వేదన తెల్పగ చుట్టు మూగినన్
గ్రన్నన వారి బాధలపకర్ష మొనర్పగ నెంచె శంభుడున్ ॥ 426

చ॥ ఒక యువరాజుగా పితరు నొప్పము చెల్లెడు రాజ్యమందు న
న్నికడల పాలనమ్మెటుల నిర్వహణంబగుచున్నదో కనన్
స్వకమగు పూచిపై తిరిగి - చారులు చేరగ వేయు వర్తమా
నకలన నిక్కమున్నెఱిగి నాయము గూర్చును పౌరపాళికిన్ ॥ 427

ఉ॥ అట్టి యటాట్యమందె కనులార కనుంగొని భూ ప్రజాళి యి
క్కట్టులుఁబాగుగా నచటి కచ్చుటె వారల కోర్కెలన్నియున్

(అపకర్షము=తొలగించు) పానలు=మాటలు; నొడువు=చెప్పు
(ఒప్పము=పాలన, అధికారము; స్వకము=స్వీయము) నేటు=మర్మము

నెట్టనఁదీర్చి వారలకు నెవ్వరు నెంతటి వారుగాని యే
రట్టొనరించినన్ తదపరాధుల కేయు కఠోర శిక్షలన్ ॥ 428

శంభాజీపై అపనిందారోపణము - శ్రీ శివాజీ నేర విచారణ సేయుట

చ॥ నిరతప్రజోపయుక్తకృతినిష్ఠుడునౌచు ప్రజాంత రంగము
ల్లిరవుగనుండు శంభుపయి లేచె సమాజము నందు నాడికల్
శిరములనెత్తి – "నిత్యసుఖజీవనలాలసు డార్యలోకధి
క్కరణ పరాయణుండ"నెడు కల్లలు పొల్లులు శత్రు కల్పనల్॥ 429

శా॥ 'అణ్ణాజీ' యనుజాత్మజాత, పరకీయన్ "హంస"ఁగామించి యా
యన్నున్ స్వీయ గృహమ్మునందె నిలుపన్నాశించి నాడంచు శం
భు న్నన్నెమ్ముగ నిందితున్ సలుపు దంభోల్లుంఠనంబయ్యెడన్
విన్నున్ తాకెడు కారుచిచ్చు పగిదిన్ పెట్రేగె "రాయర్గడిన్" ॥ 430

ఉ॥ నిక్కముఁజూడ నావనిత నేయము నెంచుచు శంభుతోడ – తా
మొక్కపుడిద్దరున్ కలిసి యొద్దిక నున్కిని బాల్యమందు – వే
రొక్కరి ధర్మచారిణిగ నుండియు శంభుని పొందు గోర – నా
తిక్కవదల్ప శంభు తగు తీరున నామెను మందలింపగన్ ॥ 431

తే॥గీ॥ అందమున శంభు శరదిందు డగును గాక
యతుల శౌర్య పార్థాత్మజుడగును గాక
యౌచితి నెఱిగి వర్తించు ప్రాజ్ఞుడతడు
తత మహారాష్ట్ర భావి ఛత్రపతి యతడు ॥ 432

తే॥గీ॥ విఫల ప్రేమాను రాగయై విప్రవనిత
'హంస' త్ర్యంబకరావు దేహజుని భార్య

(అటాట్యము=పర్యటనము; నెట్టన=అనివార్యముగా; రట్టు=ఆపద)

(పరకీయ=అన్యకాంత; అన్ను=స్త్రీ; ఉల్లుంఠనము=అపనింద; విన్ను=ఆకాశము; అన్నెము=అన్యాయము)

(నేయము=స్నేహము)

విక్షతాత్మాభిమానయై విడిచె తనువు
శంభుపై నింద మరి కొంత సాంద్రమయ్యె ॥ 433

న్యాయ విచారణలు - 'శంభూజి' నిరపరాధిగా తేలుట

ఉ॥ ఆపయి శ్రీ శివాజి సుతునంటిన నింద నెఱింగి - శంభుపై
మోపిన నేర మెంత నిజమో? మృషయో?తెలియంగ కొల్వుకున్
వ్యాపృతులందరన్బిలిచి వాస్తవ మెయ్యదొ నిగ్గు దేల్ప నా
జ్ఞాపన చేయ - వారల విచారణ తేల్చెననింద్యుగా సుతున్ ॥ 434

ఆర్థిక సచివుడు "అణ్ణాజీదత్తో" "శంభూజీ"పై అపనిందలు వేయుట

మ॥ ఇది యణ్ణాజి, 'త్రియంబకుండు', మరియున్ యింకెందరో మంతులే
మదిలో శాత్రవమూని శంభుపయి యీ మాద్రిన్నబద్ధంపు త
ప్పిదమున్ మోపిరి - చెల్లి వంటి యొక సాధ్విన్ శీలమున్ మాపగా
నుదియం జేసెను శంభు డంచు కలదొక్కో! నాల్కకున్ స్నావమున్ ॥435

అణ్ణాజీ మఱియు ఇతర మంత్రులు అవినీతిని శంభూజీ విమర్శించుట

శా॥ "అణ్ణాజీయును వానితోడుగను భావైక్యమ్ము నున్నట్టి వా
రెన్నో మార్గములన్ కరాయమును దారిన్ కొంత మళ్ళించుచున్
హెూన్నుల్ బండరుఁజేర్చు చుండ్రు - పరదేశోద్యోగులున్, దూతలున్
'మన్నెన్' మన్నన సేయనిచ్చు యులుపాల్, మాయమ్మగున్ వారిచే॥436

తే॥గీ॥ బుడతకీచులు రాజ్యభావుకము కొఱకు
నాంగ్ల సాంయాత్రికులు పణ్యమైర గొనగ

(దేహజుడు=కుమారుడు)
(మంతులు=మంత్రులు; ఉదియచేయు= యత్నించు; స్నావము=నరము)
(మన్నె=ప్రభువు; ఉలుపాలు=కానుకలు)

యానతులయి యొసంగెడి యప్పనములు
సొంతబండరువులఁజేర్చు చుం(డి వీరు ॥ 437

ఉ॥ "నీతిని, సూనృతమ్మును, గణింపని వారధికారులైన ఆ
నేతలు రాజ్యమున్ నడుపనేర్తురె? నిర్వికలాత్మలౌచు - స్వా
ర్థాతురులెంచుచుం(ద్రు జనులందరు వారివలెన్ యనీతికిన్
(ప్రాతలెయంచు - కామెరల వ్యాధితు లోకమె పచ్చనౌ గదా! ॥438

ఉ॥ అష్ట(ప్రధానులైన (ప్రభు నాదృతి పొందిన వారలైనను
న్నిష్టము వచ్చినట్లు తమ నెవ్వరు నడ్డెడు వారులేనటుల్
నష్టము గూర్ప, తేని (ద్రవిణంబిటులన్ గిలుబాడుచున్-మహో
త్కృష్టమరాట రాజ్యరమ దీలువడున్ గద! నాటినాటికిన్" ॥ 439

చ॥ అని యువరాజుగా, శివజి యౌరసుగా, జిజియాంబ ముద్దు మ
న్మనిగను నన్ని శాఖలను మం(త్రులు, వారి సహాయ కార్యులున్
పనులొనరించుటందు తగు (ప్రాజ్ఞులొ?లేక 'విభూష(ప్రాయులో'
కనుగొని గట్టి గింజ, తరకన్ తెలియన్ సలిపెన్ విచారణన్ ॥ 440

తే॥గీ॥ ఆర్జవము లేని పనిదొంగ లైన వారి
భరతమును బట్ట యువరాజు పట్టుబట్టె
(ప్రగడ లధికారులును కొయ్య బారిరపుడు
శంభు సూటి (ప్రశ్నలకువాక్స్తంభ మగుచు ॥ 441

శంభూజీ పై అపనిందలు పెచ్చరిల్లుట

చ॥ ఇదియిటులుండ శంభుజి పయిన్ సడియెంతయు పిచ్చలించె న
న్నిదిశల నాతడెంతొ యవినీతుడు, దుర్వ్యసనుండు - చుట్టు నుం
గదిసెడు మి(త్రులందరునకార్యపరాత్ములె, వారి సంగతిన్
మెదలు నితండు నెప్పుడును-మేలము లాడును పూజ్యులార్యులన్॥ 442

(బుడతకీచులు=పోర్చుగీసులు; సాంయాత్రికులు=ఓడ వర్తకులు; భావుకము=సేమము; పణ్యము=వాణిజ్యము; ఐరగొను=వర్ధిల్లు; అప్పనములు= శుల్కములు, కానుకలు) సడి=అపకీర్తి

(ప్రాతలు=దాసులు, కామెరలు=పసిరికలు; లోకము=చూపు)

(ఆదృతి=ఆదరణ; గిలుబాడు=దొంగిలించు; దీలువడు=బలహీనమగు)

కం॥ ఆతడు విలాస పురుషుడు
నీతియు, నియమమును లేదు నెలతల పట్లన్
ద్యూత కరులతో తిరుగున్
వాతన్ ప్రల్లదములురియు భాషించు నెడన్॥ 443

మ॥ అనియట్లేవియొ లేని వున్నవియు సత్యంబో? యసత్యంబొ? భూ
జన వక్త్రంబులంమూత లేమిని, యవాచ్యమ్ముల్ ప్రజానీకమా
డిన శంభాజి విరోధులున్ చెవుల దండెల్ మ్రోగెనన్నట్లుగా
ననవద్యోల్లసమొప్ప నాడిరి జయాత్తాఖర్వగర్వమ్ముతో ॥ 444

శంభాజీ మనస్తత్వము - నేపథ్యము

తే॥గీ॥ నిప్పు లేనిదే పొగరాదనెడు విధాన
శంభుశీలమ్ముపై రేగు శంకలకును
కొంత నేపథ్యమున్నను వింతగాదు
శంభు రిపులకు నది పెద్ద సాకునయ్యె ॥ 445

చ॥ పసి తనమందె తల్లి యొడి బాసిన శంభుని జేజి జీజియా
ప్రసవనవీన కందళము భాతిని పెంచి పదేడుయేండ్ల వా
ని సుమశరోపమున్ కనుల నిండుగ జూచి గతించె బామ్మ - ఆ
ముసిమి ప్రగాఢమౌ కతన ముగ్ధత వీడదు వాని నెప్పుడున్ ॥ 446

తే॥గీ॥ ప్రేమ తలమున్నలై యున్కి పెంకెతనము
మమత నిస్సీమమై యున్కి మంకుతనము
బామ్మ నేర్పిన సూనృత వర్తనమ్ము
వప్త శౌర్యము, శంభు రూపమ్ముగొనియె ॥ 447

(వాతన్=నోటి నుండి, ప్రల్లదములు=పరుషోక్తులు, భాషించు=మాట్లాడు, నెలత=స్త్రీ)

(వక్త్రము=నోరు; ఉల్లసము=సంతోషము; దండె=వీణ, ఆడు=నాట్యము చేయు, పలుకు)

(ముసిమి=ప్రేమ)

ఉ॥ ఆతడు సాహితీ సమర ప్రాంగణ నిస్తుల చక్రవర్తి - ని
ర్వాత ప్రదేశ నిశ్చల ప్రభా ప్రతి భాసిత దీపకందళం
బాతనిలక్ష్యశుద్ధి - భిదురాహతి నైనను తూలనట్టి దా
చేతినిశాతహేతి - రణ సింహుడు - శంభుని శీలమిట్టిదా॥ 448

చ॥ అతడవురంగబాదున "ముయజ్జము" కొల్వున నైదు వేల హ
ర్యత తతి నాయకుండగుచు నా షహజాదుకు పిల్ల నేస్తమై
ప్రతిముఖమందు కన్గొనియె - పాలకు లెంత విలాస భోగ పూ
రితసుఖజీవ నాస్వదన లీనమనస్కులునై చరింతురో ॥ 449

చ॥ "మొగలు జహాపనాసుతుని మోమున మాత్రమె వ్రాసి యుండెనా!
జగమున కల్గు సర్వ విధ సౌఖ్యములందున మున్గి తేలగా
పొగడుదు రెల్లరున్ పితను మోగలు భూపుని మించు వానిగా
తగడె తదౌరసుండటుల తానును భోగములాస్వదింపగన్ ॥ 450

ఆ॥వె॥ వేట యనిన రాజ విహిత కర్తవ్యంబు
చుఱుకు గల్గు పల్కు సూనృతంబు
నాట పాట లనిన యౌవన సహజంబు
నేల తప్పుఁదలప నిట్టి నడత"॥ 451

చ॥ అనియొక సాహసాంకమగు నట్టి విశృంఖల భావవీచి లే
చెను యువశంభు హృజ్జలధి చివ్వున నిక్కెడు కోడె నాగమై
"మును పలుమార్లు తాపతనముం బొనరించిన గ్రంథజాలమం
దునగలదే? సుఖానుభవ దూరత రాజులకున్ విధించుచున్"॥ 452

తే॥గీ॥ శంభు తలపులు నీరీతి సాగుచుండె
స్వీయ వృత్తము తా సమీక్షించు కొనుచు
హేతువులు జనులకు వివరించుటవలె
కాని సుతుగూర్చి పిత వేరుగా దలంచె ॥ 453

తే॥గీ॥ అట్టు లొకవేళ శంభాజి యౌవనంపు
మంపు వలన తలవని తలంపున నొక
కొన్ని తలవంపెతెచ్చెడి కొంటెపనులు
చేసి యున్నను అవి దౌష్ట్య చిహ్నలగునె? ॥ 454

(హర్యతము=గుఱ్ఱము; ప్రతిముఖము=సమక్షము) 'పిత' అనగా శివాజీ

శంభాజీ ప్రవర్తనపై శ్రీ శివాజీ అసంతృప్తి

చ॥ జనపతి రాజ్య పాలనము చక్కగ సాగుట కన్ని వేళల
న్ననువగు సూచనల్ యొసగు నష్టప్రధానులపైన శంకతో
కని, కననట్లు నుండదగు గాని కొఱంతలు చిన్న వుండినన్
చనులను శల్యముల్ వెదకు చాడ్పున తీవ్ర పరీక్ష యొప్పునే॥ 455

శా॥ 'అణ్ణాజీ' యన నంత యేలిదము చేయంజెల్లునే శంభుకున్
పన్నుల్ దండుచు, దండి దండ కవిలెల్ వ్రాయించు వాడంచు - సం
యన్నాగారి యనంగ రేగుచును 'పన్వాలా' గడంబున్ గొనెన్
కన్నాకౌను దణాయ లందతనికా? కాలుష్య మంటించుటల్ ॥ 456

అణ్ణాజీ దత్తో మన క్లేశము

మ॥ తనపై శంభుకు కంతదఘ్నమగు క్రోధంబున్న నిక్కంబెఱుం
గును నణ్ణాజి - కుమార ప్రాయుని వెవో కోణంగి చేష్టల్లటం
చును నిన్నాళ్ళనుపేక్షఁజేసె - తననే క్షోదిష్ఠుగా నెంచి రే
గెను లోపమ్ముల నెత్తి జూపుచు తనన్ కీనాశుడంచాడుచున్॥ 457

చ॥ ఇక పయి శంభు బాలిశ ప్రవృత్తిని నోర్చుట దుష్కరమ్ము - లే
డికినిలలేచుటే పరుగు లెత్తుట యన్నటులుండె - క్రొత్త బిచ్చగా
నికి యెఱుకౌనె ప్రొద్దు? - విధి నిర్వహణమ్మన పిల్లయాటలా?
సుకరమె రాజ్యపాలనము? శూలముపై యొనరించు సామగున్॥ 458

అణ్ణాజీ తదితరామాత్యులు 'శివాజీ' కడకేగి తమ యిబ్బందులు చెప్పకొనుట

మ॥ అపుడణ్ణాజియు తోడుగా నితర శాఖామాత్యులన్ గూడి, ఛ
త్రపతి న్డాసియు చెప్పిరిట్లు - "తమ మీదన్ శంభుజీ శంకతో

(పతి=రాజు)

(సంయత్+నాగారి=రణసింహుడు; కన్నాకు=శ్రేష్ఠుడు)

(క్షోదిష్ఠుడు=అల్పుడు; కీనాశుడు=లోభి)

నపరాధమ్ములు మోపి చేయు పనులన్నాపించు - డీపైన మీ
రెపరీక్షించుచు తప్పు కల్గినను దండింపందగున్ మమ్ములన్॥ 459

మ॥ ఇవియే మేము లిఖించు దండ కవిలెల్లెల్లప్పు నాయ వ్యయా
ది విశేషమ్ములు నిందు పొందుపడు నిర్దిష్ట క్రమంబొప్పగన్
అవిరామమ్ముగ రాజ్యకార్యములకై యర్థంబు వెచ్చమ్మునౌ
తవు రీతిన్ పలు దారులన్ కరములన్ దండంగ నేరమ్మొకో?॥ 460

చ॥ విడిముడిపట్టు నుండి తగు వేతనముల్లిడు కట్టుబాటు చే
గడమున లోనయుండు నధికారులకున్ పనివారి కాపయిన్
విడిగ గడమ్ములన్నిటిని వీడక కాచెడు నెల్ల సేనకు
న్నుడుగక సంగరాశ్వకరి యూథము మేపగ వెచ్చ మెచ్చెడిన్॥ 461

ఉ॥ పన్నులు దండు చుండ 'నది పాపము- సైరికులెల్ల పేదలే'
యన్నను - వారికిన్ మనము నక్కఱలెప్పుడు తీర్చు చుండమే
దున్నుట కెద్దులన్ మరియు దుంతలు - పాడికి గేదెలాలు - నీ
రెన్నడు నిల్వయుండ కడలింబలె చెర్వులు కాల్వ లేర్చుచున్ ॥ 462

తే॥గీ॥ ఎరువు లిచ్చుచు భూసార మెచ్చు కొఱకు
పంచు చుంటిమి ధాన్యము వఱపు లందు
హాలికుడె నిజమగు రాజ్య పాలకుడని
కృషికు సేమమే ప్రభుని రక్షించుననుచు ॥ 463

తే॥గీ॥ అధికముగ పన్నులను పిండి హాలికులను
ప్రేతములఁజేయు అధికార భూతములగు
'వతనుదార్ల' 'జమీందార్ల' 'పాటిలు'లకు
కోరలంబీక, నిరసు విషాహులైరి ॥ 464

(ఆకించు=అడ్డగించు)

(విడిముడిపట్టు=కోశాగారము; వెచ్చము=వ్యయము)

(దుంతలు=దున్నలు; ఆలు=ఆవులు, ఏర్చు=నిర్మించు)

(వఱపు=కాటకము)

(నిరసు=ప్రాణరహితమైన; విషాహులు=పాములు)

చ॥ తరముల నుండి యీ 'వతనుదారులు' వెండి 'జమీనుదార్లు' ని
ష్కరుణులునై కృషీవలుల కాఱియ వెట్టుచు దండు పన్నులన్
పరి పరిపోషణమ్ము కొక పాలిడి తక్కిన సొమ్ము నొక్కుచున్
సురపతి భోగమెంత? యనుచొప్పుననొప్పుదురెమ్మెకాండ్రు నై॥ 465

తే॥గీ॥ మీదు యానతి చొప్పున మేము నడతు
మీజనాభ్యుదయ పథక రాజి యెల్ల
మీరు రచియించినదె రాజ! మేమవెల్ల
కార్య రూపమునం బెట్టు కార్మికులము ॥ 466

చ॥ తమ పరిపాలనారథమతంద్రముగాఁ జనుచుండ రథ్యమ
ధ్యమున ప్రతీపమౌ స్థితుల కాశ్రయ మీయక ముందుకేగ స
క్రమమగు యాన సౌఖ్యమున కాకరమౌ మితిలేని సొమ్ము – రా
జ్యమెపుడు స్వేచ్ఛగామనగ నక్కఱయైనది రొక్కమే ప్రభూ! ॥ 467

ఉ॥ శంభుజి పాత్ర యిట్లె కొనసాగినచో యధికారు లెట్టి ప్రా
రంభములే యొనర్పరు నిరస్తకుతూహలులై – యరాతి సం
రంభము నడ్డుచున్ ప్రభుత రక్షణకున్ రణరంగమందు ను
జ్జృంభణ చూపలేని బలహీనులు నయ్యెదరో శివప్రభూ॥ 468

శ్రీ శివాజీ మంత్రుల నూరడించుట

చ॥ అని మనవింబొనర్చు తన యాశ్రిత కార్యుల పార జూచి – "మీ
రనినవియెల్ల గణ్యమగు నంశములే – శివజీ ప్రభుత్వమే
మనునది మిమ్ము బోంట్ల బుధ మంత్రబలమ్మున సుమ్మి యిట్లు మీ
మనముల నొవ్వఁజేసిన యమాయకు శంభుని మందలించెదన్"॥ 469

చ॥ అనెడు శివాజి మాటలకు నాత్మల నెంతయు పొంగి ప్రెగ్గడల్
చనిరి నిజాలయమ్ములకు శాంత మనస్కులు నౌచు నింక కం
టి నలుసు, కాలి ముల్లు వలె నెవ్వను గూర్చెదు శంభు పీడ బా
సిన – తమచేతలడ్డు కొని చిక్కులు పెట్టెదు వారు లేరిలన్ ॥ 470

(పరి=సేన; ఎమ్మెకాడు=విలాస పురుషుడు)

(కార్ములు=అధికార్లు)

శ్రీ శివాజీ శంభాజీ విషయమై పశ్చాత్తాప పడుట

ఉ॥ "ఊఱట లేని పాలనము యొత్తడిచే యువరాజు శంభుతో
తీఱికగా ప్రియమ్మున సదేశముఁ జేర్చుచు సల్లపింపుచున్
దారకు డెట్టులుండెను పదారు శరత్తుల యౌవనుండు నం
చారయనైతి - నేడతని యాచరణే నలుపౌటెఱింగితిన్ ॥ 471

చ॥ నిజమొ? యబద్ధమో? తనదు నెత్తినబడ్డ దిసంతు గూర్చి శం
భుజి కెఱుక య్యెనో? వినుట పోలదొ? కాని తదీయ వర్తనన్
నిజము యథాప్రకారముగనే గతిమారక యున్నయట్లు త
న్నిజులను చూడ బోధపడు నేల? "కడెమ్మును చూడ అద్దమున్"॥ 472

ఉ॥ జేజియు లేదు నేడతని చేష్టల నారసి బుద్ధి చెప్పగన్
రాజుగ నాదు బాధ్యతల రాయిడిలో నరయంగలేను శం
భాజిని - తానె స్వీయమగు వర్తనమున్ సరిదిద్దు కొంచు నే
యోజ చరింపయుక్త మగునో యువరాజుగ తానె యెంచెడిన్॥ 473

చ॥ అతడొక యాతతాయి యను నాడిక పెక్కురు నమ్ము చుండగా
కతమెదియో యెఱుంగ బడకాప్తుల హృద్వ్యథ హెచ్చుచుండె - పం
డితుడు, కవీశుడున్, సమర నిర్దళి తాఖిల శాత్రవుండు సం
తతజనతోపకారమతి - తానిటు లౌటు మరాట కొచ్చెమౌ॥ 474

తే॥గీ॥ వాని వలగొని తిరిగెడు వంది జనులె
మంచి చెడుల నెడద విచారించ కుండ
శంభు జేసెడి ప్రతి పని శ్లాఘ్యమనుచు
అతని యపకీర్తి కాశ్రయమైరి నిట్లు॥ 475

(దారకుడు=కొడుకు) (దిసంతు=నింద; పోలు=వీలుపడు; నిజము=పద్ధతి; నిజుడు=స్నేహితుడు; కడెము=కడియము)

(జేజి=బామ్మ)

(ఆతతాయి=తుంటరి; ఆడిక=అపనింద; ఒచ్చెము=నష్టము)

తే॥గీ॥ "అదె పులి యనంగ యిదె తోక" యనెడి జనుల
వర్తనమ్మును తప్పును పట్టలేము
పాలక కుటుంబ సభ్యుల వర్తనమ్ము
జనుల కాదర్శ ప్రాయమై సాగవలయు" ॥ 476

శ్రీ శివాజీ భవిష్యత్కార్యా చరణ నిర్ణయించుట

తే॥గీ॥ అనుచు తలచి శివాజి హృదంతరమున
నిశ్చిత కరణీయమ్మేదో నిర్ణయించె
భావి కార్యాచరణముకై పన్నుగడల
గూర్చి మంత్రులతో గూడి చర్చచేసె ॥ 477

చ॥ కొనిరి 'మరాట' నేలఁగల కోటలనెల్లను సైన్య శక్తితో
నణగె మొగల్ విజృంభణము నప్పటికిన్ సడిసేయకుండ – ద
క్షిణమున 'జింజి', 'వేలురు' లజేయము లిప్పటిదాక – ప్రాగ్దిశాం
బునిధి తటమ్మునంగలుగు ప్రోలులు గెల్చుటయున్ సశేషమౌ॥ 478

అపుడు దక్షిణాశాజైత్ర యాత్రకు 'దళ
పతిగ' "హంబీర రావుమోహితె" యు, మరియు
ప్రగడ లశ్వ, కరి, వృషభ పాలకులును
అన్ని వృత్తుల వారు తోడైరిఁజనగ॥ 479

తే॥గీ॥ తన పరోక్షము నందు బాధ్యత వహించి
రాజ్య రక్షణ సేయు భారమ్ము నంత
"సోయరాబాయి" తనదు ద్వితీయ భార్య
పైనిడె – ప్రగడలు, దణులు పని వినంగ ॥ 480

శ్రీ శివాజి శంభు భార్య "యశూబాయితో" శంభుని గూర్చి చర్చించుట

తే॥గీ॥ స్నుష 'యశస్విని' 'శంభు' పాలుషినిఁబిల్చి
ఓ! యశూ! నేను కర్ణాట కోర్వికిపుడు

జైత్ర యాత్రార్థమై యేగ సమయమయ్యె
రాజ్యభార మీపై "సోయరా" వహించు॥ 481

తే॥గీ॥ ఎఱుగు దీవు నీపతి సబామెన్మి దేండ్ల
నుండి - ధీరోద్ధతుడు తొల్త నుండి యతడు
జతనములయందు నోర్వడు జాగు నోగు
నసహనమనునదే వాని యవగుణమ్ము॥ 482

తే॥గీ॥ వీరుడును, పండితుడును, కవీశ్వరుండు
దేశ భక్తియు రాజ భక్తియు నెడంద
దందడించును - పితృ భక్తి యందు నద్వి
తీయుడు మదగ్రసుతుడు - సందియము లేదు॥ 483

ఉ॥ జేజి 'జిజాంబ' లేదిపుడు చేరగ దీయుచు బుజ్జగింపగా
నేజను చుంటి దూరముగ నెంతవడిన్ మగుడంగ నౌనొ? శం
భాజి వయోనుజమ్మగు సబామునకున్ దమయిత్రివౌచు - నీ
వేజుమి! యోర్మిమై నిలువరించు వలంతివి-వాని దూకుడున్॥ 484

తే॥గీ॥ సహన శీలియై శంభుజీ సంచరింప
ఈమహారాష్ట్ర భువికగు - హీరభూష
పెంకె తనమున విచ్చల విడిగ రేగ
యది మరాటా విభవ చరమాంకమగును॥ 485

శ్రీ శివాజి శంభు దంపతులను, శంభు అత్తవారిల్లు శృంగారపూరునకు పంపుట

తే॥గీ॥ చేరుడింక మీరిపుడు శృంగారపురము
నీదు పుట్టినిల్లే గద! రాదు కొఱత
యమ్మ, నాన్నలనెఱి పునరను భవమ్ము
నీకు - జామాతనాపేర్మి నెగడు పతికి॥ 486

(స్నుష=కోడలు; పాలుషి=భార్య)

(వడి=సమయము; సబాము=స్వభావము; దమయిత్రి=అదుపులో నుంచునది) (హీరభూష=వజ్రభూషణము; నెఱి=ప్రేమ)

తే॥గీ॥ అచట నుండియె శంభాజి యరయుచుండు
రత్న గిరి మండలము నందు రాజ్య కార్య
ములను – నచటి రాజోద్యోగ బలగమింక
నతనికి విధేయమగుచు తదాజ్ఞ మెలగు ॥ 487

ఉ॥ మామ ప్రబోధ మందె 'యశు' మానస మందొలసెన్ "పినత్తయే"
యీమెయి మామ పల్కుటకు హేతువటంచును – శంభు గూడ గా
రాముల పాలు హెచ్చి "తకరారు" లకున్ దిగె మంత్రి పాళితో
నేమియనంగ వీలుపడ దింటను బైటను పోరు హెచ్చుటన్॥ 488

తే॥గీ॥ తలను వంచి యా లేత కోడలు వచించె
"వల్లె' మామ! నీ యానతి యల్లె దాట
మట్లె నా భర్తయును భవదాజ్ఞ మీరి
యెట్టి యారంభములు తల బెట్టడింక" ॥ 489

తే॥గీ॥ అని వయస్సున కడు చిన్నదయ్యు శ్వశురు
స్వాంతమందు రేగెడి యలజడి నెఱింగి
సాధు పేశల భాషల సాంత్వపరిచె
నమ్మకముతో నతడు పయనమ్ము గాగ॥ 490

తండ్రి నిర్ణయమును వినిన శంభాజీ కోపావేశము

చ॥ జరిగిన దంతయున్ వినిన శంభుని గుండియ యగ్నిగుండమై
యెరియగ – నగ్ని గోళముల యేపున కన్నులు జేవురింపగ
న్నెరుకను కోలుపోయినటు లేదియు తోచక కొంతసేపు తా
నరయుచు శూన్యమున్ పిదప యారసె వాస్తవ మూరడిల్లుచున్॥ 491

తే॥గీ॥ "తండ్రి పట్టాభిషవ మహోత్సవము నాడు
"ఛత్రపతి" పిత క్షాత్ర తేజమ్ము గనుచు
'బాల ఛత్రపతి' గ నన్ను ప్రజలు పొగడ
నెంత యుప్పొంగితినొ! యదియిట్టులగునె ॥ 492

(ఒలయు=స్ఫురించు; పినత్త=సోయరాబాయి; తకరారు=వివాదము)
(ఆరంభములు=ప్రయత్నములు)

తే॥గీ॥ నాకు చెప్పక దక్కను పైకిబోవ
వ్యూహమెప్పుడు రచియించెనో పితాజి
వీటిడిగ నెంచెనను - తన వెంట బోవు
బిరుదు నైనను నాకు కల్పింపలేదు ॥ 493

చ॥ తనయునిగా ననున్ జనయితర్మిలితో కనునో కనండొ? దో
షిని యొనరించి నా విమల శీలమునే కలుషమ్మటంచు, క
ల్పనలొక కొన్నియల్లి తమ పబ్బములన్ గడుపంగ నీతి మా
లిన ప్రెగడల్ వచించు మృషలే మది నమ్ముచు నాదెతప్పనెన్ ॥ 494

తే॥గే॥ సవతి తల్లి "సోయర బాయి" చెవుల నూదు
కల్లబొల్లి మాటలకె తాకట్టు బడెనొ!
లేక యవినీతి పరులైన ప్రెగడల కప
టోక్తులకె తండ్రి తనచెవి యొగ్గి నాడొ ॥ 495

తే॥గీ॥ రాయగడమును వీడ 'దురాయి' చేసి
యత్తవారింట యల్లెము నారగింప
నంపిరితనను యిల్లటపల్లుని గను
నెట్టి వాడను? నేనిట్లు వెట్టినైతి"॥ 496

*తే॥గీ॥ అనుచు నిర్జలాగాధ జీర్ణాంధ్వధోత
ల పతితుండైన యట్లు - నిర్జన, నిరధ్వ
గహన మధ్యైక గహ్వర గర్భ సంస్థి
తునిగను తనను తానెంచు కొనియె నపుడు॥ 497

---

* (నీళ్ళు లేని పాత బావి అడుగున పడిపోయినట్లు గను, దారీ, తెన్నూ లేని దట్టమైన అడవి మధ్య గుహలో, నిర్జన ప్రాంతంలో ఒంటరిగా ఉన్నట్లు గను తనను తాను భావించాడు)

శ్రీ శివాజీ తాను రాజధానిలో లేని సమయమున అచటి అధికారమును మంత్రులకు, అధికారులకు పంచుట

తే॥గీ॥ రాయగడుకుదగ్గిగధి కారమ్ము "మోరొ
పంతు" – 'పన్హాలా' యామ్య "కర్వారు' వరకు
యధికృతము 'అణ్ణదత్తు' – రాయగడు పాల
నము 'రఘుజి సోమనాథు' వంతనియె శివజి ॥ 498

తే॥గీ॥ ఛత్రపతి శివాజీ యౌరస ప్రతిష్ఠ
జ్యేష్ఠ సుతుడు శంభాజీకె చెందియుండ
రాజధాని రాయగడుకు రాజ పుత్రు
నే దవులనుంచుటందేమి నీతి గలదొ? ॥ 499

తే॥గీ॥ రాణువకు నేత "హంబీర రావు మోహి
తే" వెఱగుపడె శివరాజు తీర్పు జూచి
తాను సోయరాబాయి సోదరుడునయ్యు
ననుగు మేనల్లునిగ శంభునాదరించు॥ 500

చ॥ పతి చెవినిల్లు గట్టుకొని పాడిన పాటగ 'సోయరా' సప
త్ని తనయుపైన చెప్పిన యనేకములౌ వ్యతిరేక వార్తలన్
సతతము తప్పులెన్ని తముఁసంకట పెట్టెడు శంభుగూర్చి మం
త్రి తతి వచించు వక్కణలు శ్రీ శివజీని కలంచుచుండొగిన్॥ 501

తే॥గీ॥ అంతెగాక స్వకాంత యేకాంతమందు
వింత సూచన కావించె – వెంట శంభు
జీని తోకొని పోయి దక్షిణ సుయాణ
మప్పుడతని కొంకణ మందె యజ్జగింప ॥ 502

(ఉదక్+దిక్+అధికారము) ఉదగ్గిగధికారము=ఉత్తరపు దిశపైన అధికారము; యామ్య=దక్షిణము; అధికృతి=అధికారము)

(సుయాణము=దండయాత్ర; అజ్జగించు=వదలివేయు)

'శంభాజీ'పై వచ్చు నేరారోపణలకు
శివాజీ తీవ్ర హృదయ వేదన

తే॥గీ॥ "తనను అవతార మూర్తిగా తలచు శంభు
నగ్ర సూనుని, నౌరసు నట్లు చేయ
తాను మరియొక జన్మమ్ము దాల్ప వలయు
తన బహిఃప్రాణమగు 'శంభు' దారకుండు॥ 503

శా॥ కానీ శంభుజి యిప్పుడీ స్థితిని యొక్కండౌచు నావృద్ధ మం
త్ర్యానీకమ్ము నెదుర్కొనంగలుగు సమ్యగ్రీతి రాణ్ణీతివి
ద్యా నైపుణ్యము లేని వాడనుచు రాద్ధానిన్ వసింపంగ తా
నా నిర్ఘర్షణ మోర్వలేడు గనుకన్ తప్పించి తచ్చోటికిన్ ॥ 504

తే॥గీ॥ కాన యప్పటి వరకు శృంగార పురము
చేరి యట నున్కియే సమీచీన పథము
రత్నపురి మండల పరిపాలనము నందు
స్వ ప్రతిభంజూపి వృద్ధికన్పఱచు గాక" ॥ 505

శంభాజీ పై సవతి తల్లి "సోయరా" విద్వేష కారణము

చ॥ రెండేడ్లప్పుడె మాత్రయోగమను దుర్దిష్టమ్ము పాలౌ నపో
గండున్ జేజి జిజాంబ యక్కున కడున్గారాముతో పెద్ద మ
న్మండంచు న్హృదియంగబట్టి తనకా నప్తే ప్రపంచమ్మునం
చుండన్ శంభుజి వృద్ధి పొందుచును కైశోర్య స్థితిం దాటగన్ ॥ 506

చ॥ తన నటు జేజియున్, సవతి తల్లులు నార్గురు జ్యేష్ఠ సూనుడం
చును కడు బుజ్జవమ్మునను చూచుచునుండిరి–సోయరాంబయున్

(దారకుడు=కుమారుడు) (దుర్దిష్టము=దురదృష్టము)

(నిర్ఘర్షణము=రాపిడి)

(మాతృ+అయోగము=తల్లి యెడబాటు; అపోగండుడు=బాలుడు; నప్త=మనుమడు; కైశోర్యస్థితి=బాల్య దశ, జేజి=పితామహి)

మనమున యెట్టి భేదమును మచ్చున కైనను లేక సొంత బి
డ్డనిగను ముద్దు సేయుచును దగ్గర దీయుచు నుండె ప్రేమతో॥507

చ॥ తనకొక పట్టి పుట్టినను తగ్గని ప్రేమముతోడ శంభునిన్
తన తొలి పుత్రుడన్నటులె తన్పునజూచుచు నుండె - జంటగా
తనయులు నాటలన్ మునుగ దగ్గరగా గనువారు "రామల
క్ష్మణులని" మెచ్చ "సోయర" యమంద ముదమ్మును పొందునెప్పుడున్॥ 508

చ॥ పెరుగుచునున్న శంభునకు పెండిలియయ్యెను, పిన్న నాటనే
బరువగు బాధ్యతల్ శిరముపైబడె పెద్ద కుమారుడౌట - ము
మ్మరముగ నన్య ప్రాంతముల "మన్సబుదారు"గ చేసె కొల్వులన్
గఱచెను శాస్త్ర విద్యలను - కాకలు తీఱెను శస్త్ర విద్యలన్ ॥ 509

చ॥ చదువును, సంతయున్, సమర శాస్త్రము నేర్చుట యెల్ల వారికిం
పాదవెడు వార్తయే - యతని పోకడలందున మార్పు వచ్చె న
న్నదియె - గృహమ్మునన్, బయట నర్మిలి శంభుని జూచు వారికిన్
విదితము గాని చిక్కుముడి - నెవ్వగ పెంచెను బాంధవాళికిన్॥ 510

మ॥ "సచివుల్ లంచములన్ గ్రహింతురనునా" 'శంభాజి' - యవ్వారిలో
న్ప్రచురంబైనది విత్త శాఖ సచివున్డైనట్టి యణ్ణాజి పా
త్ర - చురం జేయును సొమ్ము-దండకవిలెల్ వ్రాయించి లెక్కల్ వెలా
రుచు-నాయంకెల మర్మమున్ తెలియలేరొక్కండునున్ భూమిపై॥ 511

తే॥గీ॥ రాజకోశమునకు పంపు 'రై'ని కొంత
స్వీయ కోశములకు చేర్చి పిదప - తక్కు
రొక్కమునె చేర్చెదరు ఱేని బొక్కసముకు
గణన కెక్కదు యీ లోటు కడితములను॥ 512

తే॥గీ॥ ప్రగడ లందరు యీ త్రోవ పట్టు వారె
యెంతయో కొంత లాభము సొంతమునకు
లేనిదే చేతురే సేవ రేబవళ్ళు
వయసుననుభవ మవినీతి వర్ధనములు॥ 513

(రై=ధనము; బొక్కసము=ఖజానా; కడితము=లెక్కల పుస్తకము)

చ॥ ఇది యటులుండ 'హంస' యను నింతి, వివాహిత 'అణ్ణజీ' కనీ
య దుహిత-శంభుతో కలిసి యాడెను, పాడెను బాల్యమందున
న్నెదిగెను ప్రేమ శంభుపయి-యిప్పుడు కోరెను శంభు కూటమి
న్నిది తగదంచు శంభుడన-నీల్గెను కూపములోన దూకుచున్॥ 514

చ॥ ఇదియొక సాకుగా గొనుచు-"హీనుడు నాయనుజాత్మ జాతయౌ
సుదతిని పాడు చేసె తన సోదరి తుల్యను నన్య కాంతని
ట్లదయత నాత్మ హత్యకును నాయమపాల్పడె నింతకన్న ఘో
ర దురిత మేమి యుండును ధరన్నని 'శంభుని' తిట్టె 'నణ్ణయున్'॥ 515

చ॥ "తన నవినీతి వర్తనుగ దారుణ రీతి విమర్శ చేసి - భూ
జననుతి పాత్రుడౌ తనకు చౌర్యము నెత్తిన మోపె 'శంభు'దు
ర్జనుడత డీమరాట ధర ఛత్రపతైనను నింక తద్విజృం
భణమును నాపుశక్తిగల వారమె? దిక్కిక మాకు మృత్యువే"॥ 516

చ॥ అనుచు 'శివాజి' భూపవరు నగ్రసతీమణి యైన "సోయరా"ం
బనుఁగనబోయి చెప్పెనిటు ప్రక్కల నెవ్వరు లేని యప్డు -"శం
భుని పయి నిందలన్ వినుచు నుంటివి నీవును - పౌరులట్టి వా
నిని యువరాజుగా దలపనేల? భవత్సుతుడుండ ప్రభ్వినీ ! ॥ 517

చ॥ "పదుగురిలోనదుర్యశము పాలయినట్టి నృశంసుకెట్లు రా
ట్పదవి నొసంగజెల్లు ?- గుణవంతుడునీ సుతుడైన రామరా
జుదయ విభాకర ప్రతిముదుర్వికి నూతన కాంతి నీయగా
నొదవె మరాట వారి కొక యూతమునౌచు పురోభివృద్ధికిన్"॥ 518

చ॥ అనుచొక స్వార్థ బీజమును 'నణ్ణజి' నాటెను 'సోయరా' యెదన్
మునుముగ యోచనాజలధిమున్గెను "సోయర"-"ఔను-శంభుపై
గణనకు మీరు నేరముల గంపలు మోపిరి మంత్రులెల్ల - నా
తనయుడు రామరాజుపయి తద్దయునమ్మకముంచి రెల్లరున్"॥ 519

(కనీయుడు=తమ్ముడు; దుహిత=కూతురు; కూటమి=కలయిక; ఈల్గు=
చనిపోవు; కూపము=బావి)

తే॥గీ॥ అనితలంచుచు 'సోయరా' యంత వరకు
శంభుపై నెంతొ ప్రేమ వాత్సల్యములను
కలది యయ్యు - తన సుతున కతడు 'స్పర్ధి'
యనెడు తలపు మొదటిసారి యామెకొదవె॥ 520

ఉ॥ ఆపయి శంభుడన్న సవతమ్మకు గిట్టని వాడునయ్యె - తా
బైపయి కెంతొ కూర్మి వెలువర్చుచు - భావి మరాట నేతగా
యాపె నిజాత్మజున్ నిలుపు యత్నము సేయగ "అణ్ణదత్తు" తా
నే పురికొల్ప - రాయగడుకే యెడసేయగనెంచె శంభునిన్ ॥ 521

మ॥ శివజీ పట్టము దాల్చువేళ సభలో "జేజే' నినాదమ్ములన్
స్తవమున్ చేసిరి శంభుజీని యువరాజంచున్ జనుల్ ప్రేమతో
నవమానమ్మున మోము నెఱ్ఱవడె నా యణ్ణాజి కా సోయరా
కివమయ్యెన్నెద శంభుజీని పొగడన్ యెల్ల ప్రజల్ తత్సభన్॥ 522

చ॥ సమయము మించి పోవునని సారెకు నణ్ణజి, మంత్రి పాళి - నే
రములను శంభుపైన శివరాజుకు చెప్పుచు నుండ - సోయరా
ప్రమదయు వీలు జూచుకొని భర్తకు శంభుని శీలమందు లో
పములను నెత్తి చూపు సుతుపై పితకూరిమి డిందుసేయగన్॥ 523

తే॥గీ॥ స్వజుని భావినేతను చేయ జతన పడుచు
నాటి కైక దశరథు డెందమును కలత
పెట్టినట్లు, శివాజి కిష్టట్టి నెవ్వ
కలుగ చేసెను 'సోయరా' కాంతగూడ॥ 524

శ్రీ శివాజీ దక్షిణాశా జైత్ర యాత్ర

చ॥ అనికి శివుండనీకినుల నాయితమున్ పొనరించి సాగె ద
క్షిణ దిశ కన్నిటన్ మొదట క్షీణబలమ్మగు బీజపూరు నా
డును తరియించి ముందు చనుడున్ పరి పాతిక వేల యాశ్వికుల్
వెనుకొని మంది నల్వదియు వేలును రాఁ గనవచ్చె కొండలున్॥ 525

(ఇవము=మంచు)
(పరి=సేన; మంది=కాల్బలము)

తే॥గీ॥ అది "యనంత గిరి శ్రేణి" - యందె "మూసి"
నది జనించి 'హైద్రాబాదు' నాదుకొనును
త్రాగుటకును - సాగునకు నుదక మొసంగి
స్నాన పానములట నయ్యె సైన్యములకు ॥ 526

తే॥గీ॥ అచ్చటును వీడి మునుముందు కరుగునపుడు
నెన్నొయూళ్ళు, పురములు తరించ వలసె
కనిన యంత మేరను సుభిక్షముగ నుండె
పాడి పంటలతో ప్రతి వీడు గూడ ॥ 527

తే॥గీ॥ ప్రక్కకుం జూచి చూడని పగిది సేన
సాగు చుండెనే గాని యెచటను గూడ
ఘోర విధ్వంసనాకృత్య కారులైన
కఱటు లొక్కరు లేరు యీ కటక మందు ॥ 528

చ॥ దినుసులు విల్చినన్ ధనమిదే గొనుడంచును నిచ్చువారె - యా
లను, మగనాలులంగని తొలంగుచు దవ్వుగ గౌరవమ్ముతో
చనియెడునట్టి సత్వగుణశాలురె - దేవగృహమ్ములంగనన్
వినమితులౌచు మ్రొక్కెడివినీతులె - వేరుగ నుండి రీ భటుల్॥ 529

శ్రీ శివాజీ సైన్యము సత్ప్రవర్తనకు జనులు ఆనందించుట

మ॥ ఇది యా 'ఆదిలుషాహి సేన', 'మొగలాయీ మూక' యున్గాదు - ప్ర
ల్లదులా బంట్లనివార్యులై తొడరి పౌరావాసముల్ చొచ్చి సం
పదలన్ బల్మిని కొల్లగొట్టి, వనితా భర్తృవ్రతాహర్తలై
మొదవుల్ బోనముగాగ, కోవెలల నిర్మూలించిరా పాలసుల్ ॥ 530

(కఱటి=దుర్మార్గుడు; కటకము=సేన)

(దినుసులు=సరుకులు; విల్చు=కొను; ఆలు=ఆవులు; మగనాలులు=వివాహితలైన స్త్రీలు)

(ప్రల్లదులు=దుష్టులు; భర్తృవ్రతము=పాతివ్రత్యము; పాలసుడు=దుష్టుడు)

చ॥ అని జనులెల్ల వారలకు నారతు లెత్తెడివారు, ప్రీతితో
కొనుడని యన్ని వస్తువులు కోరకయే కొని వచ్చియిచ్చు వా
రును, "గతమందు యీ తెరువులో పయనించిన బంట్లు మీ
యనువున మంచిగోరు సుజనావళి కాదని" పల్కువారలే ॥ 531

తే॥గీ॥ ప్రథమ హైందవ సామ్రాజ్య ప్రభువరుండు
శ్రీ శివాజి సైన్యములో సుశీలురైన
వారికే తప్పు చోటు తుటారులకట
నొక రవంత యైనను నెపుడుండ బోదు ॥ 532

చ॥ పరసతులన్ స్వమాతలను భావముతో గనువారు - సొంతయ
క్కఱలకు వస్తువుల్ కొనిన గ్రక్కున పైకము నిచ్చు వారలున్
తెరువున యేమతాలయము దృష్టికి వచ్చిన గౌరవించు వా
రరయడెవండు నీ విధుల నాతడు వధ్యుడు రాజు నాజ్ఞమై॥ 533

చ॥ ఇది శివజీ మతమ్మెద నెఱింగిన వారికి నెల్ల తెల్లమే
మొదటి దురమ్ము నుండి తన మూకలకెల్ల శివప్రభుండు తా
విదితమొనర్చె నేరయిన భిన్న మతావమతింబొనర్చినన్
ముదితల కాసపడ్డ, ధనముల్గొన జూచిన వధ్యులంచునున్॥ 534

ఆ॥వె॥ "అబులు హసను" హైదరాబాదు సుల్తాను
మల్కలందున 'షియ' మార్గచరుడు
భిన్న మతములనిన భేద భావము లేక
యందర నొకరీతి నరయు సముడు ॥ 535

తే॥గీ॥ అతనికి ప్రధాన మంత్రి 'మాదన్న' యనెడు
విప్రుడతని తమ్ముడచట విత్తమంత్రి
యైన 'అక్కన్న', తదనుజుడట శతఘ్ని
దళపతి 'విస్సన్న', సుల్తానుఁ గొలువ ॥ 536

(తుటారి=తుంటరి)
(మల్కలు=తురుష్కులు; సముడు=సాధువు)

తే॥గీ॥ వీరి తంబి "మృత్యుంజయా" భిఖ్యదనరు
నతడు నచటి కొల్వున నున్నతాధికారి
భ్రాతలు నలువురు స్వపుత్ర పౌత్రికముగ
బాంధవులగూడి కొల్తు నవాబు కొదిగి॥ 537

శ్రీ శివాజీకి హైదరాబాదులో ఘన స్వాగతము

ఉ॥ మాదన లక్కనల్ పెరిమమై తన నచ్చట స్వాగతింపగా
హైదరబాదు రాజ్య సుషమాతిశయమ్మును కన్నులార తా
సోదర యుగ్మమున్ కలిసి చూచెను – ప్రోన్నత హర్మ్య భర్మరు
క్మేదుర వైభవమ్ము – పురికిన్ మణి భూషను "చార్మినారునున్॥ 538

కం॥ శృంగాటకములఁ జనగా
తుంగావసథాగ్ర సంస్థితోత్పల నయనల్
పొంగెడి ప్రేమను చల్లిరి
బంగరు సేసలువిరులు శివాజి శిరముపై ॥ 539

సీ॥ వీడటే కడు పిన్న యీడున 'యాదిల్ష'
కోట లెన్నింటినో గొన్న ప్రోడ
వీడటే పులి గోళ్ళతోడ నఫ్జలు ఖాను
నుదరమ్ము జీల్చిన యుక్కలుండు
వీడటే ఢిల్లీశు ప్రియ మాతులు షయిస్త
ఖానుని వ్రేళ్ళ జక్కడచిన కలి
వీడటే ఢిల్లీశు వెట్టి వానిని జేసి
'ఆగ్రా' చెఱను వీడి నట్టి జాణ॥

తే॥గీ॥ వీడటే "ఛత్రపతి" యను బిరుదు దాల్చి
ప్రథమ హిందూ స్వతంత్ర సామ్రాజ్యమునకు
స్వర్ణ పీఠికా రోహియౌ చక్రవర్తి
నోచినామిట్టి శివజీని చూచు కృతము ॥ 540

చ॥ అని తనవైపు చూపుచును నచ్చెరు వంద జనమ్ము లెల్ల – సా
గెను నగరావలోకన చికీర్షుడు నై శిబికాధిరూఢుడై

తనబడి మాదనక్కనలు తామును రాఁదురగాధి రూఢులై
చని సులతాను భవ్యమణి సౌధము చేరెను మెల్లమెల్లనన్॥ 541

తే॥గీ॥ గాఢ పరిరంభణమ్మున గౌరవించె
హైదరాబాద్నవాబు స్నేహమ్ము మెఱయ
భాషణలు భుజాభోజన భాజనముగ
జరిగె తృప్తిగా నుభయ పక్షమ్ములకును ॥ 542

చ॥ తనకు ధనమ్మొసంగి సులతాను రణవ్యయ మేదినన్ - శివా
జి నిరత జాగరూకతను సేనలతో నటు బీజపూరు వా
రి నిటు మొగల్బలమ్ములను రెంటినెదుర్కొనుచున్ కుతుబ్ష ధా
రుణికిక దండయాత్ర గొవరున్నెడ సేయ నొడంబడెన్నటన్ ॥ 542

తే॥గీ॥ పిదప కర్ణాట భూమిలో బీజపూరు
వారి రాజ్యభాగములపై బవరమునకు
పయనమయ్యెను హైదరాబాదు నుండి
శ్రీ శివాజి ప్రగాఢ జిష్ణుక్షతోడ ॥ 544

శ్రీ శివాజీ శ్రీశైలక్షేత్ర దర్శనము

ఉ॥ జాలము లేక ముందునకు సాగుచు 'హైదరబాదు' నుండి - క
ల్లోలిని 'కృష్ణ' నల్లమలలో ప్రవహించెడు లోయపైన శ్రీ
శైలము, మల్లికార్జునుని 'సంజ్ఞను నెక్కొని యున్న శంకరు
న్నొల వెలుంగుచున్న జగదంబయునౌ భ్రమరాంబఁ జూచుచున్॥ 545

తే॥గీ॥ తొమ్మిది దినములట భక్తితోడ మల్లి
కార్జున, భ్రమరాంబల కరుణపడయ
నైక విధ సమర్చనలు తదేక నిష్ఠ
సలిపిభవ్య గోపుర మొందు నిలిపెనచట॥ 546

కం॥ శ్రీశైల మందు నేడును
ఆ శివజీ పేర భవ్యమౌ గోపురము

(భుజాభోజనము=మృష్టాన్నము)
(కల్లోలిని=నది; ఔలన్=ఆ ప్రక్క) గొవరు=సంకటము

న్నీశుని భక్తులు దృగమృత
ప్రాశనముగ జూతు రఖిల పాపహరమ్మున్ ॥ 547

తే॥గీ॥ అట్లు భ్రమరాంబికా మల్లికార్జునకరు
ణామృతాభిషిక్తుడయి యానంద మొంది
యా జగత్పితరుల సెలవంది సాగె
"జింజి' కోటజయింపగ శ్రీ శివాజి॥ 548

శ్రీ శివాజీ 'జింజీకోట' ముట్టడి

తే॥గీ॥ మూడు కొండల నొక్కటే ముడిగ వేయ
కఠిన శిలలను పేర్చి పక్షములు గూర్చి
యైదు చదరపు కోసులాయమ్ముగల
నేల చుట్టును దుర్గమ్ము నిలిపిరచట ॥ 549

తే॥గీ॥ ప్రత్యగాశ "కృష్ణగిరి"యు, 'రాజగిరి' యు
నగ్నికోణ దిశఁగల "చాంద్రాయణ' గిరి
త్రిగిరుల కలుపు ఊతి భిత్తికనుకట్టి
జింజి దుర్గము నేర్పాటు చేసినారు ॥ 550

ఉ॥ పేరిచి రాలు మధ్య మను వేయుచు కట్టినకోటగోడలే
మేరకు నిల్చి యోర్చు యెడమీయక తాకు శతఘ్నిగోళ ఘా
తోరునిఘర్షమాజినని యోజనతో యిపుడున్న కోటనే
మారుపు చేసి మంచి బలమైన విధమ్ముగ దిద్దనెంచుచున్॥ 551

ఆ॥వె॥ చెక్కినట్టి కఠిన శిలలను పేర్పించి
గారమెత్తి చక్క గదియ హత్తి
నింగినంటునట్లు నిర్మించి రప్పుడు
భంజితారి వర్గ చెంజి దుర్గ॥ 552

(పక్షములు=గోడలు; నిల్పిరి=కట్టిరి)
(ప్రత్యగాశ=పడమటిదిక్కు;అగ్నికోణదిశ=ఆగ్నేయ దిక్కు)
(మను=మన్ను; నిఘర్షము=ఒత్తిడి)

తే॥గీ॥ ఆదిలుషహ రాజ్యమున దుర్గాధిపతిగ
"జింజికోట" బాలించు 'నసీరు' ఖాను
చుట్టు ముట్టిన వైరులఁ జూచి జడిసి
కాలికిని బుద్ధి చెప్పెను గడము విడిచి ॥ 553

ఆ॥వె॥ తుంగ, చంగ, శృంగ సంఘముతో నింగి
నంటు బహు గహన వనావృతమ్ము
సహ్య శైల పంక్తి సాటియే రావిట
చిట్టడవుల పొట్టి "జింజి' గట్లు॥ 554

తే॥గీ॥ తన దణి 'ప్రతాపరావు' - విన్మణి యగు 'రఘు
పండితుడు' - తోడుగావెంట నుండ శివజి
భీకర గ్రాహ పూర్ణ గభీర ఖేయ
మాది రక్షణయగు కోట నరయ దలచె ॥ 555

తే॥గీ॥ జింజి కోటలోపల, కనుల్ చెదరు నట్లు
కూటములు, చతుశ్శాలలు,కోష్ఠములును
ధాన్య కోశములు నమలోదాశయములు
పెక్కు యంతస్థుల యవులు లెక్క మీఱు ॥ 556

ఆ॥వె॥ జింజికోటపైకి చెచ్చెఱనెక్కుచు
అన్నివైపుల తనివార జూచి
గడము లోపల పలు కట్టడముల శిల్ప
కౌశలమునకు వెఱగంది - మెచ్చె ॥ 557

ఉ॥ 'సెంచి' గడమ్ము జూచి శివజీ మది నూహము చేసె - స్వర్ధృగా
శాంచల వేలపై ద్విషదజయ్యము నౌనిది 'రాయగడ్' సమ
మ్మంచు గణింతు యామిదిశ కబ్ధివణిగ్వ్యవహారమెల్ల సా
గించుట కడ్డు యుండదిక నిచ్చటి తూరుపు తీరమంతటన్॥ 558

(గట్లు=కొండలు) (దణి=సేనాని; విన్మణి=విద్వాంసుడు; గ్రాహము=మొసలి; ఖేయము= అగడ్త) (ఉదాశయము=జలాశయము; అవి=ఇల్లు)
(స్వర్ధృక్+ఆశ=ఇంద్రుని దిక్కు = తూర్పు; ద్విషదజయ్యము=శత్రుల కజేయమైనది; యామిదిశ=దక్షిణదిశ)

చ॥ పడమర, తూర్పు తీరములపై నధికారము నాకె కల్గిన
న్నడగును నింక నశ్వముల 'నాదిలుషా' కొనుగోలు సేత, యె
ప్పుడును 'అరేబియా' ప్రభృతి భూముల నుండి - హయాళి లేనిదే
తొడరదు గెల్పు పోరులను-దుర్బలు 'డాదిలుషా' మృతాహియౌ॥ 559

ఉ॥ తూరుపు, పశ్చిమాశలను తోయధి వేలలు వశ్యమైనచో
తోరముగా వణిజ్యయును తొట్టుకొనున్ 'మలయా', 'మలక్క' ప్రాం
తేరను దక్షిణమ్మున - నుదీచిని వంగధరన్ స్పృశించి-బే
హారము పైన శుల్కముల యాయము నింపును రాజ్యకోశమున్॥560

ఉ॥ చేతికి చిక్కె జింజి, కడు చిత్రముగా శ్రమలేక - దానికి
న్నాతస దిక్కునన్ వెలయునట్టి మహోపలదుర్గ 'వెల్లురే'
రీతి వశమ్మగున్ శ్రమము లేనటులంచును డాయఁబోవ ముం
దాతత తోయ పూర్ణమకరాలయ ఖేయము దర్శనం బిడెన్ ॥ 561

ఉ॥ దంభోళ్యాహతి యార్తవ స్పృశమునౌ దార్ఢ్యమ్ముతో దుర్గసం
స్తంభార్వాశ్మవినిర్మితమ్మునగు కంధావాటముల్ వప్రము
ల్లంభోభృత్పృథమంటు క్రొక్కళములున్నట్టాలికల్, కుడ్యముల్
కుంభివ్రాతము త్రోపునోర్చు-రిరి శంకుల్ గల్గుబోర్తల్పులన్॥ 562

ఉ॥ "వెల్లురి" కోట యుద్ధతి నవేక్షణచేయ నభేద్యమంచునం
దెల్లమరాట యోధుల మదిన్ స్ఫురియింపగ - గట్టిపూన్కి హె
చ్చిల్లగ ముట్టడిన్ దళము సేయుచునుండె మరాట దండు - ఆ
"ఖిల్ల"కునేత 'సిద్దిమల' కెక్కటి "యబ్దులుఖాను" పోరులన్ ॥ 563

(వేల=తీరము; తొట్టుకొను=అభివృద్ధిచెందు; ఉదీచి=ఉత్తరదిక్కు; వంగధర=బెంగాలు రాష్ట్రము)

(ఆతసదిక్కు=వాయవ్యము; ఖేయము=అగడ్త)

(దంభోళ్యాహతి=పిడుగుదెబ్బ; ఆర్తవస్పృశము=పూల తాకిడి; రిరి=ఇత్తడి; బోర్తల్పు=కోట ద్వారము)

(దళము=గట్టి; ఎక్కటి=యోధుడు)

తే॥గీ॥ అట్లు 'వెల్లూరి' ముట్టడి యడరుచుండ
శివజి కెన్నియో వార్తలు చెవిని బడియె
'షాహజాద్ ముయజ్జము' తన జననిఁజూడ
వచ్చియుండెను నౌరంగబాదుకనుచు॥ 564

తే॥గీ॥ దక్కనుకు 'సుబేదారు' పదమ్ము నంది
వచ్చిన 'దిలేరు ఖాను' పోబడియు దెలిసె
'మౌజము' 'దిలేరు ఖాను'ల మధ్య నెపుడు
పచ్చగడ్డిని వేసిన భగ్గుమనును ॥ 565

కం॥ ఔరంగజేబు పన్నిక
లౌరా! యని పించు నతని కాత్మజులైనన్
దూరగులె నమ్మకమునకు
హీరకునొకని నియమించె - 'హ్రీ"విడి సుతుపై ॥ 566

తే॥గీ॥ కుతుబుషాహి రాజ్యము నందు గూఢముగను
బాలురను షండులుగ పరివర్తనమ్ము
చేసి - 'యరబు', 'ఫారశి', 'తుర్కి' దేశములకు
పంపి యాదాయ మార్జించు వార్త వినియె ॥ 567

కం॥ అది విని శివాజి కోపము
నెదనేర్చ పలికె - తొలుతటి నియమము బడి ని
చ్ఛేదనన్నను - "నాదిలుషా
హి" దుర్గములిపుడు "కుతుబ్షా" కీయనటంచున్ ॥ 568

తే॥గీ॥ ఈ'దిలేర్ఖాను' పన్నెండు నేండ్ల క్రింద
'రాజ జయసింగు'తో గూడి రణము నందు
గొనె పురందరు గడము నా వెనుక సంధి
నియమమును బట్టి శంభుడుండెను 'గిరవు' గ ॥ 569

(హీరకుడు=గూఢచారి; హ్రీ=లజ్జ)

(షండులు=నపుంసకులు)

(గిరవు=తాకట్టు)

తే॥గీ॥ అని గతస్మృతులు తలచి కొనుచు శివజి
“బాద్ష పన్నకములు విష పన్నగములు
దక్షిణావని నంతయు భక్షణమ్ము
సేయ నేవియో యెత్తులు వేయుననుచు ॥ 570

ఉ॥ ‘వేలురు’ కోట లోబడుట ప్రేకనయై నడపింప కోల్తల
‘న్నాలముసేత’ ‘సబ్బవిసు’ నంసముపైనిడి యాశ్వికాళితో
వాలు జిగీష పైకొనగ వైళమ దక్షిణదేశ మార్గమం
దాలము లేక సాగె నట ద్రావిడభూవిభవమ్ము జూచుచున్॥ 571

శా॥ కావేరీ జలసిక్త భూములట ముక్కారున్ ఫలింపన్ – కృషా
ణా వాసమ్ములు శోభిలున్ బహుళ సస్యానీక సంపత్తితో
ప్రోవుంగట్టుచు నారికేళ, కదలీ, మోదాఖ్య, శాలీక్షులున్
యే వైపుంగనభూరి గోపురములన్ ప్రేక్ష్యాళి కన్పిందునో ॥ 572

కం॥ తంజాపురి మండలమం
దుంజనునపు డెటుగనినను తోచు పలుమనో
రంజక దృశ్యములారయ
నంజను త్రిప్పక మరాటు లరిగిరి వేగన్ ॥ 573

కం॥ “గడిలము” నది యొడ్డునగల
గడము “తిరువడి” దొర ‘షేరుఖాన్‌లోడీ’ ము
ట్టెడు మారాటుల గని, త్వర
పడుచుపలాయన మొనర్చె వారువము పయిన్ ॥ 574

ఉ॥ పాఱెడు వాని పట్టుకొని “పంద! యికెక్కడ బోయె దీవు – నీ
శూరత చూపి పోరుమటు చొప్పడదేని గడమ్ము నిమ్ము – వే
రేరహి యుక్తులన్ తలతువేని, భవత్తనుజుండునిప్డు మాదు గు
య్యారమునం గలండన భయంపడి లొంగెను ‘లోడి’ గ్రక్కునన్॥ 575

(పన్నకము=వ్యూహము; పన్నగము=పాము)

(కృషాణుడు=హాలికుడు; మోదాఖ్యము=మామిడి; శాలి=వరి; ఇక్షువు=చెఱకు)

(గుయ్యారము=చెఱసాల)

ఉ॥ ఈ విధి దక్షిణోర్వీగల యేబది కోటలు చేcబడంగ – "వి
ద్రావిత సత్త్వుడై యడగి దక్కను వైపిక చూడగల్గనే
యేవగనైన యాదిలుష, యెప్పటి కైన" నటంచు శ్రీ శివా
జీ వికచాంతరంగుడయి చేరదలంచె, స్వరాజధానికిన్॥ 576

చ॥ మొగలువిభుండు నిందనుక మోపెను చూపును నాప్తనుక్షితి
న్నిగపయి తాను చూపు మరలించును దక్కను పైకి – దానితో
సెగలిట రేగు – ముందుగ గ్రసింపగ బూను మరాట భూమి – యే
వగనిక నూఱడంజనదు–భండనమొండె శరణ్య మీపయిన్॥ 577

చ॥ అటుల మరాట భూమి పయి కాహవమున్ ప్రకటించి పాదుషా
కటిని బిగించి దూకినను – గ్రక్కునమేమును ద్రావిడావనిన్
పటుతర దుర్గలం జొఱుచు పాయగవచ్చు పరాజయమ్ము – తా
నెటుల నొకే తఱిన్ పెనగ నేర్చును నుత్తర దక్షిణమ్ములన్॥ 578

ఆ॥వె॥ బలగమెంత యున్న పలు భాగములు చేసి
యొక్క సమయ మందె పెక్కు చోట్ల
సమరమునకు దిగుచు జయము నాశించుట
జూద మాడునట్టి చొప్పుగాదె॥ 579

ఆ॥వె॥ రాయగడము వీడి యాయెను నొక్కేడు
తీరె చాల మట్టు ధ్యేయమిచట
'వెల్లురు' గడ మొకటభేద్యమై నిల్చెను
కాలగతిని యదియు కేల బడును॥ 580

తే॥గీ॥ అనుచు క్రమ్మఱె, శివజి రాయగడమునకు
కోల్తలయు సాగె వెల్లూరి కోటపైన
నిక మరాట కోటలను సుదృఢముcజేసి
భావి యుద్ధములకు సిద్ధ పడc దలంచె ॥ 581

(కోల్తల=ముట్టడి)

మహావీర శంభాజీ కొంకణ భూమిలోని శృంగారపూరు ప్రవేశము

తే॥గీ॥ 'శంభుజీ' 'యశూబాయి'తో జనయితాజ్ఞ
శిరమునందాల్చి కొంకణు సీమ యందు
'రత్నగిరి' మండలోపపురమ్మునైన
యట్టి 'శృంగారపూరుకు' నరిగి యుండె ॥ 582

వీర శంభాజీ "మల్లఖంబ్" పోటీలోపాల్గొని, తన శరీర పటుత్వము ప్రదర్శించుట

తే॥గీ॥ నున్నగానున్న "యొడిసె మాను"ను నిలువగ
బెట్టి - యేరండ తైలము విడువకుండ
ధారగాపోసి తడుపుచు - దానిపైకి
ప్రాకి,సాము చేయుట గొప్ప 'పగ్గె'యంద్రు॥ 583

తే॥గీ॥ షోడశ శరద్వయస్కుడు, సుందరుండు
సక్రమ ఖళూరిక స్థిర సంధి బంధ
పటుతరా'పఘనుడు శంభు బాలు - సాము
నందు తనపగ్గె చూపంగ నరిగె నటకు ॥ 584

శా॥ సాలప్రాంశుడు మాంసలాంసుడగు నా శంభాజి హేలాగతి
న్నాలోకించుచు నిట్టరాడు, కటి బద్ధార్ధోరుకుండౌచు - నా
తైలం బోడెడు కంబ మెక్కియది యాధారమ్ముగా నూనుచున్
గాలిందేలగ మేను, పశ్చయములన్ కావించె విన్యాసమున్ ॥ 585

ఏరండతైలము=ఆముదము; పగ్గె=ప్రజ్ఞ

(ఖళూరిక=వ్యాయమము; అపఘనము=అవయవము)

(సాలప్రాంశుడు=పొడుగరి; మాంసలాంసుడు=బలిష్ఠ దేహుడు; అర్ధోరుకము=చెడ్డీ; పత్+శయములు=పశ్చయములు=కాళ్ళు చేతులు)

ఉ॥ గిబ్బున "మల్లఖంబ" మొక కేంద్రముగా గొని కాలు సేతులన్
బిట్టుగ నూదిపట్టి మెయి వ్రేలగనంతరమందు - ప్రేక్షకుల్
యబ్బుల నెత్తి చూడ, నసియాడుచు చుట్టును చేసె సాదనన్
వెట్టిగ 'జే'లు కొట్ట ప్రజ, విన్నను వొప్పగ శంభుడయ్యెడన్ ॥ 586

మ॥ అలకల్లాడగ హేమపట్ట తులితమ్మౌ ఫాల భాగమ్మునన్
మెలికల్దీరుచు కోడెనాగులనగా మేకండలొప్పార - గో
రులకుంజిక్కెడు నూగు మీసములతో రూపాభిభూతాంగజో
త్పలరాడింద్రజుడైన శంభుగని మోదంబందిరచ్చో జనుల్ ॥ 587

శ్రీ 'శంభాజీ' కవితా, పాండిత్య వైభవములు

కం॥ యోధుడే గాదు - శంభాజి యుత్తమకవి
నైక భాషలలో రచనము లొనర్చె
నతడు 'వ్రజభాష'లో వ్రాసినట్టి కృతియె
"నఖశిఖ" యనగ బుధవందనార్హమయ్యె॥ 588

కం॥ ఆ కృతిలో వ్రాసెను 'రా
ధాకృష్ణ' ప్రణయ కథ నతి రమ్య ఫణితి "రా
ధా కైశ్యము"ను గుఱిచి ప్ర
త్యేకముగా వర్ణించి శంభు డెల్లరు పొగడన్ ॥ 589

శంభాజీ వర్ణించిన రాధా దేవి కైశ్య శోభ

సీ॥ "మునిమాపు వేళలో వినువీధి పరగెడు
నసితాభ్రముల వన్నె నతకరించి
ముప్పేట యల్లిక నొప్పి మూపున వేణి
కాలాహి వలె యాడ కటిని దాటి

(అంతరము=ఆకాశము; అబ్బు=మెడ; అసియాడు=వ్రేలాడు; సాదన=సాము; విన్ననువు=నైపుణ్యము)

(రూపాభి భూతాంగ. . .=రూపాతి శయముచే పరిభవింపబడిన మన్మథ, చంద్ర, జయంతులు) కైశ్యము=కేశపాశము

పట్టు దారపు గుంపు పసమీరు జడకొస
యాదోక కొనకుచ్చు నపహసింప
జంబూ ఫలాగ్రస్థ బంభర భంగియై
ధూమ్ర మేచక వర్ణ ధామ మొలయు ॥

తే॥గీ॥ నిరులు కురియు రాధ కురుల సిరులు జూచి
కృష్ణుడను 'నోప్రియా!' నీదుకేశ భరము
కమ్మ కస్తురి వలపులుక్రమ్ము కొనగ
నీడ నిడు నాకు యీ యెండ వేడి దొలచి"॥ 590

తే॥గీ॥ ఇట్టి వర్ణనములతో ఇంపు గొలిపి
'నఖశిఖ' కృతిని నింపుచు నఖ శిఖమ్ము
వ్రాసె శంభాజి శృంగారరసము నింపి
వ్రజవిహారి గుణిచి వ్రజ భాషయందె ॥ 591

కం॥ 'బుధ భూషణమ'ను కృతిని - వి
బుధ భాష న్నాలిఖించె - భూపతి ధర్మం
బధి కార్య మాత్య, యోధ చ
య ధర్మమును - భృత్య ధర్మమాదిగ చెప్పన్ ॥ 592

తే॥గీ॥ పరగె, శృంగారపురము కాపురము నందె
గ్రంథ రచన శంభాజి లేఖనము నుండి
యంతరంగాను భూతిని యక్షరముగ
నక్షరీకరించెను, కవి యగుట చేత ॥ 593

తే॥గీ॥ అత్తయును, భార్య రసవతి యందు నుండి
పర్య వేక్షించుచుండిరి పాచనమును
రత్న మండలాధి పతిగ, నూత్నముగను
వచ్చినట్టి శంభునింగొల్చు భటుల కొఱకు ॥ 594

తే॥గీ॥ తమసుబేదారెవండొ నూతనుడు కాదు
ఛత్రపతి శివాజి సుతుడౌ శంభురాజె

విబుధ భాష=సంస్కృతము; ఆలిఖించు=రచించు; రసవతి=వంట ఇల్లు; పాచనము=వంట

యని యెఱిగి సంతసమ్మున నతనిఁజూడ
వచ్చిరి కృషీవలులు జాత్ర పరుసబోలి॥ 595

మ॥ కడు దూరమ్ముగు నూళ్ళనుండియు తురంగారూఢులై, యెద్దుయె
క్కుడులంగూర్చొని, పాదచారులయి, కన్కోర్కెన్ శివాజీ సుతున్
గడమై వచ్చిరి తెల్ల యొల్లియలతో, కచ్చోపసంవ్యానముల్
తొడి, కార్షుల్ తమ గోడు చెప్పుకొని యెంతో కొంత మేలొందగన్॥ 596

వీర శంభాజీ హాలిక పక్షపాతము

ఆ॥వె॥ సాదరముగఁ జూచి సేదువ కాండ్రను
సేమమడిగి వారుసేదదీర
చాంద్ర లవణములను జత యొనర్చినచల్ల
యందజేసె మట్టి యటికలందు॥ 597

ఉ॥ "ఓ యువరాజ!' మాకిపుడు యూరట కల్గెను మిమ్ము జూచి మీ
నాయన – మా శివ ప్రభుడు – నాడు దమించె జమీను దారులన్
నాయముఁదప్పి యాయముల నందుచు భోగ విలాస మగ్నులై
చేయు దురాగతమ్ములను, షేధ మొనర్చుచు కాచె మమ్ములన్॥ 598

తే॥గీ॥ కాని యీనాడువారల కన్న ఘనులు
ఆర్థిక వ్యవహార శాఖాధిపతులు
మమ్ము పీడించి పన్నులిమ్మడిగ గొంద్రు
ముల్లుఁదీసి కొఱ్ఱుడచిన మోస్తరయ్యె॥ 599

కం॥ అతి వృష్టి, యనావృష్టియు
మితిలేని తెగుళ్ళ బాధ ద్రిమ్మింగెను పైర్లన్
జత పడవు యెరువు లదనున
'రతీబు' లేక పసి చిక్కె – 'రై' యెట వచ్చున్ ॥ 600

(జాత్రపరుస=తైర్థికుల సమూహము)

(కచ్చోప సంవ్యానములు= కచ్చె పంచెలు; ఒల్లియ=తలపాగాలు; గడము=గుంపు; కార్షులు=సేద్యగాండ్రు, తొడి=తొడిగి; ఎక్కుడులు=బండ్లు)

(చాంద్రము=అల్లము, చల్ల=మజ్జిగ) (షేధము=నిషేధము)

(రతీబు=పశుగ్రాసము; రై=ధనము)

చ॥ ఇది యటులుండ మా పయికి యెప్పుడు వత్తురొ? గుర్తెఱుంగ లే
మదయత పాడి పంటలను మట్టము సేయుచు – స్త్రీల, పిల్లలన్
బెదరక నెత్తుకేగుచును – వృద్ధులఁజంపుచు, సొమ్ముదోచుచుం
డుదు 'రబిసీనియా' మలక, లుక్కివు లందరు 'సిద్ది' గోత్రజుల్"॥ 601

చ॥ హలికులు నట్లు చెప్పు నుడులందున వాస్తవమున్ గ్రహించుచున్
కలతను పొంది శంభు ప్రతికారముతోపక తత్సమస్యకున్
బలమగునమ్మకమ్ము తనపైగల హేతువు చేత యింతద
వ్వలయక వచ్చినారు కృషకాళి యటంచును వారితో ననెన్॥ 602

తే॥గీ॥ "ఇప్పుడే యధికారులకేను వినుతు
కమ్మ వ్రాసి పంపింతును – కమ్మతీంద్ర
కష్ట నష్టములను యలక్ష్యమ్ము జేసి
పన్నులెక్కువ లాగుట పాపమనుచు" ॥ 603

తే॥గీ॥ ఎన్నొ నెపములు చూపించి పన్నులేసి
యనువుగా వాని రాబట్టు చణకజుండు
బోడితలకు మోకాలికి ముడులు వేయు
రాజకీయ చతురుడు "అణ్ణాజి దత్తు" ॥ 604

కం॥ అడిగినను వార లెప్పుడు
నుడుగక ప్రత్యుత్తరమ్ము నొసగెద రొకటే
వదువున నుండెడు నుడుగులఁ
"బడుగుల యభివృద్ధికేము బద్ధులమనుచున్"॥ 605

ఉ॥ పన్నులు వేయుటందు యెటువంటి యనీతియు లేదు కర్షకా
పన్నములన్ గ్రహించి తగు పద్ధతులన్ సహకారమిచ్చి నా
మెన్నియొ బీళ్ళు సాగుబడి కిమ్ముగఁజేయగ కృష్టి సాధనల్
దున్నుటకున్ పశూత్కరము–తోయపు కుల్యలు, గత్త, బీజముల్"॥ 606

(కమ్మతీంద్రు=కర్షకులు) మట్టముసేయు=నాశనముచేయు

(కృష్టిసాధనలు=వ్యవసాయ పనిముట్లు; గత్త=ఎరువు; బీజములు=విత్తనములు)

తే॥గీ॥ ఇట్టి ప్రత్యుత్తర మమాత్యు లిత్తురనుచు
ముందె యూహించె - ప్రగడల చంద మెపుడొ
తెలిసి యుండుటచే - వారి తీరులందు
మార్పు యూహించ లేదు - శంభాజి యెపుడు॥ 607

సీ॥ శ్రమకోర్చి చెమటోడ్చి జనత యాకలి తీర్ప
మన్నుహొన్నుగ మార్చు మాంత్రికుండు
మోకాళ్ళు దాటని ముదుక పంచెను దాల్చి
యిలకు పట్టు వలువ లిచ్చు దాత
యత్యనావృష్టుల యత్యయమును గెల్చి
మరువు తరిగ మార్చు కఱుదులాడు
తాను యంబలి త్రాగి మేనుడయ్యని వారి
కమృతాశన మొసంగు హాలికమణి॥

ఆ॥వె॥ అట్టి వారి నోట అహి ఫేనముంబోయు
రీతిపన్నులొడుచు నీతి తగునె?
పాడి పశువు నుండి పాలు దండిగ గోరి
పొదుగు చెండునట్టి విధముగాదె ! ॥ 608

తే॥గీ॥ ప్రభుత యునికికి యూత కంబములు నైన
హాలికులనెరియించుట హాని యనుచు
తనదు పరిపాలనమున "రత్నగిరి" పుడమి
శంభు హలికాభివృద్ధి లక్ష్యముగఁనేలె ॥ 609

'వీర శంభాజి' శృంగారపురమున ఒంటరి తనమును అనుభవించుట

చ॥ తనకిట లేరు వేరెవరెదన్ ముడివిప్పి యధేష్టరీతి భా
షణములొనర్ప - లో పొడము సంతసమైనను, బాధయైన పై
కనుటకు, నాప్త లౌహితుల యాశయముల్దెలియన్ మరెట్టి చిం
తనలను పాలుపంచు కొనునట్టి వయస్యులు నాపురమ్మునన్॥ 610

(హొన్ను=బంగారము; మరువు=ఊషరక్షేత్రము; తరి=మాగాణి; కఱుదులాడు= నేర్పరి; అహిఫేనము=విషము; చెండు=కోయు)

మహావీర శంభాజీ, కవికలశుల పునస్సమాగమము

కం॥ మధురా పురమున మును వి
ప్రధిష్ణ్యమున తాను వారి బాలుర నొకడౌ
విధమున నుండగ నక్కడ
బుధుండు "కలశుడు" కనోజి బొమ్మడు 'సచి'గాన్॥ 611

ఉ॥ అట్టి నిగూఢ వాస సమయమ్మున నెంతొ సుదూర దేశమం
దెట్టులొ మైత్రి యేర్పడెను ధీమణి యైన కనోజి విప్రుడున్
దిట్టరి శాస్త్ర శస్త్రముల తీర్పున నేర్పున - బాల శంభుకున్
పట్టగుచెల్మి యాకలశపండితుతో కలిగెన్ యదృచ్ఛమై ॥ 612

చ॥ చుఱుకుదనమ్ము నుట్టిపడు చూపులతో విశిఖాగ్రతీక్ష్ణ ధీ
గరిమను చూపు భాషణము - క్రమ శరీర విలాస రేఖయున్
పరగెడు శంభుడా కలశ పండితు మానస మాది వీక్షనే
పఱిగొనె - క్షాత్రతేజము రవంతయు తగ్గని వర్తనమ్మునన్ ॥ 613

తే॥గీ॥ సమలు పదిహేడు గడచెను శంభునిగని
మధురలో విడి పోయిన మైత్రిఁదలచి
కలశుడిప్పుడు యువ శంభుఁగలియ దలచె
వింశతి సమప్రాయు - మరాట వీరవరుని ॥ 614

చ॥ మొదలిడె పైన ముజ్జయిని భూమిని వీడుచు వారువమ్ముపై
తదుపరి దారిలో కనియె తౌర్క్యపు పాలన మందు దేశమె
ట్లదవద పాలునై చెడెనొ! యంతయుగగ్గుల కాడునై జనుల్
మెదలుచు నుండిరో-బడుగు మేనులతో నడపీన్గులట్లుగన్ ॥ 615

కం॥ అనయమును ప్రబోధించును
పనివడ ఔరంగజేబు పడవాలులకున్

(విప్రధిష్ణ్యము=బ్రాహ్మణ గృహము; బొమ్మడు=బ్రాహ్మణుడు; సచి=స్నేహితుడు)

(పఱిగొను=కొల్లగొను) తౌర్క్యపు=తురకలదైన

మన "ఇస్లామున" కాఫిరు
లనెట్లయిన చంపుటను "హలాలను" సూక్తిన్॥ 616

కం॥ జగడమునఁ బ్రదుక "ఘాజీ"
లగుదురు - దోరిన "షహీదు" లగుచును దివిలో
సొగయుదు రనంతముగ - న
ట్లగుటను యుద్ధమ్మొ చేయుడని పురి కొల్పున్॥ 617

సీ॥ ఊళ్ళకు యూళ్ళనే యూచముట్టుగ దోచి
కొంపలన్నియు దరి కొల్పినారు
గుడులన్ని నేలనుఁబడగూల్చి మణి, భర్మ
రౌప్య నిధులను కొల్లాడి నారు
పంట పొలములన్ని పాడఱ జేయుచు
నేలి కఱవును సృష్టించినారు
పశు సమూహములను విశసన మొనరించి
సేద్యమున్, పాడిని చెఱచినారు ॥

తే॥గీ॥ కన్యలని, సతులని విచక్షణయె లేక
స్త్రీల నీలువు గోల్పోవఁ జేసినారు
బలిమి హైందవ ధర్మముఁ బాయజేసి
మలక లెందరిమతమునో మార్చినారు ॥ 618

తే॥గీ॥ దారి పొడుగున యిటు వంటి ఘోరములను
చూచి నిర్విణ్ణుడై కలశుండు కనలె
యెప్పుడెవ్వరిచే భారతేల కిట్టి
కష్టములనుండి నిష్కృతి కలుగుననుచు॥ 619

(కాఫిరు='ఇస్లాము'ను విశ్వసించని వాడు; 'హలాలు'=అనుమతింపబడినది)

(ఘాజీ=గొప్ప వీరుడు; షహీదు=మృతవీరుడు; దోరు=మరణించు; సొగయు=సుఖించు)

(దరికొల్పుట=కాల్చుట, భర్మ=బంగారము; రౌప్యము=వెండి; కొల్లాడు=దోచుకొను; పాడఱు=చెడిపోవు; ఏలి=కృత్రిమమైన; విశసనము=చంపుట; ఈలువు=మానము)

తే॥గీ॥ 'కాన్యకుబ్జము' నుండి 'కొంకణము' వరకు
కుదరమెక్కి బోవ నడుము చదరమయ్యె
సింధు, కానన, పర్వత శృంగ, కటక
కంటకమయ దేశము నెల్ల కడచి కడచి ॥ 620

తే॥గీ॥ కడకు చేరె కలశుడు శృంగారపురము
పథ పరిశ్రాంతుడై ధూళి పైనిఁగ్రమ్మ
కురులు చెదరి యుడుపులు తుత్తుఱు గొనంగ
క్రొత్త యాగంతుఁగని యారెకులు నరగొని॥ 621

ఆ॥వె॥ వలగొనుచు నతనిని వార్వమ్ముతో పాటు
శంభు సముఖమునకు సరగ వచ్చు
నటుల వెన్నడికొని యా పైనయాతని
గుఱిచి తమ యనుమను నెఱుకచేయ ॥ 622

తే॥గీ॥ పది సమలుగడచెను – పరస్పరము చూచు
కొని – యిపు డిరువురికి పోల్కి కొంత మారె
ఇరువదేడుల యువరాజు నిపుడు శంభు
ప్రౌఢవయసున కలశుండు పరిణతమతి॥ 623

తే॥గీ॥ ఒకరినొకరు గుర్తించిన యుత్తరక్ష
ణమున సాగె సంభాషలనంతముగను
ముందిరువురి యోగక్షేమములరసికొని
అవల రాజ్యచర్చోత్సుకు లైరి వారు ॥ 624

సీ॥ వింటివా శంభు! నీ వెపుడు మధుర వీడి
వచ్చితివో, తదుపరి సమీప
కాలమునందె మొగలుసేన లౌరంగ
జేబు నానతిని విజృంభితులయి

(కుదరము=గుఱ్ఱము; కటకము=బోయ)
(తుత్తుఱుగొను=మాయు; ఆరెకులు=రక్షక భటులు)అరగొను=శంకించు
(అనుమ=అనుమానము)

మలకల పూజ్యరమ్జాను పర్వమునాడె
మధురాపురి పయిని ప్రధనమునకు
పూనుచు శ్రీకృష్ణ పుణ్యాయతనమును
కొల్లగొట్టి పిదప కూల్చి వైచి ॥

తే॥గీ॥ యడ్డగించిన వారల నడచి వేసి
యాస్థలమునందు తమ ప్రార్థనాలయమును
కట్టు కొనిరి శాశ్వతముగ "కన్నయ" కట
నిలువ నీడయె లేకుండ తొలగబెట్టి ॥ 625

కం॥ ముప్పది లక్షల రూకలు
కొప్పరముగ వెచ్చబెట్టి గుడి కట్టించెన్
గొప్పగ రుద్ర ప్రతాపుడు
తప్పుడు మలకలును దాని ధ్వంసించిరయా ! ॥ 626

శా॥ అనినన్ శంభుజి జేవుటింప కను లిట్లాడెన్ "బుధాగ్రేసరా!
యనయుల్ మల్కలు చేయు దుండగములన్నాకట్టగా హైందవుల్
మునుకోన్నేరరె? రుద్రసింహుని భటుల్ బుందేలు లేమైరి? యి
ట్లనిరుద్ధమ్ముగసాగు చుండ వలెనే? యౌరంగజేబ్ దౌష్ట్యముల్"॥ 627

తే॥గీ॥ అనిన కలశుడునగి "యమాయకుడ వోయి
శంభు" సాయుధులగు వారి జృంభణమ్ము
నాపదుర్బలుల్ పౌరుల కలవియగునె
కత్తికిన్ కత్తి యెపుడు ప్రత్యుత్తరమ్ము " 628

హిందూరాజులలో అనైక్యత

ఉ॥ కత్తికి కత్తి, కన్నునకు కన్నని సాయుధమైన సైన్యమా
యత్తమునై బరిన్ దిగక నాగునె దుష్ట తురుష్కధాటి - తా
మిత్తఱి పొత్తులన్ వదలి యీసుమెయిన్తమలోన తామె భూ
భృత్తులు హైందవుల్ పగలు పెంచుకొనన్ యెవడాపుమ్లేచ్ఛులన్?॥ 629

(కన్నయ=శ్రీ కృష్ణుడు)

తే॥గీ॥ మనల నైక్యత లేమియె మల్కల కుసి
యొకడె ఔరంగజేబు హిందూర్వికంత
బాధ్న - మనకెప్డు రాజులు పల్లె కొకడు
"కేంద్ర" ప్రభుత లేమిని మనకెపుడు నోగె ॥ 630

తే॥గీ॥ అపుడుకలశుడు మనసులో ననుకొనెనిటు
"నగ్గి రేగంగ గాలి తోడైన యట్లు
శివజితోపాటు శంభాజి ప్లవులపైన
దూకినను - వారి జృంభణ కాకయున్నె?॥ 631

శా॥ శివజీ శంభుని గూడి యప్పుడపుడా జ్యేష్ఠాత్మజోద్రేకము
న్నవరోధించుచు - చాకచక్యమును లౌక్యమ్మున్ ప్రదర్శింపగా
తవు సందర్భములందు - దుందుడుకు వృత్తంబున్నడంగించు కం
దువ నేర్పించిన - వారికెంత పని హిందూరాజ్య నిర్మాణమున్" ॥632

కవికలశు - శంభాజీల సంభాషణము

తే॥గీ॥ 'షాహజాదు మౌజము' తన జననిఁ జూడ
వచ్చియుండెను 'యౌరంగబాదు' కనుచు
కలశుడు తెలిపె, శంభాజి కంత వరకు
బయటి వార్తలు తెలియుట బ్రాతియయ్యె ॥ 633

మ॥ తనప్రాణమ్ములు కాచినట్టి 'షహజాదా' పేరు విన్నంత శం
భునకున్ జ్ఞప్తికి వచ్చె - "దుష్టుడు మొగల్ భూనేత "ఔరంగజే
బునకున్ మానవతా ప్రపూర్ణుడగు నీ పుణ్యుండు "మౌజమ్మె"టుల్
తనుజుండయ్యె" నటంచు విస్మితుడునౌ తత్కాల సందర్భముల్॥ 634

(ఓగు=నష్టము)
(ప్లవులు=శత్రువులు; ఆక=అడ్డు) సందర్భము=సంఘటన
(కందువ=నేర్పు; తవు=తగు)
(బ్రాతి=అరుదు)

తే॥గీ॥ మరియు "దక్కన్ సుబేదారు" మణియము గొని
వచ్చెను "దిలేరుఖానుడన్" వార్త తెలిసె
తనను జయసింగు 'కాహి' గా నునిచినపుడు
శంభు 'పులిబిడ్డ' యని ఖాను చాలమెచ్చె ॥ 635

షాహజాదు మోజము తన తండ్రిని పద భ్రష్టుని చేయుటకు పన్నాగము పన్నెనని కలశుడు చెప్పుట

తే॥గీ॥ ఇంత కన్నను వింత వృత్తాంత మొకటి
కలశు తెలిపెనది - యపాయ కరము కరము
"షాహజాద" "మౌజము" తన జనకు తీరు
తో విభేదించి యెదిరింప దొరకొనె" నని ॥ 636

కం॥ తన నెదిరించెడు వారలు
స్వనందనులనైన పాదుషా శిక్షించున్
పనుచును "గ్వాలియరు" 'చెఱ'క
ట నల్ల మందిచ్చి చంపుటకు బందీలన్ ॥ 637

ఉ॥ ఆయువరాజు వచ్చె తన యాత్మ పితన్ పదవీచ్యుతుండుగా
చేయుచు - నెమ్మిగద్దెపయి చేరగ భావి మొగల్విభుండు నై
సాయము కోరనేడిటకు శంభుని - మున్నెయెఱింగి యున్కి తా
నాయవురంగ బాదున తదద్భుత శౌర్యము పిన్న నాటనే ॥ 638

చ॥ ఇది వినినంత శంభునకు నిందెదియో నొక కుట్ర యున్నటుల్
యెదకును తోచె - యాతలపునే పయికిన్ కలశుండునున్ వినన్
విదితము చేసె - యీ మొగలు వీటికి క్రొత్తయె? యౌరసత్వపు
న్నదవదలిందు యొడ్ల తగులాటమనన్ శలభాగ్ని చందమౌ ॥ 639

(ఆహి=పూచీ) మణియము=అధికారము

(ఒడ్లు=ఇతరులు; తగులాటము=జోక్యము; శలభాగ్నిచందము=మిడుత అగ్నిలో ప్రవేశించుట)

చ॥ తరముల నుండి రాజపద తర్షకు లెవ్వరు గాని - పాపమం
చరగొనకుండ గద్దెపయి సంస్థితులౌటయె లక్ష్యమంచు - నె
వ్వరు తమ కడ్డు వచ్చుటకు పాయను గల్గిన నట్టివారు - సో
దరులును, సొంత బిడ్డలును, తండ్రియునైనను చంపలేదొకో॥ 640

తే॥గీ॥ ఇంత యెందుకు? మనకండ్ల యెదుటలేడె?
స్వయము ఔరంగజేబు రాజ్యాశతోడ
యన్న దమ్ములను వధించె - నయ్యనింట
కట్టివైచె, నగ్రస్వజుఁకారఁనుంచె॥ 641

శా॥ ఈ రాజ్యాశకు లొంగినట్టి మనుజుండెవ్వాడుగానీ యిటుల్
ఘోరమ్ముల్ పొనరించు - నిప్పుడు నెదోకుట్రన్నొనర్పంగ నె
వ్వారో వేచిన రీతి దోచు మన కావంతైన జోక్యమ్ము నిం
దేరీతిన్ వలదెప్డు - వైరి మనలన్నింట్రమ్ముకున్ నెట్టినన్॥ 642

'వీర శంభాజి' తన తండ్రి 'శివాజీ' తనను కర్ణాటక జైత్ర యాత్రకు వెంటకొని పోలేదని విచారించుట

తే॥గీ॥ ఛత్రపతికి నౌరసుడగు 'శంభు' నేడు
రత్నగిరి సుబేదారుగా రాజ్యమందు
కొంకణమ్మున నొక ప్రక్క కొదిగె యుండె
తండ్రి కన్నడ భువిని యుద్ధము లొనర్ప ॥ 643

చ॥ ఇది తనమానసమ్ము నెపుడేర్చుచు నుండె తుషాగ్ని చందమై
కొదలును నేమి లేవు తనకున్ - జనకుండు తనన్ త్యజించియే
కదనము సేయ వెళ్ళె గద! కన్నడ భూమికి - నంతె గాకతా
నెదనను జ్యేష్ఠ పుత్రుడనకే యెడఁజేసెను రాజధానికిన్ ॥ 644

(పదము=పదవి; తర్షకులు=పిపాసులు; పాయ=అవకాశము; అరగొను=సందేహించు)

(అగ్ర స్వజుడు=పెద్ద కొడుకు) (ఇంట్రము=ఇఱుకున బెట్టుట)

(తుషాగ్ని=కుమ్ము; కొదలు=లోపములు; ఎడసేయు=దూరము చేయు)

చ॥ వికలమనస్కుడై తలపు వేడి శమించుటకన్న యట్లు - యిం
టికికడుదవ్వుకేగ కురుటిన్నధిరోహణచేసి పల్లమే
యక వెనుపైన వట్టిగనె యశ్వదరద్విదుడౌట - యేగుచు
న్నొక కొటికన్ కనెన్ యచట యోలిగ నానక నాదముల్ వినెన్॥ 645

కం॥ దుందుభి నాదము శంభు నె
డందన్నుప్పొంగ జేయు - ఢమరుక నాదం
బిందు కళాధర తాండవ
సందర్భమునందు మ్రోయు చాయగఁ దోపన్॥ 646

ఉ॥ ఈశునపైన భక్తి తమ కెప్పుడు వంశ పరంపరాగత
మీశియు నింటి వేల్పు - పితకిడ్డ యభిఖ్యయు నామెనామమే
యీశుని గూర్చి తాను విలిఖించెను ము"న్బుధ భూషణమ్ము"-స్వ
ర్వేశుల భాష యందు సవరించిన కావ్యములోన భక్తిమై ॥ 647

'మహావీర శంభాజి' రచించిన "బుధభూషణము" లోని ఈశ్వరుని స్తవము

ఉ॥ "ఆతడు సింహసన్నిభుడు - నర్ధశశాంకలసద్వరాంగుడున్
భూతి విలిప్తదేహి -నభమున్,భువిఁగాచునుఫాలదృక్కుతో
శీతనగాత్మజాత సతి- స్నేహము స్నిగ్ధము పెన్మిటన్న - నీ
కేతన మా హిమాద్రి-పదికేలులల చూపరి- శ్రీదు మత్రుడున్॥ 648

ఆ॥వె॥ జోత లిడుదునట్టి శూలికి, శంభుకు
దేవ దేవుడాది దేవునకును
చిన్న తనము నందు జేజి చెప్పుచు నుండె
యడిగినప్పుడెల్ల హరుని గూర్చి ॥ 649

(కురుటి=గుఱ్ఱము; పల్లము=జీను; దరద్విదుడు=హృదయ మెఱిగిన వాడు; కొటిక=పల్లె; ఆనకము=తప్పెట)

(ఈశి=పార్వతి; స్వర్+వేశులు=దేవతలు; (సంస్కృతము) దేవతలభాష

(వరాంగము=శిరము; నీకేతనము=వసతి; చూపరి=అందగాడు; శ్రీదుడు=కుబేరుడు) (జోతలు=నమస్కారములు; జేజి=పితామహి)

ఉ॥ ఈశుడె శక్తి – యీజగము లెల్లను నాట్యము చేయు నీశుతో
పేశల సౌమనస్యములు విచ్చిన- నందము వ్రచ్చి జీవి యా
కాశముఁజూచినన్ తొలిగ- కాండము కొమ్మకు నాకు మొల్చిన
న్నాశలుపండి ధాత్రి కను నర్భకమున్–శివతాండవాంకముల్॥650

ఉ॥ ఈశుడె – దీపకీల ప్రసరించు తమోపహమైన వెల్గులో
శైశిరశీత మోర్వ శిఖిజాపెడు జిహ్వాల దాలి వేడిలో
ప్రాశన సిద్ధికై రగులు వంట ప్రొయిల్ కలిగించు 'కాక'లో
ఆశర రూపియౌచును సహాయ మొనర్చు సమస్త సృష్టికిన్ ॥ 651

శివతాండవము

ఉ॥ ఆపరమేశుడే కుపితుడై నృతి యాడెడు రుద్ర తాండవం
బాపెడు శక్తి లేదెచట- భర్గజటాస్రము లుద్గమించుచున్
ఊపెడు చర్నకోలలటు – ద్యోడుగణమ్ముల నేలరాల్పగన్
తాపగ నేల పాదముల తాకిడికిన్ జగముల్ వడంకెడున్ ॥ 652

తే॥గీ॥ హరుడె కోపించి ఫాలాక్షి తెరచెనేని
ప్రళయ వహ్ని కీలలు రేగివార్ధిచయము
నంటుకొనఁజేయు నీరమ్ము నావిరవగ
శివుడె కర్త, భర్తయు, హర్త సృష్టికెల్ల ॥ 653

హాలహాల భక్షణము

శా॥ క్షీరాబ్ధిన్ మధియించి యందుగల నిక్షేపమ్ములన్ పొంద త
త్పారమ్మందు సురాసురావళికి మంధానమ్ము మంధాగమై
బోర ప్రాకుడుమన్నె వాసుకిని త్రిప్పాత్రాడుగా చిల్క హో
హారావంబులు రేగె దుగ్ధనిధిలో హాలాహలం బొట్టగన్ ॥ 654

(పేశల=సుకుమారమైన; సౌమనస్యములు=పూలు; ధాత్రి=తల్లి; అర్భకము=శిశువు; అంకము=గుర్తు) ఆశరుడు=అగ్నిదేవుడు

(నృతి=నాట్యము; అస్రములు=కేశములు; ఉద్గమించు=పైకిలేచు; భోడు(భ+ఉడు)=ఆకాశము నందలి నక్షత్రములు; తాపగ= గట్టిగాతాకుట)

(పారము=ఒడ్డు; మంధానము=కవ్వము; మంధాగము=మందర పర్వతము; బోరప్రాకుడు మన్నె=పాములకు రాజు; ఒట్టగన్=పుట్టగా)

కం॥ చుక్కైన చాలు హాహాలం
బొక్కుమ్మడి జగము లెల్ల బూడిద చేయున్
వెక్కసమై గరళాగ్నులు
దిక్కులనలమె - త్రిజగములుదీనత నొందన్ ॥ 655

చ॥ అడలి సురాసురుల్ మునులు నన్నిజగమ్ముల భూత సంఘముల్
మృడునికి మ్రొక్కి దేవ! కనుమీవిపదుద్ధతి-నీదు సృష్టియే
పిడికెడు బూడిదై మిగులువేళ తటస్థము నయ్యె నీవె యీ
యిడుమ - దొలంచగాకలుగు నెక్కటి వంచును సంస్తుతింపగన్॥ 656

శా॥ ప్రళయాభ్ర ప్రతిమాన కాళిమముతో వ్యాపించి హాలాహలం
బళుకం జేయుచు సర్వ జీవులను నిర్వార్యంబునై చేతనన్
తొలగంజేయుచు నుండ, శంకరుడు క్రోధోద్వేగుడై క్ష్వేళమున్
తలమందున్నొక 'యుండ'గా మలిచి మ్రింగన్ నిర్వికారాత్ముడై ॥ 657

కం॥ అదిగని గ్రక్కున యంబిక
యదిమెను తన భర్త గళము - నాపుచు విషమున్
"మదనారికుక్షిఁజేరిన
సదమదమొనరించు గరము సర్గము ననుచున్" ॥ 658

ఆ॥వె॥ అగ్గి ముద్ద వంటి హాలాహలమ్మును
గళమునందె నిలుపు కారణమున
నల్లనయ్యె శివుని గల్లమ్ము నందుచే
'నీలకంఠు' డనగనెగడు భవుడు ॥ 659

చ॥ భువనములన్ని మాడి మసి ప్రోవులునై పడగన్ గరార్చులన్
తవిలి సమస్త లోకముల దాఁ పరిరక్షణ సేయ - ముందుగా

(అడవ=భయపడి; యిడుమ=కష్టము; ఎక్కటి=వీరుడు)

(అళుకు=భయపడు; నిర్వార్యము=అపరానిది;చేతన=స్పృహ; క్ష్వేళము=విషము) తలము=అరచేయి; సదమదమొనరించు=నశింపజేయు

(గరము=విషము) సర్గము=సృష్టి

(గల్లము=గొంతు)

మివులుచు వేల్పులందరికి - మ్రింగె విషాగ్నిని వేల్పుబువ్వటుల్
శివునిల దేవదేవుడని చెప్పుట కింకను శంకయుండునే ॥ 660

తే॥గీ॥ శంభు సాహస గాథ యీ సరణినుండ
కృష్ణ పరమాత్మ కథ నాలకించినపుడు
తలచు కొలదిని యేదియో కలతరేగె
శంభు లేయెదఁ బాల్యంపు స్మరణ వలన ॥ 661

శ్రీకృష్ణ జననము

ఉ॥ "పుట్టిన వెంటనే జనని మోమయినన్ గనకుండ పెన్జడిన్
పుట్టికఁ పొత్తులన్ నిదురపోయెడు పట్టినిమోచుకొంచు తాఁ
గట్టులు రెండుఁదన్ని వడిగా ప్రవహించు కళింద వాహినిన్
నెట్టుచు రెండు పాయలుగ నేగెను యా వసుదేవుడద్దరే ॥ 662

ఆ॥వె॥ ఆది శేషుడప్పుడాత పత్రముఁబట్టె
వర్షధారలకును ఫణులు విప్పి
కీచు రాళ్ళు గూడ కిక్కురు మనలేదు
మూకలయ్యె సర్వ లోకములును ॥ 663

ఉ॥ ఘోషము నందు కుక్కలును కుక్కిన పేనుల వోలె నుండె, నా
శేషశయాను రాకకయి చిత్తములుబ్బగ వేచియుండె, సం
తోషముమీరగోగణము - దుప్పటు లన్మునిగుంౖడ్రి[ప్రే]లు- ని
ర్దోష యశోదఁ జేర్చి కొమరున్ వసుదేవుడు నేగె 'మాయ'తో ॥664

తే॥గీ॥ మరల పంౖడ్రెండు నేండ్లకు మధుర చేరి
కంస విధ్వంసియై శౌరి కారయందు
చిరము [మ్రగ్గి]నపితరులు స్వేచ్ఛనొంద
మొదటి సారిగ వారల మోములుగనె ॥ 665

(గరార్చి=విషాగ్ని; తవిలి=పూని; మివులుచు=దాటు; వేల్పుబువ్వ= అమృతము)
(జడి=జోరువాన; పుట్టిక=బుట్టి;పట్టి=కొడుకు; కళిందవాహిని=యమున; అద్దరే=అర్ధరాత్రి)
(ఘోషము=గొల్లపల్లె; వ్రేలు=గోపకులు; నిర్దోష=అమాయిక; మాయ= యశోదకు జన్మించిన మాయ)

తే॥గీ॥ అట్టె వారికి తమపట్టి పుట్టగానె
తమకు దూరమ్ము నౌచు నందకుల మందు
పెరిగి యిన్నేళ్ళకు మరల తిరిగి వచ్చె
పోయినదనుకొనిన నిధి పొందినట్లు" ॥ 666

తే॥గీ॥ ఇట్లు శ్రీ కృష్ణలీలలు నెద తలంచి
జేజి జీజియా చెప్పగ చిన్ననాడు
విన్న ప్రాచీనగాథల నన్ని మరల
తరచుచుండ నెదో నవ స్ఫురణకలిగె ॥ 667

శ్రీ శంభాజీ గత స్మృతుల యంతర్మధనము

తే॥గీ॥ తాను తల్లి మోమును చూచి తనుచు చెప్ప
గాదు రెండేడ్ల పసిబిడ్డ గాన యపుడు
తల్లి గతియింప జేజియు వెల్లి గొనెడు
ప్రేమతోఁడ తనను పెంచి పెద్దజేసె ॥ 668

తే॥గీ॥ ఏడెనిమిదేండ్ల ప్రాయాననేగ వలసె
నంబరేశుని కొలువుకు 'నాహి' క్రింద
మరల పంద్రెండు నేడుల తరుణ మందు
వప్తకు, తనకు 'ఆగ్ర' నిర్బంధమయ్యె ॥ 669

చ॥ పితరుడె యేదొ యెత్తుగడ వేసి చెఱన్ కడచేసి 'ఆగ్ర' భూ
మితిని యతిక్రమించి చని మేద్పురుపన్ కనువారిఁదారిలో
యతివర వేషధారులయి యధ్వములంజను చుండి మధ్యలో
కొతుకక నొంటిగా మధురకున్ననిచెన్తన నెంతొ గుట్టుగన్॥ 670

తే॥గీ॥ జనకు డా"రాయగడము"కు చనెడు వరకు
దారిలోనేరికి మలికితమ్ము లేని
పయన మాటంకములురాని పగిదిసాగ
తననువిడనాడె నట తండ్రి దారి నడుమ॥ 671

తే॥గీ॥ కాని బాలుడు వీడు నేకరణి నన్య
దేశమున నతర్కితముగ ప్రవేశమైన

నోర్వ గలడె తానచ్చుట నొంటి మనగ
నంచు తర్కించినే? క్షణమైన తండ్రి॥ 672

తే॥గీ॥ అదియుగాక తామిద్దరు పథికులైన
జనులు శంకింతురనుచును జనకుడపుడు
చాటె శంభాజి కాలగోచరుదు నయ్యె
బాటనడుమ యాన శ్రమ వలన ననుచ ॥ 673

కం॥ ఇంగను బలమగు నమ్మక
ముంగలిగించుటకు తండ్రి ముచ్చట దీరన్
సాంగముగా పరకర్మను
గంగా తీరమునఁ జేసె గాదిలి సుతుకున్॥ 674

తే॥గీ॥ రాజ నీతియు నాత్మ సంరక్షణమును
కలిసి తండ్రి చే యట్టి జాగ్రత్త కలుగు
పనులఁజేయించి యుండిన బాగెగాని
బుడుతనికి యెట్లు యీపనుల్ బోధపడును?॥ 675

మ॥ తనకావశ్యక మయ్యె నా పిదపపద్నాల్గేండ్ల ప్రాయమ్ము నం
దున ఢిల్లీ యువరాట్ 'ముయజ్జము' కడన్నుద్యోగియై యశ్వరా
ట్పదవి న్నాయవురంగబాదునను నిల్వన్నప్డె 'పాద్షా' తనన్
తుదముట్టింప దలంప 'షాహ్జదయె'తన్నోమెన్ దయాసాంద్రుడై॥ 676

తే॥గీ॥ ఆ'ముయజ్జము' కు తనెంతొ యప్పువడియె
హనువు తప్పించి నిడె పునర్జనువు తనకు
నేడతండె కోరెను తన తోడు పాటు
పితరునిన్దించి తా ఢిల్లి పీఠమెక్క ॥ 677

చ॥ తన నొక పుట్ట చెండు వలె తన్నుచు నట్టిటు నాటలోని వే
డ్కనను భవించు మాడ్కి యిట కానగ వచ్చును గాని- జ్యేష్ఠ పు
త్రునిపయి చూపగా దగిన తోరపు బాధ్యత కానరాదు - యీ
పనులను మంచికే యనుచు బాలకుడెట్లు తలంప సాధ్యమౌ? 678

(అతర్కితము=హఠాత్తుగా; తర్కించు=ఆలోచించు)

(హనువు=హత్య; జనువు=జన్మము)

తే॥గీ॥ మందలింపగ తన పితన్ మాత జీజ
యాంబ లేదిపుడా సవతాలు గలదు
సవతి కొడుకుపై తనకు వాత్సల్యమున్నె?
వీలు చూచి చాడీలను వినుచు గాక॥ 679

ఉ॥ నిప్పున నేయి వోయు వగ నిత్యము నిక్కము దాచు ప్రెగ్గడల్
యెప్పుడు తండ్రి వీనులను నిల్లును గట్టుక చెప్పుచుందు రే
తప్పుడు మాటలో తగు నిదర్శనముల్ యణువంత లేని వా
చెప్పుడు మాటలే జనకు చేతలకుందగు హేతువాయెనా? ॥ 680

తే॥గీ॥ జనకు డా కన్నడ భువిని జైత్రయాత్ర
కై వెడలి యట వత్సరకాలముండి
మరలి రాయగడము చేరి మాసములకు
మాసములె గడచియు, సుతున్మరచినాడు॥ 681

మ॥ తనపై కొపమొ?యంత కెక్కుడగు సాంద్రమ్మైన నిర్లక్ష్యమో?
జనకుండైనను తప్పులివ్వియని నిస్సంకోచమౌ మాటలా
డిన సందర్భము గుర్తులేదుతనతో డెప్డున్ గతమ్మందు - నే
డును మాటాడుట లేదు-దూరముంచుటయొ నాడున్నేడు కన్పట్టెడున్॥ 682

ఉ॥ తప్పులు మోపి తప్పుకొని తాము వినోదము చూతమన్న వా
రెప్పటికైన వారి గుణహీనత నల్వురిలో బయల్పడన్
తప్పక నెట్టి శిక్షకయినన్ తలవంచుట తప్పదింక - తా
నిప్పుడమిన్ ప్రశస్తిగొను - నీతి పరుండుగ- ధర్మవీరుగా॥ 683

తే॥గీ॥ లోకులాడెడు మాటలలోన తోచు
నికము, కల్ల తేర్చగ పితనేరదయ్యె
"శంభుజీ" యను తనకున్న సంజ్ఞ వలన
తానొ, గర్హణ గరళము నాన వలసె ॥ 684

(నికము=నిజము)

మహావీర "శంభూజి" ప్రతిజ్ఞ

కం॥ "లోకద్రోహి" హలాహలమ్ము నొకటే గ్రుక్కన్ గొనెన్ శంభుడే
వైకల్యమ్మునుపొందకుండ- జగతిన్ పాలింప ప్రాగ్రీతిగా
నాకోవన్ యువరాజు శంభుడు నపేతాధారనిందా విషో
ద్రేకమ్మున్నడగించి ధీరమతియై రెక్కొల్పు హిందూ క్షితిన్ ॥ 685

సీ॥ తన యగపాటును గని నగు నెలవంక
డంబంబునడచు 'హేరంబు' నంశ
కొమరు ప్రాయము నందె యమరసైన్యములకు
నాయంకుడైన 'షాణ్మాతు' రాంశ
లంకేశు పతనము క్ష్యింకాళి చే సంభ
విల్లునని శపించు "భృంగి" యంశ
జగములగాపాడ క్షణమాలసింపక
హాహాలమ్మును మ్రింగు "హరుని" యంశ॥

తే॥గీ॥ భువన భాండములను మోయు భవుని మోయు
తందరెరుగక చరియించు 'నంది' యంశ
యన్ని యంశలు తననిప్పు డావహించి
"హిందురాజ్య రక్షకు" తనన్ ముందునడపు ॥ 686

తే॥గీ॥ పుట్టినపుడె కృష్ణుడు తల్లి పొడను గనక
యద్దరేతిరి వ్రేపల్లె నధిగమించి
కన్న తల్లిని మఱపించు గార మొలయ
మనిచిన యశోదనే తన మాయంమునిచె ॥ 687

తే॥గీ॥ అడుగడుగునకు నాపదలడర జేసి
కృష్ణందునుమ కంసుడు నసహిష్ణుడగుచు
నెన్ని యెత్తులు వేసిన సున్నజేసి
కృష్ణడే మాతులుం గంసు గీట డంచె ॥ 688

ఉ॥ బన్నము లెన్నియైన చను బాలను గ్రోలు వయస్సు నుండి ఆ
వెన్నుడు చూపినట్టి కడు విస్మితి గూర్చెడు లీల లెన్నియో

కన్నయదృష్ట మప్డు సమకాలికులందరి కబ్బె - నేటికిన్
విన్నయొడల్ గగుర్చును - యవిష్ణగదావినె జేజి చెప్పగన్ ॥ 689

తే॥గీ॥ ఆ మహాదేవుడప్డు లోకావనార్థ
మెట్లు హాలహలము నాహరించి నాడొ !
బాల శౌరి విపత్పరం పరలు దాటి
యెటు జగద్గురువయ్యె - తానటులెయగును ॥ 690

మ॥ ముధకారాదిక శంభుజీబ్రదుకు - మున్ముందున్జలజ్జ్వాలయై
ప్రధనమ్మందున తండ్రి జూడ నరులన్ భంజించి హిందూస్వతం
త్రధరా ప్రాభవ సంప్రతిష్ఠకును మూలంబౌ పితాజీప్రయ
త్న ధురావాహిగ శంభుడేచు, మొగలుల్ త్రస్తాత్ములై పాఱగన్ ॥ 691

మ॥ అటు సాల్హేరిటు చోళమండలముదీచ్యాగస్తి దిగ్మధ్య భూ
తట మందంతట యున్న కోటలపయిన్ దర్పించి కాషాయ రు
క్పటముల్ ప్రేంకణమాడ ఛత్రపతియొప్పమ్మెల్లెడన్ చెల్ల న
చ్చట నాదిల్లి మొగల్ప్రభుత్వము లికన్ స్తంభించు నిర్వీర్యమై ॥ 692

తే॥గీ॥ ఈ మహారాష్ట్ర రాజ్యైరసేద్య పదవి
కేవలము శివాజి సుతానుభావముననె
దక్క రాదతని స్థైర్య, ధైర్య, శౌర్య
ముల వలన దక్కిననె శంభు మోదమందు ॥ 693

తే॥గీ॥ హైందవ స్వరాజ్యమ్ము నిస్స్పంద మగుచు
నిలచి యభివృద్ధి పథమున నెగడ వలయు
శంభుజీ ధ్యేయ మాకార్య సాధనమ్మె
బ్రదికి యున్నను లేక నిష్ప్రాణుడైన" ॥ 694

(విస్మితి=ఆశ్చర్యము; యవిష్ణువు=బాలుడు) ముధా=వృథా
(ధురావాహి=బరువును మోయువాడు; ఏచు=విజృంభించు)
(ఉదీచి=ఉత్తరము; ఆగస్తి=దక్షిణము; రుక్=కాంతి; ప్రేంకణము=నాట్యము; ఒప్పము=అధికారము)

"మహావీర శంభుజీ"కి పుత్రికా జననము

తే॥గీ॥ శంభు పత్ని 'యశూబాయి' జనని యయ్యె
తొట్టతొలి కాన్పు నందు కూతురిని గనుచు
భోసలేకుల దైవము, 'పురహరప్రి
య' యెడ భక్తితోడ "భవాని" యభిదనిడిరి ॥ 695

కం॥ శృంగారించిరి కొమరుగ
శృంగార పురమ్ము నూత్న శోభలొలుక - ను
ప్పొంగిరి 'శంభు', 'యశూ' లు
త్సంగమునన్ ముద్దు లొలుకు తనయను గనుచున్ ॥ 696

తే॥గీ॥ శ్రీ శివాజి యెటిగె తన జ్యేష్ఠ సుతుడు
తండ్రి యయ్యె - తానిప్డు పితామహుడని
యయ్యు నాతడు నెలల పర్యంత మగ్ర
సుతుని పల్కరింపగ లేదు - చూడలేదు ॥ 697

శ్రీ శివాజి యింత పరకు మాతామహుడు మాత్రమే అయ్యాడు - ఇపుడు తొలిసారిగా పితామహుడయ్యాడు

శ్రీ శివాజీ ఆరు నెలల తర్వాత శంభాజీని మందలించుచు లేఖ పంపుట

తే॥గీ॥ అట్టులుండగ నొకనాడు ననుచరుండు
లేకలను రెండు శ్రీ శంభుజీ కొసంగె
కమ్మయొకటి పిత - "దిలేరుఖాను" నొకటి
పంపిరి, తొలుత చదివెను వప్తలేఖ ॥ 698

తే॥గీ॥ అగ్గిపై జల్లు నాజ్యమ్మునట్లు నుపరి
లేఖ పంపె సుతుని మందలించుటకును
"పన్నులందండు సచివుల పైన వేసి
నావభాండములను వారనైతికులని" ॥ 699

ఉత్సంగము=ఒడి; వప్త = తండ్రి

తే॥గీ॥ "బాలుడ వీవు - నీయనుభవమ్మును చిన్నది - పిల్లకాకి 'యుం
డేలు' ప్రఘాతము న్నెఱుగునే యను నట్లుగ, నీయపక్వతా
వాలములైన యోచనలపారప్రశాసన కార్య దక్షధీ
శాలు రమాత్యులందున దొసంగులు చూపగ సాహసించునే॥ 700

తే॥గీ॥ శుల్కములె ప్రధానాయము క్షోణిపులకు
నాదిలుషహాను, మొగలుల నాపగలుగు
సైన్య పోషణకెంత వెచ్చమ్ము నగునొ?
నీదు బాలిశ బుద్ధి గణింపలేదు ॥ 701

తే॥గీ॥ నీ విపుడెఱుగ వలె రాజ నీతిలోని
మివుల సూక్ష్మాంశములను,, ధార్మిక రహస్య
ములను, 'సజ్జను' గడమునగల మహర్షి
శ్రీ సమర్థ రాందాసజీ చెంత వినుము" ॥ 702

తే॥గీ॥ అనుచు తండ్రి పంపిన పురోణిని పఠించి
యెట్లు స్పందింప వలయునో యెఱుక లేక
పితరు యెదలోని తలపుల విధము నందు
కీలకమెఱుంగ జాలక ఖిన్నుడగుచు ॥ 703

ఉ॥ పుత్రుని పల్కరించుటకు బుద్ధియెపుట్టక పోయినన్ సరే
పౌత్రిని చూడ వచ్చు తలపైనను పుట్టగ లేదె తండ్రికిన్
పత్రము పంపినాడొకటి నారు నెలల్ గతియింప నివ్విధిన్
క్షత్రియ ధర్మమింత కటుకమ్మె?-పితాత్మజ బంధమాలమా?॥ 704

తే॥గీ॥ సుతుని యేణ్ణర్థమైనను చూడరాడు
ఆరు నెలలు పౌత్రిని గన నరుగు దేడు
తన పితాజి యెదదలోతు ధాత యొకడె
యెఱుగునేమొ? నాకది ప్రవల్హికయె సుమ్ము ॥ 705

తే॥గీ॥ ఐన పోయిన దేమి? పిత్రాజ్ఞ మంచి
'సజ్జన'గడముకునుంబోయి సాధు వర్యు
శ్రీ సమర్థ రాందాసజీ చెంత యెంతొ
కొంత శిక్షణందిన లగ్గగునని యెంచి ॥ 706

(కటుకము=చేదు; ఆలము=అసత్యము, అనాదృతము)
(ప్రవల్హిక=గూఢ కావ్యము) పురోణి=లేఖ; మంచి=గౌరవించి

శ్రీ శంభాజీకి దిలేరు ఖాను ఆదర పూర్వక మైన లేఖ వ్రాయుట

తే॥గీ॥ పిదప రెండవ లేఖను విప్పి చదువ
దానిలో దిలేర్ఖాను వాత్సల్య మొలుక
తనను 'పులిబిడ్డ' యనుచు పేర్కొని లిఖించె
"రమ్ము! శంభాజి! మా మొగల్ రాజుగొల్వ" ॥ 707

ఉ॥ రాయగడమ్ములోనగల ప్రగ్గడలందరు నీ విరోధులే
నీయభివృద్ధి నడ్డుటకు నిత్యము నీదుసపత్నిమాతయే
మాయలు పన్నుచున్నయది మంత్రులఁజుట్టను చేర్చి కొంచు నీ
కీయుబు సెన్నడో తెలిసి యేమియు చేయనెఱుంగకుంటివే ॥ 708

తే॥గీ॥ రాయగడమున నీకున్న రాయిడులను
నటులె యిల్లట పల్లునివైన తెలగు
నెఱుగుచుంటి చారులవల్ల యెపటికపుడె
దోమ కుత్తుకఁజొచ్చె సింధురవరమ్ము ॥ 709

తే॥గీ॥ బైల యువరాజనెడు పల్లకీల మ్రోత
మూల మణుగంగ యీగల మ్రోత యింట
ఎట్టు లొప్పితి వోయి? యీ హీనదశను
కొదమ సింగమవే నీవు కదనమందు ॥ 710

తే॥గీ॥ ఇప్పుడైనను మించి పోయినది లేదు
రమ్ము – మొగలు కొల్వునఁజేర – 'రాజ' బిరుద
మేదు వేలతురగముల యేల్బడి గొని
ధనికుడౌ వతన్దారువై మనుము కుఱ్ఱ ॥ 711

ఉ॥ నీ పిత కన్నడమ్మునకనిన్ యొనరింపగ నేగు చుండి – బా
హాపటు శక్తిలో నభినవార్జునజున్నిను దూరముంచె – యే
పాపము నీయెడం గలదు? భార్య యొనర్చిన దుష్ట బోధయున్
ఆ పిశునుల్ ప్రధానులెపుడాడెడు కల్లల చేతనే గదా! ॥ 712

తే॥గీ॥ గడచె యేణ్ణర్ధమా రాయగడము చేరి
నీదు పిత – యొక్కదినమైన నిన్ను పల్క
రింప – నీ తొలి బిడ్డను రిక్కవేసి
చేఱుటకు తీరలేదట చిత్ర మౌర ! ॥ 713

తే॥గీ॥ రాయగడము పన్నెండు జిల్లాల తోడ
రాజరామునకిచ్చెడు యోజనమ్ము
'జింజి' దుర్గమ్ముతో నవాచీన దిశను
కలుగు రాజ్యమ్ము నీ కీయ కట్టడయ్యె ॥ 714

కం॥ నీ కన్న నెక్కువయ్యెను
నీకు న్వైమాత్రుడగు కనీయుడు స్థాయిన్
నీకిదిసమ్మత మగునే
యాకోణము నుండి గూడ యరయుము శంభూ ॥ 715

తే॥గీ॥ తండ్రి, కొడుకుల మధ్య – సోదరుల నడుమ
రాజకీయము లందు వైరస్యముండు
రావణ, విభీషణుల కథనీ వెఱుగుదు
ధర్మజుడు చంపె మామ మద్రాధి పతిని ॥ 716

తే॥గీ॥ గొప్ప సరదారుగా మొగల్ క్షోణిపునకు
మనసు రంజింప చేయుచు మసలు దేని
ఎంత ఎత్తుకు నీ స్థాయి యేగగలదొ?
నేను సైతము నూహించ లేను శంభు" ॥ 717

తే॥గీ॥ అనుచు వ్రాసిన లేఖ సారాంశ మరసి
తురక యౌ దిలేర్ఖాను హిందూ పురాణ
వైషయిక పరిజ్ఞానమబ్రమ్ము గొలుప
యులక కాదుర! యీ 'వృద్ధ మలక' యనుచు ॥ 718

(యోజనము=ప్రణాళిక; అవాచీనము=దక్షిణము;కట్టడి=యేర్పాటు)
(వైమాత్రుడు=సవతి తల్లి కొడుకు; కనీయుడు=తమ్ముడు)
(ఉలక=తేలిక; మలక=తురుష్కుడు)

చ॥ తెలిచిన పుస్తకమ్మువలె తెల్లమునాయె మరాట రాజ్యపు
న్తెలిగు సవిస్తరమ్ముగను – దిగ్భ్రమమౌ మొగలాయి వారివే
గరుల నియామకమ్మరయ – కాంతురు జాడలు నీటిపైన – నే
తురు విరచింప గాడుపున తోరపు చేర్లను – వీరలల్పులే ॥ 719

కం॥ అనుకొనుచు సభ్రమందుచు
తనివియు, తడబాటు, శంక,తగినంత భయ
మ్మును, బిడియము పెనగొనగా
మనమున నొక తీర్పు లేమి మథన పడంగన్ ॥ 720

కం॥ విద్యావతి శంభుని సతి
సద్యముగ నెఱింగెలేఖ సారాంశమ్మున్
వేద్యము ముందేపతి మతి
హృద్యోక్తుల తోడ శంభుకితమును చెప్పెన్ ॥ 721

'మహావీర' శంభాజీకి భార్య యశూబాయి హితబోధ

శా॥ ఆర్యా! మల్క దిలేరు ఖాన్పులుకు లేఖాంశమ్ములున్ – మీదు నాం
తర్యమ్మున్ సరిపోయినట్టివిగచింతన్జేతు నేనిప్డు – మీ
చర్యల్ యింతకు ముందె తండ్రికి జుగుప్సన్గూర్ప – మా యత్తయున్
క్రౌర్యంబూనును మీ పయిన్–స్వసుతునకున్ రాజ్యాధికారమ్మిడన్॥ 722

తే॥గీ॥ వ్యక్తి చుట్టును ముండ్ల కంపలను పరచి
ననల సెజ్జగ భావించి నడవమన్న
చందమొప్ప – మీ చుట్టును సంకటములె
కల్పనము చేసి – మీ నేర్పు కాంచ నెంత్రు ॥ 723

(వేగరులు=గూఢ-చారులు; నియామకమ్ము=వ్యవస్థ; చేర్లు=త్రాళ్ళు; నేతురు=నేర్తురు)

(సద్యము=వెంటనే; ఇతము=హితము)

(ననలసెజ్జ=పూలపాన్పు)

కం॥ ఇదియె పరీక్షా సమయము
పద పదమున వలయు నెంతొ భద్రము - కనుచ
న్నిదిశలు ననపాయములని
విదితమ్మైన మొనకడుగు వేయుటలగ్గొ ॥ 724

తే॥గీ॥ పితరుడేది కోరెనొ? హైందవీయ రాజ్య
సాధనము - దానిని వదలి, స్వాభిమాన
మనుచు, తురకల గలియుట మంచి యగునె?
యోచనము చేసి - చేయుము యోజనమును ॥ 725

తే॥గీ॥ ఆడుదానిని, నీకు నధ్యూఢ నగుదు
నీదు తొలిబిడ్డకును తల్లినిపుడు - వినుము
మంచియో! చెడ్డయో! నాదు మాట సుంత
చనుము సజ్జనగడము - యోగిని గనంగ" ॥ 726

తే॥గీ॥ అనెడు భార్య బోధన, పితరాను శిష్టి
ప్రేరణమునిచ్చె శంభాజి వెడలుటకును
ముందు సజ్జన దుర్గ నాముష్మిక వరు
చెంత రాజనీతి గఱచు చింతనమున ॥ 727

తే॥గీ॥ కదలె శంభాజి సజ్జన గడముఁజేర
ఐదు వందల యాశ్వికులనుసరింప
కాని నాటికే సజ్జన గడమునుండి
యోగి కొల్లాపురికి చన్న యూసు దెలిసి ॥ 728

తే॥గీ॥ రెండు నెలలాగె నచట త్రిదండి కొఱకు
నయ్యు శ్రీ రామదాసజీ యైపు లేక
శంభు యోచనోన్మంథిత స్వాంతు డగుచు
చేరె కృష్ణ, వేణ్ణాసంగ తీర భువిని ॥ 729

(యోచనము=ఆలోచన; యోజనము=వ్యూహము)
(అధ్యూఢ=మొదటి భార్య)
(అనుశిష్టి=బోధనము; దుర్గ=గడము)
(ఊసు=వార్త) (ఐపు=జాడ; త్రిదండి=సన్న్యాసి)

ఆ॥వె॥ ముందె తలచినాడొ? మొగలులఁజేరగా
కాక హఠికమైన కాయమౌనొ?
కృష్ణ వేణ్ణ సంగ ఘట్టమునకు రాగ
వీర శంభు మనసు మారిపోయె ॥ 730

కం॥ ముందుగ దిలేరు ఖానుడు
సందేశము పంపె 'కృష్ణ' సరిదుదగాశం
జెందిన తటమున చేరిన
కొందరు సైనికులు శంభుఁగొనివత్రనుచున్ ॥ 731

"వీర శంభాజి" మొగలుల శిబిరమునకు చేరుట
క్రీ.శ.1678

ఉ॥ "మాహులి" "కృష్ణవేణ్ణ"నద మంగళ సంగమ తీర్థ మందునన్
గాహనముంబొనర్చి యురగాభరణున్ జగదంబ గొల్చు స
న్నాహముతోడ వచ్చి యట నర్చ యొనర్చుచు శంభు డొంటిగా
వాహము గూడ లేక ఘనవాహినిఁజొచ్చుచు యీదె యుక్కునన్॥ 732

కం॥ వెను వెంటనె 'ఖేలోజీ'
దణి, మిగిలిన రక్షకభట దళమా శంభున్
మునుకొని వెనుకకు మరలిం
ప నెంతయు జతనమొనర్చి ఫలమతి మరలన్ ॥ 733

చ॥ మొగలుల రాజ్య భాగమునమోపి పదమ్ములు - శంభుడప్డు తా
నిగ మరలన్నటంచు పయికెత్తి కరమ్మును నూపి చెప్పె - స్వా
నుగులగు నంగ రక్షకుల నూరడు డంచును - నింతలోపలన్
మొగలుభటుల్ తురంగమము మూపున కూర్చొన బెట్టి రాతనిన్॥ 734

(హఠికము=హఠాత్తుగా; కాయము=నిర్ణయము; సంగము=నదీ సంగమము)

(సరిదుదగాశ(సరిత్+ఉదక్+ఆశ)= నదికి ఉత్తరపు దిక్కున)

(గాహనము=స్నానము; ఉరగాభరణుడు=ఈశ్వరుడు; వాహము=గుఱ్ఱము) (దణి=సేనానాయకుడు; ఆరెకులు=అంగ రక్షకులు; జతనము=యత్నము; ఫలమతి=ఫలములేక)

తే॥గీ॥ క్రమ్మతెను నిరాశ మెయి మరాట దళము
చేరె శంభాజియును బహదూరు గడము
నట "దిలేరుఖానుని" వైభవాతి శయము
కాంచి కనులార శంభుడక్కజము నొందె ॥ 735

కం॥ మరికొన్ని దినములకు శం
భు రెండవ రమణ "దుర్గబాయి" ముదమున మగనిన్
దరి జేర, నామె తోడ న
వరజునిగన, యక్క "రాణుబాయియు" వచ్చెన్ ॥ 736

తే॥గీ॥ మొగలు మాయ వాగుర యందు తగులు కొంటి
ననుకొనుచు నుండ యిప్పుడు అక్క, ఆలు
వచ్చి చిక్కుపడి రనుచు వంత గూతె
శంభుజీ, దిలేర్ఖానుపై శంకనొంది ॥ 737

తే॥గీ॥ ఎన్ని మాసముల్ గడచుచు నున్న గాని
మొగలు రాజ్యాభి వృద్ధికై మొగ్గకుండ
కేవలము శంభు తనకు చిక్కెనని మిగుల
తృప్తుడౌ ఖాను 'బాద్షా' కతృప్తిఁగూర్చె ॥ 738

మ॥ నెలలున్ పోయెను - వత్సర ద్వయముపైనేయయ్యె కాలవ్యయం
బులుకున్ పల్కనులేదు - కేవలము శంభూజీని లోగొంటి నం
చలసత్వమ్మున మీది కార్యములెవో యాలోచనే లేక ని
శ్చలతన్ యుండె 'దిలేరుఖాను'డని 'బాద్షా' లేఖ వ్రాసెన్నిటుల్ ॥739

కం॥ "శంభుజి" చిక్కెనని సం
రంభముకా దతనితో మరాట భువి రణా
రంభ మొనర్పుము గ్రక్కున
'కుంభి'ని మేపుట గడములఁగూల్చుటకె గదా !" ॥ 740

కం॥ చేలమున చుట్టిన యయో
గోళమువలె వచ్చి తాకి కూర్కు వదల్చెన్

(అవరజుడు=తమ్ముడు) రమణ=భార్య
(కుంభి=ఏనుగు; గడము=కోట)

ఆ లేఖలోని వాడికి
గాలిని తృణమట్లు ఖాను గజగజవణకెన్ ॥ 741

ఉ॥ ఆలము సేయకుండ నిపుడాలము సేయ దిలేరు ఖాను - భూ
పాలగడమ్ము నెన్నుకొనె - పాలకుడాగడికిన్ "ఫిరంగు న
ర్సాల" తదీయ విక్రమము 'చాకణు' పోరున వెల్లడయ్యె - నా
యాలము గెల్వ రెండు నెలలారడి చెందెను 'షైస్తఖానుడే'॥ 742

కం॥ బహదూరు గడము నుండియు
నహమహమిక తోడ నడచె - నని సేయుటయే
మహమట్లు గాగ సేనలు
మహియంతయు తమదె యనెడు మల్లరము మెయిన్॥ 743

తే॥గీ॥ పథము పొడుగున తారసపడెడు నూళ్ళ
పట్టణమ్ములుఁ దోచుచు పౌరతతిని
కట్టు బట్టలతో వెళ్ళగొట్టి వెలికి
నిండ్లు దరికొల్పి ముందుకు నేగుచుండ్రి॥ 744

తే॥గీ॥ ముఖ్యముగ "అథాని" యను గ్రామోప కంఠ
మందె కన్పడినజనులఁ గ్రుంద జేసి
యూరిలో జొచ్చి ధనమెల్ల నొడిచి కొనుచు
స్త్రీలను చెఱచి, ప్రజను వధించినారు ॥ 745

తే॥గీ॥ పిదప ఖానుసేన "తికోట" వీడు చేరి
'హిందువులును', 'షియామల్క' లిరు తెగలును
కాఫిరులె యంచు వారలఁ గరుణలేక
విత్తుమాల్చిరి యాబాల వృద్ధముగను ॥ 746

(చేలము=గుడ్డ; అయోగోళము=ఇనుపగుండు; ఖాను=దిలేరుఖాను)
(మహము=ఉత్సవము; మల్లరము=గర్వము)
(దరికొల్పు=కాల్చు)
(ఒడిచికొను=దోచుకొను; ఉపకంఠము=పొలిమేర)
(కాఫిరులు=ఇస్లామును నమ్మనివారు; విత్తుమాల్చు=చంపు)

సీ॥ ధనిక, పేద యనెడు తారతమ్యము లేక
కనబడ్డ యిండ్లను కాల్చినారు
కన్నెలు - పరసతులన్న భేదము లేక
వనితల శీలము వ్రాల్చి నారు
శిశు, బాల, తరుణ, వర్షీయాంసులను, నఱ
వీడి కత్తులతోడ ద్రీల్చినారు
దృష్టికి సోకిన దేవాయతనముల
కుద్దాలముల తోడ కూల్చినారు ॥

ఆ॥వె॥ నైచికీ వితతిని నైష్ఠికతతిఁ దయ
మాలి వారి యునికి మాల్చినారు
ఖాను యుద్ధభటుల క్రౌర్య విశ్వాకృతి
'శంభు' కనె వెఱగున స్తంభితుడయి ॥ 747

శంభాజీ, దిలేరుఖాన్లు బహదూరు గడమును ముట్టడించుట

చ॥ గడమునుముట్ట తుర్క బలగమ్ముకు ముందుగ "శంభుజీయె" క
న్పడగ- దిలేరుఖాను వలపన్నెను - నట్లె మరాటులప్పుడ
క్కడ యువరాజునుంగనుచు కాడ్పడి నివ్వెఱతోడ, తేరుచున్
తొడరిరి భీకరాజి నరిఁ దుత్తుమురున్నొనరింప నుగ్రులై ॥ 748

తే॥గీ॥ 'శంభు'పేర 'దిలేర్ఖాను' జాబు నొకటి
వ్రాసిపంపించె కోట లోపలికిఁజేర
"శత్రు బలమధికము - మీరశక్తు లిచట
యేల జనహతి; గడమప్పగించు" డనుచు ॥ 749

తే॥గీ॥ ఆ పురోణికి ప్రతిలేఖ నంపె దుర్గ
నేత- "లొంగుటన్నది మేము నేర్వ లేదు
నంతిమ శ్వాస వరకుపోరాడు టొకటె
నేర్పినాడు మాకు శివాజి నృపుడు ననుచు" 750

(వర్షీయాంసులు=వృద్ధులు; నైచికి=గోవు; నైష్ఠికుడు=ఆచారవంతుడు)

చ॥ పరినుసిగొల్పె ఖాను గడిపైకి – ఫిరంగులు బారు చేయుచున్
వరుసగ కోట గోడడుగు భాగము నందున మందు పాతరల్
దొరపుచు కోటపైకి నధిరోహిణులన్ నిలబెట్టి యెక్కగన్
తరుముచు వీరులన్ కెరలినారనిఁ 'శంభు', 'దిలేరుఖాను'లున్ ॥ 751

చ॥ తమ యువరాజెవచ్చి రణతంత్రములన్ నడుపన్ మరాటులున్
తెమలుచు, శంభుబాలిటకు దేనికి వచ్చెనొ? తుర్క వారితో
సమసనమై పితృస్వము వశమ్మొనరింపగ వారికిన్ – సహా
యమగుట – వింత యంచు వికలాత్ములునై యనిసేసి రంతటన్॥752

కం॥ పోరియు నోటమి చెందుచు
పారిరి గడివీడి పంచ బంగాళమ్మై
మారాట భటులు – చిక్కిరి
వారలలో కొందరరికి 'బందీ'లగుచున్ ॥ 753

చ॥ గడమును కూల్చి వేయుడని ఖాను భటాళికి చెప్ప – "యేమి యా
గడమిది–దుర్గముండిన మొగల్వరి పాలన కెంతయు మేలుగాదె"–యం
చడుగగ శంభు – "దక్షిణము నంతయు నాక్రమణమ్ము చేసి– య
ప్పుడిట నవశ్యమైనయెడ పూనెద మేము గడమ్ము కట్టగన్" ॥ 754

తే॥గీ॥ అని తిరస్కార పూర్వకాఖ్యాన మిడుచు
కోట నంతయు కుప్పగా కూల్చి వేయ
పంచి – బందీల చేతులు బల్మి వెనుక
కును విరిచి త్రాళ్ళతో కట్ట మనుచు చెప్ప ॥ 755

తే॥గీ॥ సప్తశత ప్రమిత మరాట సైనికులట
చిక్కిరి – దిలేరు ఖానుకు చిత్త మలర
బంధితులయిన వారల భావి నుదుటి
లిఖితమునకు బ్రహ్మయ్యె, దిలేరుఖాను ॥ 756

(పరి=సైన్యము; దొరపు=ఉంచుట; అధిరోహిణి=నిచ్చెన; కెరలు=విజృంభించు) అని=యుద్ధము

(తెమలు=కలతపడు; సమసనము=సంసర్గము)

వీర శంభాజీ బహదూరు గడముపై దండెత్తి నందుకు పశ్చాత్తాప పడుట

కం॥ "తన వారితోనె యనికిని
మునుకొనగాఁజేసె నన్ను మోమోటము లే
క నిరనుకంపకుడై విధి
ననుబోలెడు వారు గాదె? నడపీస్గులనన్ ॥ 757

తే॥గీ॥ దుర్గనేత ఫిరంగోజి దురము నందు
వెన్ను చూపక పోరియు బన్న పడుచు
నచట తననుఁజూచి యతడు నచ్చెరువడె
తాను లజ్జింపవలసె నాతనిని గనుచు ॥ 758

మ॥ పితరాజ్ఞా వినిబద్ధ బుద్ధి యగుచున్ వృద్ధో ఫిరంగోజి యౌ
వతరస్వుల్ సయితమ్ము చూపని బలావష్టంభమున్జూపియున్
జితుడై దుర్గము వీడగా వలసె – నిస్సీమాభిభూతుండునై
సుతుడన్నెపతనమ్ము గాగ–భృతుడై శోభించె హంవీరుగన్॥ 759

తే॥గీ॥ అతని కీరితి ప్రాకు దిగంతములకు
నా యపయశము నిలుచు మన్వంతరములు
పతికి వెన్గాపు నై పోరు ప్రజవి యతడు
పితకు వెన్పోటు పొడిచిన పతితుడేను" ॥ 760

దిలేరు ఖాను మరాటా బందీలను అతి క్రూరముగా శిక్షించుట

శా॥ బందీలందరు దీనదృక్కులను శంభాజీని చూడంగ, 'వీ
రెందుం బోవగ చేతువం'చడుగ – 'వీరిప్డేగి బహ్దూర్ గడిన్
విందై యుందుర'టంచు పంపె యటకున్నేణ్ణూర్ల మందిన్ వెసన్
ముందే చెప్పక యెట్టి శిక్ష పడునో ముచ్చో దిలేర్ఖానుడున్ ॥ 761

(యౌవ తరస్వులు=యువ వీరులు; అవష్టంభము=సమున్నతి; నిస్సీమ=ఎల్లలేని; అభిభూతుడు=అవమానితుడు) భృతుడు=సేవకుడు

(ప్రజవి=వీరుడు; పతితుడు=పతనము నొందినవాడు)

చ॥ స్వయముగ "శంభు" యుండగనె సప్తశతప్రమితుల్ మరాటులన్
శయముల వెన్కకున్ విఱిచి ప్రజ్వలతోడ బిగించి కట్టుచున్
బయలున నిల్పి నొక్కొకని వల్పలి బాహువు చెండి వేయుచున్
దయవిడనాడి శోణిత నదమ్ములు పారగ జేయనెంచగన్ ॥ 762

కం॥ ముందుగ "ఖాను' దురూహల
చందమ్మరయంగ లేని శంభునకు గడ
మ్మందున జరిగెడి ఘోర
మ్ముందెలియ నటకరుదెంచి మునుకొనె నాపన్ ॥ 763

శ్రీ శంభాజీ మరాటా బందీలకు వేయబోవు కఠిన శిక్ష ఆప ప్రయత్నించుట

చ॥ "వలదిటు వంటి నిర్ఘృణపు వైఖరి – నీకును లోగి యున్నవా
రలు, శరణమ్ము గోరెడు నిరాయుధులన్నుదరార్ధ మాజిలో
నిలబడి యాత్మ రక్షణము నేని తలంపక రాజు గెల్పుకై
కలన యొనర్చుటే, యఘముగా తలపందగు నయ్య ఖానుజీ ॥ 764

ఆ॥వె॥ ఎవడు సుంత బత్తెమిడునొ? వాని కొఱకు
ప్రాణ భయము వీడి బవరములను
పెనగుచుందు రొక్క పిడుచడు బువ్వకై
యట్టి వారు క్రొత్త యగునె నీకు? ॥ 765

ఉ॥ కావలెనన్న వీరలకు గవ్వల నిచ్చియునైన నీ పరిన్
తావిడ వచ్చునే? సతము దాతకు వారలు బద్ధు లౌదురీ
వీ విషయమ్మెఱుంగవొకొ? వృద్ధుడవైతివి యుద్ధ భూములం
దే వయసెల్లనుంగడపితెందుకు పాల్పడె దిట్టి చెట్టకున్" ॥ 766

(శయములు=చేతులు; వల్పలి=కుడి)
(నిర్ఘృణము=దయలేని; కలన=యుద్ధము)
(గవ్వలు=వేతనము; పరి=సైన్యము; తావు=చోటు; బత్తెము=జీతము)

వీర శంభాజీ విన్నపమును దిలేరుఖాను నిరాకరించుట - శంభాజీ పశ్చాత్తాపము

కం॥ అని శంభుడెంత జెప్పిన
వినకుండుటె గాక యెంతొ వేగిరమొప్పన్
తన నేరము జరిపించెను
ననయుల బంటులనుఁ బంపి హర్షముతోడన్ ॥ 767

తే॥గీ॥ అంతెగాక దిలేర్ఖాను డనియెనిట్లు
"యీ మరాట సైనికులకు నిట్టి శిక్ష
వేయునది వారికైగాదు – నెవరి కొఱకు
చేసిరో 'యని' నా శివాజీకి శిక్ష" ॥ 768

శా॥ ఆ మాటన్ విని నెత్తిపై పిడుగు పడ్డట్లైన నిర్విణ్ణుడై
"యీ మాత్రమ్మునకా 'పితాజి' వచన మ్మేమాత్ర మాలించకే
యీ మాయావి 'దిలేరుఖాను' వలలో నీ రీతిగాఁ జిక్కితిన్
స్వామి ద్రోహము, వప్తద్రోహమును, దేశ ద్రోహమున్ చేసితిన్॥ 769

తే॥గీ॥ సవతి తల్లియు – దుష్టాష్ట సచివ చయము
నన్ను దుశ్శీలుగాఁజూప నెన్నొగతుల
వేయు నపనిందలకును నే విసివియిట్లు
పరుల పంచను చేర పాల్పడగ వలసె ॥ 770

కం॥ ఫలియించె వారి దౌష్ట్యము
నిలుపోపక నేను తురక నేయుడనైతిన్
కలచితి పితరు నెడందను
కలరూపిపు దర్థమయ్యె కరముల్ కాలన్" ॥ 771

(అని=యుద్ధము)

(నిలుపోపక=సహించలేక; నేయుడు=స్నేహితుడు; కలరూపు=నిజము; కరములు=చేతులు)

వీర శంభాజీని బంధించి ఢిల్లీకి పంపమని ఔరంగజేబు ఆదేశించుట

తే॥గీ॥ అనుచు వాపోవు శంభుని నంగవించి
చారుడొక వార్త చెవికిని చేరవేసె
పాపి యౌరంగజేబు "శంభాజి నిపుడు
బంధితుని చేసి ఢిల్లీకి పంపు" డనుట ॥ 772

చ॥ చకితుడునయ్యె వార్త విని శంభుజి "పాదుష పన్నకమ్మదా?
యొక కొలువిచ్చినట్లెయిడి యుచ్చు బిగించిరె? కారలో నిడన్
నికముగ దీనికొప్పుకొనునే విధిలేక దిలేరుఖాను – యీ
వృకముల ముప్పుతప్పుకొను వీలును వేచెద"నంచు శాంతుడై॥773

కం॥ ఆవల శంభాజీ తా
నీ విషయమె యెరుగనట్లు నెప్పటి వలెనే
తావీయకెట్టి శంకకు
తావర్తిలుచుండె ఖానుదాపున నెమ్మిన్॥ 774

ఆ॥వె॥ వేగు వార్త చెప్పి వేగమ్ము గాఁజనె
ఖానుడింతలోన కలియవచ్చె
"శంభు! ఇంక మనము జృంభించగా వలె
"ఆదిలుషహా" రాజ్య మాక్ర మింప ॥ 775

చ॥ అది యటులుండ నీ జనకు డాదిలుషాహికి తోడు సూపగా
కదలుచు–దాడి చేసెను మొగల్ప్రభు ప్రాంతము "జల్నపూరుపై"
యదియొక సాకు – బీజపురి నాక్రమణమ్మొనరించు పాదుషా
పదకము నడ్డగించుటకు పాచికవేయు శివాజి వ్యూహమౌ" ॥ 776

ఆ॥వె॥ అనిన శంభుడనియె "ఔనౌను ఖానుజీ
శంభుడనగ మీకు సంశ్రితుండు

(అంగవించి=సమీపించి)
(నికముగ=నిక్కముగా; విధిలేక=మార్గము లేక)
(కదలు=ప్రయత్నించు; పదకము=వ్యూహము)

ఛత్రపతి శివాజి సర్వస్వతంత్రుడు
నతడు నిచ్చ వచ్చి నటులంజేయు" ॥ 777

కం॥ అన విని దిలేరు ఖానుడు
మనమున కడు నొచ్చుకొనియు, మందస్మితుడై
"మన మాట వినడు శంభుడి
క నితని కట్టడి నొనర్పగవలె' ననువగన్ ॥ 778

ఆ॥వె॥ "ఎంత మాట శంభు! నెల్లిదుడవె నీవు!
సప్తశత హయదళ శాసకుడవు
మొగలు కొలువునందు మొదటి బంతిని యుందు
నీకు యీడు గలడె నిఖిల ధరణి"॥ 779

ఆ॥వె॥ ఖాను పొగడికలకు గర్వమ్ము నటియించె
శంభుపైకి – లోన జనకు గలియ
తగిన తరుణము కయి తాల్మితో నుండెను
చారులంద జేయు సన్నవేచి ॥ 780

తే॥గీ॥ శంభుఁబంధించుటకు తగు సన్నహనము
చేయ బంచెను ఔరంగ జేబు ముందె
యది యెఱిగె దిలేర్ఖానుడు – నైన గూడ
శంభు గోల్పోవ ఖాను కిష్టమ్ము లేదు ॥ 781

ఉ॥ "వైళమ బీజపూరు పయి భండనమున్ ప్రకటింప కాదనం
జాలడు పాదుషా – పయిగ శంభుజి సాయము చేయుచుండెనం
చాలఘు బుద్ధికి న్నెటులొ నచ్చగఁజెప్పిన, పాదుషాయు, తా
నాలము సేయు శంభు, నతడండగనుండ జయింతు దక్కనున్॥ 782

ఆ॥వె॥ ఖానుడిట్లు దలచి కదలించె శంభును
"పన్హాలా"గడమ్ము పైకి బోవ
దారివేరు లేక తలయూపె శంభాజి
ఖాను పృతన కదలె కదనమునకు ॥ 783

(సన్న=సంకేతము) (ఆలముసేయు=ఉపేక్షసేయు)
(పృతన=సైన్యము) వగ=ఆలోచన

ఉ॥ ఎప్పటి మాదిరే తురకలేచి పథమ్మున కల్గు పల్లెలన్
నిప్పులకుప్పలన్ సలిపి, నీఱొనరించుచు ధాన్యరాశులే
తప్పును లేని పౌరులకు దారుణరీతి కశాభిఘాతలన్
నొప్పిని గూర్చి, స్త్రీలకతి న్యూనముగా నభిభూతి గూర్చుచున్॥ 784

తే॥గీ॥ అడ్డు, నాపును లేక సైన్యమ్ము రేగ
పడతులవమాన భీతలై పరువులెత్తి
కూప, వాపీ, సరో, తటాకోదమగ్న
లై యసువులుబాసిరి శీల రక్షణకయి॥ 785

తే॥గీ॥ విచ్చల విడిగ దోచుచు విపణి వీధు
లెల్ల వణిజుల గృహములు కొల్ల గొట్టి
కట్టు బట్టలతో బైటి కంపి రంద
రిన్నటులె యన్ని యూళ్ళను రిత్తబోయె ॥ 786

మ॥ అటులీ ఘోరములన్ని చూచి కుపితుండై శంభు ప్రశ్నించె "మీ
రెటులన్ యుద్ధము సేయ వచ్చితిరి – మీకే హానియున్ చేయలే
రిట నున్నట్టి నిరాయుధ ప్రజలు నారీ వృద్ధబాలాదులున్
విట తాటమ్మును చేయనిట్లు తగునే నిర్లజ్జులై క్రూరులై" ॥ 787

ఆ॥వె॥ అనుచు కత్తి దూసి యలుక నాపగ లేక
అతివల చెఱబట్టు యవన భటుల
గాయ పరచె – తుఱక నాయకులిదిఁ జూచి
శంభు పైకి రాగ చంపుటకును ॥ 788

ఆ॥వె॥ మెఱపువోలె ఖాను తుఱక సర్దారుల
నడ్డగించి శంభుకండ యగుచు
"నాగుడోయి శంభు డావేశ పడినాడు
కుస్తరింతువాని – క్రుధను విడుడు" ॥ 789

(నీఱు=బూడిద; కశాభిఘాత=కొరడాదెబ్బ; న్యూనము=హీనము; అభిభూతి=అవమానము)

(కూప=చేదుడుబావి; వాపి=దిగుడుబావి; సర=సరస్సు; తటాక=చెఱువు; ఉదము=నీరు) (కుస్తరించు=అనునయించు)

తే॥గీ॥ అనుచు యవన నాయంకుల యలుక నుడిపి
శంభునౌలకు గొంపోయి సంభ్రమమున
శాంత పరుపంగ బూనిన శంభు డనియె
"నింత క్రౌర్యము చూడ లేదెచట గూడ" ॥ 790

తే॥గీ॥ అనెడు శంభుకు ఖానుడిట్లనియె "శంభు!
యేమి మాటాడె దాజియే యెఱుగ నట్లు
మీ మరాటులు జినమును లేమొ చెప్పు
నెన్నడును హింసయను మాటె యెఱుగరొక్కొ? ॥ 791

తే॥గీ॥ హిందువులు గాని, ముస్లిములేని మాకు
నెదురు తిరిగిన వారిని వదలబోము
బీజపూరు గాని, మరాటరాజు గాని
గజగజ వణక వలయును - కనుము నేడు" ॥ 792

తే॥గీ॥ అట్లిరువురి సంభాషణ మైన పిదప
ఖాను శంభుపై కట్టడి గట్టి చేయ
శంభు ఖానుని చెఱవీడి చనగఁ దలచె
ఎవరి తలపులలోవారు తవిలియుండ్రి ॥ 793

ఆ॥వె॥ "కోతి, పిల్లి కాలు, చేత గట్టిగ బట్టి
నిప్పులందు వేగు పప్పు గింజ
లులక వెలికి దీయు నలవున నాచేత
తండ్రి గడములఁగొన తలచె ఖాను" ॥ 794

ఆ॥వె॥ అనుచు శంభుతలప - యవల ఖాను తలచె
"శంభు పణముగనిడ - శాశ్వతముగ
దక్కు తనకె యింక - దక్కన్ సుబేదారు
పదవి - తనను మెచ్చి బాద్షయిడగ" ॥ 795

తే॥గీ॥ అంత హంబీర రావు రహస్య వార్త
నంపెను - "అథాని" గ్రామ సీమాంచలమున
సిద్ధ పరచితి మొక కొంత సేననచట
ఖానుని వదలి రమ్ము వేగమున" ననుచు ॥ 796

(ఔలకు=ఆవలికి; సంభ్రమము=తొందర)

శ్రీ శంభూజీ దిలేరుఖానుతో 'పన్హాలా'గడముపై దండయాత్రకు ప్రయాణమై మధ్యలో తప్పించుకొనుట

ఉ॥ భద్రగజమ్ము లెక్కి యిరు ప్రక్కల నాశ్వికులున్ నృసేన రా
నద్రువ నేల "శంభు", యవనాగ్రణియుంజన "పన్హాలా" గొనన్
"రుద్రుని దేవళమ్ము గని రుద్ధ పురోగమనుండునై శివా
జీ ద్రుహు డీశుగొల్చి మరి చేరెద నిన్న"ని ఖాను సమ్మతిన్ ॥ 797

మ॥ శివ దేవాలయ సీమఁ జేరుచును కాంచెన్ శంభు డచ్చో ఝరి
న్నవగాహించుచునున్న నీవరులు "జ్యోత్యాజీ"ని, రాయప్ప ను
న్నవగాహమ్మును నయ్యె వారట తనన్రక్షింపగా వచ్చిరం
చవగాహించెను తాను గూడ ధునిలో సర్వేశు ధ్యానించుచున్॥798

చ॥ "మునిగినవాడు మున్గినటుపోయెను తేలడిదేమి" యంచు - యొ
ద్ధునగల తుర్కలబ్రపడి - "డొంగుచు నీటి ప్రవాహ మందునన్
మన కనుబ్రామి తప్పుకొని మాయమునయ్యెను శంభు" డంచు వె
న్నొనుచు హయాధి రూఢులయి, గొబ్బున వెళ్ళిరి ఖానుసైనికుల్ ॥799

చ॥ తరిమిన కొద్ది ముందరుగు దాయలకున్ తమ మధ్య దూరమే
పెరుగుచు వచ్చె - యేవయిపు వెళ్ళిరొ శంభుడు తత్పరిగ్రహం
బరిగినజాడయే తెలియదయ్యెనటన్ మృగతృష్ణ చందమై
దొరకెను యెట్టకేల కతి దూరముగా జను వారి పొల్పునున్ ॥800

(నృసేన=పదాతి దళము; అద్రువ=అదురుట; యవనాగ్రణి=దిలేరు ఖాను ద్రుహుడు=కొడుకు)

(ఝరి=నది; అవగాహించు=స్నానముచేయు; నీవరులు=గోసాయిలు; అవగాహము=బోధపడు; ధుని=నది)

(అబ్రపడు=ఆశ్చర్యపడు; డొంగుచు=దాగుకొనుట; కనుబ్రామి=కండ్లుగప్పి; గొబ్బున=వెంటనే)

(పరిగ్రహము=పరివారము; మృగతృష్ణ=ఎండమావులు; పొల్పు=జాడ)

ఆ॥వె॥ అందుకొనిరి మొగలు లాశంభుని, యతని
భటుల నేబదుగుర నటుల చిక్కి
యెలమి విడక వారు యేనూఱు మొగలుల
నెదిరి పోరు సల్పి వదలిరసులు ॥ 801

"వీర శంభాజీ" ప్రాణములను "మునిసిబుఖాను" రక్షించుట

ఆ॥వె॥ శంభుజీని పట్టి సాలమునకు కట్టి
కొట్టు చుండ్రి స్పృహను కోల్పడంగ
"బాలెఖాను" శంభు వధియింప నసినెత్త
బిలుకు మార్చె నతని పిన్నతండ్రి॥ 802

చ॥ "మునిసిబుఖాను" భ్రాతృజుడె-మూర్ఖుడు, గర్వ్యుడు "బాలెఖాను"-శం
భుని వధియింప నెంచనది "మున్సిబుఖాను" సహింపలేక - యా
తని వధియించె, నెందుకనితన్నడుగన్ "బిజపూరు సైనికుల్"
వినుకలిచేసె కారణము వెంబర విత్తును చంపినందుకున్ ॥ 803

చ॥ ఇపుడు దిలేరుఖాను 'నని' యెవ్వరితో నొనరించు చుండెనో
విపులముగా యెఱుంగుదురు - బీజపురమ్ము జయింపనేగదా!
యెపుడవురంగజేబు నొక హిందుజనాళికె గాదు - మీకు నా
కపచితి సేయు "కాఫిరులటంచు"-'షియా'లిపుడైరి హిందువుల్ ॥ 804

తే॥గీ॥ కంటిరి "అధాని"యు, "తికోట" గ్రామములను
నధిక సంఖ్యాకులట తుర్కలయ్యు - కేవ
లము 'షియా'లగుట వలన, లాతి వార
లైరి - 'ఖాను' ఘోరకలికి నగ్గమైరి ॥ 805

(ఎలమి=ధైర్యము; అసులు=ప్రాణములు)

(సాలము=చెట్టు; బిలుకుమార్చు=చంపు)

(భ్రాతృజుడు=సోదరుని కొడుకు; గర్వ్యుడు=నింద్యుడు; వినుకలిచేయు= వినిపించు; వెంబరవిత్తు=అవివేకి)

(అపచితి=అపకారము)

చ॥ అపుడు "దిలేరు ఖానుని" భయంకర నేరములన్ గుఱించి శం
భు పదరి గట్టిగా నడిగె "పోరున సాయుధులైన వారితో
డ పెనగుటన్న సాజమకటా! జన హింసన శౌర్యమౌనె? పా
పపు పనులేల చేతువని"? పల్కెనె యొక్కడునైన సేనలో? ॥ 806

తే॥గీ॥ కఱవు వలన బిజాపూరు గాసి నొంద
బండ్ల కొలదిగ ధాన్యమ్ము పంపె శివజి
ఆదుకొనెను షియాల నా 'హైందవుండు'
క్రుంగ గొట్టగ వచ్చె ఔరంగజేబు ॥ 807

ఉ॥ దక్కనులో "షియా" ప్రభు విదారణముం బొనరించి – సున్ని భూ
భృక్కునిదెల్ల రాజ్యమని – హిందువులన్ తమ బానిసీంద్రకున్
తక్కువఁజేసి జూచి యికతక్కు 'షియా'లను 'కాఫిరు'ల్లటం
చుక్కున వారి కెచ్చటను నున్కియులేమి ఘటించు పాదుషా॥ 808

తే॥గీ॥ అనెడు "మున్సిబు ఖాను"ని యనుభవయుత
వాక్యములు విని శంభుని వదలివేసి
"తక్షణమె యిచ్చటును వీడి యేగుమింక
సేమముగ" పన్హాలగడు" చేరుమనిరి ॥ 809

చ॥ చేరగ "పన్హాలా"ను – హత శేషులునౌ యనుయాయు లంటి రా
దారులు వేసికొంచు కడు దట్టములౌ విపినాంతరంబులన్
క్రూరమృగాళికిన్ మరియు క్రూరమృగమ్ముల మించు దాయకున్
దూరముగా తొలంగుచును తుట్టతుదన్ 'గడి' డాసె శంభుడున్॥ 810

చ॥ కొతుకుచు కోటలోనయడుగున్నిడె – యిప్పుడు కోటలో పరి
స్థితి యెటులున్నదో? ప్రజమదిన్ తన పట్ల తలంపు లెట్టివో?
పితయెటు లాదరించునొ?దవీయముగా తొలగంగ పెట్టునో
సతిసుత లేడనుండిరను శంకలు రేగ మదిన్ వ్యథార్తుడై॥ 811

ఉ॥ ఆరతు లెత్తుచున్ తనకు హ్వానము పల్కెడు వారు, వీధులన్
బారులు తీరి మీద ప్రసవమ్ములు చల్లెడివారు – ముగ్గులన్
తీరిచి దిద్ది ముంగిళుల నిల్చి ఘటంబుల నింపినట్టి ప
న్నీరును వారుబోయు రమణీ మణులెవ్వరు కానరారటన్ ॥ 812

ఆ॥వ॥ సౌవిదల్ల మందు సతి "యశూబాయిని"
కలిసి కొనగ "శంభు" కలతc దీరె
భర్త మనసు యెంతొ బాధకు గురిగాగ
కలిసె 'మొగలుల'నని తెలుసు 'యశు' కు ॥ 813

ఆ॥వె॥ దూరమందెcజూచి పౌరులందరు గూడ
కూడి యొక్కట గుజగుజలు వోవ
మొగలు వారిcగూడి 'భూపాల గడమును'
మన 'మరాట' యయ్యు మాల్చెననుచు ॥ 814

శ్రీ శివాజీ, శంభాజీని చూచుటకు 'పన్హాలా'గడ మునకు వచ్చుట (క్రీ.శ.1679)

ఆ॥వె॥ పప్త యేగు దెంచె పన్హాలా గడమున
కనుడు వార్త తెలిసి హర్షమొంది
యాత్మలోన కొంత యపరాధ భావము
కలతc బెట్టుచుండ కలిసె పితను ॥ 815

ఆ॥వె॥ చనెను మూడు సమలు తన జ్యేష్ఠ సుతుcజూచి
కనుల ముందు నేడు కాంచ గలిగె
హర్ష పులకితాంగుడై తప్పిపోయియు
దక్కినట్టినిధిగ నక్కుc జేర్చె ॥ 816

మ॥ "కొడుకా! నిన్ను సజీవుగా గనగ నాకున్ భాగ్య లేశమ్మెదో
యిదె కాబోలు భవానిమాత - యటు లేదేనిన్ మొగల్ వ్యాఘ్రపు
న్విడి నోటన్ తలయిడ్డ నీ వెటుల నీస్వేచ్ఛంగొనం గల్గితో
కడు నబ్రమ్మగు-నేది యేమయిన మాకయ్యెన్ సుతాయమ్మిటుల్॥ 817

(సౌవిదల్లము=అంతఃపురము)
(మాల్చు=నశింపచేయు)
(విడినోటన్=ఎఱ్ఱని నోటిలో; సుతాయము=పుత్రలాభము)

శంభాజీ తండ్రితో నిష్ఠూరముగా పలుకుట

మ॥ అనినన్ తండ్రికి శంభు డిట్లనియె "యయ్యా! నీవు శృంగార పూ
రునకా నాడనుపంగ మమ్ములను మారున్మాట లేకుండవె
ళ్ళిన మమ్మున్ మరియాద చేసె శ్వశురుండెంతో ప్రియమ్మార - నీ
కనుకూలింపకపోయె నొక్కలవమున్ కమ్మన్ లిఖింపన్ పితా!॥818

తే॥గీ॥ నేను, నీ క్రొత్త కోడలు, నీకుదవ్వ
నందె యుంటిమి - గడచె యేణ్ణర్థమయ్యు
నొక్క మాట, పల్కును లేదు - నొక్క జాబు
లేదు - పౌత్రి నైనఁగనరాలేదు నీవు ॥ 819

చ॥ కొడుకొకవేళ నీ మనసుకున్ తగు వాడనిపించకున్నచో
యెడమొనరించ వచ్చు - మరియే దొసగున్నదికోడలందు! నీ
వడిగితె? యామె సేమమును! నాయమదౌ యపరాధ మందువా?
కడకొక యార్నెలల్ వయసు కల్గిన నప్త్రియు త్యాజ్యయాయెనా! ॥ 820

ఉ॥ కన్నడ రాజ్యమున్ గెలువగా పయనమ్మయి రొంటిగానె - నే
వెన్నడి వత్తునన్న నను వీడ్కొని - రాయగడమ్మునందు నే
నున్న మనమ్ము లందెరియు నుక్కివులందరు హర్షమొంద న
న్నిన్నగ మామగారి వసతింజొఱఁబంపిరదెట్టి నీతియో? ॥ 821

ఉ॥ నాయపరాధ మేదయిన నాకు ముఖాముఖి విప్పి చెప్పుటే
నాయము - సందుగొందులనణంగి ప్రవాదములన్సృజించు - వా
రేయిట పెద్ద ప్రెగ్గడలు - రేపును, మాపును నీదు చెవ్వులో
నే యిలుకట్టి నాపయిని నేరము లెన్నెడు యాపె రాణియౌ ॥ 822

ఉ॥ వారలు చెప్పు మాటలను వాస్తవ మెంతొ? యలీక మెంతయో?
తేరిచి చూచి తప్పుకల దేనియు దోషిని దండ బెట్టుటే

(నప్త్రి= కొడుకుకూతురు; త్యాజ్య=విడువదగినది)
(వెన్నడి=వెంట; వీడ్కొను=త్యజించు; ఉక్కివులు=దుష్టులు)
(నాయము=న్యాయము; చెవ్వు=చెవి)

తీరుప్రపంచమందెఱుగు దీరును భూపతులౌట- యెట్టి యా
ధారము చేత నా పయినితప్పును మోపెదరీయమాత్యులున్ ॥ 823

తే॥గీ॥ నేను "అణ్ణాజి భ్రాతృజ" పైననెదొ "కు
కర్మ" కూనితను నభియోగమును మీరు
తగు విచారణ చేసి పెద్దల సదమున
నన్ను నిర్దోషిగా తేల్చినారుఁ గాదె ! ॥ 824

ఉ॥ ఇప్పటిదాక నాపయిని యేకొఱగాములు మోపినారొ! యా
తప్పుల యందు నొక్కటియు తథ్యములన్ బుజువేమి చూపలే
కెప్పుడు దుష్ప్రచారమునకే గమకింతురు - నన్నొక నేరగానిగా
నిప్పుడమిన్ గలట్టి జనులెల్ల తలంపగఁ జేయ నెంచుచున్ ॥ 825

సీ॥ ఏడేండ్ల ప్రాయాన యేగి 'యాధి' గ యంబ
రాధిపుఁగొల్చు నప్పుడైన
పది యేండ్ల వయసులో వచ్చి నీతో పాటు
'నాగ్రా' ను బందియైనప్పుడైన
పంద్రెండు యేండ్లప్డు బాద్షా తనయు 'మౌజ
మా' స్థానమున కేగినప్పుడైన
"ఛత్రపతి"గ త్వదభిషవ వేళ - జనులు మీ
కౌరసునిగ నన్నప్పుడైన ॥

తే॥గీ॥ పనికి వచ్చిన మీ శంభు బాలు డిపుడు
కన్నడము జైత్ర యాత్రకు కానివాడు
రాయ గడమున యుండగా రానివాడు
యిల్లటమ్మెగు నంతటి యెల్లిదుండె? ॥ 826

(అళీకము=అబద్ధము; దండబెట్టు=శిక్షించు; ఎఱుగుదీరును (ఎఱుగుదు+ఈరును); ఈరు=మీరు)

(కొఱగామి=తప్పు; తథ్యము=నిజము; బుజువు=సాక్ష్యము)

(భ్రాతృజ=సోదరునికూతురు; కుకర్మ=అత్యాచారము; అభియోగము=నేరారోపణ)

(ఆధి=పూచి; అభిషవము=అభిషేకము; ఎల్లిదుడు=అల్పుడు)

ఆ॥వె॥ అనెడి శంభు యెడద యట్టడుగున నుండి
నుబికి వచ్చెడి ప్రతియొక్క మాట
యది శతఘ్నిగోళ మశని ఘాతముపోలె
శివజి యెదను తాకె చిల్లు పడగ ॥ 827

మ॥ "కొడుకా! నీ ప్రతి మాట నాయెదను తాకున్వజ్ర ఘాతమ్మునై
పొడువల్ కొందరు కొండెముల్ వినుతురేవో నిచ్చలవ్వాని నే
నడతున్ యెప్పటి కప్పుడే – ఋతము నే యాశింతు నెల్లప్డు – నీ
నడతన్ తప్పును పట్టలే దెపుడు కన్నా! నీవె నా యాత్మవున్ ॥ 828

తే॥గీ॥ నీవు షాజాదు మౌజము సేవయందు
గడపితివికొంత కాలమాతడును నిన్ను
బాల మిత్రునిగా నెంచి వత్సలతను
చేర దీసెను – మరియు రక్షించెగూడ॥ 829

మ॥ అపుడా మౌజము రాజ భోగయుతమౌ యా జీవితమ్మే భువిన్
నృపులౌ వారలకెల్ల సాజమనుచున్ నీడెంద మన్వవే
క్ష పరామర్శితమై తదేకముగ నీకట్లే విలాసమ్ములు
న్నపురూపమ్మగు భోగముల్ యనుభవింపన్ బుద్ధియే పుట్టెనో॥ 830

మ॥ యువరక్తమ్మును చేత నున్న యధికారోద్వృత్తి సంపత్తియున్
తివురించెన్ మది శూకలాశ్వమయి యుద్రేకించి పర్వెత్తగన్
తవునంచున్నిది, తప్పటంచు నిది సన్మార్గంబు చూపించు వా
రెవరున్ లేని కతాన నీ నడతలో యీ లాగులోటేర్పడెన్ ॥ 831

ఉ॥ 'ఆయి' గతించె శైశవము నందె – పితామహి బుజ్జవమ్ముకు
న్నాయువు తీరిపోయె – నిక నయ్యగ నేనును రాజ్యకార్యముల్
వేయి బుజాన కెత్తుకొని వేళకు తిండియు తీర్థమేది నే
నే యిలు బట్టకుంటి నిను నెవ్విధి నారయ లేకపోయితిన్ ॥ 832

(పొడువలు=దుష్టులు; ఋతము=సత్యము; ఆత్మావై పుత్రనామాసి)
(అన్వవేక్ష=ఆలోచన; పరామర్శితము=సమీక్షింపబడు)
(ఉద్వృత్తి=గర్వము; తివురించు=ఉవ్విళ్ళుగొలుపు; శూకలాశ్వము=అడవిగుఱ్ఱము)
(ఆయి=అమ్మ(మరాటీభాష); బుజ్జము=గారము; తీర్థము= మంచినీరు)

ఆ॥వె॥ సవతి తల్లి నిన్ను శత్రువుగాఁ జూచు
పొందులున్న, నీకు వంది జనులు
సచివులకును నీకు షష్ఠాష్టకమ్మయ్యె
తగిన మార్గదర్శి గగనమయ్యె ॥ 833

ఆ॥వె॥ అట్టులయ్యు నీవునభ్యసించితి నైక
భాష లందు నీవు పండితుడవు
కవివి నీవు - బహుళ గ్రంథకర్తవు గూడ
సంగరమున సవ్యసాచి వీవు॥ 834

ఉ॥ నాకుపెదబ్బి వీవటులె - నా యసుపంచక మీవె సుమ్ము - నీ
వాకరణిన్ మొగల్ శిబిరమందున చేరిన వార్తవించు - నే
వ్యాకుల మందు చుంటి - కఱవయ్యెను నిద్దుర- నేడు తేర్చె నీ
రాక - పయోధి రాకగని రంజిలు నట్లుగ నాదుడెందమున్ ॥ 835

చ॥ నిను మధురాపురిన్ విడచి నేనొకరుండనె యేలక్రమ్మఱం
గ ననిన- నిద్దర మ్మొకట కానగవచ్చిన శంకనొంది యే
చెనటియొ డబ్బు కాసవడి చెచ్చెఱ 'ఆగ్ర' కు వార్త చేర్చినన్
తనకలియౌ నటంచు నిక తప్పనిదై నిను వేరు చేసితిన్ ॥ 836

తే॥గీ॥ అంతెగాక గంగ తటి నీ కపరకర్మ
చేయుటయు గూడ ముందు నీ సేమ మెంచి
నీవు లేవను సంగతి నెఱిగి భటులు
నిన్ను వెంటాడు టింక మానెదరటంచు ॥ 837

చ॥ వినుటకు క్రూరకర్మముగ వీనులఁగాడునుగాని లోతుగా
గనిన మరింత కంటె నతి కర్కశ సూత్రములుండు - నూహ కం
దనివగు వ్యూహముల్ బ్రదుకు నందు జయమ్మును కాంచు పొంటె, చు
ల్కన పనిగాదు రాజ్యగత కార్యవినిర్వహణమ్ము పుత్రకా! ॥ 838

(పొందు=స్నేహితుడు; వంది=పొగడువాడు; షష్ఠాష్టకము=విరోధము)

(రాక=పౌర్ణమి; పెదబ్బి=పెద్దకొడుకు; అసు పంచకము= పంచ ప్రాణములు)

(క్రమ్మఱు=మరలిపోవు; చెనటి=దుర్మార్గుడు; తనకలి=ఆపద)

ఉ॥ ఆ జయ సింగుతోడ నిను నంపుట పూచిగ - నాడు నాకుఘో
రాజియొనర్వగా తగిన రాణువ లేమినిసుమ్ము - వార లీ
యోజను శాంతులైరి నిను నుంకువగా తమ వద్ద కంప నా
పై జయసింహు డెంతొ హితభావము చూపగ సమ్మతించితిన్॥ 839

ఉ॥ విత్తును నాటినాడ - నది వృద్ధిని చెందెను లేత మోకయై
ఇత్తఱి దానినిందునుమనెత్తెను మల్క బలమ్ము - నేడు నా
యత్తము నై మరాటపరి యాపగ లేదు నరాతి నందుచే
పొత్తును గోరినాడ పెను పొందగ హైందవ రాష్ట్ర మద్రియై ॥ 840

శా॥ నాడున్ నేడును హైందవీయ ప్రభుతన్ నాటంగ యీ నాడునన్
వేడున్నాడొక నేను, నా వెనుక నీవే తప్పు - నిన్నందుకే
యీడున్ చూడక పిన్నవాడవనియున్నేనెంచకే "సింగు"తో
న్తోడున్నీకయె పంపినాడ నరులన్నోర్వంగ నేర్వన్ సుతా! ॥ 841

మ॥ అపుడా "మౌజము"యొద్ద కంపినను వ్యూహమ్మిద్ధియే సుమ్ము - నీ
వెపుడున్ మన్సబుదారుగా కొలిచి నావెచ్చోట కెప్డేగినన్
రిపులన్ మచ్చిక చేసికొంటివచటన్ నీ రూప, శౌటీర్య, ధై
ర్య, పటుత్వ ప్రతిభావిశేషములతో, నల్పుండవే చెప్పుమా! ॥ 842

ఆ॥వె॥ ఎచటి కేగినను జయించు కొని మరలి
తతుల శౌర్య, ధీ సహాయుడవయి
కొదువ యేమి నీకు కొండికవై గూడ
పెద్దలచ్చెరు వడు పేరుగొంటి ॥ 843

ఉ॥ కన్నడ రాజ్యమున్ గెలువగాఁ జనునప్పుడు నేను రమ్మటం
చు న్నిను పిల్వ లేదనుచునొచ్చితి వీవెద నంతదూరమే
గన్నట సంభవించు వెడ గండములన్ తెలియంగ లేమి - నే
జన్నను రాజ్య రక్షణకు చాలెద వీవని యెంచితో సుతా ॥ 844

(రాణువ=సైన్యము; యోజ=విధము; ఉంకువ=గిరవు)
(మోక=లేతచెట్టు; దునుముట=నఱకుట, ఎత్తైను=దండెత్తెను; పరి=సైన్యము; అద్రి=చెట్టు) (అరులు=శత్రువులు; ఓర్వన్=ఓడించుట) (శౌటీర్యము=శౌర్యము)
(వెడగండములు=ఊహించని ప్రమాదములు; చాలు=సమర్థుడగు)

ఉ॥ “రాయగడమ్ము నందున నరాతిగ నెంచుచు నన్ను దూరమున్
చేయగ నెంచి నార”నుచు నెవ్వగ బూనితి గాని నీ కటన్
దాయలు మెండు - నీ సవతి తల్లియె యోర్వదు నీ పొడన్ - సదా
నీయపరాధముల్ వెదుక నెంతురు మంతులు ద్వేషమూనుచున్॥ 845

ఉ॥ ఇందరి మధ్య నిన్నునిచి యెట్లు ప్రశాంతిగ బోవనేర్తు - నీ
వెందునయున్న సేమము మెయిన్ మన గల్గుటె చాలు నాకు - నీ
హైందవ రాజ్య మీవె మదనంతర మేలెడు నౌరసుండవై
నందున - నీసురక్షకయి నంపితి నీ శ్వశురస్థలమ్ముకున్॥ 846

తే॥గీ॥ జనులు ననుచంద్రు - “దాయాది చావగోరు
బావ మఱది బ్రతుక గోరు” - నా వచనము
లెంతొ విలువ గలవి కాని యేలికలకు
నన్ని వైపుల శత్రులే యరయు కుఱ్ఱ॥ 847

ఉ॥ ఇప్పటికైన నీ యెదను నేర్చెదు శంకలు పోయి - నీ యెడ
నొప్పరికమ్ము నా మదిని యొక్కరవంతయు లేదటంచు నీ
వొప్పిననాడె నా యెదకు నూరట కల్గును - నీదు సేమమే
తప్ప మరెద్ది యేనియు ప్రధానము కాదు కుమార! నాకిలన్”॥ 848

తే॥గీ॥ అనెడు పిత పలుకులు శంభు నాలకించి
బాష్ప సిక్తాస్యుడై పితృ పదము లంటె
నన్ను మన్నింపుమో తండ్రి! నాగ, శంభు
గాఢముగ శివాజి సుతుని కౌగిలించె ॥ 849

చ॥ కరగి ప్రవాహమయ్యె నెద కల్గిన భావములశ్రు రూపతన్
పురుటము సాగె కొంతతడవున్ పిత పుత్రులకున్ - శివాజియున్
మరలుచు రాజధానికి కుమారునితో నిటులాడె - “నింకనీ
కిరవుగ “పన్హాలా గడమె” యెంతయునుందగు కొంత కాలమున్”॥ 850

(అరాతి=శత్రువు; దాయలు=శత్రువులు; పొడ=ఉనికి; మంతులు=మంత్రులు)

(ఒప్పరికము=ఉపేక్ష; ఒప్పు=అంగీకరించు) (పురుటము=సంభాషణ)

శ్రీ 'శివాజి' వీర శంభాజీ కి "రాజనీతి", "రాజ ధర్మమును" గూర్చి ప్రబోధించుట

తే॥గీ॥ "వినుము శంభాజి! మనకున్న విమతు లందు
పైకి కన్పడు పెఱవారి వలన మనకు
చేటు కలుగును - కాని మారాటు లందె
కల దురాత్ములచే నంత కన్న కీడు ॥ 851

ఆ॥వె॥ ఆదిలుషనవాబు, నౌరంగజేబును
నందరికి కనబడు నరియుగమ్ము
పూరి కప్పిన 'ప్రహి' బోలుమరాటులు
పైకి మైత్రి లోన వైర మెంత్రు ॥ 852

సీ॥ నాకుజామాతయు, నీకుబావయు నగు "మ
హద్జినింబాల్కరు" నా మొగలుల
భృత్యుడు "ఫల్తను" పృధ్వి వతన్దారు
జావళీ మోరేలు" సంతతమ్ము
హైందవ రాజ్యోపహతి గోరు వారలు
తడిగుడ్డతోగొంతు పుడుక గలరు
'శృంగారపూరు' "సుర్వే"లు - "గణోజిషి
ర్కే"యు మనలసమర్థించునటుల ॥

తే॥గీ॥ నటన చూపుచునుందు రావటమునైన
మొగలువారిని నెగ్గింప మొగియు చుంద్రు
జాల్మ డ"ఫలుఖాను" "తుల్జాభవాని"
ప్రతిమ గూల్చ, మరాటులే 'భళిర' యనిరి ॥ 853

ఉ॥ ఇట్టి మరాటులుండ నిక హిందు స్వతంత్ర ప్రభుత్వమెట్లు తా
గట్టుకు నెక్కు? -క్రిందికి దిగన్ ఖలులిగ్గుచు నుండ-గ్రన్న నీ
కట్టిడులే మొగల్ ప్రభుత కాడిని మోయగ సిద్ధమెప్పుడున్
తట్టదె? వీరి బుద్ధికి స్వతంత్రతకున్ గల విల్వ యెట్టిదో ॥ 854

(పూరి=గడ్డి; ప్రహి=బావి) పుడుకు = కోయు

ఉ॥ నమ్మిన యట్లె యుండవలె నాయకు లెప్పుడు నెల్ల వారలన్
నమ్మిక కర్హమైన సుజనావళి నాప్తులుగా గ్రహించుచున్
నమ్మిక వమ్ముఁజేయుచు ననర్ధము చేకుఱ చేయువారి-వ్యూ
హమ్ము లెఱింగి ముందె తగు నౌపయికమ్మున తప్పుకోవలెన్॥ 855

ఉ॥ ఆహవ రంగమందు విజయమ్ముఁగొనన్నతి ముఖ్యమైనవై
సాహస ధైర్య శౌర్యములు సర్వ ప్రధానములయ్యు నేతకున్
వ్యూహములల్లునప్డు సమ యోచిత మౌవగ - గెల్పునోటల
న్నూహము సేయగల్గు ప్రతిభోన్నతి, యంతకు మించి కావలెన్॥ 856

ఉ॥ ఇంతకు మించి నేనిక వచించెడు దేమియులేదు - నీవు న
త్యంతము రాజనీతిని గలట్టి రహస్యము లాకళించి నా
వింతకు వాని నాచరణకెట్లు సమన్వయము న్నొనర్తు వా
సంతన నేర్వగా వలయు శంభు! భవద్భవితవ్య ప్రాప్తికై ॥ 857

ఉ॥ ఆరయు చుంటి నీ వెపుడు హాలిక, నిర్ధన పక్షమూను చే
దారినినైన వారి విపదల్ తొలగించుచు నుంటి వాదయో
దారమనస్కతన్ పొగడుదౌనదియే జనతాభిమానమ
వ్వారిగ పొందు మార్గము-నృపాఖ్యను దాల్చినయెట్టి వారికిన్॥ 858

తే॥గీ॥ నిర్ధనులు - నిష్కళంకులు - నీతి పరులు
నైన యా జావళీ తెగ యందె నాకు
వీర "తానాజి", వీర "మురారి" వంటి
హైందవీరాజ్య రక్షకులనుగులైరి ॥ 859

ఉ॥ గద్దియ నెక్క నాసవడగా యపరాధము కాదు గాని యే
పద్ధతిలో నతండు మునుపందరికిన్ తలలోని నాల్కయై
శ్రద్ధనుఁజూపె రాజ్యప్రజ సౌఖ్య ధనామయ, శాంతి, సిధ్ర సం
సిద్ధికినట్టి దట్టుడె వసింపగ నర్హుడు సింహ పీఠిపై ॥ 860

(ఓటు=ఓటమి)

(భవితవ్యము=శుభము)

(ఆమయము=ఆరోగ్యము; సిధ్రము=సంరక్షణ)

కం॥ నే నెక్కిన గద్దియకును
నేను మెటికలు గలుగు - నవి యెక్కెడు వేళన్
లో నెంతొ పవిత్రోహల
నూనుచు నెక్కంగ తగును నొక్కొక మెట్టున్ ॥ 861

రాజ సింహాసనము యొక్క సాంకేతికమైన అంతరార్ధము

సీ॥ తొలి తాపపైన జనుల కనుల్కనవచ్చు
 వినవచ్చు వివిధ 'వాహినుల' యులివు
మలి మెట్టుపై దృశ్యమానమౌ మారాట
 రక్షాత్త 'త్రిశత దుర్గముల' యున్కి
మూడవ మెటికపై చూడనౌ 'జీజా'ది
 వశల సూడిగములు పగులు రవము
నాల్గవ పావంచ నడుగేయ విన్పించు
 'జ్ఞానేశ్వర', 'తుకోబ' జ్ఞానబోధ ॥

తే॥గీ॥ ఐదవ పడికట్టెక్క 'సహ్యాద్రి' ప్రాంశు
సానువులు చూపు స్వస్థైర్య సంప్రతిష్ఠ
'ఇనుడు' హిందు రాజ్యము గూర్చి హెచ్చరించు
నిన్ని మెట్లెక్కి మరిగద్దె నెక్క వలయు॥ 862

ఉ॥ సాహస విక్రమార్కుడవు శంభు! లవమ్మును సందియమ్ములే
దాహవ పార్థ నందనుడ వాపయి దైవత వాణి నాది శే
షాహివి - కావ్య కర్త వటులయ్యును ముందు రజస్తమోగుణ
వ్యూహము సంయమింపగల ప్రోడవు గావలె నీవు పుత్రకా! ॥ 863

(మెటికలు=మెట్లు) సూడిగములు = గాజులు
(సంప్రతిష్ఠ=ఉచ్ఛస్థితి; ఇనుడు=సూర్యుడు)
(పార్థనందనుడు=అభిమన్యుడు; దైవతవాణి=సంస్కృతము)

శ్రీ శివాజీ రాయగడమునకు మరలి పోవుట

ఆ॥వె॥ అనుచు హితము చెప్పి తన యగ్ర సుతునకు
వెడలె శివజి 'రాయగడము'ఁజేర
'పన్హాల' గడమందె వసియింపు మని చెప్పె
శంభుజీకి యతని జనకుడపుడు॥ 864

శ్రీ 'శివాజీ' 'వీర శంభాజీ'ని పూర్తి నిర్దోషిగా యెంచెననుటకు వీలు లేదు

చ॥ కొడుకును కుస్తరించు పని గొప్పగ చేయు శివాజి తాను ప్రె
గ్గడలకు, భార్య 'సోయర'కు గట్టిగ యుత్తర మీయలేదు - వా
రుడుగక చెప్పు కొండెములకొగ్గను చెవ్వు - నిజానిజమ్ము లా
నుడుగుల నెంత యంచు కన నొత్తిన నిక్కము వెల్వడున్ గదా! ॥ 865

కం॥ శివజీ వారల మాటలు
చెవి బెట్టెనొ? - తానె విశ్వసించెనొ? శంభు
న్నవినయు డసహన గుణుడని
ధ్రువము నొనర్చు కొనియెనొ? యెఱుక యౌ విధికే ॥ 866

ఉ॥ రాయగడమ్ము లోనికిక రాదగడెప్పుడు శంభు డంచు ని
శ్చాయకులైన మంత్రులకుసైయను 'సోయర' బాయి తీర్పు వై
ధేయమునై పురప్రజలధీరులు నైరి -శివాజి రాజు తా
నేయదినాకమౌనము వహించెను-పొంగిరిశంభువైరులున్ ॥ 867

శ్రీ 'శివాజీ' 'సోయరాబాయి'ల కుమారుడు 'రాజా రామ రాజు' వివాహము

కం॥ శివజీ ద్వితీయ సుతునకు
వివాహ మొనరింప దలచి పెండ్లి కొమరితన్

(వైధేయము=విధి విహితము; పొంగిరి=సంతోషించిరి; అధీరులు=ధైర్యహీనులు)

తవునని "ప్రతాపరావ్" తను
భవనెంచు కొనియె తనదణి భవ్య స్మృతికై ॥ 868

తే॥గా॥ తన దణాయల యందు మేరునగ ధీరు
డౌ "ప్రతాపరావు గుజరొ" కప్డు బీజ
పూరు "బహలోలు ఖాను"ను పోరునందు
నోడగొట్టి, విడువ - శివుడుగ్రుడయ్యె ॥ 869

కం॥ "శివజీ' కోపము నణపగ
రవులునెడందను ప్రతాపరావు బిరానన్
బవరమున కేగి షడను
ప్లవులను వెంటగొని పోరి స్వర్గతి నొందెన్ ॥ 870

కం॥ ఆ పొరపాటుకు, పశ్చా
త్తాపముతో 'శివజి' యతనితనయను స్నుషగా
చే పట్టి మురిసె - 'జానకి'
తాపదమిడె 'రాజరాము' దారగ నింటన్ ॥ 871

తమ్ముడు 'రాజారాము' 'వడుగు'నకు గాని, 'పెండ్లి'కి గాని శంభునికి పిలుపు లేకుండుట

ఉ॥ రాయగడమ్ముపై గల పుర ప్రజలందరు పెండ్లి పెద్దలై
రాయెడ నన్ని దిక్కుల మరాట భువింగల పౌరు లెల్లరున్
పాయని వేడ్కతో తరలి వచ్చిరి శ్రీ శివరాజు చిన్నయ
బ్బాయికి రాజరాముకు వివాహమటంచును గుంపుకట్టుచున్॥ 872

తే॥గీ॥ తమ్ముని 'వడుగు' నకును - నుద్వాహమునకు
నొక్కగా నొక్క యన్నకు - వక్కణమ్ము
లేదు - శంభాజి మన సెంతొ ఖేదపడియె
"నన్నయేడి?యేడ'ని తమ్ముడడిగె నంట ॥ 873

(తనుభవ=కూతురు; దణి=సేనాపతి; భవ్యస్మృతి=జ్ఞాపకార్థము)
(బవరము=యుద్ధము; అనుప్లవులు=అనుచరులు)
(వక్కణము=లేఖ)

వీర శంభాజీ తనపై నీలాప నిందలు వ్యాప్తిచేయు అమాత్యులు, సవతి తల్లి ప్రవర్తన పట్ల ఆవేదన వ్యక్తముచేయుట

శా॥ "నే నే తప్పొనరించినన్ పితయె మన్నించెన్గదా నన్ను! ని
ద్ధాన న్నిందు స్వతంత్ర భూమికి ననర్థంబేమి వాటిల్లె? నా
పై నింకేల వహింతురీ పగిది నెవ్వారైన శత్రుత్వము
న్నేనెవ్వారికి నెట్టి హానియును కావింపంగ లేదెప్పుడున్ ॥ 874

తే॥గీ॥ "అణ్ణజీ దత్తు" నాపయి నగ్గిఁజిమ్ము
"పన్నులం గొనుటందు చే వాడి తనము
చూపె నంచును, నేతప్పు మోపితినని
యష్ట మంత్రుల యవినీతి నడ్డితినని ॥ 875

చ॥ జనకుని రాజ్య వృద్ధికయి సాయము చేసిరి వార లెంతొ - య
ట్లని తమనడ్డు వార లెవరంచు ననైతిక వర్తనమ్ముతో
ధనమును కొంత సొంతమని, దారిని తప్పగ చేయు దోపిడీ
యెనయుచునున్న యిట్లె, యిక యెట్టులనింతురు రాచ బందరున్॥ 876

చ॥ అది తగదంచు చెప్పితని హోలికులన్ యెగదోలి తంచు-వా
నిదుహిత నేదొ చేసితని నేరము కల్పన చేసి నా పయిన్
పదరుచు యణ్ణజీ తనదు బైసిని తానె తొలంచు కొంచు - దు
ర్హృదునిగ నన్ను లోకమున కెల్లను చూప దలంచె నీసుతో ॥ 877

ఆ॥వె॥ సవతి తల్లి యయ్యు చనవుతో నను పెంచె
తనసుతుండు నాకు తమ్ముడె గద ।
ఛత్రపతి జనకుడు సభలోన నను యువ
రాజుగాఁవచింప రగిలె యాపె ॥ 878

చ॥ వయసున నేనె పెద్ద యని - వప్తకు యగ్ర సుతుండనంచు నె
ప్డయినను తండ్రికి న్నిదప యౌరసుడేనను వాస్తవమ్ము - తా

(దుర్హృదుడు=దురాత్ముడు; ఈసు=కోపము)

(చనపు=ప్రేమ; రగులు=కోపించు)

ను యెదఁదలంపదో! తన తనూజును రాజును చేయనెంచి - నా
పయి సచివాళితో కలిసి బద్దుర నేరములన్ని మోపునే? ॥ 879

శా॥ స్త్రీ లోలుండని మత్తు గొల్పు దినుసు ల్సేవింతునంచున్నదా
శీలాపేతులతో చరించుచునుపేక్షింతు న్వయోజ్యేష్ఠులన్
తూలన్నాడుచు నంచు, నార్య జనుల న్దూరింతు నంచున్నస
త్యాలాపమ్ములతో మచ్చరిత్ర పయి నైల్యమ్మంటిరీ దుర్జనుల్ ॥ 880

తే॥గీ॥ తండ్రి తగు విచారణ సల్పి "తన తనయుని
కనయ వినయ గుణమెతప్ప - యనయ గుణము
లేదతండు నిరపరాధి - లేని నింద
లాతడింత వరకు మోచె ననఘు డయ్యు" ॥ 881

తే॥గీ॥ అనిన తండ్రి తీర్పు నెడ మన్ననయె లేని
మంత్రి వర్గ వైఖరి నెట్టి మార్పు లేదు
సవతి తల్లి విష ప్రవృత్తి సాగుచుండె
ఛత్రపతి తీర్పు గూడ నిస్సత్త్వమయ్యె॥ 882

చ॥ 'వశ' కెదురాడ లేక - సచివాళి నలక్ష్యము చేయలేక - తా
వశుడయి రాజకీయముల వాగురలన్ తొలగించి వెల్వడన్
భృశమగు సంకటమ్మగుచు - పేరుకె రాజయి సొంత తీర్పె, క
ర్కశముగ నెట్టి వేయబడఁ కాదన కొననకుండె తండ్రియే ॥ 883

తే॥గీ॥ అని "యశూబాయి" తో "శంభు" స్వాంతరమున
యాది నుండియు పేరిన ఖేదమంత
కాళియుండున్న కాళింది కూలమట్లు
నుడుకు చుండగ నుడుగుల వెడలఁజేసె ॥ 884

(వప్త=తండ్రి; బద్దుర=అసత్యము)

(వశ=భార్య; వాగుర=వల; భృశము=మిక్కిలి)

(స్వాంతరము=తన మనస్సు; కాళింది=యమున; కూలము=తటాకము; నుడుగులు=మాటలు)

వీర శంభాజీ “పన్హాలా” ప్రాంతమునకు సుబేదారుగా తండ్రిచే నియుక్తు డగుట “హీరోజి” శంభాజీపై కొంత అనాదరము చూపుట

తే॥గీ॥ “పన్హాలా”, ‘ప్రభావళి’, ‘దభో(ల్ప్రా’ంతములకు
శంభునకు పాలక పదమొసంగె శివజి
అచట ‘హీరోజియు’ గలడు – ‘నా(గ్ర’ యందు
‘శివజి’ బూమియ పన్ని రక్షించె ప్రభుని ॥ 885

తే॥గీ॥ ‘శంభు’ బంధువు హీరోజి – ‘శంభు’ యనిన
యెంతొ వాత్సల్యమతనికి – యేమి కతమొ?
యిపుడు కొంత దూరమును పాటించు చుండె
పూర్వ ప్రేమ భావము నేడు ఖర్వమయ్యె ॥ 886

సీ॥ ‘మల్హోజి ఘోర్పడే’ మహిత సేనాపతి
‘పన్హాలా’ వనిని కాపాడు చుండ
“విఠ్ఠల్ మహాద్కరు” కోట కధిపతియై
గడము నెప్పటికప్డు దృఢము చేయ
పదిలుడు “హీరోజి ఫర్జాందు” బండరు
నిండించు చుండ నిర్నిద్రుడగుచు
దండి మగడు “జనార్దన హనుమంతు “కొ
ల్లాపురి” యశ్వదళాధి పతిగ ॥

తే॥గీ॥ నిట్టు లీ వీరులందరు చుట్టి యుండి
‘పన్హాలా’ పురాఁ గాచుచు బవలు రేయి
యెత్తి వచ్చు ‘దిలేర్పరిన్పిత్తుఁ జేయ
నట సురక్షితుడై యుండె నపుడు శంభు ॥ 887

(బూమియ=మారువేసము) పదిలుడు=నేర్పరి
(ఖర్వము=హ్రస్వము)
(నిర్నిద్రుడు=నిత్య జాగరూకుడు; పురా=కోట; పరి=సేన)

కం॥ 'రాయగడు' కేగ నీక "దు
రాయి"ని బెట్టె న్నచటి నిరంకుశ శక్తుల్
యేయెడ ననుజు మనువు క
గ్రీయుని రానీయకుందురే? యటదప్పన్ ॥ 888

కం॥ అని శంభు నగ్రపడుచును
తన పిత యెటు చెప్పలేక తాటస్థ్యముతో
తనరించు నన్ని పనులని
జనకుని యెద నెఱిగి శంభు శాంతి వహించెన్ ॥ 889

"ఔరంగజేబు" భావిదక్కను దండయాత్ర నెదుర్కొన మరాటులు సిద్ధపడుట

కం॥ కాబూలు, కాంద హారులు
జేబునఁజేర్చ నవురంగజేబు పవిదిశన్
తా బవరములో మునుగుట
చే - బలమేదె న్నవాక్దిశేలను గెల్వన్ ॥ 890

ఉ॥ ఎప్పుడు గెల్చి'యాఫ్ఘనును' నింక యుదీచిని యుద్ధ బాధ్యతల్
తప్పునొ 'పాదుషా' కపుడు తప్పని ముప్పగు దక్షిణాశకున్
గొప్ప చమూసమూహములఁ గొంచు స్వయమ్ముగ నెత్తి వచ్చు - తా
తప్పమరొక్కడీ యిల స్వతంత్ర నృపత్వము పూన్కి యొప్పమిన్ ॥ 891

కం॥ దాదా పెనిమిది లక్షల
పాదాతులు హయగజోష్ట్ర వాహనచయముల్
బందూకులు, దంచనముల
తో దిగు 'మొగలుపరి' మిత్తి తోబుట్టువలెన్ ॥ 892

(దురాయి=ఆజ్ఞ; మనువు=వివాహము; అగ్రీయుడు=అగ్రజుడు)
(తనరించు=చక్కబెట్టు)
(పవిదిశ=వాయవ్యము; బవరము=యుద్ధము; ఏదు=లేకపోవు; ఆవాక్+దిశ+ఇల=దక్కను)
(పదాతులు=కాల్బలము; దంచనములు=ఫిరంగులు; పరి=సైన్యము; వాహనము=శకటము)

కం॥ "అందులకే మారాటులు
నందరు జతఁగూడి పోరి కాయత్తమ్మై
కందువల నిలిచి నేర్పున
క్రందుగ ౘ్రమందింప వలయు గడ్డు పగతులన్" ॥ 893

శ్రీ శివాజి 'జల్నా' ప్రాంతములను కొల్ల గొట్టుట

ఉ॥ 'శంభు' దిలేరుఖానుని వశమ్మున నుండిన కాలమందు - ప్రా
రంభము చేసె శ్రీ శివజి రాణువలన్ సమకూర్చు కొంచు - సం
రంభము తోడ నాదిలుష రాజ్యము నాను మొగల్ విజృంభణన్
స్తంభితముం బొనర్చనని "జల్నా" ముఖప్రముఖ స్థలమ్ములన్ ॥894

శ్రీ శివాజీని రణ మస్తఖాను అడ్డగించుట - శ్రీ శివాజి తప్పించు కొనుట

ఆ॥వె॥ సమర విజయి యగుచు 'జల్నా'ను కొల్లాడి
తిరిగి రాయగడము కరుగు వేళ
సవరఁబెట్టె పరిని 'సంగమనేరొ'ద్ద
మాల్చ శివజిని "రణమస్త ఖాను'॥ 895

కం॥ గహనారణ్యములంజొౌటి
'బహిర్జి నాయకుని' బుద్ధి ప్రావీణ్యము చే
సహియించి యన్ని యిడుమలు
రహస్యముగ శివజి చేరె రాయగడమ్మున్ ॥ 896

(కందువ=కీలక ప్రదేశము; క్రిందుగ=బాగుగా)

(రాణువ=సైన్యము; సంరంభము=గర్వము; ఆను=ఆక్రమించు; స్తంభితము= ఆగిపోవుట; అని=యుద్ధము)

(సవరపెట్టు=అడ్డగించు; మాల్చు=చంపు)

(ఇడుమలు=ఇబ్బందులు)

శ్రీ శివాజీ ఆరోగ్యము క్షీణించుట

చ॥ క్రమముగ శ్రీ శివాజి తన కాయము శక్తిని కోలుపోవు ని
క్కము నెఱిగెన్ - గదమ్మెదియొ గాసిల చేయుచు నుండె నాతనిన్
శమితముగాని "కాక" శయ శాయినొనర్చె నహర్నిశమ్ము - వై
ద్యమునకు లొంగ కుండ-భిషగ్రగణులచ్చెరు వంది మ్రాన్పడన్॥ 897

కం॥ జ్వరమును, రక్త గ్రహణియు
త్వరితముగ క్షయింపఁజేసె తనువున త్రాణ
న్నెరగొన నోరెము, నీరము
నురవగు దిటలేక శివజి యుడిగెను స్ఫురణన్॥ 898

ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజే అస్తమయము

ఏప్రిల్ 3 తేది 1680

కం॥ వారద్వితయము లోనె - మ
హారాష్ట్ర తరణి శివాజి యస్తమితుండై
నీరంధ్రాంధమ్మున - హిం
దూరాష్ట్రమును విడిచిచనె ధూర్జటిఁజేరన్ ॥ 899

(గడము=జబ్బు; శమితము=తగ్గుట; కాక=జ్వరము; శయశాయి=పడకపై పండుకొనుట; భిషక్=వైద్యుడు)

(రక్తగ్రహణి=నెత్తురు విరోచనములు; త్రాణ=బలము; ఎరగొను=మ్రింగు; ఓరెము=ఆహారము; ఉరవు=తగిన; దిట=సామర్థ్యము; స్ఫురణ=స్పృహ; ఉడుగు=నశించు)

(వారము=ఏడు దినములు; తరణి=సూర్యుడు; నీరంధ్రాంధము= చిమ్మ చీకటి; ధూర్జటి=ఈశ్వరుడు)

"ఛత్రపతి శివాజి" మరణ వార్తను అమాత్యుడు, "సోయరాబాయి" అతి గోప్యముగా ఉంచుట

కం॥ శివజీ స్వర్గతి వార్తను
దివిజులకే యెఱుకగాని తీవ్ర రహస్యం
బవునట్లొనరింపంగ స
చివు'డణ్ణాజి', 'శివజి సతి' చేసిరి కుట్రన్ ॥ 900

"ఛత్రపతి శ్రీ శివాజి" మరణ వార్తను "వీర శంభాజీకి" తెలియకుండ దాచుట

మ॥ జనక స్వర్గతిఁ గూర్చి 'శంభు'కు సమాచారమ్మె లేకుండఁజే
యునటుల్పన్నక మల్లి రాయగడిఁగాలూదంగ నెవ్వారికిన్
యనువు న్నీయక కోటలో బయల సేనన్ కాపుగా బెట్టి ర
ర్కనికాశమ్మఁచేత నడ్డినటు "సోయ్రాబాయి" "రాహూజి"యున్॥ 901

ఉ॥ "భావి మరాట ఛత్రపతి పట్టము దాల్పగ "రాజరామె" - సం
భావిత సద్గుణాన్వితుడు, పాత్రుడు - శంభుజి పాలనార్హమౌ
త్రోవనుఁదప్పి దుర్వ్యసన దూషితుడై - పితృ గౌరవమ్ము పై
కావిరి గ్రమ్మ తుర్క కటకమ్మున చేరె స్వధర్మ దూరుడై ॥ 902

ఉ॥ కావున శంభుజీ యిపుడు కాలిడినన్ యిట శాంతి యింక వి
ద్రావితమౌ, సుఖమ్మునకు తావె లభింపదు - క్రోధ ఘూర్ణితుం
డై విలయాంతకుండగుచు నందరినిన్నుఱుమాడు - పెద్దలా
రా! వినుడయ్య మా మనవి-రాజ్య మొసంగుడు "రాజరాముకే"॥ 903

తే॥గీ॥ అనుచు 'నణ్ణాజి' తక్కిన వ్యాపృతులను
దణుల నధికృతులను సభాస్థలినిఁ జేర్చి
చెప్పె నిది 'సోయరాబాయి' స్వీయ నిర్ణ
యమని, మన రాజ్ఞిగా యాపె యాజ్ఞయనుచు ॥ 904

(అర్కనికాశము=సూర్యకాంతి; రాహూజి=రాయగడు దుర్గాధిపతి)
(వ్యాపృతులు=మంత్రులు; దణులు=సైన్యాధిపతులు)

మ॥ శివజీ స్వస్థత కోలు పోయినపుడే చేతమ్మునన్ స్ఫూర్తియున్
లవమై నోటను మాట గూడ వెలికిన్ రాలేనిదై పోయె – తా
నెవరిన్ పిల్వగలేడు – వారడిగినన్ స్వేచ్ఛన్ యెఱింగింప లే
డవసాన స్థితిలో శివాజి మది యూహల్ మ్రందె నజ్ఞాతమై॥ 905

మ॥ మును కర్ణాటక జైత్రయాత్రకును తాఁబోవంగ సంసిద్ధుడౌ
చును, మంత్రుల్ దళనాయకుల్ తదితరుల్ చుట్టుంగుమిం గూడ–ఆ
యన చెప్పెన్నట – "నేను లేనపుడు రాజ్యాధ్యక్షతన్ శంభుకీ
యనపేక్షింపను – కోపనుండతనికిన్నావేశ మెచ్చౌటచే ॥ 906

ఆ॥వె॥ అపుడె పట్టివైచె 'అణ్ణాజి' గట్టిగా
'శివజి' నోటి మాట స్థిరమటంచు
నంతమందు శివజి యాశయమ్మేమిటో
తెలియమిని సచివులు పలుకరైరి ॥ 907

ఉ॥ 'సోయరబాయి' యున్ తనదు సూనుని రాజును చేయ నెంచి – తా
నాయెడ నెల్లవారికి వెలార్చుచు నుండెను "రాజరాముడే"
యాయతిలో మరాట భువి కంతయు రాజగు నంచు నెన్నొ ప
ర్యాయము లాప్రభుండనెనటంచును–నశ్రులు నొత్తుకొంచునున్ ॥ 908

ఛత్రపతి శ్రీ శివాజీ అంత్యక్రియలు "సబజిభోస్లే" యనెడు తద్వంశీకుడు చేయుట

ఆ॥వె॥ అగ్రసుతుని పిల్వ నంపగా లేదిక
చిన్నకొడుకు వయసు చిన్నయగుట
"సబజిభోస్లె" యనెడు జ్ఞాతి యొకడు వచ్చి
శివజి కపరకర్మ చేసెనపుడు ॥ 909

మ॥ శివజీ యేమి అపుత్రకుండె? చితికిన్ జ్యేష్ఠాత్మజుండే సమ
ర్థ విధానమ్మున వైదికమ్మయిన మంత్రాగ్నిన్ రగుల్పన్ వలెన్

(అపేక్షించు=కోరు; ఎచ్చు=ఎక్కువ)

(ఆయతి=భవిష్యత్కాలము; వెలార్చు=ప్రకటించు)

యెవరో దిక్కును లేని వారికటులన్ యేచుట్టమోవచ్చి యి
ట్లవమమ్మైన యమంత్రకమ్మయిన "భాటాగ్ని"న్నిడన్ పాడియే॥ 910

ఆ॥వె॥ శంభుడనిన యష్ట సచివుల కాత్మలో
భీతిగలదు కాన ద్వేషముబికె
శంభు 'సైరికులకు' సైనికులకు నెంతొ
ప్రీతి పాత్రుడగుటె బెడద యాయె ॥ 911

'సోయరాబాయి' తన సోదరుడు సైన్యాధిపతి హంబీర రావును పిలిపించుట

తే॥గీ॥ సోయరాబాయికి ననుగు సోదరుండు
చేరువ కధినాధుడగు హంబీర రావు
"కరదు" కేగి యుండె నతని కంపె కమ్మ
క్రచ్ఛఅన్రమ్మనుచు రాయగడమునకును ॥ 912

ఉ॥ రాయగడమ్ములోనికి చొరంబడు దాక యెఱుంగలేరు – యం
దేయదియో మహా విపద యేర్పడెనంచెవరైన గాని – య
ట్లాయెడ కట్టడిన్ సలిపి రష్టప్రధానులు, సోయరాంబయు
న్నేయిసు మంత యూసు వెలికేగియు 'శంభుని' చేరకుండగన్॥ 913

తే॥గీ॥ వచ్చె 'హంబీరరావు' నవరజ పిలువ
నంప – వినుచు శివాజి నిర్యాణ వార్త
పిడుగు పడ్డట్లు మ్రాన్పడె – పిదప తనరె
స్వస్వసేయుడే భావి రాజౌననంగ ॥ 914

(మంత్రాగ్ని=మంత్ర పూర్వకమైన అగ్ని; అవమము=హేయము; భాటాగ్ని=అద్దెకు వచ్చిన వ్యక్తి రగిలించు అగ్ని)

(చేరువ=సైన్యము; 'కరదు'='సతారా' జిల్లాలోని యొక ప్రాంతము)

(కట్టడి=ఆజ్ఞ; ఊసు=వార్త)

(అవరజ=చెల్లెలు; స్వస్వసేయుడు=మేనల్లుడు)

ఉ॥ ఇంతకు శంభుడేడ? కనిపింపడు 'నేమికతమ్మొ'? యంచు బ
ల్వింతను, వంత జెందు తన భ్రాతను కన్గొని సోయరాంబ - నా
వంత బిడెమ్ము లేక యనె - "నాతడు తండ్రికి, హైందవోర్వి క
శ్మంతము గూర్ప పాల్పడియె శత్రుల పక్షము చేరి ద్రోహియై ॥ 915

ఆ॥వె॥ ఆతడెట్టు లింక యౌరసుడౌ తండ్రి
కతని వర్తనమ్ము నాది నుండి
మనకపాయకరము గనె యుండె - నందుకే
ఇటకు రాననుజ్ఞ నీయలేదు" ॥ 916

హంబీరరావు మోహితే శివాజీ భార్య 'పుతలబాయి'ని చూడబోవుట

చ॥ అదివిని 'శంభు'దన్న, సవతమ్మకు నింతటి ద్వేషముండెనా
ప్రదరముఖాభ తీవ్ర శితవాక్కుల నొవ్వగ నాడు నంచు తా
మదినతిచోద్యమంది స్వసమందిరమున్ విడి - సంప్రదాయపుం
బదకము మైచనెన్ "పుతలబాయి" ని చూడగ 'మోహితే' యటన్॥ 917

ఆ॥వె॥ శివజి భార్యలందు స్తవనీయ గుణవతి
పుతలి బాయి పూర్ణ పుణ్య చరిత
'సంతు'లేని యామె - జననిని గోల్పడ్డ
"శంభు"ని గను సొంత సంతు వోలె ॥ 918

ఛత్రపతి శివాజీ అస్వస్థతను గురించి 'మోహితేకు' పుతలీబాయి వివరించుట

తే॥గీ॥ శ్రీ శివాజి కర్ణాట భూ జేతయగుచు
రాయగడు చేరి కొంత కాలమ్ము గడిచి

(బిడెము=బిడియము; అశ్మంతము=కీడు)
(ప్రదరముఖ=బాణపు ములికి; శిత=వాడియైన; స్వస=చెల్లెలు)
(సంతు=సంతానము)

నంత దేహదౌర్బల్యము కొంత తోచి
క్రమముగా వేకియు, రుధిర గ్రహణి కలిగె ॥ 919

కం॥ ఔషధములకును లొంగక
దోషజ్ఞుల కెఱుక పడని దుర్దమరుజయై
శోషించె తనువును – యశ
శ్శేషుని చేసె, నది కడకు శ్రీ శివప్రభువున్ ॥ 920

తే॥గీ॥ దేహమున జబ్బు మొదలైన దినము నుండి
వా విడచి యొక్క మాటయు పలుక లేదు
ఎపుడు చూచిన మ్రాగన్నె – స్పృహయె లేదు
చివరిమాటైన చెప్పకే చేరె దివము ॥ 921

ఆ॥వె॥ 'పుతలిబాయి' చెప్పె పూర్తిగా విషయము
'మోహితే' యట నిజమును గ్రహించె
మారుమాట లేక మరలె 'సతారా' కు
శంభునడప కుట్ర సాగుచుండె ॥ 922

వీర శంభాజీని నియంత్రించుటకు అణ్ణాజి, సోయరాబాయిల కుట్ర

సీ॥ అష్ట ప్రధానుల నగ్ర గణ్యుండైన
పీష్వ "మోరోపంతు పింగళేజి"
ఆర్థిక మంత్రియౌ "అణ్ణాజి దత్తోజి"
వ్రాయసకాడు "బాలాజి యవజి"
జనకాగ్ర సుతునిగా 'శంభాజి' తన యౌర
సత్వమున్ స్థాపించు సందునిడక
'సోయరాబాయి' స్వజుడగు 'రాజారాము'
ఛత్రపతిని చేయ సాయపడగ ॥

(రుధిరగ్రహణి=నెత్తురు విరోచనములు; వేకి=జ్వరము)

తే॥గీ॥ "పన్హాలా" గడమున శంభుఁబట్టి బంది
గా నొనర్ప "వితల్మహద్కరు" గడి దొర
బండరముఁగాచు "హీరోజిఫర్జ" దట్లె
వ్రాతకాడు "జనార్దను" వల్లె యనిరి ॥ 923

తనకుమారుడైన 'రామరాజు'కు ఛత్రపతి పట్టము కట్టరమ్మని 'సోయరాబాయి' తన సోదరుడైన 'హంబీరరావు మోహితే'ను పిలిపించుట

తే॥గీ॥ "సోయరాబాయి"కి యనుగు సోదరుండు
ఛత్రపతి శివాజీ మెచ్చు శ్యాలకుండు
శంభు వ్రేల్విడ్డ మాతృకేశటుడు గూడ
నిఖిల సైన్యాధికారి హంబీర రావు ॥ 924

తే॥గీ॥ అతని సాయమ్ముకోరెను నతని యనుజ
తనసుతుడతని మేనల్లుడునగు "రాజ
రాము"నికి పట్టముంగట్ట రమ్మనుచును
నిండ పదియేండ్లు లేనట్టి నిసుగునకును ॥ 925

తే॥గీ॥ చెల్లి కోరిక వినుచు నచ్చెరువు నందె
యిర్వదొక్కేండ్ల శంభాజి నేల యెడలి
చెక్కు మీటిన వసవల్చు చిన్ని కుఱ్ఱ
కింత బాధ్యత నిత్తురో యెఱుక గాక ॥ 926

శా॥ రానైయుండెను దక్కను న్గెలువ నౌరంగ్జేబసంఖ్యాక మౌ
సేనా వాహినితో నపారధన రాశిన్వెంట గొంచున్తన
న్నీనేల న్నెదిరించు పోటుమగడేడీ యంచహంభావియై
వానిన్నెద్రు మరాట యోద్ధయొక పాపండన్న గేలించరే ॥ 927

(శ్యాలకుడు=బావమఱది; వ్రేల్విడ్డ=వ్రేల్విడిచిన; మాతృకేశటుడు=మేనమామ) (ఎడలి=త్యజించి)

(ఎద్రు=ఎదిరించు; యోద్ధ=యోధుడు; గేలించు=హేళనచేయు)

చ॥ ఎఱుగడు శంభుజీ పిత గతించిన సంగతి - మారుతల్లి మం
తురులును నేకమై తనను దూరము చేయగ రాజధానికిన్
పఱపు కుతంత్రముల్ తెలియ వచ్చినచో యనలాద్రి బ్రద్దలౌ
తెఱగున-సంభ్రమే యుబికి తెచ్చెడు నుప్పెన యట్లు రేగదే? ॥ 928

తే॥గీ॥ అనుచు తలచి హంజీరరావప్పు మదిని
నిశ్చయించె - భావి మరాట నేత గాగ
సాహసమున, శౌర్యమున నిస్సముడునైన
శంభు డొకడె యర్హుడని - నిస్సంశయముగ ॥ 929

'వీర శంభాజీ'కి తన తండ్రి మరణ వార్త తన సవతి తల్లి పుతలీబాయి ద్వారా తెలియుట - వీర శంభాజీ తీవ్ర మానసిక సంక్షోభము

తే॥గీ॥ రాయగడము నందు "పుతలీబాయి కమ్మ
నొకటి వ్రాయించి వేగున కొప్పగించి
వెంటనే దీని నెవ్వరి కంటఁబడని
యట్లు నిమ్మనె శంభుకత్యవసరముగ ॥ 930

మ॥ పుతలీబాయి నియుక్తి గొంచు నపసర్పుండామె పత్రమ్ము భ
ద్రతమై దాచుచు 'పన్హలా' గడము చేరంబోయి శంభాజికి
న్నితరుల్ చూడని యట్లు నేర్పుమెయి నందించె న్తదీయార్థముల్
మతికిన్నెక్కగ చింతనిప్పులయి శంభాజీ కనుల్ మండగన్ ॥ 931

ఆ॥వె॥ పట్ట పవలు దోచె నిట్ట నిల్వున చిమ్మ
చీకటులు నలమిన లోకమగుచు
తన యునికియె తనకు దబ్బఱయైతోచె
కలయొ? నిక్కమొ? యవగతముకాక ॥ 932

(పఱపు=కావించు)

(కమ్మ=జాబు; వేగు=గూఢచారి)

(నియుక్తి=ఆజ్ఞ; అపసర్పుడు=గూఢచారి)

సీ॥ కనుల యెదుట తోచు గ్రావంపు కంబమున్
పిండి పిండిగఁజేయ పిడికి లెత్తు
'పన్హాలా' గడమునే పైకెత్తి విసరగా
పొంగించు మాంసల భుజయుగమ్ము
నాకాశమునుఁబట్టి యవనిపై పడునట్లు
లాగి వేయంగ కేల్జాచు పైకి
భూగోళమునె గిట్టి ముద్దగా మర్దించి
కడలిలో రువ్వంగ కాయమూచు ॥

తే॥గీ॥ శోక, ప్రతికార భావ సంక్షోభితాత్మ
గళగళల్లయక్ష్వేళా ప్రకంపమాన
'పన్హాలా' శైల కందర ప్రతినినద క
ఠోరతాక్షుబ్ధ 'దుర్గ' బిట్టులికి పడగ॥ 933

సీ॥ నిద్రాణ వహ్న్యద్రి నిప్పులంజిమ్ముచు
నాకస్మిక స్ఫోట మైనయట్లు
ఉదధి యొక్కుమ్మడి యుద్దామరమ్ముగా
యుప్పెనయై భూమినూడ్చినట్లు
వివిధ వల్లీగుల్మ వృక్షసాంద్రాటవి
చండ దావాగ్నిని మండునట్లు
కొండలనై నతము బెండులట్లెగ మీటు
ఝుంఝూ ప్రభంజనోచ్ఛలన మట్లు ॥

తే॥గీ॥ స్వర్ణ కశిపు రాణ్మందిర స్తంభ సంభ
వోగ్ర నరసింహ రూపధేయోగ్ర, శర్ధ
దుర్నిరీక్ష్య, క్రుద్ధానన దూర ధూత
పరిజనుండౌచు శంభాజి ప్రజ్వలించె ॥ 934

చ॥ ఎవరికిగాని స్వీయపిత యెక్కడొ దౌల దివంగతుండునై
న విషయ మింతదాక నిజ నందనుకే యెఱిగింప కుండు న

(ఉద్దామరము=అతిశయము; స్వర్ణకశిపుడు=హిరణ్య కశిపుడు; రూప ధేయము=రూపము; శర్ధము=జనసమూహము)

ట్టి విసపుకుట్ర నెట్టు లెవడేని సహించును? 'శంభుజీ'యు నెం
త వఱకు నిట్టి చెట్టలకు తాల్మివహించు? నతండు మౌనియే॥ 935

చ॥ కవి కలశుండు డాసి తన కన్నను నెంతయు పిన్నయైన శం
భు వికల మానస స్థితిని పొంకము చేయగ కుస్తరించి – మా
ర్దవ మొలికించు భాషణ సుధాప్లుతిఁ శాంతుని చేసె నత్తఱిన్
చివరకు శంభుజీయు తన స్నేహితు మాటలకొగ్గె తగ్గుచున్ ॥ 936

తే॥గీ॥ శంభు సతి యశూబాయి చాలసేపు
పతి హృదయ బాధ పేశల భాషణముల
శాంతి నొందింపఁజేయంగ జతన పడుచు
చివరకాశించిన ఫలము చేకొనియెను ॥ 937

చ॥ పదపడి పన్హాలా గడము వప్రముపై నిలుచుండి శంభుడున్
వదలని నీడ యౌ కలశ పండితుడున్ గడి క్రింద త్రోవలన్
పదనగు దృష్టులం బఱపి పైకెవ రెక్కుచు నుండిరో కనన్
పొదలె నదాటుగా నచట పూరుషు లిద్దరు పైకి వచ్చుటల్ ॥ 938

మ॥ గడముంజేరిన వారి నిద్దరిని కక్షావేక్షకుల్ చుట్టియున్
వడిఁదోడ్తెచ్చిరి శంభు సన్నిధముకున్ – ప్రశ్నింపగా చెప్పెనొ
క్కడు "లేఖన్గొని దుర్గ' నేత కొసగంగా మమ్ము "యణ్ణాజి ని
క్కడకున్నంపె" నటంచు–వే కలశుడా కమ్మన్ గొనెన్ బల్మినిన్॥ 939

తే॥గీ॥ శివజి లేఖరి "బాలాజి యవజి" – శంభు
డనిన యెంతయోగారము – నట్టి వాని
చేత కమ్మ లిఖింపగా చేయ నెంతొ
యొత్తడి నొనర్చె "యణ్ణాజి" యులుకుఁగొలిపి ॥ 940

తే॥గీ॥ కడకు విధిలేక 'బాలాజి' 'కమ్మ'ను తన
సుతుడు 'అబ్బాజి' చేత లిఖితమొనర్చె
'పన్హల' పతి 'విశల్త్రియంబకు'ని పేర
నదియె కలశునిచేత నున్నట్టి లేఖ ॥ 941

ఉలుకుగొలిపి=భయపెట్టుట; కక్షావేక్షకులు=ద్వారపాలురు; సన్నిధము=సన్నిధి

చ॥ కలశుడు బిగ్గనంజదివె కమ్మను "రాయగడమ్ము నందు నే
డలజడి యౌ స్థితిన్ పురము నంతయునున్నది - యెట్టి వార్తయున్
తెలుపగ రాదు శంభునకు నేమఱుచున్ 'మన రాజు' గూర్చియున్
వెలికొక మాటగూడ యన నీయకు డాపయినిత్తు నాజ్ఞలన్ ॥ 942

కం॥ ఈ విషయమె వ్రాయించుచు
నే - వేఱొక యుత్తరము "బహిర్జీ నాయక్"
కై వచ్చెను - నీ యిరువురు
నేవైపో శంభు తెలియడిప్పటి వరకున్ ॥ 943

కం॥ ఆ లేఖ యందు వ్రాసిరి
"యాలస్యము లేక శంభు నచ్చటికచటే
యాలానములనుఁ గట్టుచు
కూలంద్రోయంగ యిరుల గుయ్యారమునన్"॥ 944

తే॥గీ॥ సవతి తల్లి 'పుత్లీబాయి' జాబు తెలిపె
తండ్రి కంత్య సంస్కృతి నమంత్రక మొనర్చి
కులము పేర పరుడు దరి కొల్పె చితిని
యది యనాథలకిచ్చు "బాటాగ్ని" యనుచు ॥ 945

చ॥ "తన ధిషణా బలమ్మును - నతంద్రమునైన మనో బలమ్ము - ప్రా
క్తన ముని వర్య ప్రోక్తమగు ధర్మబలమ్మును గూడి యుండ - నూ
తనము - స్వతంత్ర హిందు ప్రభుతన్ నెలకొల్పిన ధర్మ వీరుడా
ఘనుడు శివాజి రాడ్వరునకా? శ్రుతి మంత్ర విదూర సంస్క్రియల్"॥ 946

తే॥గీ॥ అని మనమ్మున నెంతయు పనవె శంభు
కవి కలశునితో చర్చ దీర్ఘముగఁ జేసె
భావి కార్యాచరణము నే పగిది నుండ
దగునొ? యాలోచనము సేయు తరుణమగుట ॥ 947

(బిగ్గనన్=బిగ్గరగా; ఏమఱుచున్=అప్రమత్తులై)
(ఆలానము=త్రాడు; ఇరులు=చీకటి; గుయ్యారము=చీకటి కొట్టు)

సైన్యాధిపతి "హంబీరరావు మోహితే"ను "అణ్ణాజి దత్తు", "మోరోపంతు పింగళే"లు చూడవచ్చుట

సీ॥ హంబీరరావు సర్వానీక పతి "సతా
రా" దాపున 'కరదు' ప్రాంతమందు
బస చేసి యుండెను పటవాసమందున
వింశతి సాహస్ర వీరభటులు
నాతని యాధిపత్యములో మెలంగుచు
వివిధ చక్రములలో విడిసి యుండ్రి
యపుడు చూడగ వచ్చి "రణ్ణాజి దత్తోజి"
"పీష్వ మోరోపంతు పింగళేజి ॥

ఆ॥వె॥ "రాయగడము నుండి రాజకార్యము పయి
దశసహస్ర సుభట దళముతోడ
వారికి ప్రణమిల్లి వచ్చిన పనియేమొ
తెలియనడిగె 'మోహితే' నయమున॥ 948

తే॥గీ॥ "రాయగడ మెంతయును బోసి పోయె నేడు
మృగ పతి క్ష్వేళ వినరాని మెడద వోలె
ఛత్రపతి శివాజి ధవళ చ్ఛత్ర ఛాయ
జనులు సుఖియించు కాలము చనియె నిపుడు॥ 949

కం॥ ఇప్పుడు "మారాటా" భువి
ముప్పుకు గుఱియగు ప్రమాద మొదవెడు గడియల్
తప్పని సరి యనిపించుచు
దెప్పరముగఁ గడప ముందె తిరుగుచునుండెన్ ॥ 950

తే॥గీ॥ సర్వ సేనాధి పతివి – విజ్ఞాన నిధివి
నీకు తెలియని దేమి? యనీకినీశ!
ఎల్ల వారలు నీదు మేనల్లునికిని
పట్టముంగట్టుడని పట్టుఁ బట్టు చుండ్రి ॥ 951

(మృగపతి=సింహము; క్ష్వేళ=గర్జన; మెడద=అడవి)

తే॥గీ॥ నీదు సోదరి 'సోయరా' నేత్రి గూడ
'రాజరాము'నే రాజుగా నోజగొల్పు
మాతులుడ వీవు – నడపించు మార్గదర్శి
వీవు – లెమ్మింక తొలియడ్గు వేయుటకును ॥ 952

ఉ॥ ఈ పని కడ్డ మింక నొకడేయగు శంభుజి – వాని దూకుడు
న్నాపగ నీవు మేము నిపుడాతని బంధితు చేయగావలెన్
కోపను, డాతతాయియును, కూళ, యనైతిక వర్తనుండు, వా
డే పరిపాలకుండయిన నీ క్షితికిన్ క్షతి తప్ప యేమగున్" ॥ 953

తే॥గీ॥ వినుచు హంబీర రావు గంభీరు డగుచు
"పెద్దలార! ప్రణామము! వినుడు మీరు
నాకు భాగినేయుండె యౌగాక!" "రాజ
రాము" కేవలము దశాబ్ద ప్రాయుడిపుడు ॥ 954

మ॥ విమతుండిప్డు మరాట రాజ్యమునకు న్వేదన్న? లక్షాష్టక
ప్రమితంబైన వరూధినిన్ గొనుచు స్వర్ణంబున్ వెదన్ చల్లుచున్
సమరోత్సాహముతో దణాయలు జయోచ్చైర్నాదముల్ సేయగా
యమరాజై మన మీదికెత్తు నతడా 'యౌరంగజేబే' సుమీ ॥ 955

తే॥గీ॥ సమర వీరాభిమన్యుడు "శంభురాజు"
నతని యౌరసత్వమును కాదనగ నేవొ
పొల్లు నేరము లతనిపై మోపి భావి
ఛత్రపతి పద దూరుని సలుప వలదు ॥ 956

సీ॥ ఏడేండ్ల ప్రాయాన నేను వేల హరుల
'మన్సబుదారు'గా మంతుకెక్కె
పది యేండ్ల వయసులో వప్తతో 'ఆగ్ర'లో
బందియై నేర్పుతో బైటఁబడియె
పంద్రెడు నేండ్లప్డు బాద్షాసుతుని యొద్ద
'పులిబిడ్డ' గా పేరు పొంద గలిగె

(నేత్రి=పాలకురాలు; ఓజగొల్పు=ప్రేరేపించు)
(వేడు=ఎవడు; వరూధిని=సేన)

పదునారు యేండ్లప్డు బవరమ్ముఁజేయగా
"రామదుర్గము" కేగి రాణకెక్కె" ॥

తే॥గీ॥ ఏ మహావీరుడైన తానీ వయసున
ఇన్ని బాధ్యతలను నిర్వహించగలడె?
యొక్క శంభాజి నాగర్భ యోధుడనగ
చెల్లు 'నభిమన్యు' పిదప యీ క్షితి తలమున" ॥ 957

తే॥గీ॥ అనిన 'నణ్ణాజి' పట్టరానంత యలుక
బూని – 'హంబీర రావు'ను పొదివిఁబట్టి
కట్టి వేయుడని దివాను కాజ్ఞయిచ్చె
నే భటుడును ముందునకడు గేయలేదు ॥ 958

తే॥గీ॥ ప్రాంశుతనుడైన 'హంబీర రావు'నవ్వి
అంజకుండ మోరోపంతు నగ్రమంత్రి
నార్థిక సచివునణ్ణాజి నచటి కచటె
కట్టి వేయంగ భటతతి కాజ్ఞయిచ్చె ॥ 959

కం॥ 'బందీ' లిద్దరిఁగొనుచు, న
మందగతి 'న్పన్హాలా'కు మార్గము నంది
బ్బందు లెదురు పడని విధి
న్నందరు పయనించి చేరి రనుకొన్నటులే ॥ 960

తే॥గీ॥ 'పన్హాలా' గడమందు శంభాజి "వితలు
మహదుకరు"ని, "హీరోజి ఫర్జహదు" నచట
కట్టి వేయమన – భటుల కాజ్ఞయిచ్చె
కోట కధిపతి "మల్హోజి ఘోర్పడేజి" ॥ 961

ఉ॥ సంకెలలందుఁజిక్కి తన సన్నిధిఁ జేరిన మంత్రులున్న యా
వంకను చూడ శంభుడరవాయిగొనెన్ – "పిత రాజ్య వృద్ధికి
న్నంకితమై యహర్నిశలు నాపదలెన్నెదిరించి తండ్రికిన్
కింకరులై చరించి – యిట కీవిధి రాకకు నొచ్చుకొంచెదన్" ॥962

(ప్రాంశుతనుడు=దీర్ఘ శరీరుడు; అంజకుండ=సందేహించక)
(అరవాయిగొను=సందేహించు)

తే॥గీ॥ తాను చేసిన పనికి సంతాప పడక
రెచ్చిపోవుచు నణ్ణాజి ప్రేలఁదొడగె
శంభు శీలముఁగూర్చి దుర్భాష లెన్నొ
యందరక్కడ వినుచుండ నదరు లేక ॥ 963

మ॥ "పరకాంతాగమనాది దుర్వ్యసన దుస్స్వాజన్య లోలుండవున్
గురువర్య ప్రతి బోధితోత్తమ హితోక్త్యు ల్లంఘనాకృత్యచం
చురుడౌ నీవు – శివప్రతిష్ఠితము హిందూ రాజ్యమున్నేలు మే
టరియౌ పుత్రుడ వక్కటా! ప్రజకు చేడ్పాటింక వేరుండునే!" ॥ 964

తే॥గీ॥ అనుచు తీండ్రించు 'నణ్ణాజి' యదటు జూచి
కనలి 'హంబీరరావు' యాతనిని చీక
టింట బంధితుఁజేయ కఠిన నియుక్తి
నొసగె సైనికులకు, నెట్టి కొతుకు లేక ॥ 965

ఆ॥వె॥ 'పేష్వమోరొ పంతు' పెద్ద వాడగుటచే
కట్టి వేయకుండ కార నిడిరి
యెంతయొ విసువాసి 'హీరోజి ఫర్జందు'
స్వజనుడగుట శంభు వదలి వేసె ॥ 966

హీరోజిఫర్జందు ఖజానా సొమ్మును సంగ్రహించి పారిపోవుట

ఆ॥వె॥ రాజ బంధువగుట, రాజ్య కోశమునకు
రక్షణాధి కృతిగ భృతకుడైన
యెంతయు విసువాసి 'హీరోజిఫర్జాందు
భూరి ధనమునొడిచి పారిపోయె ॥ 967

(ప్రతిబోధితము=ఉపదేశింపబడిన; చంచురుడు=నిపుణుడు; మేటరి=శ్రేష్ఠుడు; చేడ్పాటు=బాధ) (అదటు=మిడిసిపాటు; నియుక్తి=ఆజ్ఞ) (విసువాసి=విశ్వాసము కలవాడు) స్వాజన్యము=సంబంధము (భృతకుడు=ఉద్యోగి; ఒడిచి=దొంగలించి)

వీర శంభాజిపై ప్రజాభిమానము వెల్లి విరయుట

తే॥గీ॥ సైరికులును, సైనికులును, సర్వ జనులు
గుంపులై వచ్చి పన్హాల కోట చుట్టు
క్రమ్ముకొనిరి శంభాజిని కాంచుటకును
"శంభుజీయె" మారాజని చాటు కొనుచు ॥ 968

తే॥గీ॥ బుడత కీచులు తమ "గోవ" భూమినుండి
యాంగిలేయులు "బొంబాయి' యంతరీప
వసతి నుండి వచ్చిరి శ్రీశివాజి మృతికి
స్వపరితాపముఁదెలుప 'శంభాజి' యెదుట ॥ 969

తే॥గీ॥ తననిటు స్వదేశ, పరదేశ జనులు గూడ
'ఱేని' గా గుఱుతించ సంతృప్తి చెంది
'రాయగడము'నుఁజేర నధ్యాయనమున
కపుడు శంభాజి వేగ నాయత్తుడయ్యె ॥ 970

చ॥ 'జయజయనాద' ఘూర్ణిత దిశాష్టక సంస్థిత సామజశ్రవో
త్యయముగ రాజధాని నికటావని యొప్పె జన ప్రకీర్ణమై
యయువు పయిన్ ససైన్యముగ నక్కడ చేరిన శంభు రాజు కెం
తయు ఘనమైన స్వాగతము నర్మిలి నీయ జనమ్ము మేకొనన్॥ 971

వీర శంభాజి పరిదేవనము

ఉ॥ "రాయగడమ్ము నుండి శ్వశురావసథమ్మునఁజేరియున్ మొగ
ల్మాయకు లోగి యా "శని" తొలంగగ 'పన్హాల'కోట చేరియు
న్నాయెను వత్సర త్రయము - నందె వసించితి తండ్రియాజ్ఞపై
నాయన స్వర్గతుండగు క్షణమ్మున నేను ప్రవాసి నైతటన్ ॥ 972

(సైరికులు=కృషీవలులు)
(బుడతకాచులు=పోర్చుగీసువారు; అంతరీపము=ద్వీపము)
(అధ్యాయనము=ప్రయాణము)
(అత్యయము=బాధ; యయువు=గుఱ్ఱము)

తే॥గీ॥ నన్ను నా తండ్రి కెడము నొనర్చి నట్టి
పాప మంతయు "నణ్ణాజి" వంతె యగును
అందు పాల్గొనె నా మాఱుటమ్మ గూడ
తన తనయుని ఛత్రపతి పదస్థుఁజేయ" ॥ 973

వీర శంభాజీ రాయగడము ప్రవేశించుట

చ॥ వశమయినట్టి రాయగడు పాలన చేకొన శంభుడెంచుచున్
శ్వశురు "పిలాజి షిర్కె"ను వెసన్ బలమున్గొని రమ్మటంచునున్
విశదము చేసె నాతనికి నేవగ నాటకముల్ ఘటిల్లెనో
పిశునుల చేత 'రాయగడు' వేదికగా, నటు ' పన్హాలా' గడిన్ ॥ 974

ఆ॥వె॥ ఐదు వేల పరిని "హంబీర రావు'ను
నైదువేల దళము నా 'పిలాజి'
'శంభు' రెండు వేల సైన్యమ్ము గొంచును
రాయగడము నెక్కి డాయఁజనిరి ॥ 975

కం॥ ముందుగ 'పుతలీబాయికి'
వందనమున్నాచరించి - స్వస్థతఁ బ్రశ్నిం
పందలచుచు చనె నాయమ
మందిరముంజేర 'శంభు' మమత చెలంగన్ ॥ 976

కం॥ 'పుతలీబాయియు' శంభుని
గత వర్షత్రయముగ నెట గానమి నశ్రు
ప్లుతిచే కన్నులు తడియగ
యాతనిని గారమున నిల్పి నారసిఁజూచెన్ ॥ 977

ఆ॥వె॥ తల్లి లేని యట్టి పిల్ల వాడగు 'శంభు'
సంతు లేని యట్టి సతియు నామె
నెనరు నిండ పుత్ర నిర్విశేషమ్ముగ
శంభుఁ బెంచె 'పుతలి', జనని వోలె ॥ 978

(పిశునుడు=చాడీలు చెప్పువాడు)

శా॥ "మాతోశ్రీ" యని కాళ్ళకు న్నెఱగె - ప్రేమాంభోధి నిర్వేలయై
మాతా పుత్రులం ముంచివేయ మమతా మాధుర్యమున్ గ్రోలుచున్
పాతింగోల్పడి యామె - తండ్రి గతియింపన్నంభు రోదించియున్
యేతద్దుఖము నొండొకళ్ళకు సమంబేయౌట - తెప్పిర్లుచున్ ॥ 979

పుతలీబాయి జరిగిన విషయమంతయు శంభాజీకి వివరించుట

మ॥ పుతలీబాయి యెఱుంగంజెప్పెనట శంభూజీకి "ఓ పుత్ర! నీ
పిత దేహమ్మున స్వాస్థ్యమంచెలుగ లోపింపం దొడంగెన్ - ప్రభుం
డతి నిర్లక్ష్యముంజూపె జబ్బునెడ - శయ్యం జేరినందాక - తా
మృతుడౌ ముందర నన్ను పిల్చి వచియించెన్ హీనమౌ నెల్గునన్॥ 980

తే॥గీ॥ "పుతలి! వినుమిది నా జ్యేష్ఠ పుత్రుడొకడె
యాజి నౌరంగజేబును నాపగల్గు
హైందవ స్వరాజ్యమును నర్ధాంతరముగ
నడగి పోకుండ కాచు దిట్టడతడనుచు " ॥ 981

కం॥ నిను నీ తండ్రికి దూరము
నొనరింపం దలచి కొందరుక్కివులిచట
న్ననవరతమ్మపవాదులు
పెనిచిరి నీ పైన జనులు విసువాసింపన్ ॥ 982

శా॥ "నీపై నమ్మకమేదె నీ పితకు - తానే నిన్ను దూరమ్ముగా
నా 'పన్హాల'గడమ్ము నందునిచె నం"చట్లందరున్ నమ్మగా
యాపున్నద్దును లేక చాటుచును - నీకన్యాయమున్ చేయగా
యీ పాపాత్ములు నుద్యమింప-యెడమైతీవామహారాజుకున్"॥ 983

ఆ॥వె॥ మాత పుతలిబాయి మాటలు వినగానె
అలుక, బాధ బిట్టు నలమెనతని
తన్ను నడప మాయ తంత్రముల్పన్నిన
శత్రుతతినింగూల్ప శంభుడడరె ॥ 984

(నిర్వేల=చెలియని కట్టలేనిదై; పాతి=భర్త; తెప్పిర్లు=తేఱుకొను)
(విసువాసించు=నమ్ము)

వీర శంభాజి రాయగడు రాజధానిగా పరిపాలన పగ్గములు చేగొనుట

ఉ॥ క్రన్నన! శంభు రాయగడ రాజ్యము నందున స్వీయ పాలన
మ్ము న్నెలకొల్పె తక్షణమె - మొత్తము దోషులఁబట్టి తేర నా
సన్నులబంపె - దేశమున శాంతికి భంగము గూర్చు దుష్టులెం
దున్నను వెల్వరింపఁ దగు యోగుల పంపెను నాల్గు వైపులన్ ॥ 985

ఉ॥ సేనలకిచ్చు జీతములు చిన్నము నైనను తగ్గకుండ - తే
మానము లేక పంచె - గడమందలి పాలన శాఖలందు సే
వానిరతిన్నజస్రమును, పద్ధతిగా పనులన్ని దీర్చు కు
ర్వాణుల వేతనమ్ములు బిరాన యొసంగెను, వెంట వెంటనే ॥ 986

తే॥గీ॥ అప్పటి మరాట రాజ్యము నందు చిట్ట
చివరి గ్రామములందున సేవఁ జేయు
వారి జీత బత్తెముల నవ్వారి గాగ
యందఁజేసెను జాగుకు సందు నీక ॥ 987

ఉ॥ అన్ని మరాట దుర్గముల కత్యధిక ద్రఢిమమ్ము గూర్చి - యే
తెన్నున చీమయుంజొఱని తీరుగ - దుర్గములోని వారికిన్
మిన్నగ నీర, తండుల, సమిత్పశు ఘాస, శతఘ్ని, శస్త్ర సం
పన్నత గూర్ప నాజ్ఞలను పంపెను నందరి కన్ని దిక్కులన్ ॥ 988

(ఆసన్నులు=పరిజనులు; యోగులు=గూఢచారులు)
(తేమానము=ఆలస్యము; కుర్వాణులు=పనులు చేయువారు)
(జాగు=ఆలస్యము)
(తండుల=ధాన్యము; సమిత్=వంట చెఱకు; ఘాస=గడ్డి)

'వీర శంభాజీ' 'పన్హాలా' గడము నుండి రాయగడము నకు వచ్చుదారిలో ప్రయాణ విశేషములు

తే॥గీ॥ 'పన్హాలా' కోట వీడి శంభాజి యపుడు
రాయగడమున కేగుచు రాణువఁగొని
మధ్యలో "ప్రతాపగడము" రథ్యపైన
కనపడ, వెనుకటి జ్ఞాపకములు మెదలి॥ 989

తే॥గీ॥ ఆగి, యా "ప్రతాపగడు" గిర్యగ్ర మెక్కి
యట భవాని మాతను గొల్చె నతుల భక్తి
నచటి నుండి ముప్పది క్రోసు లవలనున్న
రాయగడు మహోన్నత శిఖరాళిఁజూచె ॥ 990

తే॥గీ॥ రాయగడమున్న గిరి పాద ప్రాంత మందు
"పచడు" అను నూరిలో నుండె పరమ పూత
చరిత, 'జీజియాంబ' సమాధి - శంభు డచట
నాగుచు "పితామహి"కిఁ భక్తినర్చఁజేసె ॥ 991

కోశ ధనము నపహరించిన హీరోజి ఫర్జాందు పట్టుబడుట - శంభాజి అతనిని క్షమించుట

ఆ॥వె॥ కోశ రక్షకుండె కోశ భక్షకుడయి
పారిపోయి నట్టి వీర వరుడు
నెట్టకేల కచట హీరోజి ఫర్జాందు
చిక్కె భటుల చేత శిరము వంచి ॥ 992

ఆ॥వె॥ అతనిఁజూచి శంభు డయ్యయో కాకాజి !
బొక్కసమును గాచు ప్రోడ వీవు
ధనము నీకు బ్రాతె? నను నడిగిన నప్డె
కొంచుమనుచు నిడనె కోశమెల్ల॥ 993

తే॥గీ॥ అనుచు 'హీరోజి ఫర్జాందు' మనమునపుడు
సాంత్వనము గూర్చు మాటల శాంత పఱచి

వానికే బండరువుఁగాచు పదవి తిరిగి
కట్టబెట్టెను – పోరాని చుట్టమగుట ॥ 994

శ్రీ శివాజి మృతి వార్త మరాటా రాజ్యమున సంచలనము కల్గించుట

తే॥గీ॥ శ్రీ శివప్రభు మృతి వార్త చెవినిఁబడగ
దూర ప్రాంతములందున్న దుర్గ పతులు
కొందఱికి ఖేదము – ముదము కొందఱికిని
కలిగె – వారి యోచనల మార్గమునుఁబట్టి ॥ 995

తే॥గీ॥ ప్రాత వతనుదార్లకు ఛత్రపతి మరణము
క్రొత్తయాశలు మదిని రేకెత్తఁజేసె
బడుగు కాపుల నొప్పించి పన్నులిగ్గి
యట్టి ధనముతో భోగములనుభవింప ॥ 996

తే॥గీ॥ శ్రీ శివాజీకి నౌరసుడెవ్వరనెడు
ప్రశ్న రేకెత్తె నను వార్త ప్రాకె దిశల
శంభుజీ పక్ష పాతులు సైరికాళి
'వతను దార్లు' "సోయరబాయి" వైపు నుండ్రి ॥ 997

వీర శంభాజీ తన పేరిట ఆజ్ఞలను దుర్గాధి పతులకు పంపుట

శా॥ కానీ శంభుజి పంపె నందరకు లేఖల్ స్వీయ ముద్రాంకిత
మ్మౌ నట్లుం బొనరించి – 'ఛత్రపతె'వండన్నట్టి సందేహమే
రానట్లెల్ల ప్రభుత్వ శాఖలకు – కార్యాళుల్ గ్రహింపంగ – మా
భూనాధుండిక "శంభుజీ" యను నికంబున్ చూచి స్పష్టమ్ముగన్॥ 998

ఉ॥ "నా జనకుండు పాలన మొనర్చెడి వేళ భవత్ప్రవర్తనే
యోజను నుండెనో యటులె యుండదగు న్నిపుడప్పుడా మహా

(కార్యులు=అధికార్లు; నికము=సత్యము)

రాజెటులాదరించె తన రాజ్యము నిల్ప శ్రమించుమిమ్ము - "శం
భాజిని" నేను గూడ తమ పట్ల ప్రవర్తిలెదన్నదే విధిన్" ॥ 999

తే॥గీ॥ అనుడు లేఖలుఁచదివి దుర్గాధి పతులు
అన్ని శాఖలలోయున్న యధికృతులును
నెంతయును సంతసంబున నెడదలలర
"శంభుజీ మహారాజ" ని చాటిరపుడు ॥ 1000

'రాయగడు' ప్రవేశ సమయమున శంభాజీకి జరిగిన స్వాగత సత్కారములు

తే॥గీ॥ రాయగడు నుపత్యక యందు గ్రామమైన
'పచడు' నందు శంభాజీని స్వాగతించె
శ్వశురుడౌ "పిలాజి షిరికె" సంతసమున
తనకు జామాత భావి "ఛత్రపతి" యనుచు ॥ 1001

తే॥గీ॥ రాయగడు దుర్గ నేత యౌ "రాహుజీ" ని
మరియు 'కన్హోజి'ని, యటులె "మాల్సవంతు"
పట్టి బంధించి చెఱలోన పెట్టి రపుడు
శంభుజీ ద్రోహులకు తగు శాస్తిఁజేయ ॥ 1002

తే॥గీ॥ రాయగడముకు శంభాజి రాకముందె
స్వాగతమిడ వచ్చిరతని - భావుకులు - "మ
హాద్జినింబాల్కరం"దరి యందు పెద్ద
మొగలులను వీడి వచ్చె శంభుజినిఁగొల్వ ॥ 1003

ఆ॥వె॥ "షిర్కె" వంశజుండు - శృంగార పూరుకు
ప్రాత వతనుదారు వచ్చె నటకు
'శంభు ఛత్రపతికి' శ్యాలకుడు "గణోజి"
అలుక దాచి నవ్వులొలుకు చపుడు ॥ 1004

తే॥గీ॥ శంభు రాయగడమున ప్రవేశమయి దొలుత
యచటి జగదీశు దేవాలయమ్ము డాసి

(శ్వశురుడు=పిల్ల నిచ్చిన మామ)

సముచితములైన పూజలు సలిపి పిదప
పోయె మారుతల్లి పుతలిబాయి కడకు ॥ 1005

తే॥గీ॥ 'అమ్మ' యాశీస్సులన్నొంది క్రమ్మఱుచును
తనకు నపకార మొనరింప తవిలి గూడ
యెడదలందు పశ్చాత్తాప మించుకంత
లేని వారల శిక్షింపఁబూనె శంభు ॥ 1006

రాయగడమున 'తక్మకుతోకు' భృగు పాతము - ద్రోహులకు మరణ శిక్ష

తే॥గీ॥ రాయగడు దుర్గముందు గిర్యగ్రమందు
చాల యెత్తైన చోటున 'చఱియ' గలదు
దానిపేరు "తక్మకుతోకు' - దాని నుండి
జాఱిపడిన చిక్కదు శల్య శకలమైన ॥ 1007

తే॥గీ॥ చెఱనుఁబెట్టిన మంత్రుల తెరువు పోక
తక్కుద్రోహుల బంధించి తొక్కిపట్టి
గోతముల యందు బిగియించి కుట్టి వేసి
త్రోసి రదుగుకు "తక్మకుతోకు" నుండి ॥ 1008

ఉ॥ ఇంతటి ఘోరశిక్ష విధియింపగ నిష్టము లేదు శంభుకా
వంతయు కాని యాఖలుల భావములందున నేడు గూడ దు
శ్చింతయె గాని ద్రోహమును చేసితిమంచనుతాప మేమియున్
సుంతయు కానరాక యెదస్రుక్కి విధించెను మృత్యుదండనన్॥ 1009

(చఱియ=కొండ నిలువుగా చీలిన చోటు; శల్య శకలము=ఎముక ముక్క)

వీర శంభాజి తన సవతి తల్లి 'సోయరాబాయి'ని చూడబోవుట

చ॥ పదపడి సోయరాసతి బవంతికి వెళ్ళి నమస్కరించినన్
వదనము మాడ్చుకొంచు తన వంకను చూడక తెల్ల చీరలో
కదపిహితామృతాంశుగతి కాంతి దొఱంగిన మేనితోడ – తా
పెదవి కదల్పకన్తననుపేక్ష నొనర్పగ – శంభు డిట్లనెన్ ॥ 1010

ఉ॥ "ఓ పినతల్లి ! శైశవము నుండియు నా పయి నెంతొ గారమున్
చూపుచు పెంచి నావు నొక సూనునిగా నను తీర్చి దిద్దగా
నోపుదు వొక్క వేళ శిశు నోజ నెవో పొరబాట్లు చేసినన్
పాపని సంస్కరింపదగు బాధ్యత గూడ త్వదీయమే గదా! ॥ 1011

తే॥గీ॥ బాల్య, యౌవన సహజ చాపల్య వశత
సత్పథముఁదప్పె నేమొ? నా చర్యలపుడు
జననిగా నన్ను మందలించంగ వచ్చు
రాణిగా నన్ను శిక్షింపఁబూనవచ్చు ॥ 1012

తే॥గీ॥ తండ్రి కగ్ర సుతుడనైన – తల్లి వైన
నీకు నంతియెకా! జననీ ! తెలుపుము
రాజ రాముడొకటియు – శంభాజి యొకటి
యా? సుతుల మధ్య భేదమే యమ్మ జూచు? ॥ 1013

ఉ॥ రాజును చేయనెంచుచు మరాటుల కెల్లను రాజరామునిన్
నాజనకుండె చెప్పెనని నాటకమాడితి వంతబోక యా
నా జనకుండు స్వర్గతుడు నైన నిజమ్మును నేనెఱుంగ నే
యోజయు లేని బెట్టిదపు నుచ్చును పన్నితి కోట చుట్టునున్॥ 1014

ఉ॥ చీకటి కొట్టులోన నను జీవిత కాలము బంది సేయగా
నీ కనిపించెనా జనని! నీతి విదూరులు మంత్రులెల్లరున్
నీకనుకూలు రౌచు నను నింద్యుడటంచును చాటుచుండ నా
పై కెగదోలితా ఖలుల బంధితుఁజేయగ నన్ను "పన్హలన్ ॥ 1015

(కద=మేఘము)

చ॥ మొగలుల సేనతో కలిసి పోరుట నేరమె - కాని నామదిన్
రగిలెడు వేదనానలము నార్పగ వేడు తలంప లేదు - నే
దిగబడి యున్న దూబి యని తెల్లమునై వెలికేగఁజూడ - నా
దు గురుడె నన్ను నాదుకొని దోసము లన్ని క్షమించె తాల్మితో॥ 1016

ఉ॥ నాయనుజుండు నీ కొడుకె - నాకును వానికి తండ్రి యొక్కడే
యీ యిలనేలు నర్హతకు నిద్దర మౌరసులౌదు మయ్యును
న్నీయెడ ప్రాయ మెంచినను జ్యేష్ఠుడ నౌదును గాన భూజనుల్
నాయన వెన్క నన్నె తమ నాయకుగా నియమించి రర్మిలిన్॥ 1017

తే॥గీ॥ పితకు నెడసేయగానన్ను జతన పడితి
'పన్హాలా' గడిన్బంధింప పాల్పడితివి
కడకు నన్ను నా పితరుల కడకు నంప
గాదలచితేమొ? తల్లివి గాని తల్లి !" ॥ 1018

తమ్ముడు రాజరాము అన్న శంభాజీని కావిలించు కొనుట

చ॥ అని యనునంతలో తన ప్రియానుజు డెక్కడొనుండి వచ్చి - గ్ర
న్నన తన నత్తుకొంచు కడు నర్మిలి తోనణె "యన్న! మమ్ము కా
రనిడగ నీవు వచ్చితని రందరు - నిక్కము చెప్పుమన్న" - త
మ్ముని యకలంక భాషణము మోదము ఖేదము వెల్లి గొల్పగన్॥ 1019

తే॥గీ॥ "తమ్ముడా! నాకు పంచప్రాణమ్ము లీవె
నీకు హానిని తలపెట్టు నెవడు గాని
ముందు నా శవము పయి కాల్మోప వలయు
భ్రాతృ బాహార్గళములె నీ వజ్ర దుర్గ" ॥ 1020

తే॥గీ॥ అనిన - "నట్లైన నా వివాహమున కీవు
యేల రాలేదు? నగ్రజుండేడి యనుచు
నేను పల్మారు లడిగితి నెవరు గూడ
తగిన యుత్తర మిడరు - వింతాయె నాకు" ॥ 1021

(దూబి=చిత్తడినేల; గురుడు=తండ్రి)

తే॥గీ॥ అనెడు, తమ్మునితో యనె శంభు "యనుజ!
యమ్మ యందరి కనిపెనాహ్వాన మొక్క
నన్ను వదినెను పిల్వక మిన్న కుండె
నాకతము తెలియు వయస్సు నీకు లేదు" ॥ 1022

తే॥గీ॥ సోయరాంబ సోదరులను చూచుచుండె
నెడద ననుకొనె - నీసు రేకెత్తు చుండ
"ఈ మహారాష్ట్ర రాజ్యమ్ము నేలు వారు
శంభుజీయును - యిక వాని సంతు" ననుచు ॥ 1023

సభాంగణమున మంత్రుల నేర విచారణము - శంభూజీ తీర్పు

చ॥ పిదప సభాంగణమ్మున ప్రవేశ మొనర్చుచు సభ్యులందరున్
సదమున గూడి యుండ చెరసాలను బెట్టిన మంత్రి వర్గము
న్నెదుటకు బిల్వ పంపి తమ నేరములన్ వివరించి చెప్పగన్
మొదట దణాయదేమనునొ? ముఖ్యముగా తెలియంగ "మోహితేన్"॥ 1024

తే॥గీ॥ "మామ! నీదు నుద్దేశ మందరకును
విశదపరచుమ" నంగ తా వినిచెనిట్లు
నెదను "హంబీర రావు మోహితె" దణికిని
శంభు 'సాహసాంకుండని' చాల మెప్పు ॥ 1025

తే॥గీ॥ "శంభు! విష సర్పములు గల సదన మందు
నెవరి కైనను భద్రత యెటుల లేదొ
నేరగాండ్రధికృతులైన నెంత గొప్ప
రాజు రాజ్యమైనను నభద్ర మగునయ్య" ॥ 1026

తే॥గీ॥ అనుడు 'హంబీర రావుజీ' యాప్త వాక్య
మును వినిన శంభు భటులకు ముదల నిచ్చె
నందరపరాధులను తన ముందు నిలుప
నొక్కొకరిని విచారించి యొసగఁ దీర్పు ॥ 1027

(సంతు=సంతానము) (దణాయడు=సేనాపతి)

సీ॥ పిలిచె "మోరోపంతు పింగ్లేజి" పీష్వాను
"యేల వయోధికుడీ విటుల నొ
నర్చితన" దొసగు నాదెమోమోటమి
కిందుదిగితి - ఫలమందినాను
క్షమియించు మీ తప్పు - శంభుజీ" యనినను
నతని నప్డె వదలి సాదరముగ
"నీ కొమరుండిక మాకు పీష్వాయగు
నీలకంఠోజియు నియమశీలి" ॥

ఆ॥వె॥ యనుచు తీర్పు నిచ్చె - నా పైన "యణ్ణాజి
దత్తు" నటకుంబిల్వ - దర్పమొలుక
యెట్టి బిడెము లేక - యెదుట నిల్వంబడె
నున్నమిత శిరుడయి - యులుకు తోడ ॥ 1028

శా॥ "అణ్ణాజీ! సచివాగ్రియుండవనుచున్ 'యప్పాజి' శ్లాఘించి, నీ
విన్నాణమ్మెగి నంక శాస్త్రమున - నాభీలాహవవ్యూహముల్
పన్నంగల్గిన ధీకుశాగ్రతను - గెల్పందింప గాగల్గు శౌ
ర్యౌన్నత్యమ్మును - 'విత్తమంత్రి' పదవిన్నానాడు నీకేయిడెన్॥ 1029

మ॥ అధికారమ్మర చేత యున్నదని రెక్కాడంగ డొక్కాడు దు
ర్విధులౌ కార్షుల నుండి పన్నుల వగన్ పీడించి వేధించి దం
డు ధనమ్ముందున కొంత భాగమును యెట్లో దారి తప్పించి-సొం
త ధనాగారము చేర్చు చుంటి వతి గుప్తమ్మైన వ్యూహముతో॥ 1030

తే॥గీ॥ అంతెగాక దేశ విదేశ ప్రాంతముల ప్ర
భుత్వ ప్రతినిధులు వణిక్ప్రముఖులు మొదలు
గా మరెందరో మాతండ్రి గారి కొసగ
తెచ్చు కానుకలను నీవు ముచ్చిలితివి ॥ 1031

(బిడెము=బిడియము; ఉన్నమిత=యెత్తబడిన; ఉలుకు=గర్వము)
(విన్నాణము=జ్ఞానము; అంక శాస్త్రము=గణిత శాస్త్రము)
(దుర్విధులు=దరిద్రులు; కార్షులు=సేద్యగాండ్రు; వగ=పద్ధతి)
(ముచ్చిలి=దొంగలించు)

శా॥ నేనా తప్పుల నెత్తి చూపితని నన్నెంతో దురాచారుగ
న్నే నేపథ్యము లేని నిందలకు నన్కేంద్రమ్ముగా చేసి తా
యానోళ్ళంబడి భూజనావళికి నేనత్యంత దుశ్శీలుగా
నోనాడందగు నట్టి వానిగఁదలంపుల్పుట్ట దుర్నీతివై ॥ 1032

ఉ॥ నా సవతమ్మ కీవు తన నందను ఛత్రపతి న్నొనర్తు నం
చాసలుగొల్ప నా పయి ననంత సముచ్ఛ్రయ మూని తండ్రికే
యూసులు చెప్పెనో జనని - యుల్లమునన్ వ్యతిరేక భావమే
మోసులు నెత్తె నా పితకు - పుత్రునిగా యభిమాన ముండియున్॥ 1033

తే॥గీ॥ ఇటు సతియు నటు మంత్రులు నిర్వయిపుల
చేరి వినిపింప నా పయి నేరములను
నెట్టి తండ్రికైనను తన సంతుఁగూర్చి
యాడు నిందలు విన నెద - సూడుగాదె ॥ 1034

మ॥ నను దూరమ్ముగ నుంచి నా యనుజునీనాడీ మహారాష్ట్రకున్
జననాథుంబొనరింప నాకదియు హర్షాపాదకమ్మే యగున్
నను నా తండ్రికి వైదికమ్మయిన మంత్రాగ్నిన్ రగుల్కొల్ప - శ్రు
త్యను సారమ్ముగ చేయు సంస్క్రియలకున్ దౌలుంచితేనస్వివై॥ 1035

ఉ॥ నా పిత కగ్రనందనుడ నన్న నిజమ్ము నెఱింగి గూడ - యా
భూపతి స్వర్గతింగుఱిచి పొక్కగ నీయగవైతి వార్తల
న్నా పరిపూర్ణ హైందవ చితాగ్నినవైదిక రీతి నిచ్చె వే
డో పితవంశజుండనెడి యొక్క నెపమ్మున-పుత్రులుండియున్॥ 1036

తే॥గీ॥ తండ్రి యంతిమక్షణముల దాపు నుండి
యాయన కడసారి పలుకు లాలకించు
నట్టి భాగధేయము నాకు వట్టిదయ్యె
నూరుక్రోసుల దూరాన యుండవలసె ॥ 1037

(సముచ్ఛ్రయము=వ్యతిరేక భావము)

(దౌల=దూరముగా, ఏనస్వి=పాపి)

(వేడో=యెవరో)

తే॥గీ॥ జనకు కడచూపుకైన నోచనయితిగద!
పితకు నంతిమక్రియలను వేద విధిని
చేయు నవకాశమే లేక పోయె నాకు
కడకు మృతదేహమైన నే గాంచనయితి॥ 1038

శా॥ అణ్ణాజీ! భవదీయ వాంఛితము నీత్రైపోయె – జీవమ్ముతో
నున్నాడిచ్చట నీదు కట్టెదుట శంభుండయ్యు నీదే జయం
బెన్నో యుక్తులు పన్ని నావయిన తప్పెన్నాకు నిర్వాతి – యై
నన్నాడెందము క్రుందె తండ్రి మృతితో–నందింపుమో ప్రెగ్గడా॥ 1039

తే॥గీ॥ తప్పు లెన్నియుండినను, ప్రధాను లందు
నంకశాస్త్రజ్ఞుడగు నీవు నగ్రియుడవు
నీదు సేవయే కోటి పెన్నిధుల సమము
నార్ధికామాత్య! నీ కిదె స్వాగతమ్ము" ॥ 1040

తే॥గీ॥ ననుచు నణ్ణాజికి న్స్వేచ్ఛ నాజ్ఞ చేసి
మరల నొసగె నార్ధికామాత్య పదము
కాని యణ్ణాజి మొగమున కాంతి లేదు
మనసులో నున్న చీకటి మణగ లేదు ॥ 1041

మ॥ హీరోజీ ఇందూల్కరు
ఆ"రాయగడు"కు స్థపతియు – నద్భుత నిపుణుం
డే రహి నాయెనొ? శంభుని
వైరులతో చేయిగలిపె బాలిశుడగుచున్ ॥ 1042

తే॥గీ॥ అయ్యు శంభాజి "యాతని యద్భుత ప్ర
తిభ వలన "రాయగడు" నిర్మితికతి ప్రాభ
వమ్ము కలిగెను – నతని సేవ లవసరము
మనకు "నని యతనికి కొల్వు మరల నిచ్చె ॥ 1043

(నీఱు=బూడిద; నిర్వాతి=మృత్యువు; నందించు=ఆనందించు)
(స్థపతి=శిల్పాచార్యుడు; బాలిశుడు=మూర్ఖుడు)

తే॥గీ॥ ఇక "జనార్ధను హన్మంతు" నెచ్చరించి
"యోయి! నీ భ్రాత 'రఘునాధు' దుక్కలుండు
శామని భువి నాదిలుషా విషయము గొనగ
నాదు తండ్రికి తోడ్పడె నాహవముల ॥ 1044

తే॥గీ॥ నీవు చిత్తభ్రమ వలన నా విరోధి
తతికి సాయపడితివి యుత్తముడవయ్యు
నైనను క్షమియించితిని - యీ పైన నీవు
రాజ దూత వగుము - మహారాష్ట్రమునకు" ॥ 1045

కవి కలశుడు శంభాజీ రాజనీతిని క్షమాగుణమును ప్రశంసించుట

చ॥ కవి కలశుండు మెచ్చియనెఁ కై పయికెత్తుచు "శంభుజీ" భళా!
స్తవ మొనరింప నర్హమగు చక్కని తీర్పులొసంగి నావు - నీ
దు వయసు పిన్నదయ్యు విబుధుల్ వెఱగందు పచేళిమ మ్మిట
న్నవుపడె నీదు విజ్ఞతకు నద్దము పట్టుచు నీ ప్రవర్తనన్ ॥ 1046

మొగలు బాద్షా ఔరంగజేబు స్వయముగా దక్కనుపై దండయాత్రకు రాదలచుట

కం॥ కాబూలు, కాందహారులు
జేబునఁజేర్చి యవురంగ జేబు పిసినియై
యాబగ రాజస్థానును
నాబూతిగ మ్రింగదలచె నాపోవమిచే ॥ 1047

(శామనిభువి=దక్షిణదేశము) విషయము = రాజ్యము
(పచేళిమము=బుద్ధిపక్వత)
(పిసిని=లోభి; ఆబ=అత్యాశ; ఆబూతిగ=అమితాహారి; ఆపోవమి= ఆకలి తీరకపోవుట)

కం॥ రాజస్థానును గెలువగ
యాజి నొనర్చుచును జయము నందని పందౌ
యోజకు విసువుచు నుండి - 'శి
వాజీ' మృతి వార్త వినుచు బాద్షా మురిసెన్॥ 1048

తే॥గీ॥ 'ఆదిలుషహ', 'కుతుబ్షాహ' లపగతబలు
లైరి - వారిపై గెల్పు సులభమె కాని
కొరకరాని కొయ్య మరాట ధరణి - సాంద్ర
కానన, గిరి, కటక, కంటక మయ మౌట॥ 1049

చ॥ అని యవురంగజేబు యెద నంజుచు యెన్మిది లక్షలున్న - సే
నను యనువుంబొనర్చి శమనాశకురా సమకట్టియుండె - యా
తని బయలందెదుర్కొనుట తట్టము చిన్నమరాట సేనకున్
వనులకు నీగి చిక్కులకు పాల్పడ చేయవలెన్ మొగల్బరిన్॥ 1050

ఔరంగజేబు నెదుర్కొనుటకు శంభాజీ సమర సన్నాహము

ఆ॥వె॥ భావి యుద్ధమునకు పన్నంగ మొగరముల్
సభకు పిలిచె శంభు సచివతతిని
ప్రాడ్వివాకుడైన "ప్రహ్లాద నీరాజి"
పీష్వ 'నీలకంఠు' వెడలిరటకు ॥ 1051

ఆ॥వె॥ అటులె సబ్నెవీసు 'అబ్బాజి' సోన్దేవు
వాహినీ పతియగు 'మోహితే'యు
ఆర్థికసచివుండు 'అణ్ణాజి దత్తోజి'
సభను తమ యునికిని చాటుకొనిరి ॥ 1052

(అంజు=తటపటాయించు; తట్టము=కఠినము; ఈగి=లాగి; బరి=సేన)

(మొగరము=వ్యూహము; పీష్వ=ప్రధానమంత్రి; ప్రాడ్వివాకుడు=న్యాయాధిపతి)

(సబ్నవీసు=శుల్కాధికారి; వాహినీపతి=సర్వసైన్యాధిపతి)

సీ॥ కోటలన్నిటి గూడ నేటు సేయించుచు
ధనధాన్యములనట ననువుఁజేసి
సానబెట్టించుచు శస్త్ర వితతుల కెల్ల
క్రందు కొనగఁజేసి మందు గుండు
బలితంపు ఖడ్గముల్ పట్టి వీచు భటుల
మోయగ బటువుహుమాయి దడము
బాణ, బాణాసన; తూణ, కృపాణికా
దశన; ఖేటక; శూల దళప సమితి ॥

తే॥గీ॥ పల్లములు, నంకవన్నెలు, కళ్ళెములును
లాలములు, టంగువార్లు, తురాయిలాది
వాహములపై సుఖకరాధిరోహణమున
కనువునగు నన్ని వస్తువులనువుఁజేసి ॥ 1053

సీ॥ అఖిల సేనాపతి హంబీర రావును
"ఏసాజికంకు" పద్గేట్టు - నతని
స్వజుడు కృష్ణాజియు - వచ్చి రాయత్తమై
సైన్యముతో రణోత్సాహులగుచు
"మానాజి మోరె" "నేమాజిగైక్వాడు", "దా
దాజి నర్సప్రభు", "రూపాజిభోస్లె"
"నారోత్రియంబకు" "నాగోజి బల్లాలు"
"మల్వోజి ఘోర్పడే", 'మల్హారుయశ ॥

తే॥గీ॥ జీ' ముఖప్రముఖులతోడ చేరి రచట
శంభుజీ భావుకులు యట్లె శ్యాలకుండు
"హరజిమహదికు" ను 'గణోజి షిరికె' నంట్లు
మావుదడముల పడవాళ్ళు - మంది దొరలు ॥ 1054

(నేటు=ధృఢము; క్రందుకొను=నిండుగా; హుమాయి=గుఱ్ఱము; బాణాసనము=విల్లు; తూణ=అంపపొది; దశన=కవచము; ఖేటక = డాలు; దళపము= ఆయుధము; పల్లము=జీను; అంకవన్నె=రికాబు; లాలము=గుఱ్ఱపు నాడ; టంగువారు=పొట్టపట్టెడ) బటువు=దృఢము

(పద్గ+ఈట్టు=పద్గేట్టు=పదాతి నాయకుడు; స్వజుండు=కుమారుడు; నంట్లు=చుట్టములు; మావుదడము=అశ్విక దళము; పడవాళ్ళు=సేనా నాయకులు; మంది=కాల్బలము; దొరలు=నాయకులు)

తే॥గీ॥ సకల మారాట భువి గుప్త చర్య కల్ప
నమున కధి నాధుడు "బహిర్జి నాయకుండు"
వచ్చె దక్షిణదిశనుండి పయన మగుచు
శంభు పిల్వ యుద్ధ వ్యూహ సభకుఁజేర ॥ 1055

మొగలు, మరాటా భూభాగ వర్ణనము

సీ॥ మారాట భూమికి మారుతి దిక్కున
"బాగ్లాను" గిరి వన ప్రాంతమగును
నందు పర్వత "దుర్గ" లన్ని "మరాటావె"
బయలంతయును మొగల్ వశము నయ్యె
"బాగ్లాను" కానుచు వాయవ్య దిశనున్న
"ఖాందేషు" గుజరాతు క్ష్మాతలమ్ము
"మొగలు బాద్షా"వశమున నుండు - ధనవంత
మైన పణ్యము సాగునచట నెపుడు ॥

తే॥గీ॥ "సూరతు" పురము గుజరాతు క్షోణి యందు
"బురహాను" పురము 'ఖాందేషు' భూమి యందు
గొప్ప వాణిజ్య కేంద్రములెప్పుడచట
భూరి ధనరాశి చేతులు మారుచుండు ॥ 1056

ఉ॥ ఆ "బగలాను" ప్రాంతమున యన్ని గడమ్ములకన్న కీలక
మ్మౌ బహుళార్థ సాధకమునౌనట "సాల్హెరు" కోట - వప్రపున్
పై బువి నిల్చి పావిదిశ వైపుగనన్ "యవురంగబాదు"కున్
తేబడునట్టి సంపదల తెన్నులు కానగ వచ్చు స్పష్టమై ॥ 1057

తే॥గీ॥ దక్షిణమున మొగ "రాజధాని" గ, "యవు
రంగబాదు" కలదు - గుజరాతు నుండి
మరియు "ఖాందేషు" నుండి యా పురమునకును
వలసినట్టి వస్తువులన్ని వచ్చుచుండు ॥ 1058

(గుప్తచర్య కల్పనము=గూఢచారి వ్యవస్థ) వప్రము=కోట గోడ
(మారుతిదిక్కు=వాయవ్యము; దుర్గ=కోట; పణ్యము=వాణిజ్యము)
పావి దిశ=వాయువ్యము; బువి=నేల

చ॥ సమరములన్మరాట పరి "సాల్హేరు" కోటకు పైన యుండి - క్రిం
ద - మొగలు సైన్యమెంతయిన దారులనడ్డుచు నోడగొట్టగ
న్నమరికగల్గు చోటగును - నన్నిగడమ్ముల యందు నట్టులే
సమకొని పన్నఁ వీలెసగు-సంగర యోగ్యములైన వ్యూహముల్॥ 1059

మ॥ 'బగలాన్' భూధ్ర 'పురా'ల్ మరాటుల కటన్ స్వాధీనమై యుండియున్
దిగువన్ "నాసిక" "జున్నరుల్" మొగలు స్వాధీనమ్మునందుండె-ఆ
నగరమ్ముల్ వశముంబొనర్చుకొనగా నర్హమ్మునౌ సంఖ్యకున్
తగు సైన్యమ్ములు లేమిచే విడువగా నయ్యెన్ "స్థలప్రాంతముల్"॥ 1060

మ॥ చదలన్నంటెడు నంత యెత్తు గిరిపై "సాల్హేరు" దుర్గమ్ము - శ
త్రు దురారోహమునౌచు నెక్కొని కడున్దూరమ్ముగా నున్న వా
ని దృశింపంగల వీలుగల్గి, యరులెంతే దవ్వునందుండగా
నెదురన్ సిద్ధము నౌను సేన-తగునట్లేర్పాటులన్ చేయుచున్॥ 1061

తే॥గీ॥ 'షాజహాన్" కాలమందు - నిజాముషాహి
వారిదీ కోట - మొగలులు బల్మి గొనిరి
పిదప మొగలుల నోడించి కదన మందు
గొనిరి గడము "మోరోపంతు", "గుజరు" దణులు ॥ 1062

సీ॥ "బగ్లాను" గిరులలో పదునాల్గు కోటలు
కలవు 'మరాటాల' కైవసమున
"చాంద్వాడ", "అంజయి", "సాల్హేరు" "రామ్సెజు"
"కన్హేరు", "కోలేరు", "కాంచనగడు"
"మంచన", "జావళా", "మార్కండ", "రావలా"
"అహివంతు", "రాజెహర్", "అచలగడము"
నలుబదైదేండ్ల ముందల యీగడములన్ని
నైజాముషా పాలనమున యుండె ॥

(భూధ్ర 'పురా'ల్=గిరిదుర్గములు; స్థలప్రాంతముల్=బయలు భూమి) పురా=కోట (చదల=ఆకాశము; దురారోహము=ఎక్కుట కష్టము; నెక్కొను=ఉండు; దృశించు=చూచు)

తే॥గీ॥ 'షాజహాను', 'నాదిల్షాహి' జమిలిగా ని
జాము నోడించి యీ ప్రదేశమ్ములన్ని
గొనగ శ్రీ శివాజీ యుద్ధము నొనరించి
కైవసము చేసికొనెను - యీ గడములన్ని॥ 1063

'వీర శంభాజీ' 'ఔరంగజేబు' నెదుర్కొను వ్యూహము ఆలోచించుట

మ॥ ఇక యీ నాడవురంగజేబు పఱపెన్ దృష్టుల్ "యవాచీదిశో
ర్వికి" - 'నజ్మీరున' వేచె నింత వరకున్ వే లోగొనన్ - రాజ పు
త్రకులన్నోర్చుచు వారి రాజ్యములు "మార్వార"ట్లె, "మేవారు"నున్
స్వకమున్ చేసి కొనంగ - కాని యతడాశా భంగమొందెన్ తుదిన్॥ 1064

తే॥గీ॥ బయలు నందోర్వజాలమా బలియు బలము
కాన మొగలులు ముందు 'బగ్లాను' నందు
"రామ్సెజు" స్థల దుర్గ దురాక్రమణకు
పూనెదరు - బయలున సాగు పోరు గనక ॥ 1065

తే॥గీ॥ మనము చూచు వస్తువు పరిమాణ మింత
యనుచు నొక్క చూపున కొల్వఁగనుట తప్పు
పయి పయిన కనరా-దన్ని పార్శ్వములను
తఱచి, తఱచి చూడ నిజ తత్త్వమ్ము తెలియు ॥ 1066

తే॥గీ॥ భారతావని యందు ముప్పావు భాగ
ము యవురంగజేబు తిని - యాపోవకునికి
మిగిలినట్టి పాతికయును మ్రింగదలచి
యెత్తి వచ్చును మన పైకి మిత్తి వోలె ॥ 1067

తే॥గీ॥ "రామ్సెజు" గడి కధిపతి - సూర్యాజి - యచటి
కైదు క్రోసుల దవ్వుండు 'త్ర్యంబకు" గడి
కంపె - "కేశోజి త్రిమలుని" యార్థిక సచి
వు నొనరించి శంభుండెంతొ నెనరు గదుర ॥ 1068

తే॥గీ॥ శంభు దశవర్ష ప్రాయుడౌ సమయమందు
"ఆగ్ర" చెఱబాయుచు 'మధుర' యందు నుండి
"త్రిమలు"దను విప్ర వసతి నతిథిగఁకొన్ని
నెలలు గడపె - కేశు పిత యా 'నేలవేల్పె' ॥ 1069

కం॥ ఈత్రిమలుడె 'శంభుజి'ని స
గోత్రజుగను చాటుకొనుచు కుసుమము వోలెన్
నేత్రములంగప్పుకొని నుతి
పాత్రుండై చేర్చె శివజి పజ్జకు కొమరున్ ॥ 1070

"వీర శంభాజీ" తన తండ్రికి వేదమంత్రోక్తముగా అపర క్రియలు చేయుట

ఉ॥ హైందవ ధర్మ రక్ష నొక యాగముగా దృఢదీక్షబూని - ని
స్స్పందమనస్కుడై సలిపి స్కంధము డెందము సర్వ శక్తుల
న్నింధనముంబొనర్చి సవనేషిర కీలల కచ్ఛ కీర్తికిన్
మందిరమై చెలంగ భువి మాన్య శివాజి శివైక్యమైెఁజనెన్ ॥ 1071

ఉ॥ అంతటి యచ్ఛ హిందువునకా? శ్రుతి దూరమమంత్రకమ్మునౌ
యంతిమ సంస్క్రియల్సలిపిరంచును శంభుజి వేద విద్యలన్
మంతుకు నెక్కినట్టి ద్విజమౌళులచేత సమంత్రకమ్మునౌ
యంతిమ కర్మఁజేయుచు చితాగ్నిని తానిడె జ్యేష్ఠ పుత్రుగా ॥ 1072

తే॥గీ॥ తొలుత "బాటాగ్ని" నిడిన యా స్థలమునందె
పితరు దేహావశిష్టము ల్పేర్చి యచట
గంధ, కౌశిక, కర్పూర కాష్ఠ చితికి
మంత్ర పూతాగ్ని నిడె శంభు మనము తనియ ॥ 1073

(నేలవేల్పు=బ్రాహ్మణుడు)
(సవనేషిరకీలలు=యజ్ఞాగ్ని జ్వాలలు)
(గంధ=చందనము; కౌశిక=గుగ్గిలము)

పుతలీబాయి శ్రీ శివాజీ చితిపై సహగమనము చేయుట

కంII పుతలీ బాయి తొలుత పతి
చితి నెక్క దలచియు నాగె - చిత్తము కలగన్
పతికట్లవైదికమ్మగు
గతి నంత్య క్రియలు జరుగగా నెఱబఱమై ॥ 1074

కంII జరిగిన దంతయు శంభున
కెఱిగించిన వెన్క సహగమింపగ చితిపై
స్థిరమగు నిర్ణయమును గొనె
చరణమ్ముల వ్రాలి 'శంభు' చాలంబొదివియున్ । 1075

ధర్మవీర, మహావీర, శ్రీ శంభాజి మహరాజే పట్టాభిషేకము

కంII శంభాజి పట్ట బంధన
శుంభత్సందర్భ మహము సుడియగ నానా
సంభారములమరుచు, సం
రంభమ్మున పరుగులెత్తి రటు నిటు భృత్యుల్ ॥ 1076

కంII సంతోషము, సంతాపము
సంతులనముగ జననివహ సత్వములందున్
వింతయను భూతి నించగ
గంతుగ ప్రజ గూడె రాయగడమందంతన్ ॥ 1077

(పొదువు=బ్రతిమాలు) (మహము=ఉత్సవము; సుడియు=సమీపించు; అమరుచు=సిద్ధము చేయు) ఎఱబఱము=అసహ్యము

(సంతోషము=శంభాజీ పట్టాభిషేకము సందర్భముగా సంతోషము; సంతాపము=శ్రీ శివాజీ మరణము విషయమై కలిగిన దుఃఖము; సత్వము= మనస్సు; గంతుగ=గుంపులుగా)

ఉ॥ శ్రీ శివజీ ప్రభుండధివసించిన హాటక సింహపీఠి - నే
డీ శుభలగ్నమందధివసింపగ నుండెను శంభు బాలు - స
ర్వేశుడు, జేజి జీజియ, నెటిన్ తలి తండ్రులు సాయి బా
యీ, శివజీలు యాశిషము లెన్నొ యొసంగగ దివ్యరూపులై॥ 1078

సీ॥ రాయగడము బహిర్ద్వారమ్మునుందొట్టి
కోట నంతయు పూలతోటంజేసి
వీధులందున ప్రాంశు సౌధములందున
వేల దీవియలను వెలుగ జేసి
రాట్సభా భవనము రత్నకంబళులతో
రమ్యతరముగ నలంకరించి
రత్నమండపమట్లు రాజిల్లు శ్రీ శివా
జీ సింహ పీఠికి చికిలి గూర్చి ॥

తే॥గీ॥ యైదు యేండ్ల క్రింద శివ పట్టాభిషేక
పర్వము పిదప యా తండ్రి ప్రతిగ నగ్ర
సుతుడు శంభాజి రాట్ప్రభాశోభితునకు
పట్ట ధారణకై సిద్ధ పరచి రంత ॥ 1079

ఉ॥ నాడు శివాజి రాజు తన నవ్యమరాట స్వతంత్ర రాజ్యపున్
పోడిమి భూప్రజల్ తెలియ పొంకముగానొక రాజ చిహ్నమున్
ప్రోడలునైన పండితులపూర్వముగా విరచించి యీయగా
పైడిని యచ్చు పోసి పరిపాలక దండముగా నొనర్పగన్ ॥ 1080

తే॥గీ॥ రాజ దండముకై బుధుల్రచనంజేసి
నట్టి సంకేతములు పర మార్థ వంత
ములగు నవి రాజధర్మ ప్రబోధ సేయు
గొప్ప విజ్ఞాన భరితమౌ గుర్తులగును ॥ 1081

తే॥గీ॥ పసిడి చిఱుచేప కడుపేద ప్రజకు గుఱుతు
ప్రభువు వారల నెపుడు కాపాడ వలయు
పెను దవుడలందెఱచి చూపు వెండి ఝుషము
ఎత్తి వచ్చెడు రిపుల సూచించునద్ది ॥ 1082

తే॥గీ॥ అట్టి శత్రుల నడప రాజదరవలయు
పెద్ద తక్కెడ బలపక్ష విరహితమగు
న్యాయ నిర్ణయములకు సూచ్యాంకమగును
సమత పాటించు తేనిని జనులు మెత్త్రు ॥ 1083

తే॥గీ॥ "స్వస్తిక" గుఱుతు దుర్గము పసను తెలుపు
అందలి మొనలు దాడిని దాడితోనె
యెదురు కొనెదమటంచు సూచించు చుండు
కోటను పటిష్ఠమును చేయు గుట్టు తెలుపు ॥ 1084

తే॥గీ॥ 'ఓమ్మ' నెడు నక్కరమ్ము చిహ్నమ్మనంత
మైన యీ విశ్వ సృష్టికి - నట్లు నీ వి
విధములైన చిహ్నములివి విరతి లేక
ప్రభుని కెపుడు గుర్తొనరించు బాధ్యతలను ॥ 1085

తే॥గీ॥ మహికి హైందవ సార్వ భౌమతను చాటు
రాజముద్ర శివజి బహిరంగ పఱచి
తనదు స్వాతంత్ర్యమును చాటు ధైర్యమరసి
చిచ్చులుమిసెను ఔరంగజేబు మునుపు ॥ 1086

ఉ॥ రాజసదమ్ము కప్పుకమరంగ 'వెనిస్ భువి గాజుగుత్తుల"
ట్లోజలెసంగు వన్నియల నొప్పగు దివ్వెలు వ్రేల - మోచకో
ర్వీజ సదాఫలచ్ఛద పరీతములం బొనరించి కంబముల్
భూజన నేత్ర పర్వముగ-పొంకమొనర్పిరి కొల్వు కూటమున్ ॥ 1087

తే॥గీ॥ ఆగమ విహిత నియమనిష్ఠాను సార
పుణ్య యాజ్ఞిక క్రియలన్ని పొసగ జేసి
ఋత్విజుల మంత్ర నాదము లెల్ల దిశల
మాఱు మ్రోగుచు నుండ "శంభాజి" యపుడు॥ 1088

సీ॥ తలపైన తెలిపాగ తారగోపుర మట్లు
కుదురుకొనగ పైన కుచ్చులూగ

(మోచకోర్వీజము=అరటిచెట్టు; సదాఫలచ్ఛదము=కొబ్బరిమట్టలు)
తారగోపురము=వెండి కొప్పరము; ఓజ=కాంతి

ముత్యాల గుత్తులు ముచ్చటగా కుచ్చు
లకు ప్రక్క తూగుచు రాజిలంగ
వెల్లపట్టంగిక స్పృశియింప ఘుటముల
కాషాయ దట్టీని కటిఁబిగించి
ప్రక్కన యొఱలోన వాడి ఖడ్గము వ్రేల
ఛురికను నొక ప్రక్క జొనిపి యుండి ॥

తే॥గీ॥ యఖుత రత్న కనక తారహార సమితి
మెఱయ - ప్రాంశు మాంసల దేహ మింపు గొల్ప
క్షాత్ర తేజమ్ముతో నూత్న ఛత్రపతిగ
"యపర శివజి" యనగ గద్దె నధివసించె ॥ 1089

తే॥గీ॥ వెంట నడచెను సామ్రాజ్ఞి విభవ మెసగ
సతి "యశూబాయి" హర్షిత స్వాంతయగుచు
ననుజుడౌ "రాజరామజీ" యన్న గారి
పట్ట బంధోత్సవము చూడ వచ్చె సభకు ॥ 1090

ఉ॥ ఆమహరాష్ట్ర దేశ జనులందరు రాయగడమ్ము చేరి నా
రామహమున్గనంగ - తమ రాజగు చుండెడు శంభుబాలు ధై
ర్యామరగోత్రుడౌ శివజి కన్నిట నెన్నగనైన యౌరసుం
డే, మనకండయై నిలచు నింకయటంచును ముచ్చటించుచున్॥ 1091

ఉ॥ అన్ని పవిత్ర వాహినుల, యబ్ధుల నీరము కొంచు తెచ్చియున్
జన్నము సేయు ఋత్విజుల సన్నిధి నుంచిరి - శంభు రాజుకున్
మున్నుగ నానయ క్రియను పూర్తి యొనర్చిరి - పట్టబంధన
మ్ము నొనరింప ముందు ద్విజముఖ్యుడు బూనె సశిష్యుడై సభన్॥ 1092

తే॥గీ॥ సర్వపూత వాహిన్యబ్ధి జలములందు
బహు విధౌషధి మూలికా ప్రతతి గలిపి
స్వర్ణ చాలని నుండి ఆ జలము జల్లు
జల్లులుగ రాగ నవభృధ స్నానమిడిరి ॥ 1093

(ఘుటము=మడమ) (ఆనయము=ఉపనయనము)

(స్వర్ణచాలని=బంగారు జల్లెడ; అవభృధ స్నానము=యజ్ఞాంత స్నానము)

తే॥గీ॥ గాగభట్టు నాహ్వానింప నేగె - శంభు
డనుప - ఖండోజి బల్లాలు నైన యతడు
మేన స్వస్థతలేమి రాలేనటంచు
నిచ్చెను "సమన్వయమ"ను రాణ్ణీతికవిలె ॥ 1094

తే॥గీ॥ శ్రీ సమర్ధరాం దాసయతీశుడటులె
తాను రాలేక పంపె ఛాత్రతతి నటకు
శంభు వైరులు శంభు 'నృశంసుడ'నుచు
దుష్ప్రచారము చేసిన దుష్ఫలమిది॥ 1095

చ॥ జననయనోత్సవమ్మదర సాగి - సమాప్తమునయ్యె పట్టబం
ధన సుమహోత్సవమ్ము -మహదాశిష మంత్రములన్ పఠించువే
దనిధులునౌ ద్విజావళికి - దండిగ దక్షిణలిచ్చె శంభు - నా
తనికి సువాసినుల్ శుభప్రదమ్ముగ నిచ్చిరి మంగళారతుల్॥ 1096

తే॥గీ॥ శంభుజీ 'మహారాష్ట్రేల ఛత్రపతి'గ
శ్రీ శివాజీ పిదప నధిష్ఠించె గద్దె
వేద మంత్రోక్తముగ - క్షాత్ర వీర్యమెసగ
హితులు హర్షింప - యహితుల యెడదలదర ॥ 1097

మ॥ తన పట్టాభిషవోత్సవావసరమందత్యంత సేవారతిన్
ఘనమౌ హిందు స్వతంత్ర రాజ్యమును సంస్థాపింప - వ్యాప్తింబొన
ర్ప - నితాంతశ్రమ సల్పినట్టి యధికార్లన్, భృత్యులన్, యోద్ధల
న్ననురూపమ్ముగ సత్కరించె సభలో నౌదార్యమొప్పారగన్॥ 1098

కం॥ "ఛాందోగామాత్య" బిరుదు
నందరుగన - గవికలశుని కందించె సభ
న్నందుకు కనోజి విప్రుడ
మందానందమ్ము నొందె యనుగుని దయకున్ ॥ 1099

(కవిలె=గ్రంధము)
(నృశంసుడు=హీన చరిత్రుడు)
(అనుగు=స్నేహితుడు)

తే॥గీ॥ శ్రీ సమర్ధరాందాసుని శిష్యులకును
భూరి సత్కారమందించె గౌరవమున
సంతు శ్రీతుకారాముజీ స్వజుడునైన
యట్టి "మహదోబ" కిడె కాన్కలతుల భక్తి ॥ 1100

"ఛత్రపతి శ్రీ శంభాజీ మహారాజే"కు కొంకణ తీరవాసులు, "సిద్దీ"ల వలన తమకు సంభవించుచున్న కష్టములు విన్నవించుకొనుట

ఉ॥ కొంకణ తీర వాసులగు కొందరు శంభుని తోడ చెప్పి "రే
మింక ప్రశాంతిగా బ్రదుకు నీడ్చుట కష్టము, మాదు పల్లెలన్
కొంకక "జంజిరా"నడిమె నుండు తుటారులు "సిద్దిమల్కలే"
యంకిలి లేక డబ్బు, పసి; యాండ్రను, కూతులదోతు రెప్పుడున్॥ 1101

ఉ॥ పల్లెల నింతులంజెఱచి బల్మిని యెత్తుక పోయి - యట్టులే
పిల్లల సైతమున్ వదలి పెట్టక తీసుకపోయి - సంతలన్
చిల్లర బానిసీంద్రుగను చేతికి వచ్చిన యంత సొమ్ముకే
చెల్లగబెట్టి యీ విధిని ఛిద్రము చేసిరి మాకుటుంబముల్"॥ 1102

తే॥గీ॥ అనిన వినుచు రోషారుణితాక్షుడైన
శంభు తనచుట్టు నున్నట్టి సభ్యులగని
"వింటిరేగద సిద్దీల విఱుగబాటు
వారి శిక్షింతు" నంచు తీవ్రముగ పలికె ॥ 1103

(స్వజుడు=కొడుకు)

(నడిమెం=దీవి; తుటారులు=దుష్టులు; అంకిలి=అడ్డము; పసి=గోసమూహము)

ఛత్రపతి శంభాజీ తన పట్టాభిషేకానంతరము చేసిన తొలి దండయాత్ర

ఉ॥ పట్టము కట్టుకొన్న పిదపన్ తన దిగ్విజయ ప్రణాళికన్
తొట్టతొలేటు దేనిపయి నొప్పునటంచును 'శంభు' డన్న "యే
దెట్టుల నున్న రాజ్యమున కెక్కువ యక్కఱ రొక్కమౌ గదా !
బిట్టుగ విత్తమున్ గలుగు వీడులపై" యని చెప్పె మోహితే ॥1104

కం॥ సూరతు, బుర్హాన్పూరుల
పౌరధన నిధానములగు – వాణిజ్యముచే
పేరుకొనె లిబ్బులచ్చట
యా'రిక్థము' నేడు మనకు నావశ్యకమౌ ॥ 1105

చ॥ 'తపతి' నదీ తటాంచలము తావలమౌ "బురుహానుపూరులో
విపణి బృహత్తరమ్మగు – నవేల ధనాగమముండు నందు న
ర్థపునకు నప్పు లీయగల 'రై' కలవారలు పౌరులా "మొగల్
నృపు"ని ప్రభుత్వమున్ నడపు రిక్థము కాపురి హేమ ఖానియౌ॥ 1106

శా॥ ఔరంగ్జేబు ధనాగమమ్మునకు "బుర్హాన్పూరు" సర్వాగ్రియా
ధారమ్మైతగు "కాణయాచి" యగుటన్ తచ్ఛ్రామ కర్తవ్యమా
యూరిన్ పూర్తిగ కొల్లగొట్టుటనుచున్ సోత్సాహులై శంభు హం
బీరుల్ సేనల నాయితమ్మవుటకున్వేగ నాజ్ఞల్ యిడన్ ॥ 1107

ఛత్రపతి శంభాజీ 'సూరతు'ను కొల్లగొట్టుటకు వచ్చుచుండెనను ప్రచారము ప్రజలలో వ్యాపించుట

ఉ॥ 'సూరతు' పట్టణమ్ము నరి సూదనుడౌ శివజీ ప్రభుండు ని
న్మాఱులు కొల్లగొట్టె గతమందున మూడవ సారి ముచ్చటౌ
తీరున శ్రీ శివప్రభు ప్రతిప్రభవాఢ్యుడు నైన శంభుజీ
సూరతు కొల్లగొట్టు ననుచున్ జనవాదము రేగె యంతటన్॥ 1108

(లిబ్బి=సంపద; రిక్థము=ధనము) తత్+శ్రామము=తత్శ్రమయము

(తావలము=ఉనికి; అవేలము=అమితము; అర్థపుడు=కుబేరుడు; రై=ధనము; హేమఖాని=బంగారుగని) ప్రభవము=శౌర్యము

ఉ॥ సూరతు పేరుతో రిపుల చూపు మరల్చుచు కొంత దూరమా
సూరతు దారిబట్టి చను చొప్పునుఁజూపి యదాటునన్ "బురాన్
పూరును చుట్టుముట్టుటను వ్యూహముపన్నిరి శంభు మోహితే
లేరహి శత్రువర్గములకేమియు దెల్లమిగాని రీతిగన్ ॥ 1109

కం॥ బురుహాన్పూరు సుబేదా
రరిందముడు 'కోల్కతాషు', ఔరంగ్జేబ్సో
దరసము డొక ధాత్రి పయ
స్సెరగొనిన సజాత్యము తమ కేర్పడిన మిషన్ ॥ 1110

ఆ॥వె॥ ఆతడేగ వలసె నౌరంగబాదుకు
భ్రాతృజుని వివాహ వారమగుట
"గోలుకొండ" పెండ్లి కూతురిదటనుండి
పెద్ద పెండ్లి గుంపు వెడల బాటె ॥ 1111

చ॥ ఎనిమిది వేల సైనికులు నెల్లపుడున్ బురుహానుపూరు ర
క్షణమున కాయితమ్మగుచు కన్గలిగుందురు రేబవళ్ళు నా
మొననొక మూడు వేల భట ముఖ్యులతో "బహదూరు కోల్కతాష్"
చనెనవురంగబాదునకు - సామి బలమ్మటె రక్షి సంఖ్యలో ॥ 1112

తే॥గీ॥ పాత బురుహానుపూరుఁగాపాడ నొక్క
మట్టి కోటను గట్టిరి దిట్టముగను
పురము యెదుగుచుండగ కోట పరిధి దాటి
యెన్నియో పెద్దవాడలు నేర్పడియెను ॥ 1113

ఆ॥వె॥ నాడు బుర్హానుపురి నాయకుసుబేదారు
"కాక్రఖాను" చాల కళవళపడె
కోల్కతాషు వెంట గొంచు పోయె సగము
సేన - దుర్గరక్ష చిక్కెననుచు ॥ 1114

(ధాత్రి=దాది, తల్లి, పయస్సు=పాలు, ఎరగొను=త్రాగు; సజాత్యము=బంధుత్వము; మిష=కారణము) (భ్రాతృజుడు=సోదరుని కుమారుడు; వారము=తరుణము) (కన్గలిగి=జాగరూకులై; సామి=సగము, రక్షి=రక్షకుడు) (చిక్కు=తగ్గిపోవు)

శా॥ ఈలో వేగులు వచ్చి 'కాకరు' కెఱింగింపంగ సూరత్ పురి
మ్రోలన్ వైరులు మోహరించుచు ధనమ్ముల్దోచనున్నార లీ
వేళన్నంచును - యింతలోన ధనులౌ బేహార్లు రక్షింపు డం
చోలిన్ సూరతు నుండి పంప వినతుల్ యుగ్రుండునై 'కాకరున్'॥ 1115

తే॥గీ॥ తన బలమ్మున వేయి మందిని నిలుపుచు
తక్కు వారందరిని బంపె తక్షణమ్మె
సూరతుపురిని రక్షింప - వైరు లెంత
మంది యుండిరో తెలియమి వందురుచును ॥ 1116

తే॥గీ॥ బలగమటుబోవ కొంత సేపటికి మరల
వేగరులువచ్చి "మనవీడు వేగ చుట్టు
ముట్టనున్నారు మారాటు లట్టుఁదోచు
"శంభుజీకి జై"యను సద్దు శ్రవములంటె॥ 1117

మ॥ అనినన్ "కాకరుఖాను"డప్డు మివులన్నాశ్చర్యము న్నొంది", మీ
రను యాసేన మరాటి వారిదది సూరత్పైకి కొల్లాటకై
చనుచుండెన్నన "కాదుకాదధిప! యా సైన్యమ్ము నభ్యర్ణ కా
నన మందున్నది" యంచు వేగులనుచుండన్, శంభుముట్టెన్ పురిన్॥ 1118

ఉ॥ వచ్చె మరాటదండు గిలుబన్ మనసంపదలంచు భీతులై
వచ్చిరి పెద్దపెద్ద ధనవంతులు కాకర ఖాను యొద్దకే
యచ్చునగూడ వైరితతి నాపగ చాలిన సేన లేమిచే
చొచ్చిరి కోటనందరును జోరున బోర్తలుపుల్ బిగించుచున్॥ 1119

తే॥గీ॥ పాత బుర్హానుపురమున పైడి లేదు
ఉన్నదంతయు వెలుపల నున్న వాడ
లందు కలదను గుట్టు రట్టగుటచేత
పణ్య వీధుల వెరజె శంభాజి సేన ॥ 1120

(వందురు=చింతించు) (శ్రవములంటు=చెవులఁబడు)
(అభ్యర్ణకాననము=సమీపమునగల అడవి; కొల్లాట=దోపిడి)
(గిలుబు=దోచు; అచ్చు=విధము; బోర్తలుపులు=ప్రధాన ద్వారములు)
(వెరజు=దోచుకొనుట)

ఉ॥ ఎందరు వచ్చిరో తెలియ నీక యరణ్యమునందు దాగుచున్
సందునుఁజూచి మీదపడు సన్నహనమ్మొనరించు కొన్న వా
రిందమియించుటెట్లని పరింగల వారలు వేయి మందితో
దందడి కిన్దిగంగ నెద ధైర్యము చాలమి 'కాక్రఖానుడున్' ॥ 1121

చ॥ ధనికులఁజూచి మీకు నిరతమ్మును కాపుగనుండు భృత్యులన్
పనుచుడు నాయుధమ్ములిడి - వారును నాకడనున్న సేనయు
న్నని యొనరింపగా గలరు - నందరు గూడిన రెండు వేల యో
ధనిచయ మౌనటంచనగ-తద్దయు నాభటులేగు దేరగన్ ॥ 1122

తే॥గీ॥ దుర్గ తలుపులు తెఱపించి దూకి యపుడు
ఖాను కాకరు సేనలు కదనమునకు
పరులు యడవిలో దాగి యుండిరని దలచి
కందకము నందు నెగడులు కాలుకొల్ప ॥ 1123

చ॥ పరిఖను దాగుచున్నదరిపాటున శంభు "హరొంహరా" యటం
చరచి చతుస్సహస్రమగు సైన్యము నట్టులె యార్వ "కాకరా"
పరిపయి దూకి చెండుచును బల్మినిఁజూపగ భీరుడౌచు "కా
కరుడు"ను తక్కువారలును క్రమ్మఱిరంతట కోటలోనికిన్ ॥ 1124

తే॥గీ॥ మట్టికోట బోర్తలుపులు గట్టిగా బి
గించు కొని యున్నను వదలమంచు హెచ్చ
రించు పగిది కోట బయట పృతన కొంత
"కవికలశు" డధిపతిగాగఁ గాచి యుండె ॥ 1125

ఉ॥ అప్పుడు 'శంభు' కోట బయలందున బుర్హనుపూరు చుట్టునున్
కుప్పలు తెప్పలై వెలయు క్రొత్తగు వాడల చుట్టుముట్టఁ, దా
నప్పటిదాక "మోహితె" వనమ్మున దాగి ససైన్యుడౌచు, యా
చప్పుడు వించు వింతపడి చయ్యన వచ్చెను శంభుఁజేరగన్॥1126

(పరులు=శత్రువులు; కాలుకొల్పు=రగుల్కొల్పు)

బుర్హానుపూరు కొల్లగొట్టుటకు హంబీరరావు, మోహితే, శంభాజీలు పన్నిన వ్యూహము

ఉ॥ "సూరతు" పైన దాడియను సొడ్డు ప్రచారము చేసి సేనలా
దారిని పోవునట్లుగ ప్రదర్శన చేయుచు - కొంత సైన్యమా
సూరతు కేగ తక్కుగల శూరులతో బురుహాను పూరుకున్
చేరువ దుర్గమాటవులఁజేరెను 'మోహితె' వ్యూహమల్లుచున్॥ 1127

ఉ॥ ముందుగ 'మోహితే' చనుచు 'బుర్హనుపూరుకు' కొంత దూరమం
దుందటివేచి పైకొనగనుండెను - వారము యాగి శంభు తా
నుందన సేనతో వెడలి నుగ్గొనరింప మొగల్పురిన్, దణి
న్నందుకు తోడుగా గొనుచు నంచును నిర్ణయమయ్యె నాదిలో॥ 1128

తే॥గీ॥ కాని యూహను మించు వేగమున వచ్చె
రాయగడు నుండి యేన్వేల రథ్యదళము
గొంచు నైదు ప్రొద్దులలోపె కొండలడవు
లేళ్ళనుఁగడచి మెఱపు పోలికగ శంభు॥ 1129

మ॥ "భళి! శంభాజి ! మనోజవాధికముగా పైనమ్ము సాగించియున్
చులుకన్ యోటరి ఖాను కాకరుడు తాఁ జొచ్చిల్లగా కోటలో
బలిమిన్ చూపితి" వంచు, మెచ్చి-దణి యాపై "శంభు సింహోభుతో
కలియం బడ్డ విరోధియింక యమలోకాలోకితౌ"నంచనెన్॥ 1130

తే॥గీ॥ అప్పటికె శంభురాజు శౌర్యమ్ము రుచిని
యెఱిగి యణగెను బుర్హాను పురము సేన
యనలమున కనిలమటు సహాయుడగుచు
'రై'నిదోచగ హంబీర రావు కలిసె ॥ 1131

(సొడ్డు=సాకు)

(ఏన్వేలు=ఐదువేలు; రథ్యదళము=ఆశ్విక దళము)

(ఓటరి=ఓడిపోయి; చొచ్చిల్లు=ప్రవేశించు; ఆలోకిత=చూచువాడు)

(రై=ధనము)

తే॥గీ॥ ప్రాత బుర్హానుపూరు దుర్గకును వెలిగ
వెలసె నెన్నియో వాడలు విస్తృతముగ
విపణి వీధుల నిండుగ వివిధ వస్తు
తతులు - నవరత్న హేమ శ్వేతకములుండె ॥ 1132

ఆ॥వె॥ వస్తుతతులనన్ని పదిలముగా దాచ
భూగృహములు కలవు పురము నందు
రక్షణకును తగిన రాణువలేమిని
సిద్ధ భోజనముగఁ చేతజిక్కె ॥ 1133

తే॥గీ॥ 'వాడ'లందున "బహదూరు" వాడ "పెద్ద
యందు నంగళ్ళ తలుపుల నగలఁజేసి
నేల మాళిగ లందున నిలువ చేసి
యున్న, బహుమూల్య వస్తువుల్ యొడిచి కొనిరి ॥ 1134

తే॥గీ॥ ప్రాత బుర్హాను పూరుకు బయలనున్న
వాడలను కొల్ల గొట్టెడి వార్త కోట
లోనయున్న వారి కెఱుక గాని యట్లు
కట్టు దిట్టము చేసిరా చుట్టుపట్ల ॥ 1135

తే॥గీ॥ కవి కలశుడు కోట గవను కడనె - కాచి
వేచి యుండెను, కోటను దోచుకొనగ
ననెడి సంకేత మందె జనాళికచట
కోటలో నున్న వారలు కుతిల పడగ ॥ 1136

తే॥గీ॥ అట "నవాబుపురము" "షాజహాను పురము"
"ఖుర్రము పురము" "షాజంగుఁ" కొల్లగొనిరి
'కర్ణపురమున' 'సిఖ్ఖులు' కానరాగ
వారినందర ననుకూల పరచు కొనిరి ॥ 1137

(శ్వేతకము=వెండి)
(రాణువ=సైన్యము)
(ఒడుచు=దొంగిలించు; దోచు)

చ॥ తిరముగ మూడు ప్రొద్దులిటు తేకువతో 'బురహానుపూరు' లే
బరమునొనర్చి - చిక్కిన యపార ధనమ్ములు - కోటి హొన్నులం
చరయుచు - వాహముల్ మరియు నశ్వతరమ్ములపైన యెత్తి సా
ల్హైరు గడమందు దాచుటకు నేర్చిరి-బుర్హను పూరు వీడుచున్॥ 1138

చ॥ "బురుహనుపూరు" కొల్లబడి పోయె నటంచు నెఱింగిన 'న్బహ
ద్దరు" డిటకేగు దెంచు వెసఁ, దారుటకున్ సమయమ్ము లేమి - వే
గిరముగఁగ్రమ్మఱన్ పృతన కెక్కడి కక్కడ యాజ్ఞ లిచ్చుచున్
తరలిరి 'శంభు', 'మోహితె' లు-తర్పితులై యెదలందుఁ గ్రందుగన్॥ 1139

తే॥గీ॥ "ఖాను కాకరు"న్చెట్టుకు కట్టివేసి
పై వలువలూడ దీయుచు బైసిఁజెఱచి
"నీదు దుర్మార్గ పాలన, నేరములకు
నిదియ తగు శిక్ష"యంచును న్నెఱుక పరచి ॥ 1140

సీ॥ "హైందవులైనందు కన్యాయ వృత్తిని
జీజియా పన్నుతో చిన్న పఱచి
హైందవు లైనందుకన్యాయ వృత్తిని
బీద కర్షకులను పిప్పి చేసి
హైందవు లైనందు కన్యాయ వృత్తిని
సాధుల సంతుల బాధ పెట్టి
హైందవు లైనందు కన్యాయ వృత్తిని
స్త్రీల యిాలువులను చెఱచి పఱచి ॥

తే॥గీ॥ నీవు నీ "యలంగీరుని"చే "వహవ్వ"
యని పొగడ్త లందుట కయి యహరహమ్ము
నేరములు చేయుటందు పండితుడ వైతి
వందుకీ చిఱు శిక్ష కీవర్హుడ"వని ॥ 1141

(లేబరము=శూన్యము; వాహము=గుఱ్ఱము; అశ్వతరము=కంచర గాడిద; ఏర్చు=నిర్ణయించు)

(తారుట=తాత్సారము చేయుట; పృతన=సేన; తర్పితులు=సంతోషించు వారు; క్రందుగ=అతిశయముగా)

కం॥ చెట్టుకు కట్టిన ఖానుని
నట్టులె నట వదలి పెట్టి యతి వేగముగా
కట్టిడి బహదూర్ఖానుడు
ముట్టుమునుపె వీడిచనిరి బుర్హాన్‌పూరున్ ॥ 1142

తే॥గీ॥ 'షాజహాను' నర్ధాంగి 'ముంతాజ మహలు'
తొలి సమాధి 'బుర్హాన్‌పూరు' స్థలిని యుండె
పిదప యాగ్రా పురమున శిల్పింపబడియె
'తాజమహలు' – పండెనట 'ముంతాజమహలు' ॥ 1143

మ॥ బహదూర్ఖానుని కన్నుబ్రామి చనగా పాటింపనౌ దారులా
గహనారణ్యములందు దీయుచును వేగన్ యైదు బృందమ్ములై
రహమొప్పంగ పవళ్ళు దాగికొనుచున్ రాత్రుల్ ప్రయాణించుటౌ
వహిఁసాగించె మరాట సేన తమదౌ పైనమ్ము జాగ్రత్తగా ॥ 1144

బుర్హానుపూరు కొల్లగొని తిరిగి పోవునపుడు హంబీరరావు ఔరంగబాదుపై దండెత్తెదనని శంభాజీని వీడ్కొనుట

తే॥గీ॥ అంత హంబీర రావు తా ననియె శంభు
రాజుతో నిట్లు నే నవురంగబాదు
పైన దండెత్తి పోయెద – బలము నాకు
పదియు పన్నెండు వేలున్న – కదియు జయము॥ 1145

తే॥గీ॥ అనిన శంభాజి "నా సైన్యమైదు వేలు
కలదు కొని పొమ్మట"న్న, "జాగ్రత్త! శంభు!
శత్రులున్నారు చుట్టును – సైన్యమిపుడు
దండిగా నుండ దగును నీదండ ననియె" ॥ 1146

తే॥గీ॥ "ధరణగాము"ను, "చోప్డాల" దారి గుండ
సాగదలచెను శంభాజి సైన్యమపుడు

(కనుబ్రామి=మోసగించి; రహము=రహస్యము)
(దండ=ప్రక్కన)

అయ్యు బహదూరు ఖాన్ తమ యైపు దెలిసి
కొనగలిగెడి యవకాశ మెక్కువగ నుండె ॥ 1147

సీ॥ బహదూరుఖాను "చోప్డా" దాపుననువేచె
నట వచ్చు మారాట భటుల నడప
దవ్వుగా "కలకల" ధ్వని వినిపించెను
యొంటెపై యిద్దరు యుండిరచట
"కాజిహైదరు"ను - "జోత్యాజి కేసర్కరు"
"శంభు వ్రాసిన కమ్మ సత్వరముగ
గొంపోయి కుత్బుషాకు సమర్పణ సలుప
పోవుచుంటి మనుచు పోబిడీయ॥

తే॥గీ॥ వారు కొని పోవు కమ్మ శంభాజి దగున?
అనుచు చేవ్రాలు గట్టిగా నరసి యపుడు
"శంభు యెక్కడ యనుచు పృచ్ఛను యొనర్ప
నతడు 'యౌరంగబాదు'కు యరిగె ననిరి" ॥ 1148

తే॥గీ॥ అతడు నే మార్గమున బోయె ననుచు యడుగ
"యేదులాబాదు" మీదుగా యేగి యుండు
ననిరి - మూడు వేల మరాటుల నపుడచట
గనెను గాని వారికడ 'రైు' గానరాక ॥ 1149

తే॥గీ॥ వీరు వట్టి సైనికు లెంత వెదకిన నిట
కొల్లగొట్టిన నిధి పూరిపుల్ల గూడ
వారి వద్ద లేకుండుట వాస్తవమ్మె
యనుచు నామరాటుల నట్టె చనుడటంచు ॥ 1150

కం॥ వేగమె బహదూర్ఖానే
లాగున నైన వెస 'యేదులాబాదు'నకున్
యేగి యచట శంభాజికి
తా గుణపాఠమును నేర్ప దలచెన్నలుకన్ ॥ 1151

(ఐపు=జాడ)
(రై=ధనము)

సీ॥ బహదూరు ఖానుండు పయనమై పోయిన
మూడు గంటలకు శంభుండు మరియు
హంబీరరావును నాదారినేతెంచి
"చోప్డా"ను దాటిరే సుడియులేక
"సాల్వేరు" కోటకు సరగున చేరంగ
నడిరేయి దాటిరి బెడసులోయ
'మానాజి" చూపించె మార్గమధ్యము నందు
"సప్తశృంగి" జనని క్ష్మాధరమును ॥

తే॥గీ॥ సతత జగదంబ భక్తుడౌ శంభు డపుడు
తనను "రూపాజి" యిపుడు వద్దనిన గాని
"మ్రొక్కుకుంటిని – చెల్లింప బూని" తనుచు
"సప్తశృంగి శిఖరి" నెక్కె క్షణములోన ॥ 1152

సీ॥ పదిహేను వందల భటుల కాపుగ గొంచు
తక్కు సైన్యములను తరల మనుచు
దినము పట్టెత్తును క్షణములో నెక్కుచు
పరమ శక్తికి మ్రొక్కుబడినిఁదీర్చి
సాధు, పకీర్ల వేషములందు వచ్చియు
సూడుకాండ్రు తనను చుట్టుముట్ట
కత్తి సామున వారిఁగడి కండలుగ జేసి
శక్తికి బలులిచ్చు సరణిగాగ ॥

తే॥గీ॥ తనను చూడవచ్చిన పల్లె జనుల కచట
ధనము – 'ఖండోజి బల్లాలు' తనకు నంద
జేయుచుండ, విరివిగ పంచిచ్చె నపుడు
చేతి కెమ్మెఱుగని శంభుజీ ప్రభుండు ॥ 1153

తే॥గీ॥ రాయగడుఁజేరె శంభు సురక్షితముగ
దారి పొడుగున గ్రామీణులారతులిడ
"ఆప్ట", "పెన్" "మహద్" మొదలైన యన్ని యూళ్ళ
ప్రజలు 'జై శివాజి', "జయ శంభుజి" యనంగ ॥ 1154

(సుడి=యిబ్బంది; బెడసు=కఠినమైన; శిఖరి=కొండ)
(సూడుకాండ్రు=శత్రువులు; ఎమ్ము=ఎముక)

సభలో "ఛత్రపతి శంభాజీ" దణాయ హంబీరరావు మోహితేను సత్కరించుట

తే॥గీ॥ శంభు రాయగడమున పెద్ద సభనుఁ దీర్చి
వీర"హంబీర మోహితే" పృతన పతికి
రత్న ఖచిత హేమ విభూష రాశులిచ్చె
రెండవ "ప్రతాపరావ్ గుజరీ"త డంచు ॥ 1155

ఆ॥వె॥ మొనలఁబంపె శంభు "మొగలు పాలన మందు
కల ప్రదేశములను బలిమిఁగొనుచు
నచటి సంపదలను హైందవీయ, స్వతంత్ర
రాజ్య వృద్ధికి కొని రండటంచు ॥ 1156

చిరానుభవ పరులైన వృద్ధజనుల భయము - వీర 'శంభాజీ' ప్రత్యయము సభలో ప్రకటించుట

చ॥ బ్రదిమి దురమ్ములో తలలు పండిన వృద్ధులు – శంభు దూకుడీ
యదనున రాజ్య భద్రతకు హానికరమ్మని యెంచి, "బాద్షా' నే
టిదనుక రాజ పుత్రులను ఢీకొను చుండె ననంతరమ్ము యా
మ్య దిశకు వచ్చినన్నతని యాపగ నోర్తుమె?" యంచు నాడినన్॥ 1157

చ॥ "వినుడు, పితాజి భారత భువిన్నొక హైందవ రాజ్య సృష్టికిన్
పణముగ పెట్టె ప్రాణములు – వారికి యౌరసులైన మేము – యా
కణకను మధ్యలో రిపుల కళ్ళుచు నాపిన బైసి నిల్చునే
పెనకువమాని బాద్షకును ప్రేష్యుల మౌదుమె? యంచు శంభుడున్॥ 1158

(మొనలు=సేనలు)

(యామ్యదిశ=దక్షిణదిశ)

(కణక=పట్టుదల; బైసి=పరువు; పెనకువ=యుద్ధము; ప్రేష్యలు=సేవకులు)

సీ॥ హిందూ స్వరాజ్యము నీ భారతావనిన్
స్థాపించి యెదిగింప సాహ్యులగుచు
ప్రాణముల్ పణమొడ్డు రణ శూరులౌ వారు
పెక్కురు కలరు నా ప్రక్కనిలచి
"పీష్వ నీలోపంతు" వీరాగ్రగణ్యుడు
"రూపాజి భోసలే" రుద్రమూర్తి
"సంతాజిఘోర్పడే" సమర వీరుల మిన్న
"ధన్నాజి జాధవు" ధైర్య స్వరవి ॥

తే॥గీ॥ వీర "కృష్ణాజి కంకు" దుర్భేద్య పటుడు
వీరి యుత్సాహ శిఖిపైన నీరు చల్ల
హిందు స్వారాజ్య సిద్ధికి యేది దారి?
యనియె శంభుజి హృదయ వేదన చెలంగ ॥ 1159

కం॥ హీరోజీ ఫర్జాందట
వీరోచిత వాక్కులాడె - పెద్దల తోడన్
"వీరుడు శివాజి యైనను
వీరాగ్రేసరుడు శంభు - వినుడిది" యంచున్ ॥ 1160

చ॥ అనగ వినమ్రతన్పలికె నంతట శంభుజి - "నంత గొప్ప భా
షణములు నేల? మజ్జనక సన్ని భుడీవు - శివాజి తోనను
న్నెనయని పెద్దజేసితివి - నిక్కముగా పితృపాద ధూళిలో
నణువగు నంత వాడగుటనన్నది గొప్ప" యటంచు నాడినన్॥ 1161

తే॥గీ॥ సభ్యులందరు మెచ్చిరా శంభురాజు
వినయ వినమిత వాక్యధోరణికి నపుడు
హైందవ స్వతంత్ర ప్రభుత కాకృతి నిడి
చనిన శ్రీ శివాజీ ప్రతి ఛ్ఛాయ శంభు ॥ 1162

(సాహ్యులు=సహాయులు; స్వర్+అవి=స్వరవి=మేరు పర్వతము)

‘షాజాదా అక్బరు’ తన తండ్రి ‘ఔరంగజేబు’ను సింహాసనచ్యుతుని చేసి, తాను సింహాసన మెక్కుటకు శంభాజీ సహాయము కోరుట

శా॥ రాజస్థాను స్వతంత్రరాజ్యములు “మార్వార”ట్లె “మేవారు”లన్
యాజిన్గెల్చి వశమ్ము చేసికొనగా “యౌరంగజేబ్” పన్పుపై
‘షాజాదా’యగు ‘నక్బరె’త్తి చనియెన్ సైన్యంబఖర్వమ్ము నౌ
యోజంగొంచు-దణాయడై బలుడు ‘తహ్వ్వర్ఖాను’ తోడుండగన్॥ 1163

తే॥గీ॥ బాద్ష యౌరంగ జేబుని స్వజులు నల్వు
రందు నందరిలో చిన్న “యక్బరుండు”
ఫారసీ లేమ “దిల్రాసు” పాదుషాకు
ముద్దులసతి “యక్బరుఁగని” ముడుగు పడియె ॥ 1164

కం॥ తన తండ్రి భారతావని
గొనె ముప్పాతికకు పైన - కొదవడు భాగం
బును గొన పట్టు విడక - కు
ట్రను కావించుచునె యుండె రాత్రింబవళుల్ ॥ 1165

కం॥ “పిత” పద్ధతి యక్బరు కిం
పితముంగాకుండె - తండ్రి వృద్ధుండగుటన్
కృత నిశ్చయుడయ్యెను - జనయి
తను తొలగించి మకుటమును తానే దాల్పన్ ॥ 1166

శా॥ ఔరంగ్జేబు సుతాళినల్వు రొకటే ధ్యాతవ్యము న్బ్బని - వే
ర్వేరన్వేరికి వారె “ఢిల్లి” బహులగ్రీవాసనం బెక్కగా
యారాటంబును చెందు చుండి రెవరందాస్పర్ధలో ముందుకున్
మీరంగల్గెడు వారలన్న యది మేమేమేమటంచెప్పుడున్ ॥ 1167

(షాజాదా=యువరాజు; పన్పు=ఆజ్ఞ; దణాయడు=సేనాధిపతి)
(లేమ=స్త్రీ; ముడుగుపడు=చనిపోవు) బొమ్మిడీకము=కిరీటము
(కొదవడు=శేషించిన, మిగిలిన) ఇంపితము=ఇష్టము;
(ఇంపితము=ఇష్టము; మకుటము=కిరీటము; కని=ప్రసవించి)
(ధ్యాతవ్యము=లక్ష్యము; బహులగ్రీవము=నెమలి; ఆస్పర్ధ=పోటీ)

రాజస్థాను మందు అక్బరును దుర్గాదాసురాథోడు కలుసుకొనుట

శా॥ రాజస్థానును గెల్వ బోయిన మొగల్రాట్పుత్రు నా'యక్బరు'న్
రాజస్థానున పేరుగొన్న దణి 'దుర్గాదాసు రాథోడు' – ప
ణ్యాజీవుంబలె వేసమేసి కలిసెన్ "యజ్మీరు" లో, గుప్తమౌ
యోజన్ వానికి బోధచేయ తనవౌ వ్యూహమ్ములం గూర్చియున్॥ 1168

తే॥గీ॥ అక్బరు ససైన్యుడయి చనె నాక్రమింప
రాజ పుత్రుల స్వాతంత్ర్య రాజ్యములగు
నట్టి "మేవారు" మార్వారు లనెడు వాని
రాజ పుత్రులక్బరునకట్టాక నిడిరి ॥ 1169

కం॥ "ఆరావళి" గిరి వనులను
దూరుచు మొగలులను, "చాటు దురమున" నిపుణుల్
యా రాజ పుత్ర సేనలు
గారించిరి యెదురు పడని కదనము నందున్ ॥ 1170

ఉ॥ వారల చాటు పోరితపు వైఖరి కచ్చెరు వంది – యక్బరున్
చేరెను జోధపూరు – ముసు చెప్పిన రీతిగ దుర్గదాసు రా
ఠోరట రాజ పుత్రులఁ గడుంగడు పట్టుదలన్ గలట్టి రా
ఠోరు, శిశోది యాన్వయ కఠోర శుటీరులఁ గోరెసాయమున్॥ 1171

తే॥గీ॥ తండ్రి నౌరంగజేబును తలగ బెట్టి
నెమ్మి గద్దియ నెక్కంగ నెంచి – తాను
రాజపుత్ర శౌర్యముకనులార గనుచు
వారి సాయ మభ్యర్థించె, స్వాస్థ కొరకు ॥ 1172

(దణి=సేనాధిపతి; పణ్యాజీవుడు=బేహారి)

(అట్టాక=ఆటంకము)

(చాటుదురము=గెరిల్లా యుద్ధము; గారించు=చిక్కులు బెట్టు)

(శుటీరులు=వీరులు)

(స్వాస్థ=తన ప్రయత్నము)

కం॥ “రాజస్థానును గెలువగ
షాజాదా యక్బరుండు చని తడవాయెన్
యే జోలి తెలియకుండెను
నాజిఫలమ్మేమొ” యనుచు నౌరంగ్జేబున్ ॥ 1173

తే॥గీ॥ చేరె యజ్మీరు పురము – “మేవారు” రాజ్య
మందు – ముస్లిములందరికతి పవిత్ర
మైన – సూఫియౌ “మొయినులుద్దీను చిస్టి”
“దర్గ” కల పుణ్యభువికి ‘సుల్తాను’ యపుడు॥ 1174

సీ॥ తన కొడు‘కక్బరు’ కనుగల మిడగ “షా
బుద్దీను” నంపె జోధ్పూరునకును
నతడేగు చుండగ యధ్వ మధ్యము నందె
వేగు వార్తలు విని విస్మితుడయి
గ్రక్కున మరలి యౌరంగజేబుకు చెప్పె
తాను విన్నట్టి కథా క్రమమ్ము
“జోధపురమున షాజాదు తనకు తానె
ఢిల్లీశుగా ప్రకటించు కొనుచు ॥

తే॥గీ॥ తనకు “తహ్వురుఖాను” ప్రధాన మంత్రి
గా నొనర్చుకొనెననుచు – దాని వినుచు
నాగ్రహించెను – “పాదుషా” “యక్బరు”నకు
వెనుకనున్న “దుర్గాదాసు” పని యిదనుచు” ॥ 1175

ఔరంగజేబు భేదోపాయ ప్రయోగమునకై ఒక అసత్యపు లేఖ సృష్టించుట

సీ॥ సామాద్యుపాయజ్ఞుడా మొగల్పాదుష
తక్షణమొక భేద తంత్ర మెంచి
కమ్మను వ్రాయించె గారాల పట్టికి
“ప్రియపుత్ర! నేను చెప్పిన విధముగ

(జోలి=సమాచారము; ఆజిఫలము=యుద్ధ ఫలితము)

పాదుషాగా నిన్ను ప్రకటించు కొన నీవె
రాజపుత్రులకును ప్రత్యయ మెద
కల్గు మన నడుమ కలహ మేర్పడెనని
యందరు నీ వెంట నంటియుంద్రు ॥

తే॥గీ॥ నాపయి కనికేగెదు రహిదోపఁజేయ
రాజపుత్రులు నొక్కచో రచ్చ గొనగ
వెనుకనుండి నీ వేను ముందునను వారి
బలమును వలగొని నుఱుమ సులభమగును॥ 1176

తే॥గీ॥ అపుడు మేవారు, మార్వారు హస్తగతము
లగు మొగలు సుబాలౌచు - లెస్సగనుయాడి
తీవు మన నాటకమ్మిక తీరు వారి
పొగరు నట్లె దుర్గాదాసు బులుపు యణగు" ॥ 1177

కం॥ అని వ్రాయించిన కమ్మ "న
తినిగూఢమ్ముగ పడు ఫణితిని" "దుర్గా దా
సుని చేతికి - చేర్చవలెను"
యని వార్తాహరులఁబంపె - నాలంపనయున్ ॥ 1178

తే॥గీ॥ తిరుగుబాటుకు సిద్ధమై తఱిని వేచి
యున్నయట్టి దుర్గాదాసు సన్నిధికిని
భటు డొకండొక ప్రణిధిని పట్టి తెచ్చె
వాని రొంటిని గల "కమ్మ" బయలికిగ్గె ॥ 1179

కం॥ "జాబును పంపెను 'నక్బరు'
కా 'బాద్షా' యిపుడదేమొ యని దుర్గా దా
సొబగఁ జాబునుఁజదివియు
తాబాగుగ నెఱిగె దాని తాత్పర్యమ్మున్ ॥ 1180

(రచ్చగొను=గుంపుకూడు; ప్రత్యయము=నమ్మకము; నుఱుము=చంపు)
(బులుపు=ఉబలాటము)
(ప్రణిధి=వార్తాహరుడు; ఇగ్గు=లాగు)

చ॥ సరగున రాజపుత్రకుల సైన్యమునచ్చటి నుండి పూర్తిగా
మరలి చనంగ నాజ్ఞనిడి, మాటయు మాత్రము చెప్పకుండ న
క్బరునకు తాము క్రమ్మఱెడు కారణమేమియు - దుర్గదాసు - తా
నరిగెను స్వస్థలమ్మునకు - నక్బరు మేల్కను నంతలోపలన్ ॥ 1181

అక్బరు మేల్కాంచి శిబిరములు వట్టి పోవుట చూచి ఆశ్చర్య పడుట

తే॥గీ॥ ప్రొద్దుననె లేచి చుట్టును సద్దు చాల
తక్కువౌటకు వెఱగంది తక్షణమ్మె
యాత్మ శిబిరము వెలువడి నరయ నచట
రాజపుత్ర సేనల శిబిరములె లేవు ॥ 1182

తే॥గీ॥ వేగ 'తహ్వరు ఖాను' శిబిరముఁ గనగ
చనగ నచట 'తహ్వరుఖాను' జాడలేదు
మొగలు సైన్యము తగ్గెను మూడు పాళ్ళు
చివరకున్నది యేనూర్ల జవన దళము ॥ 1183

ఉ॥ అంతట వేగరుల్ కలిసి యప్పటి దాకను సాగినట్టి వృ
త్తాంతము పూర్తిగా నుడువ నాతడు రెంటికి చెడ్డ రేవడౌ
తంతును గాగ తండ్రికిని దాయయునై - యటు విప్లవింప న
త్యంతము సాయ మౌదుమను దట్టులు వీడగ యేది తోచకన్॥ 1184

తే॥గీ॥ అయ్యొ కంటను బడిన గుయ్యారమందె
జీవితమ్మెల్ల చివికియు జీర్ణమగును
పితను తప్పించుకొని పోయి వెండి బల్లి
దులగు, హితుల గూడిన తోడు దొరకనికని ॥ 1185

శా॥ రాజస్థానము వీడి శేష పరివారమ్మల్పసంఖ్యాకమై
తోఁజాగన్ మరుభూములందుఁ జనుచున్ తుక్వారమున్నెక్కి - యెం

(దొరకనికని=దొరకు+అనికి+అని=యుద్ధమునకు లభించునని)
జవన దళము=గుఱ్ఱపు దడము; గుయ్యారము=చీకటిల్లు; దట్టులు=సమర్థులు

తో జాగ్రత్తగ వైరు లేవయిపుగా త్రోపాడుచున్నత్తుర
న్నోజన్-కన్పడె దుమ్ము దూరమున మిన్నుందాకు నంతెత్తునన్॥ 1186

కం॥ భయమున రాపడె 'యక్బరు'
రయమున యాధూళి తన సరసకే వచ్చెన్
హయములపై దుర్గా దా
సు, యుధవితతిరాక తనదు చూపున కందెన్ ॥ 1187

తే॥గీ॥ అతని రాకకు నక్బరు నచ్చెరువడె
యేల జోధపూరునతా నదృశ్యుడయ్యె?
నిప్పుడింత హఠాత్తుగా యేల వచ్చె?
నంచు సందియముల పుట్ట యవగ నెడద ॥ 1188

మ॥ "అనుమానించకు "షాహజాద" మనమా 'యాలంపనా' యుచ్చులో
నను బందీలము నౌచు వంచితులమైనామయ్య, మీ తండ్రి లే
ఖను చూడియ్యదె"-యంచు చేతికిడె లేఖన్ - యక్బరా'కమ్మ'నున్
గొని చూచెన్-పిత గుంటనక్క టకటొంకున్నెంతొ కుత్సించుచున్॥ 1189

చ॥ "ఇపుడిక నేమిసేయవలె నేనన" యక్బరు - ముందెడారి దా
టి పిదప పశ్చిమాంబుధితటిన్విడకుండ పురోగమించి - యా
మ్య పృధివి చేరి, సహ్యకుధరావళి నెక్కి దిగంగ మరాట రాజ్యమం
దపుడడుగేయ గల్గుదుము-నక్కడ చెల్లవు 'బాద్ష' నీల్గుడుల్॥ 1190

తే॥గీ॥ ఇపుడు నా మహారాష్ట్ర రాజ్యేభ్యుడైన
'ఛత్రపతి వీర శంభాజి' సమర నృహరి
త్వత్పితరుడు శంభాజికి బద్ధవైరి
నీ పని నెరవేరును - నతండీయ కొనిన ॥ 1191

(మరుభూమి=ఎడారి; తుక్ఖారము=గుఱ్ఱము; త్రోపాడు=వెంటాడు; ఓజ=భయము)

(రాపడు=కొయ్యబారు) కుత్సించు=ఏవగించు

(టకటొంకు=మొసము)

(ఇభ్యుడు=రాజు)

కం॥ అని దుర్గాదాసుడు జరి
గిన కథ నొక పత్రమున లిఖించియు వార్తా
యనులకిడి శంభుని కడకు
ననిచె నతనియెడల తనకు నమ్మిక కల్మిన్ ॥ 1192

కం॥ నాసికు కడ "గోదా" తటి
నీ సవిధమున తమ వసతి నిర్మాణమ్ముల్
చేసి కను కనిని యుండిరి
యే సందినొ 'బాద్షు' భటులు నెదురుదురనుచున్ ॥ 1193

శా॥ ఆ లేఖన్గని 'శంభుజీ' తలచె ని'ట్లౌరంగజేబు' న్నితం
డే లీలన్పద భ్రష్టు చేసియును తా ఢిల్లీ మయూరాసన
శ్రీలంకింప దలంచె నంత సుళువా? స్వీయ ధ్వజమ్మెంత? యా
యాలంగీరుని సైన్యమెంత? యురణంబద్రిన్నెదుర్కొన్నటుల్" ॥ 1194

ఛత్రపతి శంభాజీకి సమర్థ రామదాసు లేఖ వ్రాయించుట

తే॥గీ॥ ఇట్లు 'శంభాజి' తలపోయు సమయమందు
సజ్జను గడము నుండొక జాబు వచ్చె
శ్రీ సమర్థరాందాసజీ శిష్యులకును
చెప్పి వ్రాయించి పంపిన శ్రీముఖమ్ము ॥ 1195

సీ॥ "ఎడలేక కనుకని న్నడయాడు మెప్పుడు
కలనైన నేమఱికనుట లేక
కోపమ్ముతో పాటు కోమలత్వము జూపు
నాశ్రితావసరము లరసి కొనుచు
నేకాంత మందున నేకాగ్రతనుఁ బూని
ధ్యానింపు దైనికమైన విధులు

(వార్తాయనులు=వార్తాహరులు) కనుకని = జాగ్రత్త; ధ్వజము=సేన
('గోదా'తటిని=గోదావరి; సంది=సందు; ఎదురు=ఎదుర్కొను)
(శ్రీముఖము=గురువులు వ్రాయించి పంపు లేఖ) ఏమరిక=పరధ్యానము

రావించి నీయాంతరంగికులందరి
స్చర్చ చేయుము కార్య సరణిపైన ॥

తే॥గీ॥ శ్రీ శివాజీయు నిత్య జాగృతిని, శాంత
సహనములు, సాహసమ్మును శౌర్యగుణము
లేవి యెపుడెంత వలయు చూపించె - నందు
నీవు నీ పితన్మించెదు నేర్పుఁ జూపు" ॥ 1196

తే॥గీ॥ తగిన తఱియందె శ్రీరామ దాసగురుని
లేఖ వచ్చెను - నిత్య జాగృతిని తెలుప
చదివె లేఖను శంభుజీ సవినయముగ
సార్ద్రమయ్యె కండ్లు గురువాత్సల్య మరసి ॥ 1197

తే॥గీ॥ పిదప దుర్గదాసు నొనర్చు వినతి దలచి
యెంతొయనుభవ పరుడీత డెట్లు నిటుల
తన దరికి వచ్చి ఢిల్లి సుల్తాను నెదుర
సాయ మిమ్మనె - నింత యమాయకుండె? ॥ 1198

ఉ॥ నేనును పాదుషా నెదుర నెంచినచో స్థలయుద్ధ మెప్పుడున్
వానికె యానుకూల్యమగు - వాహిని లెక్కకు మీరి యుండుటన్
మా నలుసంత సేన వనమార్గములన్ గిరి దుర్గ లోలిమిన్
మానము ప్రాణముల్ దొలచు మల్కలసేనకవెంతయైననున్॥ 1199

ఉ॥ కావున సహ్య భూధర ప్రగాఢ వనాధ్వములిచ్చు రక్షయున్
పోవ - మొగల్పరిన్నెదుర పోవుట యెందుకు ఢిల్లి దాక - యి
ట్లా వెలిపోరున న్నిలువనౌనె? మరాటుల యల్ప సేనకున్
గావుగొనంగ బోదొకొ! మొగల్మొన మమ్ముక్షణార్ధ మందునన్॥ 1200

ఉ॥ ఆయవురంగజేబు సుతు డక్బరు కున్నది యైదు నూర్ల "వా
నాయుజసేన" యేటి ధృతి నాతడు బూనెను పాదుషా యసం
ఖ్యేయమునైన సైన్యమును క్రీడగ నెంచుచు, ధీ కొనంగ - న
న్నాయము గోరె-నాకు గల సైన్యము యేబది వేలె మొత్తమున్॥ 1201

దుర్గ=కోట; ఓలిమి=మఱుగు, చాటు (ఎడ=విరతి; ఏమఱిక=అజాగ్రత్త) (వెలిపోరు=బహిరంగ స్థలమున యుద్ధము) (వానాయుజసేన=ఆశ్విక దళము)

తే॥గీ॥ ఇంత యల్పపు సేనతో యంత పెద్ద
మొగలు సేనను బయలున మోటు కొనిన
మొదటి దెబ్బకె మాకథ ముగిసి పోదె?
ఆరు లక్షల సేనతో నాట తగునె?" ॥ 1202

మ॥ అని "యా 'యక్బరు' కట్టుకోదలచు నా యాకాశ హర్మ్యమ్ములన్
పని లేకెప్పుడు తూగుచున్ కనుదివా స్వప్నమ్ములన్ - నిక్కమున్
యొనరింపంగల శక్తి యుక్తులవి నా కొక్కింతయున్ లేవు-నా
తని కెట్టిట్లునమాయకమ్మయిన బోధన్ చేసె రాథోడునున్"?॥ 1203

ఛత్రపతి శంభాజీ, షాజాదా అక్బరుకు 'కొంకణు' నందు వసతి యేర్పాటు చేయుట

తే॥గీ॥ అనుచు శంభాజి తనలోన యనుకొనుచును
నక్బరునకు కొంకణు పశ్చిమాబ్ధితటిని
వసతి చూపె "సుధాగడు" పాదసీమ
"పాలి" యను పల్లియకు సమీపమగు చోట॥ 1204

తే॥గీ॥ క్రొత్త 'బాద్షా' యను ఫణితి కొల్వు దీరె
పూరి యింట'నక్బరు' వేరు దారి లేక
మట్టి నేలగల్గిన యింటి, మంటి కుడ్య
ములను నూలుతెరలతోడ మూసినారు ॥ 1205

ఆ॥వె॥ ఉరణి మేనిదైన యున్నితో మొరటుగా
నేసి నట్టి వగు 'తివాసి' లచట
మంటి నేలపైన మందముగాఁ గప్పి
యుంచిరి 'దొర' వాస యోగ్యముగను॥ 1206

ఆ॥వె॥ 'అక్బరు'నకు నచట యారక్షక పతిగ
నూఱుగురు మరాట పారివారి
తో, రెయింబవళ్ళు "హీరోజి ఫర్జాందు"
నంపె కాచియుండ నపుడు శంభు ॥ 1207

(ఉరణి=గొఱ్ఱె) (పారి=అరెకుడు, తలారి)

షాహజాదా 'అక్బరు' 'కొంకణము'నకు వచ్చిన విషయము తెలిసి "అణ్ణాజీ" శంభాజీకి వ్యతిరేకముగా కుట్రను పన్నుట

సీ॥ పన్హాలా గడమున 'బందరు' కధిపతి
గానున్న 'యణ్ణాజి' కపుడు తెలిసె
"క్రొత్త పాదుష వచ్చి కొల్వుతీరెను "సుధా
గడము" దాపునను కొంకణమునందు
నౌరంగజేబుని యాత్మజు'డక్బరు'
పితనె తాను పదవీచ్యుతుని చేసి
ఢిల్లీ మయూర పీఠిని యధిష్టింపగ
శంభు సాయముకై విజయముచేసె ॥

తే॥గీ॥ రాజ్పుటాన "దుర్గాదాసు" రట్టడియును
నక్బరుకు సహాయుడునగుచరుగుదెంచె
యక్బరుకు సాయపడ శంభునడిగి నాడు
యేమనెనొ! శంభు నేరికి యెర్కలేదు" ॥ 1208

కం॥ ఈ విషయ మెఱిగి "యణ్ణా
జీ" వెస పావులు కదుపగ జిత్తులు పన్నెన్
యే విధమున కథ నడుపం
గా వీలౌనట్లొక పథకమును రచించెన్ ॥ 1209

తే॥గీ॥ అక్బరుకుఁ జేర 'బాలాజి యవజి' చేత
కమ్మ వ్రాయించి యణ్ణాజి తమ్మునకిడి
యనియె "సోమాజి! యీ జాబు గొనుచు నక్బ
రునకు నంద చేయింపు 'హీరోజి' చేత " ॥ 1210

ఉ॥ నూతన పాదుషాయు, నటనుండిన రట్టడి దుర్గదాసు - ని
శ్చేతనులైరి యప్డు తమ చేతికి వచ్చిన జాబులోని యా
వ్రాత పఠించి - యిచ్చట మరాట ప్రభుత్వము నందు గూడ నే
వో తగవుల్ తలెత్తుచునెయున్న వటంచు గ్రహించు చిద్దరున్॥ 1211

(రట్టడి=రాఠోడు; ఎర్క=ఎఱుక)

ఆ॥వె॥ 'శంభు' వచ్చెను మరుసటి దినము నటకు
'దుర్గదాసు' మివుల తోషమందె
'అక్బరు'ను కలియగ యాతని బసకును
చనిరి, యక్బరెంతొ సంతసించె ॥ 1212

"వీర శంభాజి" "షాజాద అక్బరు"ను తన నుండి యేమి యాశించిరని యడుగుట

ఆ॥వె॥ "ఏమి కోరి యిటకు నేతెంచి నారని"
శంభుడడిగె నెట్టి జంకు లేక
యక్బరు వచియించె నరవాయి గొనకుండ
"పాదుషా"ను తివియ "ప్రాపగుమ"ని ॥ 1213

సీ॥ "పాదుషా యాశయ మీ దేశమంతయు
మల్కల భూమిగా మార్పు చెంద
యే ప్రాంత మేగిన యాప్రాంత మందున
దేవాయతనములఁదిబ్బఁజేయ
జీజియా పన్నును చెల్లింప లేని హిం
దువుల నేన్గులచేతఁ ద్రొక్కఁ జేయ
చిల్లిగవ్వయు లేని యెల్ల హైందవ సైరి
కులకుటుంబములను కుతిల పఱప॥

తే॥గీ॥ రేగి బలవంతపు మత మార్పిడులఁ జేయ
దేశమున స్వతంత్రనృపుల దిల్ల పఱప
నాదు జనకుండు సాగించు నరక సదృశ
రాజ్య పాలన నాకె దుర్భరమునయ్యె ॥ 1214

తే॥గీ॥ అధిక సంఖ్యాకు లైనట్టి హైందవులను
ఇట్లు పీడించు చుండిన నేమి ఫలము;
నఖిల భారత మేలంగ నాసయున్న
తాను కూర్చున్న కొమ్మనే త్రచ్చుదగునె?" ॥ 1215

(అరవాయి=సంకోచము; తివియు=దిగలాగుట; ప్రాపు=అండ)
(సైరికుడు=హాలికుడు; దిల్లపఱచు=బలహీనపరచు)
(త్రచ్చు=ఖండించు)

తే॥గీ॥ అనెడు 'నక్బరు' మాటల నాలకించి
యచ్చు తనయీడు వాడైన యతని యెడద
పరగు నాదర్శ భావార్ద్ర సరణి నరసి
శంభు తనలోనె తాను యాశ్చర్యమందె ॥ 1216

ఉ॥ ఐనను తాను నేమి ప్రతి యాడక "యంతటి తెల్వియున్న యీ
ధీనిధి పాదుషా బలము తెల్లముగా కనుపించు చుండియున్
వాని నెదుర్కొన న్నెటుల పొల్పడు నింత యమాయకత్వమా!
వీనికి దుర్గదాసెటుల ప్రేరణ నిచ్చునొ? చూడ వింతయౌ" ॥1217

తే॥గీ॥ తన నెరవు గూర్చి తానేమి యనక యున్న
శంభుగని "మా పయిన యెట్టి శంకయున్న
తొలగబెట్టుము - యెవ రేదొ పలికిననది
లెక్క చేయము - చాలు నీ యొక్క ప్రాపు" ॥ 1218

తే॥గీ॥ అని పలికిన నగ్బరుఁ గను చనుమతోడ
"నన్ను గూర్చి పలుకు టేమి"యన్న శంభు
నపుడు చూపించె లేఖను నక్బరచట
మాకు "హీరోజి" యిచ్చె నీ యాకుననుచు ॥ 1219

ఉ॥ అందున వ్రాసియున్నదిది - "యక్బరుజీ! తమరేమొ శంభుజీ
యందగఁజేయు సాయమున కబ్బులు జాచుచునున్న వారలే
మందుము మీ యమాయికత నాతడు తుంటరి, గర్వి, వానిలో
మందునకైన మంచియను మాటయె యుండదు-మీకె నష్టమౌ॥ 1220

తే॥గీ॥ శ్రీ శివాజీ మహారాజు చిన్న కొడుకు
రాజరామరాజు సుగుణ రాశిసుమ్ము
నతని ఛత్రపతిగఁజేయ ననుగలమిడ
యతడు సాయపడును మీ ప్రయత్నమునకు ॥ 1221

(నెరవు, ప్రాపు=సహాయము)

(అనుగలము=సహాయము)

(అనుమ=అనుమానము; ఆకు=జాబు)

తే॥గీ॥ పితనె యెదిరించి మొగలుల జతను గలిసి
తండ్రి రాజ్యముపైననే దాడిచేసె
ఇట్టి ద్రోహి మిమ్ములను నట్టేట ముంచ
గలడు – వీడు మిష్టైన నీ ఖలుని మైత్రి ॥ 1222

ఉ॥ అంచిత దేశ భక్తుడగు హైందవ వీరుడు దుర్గదాసు తా
మంచియు చెడ్డ నేర్చు మతిమంతుడు నౌట నిజమ్మెఱింగి – తా
రెంచిన యుద్యమమ్ము సఫలీకృతమౌటకు మమ్ము తోడుగా
వించుకొనన్ శుభమ్ముభయు లేరికి వారు జయింత్రు లక్ష్యమున్"॥ 1223

ఆ॥వె॥ అనుచు వ్రాయబడిన యా యుత్తరము జూచి
నిప్పులురలె శంభు నేత్రములను
దీని మూలమెవరొ తెలిసి కొనగ కోర
యక్బరే వచించె నతని కపుడు॥ 1224

తే॥గీ॥ "మాకు హీరోజి చెప్పిన మాటఁబట్టి
యతని కీ లేఖ 'యణ్ణాజి' యనెడు సచివు
డంపెనట – స్వయముగ తన యనుజు చేత
యింత వరకె మేమెఱిగిన వృత్తమనియె" ॥ 1225

ఉ॥ అప్పుడు శంభు డిట్లనియె "యణ్ణ" యనైతిక వర్తనమ్ము నే
నొప్పక యడ్డుకొన్న – యత డోర్వక – నాపయి కక్షబూనుచున్
గుప్పెను నాలి నేరములు కొద్ది నిదర్శనమైన లేనివిన్
యొప్పరికించి నాడ నపుడుద్ధతుడై చెలరేగె నేడిటుల్"॥ 1226

"వీర శంభాజీ" అపరాధులను శిక్షింప బూనుట

తే॥గీ॥ అనుచు వారల వీడ్కొని చనియె శంభు
రాయగడమున కెడద రౌద్రమ్ము యెసక
మెసగ, "హంబీరరావు మోహితె" దణాయ
ని పిలిపించి, మామకు చెప్పె నెల్ల కథను ॥ 1227

(ఎసకమెసగు=అతిశయించు)

శా॥ ఆవృత్తాంతము నాలకించి నగుచున్ హంబీర రావిట్లనెన్
"నీ వానాడు నుదార భావమున యీ నీచాత్ములన్ సైప నెం
తో వింతయ్యెను నాకు - నద్దుపడ నేనుం జూచితిన్గాని - నీ
సంవిత్తుప్రతిభా పచేళిమను కాంచన్ ముచ్చటయ్యెన్ సుమా! ॥ 1228

ఆ॥వె॥ తేలు, పాము, ఖలుడు తెగ యొండె వీరికి
హాని చేయకుండ నాగ లేరు
జాలితోడ వీరి జారి పోనిచ్చిన
విపద తప్పదనుచు విజ్ఞులంద్రు॥ 1229

నేర విచారణ - శిక్ష

కం॥ పిలిపింపుము నా ఖలులను
ఫలముండెనె యట్టి వారిపయి దయచూపన్
విలువలు తెలియని వారలు
చులుకనగా చూతు రెదిరి - సుగుణ గణమ్మున్"॥ 1230

సీ॥ హీరోజిఁ బిలిపించి "యేమయ్యె కాకాజి"
యనగ 'నన్బెదరించె' యణ్ణ యనియె
"నణ్ణాజి" రావించి "యార్యా! యిదేమన
"నీవు తగవు గద్దె నెక్క" ననియె
బాలాజి యవజీని "బాబా! యిదే మన
"పడిపోతి వారి యొత్తడికి" ననియె
"రాహుజీ సోమ్నాథు" రప్పించి యేమన
"యణ్ణాజి" వలన యిట్లాయె ననియె ॥

తే॥గీ॥ 'యణ్ణ' యనుజుడు 'సోమాజి' యట్లె యనియె
యదె 'జనార్ధనహన్మంతు' యనుట గూడ
మొత్తము పయి "యణ్ణాజి" యే" మూల హేతు
వింతటికి ప్రేరకుడనుచు విశదమయ్యె ॥ 1231

(సంవిత్తు=సూక్ష్మదర్శిత)

ఉ॥ చెప్పెడు వాడు విజ్ఞత నశించి వచించిన - గంగిరెద్దుల
ట్లప్పుఱచేమి చెప్పినను నౌదలలూపుచు వాని పన్పునున్
తప్పక చేసి చూపుటకు తత్తఱలాడగ స్వీయ బుద్ధికి
న్నొప్పులు, తప్పులందెలియు నోజ నశించెనె-జంతు తుల్యులే!॥ 1232

తే॥గీ॥ రాజ విద్రోహులందర రజ్జువులను
కట్టి వైచి దుప్పటులందు - గడము మీద
నుండు "తక్మకుతోక" ను కొండకొమ్ము
కొట్టకొన నుండి క్రిందికి నెట్టి రపుడు ॥ 1233

సీ॥ "హీరోజి ఫర్జాందు" యిలను ముద్దాడెను
'అణ్ణాజి దత్తోజి' యవనిఁదాకె
"బాలాజి యవజియు" వసుధ నాశ్లేషించె
"రాహుజీ సోమ్నాదు" రస ను నిమిరె
"సోమాజి దత్తోజి" క్షోణిపైఁబడియె, న
ట్లె 'జనార్ధను హనుమంతి'డికదడవె
పుడమిపై యంత ప్రేముడిగల్గు లోభులు
శాశ్వతముగను భూశయనులైరి ॥

తే॥గీ॥ ముందు వెన్కఁగనని యర్థమోహ వశత
తమ పరువు మించు నధికార దాహ పరత
భూప, దేశ విద్రోహులన్ ముద్రబడగ
ఘోర "భృగుపాత" శిక్షకు గుఱియు నగుచు॥ 1234

(పఱచు=దుష్టుడు; పనుపు=ఆజ్ఞ; ఓజ=నేర్పు) ఇడిక=నేల
(పరువు=అంతస్థు; భృగుపాతము=కొండపై నుండి నేలపై బడుట)

"వీర శంభాజీ" సవతి తల్లి "సోయరాబాయి"కి మంత్రుల శిక్ష వార్త తెలియుట-అపరాధ భావముతో భయముతో ఆత్మహననమునకు పాల్పడుట

తే॥గీ॥ 'సోయరాబాయి' యెటిగెను రాయగడము
నందు జరుగుచున్నట్టి వృత్తాంతములను
తనదు హస్తముద్రగల లేఖనె పనిచెను
'నక్బరు'నకు - నణ్ణాజి ప్రత్యాయనమున ॥ 1235

తే॥గీ॥ తన తనూజుని ఛత్రపతి నొనరింతు
నంచు నేతులబోయిన యణ్ణదత్తు
నేడు తన సహోద్యోగులుతోడుగ భృగు
పాత శిక్షకు గుఱియగు వార్త తెలిసి ॥ 1236

చ॥ తనకిక "యాటకట్ట"నెడు తత్త్వము బాగుగ బోధ పడ్డదై
తనయుని నొంటిగా విడచు దారుణ వేదన తాళలేకయున్
మనిన - చలత్కళేబరము మాదిరి జీవిత మోర్వలేకయున్
పనవుచు నెట్టకేని విషపానముచే మృతి చెందె "సోయరా"॥ 1237

"వీర శంభాజీ"కీ విషయము తెలిసి తీవ్ర పశ్చాత్తాపమొందుట

తే॥గీ॥ "తనను ద్వేషించెడి సవతి తల్లి చెల్లె
తనను దైవముగా నెంచు తమ్ము వాడు
"రాజరామన" నెంతొ గారాము తనకు
వాని సతి "జానకీ బాయి" పరమసాధ్వి" ॥ 1238

(ప్రత్యాయనము=ఉపదేశము)
(ఏతులు=అతిశయములు)
(తమ్ముకవాడు=తమ్ముడు; చెల్లె=మరణించెను)

శా॥ అని శంభాజి మనంబు నందు నొక ప్రత్యాశ్వాసనమ్మొందె – "తా
పిన తల్లింగడు భక్తి గారవములన్ ప్రేమించెనే గాని యా
మెను ధిక్కారము చేయలేదయిన నా మేలోర్వలాదామె త
త్తనయున్ రాజును చేయనెంచి మదవధ్వంసమ్మె కోరెన్ తుదిన్॥ 1239

ఉ॥ తల్లి గతింప నాకు నొక తల్లిగ గారము చేసి సాకె – నే
దుల్లమునందు నేననిన యొప్పమి గాధమునయ్యె – ప్రక్కలో
బల్లెముగా తలంచెనను – స్వాత్మజు ఛత్రపతిన్నొనర్పనా
వల్ల విమాత మౌననెడి పంగున నన్ను తలంచె వైరిగా ॥ 1240

ఉ॥ తల్లి తనూజుడెవ్విధిని తప్పులు చేసిన సైచికాచుచున్
మొల్లమునైన ప్రేమమున బుద్ధులు చెప్పియు మంచి దారికిన్
మెల్లగ త్రిప్పదే? తనుజుమృత్యువు తాఁగలనైన కోరునే?
యొల్లమి చేయనన్సవతియుద్వహుడన్ కతమొక్కటేగదా! ॥ 1241

తే॥గీ॥ తన పగకు తానె బలియయ్యె – తనకు నేను
నెట్టి ప్రతి కారమును చేయ నెంచ లేదు
తనదు యపరాధ భావమే తనను నేర్చ
నేను వచ్చెడి లోపలే యిహము వీడె" ॥ 1242

కం॥ అని బాధ పడెను 'శంభుజి'
తనదు విమాత మృతి వార్త దహియింపనెదన్
పనవియు ఫలితము లేదని
యనుజుని యూరార్చ వెడలె నంతిపురముకున్॥ 1243

ఔరంగజేబు దక్షిణ దేశ దండయాత్రా సన్నాహము

సీ॥ ఔరంగజేబు తా నను కొన్న యట్లు రా
జస్థానులో పూర్ణ జయము లేమి
యంతకన్న నతి ముఖ్యమని తా భావించు
దక్షిణావని పైన దండునడుప

(ప్రత్యాశ్వాసనము=ఓదార్పు; అవధ్వంసము=నాశనము)
(ఒప్పమి=నిరాదరము; పంగు=భయము)
(ఒల్లమి=నిరాదరణ; ఉద్వహుడు=కొడుకు) విమాత=సవతితల్లి

సర్వ సేనానిగా స్వయము బాధ్యతలన్ని
నెత్తిపై కెత్తుకో న్నిశ్చయించె
చిరరణానుభవముచే విశ్రుతుడగు "షా
బుద్దీను" తనకుడి భుజము గాగ ॥

తే॥గీ॥ యేడు వేల మన్సబుదార్లు తోడు నొసగ
తాము పోషించు సేనతో తరలి రాగ
ఇంచు మించైదు లక్షల పృతన ప్రథన
సిద్ధమై నిల్చె నౌరంగజేబు వెంట ॥ 1244

కం॥ వ్రాయించె వక్కణమ్ముల
నే యే ప్రాంతమ్ములందు నెవరెవరున్న
న్నాయా ముఖ్యుల కందర
కీ యుద్ధము చేయు దక్షిణేలకు తరలన్ ॥ 1245

కం॥ బీజాపూరున కప్పుడు
రాజైయుండెడు "సికందరాదిల్షాహ"
న్నాజికి పురిఁగొల్పుచు "శం
భాజీ" పై-'పాదుష' యరి వదలుకొనెదనెన్ ॥ 1246

సీ॥ ఆత్మజుల నొకని "యజము" నాజ్ఞాపించె
యాదిల్ష వర్తన మరయు చుండి
"యతడు మరాటాల జతను కలియకుండ
బీజాపురము పైన వీక్షనుంచ"
"ఖానెజహాన"ను గట్టి మన్సబుదారు
నంపించె "బగ్లాను" ప్రాంతమోమ
"రణమస్త' "రుహుల్లఖాన్ల" ను, మేటి దణులను
తన వెంట రమ్మనె దక్కనునకు ॥

తే॥గీ॥ కలి "హుసేనలీఖానున" కాజ్ఞయిచ్చె
కొంకణము నందు "కళ్యాణి" కోల్తలకును
పోవు దారిని పల్లెల పురములన్ని
సర్వనాశ మొనర్చుచు సాగుమనుచు ॥ 1247

(వక్కణము=జాబు; దక్షిణ+ఇల=దక్షిణ భూమి)
(కలి=వీరుడు; కోల్తల=ముట్టడి) అరి=కప్పము

కం॥ ఔరంగజేబు పృతనను
పోరెడి భటులందు "రాజపుత్ర" "మరాటా"
వీరులునుంగల రయ్యును
నౌరంగ్జేబిది "జిహాదు" కై యుద్ధమనున్ ॥ 1248

శా॥ "హిందూద్యోగులఁగొల్వనందునుతురంచెప్పున్ మరాటాలతో
భేదం బెంచక చెల్మి చేతురనుచున్" విద్వేషమున్బూని తా
నిందించున్నెపు డాదిలున్కుతుబు మన్నీలన్ 'షియా'లంచు, వా
రిందండింపగ యుక్తమౌ తఱిని యోర్మిన్ వేచె నిందన్కనున్॥1249

'హుస్సేనలీఖాను' తన శౌర్యముతో సాధించిన ఘనకార్యములు

సీ॥ "హుస్సేనలీఖాను" నుత్థానముం గొంచు
"శివనేరి" దుర్గము చెంతఁజేరె
యాతడింతకు ముందు నారావళి గిరుల
రాజపుత్రులఁజంపె రణము నందు
"మధుర"లో "శ్రీకృష్ణ" మందిర ధ్వంసిని
కూల్చిన "జాటుముఖ్యు" ని వధించె
'యుదయపూరుకు'చుట్టు నుండిన నూట డె
బ్బది గుడులను పొలుపఱగ జేసె ॥

ఆ॥వె॥ మొగలు చక్రవర్తి ముదలను తలదాల్చి
యేమి చెప్పినను - పదింతలుగను
దుష్ట కర్మములను దూకుడుగాఁజేయు
"మానికము" పరికి "హుసేనలీ"యు ॥ 1250

తే॥గీ॥ ఇట్లు బాద్షా పనుపున మందేహులట్లు
మొగలు సేనలు చుట్టును మూగుచుండ
దక్షిణావని యున్న స్వతంత్ర రాజ్య
ములకు - విభవార్క నిమ్లుక్తి మ్రోలనిలిచె ॥ 1251

ఉత్థానము=సైన్యము (జిహాదు=మతపరమైన యుద్ధము) (నిమ్లుక్తి=అస్తమయము) (ఉత్థానము=సైన్యము; మానికము=రత్నము; పరి=సైన్యము)

రామ్‌సెజ్ కోట ముట్టడి - మొగలుల వైఫల్యము

సీ॥ ఐదు లక్షల సేన యట్ట హాసమ్ముగ
క్షౌణి క్రక్కదలగ కదలి వచ్చి
ముందుగా విడిసెను 'బుర్హాను పురమున'
నౌరంగజేబు ని'జాంబ' యచట
నే స్వర్గతికయయ్యె – నిర్మించిరి సమాధి
యామెకట, నటు 'బుర్హాను పురము'
పూర్వ సంస్కృతులకు భూమిక యగుటచే
పాదుషాకు పవిత్ర పట్టణమ్ము ॥

తే॥గీ॥ అట్టి పురమును శంభాజి యడ్డులేక
కొల్లగొట్టెనటంచు నిల్వెల్ల యూగి
పోయె నువ్వెత్తు క్రోధముప్పొంగ, 'బాద్ష'
బుసలు కొట్టుచు నాడెడు భుజగమట్లు ॥ 1252

తే॥గీ॥ ముందు సంవత్సరముపాటు "బుర్హను పురి"
యందు బసచేసి "బీజపూరాదిలుషహా"
"గోలుకొండ కుతుబుషాలఁ" గోరెనతడు
"నెట్టిప్రాపు మారాటులకీయకుడని" ॥ 1253

తే॥గీ॥ కాని మారాటుల నెదిర్చి మనుట చాల
కష్టమౌను బీజాపూరు కైన గాని
కుతుబుషాహీల కైన – యక్కతన వారు
వీడరైరి మారాటులతోడి చెలిమి ॥ 1254

కం॥ అటులౌటఁజూచి యెవరిని
దిటముగ సమ్ముటకు నైన ధృతి చాలమియున్
కటకట పడుచును "బుర్హను"
పుట భేదము నందు బాద్ష ప్రొద్దును పుచ్చెన్ ॥ 1255

కం॥ తానచట నుండగనె "బు
ర్హాను" పురసమీప ప్రాంతరము కొల్లాడెన్
వేనిని లెక్కిడక మరా
టా నాయంకుని దళమెద డక్కును లేకన్ ॥ 1256

క్షౌణి=భూమి; (డక్కు=భయము)

తే॥గీ॥ పాదుషా యాజ్ఞలిడె సైన్యపతులకపుడు
ముందు మారాట రాజ్యమున్ముట్టడింప
ప్రథమ కబళము కొంకణ ప్రాంతమందు
తెలికగ వశపడు కోట తేల్చు డనగ ॥ 1257

ఉ॥ ముందుగ కొంకణమ్మునను ముఖ్యముగా తొలి దెబ్బ తీయగా
యందికలోన నున్న గడ మన్నిటిలో నను "రామసేజ" టం
చందరొకేతలంపును జహాపనకున్ వినిపింప తృప్తుడై
యందుకు "షాబుదీన్" దణిని-నగ్రముకుం బిలిపించి యిట్లనెన్॥ 1258

ఆ॥వె॥ "అంత యెత్తులేని యద్రిపై నెక్కొన్న
దుర్గ - చుట్టు నెట్టి దుర్గమాట
వులును లేవు - చాల సులభముగా వశ
మగునటంచు చెప్పిరందరిపుడు ॥ 1259

ఉ॥ అందరు సైన్యనాయకుల నగ్రణివౌచు - "ఫిరోజి జంగ"నన్
వందితుడైతి వీవఅకె - బాలురయాట కదోయి "రామ్సెజు"న్
కందుకమట్లు చేగొనగ గారడిగా నొక రెప్ప పాటున
న్నెందుకుజాగు? నేగుమిక-నిచ్చకు వచ్చిన యంత సేనతో"॥ 1260

ఆ॥వె॥ పూర్తి వత్సరమ్ము బుర్హాను పూరున
యెట్టి పన్నికలను యెంచుకొనక
యెవరిపైన ముందు నెత్తి పోవలయునో
యనుచు వెనుక ముందు లాడుచుండి ॥ 1261

ఆ॥వె॥ అవల మార్చె బసను ఔరంగబాదుకు
నుద్యమమ్ము నచట నుండి నడుప
ముందు 'రామసెజు'ను ముట్టడింపగ నెంచి
షాబుదీను నంపె సమరమునకు ॥ 1262

తే॥గీ॥ "వేగు జాము నమాజుకు వెడలి మేము
నడిమి ప్రొద్దునమాజుకు గడము గెల్చి
విజయమాలను మీమెడ వేతుమనుచు"
"షాబుదీన"న "బాద్షా" "ఖేష"నుచు పొగడె॥ 1263

(అగ్రము=సమక్షము)

"రామ్సెజ్" దుర్గము

ఉ॥ అప్పుడు "రామసెజ్"గడుకు నగ్రగవర్యుడు "సూర్యజీజడే"
యొప్పము చెల్ల మేటి యొడయుండయి శాత్రవ దుర్నిరీక్ష్యమౌ
చొప్పున కాచుచుండె - నది చూచుటకున్ బలహీన దుర్గమన్
తప్పుతలంపు కల్గుటకు తావలమయ్యు నభేద్యమైమనున్ ॥ 1264

ఆ॥వె॥ సింహరంహమెసగ 'సింహగడు'ను గెల్చి
దురమునందు నసులు దొరగినట్టి
దండి విక్రమియగు "తానజీ మాల్సురే"
సోదరుండె వీర 'సూర్యజీ' యు ॥ 1265

తే॥గీ॥ "రామ్సెజు"న కైదు కోసులు "త్ర్యంబకు" గడ
మందు "కేశొత్రైమలుడు" శుల్కాధికారి
పదవి యందుండె - శంభుని బాల్యమందు
"మధుర" యందు కాపాడిన మహిసురుండు ॥ 1266

తే॥గీ॥ "రామ్సెజు"ను "త్రియంబకము" దుర్గములఁగలుపు
బిలము దారి నిర్మించిరి తొలుత నెవరొ!
యట్టి దారిని సరకులనన్ని చేర్చు
చుండు 'రామ్సెజు' నకు త్రైమలుండు నెపుడు ॥ 1267

రామ్సెజు దుర్గమును షాబుద్దీను ముట్టడించుట

సీ॥ రాణువను గొనుచు "రామ్సెజు" దరిజేరె
"షాబుదీను" దరహాసాస్యుడగుచు
గడము చుట్టును లోతు కందకములు త్రవ్వ
పరిజన బృందము స్తఱుముచుండె
ఇనుప, కొయ్య గడల నెత్తైన మంచెలు
నిల్పి శతఘ్నుల నెత్తైపైన
నింగెత్తు ప్రహరికి నిచ్చెనల్ మోటించి
జోదులెక్కుచు కోట జొఱగబంచె ॥

(అగ్రగుడు=వీరుడు; ఒప్పము=ఆజ్ఞ)

తే॥గీ॥ గడము చుట్టు నాశ్వికులును కాల్బలమ్ము
చేయు సవ్వడి దిగ్గజ శ్రేణి కపుడు
చెవుడు పాటును కల్పించి చెలగు చుండ
మొదలు పెట్టిరి కోల్తల మొగలు భటులు ॥ 1268

రామ్సెజు గడములోని మరాటా వీరుల వీరోచిత ప్రతి స్పందన

చ॥ బురుజులపైన "రామ్సెజు" చమూచరులశ్మము లేక ధాటిగా
కురియుచునుండ నిచ్చెనల కూచములూతగ పైకి బ్రాకు యా
తురకలపైన - పట్టువిడి తూలుచు వారలు నేలపై బడన్
స్థిరముగ నొక్కరుండయిన చేరగ జాలమి నయ్యెకోటపై ॥ 1269

చ॥ విడువక మల్క యోధతతి ప్రేల్చు శతఘ్నుల ఊతి గుండ్లు - పె
న్వడిగను కోట గోడలను భళ్ళున తాకుచునుండె గాని - యా
బెడిదపు తాకుకున్ సడలి ప్రీలుచు పెళ్ళయు రాలకుండె - యా
గడము పటిష్టతన్ కనుచు-కందెను మోము మొగల్చమూపుకున్॥ 1270

చ॥ బయలున కంటబడ్డ ప్రతి పల్లెయు, పట్నము కుడ్య రక్షణ
మ్మెయిదని వానిపై బడుచు నెల్ల గృహమ్ములు, దొడ్లు, వేల్పుటిం
డ్లయినను వీడకుండ ప్రతి తావును కూల్చగఁ, కాల్చ ఔప్పపా
టయినను చాలు కాల మటులౌనొకొ! "రామ్సెజు" కోట కూల్చుటల్॥ 1271

శా॥ ఆ "రామ్సెజ్" గడమానుకొంచు నొక రవ్వంతైన దూరమ్మునన్
వేరౌ గుట్టను చూచి దాని పయినువ్వెత్తైన మంచెన్ - శిలా
సార ప్రస్తర దారు నిర్మితములౌ స్తంభమ్ములన్, జన్పవౌ
చేరుల్ యాయస శృంఖలల్ బిగిగ ప్రశ్లేషింప నిర్మించుచున్॥ 1272

(భువనము=ఆకాశము) చేరు=త్రాడు; ప్రశ్లేషింప=గట్టిగా హత్తుకొను
(ఎయిదని=కలుగని; వేల్పుటిల్లు=కోవెల; తావు=ప్రదేశము) జన్ప='జనుము'వి
(శిలాసారము=ఇనుము; ప్రస్తరము=ఱాయి; దారు=కొయ్య)

శా॥ అంతెత్తౌ తమగంబుపైకిని శతఘ్న్యాళిన్తరల్పంగ తా
రెంతో పాటుకు నోర్చి చేర్చి రటకున్ రేయింబవళ్ళున్ కడున్
క్లాంతిన్ సైచుచు - తెల్లజాతి నిపుణుల్, తౌరుష్క్య శస్త్రజ్ఞులున్
చింతన్ బాసిరి, యందరున్గనుచు మంచెన్-గెల్పు కాంక్షించుచున్॥ 1273

"రామ్సేజు" కోటలో శతఘ్నుల సంఖ్య తక్కువ యని "ఆసుజీ" తెల్పుట

సీ॥ మంచెను మొదలిడ్డ మరులిప్త నుండియె
చూచె సూర్యాజి యా చొప్పునంత
"గోరఖు" గుట్టపై తోరమౌ మంచెను
పటుతరముగ కట్టు పగిదిగాంచి
తమకోటకును - వారి తమగమునకు దవ్వు
కొలుచుకొని బెడద కలుగునంచు
తన సవ్యబాహువే యనదగ్గ "యాసుజీ"
న్పిలిపించి యడిగిన వెసనతడనె ॥

ఆ॥వె॥ "మనకు పూర్ణముగను మందుగుండున్నది
దానికి సరిపడు శతఘ్నులసదు
తగిన సంఖ్యలో శతఘ్నులు కలవేని
యాదిలోనె వారి యాట కట్టు" ॥ 1274

ఆ॥వె॥ అనిన 'సూర్యజీ' యు తనచుట్టుఁజేరియు
"యాసుజీ"ని తనను నరయుచున్న
వీరవరుల నెల్ల వీక్షించుచును తాను
భావి పథక మెంచి పలికెనిట్లు ॥ 1275

(తమగము=మంచె; క్లాంతి=శ్రమ) వెసన్=వెంటనే
(అసదు=అల్పము)

"రామ్సేజు" కోటలో శతఘ్నుల సంఖ్య పెంచుటకు దారు శిల్పి ఉపాయము చెప్పుట

చ॥ "వినుచును నుంటిరీరలును - వీరుడు "నాసుజి" చెప్పుమాటలన్
క్షణమును నాలపింపనిక కార్యము కాదిట - చెప్పుడెవ్వడీ
మన యనలాస్త్రలోపమఖ మార్గము చూపగలండు "నన్న - గుం
పున యొక దారు శిల్పి తన వ్యూహము నిట్లని చెప్పె నేతతో॥ 1276

తే॥గీ॥ "ఇనుముతో శతఘ్నులు చేయు ననువు లేదు
దొడ్డ కొయ్య దుంగలు తెచ్చి తొలిచి నునుపు
చేసియు, శతఘ్ని నాళము వాసి గూర్చి
పెద్ద ఊతి గుండ్లను నింపి ప్రేల్చవచ్చు ॥ 1277

తే॥గీ॥ కొయ్య దుంగయే ప్రేలు చిక్కును కలదది
తొలగ, యినుపకట్లు బిగించి దుంగ చుట్టు
కట్టుదిట్టము చేయంగ మట్టుపడును
దుంగయే ప్రేలిపోయెడు దొసగు కొంత ॥ 1278

తే॥గీ॥ మందమగుతోలు తిత్తులన్మందు గూరి
కుట్టి వైచి - పెట్లుప్పును రెట్టి చేసి
యుంచి ప్రేలుడునకు నుపయోగ పెట్ట
దారు కాండ శతఘ్ని సత్త్వమ్ము తెలియు" ॥ 1279

చ॥ అనియెడు దారు శిల్పి వచనానుసరమ్ముగ లావు చెట్లనున్
మునుమును పెట్టి కూల్చి, కడుమోపగు కాండము లెంచి కొల్తలం
గొని తునియించి, తొల్చి 'సుషి' గుంద్రము, నున్నదనమ్ము కల్గియు
న్నినుప శతఘ్ని సాటియన నేర్పడ చేసెను త్వష్ట నేర్పునన్॥ 1280

(సుషి=రంధ్రము; త్వష్ట=వడ్రంగి)

రామ్సేజు దుర్గనేత "సూర్యాజి జడే" యుద్ధ సన్నాహము

సీ॥ దవ్వుగా గోరఖు ధరణీధరముపైన
కోటెత్తు పెరిగిన కురుజు చూచి
యక్కడ దివిటీల యరకొర కాంతిలో
కదలెడు నరుల వ్యగ్రతను గనుచు
తానును మోపైన దారు శతఘ్నుల
నీడ్పించి బురుజుల కెక్కఁజేసి
యేరండ తైలము భూరి భాండమ్ముల
నిండుగా తెప్పించి నిలువఁజేసి॥

తే॥గీ॥ యమ్ములకు గుడ్డలను చుట్టి యాముదమున
తడిపి యంటించి విడిచెడు తలపుతోడ
నటులె యున్ని కంబళ్ళ తుంటలను గూడ
తడిపి యనలాస్త్రములకు – సిద్ధమ్ముచేసె ॥ 1281

తే॥గీ॥ తరు శతఘ్నిని ముట్టించు దారి చూపె
త్వష్ట దంచన నాళ మధ్యమ్ము నందు
దాగలిని పెట్టి సుత్తితోఁ దాకినపుడు
నిప్పుకల్రేగి మందు నంటించునట్లు ॥ 1282

ఉ॥ "గోరఖు" గుట్టపై మొలచు కొప్పరపుంబని శేషమున్న దం
చారసి ముందుగానె యనలాస్త్రములన్ వడి గుప్పె "రామసెజ్"
వీరభటాళి – తక్షణమె పెక్కు స్థలమ్ముల రేగె మంటలా
వైరుల మంచెపై నపుడె వాఁదెఱచెన్ వడి కొయ్యదంచనల్ ॥1283

(కురుజు=మంచె)
(దంచన=శతఘ్ని; దాగలి=బిమ్మె)
(వాదెఱచు=నోరుతెఱచు; కొయ్యదంచన=దారుశతఘ్ని)

మొగలుల మంచె కూలి పోవుట

తే॥గీ॥ అటు శతఘ్నుల దెబ్బకు నిటు శిఖివి
శిఖపరంపరలకు మంచె శిఖర మందు
మంటలెసరేగి మొగలుల మందు గుండు
నంటుకొని ప్రేల, తమగము నవనిఁగూలె ॥ 1284

చ॥ మొదలిడు లోపలే ముగిసి పోయెను మోగలు దాడి డంబ - మా
పదలను చిక్కి రాపదను బాపగ వచ్చిన శ్వేత జాతి వా
రదవద చెంది యోధులు ఫిరంగి ప్రయోగ విధిజ్ఞు లెందరో
వదలిరి ప్రాణముల్ - మొగలు వారల పక్షము డిల్ల బోవగన్॥ 1285

రామ్సెజు కోటపై జరిగిన దుస్సంఘటనలో త్వష్ట మరణము

తే॥గీ॥ "రామ సెజు" కోటపైన బాధా మయమగు
సంఘటన జరిగె నొక దంచనము ప్రేలి
నూర్ల కొలదిగ కొయ్య తునుక లెగురగ
యా ప్రమాదమ్ములో త్వష్ట యసువులుడిగె॥ 1286

కం॥ ఆ దుర్ఘటనకు "సూర్యా
జీ" దురపిలె తమకు జయము చేకూర్చంగన్
పాదై నిల్చిన త్వష్టను
నా దారను కోలుపోవుటనునది వ్యథయై ॥ 1287

'షాబుద్దీన్' సైన్యమునకై వచ్చిన సామగ్రిని మరాటులు కొల్ల గొట్టుట

సీ॥ నాసికు నుండి నానావిధ సామగ్రి
"రామ్సెజు" నకును తరల్చు పూన్కి
"ఫైజులుఖాన్" "షరీఫ్ఖాను" "జహీరుఖా
ను" త్రయి పోవుచు నుండ్రి వడిగ

(దురపిలు=బాధపడు; దార=విధము)

యాహార ధాన్యము లందింప మరియొన్ని
సరకులు - షాబుదీన్ సైన్యమునకు
ద్విసహస్ర సంఖ్యాక వేశ్వరమ్ముల పయి
నెత్తించి ముందుకు నేగుచుండ ॥

తే॥గీ॥ యిఋకులోయనుఁజొఁటిన యా పరినిఁదాకె
"మోహితే నడుప మరాట మూక యపుడు
మొగలు భటుల కాపుగడను నగడు పరచి
కొల్ల గొట్టిరి సరకులు కొఱవ లేక ॥ 1288

కం॥ తరలించిరి యా సరకులు
త్వరితముగ త్ర్యంబకుగడి వారికి చేర్చన్
సరగున "కేశోత్రైమలు
డు", "రామ్సెజు"కు పంప బిలపు డొంకను వానిన్ ॥ 1289

ఆ॥వె॥ "షాబుదీను" యొకడె సాధింప లేడింక
"రామ్సెజు" గడమును బిరాన యనుచు
క్రచ్ఛఅనట కంపె "కాశిముఖానును"
"బాద్షా" - "షాబుదిను"కు బలము గూర్ప ॥ 1290

ఆ॥వె॥ అదియు చాల దంచు నంపెను "బహదూరు
ఖాను కోకలు తషు" కధిక మైన
యశ్వదళములిచ్చి - యతనిని దారిలో
యడ్డుకొనె మరాట యశ్వదళము ॥ 1291

ఆ॥వె॥ ఒక్క పూటలోనె యోడింతునని చెప్పి
శ్రామములు గడచియు 'షాబుదీను'
ఱాతి ముక్కనైన రాలగొట్టగ లేక
రామ్సెజుగడ మెదుట త్రస్నువయ్యె ॥ 1292

(వేశ్వరము= కంచరగాడిద; పరి=సైన్యము)

(డొంక=దారి)

(శ్రామములు=నెలలు; త్రస్నువు=పిఱికివాడు)

"బహదూరు కోకల్తాషు" రామ్సెజు గడమును జయింప క్రొత్త వ్యూహములు పన్నుట

మ॥ "బహదూర్కోకలుతాషు" కిప్పటికి 'శంభాజీ' గతమ్మందునే
వహి బుర్హాను పురమ్ము కొల్లగొనెనో ధ్వంసించెనో హట్టముల్
బృహదాయోగము పాడఱంగ – భటుల్రెబ్బెన్నవార్యుండునై
దహియించున్నెద విస్మరింపగ నసాధ్యమ్మౌచు నా యుద్ధతిన్॥ 1293

ఆ॥వె॥ అతడు వచ్చి కోట యానుపానులుఁజూచి
"దంచనమ్ములింత దౌలనుండ
ప్రేల్చుగుండ్లు యెటుల భేదించు గడమును?
ననుచు పన్నె వ్యూహమన్య మొకటి ॥ 1294

చ॥ గడముకు 'యామ్య'యందు తమగమ్మును వాంశిక మైన సారవల్
యెడనెడ పేర్చుచున్ బలవిహీనము గానట నేర్పరించుచున్
చిడిపి ఫిరంగులన్నిలుపఁజేయుచు శత్రులు చూచు నట్లుగా
గడమునకెక్కు యత్నమున గందర గోళము చేయుచుండగన్॥ 1295

ఆ॥వె॥ "కోకలుతషు"కచట గోచరుండయ్యెను
నీళ్ళ తిత్తులు గొని నిండు వృద్ధు
తారు చుండ నెవడితండని యడుగగ
దిక్కులేని యొక్క దీనుడనిరి ॥ 1296

ఉ॥ శామని దిక్కునందరులు చాల హడావుడి చేయుచుండగా
తామును సిద్ధమే యనుచు దక్షిణ దిక్కుకు చేరెనంత యా
"రామసెజం"దు 'సూర్యజడె' రాణువ యంతయు వైరి నెద్రువ
న్నామెయి పోరుచుండ రవి యస్తమితుండయి, యిర్లు గ్రమ్మగన్॥ 1297

(హట్టము=పణ్యవీధి; ఆయోగము=వాణిజ్యము; రెబ్బ=చంపు)

(యామ్య=దక్షిణము; వాంశికము=వెదురుకు సంబంధించిన; సారవలు= గడలు; చిడిపి=చిన్న)

(తారు=తిరుగు) (శామని=దక్షిణము; రాణువ=సైన్యము; విద్రుచు=ఎదిరించు; ఇర్లు=చీకట్లు)

ఉ॥ ఉత్తర దిక్కునందెదియె యుల్వు వినంబడి, గుట్ట క్రింద జా
గ్రత్తగ నెవ్వరో పయికి ప్రాకుచు వచ్చెడి సవ్వడైన - యా
దత్తుకు నప్రమత్తులయి దందడికాయితమై మరాటులున్
కత్తులు, బాణముల్ గొనుచు కాచిరి దారిని వైరినడ్డగన్ ॥ 1298

ఆ॥వె॥ దక్షిణ దిశయందు దాడికి సిద్ధమౌ
విధము దోప మంచె వేసి యచట
"రామ్సెజు" భట తతిని రావించి యచటికి
ఉత్తర దిశ దాడి కొగ్గి రరులు ॥ 1299

ఆ॥వె॥ "కోకలుతషు" వేయు కుటిలంపు టెత్తును
యచట తిరుగు ముసలి యంబుహరుడు
నట మరాటు లుంచినట్టి గుప్త చరుడు
చేరవేసె సూర్యజీ చెవికిని 1300

ఆ॥వె॥ "కోకలుతషు" నకును గోచరుండైనట్టి
ముసలి మరల యచట మసలకునికి
ఆతడడిగె వృద్ధుడైపు లేడే మని
యెటకొ పోయెననిరి యెల్లవారు ॥ 1301

సీ॥ "కోకలు తాష్" చూచె కుంజరములు నీడ్వ
దారు ఖండములను తమగము కయి
గజయూథములు గండు 'గజనాళ్' ఫిరంగులు
వెన్నుపై మోయుచు వెడలు చుండ
స్థూలిగణములట్లె "షోతురు నాళులన్"
దంచనల్ మూపులఁ దాల్చి సాగ
గణనకు మీరిన కంబళుల్ కక్షముల్
వాలుక, ఛుర, ఊల బండ్లులాగ ॥

(ఉల్వు=సవ్వడి; దత్తు=విధానము; దందడి=యుద్ధము)
(అంబుహరుడు=నీళ్ళు మోయువాడు) షోతురు=ఒంటె (ఫార్సీ భాష)
వాలుక=ఇసుక; ఛుర=సున్నము

తే॥గీ॥ మంచె కెత్తించు పనులలో మగ్నులగుచు
పరుగు లెత్తుచు నుండగ భటగణమ్ము
"కోల్కతాష"ది చూచి, 'యా కోట కంత
దవ్వుగా తమగములు వృథా' యనియెను ॥ 1302

ఉ॥ ఉత్తర దిక్కు దాడి కతి యోలముతోఁజను మ్లేచ్ఛ సేనపై
మిత్తివలెన్మరాట బరి మీదికి దూకగ నివ్వెఱన్ భటుల్
కృత్త శిరోధులై పడిరి కిమ్మనకన్ – హత శేషులెందరో
నెత్తులు తాకి చూచుకొని 'నిల్చెను ప్రాణము'లంచు పారగన్॥ 1303

సీ॥ ఏ గడము నయిన లోగొనగా ముందు
మూడు దార్లు గలుగు ముఖ్యముగను
గణనీయ సంఖ్యలో కాల్బలమును గొని
దూకుడుగా కోటఁ దూరు టొకటి
చాలునన్నంత లంచముగొని దుర్గప
తియె బోరుతలుపులు తెఱచు టొకటి
దండి ముట్టడివల్ల తిండి తీర్థము లేది
కోటలో ప్రజ గోడుఁ గుడుచు టొకటి ॥

తే॥గీ॥ యట్టి మూడు యీ గడి యెడ వ్యర్థమయ్యె
వారి కాహారమే విధి చేరుచుండె
నో యెఱుంగ లేకుంటి మీ మాయయేమొ?
వత్సరము దాటె యని సేయ వచ్చి యిటకు॥ 1304

తే॥గీ॥ త్ర్యంబకు గడము నుండి సురంగ మార్గ
ముండె "రామ్సెజు"నకు, దాని మూలము గను
నన్ని సరకులు గుట్టుగా నందు చుండె
నని యెఱిగి "కోకలుతష" నసువు జూచి ॥ 1305

(స్థాలి=ఒంటె; కంబళి=ఎద్దు; కక్షము=దున్న)
(ఓలము=గుట్టు; కృత్త శిరోధులు=తెగిన కంఠములు గలవారు)

తే॥గీ॥ "రామ్సెజు", "త్రియంబ"కు 'పురా'లను వలగొని
కావలిని యుంచె విడక - భూగర్భ మార్గ
ముల సవిధమున దండి యోధులను నిల్పె
"రామ్సెజు"నకు యిబ్బందు లారంభమయ్యె ॥ 1306

కం॥ ఇటు లుండ నొక్క రేయ
చ్చట పెనువర్షణము గురిసి - సాంద్ర తరమ్మౌ
పటు నీహారతిమిరమల
ముటచే రవ దవ్వు గూడ పొడగట్టమిగాన్ ॥ 1307

తే॥గీ॥ అదియె యవకాశముగ మరాట దణులచట
మృత భట, పశుకళేబర తతిని పేర్చి
దరి కొలుప - రేగు పూతి గంధమును పీల్చ
లేక మొగలు సేన యవతలికి జనియెను ॥ 1308

తే॥గీ॥ దాని గమనించి 'త్ర్యంబకు' స్థలమునుండి
వస్తు సామగ్రి యదనపు పరియు వచ్చి
చేరె రామ్సెజు, శంభాజి చెప్పగానె
రేపకడ మల్క లెటిగిరీ రీతి నంత ॥ 1309

తే॥గీ॥ అంతటట మొగల్దణులు కూడి యా పయినిక
"యెట్టి వ్యూహములల్లి జయింప వచ్చు
కోటనిపుడని చర్చించు కొనుచు నుండ
భటుడొకడు చెప్పె తమ 'యశ్వపాలు' గూర్చి ॥ 1310

(పురా= కోట; వలగొని=చుట్టి, సవిధము=సమీపము)
(వర్షణము=వాన) (పొడగట్టు=కనుపించు)
(దరికొలుపు=కాల్చు)
(పరి=సేన; రేపకడ=తెల్లవారి)

రామ్సేజు కోట గెలుచుటకై యొక తాంత్రికుడైన యశ్వపాలుని వ్యూహము మొగలు సేనా పతులు అనుసరించుట

ఆ॥వె॥ "అశ్వపాలుడెటుల ననుభవ పరులైన
దణుల కనిని గెలుచు దారి చూపు?
వ్యూహములను గూర్చి యూహ చెప్పుటయేమి?
వింతయయ్యె యతని పిలువు" మనిరి ॥ 1311

తే॥గీ॥ 'సైసు' వచ్చె – చూడ నడి వయస్సు వాడు
జఘనముందాకు కేశ పాశమ్ము వాడు
దడను పుట్టించు రక్త నేత్రముల వాడు
ఉత్తర ప్రాగ్దిశావని నుండు వాడు ॥ 1312

ఆ॥వె॥ తన యెదుటి మనిషిని కనడు సూటిగ వాడు
కనులతో కనులను కలియ నీడు
దేనినో దవులను దృశియించి మాట్లాడు
యతని తీరు చూడ యరిది పోక ॥ 1313

ఆ॥వె॥ తనదు శక్తి యుక్తులను గూర్చి దణులకు
వినయమొప్ప 'సైసు" మనవి జేయ
వాని పల్కులు విని వక్త్రముల్ తెఱచుచు
వెఱగు పడిరి మొగలు వీరులెల్ల ॥ 1314

కం॥ "నరుల నదృశ్యులఁ జేసెద
నరులను మృగములుగఁ జేయు నైపుణి గలదో
నరవర! బెరసు మెకముల నొ
కరేయిలో సాదు పసులుగా నొనరింతున్ ॥ 1315

(ఉత్తరప్రాగ్దిశ=ఈశాన్య ప్రాంతము)
(అరిదిపోక=అపురూపమగు పోకడ)
(బెరసు మెకములు=క్రూరమృగములు)

కం॥ మా పూర్వీకులు కొందరు
మా పల్లె "మయోంగు" దరిని – 'మహ్మద్‌షా' భూ
మీపతి లక్షపరిని ప
టా పంచెము చేసిరంట తక్కున తృటిలో" ॥ 1316

ఆ॥వె॥ అనుడు 'సైసు' గొప్పతనమున కెంతయు
నరుస మొంది మొగలు నరసులపుడు
వాని వలన తమకు వలసిన పని యేమొ
తెలియ చెప్పదొడగి రెలమితోడ ॥ 1317

సీ॥ "నీవు చెప్పినదెల్ల నిక్కమె గావచ్చు
నశ్వపాల! యిపుడే మనెదు? మేము
నీ కోటను జయింప యేడాదికిని పైన
పోరుచుంటిమి – గెల్పు దూరమయ్యె
యీ సమస్యకు నీవు యే పరిష్కారము
చూపగలవొ చెప్పు – చోద్యమైన
గారడీ విద్యల గండర గండవు
వెఱగు పుట్టించు నీ విద్య తెఱగు ॥ 1318

ఆ॥వె॥ ననిన 'సైసు' నపుడు వినత మస్తకుడయి
"యవధరింపుడయ్య – యరులు లొంగి
రాగ నేను" స్వర్ణ నాగ ప్రయోగము"
చేసి మీదు రిపుల 'శ్రీ' హరింతు" ॥ 1319

తే॥గీ॥ నూఱు తులముల బరువున్న నూత్న మైన
'పడగ విప్పి బుసను గొట్టు" పగిది నుండు
రూపము ఘటించి బంగారు పాపపుర్వు
ప్రతిమ చేయించి రజత పాత్రమున తెండు" ॥ 1320

తే॥గీ॥ అనిన యప్పటి కప్డు హేమాభరణము
లెన్నొ తెప్పించి కరిగించి లేలిహాన

(పరి=సైన్యము; పటాపంచెము=అదృశ్యము)
(అరుసము=సంతోషము; అరసులు=నాయకులు; ఎలమి=ఆదరము)

ప్రతిమ 'బుస్సని లేచెడు' భంగిమొలయ
పోత పోయించి రత డిడ్డ మూసలోన ॥ 1321

ఆ॥వె॥ మందడీడు యేవొ మంత్రముల్ చదువుచు
రూప్యపాత్ర యందు రుక్మఫణిని
యుంచి పట్టెదేసి "యుమ" చెందిరము"లను
నహిప్రతిమకు నింద నలదెనపుడు॥ 1322

మ॥ ఒక బ్రహ్మాస్త్రము చేత చిక్కినటులెంతో మోదముప్పొంగగన్
"ఇక" మాదే యగు "రామ్సెజం"చు-నిట మేమిన్నాళ్ళు యెంతో నిరా
శకులోనైతిమి కోట లొంగనిదియై సంవత్సరమ్మైన - నే
టికి మాపాటు ఫలించు మూర్తమది కిట్టెన్ మాకు గెల్పందిడన్॥ 1323

ఆ॥వె॥ అనుచు మొగలు దణులు నానందముప్పొంగ
బలము లెల్ల నశ్వపాలు వెనుక
నాయితమ్మగుచును నాక్రమింపగ కోట
యాజ్ఞ లిడిరి సేన లన్నిటికిని ॥ 1324

సీ॥ రెండు చేతులతోడ వెండి పళ్ళెరమును
వహియించి స్వర్ణాహి ప్రతిమతోడ
తనకె సొంతమ్మైన మనువులం జదువుచు
పిఱుదులు దాటు పెన్నెఱులు వ్రేల
రవి బింబమును మించు ప్రభలను చిందించు
నుదుటి కుంకుమ బొట్టు బెదర గొట్ట
భీకరాకృతి సాగ - వెనుక మొగల్వరి
కేరింతలన్గొట్టి క్రేళ్ళు దాట ॥

(లేలిహానము=పాము)

(మందడీడు=అశ్వపాలుడు; రూప్యము=వెండి; రుక్మ=బంగారము; ఉమ=పసుపు; చెందిరము= కుంకుమ)

(కిట్టెన్=సమీపించెను)

తే॥గీ॥ ద్రుక్కక భటులు కోట మెట్లెక్కుచుండ
ముందు వరుసను నున్న యా 'మందడీని'
కని మరాటులు నివ్వెఱగంది యపుడు
వెసను శాత శరము లెక్కుపెట్టి రచట ॥ 1325

అశ్వపాలుని తంత్ర ప్రయోగము విఫలమగుట మొగలుల ఓటమి

చ॥ వడిసెల రాలతోడ శితబాణ పరంపరతోడ స్వాగత
మ్మిడుచు మరాట సేన తమకెంతయు గౌరవ మొప్పు - కోటపై
నడుముకొనంగ - వారల ననాదరముంబొనరించి యశ్వపా
లుడు నడుగేసె ముందునకు, రువ్వుచు మంత్రములంత రివ్వనన్॥ 1326

తే॥గీ॥ వాడి వడిసెల రాయొండు వడిగ వచ్చి
యశ్వపాలుని ఫాలమ్ము నప్పళించె
దబ్బునంగూలె క్రింద కందకమునందు
తక్షణమె వానికి కపాల మోక్షమయ్యె ॥ 1327

చ॥ కురిసెను నంపవాన, కడుకూచిగ నుండెడు రాలవాన - క
ర్బురఫణి రౌప్య భాజనము పోయిపడెన్ భువి కర్దమమ్ములో
జరిగెడి దేమిటో తెలియజాలక చట్టున గొట్టు పోకలై
దొరికిన దారి బట్టుకొని దొందడి పాఱెను సేన లన్నియున్ ॥ 1328

రామ్సెజు గడము అజేయముగా నిలబడుట

చ॥ మొగలు దణాయలింక తమ మోములనెత్తి జనాళి కంటికి
న్నగపడు ధైర్యమేది తదనంతర యుద్ధమమాపి వైచుచున్
మిగిలిన కోటలన్ గొనగ మెల్లన నక్కడ నుండి నిష్క్రమిం
పగ నట "రామసెజ్" గడము వైరి భయంకరమౌచు రాజిలెన్॥ 1329

మందడీడు=అశ్వపాలుడు (మనువులు=మంత్రములు)
(నడుముకొను =సిద్ధపడు)
(అంపవాన=బాణవర్షము; కర్బురఫణి=బంగారుపాము; రౌప్య భాజనము = వెండి పళ్ళెము; చట్టు=రాయి; దొందడి=శీఘ్రముగ; కర్దమము=బురద)

దుర్గనేత సూర్జాజీ జడే దుర్జయుడై నిలబడుట

చ॥ చిన్నది కోట - యల్పమగు సేన - హమాదిక సర్వవస్తు సం
పన్నత చాలకొద్ది - రిపు వాహిని దీర్ఘమునైన ముట్టడిన్
పన్నిన తట్టుకోగలుగు బల్మియు లేశము - దుర్గ రక్షయం
దిన్ని భరించి గెల్చు రణధీరుడు "సూర్యాజి" గాక యెవ్వడొ॥ 1330

రామ్సెజ్ కోట యుద్ధ వీరులకు శంభాజి యందించిన సత్కారము

తే॥గీ॥ శంభు మెచ్చి 'సూర్యాజి'కి స్వర్ణ కంక
ణములు, మేలి వస్త్రములు, యనంత ధనము
కాన్కగా నంపె - 'కేశు'ను గారవించె
నట్టె - యెల్ల సైనికులకు 'బట్టి'లిచ్చె ॥ 1331

'ఛత్రపతి మహావీర శంభాజీ' మైసూరు యుద్ధము

ఉ॥ శంభు పితామహుండు నగు 'షాహజి', యాదిలుషాకు-తానయో
స్తంభము వోలె నిల్చి ప్రభుతన్ బలియింపగ కన్నడక్షితిన్
జృంభితుడై రణమ్ముల విజేతగ నిల్చెను - యాదిలుండు ము
త్సంభరితుండునై యొసగె, షాజికి జాగిరు 'బెంగుళూరినిన్॥ 1332

ఉ॥ అప్పటి నుండి కన్నడము నందు మరాఠుల యాధిపత్యమే
యొప్పుచునుండె - శ్రీ శివజియున్ చని కన్నడ దేశ యాత్రకు
న్నొప్పము సుస్థిరమ్ముగను నుండగ జేసెను - నట్లు కన్నడం
బెప్పుడునున్ మరాటులదె యేల్బడియై మనియెన్ 'తుషాగ్ని'గా॥ 1333

ఉ॥ కాలము మారిపోవగను - "కన్నడ నేలను, స్థానిక క్షమా
పాలురశిష్టి సాగుట కవగ్రహమేల? మరాట భూపులే
పాలన నేల సేయవలె? భావ్యము కాద"ని స్వేచ్ఛగోరి యా
నేల దొరల్ మరాటుల గణింప మటంచు తిరస్కరింపగన్॥ 1334

(హము=ఆయుధము) (ఒప్పము=అధికారము; తుషాగ్ని=వరి పొట్టులో నిప్పు) (శిష్టి=శాసనము; అవగ్రహము=ఆటంకము) బట్టి=కానుక

తొలిసారి మైసూరి వారితో యుద్ధములో మరాటుల యోటమి

తే॥గీ॥ తొలిగ నొకపరి జింజిపై గెలుపు నొంది
మరలి వచ్చుచు మారాట పరి తలంచె
నడుమ మైసూరిపై దండు నడుప - పోరు
జరిగె నొక ప్రొద్దు దినకరాస్తమ్ము వరకు ॥ 1335

ఉ॥ ఆ రజనీ ముఖమ్మున శ్రమాపనయమ్మునకై ప్రదేశము
న్నారయుచున్మరాట పరి యల్లన బోవగ - వృక్ష శాఖలన్
దూరిన శత్రు సైనికులు దూకి హఠాత్తుగ శాతలోహ శ
స్త్రారము లూచి చెక్కిరి మరాటుల నాసలు మూతులుమ్మడిన్॥ 1336

ఉ॥ వందలమంది సైనికుల వాగ్దల ఘోణములట్లు పోవగా
క్రందు కొనంగ నెత్తురు మరాటుల కాయము నిండ యూహకే
నందని యట్టి వింత వికటా చరణమ్మును చూచి దిగ్భ్రమన్
చెందుచు, భంగపాటు నత శీర్షుల చేయగ చేరి రిండ్లకున్॥ 1337

తే॥గీ॥ తెగిన ముక్కులు, మూతులు తిట్ట చేసి
గోనె సంచులలో వేసి కొనుచు పోయి
రా వెకిలి కన్నడ భటు - లీ రాశి వాసి
గని బహూకరింత్రేమొ? వెంగలి ప్రభువులు॥ 1338

తే॥గీ॥ నాట నుండి ప్రాభవము కర్ణాట మందు
స్థానిక ప్రభులదయ్యె - రాజ్యాశతోడ
నెపుడు మారాటు లట్లు దండెత్త లేదు
సాక్షికముగనట మరాట ప్రభుత గలదు ॥ 1339

(శ్రమాపనయము=సేద దీరుట; శాతలోహశస్త్రారములు=మిక్కిలి వాడి యైన ఆయుధముల యంచులు; రజనీముఖము=ముని మాపు)

(వాగ్దలము=పెదవి; ఘోణము=ముక్కు; క్రందుకొను=నిండు)

(తిట్ట=ప్రోవు; వెంగలి=వెకిలి)

సీ॥ శ్రీరంగ పట్నమ్ము చే కొన గానెంచి
దండెత్త మారాట దళము రాగ
ధీరవరుడు చిక్క దేవరాయలు వారి
నెదురు కొనఁ బరి నాయితము చేసి
వీరోచితమ్ముగా పోరును సాగింప
మారాటులకు బలమఱియె వేగ
మైసూరు విలుకాండ్రు మహితులౌ గుఱికాండ్రు
వారి ధాటికి నిల్వ వలనుగాక ॥

తే॥గీ॥ యోటమిని తలదాల్చి మరాటు లపుడు
వేగ వెనుకకు మరలిరి విఫలురగుచు
నొక్క 'హరిరాజె' యోడించె, యుగ్ర కదన
మందు - మైసూరు దణిని "కుమారయ" నట॥ ॥ 1340

తే॥గీ॥ "శంభుజీ" రాజు చిన్నక్క "యంబికాంబ"
భర్త "హరజి మహాదికా" ప్రాంతమందు
నొక సుబేదారుగా నుండె - నుర్విపతియె
గాక 'శ్వశురుడౌ శివప్రభు' కనుగుడగుచు ॥ 1341

ఔరంగజేబు దక్షిణ దేశ ప్రవేశము

తే॥గీ॥ ఐదు లక్షల సేనతో యామ్యధరణి
కరుగు దెంచె 'నౌరంగజేబ'రివిభేది
యందరుర్వీపతులు తన యాజ్ఞకొగ్గి
యప్పనము లిచ్చు సామంతులగుట కొఱకు ॥ 1342

తే॥గీ॥ చుట్టుముట్టెను మారాట దొట్టి 'బీజ
పూరు' 'గోల్కొండ' లాదిగా భూమి నంత
యూపిరాడ నీయక కమ్మి యూపివైచె
నన్ని రాజ్యాల యేలిక లగడు పడగ ॥ 1343

(అప్పనములు=కప్పములు)

ఔరంగజేబు దురాక్రమణతో మరాట రాజ్యమునకు శుల్కములు తగ్గిపోవుట

ఉ॥ ఎప్పుడు సంగరమ్ములగు టెల్ల ధనమ్మును వెచ్చమై చన
న్నప్పనముల్ లభించు ధరనంతయు మోగలు లాక్రమింపగా
గుప్పెడు చిల్లి గవ్వలును కోశము చేరెడు దారి లేదు - యీ
ముప్పుదొలంచ కన్నడము భూమియె నొప్పగు నంచు శంభుజీ॥ 1344

చ॥ బవరము చేయబూని - "మును బన్వరుపై చని పోరగా వలెన్
అవతల తంజ పట్టణము నందు పితృవ్యసుతుండు యేకజీ
సవరణ చేయగా గలడు సంకటముల్ యొకవేళ కల్గుచో
మివుల ధనమ్ములన్ గొనితిమేని జయమ్ము తలాక్షజమ్మగున్ ॥ 1345

మ॥ అనుచున్ 'శంభుజి' సిద్ధమయ్యె దశ సాహస్రాంక సైన్యమ్ముతో
మొనకుంబోవగ, 'తిర్చురాపలి' పురమ్మున్" కొల్ల గొట్టన్ వలెన్
చనుచు న్మందర - "బన్వరు న్గొనగనౌ" సంగ్రామమచ్చోటనే
యను వౌనంచును సాగె "బన్వరు"ను డాయన్ బావతో గూడియున్॥ 1346

తే॥గీ॥ కలరు, జ్యోత్యాజి, రాయప్ప - కనుల ఱెప్ప
లట్లు శంభాజి నప్పస మంటి యుండ
బావ 'హరిరాజె' చేరెను బలముతోడ
గోలు కొండ దళము పదివేలు గూడె ॥ 1347

కం॥ హుక్కేరి నాయకుండగు
నుక్కలుడు బసప్ప నాయడొగి, నరపది వే
లుక్కుతునుకలట్టి భటుల
పెక్కువతో వచ్చి శంభు పృతన జతయ్యెన్ ॥ 1348

(తలము=అణచేయి; అక్షజము=వజ్రము) పెక్కువ=సమూహము, పృతన=సేన; (అరపది=ఐదు; హరిరాజే=శంభాజీ చిన్న అక్క భర్త)

తొలుత శంభాజీ ఔరంగజేబుతో పోరాడుటకు కర్ణాటకనృపుని సఖ్యము కోరుట

మ॥ తొలుత న్శంభుజి - దక్కనున్ గొనగ నుత్తుంగాబ్ధి భంగంబుల
ట్లలవిన్మీరు మహాప్రవాహమగుచున్ వ్యాపించు మోగల్పరిన్
నిలుప న్నొక్క సమాఖ్యగా కలుపగా నెంచె "న్బిజాపూరు" మం
డల "కర్ణాటక" "గోలుకొండ" నృపులన్, భంగింపగా పాదుషన్॥ 1349

శంభాజీ సఖ్య ప్రతిపాదనము కర్ణాటక పభువు నిరాకరించుట

సీ॥ స్నేహ భావమ్ముతో చికదేవరాయల
కడకంపె ప్రణిధులఁ గారవమున
యాతడంతకు ముందె యౌరంగజేబుతో
ముక్కు బంటిగ స్నేహమున మునింగి
ప్రణిధి ముఖ్యుండైన కృష్ణాజి కన్హరే
కతి ఘోరముగ నవనతినొనర్చె
"కాకడే దాదాజి" "కత్కరుజైతాజి"
"సంతాజి నింబాల్కరం" తవారి

తే॥గీ॥ వీర దణులను నిర్దయన్బారి సమరె
"యవడు శంభాజి? వాని పేరెత్తవలదు"
యనుచు దుర్భాషలాడె సభాంతరమున
ప్రణిధి యంగరఖాఁ "బదాబదలు" చేసె ॥ 1350

చ॥ అదివిని శంభుజీ కనులు నగ్గిని చిమ్మగ యిట్టులాడె - "సౌ
హృదమును గోరి యంపి తిటు లేనును విజ్ఞుల రాయబారుల
న్నిదివరకెట్టి పొచ్చెములు నేమియు నున్నను నావలుంచి, య
భ్యుదయము గోరి దక్కనుకు-హూతినొనర్చితి మమ్ముఁ జేరగన్॥ 1351

(భంగించు=ఎదుర్కొను) (ప్రణిధులు=రాయబారులు; అవనతి=అవమానము; బారిసమరు= చంపి వేయు; అంగరఖా=చొక్కా)

(సహృదయ=స్నేహము; హూతి=ఆహ్వానము)

ఉ॥ కోరిన నాదు కోర్కె తన కొప్పమి యైనను నాకు సమ్మతం
బీరహి రాయబారులను హీనముగా పరిభూతి సేయగా
వీటిడి యంచు గాక యొక విజ్ఞుడటంచును లోకు లెంతురే?
క్రూరుడు పాదుషాకు భృతకుండగు వీనికి బైసి యున్నదే? ॥1352

ఉ॥ ఐనను మంచికే జరిగె నంతయు - కోశము వట్టి పోయె -యీ
హీనుని యోడగొట్టి ధనమెట్లయినన్ గ్రహియింపగా వలెన్
పైనముకందు సేనలిక వైళము కన్నడ భూమికేగ - నా
కానయహీనుడిట్టి యవకాశము తానె యొసంగె స్వేచ్ఛమై"॥ 1353

తే॥గీ॥ సతి 'యశూబాయి', తక్కిన సచివులపుడు
"మొగలు పాదుష వాకిలి ముందె విడిసె
యీ పరిస్థితిలో నీవు నెడగ వెడల
రాజ్య భద్రతెట్లని యధైర్యమును చూప ॥ 1354

తే॥గీ॥ సతిని, మంత్రులఁ నెసగొల్పి శంభు చెప్పె
'రాణిగా 'యశస్విని' నేమరలియు వచ్చు
నంతవరకు రాజ్య వ్యవహారసర్వ
మరయు చుండును మీ సహాయమున' ననుచు ॥ 1355

వీర శంభాజీ 'బనవరు'ను ముట్టడించుట

చ॥ బనవరు చేరె శంభు పరి - పంపెను 'మాదన' 'గోలుకొండ' వా
హినిఁ బదివేలు - హుక్కెర మహీపతి 'బస్వప నాయకుండు" తా
ను నయిదు వేల సాహిణమునున్గొని వచ్చెను - ముందె యున్న శం
భుని పదివేల సైన్యమును మొత్తము పాతిక వేల సేనతో ॥ 1356

చ॥ బనవరు చేరె శంభుడను వార్తను వేగులు తెల్ప నుగ్రుడై
యనియెను చిక్కదేవపతి - "ఆ! మన బన్వరు శంభు చేరెనా"?
వనములఁ గొండ లన్తిరుగు వాడిట వచ్చిన దాక తెల్పరా?
మన చరు లేమియైరి?" యని మండిపడెన్ తన వేగు వారిపై ॥ 1357

(ఒప్పదు=అసమ్మతి; పరిభుతి=అవమానము; వీటిడి=అవివేకి; భృతకుడు= సేవకుడు; బైసి=పరువు)(సాహిణము=సైన్యము) (చరులు=వేగులు) ఎసగొల్పు=ప్రోత్సహించు

ఆ॥వె॥ మంచి శిక్షణ గల మైసూరు సేనలు
శస్త్ర విద్యలందు చతురులగుటె
కాక - సంఖ్యయందు మీకు నెక్కువయని
శంభునకు తెలిపె బసప్ప నీడు॥ 1358

చికదేవరాయలు మరాటులకు ధానుష్కసేన లేదని గ్రహించి అర్ధవృత్త వ్యూహము పన్నుట

చ॥ కనియె మరాటు లందు విలు కాండ్రురు లేరను లోటు - నందుకే
తనకనుకూలమౌ వహిని దండడికిన్ దిగ నర్ధవృత్తపున్
మొనను ఘటించె కన్నడ ప్రభుండు - మరాటుల యశ్వ సేన తా
ర్కొనె-చికదేవరాయని వరూధినిలోని ధనుర్ధరావళిన్ ॥ 1359

చ॥ కురిసెడు నంప వానకును కొండల మందుచు నిల్వ కష్టమై
పరిసె మరాట సేన - యొక బాణము శంభుజి సవ్య బాహువున్
మెఱిమెను - డాళ్ళు, గుఱ్ఱముల మేనుల చాటున దాగి సైనికుల్
దురమునొనర్ప బూనినను-తోరపుటమ్ములు చీరె నందరిన్॥ 1360

చ॥ ఇక యని కాదటంచు దిటవేది మరాటుల సేన లంత వె
న్కకు నొదిగెన్ - క్షతాంగులను గారవమారగ చూచి వారి పూ
నిక సడలంగబోని తగు నేరుపు మాటల గుస్తరించి వా
రికి తగు వైద్య సేవలమరించుచునుండెను శంభు డత్తఱిన్ ॥ 1361

ఉ॥ 'రే'యగుటన్ భటాళి, గికురింపగ శత్రుల, దివ్వటీల వె
ల్గాయెడ చూపుచున్ - యవనికై తమ మెల్లెడఁగప్పివేయ తా
మా"యని" నేల వీడి యెడమై చనుచుండిరి తంజవూరికిన్
పోయెడురీతి, కొంత తడవున్నటు సాగుచు, నిల్చి రచ్చటన్॥ 1362

(నీడు=నాయకుడు)
(తార్కొను=ఎదిరించు; వరూధిని=సేన)
(పరియు=చెదరు; మెఱుము=గ్రుచ్చుకొను)
(దిటవేది=ధైర్యము నశించి; పూనిక=పట్టుదల; కుస్తరించు=ఓదార్చు)
(యవనిక=తెర; తమము=చీకటి; అని=యుద్ధము)

ఆ॥వె॥ ఏను వేల సేన 'యేకోజి' కొనివచ్చె
శంభుని పిన తండ్రి స్వజుడె యతడు
నన్నతోడ యెంతొ యాదరముగ శంభు
రాత్రి యంత మాటలాడు చుండె ॥ 1363

ఆ॥వె॥ "తంజవూరు రమ్ము, తమ్ముడా! యచ్చోట
నిలుము సేనతోడ యలుపు దీర
భావిమోహరముల బాగోగులను గూర్చి
చర్చచేసి పిదప సాగవచ్చు" ॥ 1364

ఆ॥వె॥ "చిన్న మనిషి కాదు చిక దేవరాయలు
మొగలు భర్తకతడు మోకరిల్లి
వారి యండతోడ యేరిని లెక్కింప
కతడు కన్నడపు నియంతయయ్యె ॥ 1365

చ॥ ఇపుడిట పోరు మానుకొని యింకొక మారనుకూల వేళలో
రిపులను చెండ వచ్చు"నుచు ప్రేమగ యన్న వచింప శంభుజీ
త్రపితయునై వచించె "కడు దవ్వుగ వచ్చితి మాహవమ్ముకున్
రిపులకు నోడి పార నగరే ప్రజ పందలటంచు నన్నయా!॥ 1366

ఆ॥వె॥ చావొ? రేవొ? తేలగా వలె 'యని' లోన
దేవరాయ లేమి దేవుడగునె?
వానిడొక్క చీల్చి వాయింపకయె డోలు
తప్పుకొనుట క్షాత్ర ధర్మమగునె"! ॥ 1367

చ॥ అని బదులాడె యన్నకపు డందరు వెళ్ళిరి తంజవూరికిన్
మునుమున వచ్చు ఘోర రణముల్ యొనరించి జయమ్ము గొంటకై
యనువగు వ్యూహముల్ గుఱిచి యందరు గాఢ సుదీర్ఘ చర్చలన్
మునుగుచు-తేల్చి రా సభను-మున్గిలుబాడగ "తిర్చురాపలిన్"॥ 1368

(స్వజుడు=కొడుకు) (త్రపిత=లజ్జాళువు) (అని=యుద్ధము)
(మున్=ముందుగా; గిలుబాడు=కొల్లగొట్టు)

తే॥గీ॥ శంభు సైన్యము కావేరి శామనితట
మందు విడిసె - నుత్తరతట మందు "తిరుచి
రాపలి" పుట భేదము గోచర మగుచుండె
నూరి మధ్య శిలా దుర్గ మొకటి యుండె ॥ 1369

ఛత్రపతి శంభాజీ తిరుచిరాపల్లి ముట్టడి

తే॥గీ॥ ఈశనముతావు - దక్షిణ దేశ 'మధుర'
తదధిపతి చొక్క నాథుడు నతగుడగుట
చిక్క దేవరాయల చేత చిక్కె మధుర
చొక్క నాథునకు "తిరుచి" యిక్కయయ్యె ॥ 1370

తే॥గీ॥ మధుర చుట్టు ప్రక్కలగల పృధివి కొంత
'శంభు' అన్న 'యేకోజి' వశమున నుండ
'శంభు' బావ 'హర్జి' పరిశేషమును గొనెను
నిట్లు మధుర చుట్టు మరాట యేల్బడుండె॥ 1371

తే॥గీ॥ 'తిరుచిరాపల్లి' కోటలో దేవరాయ
సేన గలదల్పమయ్యు దుర్జేయ మద్ది
"తిరుచిరాపలి" యూరిని తిరిగి వచ్చు
నట్టి గట్టి గోడల రక్షణమ్ము గలదు॥ 1372

విలుకాండ్ర ధాటికోర్చుటకు శంభాజీ పన్నిన వ్యూహము

ఉ॥ కన్నడ మూక యందు విలుకాండ్రురనైపుణి ధాటి నెద్రి - యా
పన్నులునైన యాత్మ భట వర్గపు రక్షణ నెంచి శంభుజీ
సన్నహనమ్మొనర్చె శర సంహతి ఘాతల నాగునట్టి వౌ
ప్రన్నని చర్మ వర్మములు పన్నగ వందల వేల సంఖ్యలో ॥ 1373

(శామనితటము=దక్షిణపు ఒడ్డు; పుటభేదము=పట్టణము)

(ఈశనము=సంపద; తావు=తావలము; అతగుడు=బలహీనుడు; ఇక్క = నివాసము)

(మూక=సైన్యము; ఎద్రి=ఎదిరించి; ఆపన్నులు=ఆపదయందు చిక్కిన వారు; సన్నహనము=యేర్పాటు; ఘాత=దెబ్బ; ప్రన్నని=దళసరియగు; చర్మవర్మములు = తోలు కవచములు; పన్ను=సిద్ధము చేయు)

తే॥గీ॥ తోలు తొడుగుల నేరండ తైలమందు
బాగుగా తడిపి తొడుగ - బాణవితతి
చర్మ కవచములందాకి జారిపోవు
ననెడి యౌపయికమ్మట పనికివచ్చె ॥ 1374

చ॥ సెలవిడె శంభు "రాయప"కు - చేరువఁబల్లెల పట్టణాలనే
వలనను గాని - చర్మములవశ్యము గావున వేల సంఖ్యలో
తులుచన సేకరించవలె - తొడ్గుల కుట్టగ సౌచికాళినిన్
పిలిచియు-నాముదమ్ము పొదపెట్టగ పంపియు గూనలందునన్॥ 1375

తే॥గీ॥ త్వచకవచము లన్నియును సిద్ధమ్మునయ్యె
గూనలందు'నామండపు' నూనె యుండె
ఇరువదైదు వేల భటుల పరియు నచట
సిద్ధ మయ్యెను "తిర్చిపై" యుద్ధమునకు ॥ 1376

కం॥ "కలశుడు, జోత్యా" యటగల
పలు నూరులను, పురములను పడవలు, నావల్
వలసిన వన్నియు, సేనలు
గలచోటికి వచ్చునట్లు కార్యముఁ దీర్పన్ ॥ 1377

తే॥గీ॥ శంభు తెప్పించె నచటికి సామజములు
నైదు వందలు - తిరుచి కుడ్యముల నన్ని
బ్రద్ద లింపగ నట్టులే పైన యున్న
కోట బోర్తలుపులఁ గూడ కూలఁ ద్రోయ॥ 1378

ఉ॥ వేగమె దాటగా వలె "కవేరజ" నిప్పుడె - వెల్లు వొచ్చిన
న్నాగము నాగమౌ మన ప్రయాసము నంచును - నావ లెక్కుచున్
వాగెలు పట్టి రాహుతులు వార్వములన్ తరలించు చుండగన్
నాగ సమూహ మేటఁ దిగునట్లుగ జేసిరి మాహుతుల్ బడిన్॥ 1379

(ఏరండ తైలము=ఆముదము; ఔపయికము=ఉపాయము)

(తులుచన=శీఘ్రముగా; సౌచికాళి=కుట్టుపని వాడు; పొదపెట్టు=చేర్చి యుంచు; గూనలు=బానలు) (ఆమండతైలము=ఆముదము)

(కవేరజ=కావేరి; ప్రయాసము=ప్రయత్నము; రాహుతులు=ఆశ్వికులు; నాగము=ఏనుగు; మాహుతులు=మావటీలు)

తే॥గీ॥ ఇట్లు తిరుచిరాపల్లి దాపించె సేన
గోడపై నుండి విల్కాండ్రు కోలవాన
కురియుచున్నను వానిని తిరుగ గొట్టె
కాయమున తైల సిక్త త్వగక్త్ర బలము॥ 1380

కం॥ ఈ లోపల మదగజములు
కూలంద్రోసె పురిచుట్టు కుడ్యచయమ్మున్
గాలివలెఁజొచ్చె సేనలు
వాలాయము పెట్టునట్టి వారలు లేకన్ ॥ 1381

శా॥ కేలుస్వీచెను శంభు సేనకు పురిన్ గేహాళి నుచ్చావచ
శ్రీలన్నైకొని – హట్టముల్ పొదివి నిశ్శేషంబుగా నచ్చుటన్
యేలిబ్బుల్గల వన్నిదోచి మరి యందే మూలను స్వీడకన్
వాలాయమ్ముగ, నూచముట్టుగను, సర్వమ్మున్గొనన్ స్వేచ్ఛమై॥ 1382

శా॥ శ్రీరంగేశు భజింప నేగఁగన వచ్చె'న్నంబికాబాయి' – తా
గారామొప్పగ తమ్మునింగనుచు, మ్రొక్కన్ వంగు శంభాజి పై
"శ్రీరస్తు"ంచు "చిరాయుషే" యనుచు నాశీస్సుల్ ప్రవర్షింపగా
నారీతిన్నిడె నాశిషమ్ములను బావౌ 'హర్జి' 'శంభాజి'కిన్॥ 1383

తే॥గీ॥ అట్లు "తిరుచి" కొల్లాట జయప్రదముగ
పూర్తి కావించి, గిరిదుర్గ మూర్తి గనిరి
లోన చొక్క నాధుండుండె – హీనబలుడు
చిక్కదేవుడతనిని రక్షించుచుండె ॥ 1384

తే॥గీ॥ "దుర్గ" జయము చాల దుష్కర మగునది
మొగ్గ దారు నెలల ముట్టడికిని

(కోలవాన=అమ్ముల వర్షము; త్వగక్త్రము=త్వక్+అక్త్రము= చర్మ కవచము)

(వాలాయము=ఆటంకము)

(ఉచ్చావచ్చశ్రీలు=అన్ని విధములైన ధనములు; హట్టము=పణ్యవీధులు; స్వము=ధనము; వాలాయము=బలాత్కారము)

తెగబడినను నష్ట తీవ్రత యెక్కువౌ”
ననుచు హర్జి శంభు నాప నపుడు॥ 1385

ఉ॥ ఆవల కొంత కాలమునకా గిరి దుర్గము నందు చొక్క నా
ధావని నేత స్వర్గతుడు నయ్యెనటంచును వార్త వచ్చె - యా
భూవిభు దేహమున్ “మధుర” ప్రోలుకు గొంచును బోవ సమ్మతిన్
కావలెనంచమాత్యులడుగన్ సరె యట్లనె శంభు సౌమ్యతన్॥ 1386

తే॥గీ॥ అపుడు ‘బసవప్ప నాయకు’ డాతురమున
శంభుఁజీరియు చెప్పెను - “సమయమిదియె
కోట తలుపులు తెఱతు రొక్కుమ్మడిగను
సేన జొఱవచ్చు” నని - శంభుజీ యిటులనె ॥ 1387

చ॥ “భళి! బసవప్ప నాయక! భవత్ఫణితోగితమయ్యు, నీ “హళా
హళి” యిపుడంత ముఖ్యమొకొ? యక్కడ పార్థివ పార్థివాంగమున్
వెలికిని తెచ్చువేళ - మన విజ్ఞత, మానము మంట గల్పి లో
పలికిని దొమ్మిగాఁజనుట భావ్యమె? పోరుకు వచ్చి చూఱయా?”॥ 1388

“తిరుచిరాపల్లి” కోటపై యుద్ధము

ఆ॥వె॥ కోట గొనుట యిపుడు పాటౌను నని, యిట్టి
వేళయందు చొఱుట పిఱికి తనము
చావు బ్రతుకులన్న - జయము, నోటమియన్న
సాజమగును - వీర సైనికులకు ॥ 1389

ఆ॥వె॥ “హరజి మహదికు”ండు నాత్రపడుచు నుండె
రాగలండు ‘దేవరాయ’డనుచు
అతడు, కలశుడు నహరహమును పురి లోన
‘పరి’ ని యనికి సిద్ధ పరచుచుండ్రి॥ 1390

పాటు=శ్రమ
(హళాహళి=సంభ్రమము; చూఱ=దొంగతనము)
(బరి=సైన్యము) ఫణితి=భాషణము; ఓగితము=యుక్తము

కం॥ వారము దినములు గడచెను
వారిదములు చిక్కనగుచు ప్రాకెను నింగిన్
పోరున కాయత్తమ్మై
వేరము పదివేల సేన విడిసెగడిమొగన్॥ 1391

ఆ॥వె॥ ఎత్తు తక్కువైన "యేకాశ్మ" మయ్యది
శైల దుర్గమగుట చాల గట్టి
కందకమ్ము గలదు గంభీర మౌచును
దంచనల్గలవట - ధన్వులుండ్రి" 1392

చ॥ పరిఖను దాటు నప్పు డరి బాణములన్ కురిపించె గాని - ఆ
శరములు తైలసిక్తమగు చర్మ తనుత్రము లంటి రాలె - యే
తిరమగు హాని చేయకమె - దీక్షగ కందకమున్ తరించి వే
గిరముగ కొండనెక్కి గడి కెక్కగ నిచ్చెన లూది నిల్పగన్॥ 1393

ఆ॥వె॥ దంచనమ్ములుమిసె దారుణానలగోళ
తతిని - కురిసె నిర్విరతిగ నంప
వాన - మృతుల సంఖ్య భయదమై యుండెను
హరి, కరి, భట దళము లాహుతయ్యె ॥ 1394

చ॥ అపుడు మరాటు లమ్ములకు నంచున గుడ్డలు చుట్టి తైలమం
దు - పదను చేసి - యగ్గినిడి తూర్ణముగా విడువంగ, కోటలో
నపడు విధమ్మునన్నచట నాల్కలు గ్రోయుచు మంట లెచ్చగ
న్నెపుడెటు 'పెట్లు మందును' స్పృశించెనొ? 'ధామ్మని' విచ్చె వప్రమున్॥ 1395

ఉ॥ కోటను సందు యేర్పడగ గొబ్బునదూరి మరాట సైన్యముల్
వాటముగా నటన్ గవను వాకిళులన్ తెఱిపించి రంతటన్
కోటను నున్న వారలొక కొందరు మ్రందిరి యగ్గికగ్గమై
ధాటిగ కోటపై నెగిరె దర్పమునన్ "భగవా" పతాకయున్ ॥ 1396

(వేరము=వేగముగా)

(ఏకాశ్మము=ఒకే శిల; దంచన=ఫిరంగి; ధన్వి=విలుకాడు; వప్రము=కోట గోడ)

ఛత్రపతి శంభాజి తిరుచిరాపల్లి విజయానంతరము కర్ణాటక, తమిళ దేశములందు యిరువది కోటల నాక్రమించు కొనుట

తే॥గీ॥ తిరుచిరాపలి గడి వశ పరచు కొనిన
పిదప మహిశూర కర్ణాట పృధ్వియందు
నటులె తమిళ భూతలినిఁ దుర్గాళి కొనియె
వెరశి ద్వావింశతిగడుల పఱపె శంభు॥ 1397

తే॥గీ॥ ఉత్తరమున "ధర్మపురి" "హొసూరు" నుండి
దక్షిణమున "మధుర" పురి దాక - శంభు
యాశ్విక దళము నిర్వార్యమగుచు రెచ్చి
జింజి, వేలూరు ల వరకు చిమ్మిరేగె ॥ 1398

కం॥ ఘనముగ దసరా వేడుక
లను పాల్గొనె శంభు "తిరుచిరాపలి"లో - ద
క్కను నమీరులు, నధికృతి
గణములును విధేయులగుచు కరముల నొసగన్ ॥ 1399

ఆ॥వె॥ చిక్క దేవరాజు చిక్కులంబడియెను
శంభు విజయ గాథ శ్రవములంట
యిరుగు పొరుగు రాజు లెందరో "శంభాజి"
కాశ్రితులయి యొసగ నప్పనములు॥ 1400

ఉ॥ అప్పటి దాక దక్షిణమునందు జయించిన కోటలందు తా
నప్పనముల్ గ్రహించిన ధనమ్మును - దోచిన సొమ్ము నంతయున్
కుప్పలు గాగ, గోతములఁ గూరుచు వందల బండ్లపైన తా
నొప్పుగ 'రాయగడ్' పనిచె యుక్తబలమ్ముల తోడ శంభుడున్॥ 1401

(ద్వావింశతి=ఇరుపది రెండు; పఱపు=గెలుపు)
(కరము=కప్పము)
(అప్పనము=కప్పము)

ఆ॥వె॥ శంభు జృంభణమును సత్వరమే యాప
చిక్క దేవరాజు పెక్కు వినతు
లంపు చుండి గూడ "ఔరంగజేబ"ట
యులుకు పలుకు లేక యూరకుండె ॥ 1402

చిక్కదేవరాయలు ఛత్రపతి శంభాజీని ఆక్షేపించుట

ఉ॥ "ఏటికి వచ్చినా విటకు? నిట్లధికారము చూపుచుంటి - క
ర్ణాటక రాజ్యమందున - మరాటులు రేగుచునుండ - కన్నడ
మ్మోటమి నొప్పుకో వలెనె? యోధులు మాకిట లేరె? మేము మీ
చోటికివచ్చి దుందుడుకు చూపితిమే? యను దేవరాజుకున్॥ 1403

ఛత్రపతి శంభాజీ చిక్కదేవరాయలకు తగిన సమాధాన మిచ్చుట

చ॥ తెలిపెను శంభుజీ యపుడు తెల్లముగా "వినవోయి మిత్రమా!
అలఘు పరాక్రముండునగు నయ్య జయించెను కన్నడ క్షితిన్
తొలుతగ మత్పితామహుడె తోరముగా వెలయించె పాలనన్
కలుగదె యౌరసత్వ పధికారము నాకును, వింత యేదిటన్?॥ 1404

ఉ॥ నేటికి గూడ ద్రావిడము నేలెడి "యేకజి" నాదు యన్న - క
ర్ణాటక రాజ్యమందధిక ప్రాంతము నేలెడి "హర్జి" నాదు బా
వౌటయు చూడ వొక్కొ? కను మంతయు కన్నులు విచ్చి, నిక్కమీ
నాటికి గూడ మేమె యధినాయకులౌదుము కన్నడోర్వికిన్" ॥1405

చిక్క దేవరాయలు ఛత్రపతి శంభాజీతో సంధి చేసికొనుట

చ॥ అనియెడు శంభు విక్రమము నడ్డు కొనన్తరుణమ్ము కాదటం
చును - తన భంగపాటు కడు సూటిగ కన్పడు చుండ - చిక్కదే
వనృపతి "లొంగిపోతిన"ను వార్తను పంపి - ద్వికోటి హొన్నుల
ప్పనమును నిత్తునంచనియె-వల్లెయనెన్ యది విన్న శంభుడున్॥ 1406

కం॥ దీపావళి పర్వోత్సవ
మైపోవగ - వేయికాళ్ళ మండపమందున్
భూప సభకు పదునొకటేం
డ్లౌ పాయపు తమ్మునినిచె 'రాయన్నృపతి'యున్ ॥ 1407

ఆ॥వె॥ చిక్క దేవరాజు నొక్కడె వచ్చిన
మున్ను శివజి చేత బన్న పడిన
యరిభయంకరుడగు నప్జలు ఖాన్గతి
తనకు పట్టుననుచు త్రాస మందె ॥ 1408

చిక్కదేవరాయలు స్వయముగా ఛత్రపతి శంభాజీ సన్నిధికి రాకుండుటకు కారణము తనకు "శివాజీ చేతిలో అప్జలు ఖాన్గతి" పట్టునని భయపడెనని సభలో హాస్యోక్తులు చెలరేగుట

చ॥ "స్వయముగ దేవరాయలు సభా స్థలికిం జను దెంచ కుండు టా
రయనత డెంతొ భీతిగొనె రానట నొంటిగ శంభు వద్దకు
న్నరిభయదాకృతింగలుగు నప్జలు ఖానుని డొక్క చించె నొం
టరియయి శ్రీశివాజి దరి డాయగ మున్నటులౌచు నంచునున్"॥ 1409

తే॥గీ॥ అనెడు హాస్యోక్తులు సదము నందు సభ్యు
లను కొనుచునుండ్రి చిఱునవ్వు లలము కొనగ
యప్పనమున సగమె పంపె ననుజు చేత
దేవరాజు, సామావలందింతు ననియె ॥ 1410

ఛత్రపతి శంభాజీ రాయగడమునకు మరలుట

ఉ॥ వచ్చిన కార్యము న్విజయ వంతమునయ్యెను - దక్షిణమ్ములో
పొచ్చెము లేని రీతి భువి మొత్తముపైన మరాట ప్రాభవ
మ్మెచ్చుగ నుండె - తానిక నిమేషము జాగొనరించరాదిటన్
వచ్చియు నార్నెల ల్జరిగె నంచును, రాయగడమ్ము చేరగన్॥ 1411

(సాము=సగము) (పాయము=ప్రాయము)

ఉ॥ పయనమగుచు 'హర్జి' బావకు, చిన్నక్క
"యంబిక"కును, పదయుగ మంటి మ్రొక్కి
ఆశిషములుఁగొనుచు హాయిగా క్రమ్మఱె
సరగ రాయగడుకు శంభురాజు ॥ 1412

జంజీరా కోట - సిద్దీలతో యుద్ధము

తే॥గీ॥ కొంకణము నందు నపరాబ్ధి కూల మంటి
"జంజిరా", మోకరిల్లిన కుంజరమటు
కోపు యలగము - ముయ్యారు క్రొక్కళములు
కలిగి - కడలి ఖేయమగు - దుర్గాగ్రగణ్య ॥ 1413

తే॥గీ॥ అన్ని బురుజులఁ, జాల దౌలందునుండు
లక్ష్యములను భేదించు ఫిరంగు లుండు
తన దరికి వచ్చు యానపాత్రమ్ము నెంత
బలితమైనను క్షణములో బాతలింప॥ 1414

తే॥గీ॥ వేయి వత్సరముల క్రింద బెస్తవారు
పశ్చిమాబ్ధిని ఆాతి ద్వీపమ్ము పైన
"జంజిరా" కోట గట్టిరి - సమయగతిని
యాక్రమించిరి దానిని "హబ్షి" వారు ॥ 1415

జంజిరా కోట శత్రుదుర్భేద్యమై నిల్చుట

తే॥గీ॥ ప్రప్రథమముగ కోట ఛత్రపతి శివజి
చూచె-చాలకీలకమగు చోటు ననుచు
దాని నాక్రమింపగ చాల తపన పడియె
జీవితాంతము - "జంజిరా" చిక్కలేదు ॥ 1416

(అపరాబ్ధి=అరేబియా సముద్రము; కూలము=ఒడ్డు; కోపు=దీర్ఘమైన; అలగము=కోటగోడ; ముయ్యారు=పదునెన్మిది; క్రొక్కళములు=బురుజులు; ఖేయము=అగడ్త; దుర్గ=కోట) ("హబ్షి='అబిసీనియా' దేశీయుడు)

(యానపాత్రము=నౌక; బాతలించు=బ్రద్దలుసేయు)

చ॥ మొగలుల చేతగాక తమ మోహరమున్ విరమించుకొంటి రా
వగనిక పోర్చుగీసులును పాయక యుద్ధము చేసి యోడిరా
పగిదిని యాంగిలేయులును పై పయికిన్జని జంజిరా గొనన్
తగవుకు నుద్యమించి పస తక్కువయై విరమించి రుద్యతిన్॥ 1417

ఉ॥ కొంకణ తీరమందు తమకున్నెదురేమియు లేదటంచు - యే
రింక మము న్జయింపగల యిద్ధ పరాక్రములంచు రెచ్చి - ని
శ్శంకగ తీరమందుగల సంవసథమ్ముల దోచు కొంచు - యా
తంకము లేక దీన జనతన్నెటియించుచు నుండ్రి "హబ్సి"లున్॥ 1418

ఛత్రపతి శివాజీ నౌకాబల ప్రాముఖ్యము గుర్తించుట

మ॥ 'శివజీ' యే ప్రథముండు భారత మహీ సేవ్యాళిలో వార్ధితీ
ర విశాలావని పాలనన్ సలుపు తద్రాజాళి కెప్టన్ సము
ద్ర వణిజ్యమ్ము ప్రవృద్ధి నొందుటకు - తర్షాధశ్చరోపద్రవా
ద్యవరోధమ్ములు నాప నౌబల మవశ్యంబంచు గుర్తింపగన్॥ 1419

ఆ॥వె॥ శివజి శంభుజీకి చిన్నప్పుడే చెప్పె
వార్ధి తీరమేలు పార్థివులకు
నావికాబలమ్ము నావశ్యకమ్మని
యరటి పండు నొలిచి నంత పసగ ॥ 1420

తే॥గీ॥ "సూరతు"ను మొదలుకొని "కార్వారు" వరకు
వార్ధి తీరము పై పట్టు వశము నైన
బుడత కీచు లాంగ్లేయుల బెడద యడగు
"సిద్ది" 'మలకల'కును తగు బుద్ధి వచ్చు ॥ 1421

ఆ॥వె॥ అనిన తండ్రి మాట యాగమ సూత్రము
లట్లు శంభు మనము నందు నిలిపె

(ఉద్యతి=ప్రయత్నము)

(సంవసథము=ఊరు; హబ్సీ='సిద్దీ' లనబడు తురుకలు; పసగ= విశదముగ) (సేవ్యుడు=రాజు; తర్షాధశ్చరోపద్రవము=సముద్రపు దొంగల బెడద; అవరోధము= ఆటంకము; 'నౌ'బలము=నౌకాబలము)

శక్తి యున్న మేర సాహసమును జూపి
వైరితతికి సింహ స్వపమునయ్యె ॥ 1422

తే॥గీ॥ 'కొంకణు' న 'మరాటా' వారి కున్న నావ
లందు "గలివతు" లను తేలికైన పడవ
లుండగ – "గురాబు" లను పేరి దండినౌక
లును గలవు వందల కొలంది – వనధి తటిని ॥ 1423

కం॥ బొంబాయికి సవిధ ద్వీ
పంబులు "ఖందేరి" పైన పటుతర మౌదు
ర్గంబు "కొలాబా" పై న
ట్లుంబటు దుర్గము నిలుప నడుముకొనె శివజీ ॥ 1424

తే॥గీ॥ ఐనను శివజి మొదలిడినట్టి దుర్గ
ములు వినిర్మించుపని సగమునకు వచ్చి
యాగి పోయె నాటంకము లధిక మౌట
కడకతో "శంభు" పూరించె కట్టడములు ॥ 1425

కొంకణ తీరవాసులైన కర్షకులు "సిద్దీ"ల వలన తమకు కలుగు కష్టములు శంభాజీతో విన్నవించుకొనుట

తే॥గీ॥ "నాగుధానె" "రోహ"యను జనపదములను
గల కృషాణులు వచ్చి యడలుచు చెప్పి
రి – తమ యూళ్ళనుండి యపహరించిరి బుడు
తలను యిర్వదేగురం, సిద్ది తులువలనుచు ॥ 1426

ఉ॥ బాలురనెత్తుకేగుచును – వారల నేమి యొనర్తురన్న – నా
కూళులు నాంగిలేయులకు కొండిక లందరం బానిసీంద్రుగా

(స్వపము=స్వప్నము)
(నడుముకొను=సిద్దపడు)
(కడక=పూనిక)

చాల ధనమ్ము కమ్మెదరు - సాటెనగొట్లది గాక పోరలన్
జాలిదొరంగి క్లీబులను సల్పుదురంచును వింటిమో దొరా! ॥1427

తే॥గీ॥ అనిన రోష విషాదము లలముకొనగ
హాలికులకు తగిన పరిహారమిచ్చి
సిద్ది మల్కలకిక బుద్ధి చెప్పెదనుచు
బాధితుల నూఱడించుచు పంపె శంభు ॥ 1428

తే॥గీ॥ కవికలశుతోడ చెప్పెను "కమ్మ నొకటి
యాంగి లేయులకిప్డు నా యాగ్రహమ్ము
వారికర్థమౌ తీరున వ్రాసి పంపు"
వారి వర్తనమున మార్పు వచ్చునట్లు ॥ 1429

కం॥ "చౌవులు" రేవుకు నధిపతి
కీ విషయము వ్రాసి పంపె - "యిక వార్ధిని ని
త్యావసరపు దినుసులు - నీ
రేవున రానీయ కాంగి లేయుల కనుచున్" ॥ 1430

'జంజిరా' కోటను జయించుటకు శ్రీ శివాజీ చేసిన ప్రయత్నములు విఫలమగుట

ఆ॥వె॥ గతము నందు శివజి గడములు నిలిపెను
"దండ" "రాజపురు"లఁ దండు పంపి
"జంజిరా"ను గెలువ సాధ్యము కాలేదు
కాని సరసఁ 'బద్మ' గడముఁగట్టె ॥ 1431

తే॥గీ॥ "జంజిరా" దుర్గ నేతతో సమయమరసి
మెల్ల మెల్లగ మచ్చిక మీర మెలగి
దండి కానుక లిచ్చుచు తన వయిపుకు
త్రిప్పుకొనె "ఫతేఖానుని" శ్రీ శివాజి॥ 1432

(కూళులు=దుష్టులు; కొండికలు=బాలురు; సాటెనగొట్లు=దుష్టులు; క్లీబులు=నపుంసకులు; పోరలు=బాలురు)

(నిలుపుట=నిర్మించుట; సరస=ప్రక్క)

ఆ॥వె॥ "కాశి" మనెడు సిద్ది, 'ఖైర్యాతు' యను సిద్ది
కడలి వద్ద శివజి కట్టినట్టి
గడము నాక్రమింప కడకతో ముట్టియు
నచటి మందు గుండు కగ్గినిడిరి ॥ 1433

ఆ॥వె॥ అట్లు శివజి చేసినట్టి యత్నములన్ని
విఫలమయ్యె - సిద్ది విడువ కుండ
జంజిరా గడమును - సాయ మడిగె నవు
రంగజేబు నాత్మ రక్షకొఱకు ॥ 1434

చ॥ మొగలులు జింజిరా పతికి మోదముతో తమ సాయమిచ్చిరే
వగనయిన "స్శివాజి" కెటు వంటి విఘాతమునైన సేయగా
పగరగులంగ కాచుకొని 'పాయ'లభించిన మీద దూకగా
పగలును రేలదేపనిగ పాయక వేచియు నుండి రెల్లెడన్ ॥ 1435

చ॥ ఈ విధి శ్రీ శివాజి యొనరించిన యత్నము లెల్ల భగ్నమై
కావలులైన 'సిద్ది మలక'ల్తమ 'జంజిర కోట' చాటుగా
తావిష తీరమందు గల స్థానక, నీవృత సీమలందు తా
రే విముఖమ్ము లేక చరియించుచు నుండిరి బంది పోటులై॥ 1436

సీ॥ "కలశు" "రాయప"లతో కదలి శంభుజి 'రాయ
గడము' నుండి 'పచడు' కంధ చేరె
యటనుండి 'మహదు' కు నరిగె 'బంకోతు' క
డ, కదలి పాయ యెడవుగ దోచె
చుట్టును కొండలు, కట్టెదుర వనధి
ప్రకృతినింగనుచును పరవశించె
"మైనాక భండారి" మహిత నావికమణి
"దర్యా సరంగు" "శాంతాజి పావ్ల" ॥

(పాయ=అవకాశము) నీవృతము=గ్రామము; స్థానకము=పట్టణము
(తావిషము=సముద్రము; విముఖము=ఆటంకము)
కంధ=గ్రామము; ఎడవు=దూరము

తే॥గీ॥ మరియు "గోవిందరావ్కథె" మాన్యనావి
కా్రగణులు - మరి యెందరో కడలిని నౌక
ప్రాదముగా నెంచునట్టి సాంయాత్రికాళి
శంభుజీ చుట్టు చేరిరి శరధి తటిని ॥ 1437

ఛత్రపతి శంభాజీకి పోర్చుగీసులు, ఆంగ్లేయుల కపట వైఖరి బెడదగా పరిణమించుట

తే॥గీ॥ "సిద్ది మల్కాల నదిమి 'జంజీర కోట
పట్టుకొనవలె నట్టులే" వణిజులమని
వచ్చి - పోర్చుగీసాంగ్లేయ జనులు చేయు
వృత్తి పణ్యమా? జన్యమా? యెఱుగ వలెను ॥ 1438

తే॥గీ॥ "ఏకు మేకయ్యె" నన్నట్లు యెంతొ వినయ
మొప్ప వాణిజ్యమున కాజ్ఞ పొంది యిపుడు
పోర్చుగీసు లాంగ్లేయుల పోకడ గన
"చంకదుడ్డును శరణార్థి" చందమయ్యె ॥ 1439

కం॥ దొద్దగొను వారి నడ్డు న
బద్ధముతో కోట కట్టి భారిఫిరంగుల్
సిద్ధమును చేసి గడిపయి
సిద్దీలకు తోడు సూప సిద్ధపడిరహెూ ॥ 1440

ఛత్రపతి శంభాజీ గొప్ప నావికా దళమును నిర్మింప ప్రయత్నించుట

తే॥గీ॥ అనుచు శంభాజి సిద్దీల నడచు ముందు
వారి కండ యౌ పరదేశ వర్తకులను
నదుపులో నుంచగవలె నా యదను కేను
యెదురు చూచుచుంటి ననియె హితులతోడ ॥ 1441

(కంధ=గ్రామము; సాంయాత్రికులు=సముద్ర వర్తకులు)
(పణ్యము=వాణిజ్యము; జన్యము=యుద్ధము)
(దొద్దగొనువారు=దోపిడీ చేయువారు)

తే॥గీ॥ అప్పుడట యెదుట కడలి నెన్నొ చిన్న
పెద్ద పడవలు, నావలు వీక్ష్యమయ్యె
క్రొత్త నావలు నిర్మింప కుశలురైన
మంచి వడ్రంగులు పనుల మగ్నులైరి ॥ 1442

తే॥గీ॥ కొంకణ ప్రాంత నేతగా కొల్వు సేయు
ధీరుడైనట్టి "రఘునాథ దేశ పాండె"
యటకు వచ్చియు శంభుజీ నామతించె
తన గృహమున కతిథిగ పావనము సేయ ॥ 1443

ఉ॥ "ఇప్పుడు కాదు మిత్రమ! మరెప్పుడు నైనను వత్తు గాని – యీ
ముప్పుకు సిద్ధమై మనము – ముమ్మరము న్పొనరింపగా వలెన్
కప్పలులన్, వహిత్రములు క్రచ్చఱ నిర్మితిసేయు కార్యమున్
యెప్పుడు సిద్ధమై యనికి నేగగ నౌచరు లుండగా వలెన్" ॥ 1444

తే॥గీ॥ అనుచు "మైనాక భండారి" గనుచు శంభు
మనకు పదియు నైదతి పెద్ద మంగినులను
తక్షణమె సిద్ధమును జేయఁదగును నిపుడు
పెను శతఘ్నుల మోసెడి వీక గలవి ॥ 1445

సీ॥ 'కళ్యాణి' కడనున్న కర్మశాలల యందు
కట్టింప బడెడు నౌకలను మించు
నతి పెద్ద రోకముల్ యవసర మౌ నిప్డు
"కుడలు" "డిఛోలీ" ల కడనెసగెడు
కర్మాశ్రయమ్ముల నిర్మిత మగుచున్న
భూరి శతఘ్నుల పొడవు, పఱపు
పాశ్చాత్యుల ఫిరంగి పరిమాణమును మించు
నట్టివై యుండెడి వగుట చేత ॥

తే॥గీ॥ వాని ప్రేలుడు యొత్తిడి వలన – కదల
కుండునట్టి స్థైర్యముగల గొప్ప నావ

(మంగినులు=నౌకలు; వీక=బలము)
(కప్పలి=ఓడ; వహిత్రము=పడవ; నౌచరులు=నావికులు)

లిప్పుడావశ్యకము గాన యిచట మనకు
నట్టి నౌకలు నిర్మింప నడరు డింక" ॥ 1446

నౌకాశాస్త్ర విజ్ఞాని "జంగేఖాను" అరబు దేశము నుండి శంభాజీకి సాయపడుటకు వచ్చుట

శా॥ సాలప్రాంశుడు, మాంసలుండరబు దేశావాసుడౌ "జంగెఖా
నా"లో వచ్చెను - స్వాగతించుచును యా "నౌశాస్త్రవిజ్ఞానినిన్"
"దౌలత్ఖాన్మయినాకు" లిర్వురు కడున్ మర్యాదతోడ న్నెదు
ర్కోలున్నల్పగ-శంభుజీ కెదురుగా కూర్చుండె మంచమ్ముపై ॥ 1447

తే॥గీ॥ 'జంగె ఖానుడు" నెంతయు సహకరింప
నొప్పె, 'శంభాజి' స్వప్రాభవోద్యమముకు
నారు నెలలు శిక్షణ నీయ నచటె నిలిచె
తరులు నడుప - దంచనలను దరి కొలుపగ ॥ 1448

శంభాజీ బానిసలకు విముక్తి కలిగించుట

తే॥గీ॥ జంగె ఖానుని యోడలో చాల మంది
దీనులై యుండఁగని - వారు బానిసలని
కొన్న ధరకన్న యెక్కువౌ హొన్నులిచ్చి
వారలను విడిపించె శంభాజి యపుడు ॥ 1449

శంభాజి 'జంజిరా' ను గెల్చుటకు 'రఘునాధ దేశ పాండేను నియమించుట

తే॥గీ॥ కొంకణునకు సుబేదారు - కొంకణ ప్ర
దేశము తల మట్లెటిగిన "దేశ పాండె
దాదుజీప్రభుఁ" బిలిపించి స్తవము చేసి
యాతనిని "జంజిర" ను గెల్వు మనుచు చెప్పె ॥ 1450

(రోకము=ఓడ) (తరి=నావ; దంచన=ఫిరంగి; దరికొల్వు=రగిలించు)
(తలము=అరచేయి)

తే॥గీ॥ "శివజి" యే యెన్నొ యత్నముల్ చేసి గూడ
"జంజిరా" కోటఁ గొనగ నసాధ్యమయ్యె
యాంగిలేయులకును నది లొంగలేదు
బుడతకీచులకునది యంగుడిని దిగదు ॥ 1451

తే॥గీ॥ అట్టి కోట నే పట్టుట యెట్టులనిన
"జంజిరా" దుర్గ పశు బృహత్స్కంధమునకు
తోక "ఉండేరి" - యా గొడ్డు త్రుళ్ళడంచ
మట్ట గట్టిగా పట్టిన మకురు తగ్గు" ॥ 1452

చ॥ అనినను "దేశపాండె" కడునచ్చెరు వందుచు "థాలు" గ్రామమం
దునిచిరి యాంగిలేయులు "హమూత్కర" మత్యధికమ్ముగా నటన్
కననరకోసు దూరమున కంటెను హెచ్చును లేని "ఉండెరిన్"
గొనుటకుబోవ-'సిద్దిపరి' కూతము నిత్తురు యాంగిలేయులున్"॥ 1453

ఆ॥వె॥ అనిన - "యాహవమున యనుకూల ప్రతి కూల
మౌ పరిస్థితులెపుడడరు చుండు
సాహసమ్మె మనకు జయము నందించును"
యనుచు "శంభు" దంపె ననికి 'ప్రభు'ను ॥ 1454

ఉండేరిపై దేశపాండే దాడి చేయుట - దేశపాండే ఘోర పరాజయము

సీ॥ "సాగరుగడు" జఖ్ని సంపన్నము నొనర్చి
"నాగొధానె" "రొహద" నాను కొనుచు
నిరువది దృఢమైన తరులను నిల్పించి
నాలుగువేల సైన్యమును గూర్చి
"దర్యాసరంగును" దౌలతు ఖానును
"మైనాక భండారి" మహిత దణుల

(మట్ట=తోక; స్కంధము=దేహము; మకురు=పెంకెతనము)

(హమూత్కరము=ఆయుధ సామగ్రి; సిద్దిపరి=సిద్దీల సైన్యము; ఊతము =సహాయము)

నాయకత్వము క్రింద సాయమ్ముగానిల్పి
"ఉండేరి" కోటపై దండునడుప ॥

తే॥గీ॥ యనుభవ పరుడు "దేశపాండ్యా"నుఁ బంపె
నచట జరిగిన యట్టి ఘోరాహవమున
యోడిపోయె "ప్రభు" – "మరాట" యోధులందు
వందపైనను చిక్కిరి వైరులకును ॥ 1455

ఉ॥ హిందు స్వరాజ్యయోధులను నెన్బది మందిని కృత్తశీర్షతం
జెందగఁజేసి మస్తముల నెన్బదిగోనెల కట్టి – 'బొంబయీ
కిందరలించి 'యిట్లె' పయికెత్తుచు చిందులు వేయు సిద్ది వా
రిందగు మాటలన్నిలువరించిరి యచ్చటి యాంగ్ల వర్తకుల్॥ 1456

ఆ॥వె॥ "దేశపాండె" మడిమ తీవ్రమ్ముగా గాయ
పడె ఫిరంగి గుండు వలన – భటులు
కదన భూమినుండి క్రచ్చఱందరలించి
రతనిని శిబిరమున కగదమిడగ ॥ 1457

తే॥గీ॥ శూరమారాట యోధులు 'షోలపూర
హమదునగరు" "ముల్వేరు"ల నటులె యెన్నొ
మొగలు ప్రాంతములను చూఱపుచ్చు చుండి
రన్వహమును విరతి లేక యరులు బెదర ॥ 1458

తే॥గీ॥ సమర సమయముల నఖిల సైన్యములకు
కొఱతలేక పసనుసమకూర్చు కొనగ
తగిన యాజ్ఞలిచ్చుచు శంభు దౌల నుండె
వశ యశూబాయి రాజ్య నిర్వహణఁజేయ ॥ 1459

(జఘ్ని=ఆయుధము)
(కృత్తశీర్షత=ఛేదింపబడిన శిరములు కల్గుట; ఇట్లు=ఈటెలు)
(క్రచ్చఱ=వెంటనే; ప్రతిక్రియ=వైద్యము) అగదము=మందు
(పస=సరకులు; వశ=భార్య)

ఔరంగజేబు శంభాజిపై యుద్ధమునకు సిద్దీలను, పోర్చు గీసులను, పురిఁ గొల్పుట "హుస్సేనలీఖాను"ను రాయగడముపై దండెత్తుటకు ఆజ్ఞ యిచ్చుట

సీ॥ "నా 'కనిష్ఠసుతు' డనయు డౌచు రాజపు
త్రుడగు దుర్గాదాసు తోడు గొనుచు
మారాటుడైన శంభాజీ సాహ్యము తోడ
నాపైకె దండెత్త నభిలషించె
ఇంత దుస్సాహస మేనోర్చు టెట్లగు
ఘోరాపరాధి నా కొడుకు నేడు
వానిని శిక్షింప వలెనన్న ముందర
శంభాజి దూకుడు సమయఁజేసి ॥

తే॥గీ॥ యవల దుర్గదాసుని పీచ మణచవలెను
సిద్ది మూకల కిప్పుడు చెప్పుడిటుల
శంభు రాజ్యముపై చేయ సమర, మటులె
పోర్చుగీసుల గొల్పుడు పోరునకును ॥ 1460

తే॥గీ॥ "నాసికు"నకేగి – 'మాహులీ' నాక్రమించి
పిదప "కళ్యాణి" ని; "భివాండి" నదర వేసి
రాయగడముపై దాడిని చేయఁ బొమ్ము
సిద్ది, పోర్చ్గీసు లటు నుండి చేరుకొంద్రు ॥ 1461

సీ॥ యామ్యమరాట రాజ్యమును బుడతకీ
చులు నాక్రమింపంగఁ జూడవలయు
హుస్సేనలీఖాను! ఉద్దండ యోద్ధపు
మధుర గోకుల జాటు వధనుఁజేసి
యుదయపూరునగల యుచ్చావచములైన
దేవాలయమ్ముల దిబ్బఁజేసి

(కొల్పు=ప్రోత్సహించు)

మంచి ముసల్మానన్పించు కొంటివి గాదె
నేడు చూపుము యట్టి నెఱిని నీవు" ॥

ఆ॥వె॥ నని తన ప్రణాళి కౌరంగ జేబంత
స్పష్టరీతి తెలియ పరచె సభకు
ఇరువదేను వేల పరి వెంట తోకొని
"హుస్సెనాలిఖాను" "నాసికుఁ"జనె ॥ 1462

"మొగలు", "మరాటా"ల రాజ్య తారతమ్యము

చ॥ ఇరువది రెండు మండలము లేలెడు పాదుషతోడ పోల్చిన
న్నరయగ మూడు మండలములైన మరాటులకున్న గొప్ప - భీ
కర గిరి కాననమ్ములవి - కర్షకులున్నను నేల లే "దలం
గిరున"కు నర్కజా, త్రిపథగేర యొసంగును సర్వసంపదల్ ॥1463

ఆ॥వె॥ అంత మాత్రమునకె యల్పుడంచును శంభు
నొప్పరికము సేయ నొప్పుగాదు
నేలఁద్రాకు పాము నిలబెట్టు మన్నెను
చీమయైన కరికి సేగి గూర్చు ॥ 1464

"జంజిరా"పై "శంభాజీ" దాడి ప్రారంభము

తే॥గీ॥ పశ్చిమాబ్ధితటిని చిన్న పట్టణమ్ము
"రాజపురి" గిరిదుర్గ విరాజితమ్ము
నెదురుగా జంజిరాకోట పొదలుచుండె
సామికోసు, దవ్వుగ మదజర్తువట్లు ॥ 1465

సీ॥ సిద్దీలదాటున చేరంగ వచ్చిరి
"జంజిరా" దుర్గము చాయనుండి
'రాజపూర్' 'దేవ్దంద' భూజనాళిని చంపి
'మురుదు' "నంద్గావు" ల నుఱిచి యాడి

నెఱి=శౌర్యము (అలంగిరు=పాదుషా; అర్కజ=యమున; త్రిపథగ=గంగ; ఇర=జలము) (మన్నె=వీరుడు; కరి=ఏనుగు; సేగి=నష్టము)
(సామి=సగము, కోసు=క్రోశము; మదజర్తువు=మదపుటేనుగు)

బల్మిమై యింతుల పరువును మాల్చుచు
నపహరించిరి సంత నమ్మివేయ
బాలురన్నొడిసిరి బాని సీంద్రుగ మార్చ
తస్కరించిరి ధన ధాన్యములను ॥

తే॥గీ॥ "సిద్ది మల్కలు" చేయని చెఱుపు లేదు
జనులు యిండ్లను వీడి దాగొనిరి వనుల
పల్లె సీమలుఁ జేసిరి వల్లకాళ్ళు
పటిగొనిరి వణిజతతుల బండరములు ॥ 1466

కం॥ సిద్దీ ఖైర్యతు ఖానును
సిద్దీ కాశీముఖాను చెలగిరిమిగులన్
సిద్దీ మల్కలు చేసిన
తద్దారుణ చర్యలనుఁ ప్రధానులు నగుచున్ ॥ 1467

తే॥గీ॥ పాదుషా ప్రేరణము తలపైన దాల్చి
దక్షిణ మరాట నేలపై దండునెత్తి
ముందుగా "రోహ" ప్రాంతము ముట్టడించ
సిద్ది సేనాను లిద్దరు సిద్ధమైరి ॥ 1468

తే॥గీ॥ "రాజపురి" మరాట భటులు ప్రజల నాదు
కొనక పారిరి - సేనతక్కువగనున్కి
సిద్ది మల్కల నెదిరించు చేవలేక
దూరి రందరు "రాజపూర్" దుర్గమందు ॥ 1469

సీ॥ "ఉండేరి" దాడిలో నోటమి నందుచు
పారిపోవు మరాట భటులఁబట్టి
యాయుధమ్ములు వీడి యౌదలల్ వంచిన
యెనుబది మందిని మునుముఁబెట్టి
కృత్తమస్తులఁజేసి కేరింత లాడిరి
క్రౌర్యమందున పరాకాష్ఠ నంది

(తుమురునొనర్చు=నాశనముచేయు, ఒడియుట=దొంగిలించుట; పటిగొను=దోచుకొను)

యంతతో బోకుండ యా చుట్టుప్రక్కల
"పన్వేలు" "చౌవులు" ప్రాంతములను॥

తే॥గీ॥ ధ్వంసమును చేసి యత్యంత దారుణముగ
నిరపరాధులు, నబలలు, నిసుగులనక
మునుము బెట్టి నచటి జనములను మివుల
గాసిబెట్టిరి సిద్ది గరాసులకట! ॥ 1470

ఆ॥వె॥ ప్రొద్దుపొడుచు సరికి 'సిద్దిఖాను' యుగము
నిదురమబ్బు తటుకు నెగిరి పోయె
రాజపూరు గడి మరాట పోటరులతో
నిండి యుండె 'సిద్ది' గుండె లదర ॥ 1471

ఛత్రపతి శంభాజీ స్వయముగా జింజిరాపై యుద్ధమును దిగుట

చ॥ స్వయముగ "శంభుజీ"యె దిగె - సంగరమందున వార్ధివీచికా
చయము పయిన్ వహిత్రములు సాగుచు నూగుచునుండె నబ్బమా
హ్వాయమున కాయితమ్ములయి - యన్నిట నిల్చిరి పెద్ద దంచెనల్
రయమున నిప్పులన్నుమియ రక్కసి 'జంజిర' ఊతి కోటపై॥ 1472

తే॥గీ॥ నావికా సైన్యమును త్రిభిన్నములు జేసి
అందు నొక దళమునకు 'దర్యాసరంగు'
రెండవ పరికి మైనాక భండరియును
మూడవ పతాకినికి శంభు ముందు నిలువ ॥ 1473

తే॥గీ॥ మూడు నూర్ల నావలు గుమికూడి యుండె
ఐదు వేల నావిక యోధులందు యుండి
రరుల దుర్భిణులందున నరయుచుండి
రిది గనిన సిద్దిఖాన్లకు చెదిరె గుండె ॥ 1474

(గరాసులు=దుష్టులు)

(వహిత్రములు=పడవలు; అబ్దమాహ్వాయము=నీటిపై యుద్ధము)

ఉ॥ ౖమోగె మరాట దంచనలు – రోదసి గోళ మగల్చు ౖమోతతో
'వీగక జంజిరా గడము పెద్ద ఫిరంగులు నట్లె గర్జిలెన్
జోగులు చిన్నవౌట నతి చుల్కగ వెన్కకు ముందుకేగుచున్
సాగుచునుండె వార్ధిపయి శత్రుల గుండ్లను సోకనీయకన్ ॥ 1475

చ॥ కడక మరాట నౌకలును గర్జిలచేయుచు నుండె దంచనల్
గడమున దాగి సిద్ధిపరి కంటికగోచర మౌచు దంచనల్
విడువక ౖపేల్చుచుండనటు భీకర యుద్ధము సాగుచుండె ని
ర్గడలను ౖపాణనష్టము నగణ్యమునయ్యు శమింప రిర్వురున్॥ 1476

కం॥ ఎడ తెగని మరాటుల ము
ట్టడి సిద్దీలకు నెడద దడను పుట్టించెన్
కడలి పయి వారు వీరును
కడ యెన్నడొ యెఱుగనట్టి కదన మొనర్పన్ ॥ 1477

ఛత్రపతి శంభాజీ 'జంజిరా' యుద్ధమునకు లోబడదని ఉపాయము చేత సాధ్యపడు మార్గము ఆలోచించుట

తే॥గీ॥ 'సిద్దిమిస్త్రి' నానొకడు "జంజిరను" విడిచి
'శంభు' కొల్వులో చేరె విశ్వాసి యగుచు
యతని వలన 'జంజీర' ద్వీపాంతరంగి
కమగు విషయమంతయు నవగాహమయ్యె ॥ 1478

శంభాజీ, జంజీరాను గెల్చుటకు భేదోపాయము ప్రయోగించుట

ఉ॥ ఆజికి ముందె 'జంజిర' దురాపమటంచు నెఱింగి శంభు – అ
బ్బాజియు దాని గెల్చుట కపార కృషి నొ్నరించి గూడ – యే
వ్యాజమొగాని నిష్ఫలుడునయ్యెను కావున భేద యుక్తితో
నేఁజనుదాని గెల్వనని యెంచుచు–పిల్చెను 'కొండ బాబజీన్'॥ 1479

(అగల్చు=బ్రద్దలుచేయు; వీగక=తగ్గక; జోగులు=చిన్నపడవ; గుండ్లు=ఫిరంగి గుండ్లు) (అబ్బాజీ=పితయైన శివాజి; వ్యాజము=కారణము)

చ॥ అనియెను “నీకు నాకు కలహమ్మయి నీ వికసిద్ధి వారితో
డనె నివసింప జంజిర గడమ్మున కేగితివన్ ప్రవాదమున్
జనములుఁగూడు రచ్చల ప్రచారము సేయుచు సిద్ధి వారికిన్
తొణకని నమ్మకమ్మొదవు ద్రోవఁజరింపుము నేటి నుండియున్॥ 1480

తే॥గీ॥ పిదప వారికి మన‘కని’ యొదవి నపుడు
కోటలో మందు గుండున్న కొట్టులకును
అగ్గి ముట్టింప తగు తఱి నరసి యుండి
రణము సాగుచు నుండ కార్యమునుఁదీర్చు” ॥ 1481

తే॥గీ॥ ఇట్లు కొండాజి ఫర్జాందు కెఱుగఁజెప్పి
గడచె వత్సర మానాడు విడచి చన్న
“బాబ కొండాజి” “జంజిరా’ వాసి యగుచు
గడపె కాలము - యీ నాటి కదను వచ్చె ॥ 1482

‘జంజీర’ కోటలో కొండాజి ఫర్జాందు గుట్టు బయలై ఆతడు అక్కడ చంపబడుట

శా॥ “జంజీరా” గడ మాక్రమింప రణమున్ శంభాజీ సాగించుచున్
“కొంజెన్నేలొకొ? మందు కొట్టును రగుల్కొల్పంగ “కొండాజి” తా
నంజన్ కారణమెన్న గుట్టు బయలైనట్టాశంకయౌ - కానిచో
జంజీరా గడి కోట గోడలవి నుజ్జైపోవె యీ పాటికిన్” ॥ 1483

తే॥గీ॥ అనుచు యోచించు చుండంగ కనియె నొకని
మట్టి కొట్టుక పోయిన బట్టలందు
“కొంత కాలిన తల” చేతఁ గొనుచు వచ్చి
“మిగిలె “కొండాజి ఫర్జాందు” మేన నిదనె”॥ 1484

తే॥గీ॥ అక్కజమ్మును, దుఃఖమ్ము పిక్కటిలగ
“శంభు” నేమాయెననుచు ప్రశ్నపయి ప్రశ్న
వేసి విషయమంతయు వాడు విశదపఱుప
క్రూరమౌవిధి చేతకు క్రుంగి పోయె ॥ 1485

(అని=యుద్ధము) (అదను=తగిన సమయము)

తే॥గీ॥ "ఒంటిచే 'పన్హాల గడము' నొడిసి పట్టె
ఉద్దముగ్గురు భటులను నడ్డమునిచి
అలవి మాలిన మల్క సైన్యము నెదిర్చి
యట్టి "కొండాజి ఫర్జాందు" కిట్టి గతియ? ॥ 1486

వీర మరణము చెందిన 'కొండాజీ ఫర్జాందు' నకు ఛత్రపతి శంభాజి అత్యంత ఘనముగా అంత్యక్రియలు జరుపుట

తే॥గీ॥ అట్లు పలవించుచునె 'శంభు' యపుడు సగము
కాలినట్టి కొండాజి 'చూడాల' మెత్తి
పల్లకిని పట్టు మెత్తల పైన నిడుచు
తనదు కటిమానికపుదండ తలకు పెట్టె ॥ 1487

తే॥గీ॥ అంత్య సంస్క్రియలన్నియు నైన పిదప
ఒక్క యేడు నడచిన 'గుప్తోద్యమమ్ము'
నెట్లు విచ్చెను?; కారణమేమి? యనిన
జరిగిన కథయెల్ల తెలిసె 'చరుల' వలన ॥ 1488

'జంజిరా'లో కొండాజి ఫర్జాందు గుట్టు రట్టగుటకు కారణము

సీ॥ బాధ విశ్వాస్యులౌ పరిమిత భటులతో
కొండాజి జంజీర కోటఁజొచ్చి
సిద్దీల యెదలందు చెదరని నమ్మక
మ్మొదవ చేయుచునుండె మొదటి నుండి
స్నేహ భావము చూప, సిద్ది 'కసము ఖాను'
తన భోగ పత్నినతనికి నొసగె
నింత మమేకమై యేడుగడచు చుండ
నంతిమమున తాను నాదమఱచి ॥

(చూడాలము=తల; కటిమానికము=ఇంద్రనీలము) చరులు=వేగులు

తే॥గీ॥ సూచనమ్ముగ తన రహస్యోద్యమమ్ము
భోగ పత్నికిఁ జెప్పనప్పొలితియు, చెలి
కత్తెతోయన, నది సిద్ది కసము "యొద్ద
ప్రేల, "మందు కొట్టు"కు మారు, ప్రేలె 'గుట్టు' ॥ 1489

తే॥గీ॥ గుట్టు రట్టయినట్లుగా గుఱుతెఱిగెడి
లోపె – 'కొండాజి'ని యనుచరులనుఁ బట్టి
కట్టి వేసి విచారించి – కొట్టి వేసి
రందరితలలు – "సిద్ది ధర్మమ్మె" యంత ॥ 1490

తే॥గీ॥ "శంభు", 'కొండాజి' యత్నము సఫలమైన
"జంజిరా" లోబడునని యాశపడెఁగాని
కడకు ఆ యాశ స్వప్నముగానె మిగిలె
పితకు తనకు "జంజీర" యభేద్యమయ్యె ॥ 1491

'మరాటా', 'సిద్దీల' సముద్ర యుద్ధము కొనసాగుట

సీ॥ "జంజిరా" బురుజుల సన్నద్ధమై యున్న
పెను శతఘ్నులు నోళ్ళు విచ్చి చిమ్ము
నగ్గి గుండ్లు తగిలి నుగ్గౌచు పడవలు
వాని నడపువారు వార్ధిమునుగ
మారాట బరి పెద్ద మంగినుల్ సైతము
గుండ్ల దెబ్బకు కలగుండు వడగ
అటులె మారాటుల పటువైన దంచనల్
గుండులుమియ – కోట బండలురల ॥

తే॥గీ॥ యగ్ని బాణమ్ములు గడము నందు బడగ
యెగయు మంటలంటిన వెల్ల సిగరి గాగ
రెండు వైపుల సేగి సరిసమ మగుచు
దురము సాగించి రిరువురు పిఱుదివియక ॥ 1492

(బరి=ప్రక్క; మంగినుల్=నౌకలు; ఉరలు=రాలిపడు; సిగరి=బూడిద; సేగి=నష్టము; పిఱుదివియు=వెన్కకు తగ్గు)

సీ॥ "జంజిరా" కోటకు సరకుల నంపించు
"మురుదు" 'తూల' 'మషాల' 'హరిహరేశ్వ'
రాది ప్రాంతములను నడ్డు కొనుచు నుండి
సిద్దీల కోరెము చిక్కనీక
నట్లయ్యు జంజీర స్వాధీనమునుఁగామి
శ్రీరాము డబ్ధికి సేతు వెట్లు
కట్టె నటుల ఊతి కట్టను నిర్మింప
పెనుశిల లతి పెద్ద వృక్షములను ॥

తే॥గీ॥ నప్పటి కపుడు తెప్పించి యంకురార్ప
ణమును చేయించి - సేతు బంధమట సాగు
చుండ సగమైన తఱి, "శంభు" యుద్యమమును
నాపువార్త "కొథాల్కోట" యధిపుడనిచె ॥ 1493

జంజిరాకు సరకులు వచ్చుట - హుస్సేనలీఖాను రాయగడముపై దండెత్తుట

శా॥ ఈలో యోడలు గొంచువచ్చె నెటులో యేమార్చి మారాటులన్
వాలాయమ్ముగ 'జంజిరా గడుకు సర్వావశ్య వస్తూత్కరం
బేలోటున్నిక లేనియట్లు - నిదియున్నెంతో బలంబిచ్చె-సి
ద్దీల న్నేపి పరాక్రమించుచు, నిరోధింపంగ మారాటులన్ ॥ 1494

తే॥గీ॥ హసనలీఖాను 'నాసికు' నందు నుండి
కొంకణము చేరి 'కళ్యాణి' కోట కూల్చి
'పెణు' ను 'పెన్వేలు' ప్రాంతము ల్బీడు చేసి
యాయితుండయ్యె దండెత్త "రాయరి" పయి॥ 1495

ఆ॥వె॥ రాజధాని కెంతొరట్టు దాపురమయ్యె
'జంజిర' నడవ పని సగమె జరిగె
యెట్లు పాలుబోక యిఱికినట్లె శంభు
రాజధాని రక్ష ప్రథమ మంచు ॥ 1496

(రాయరి=రాయగడము) (రట్టు=ఆపద; నడవ=వారధి)

తే॥గీ॥ "జంజిరా" పై రణము కొన సాగఁజేయు
పూచి 'రఘునాథదేశ్‌పాండె' భుజములపయి
నునిచి, 'శంభాజి' రాయగడునకుఁజనియె
'హసనలీఖాను' పోబడి నరయుచుండి ॥ 1497

'ఛత్రపతి' శంభాజి గతమును, భవిష్యత్తుని గూర్చి చింతించుట

ఆ॥వె॥ 'శంభుజీ' ద్వితీయ సతి "దుర్గ బాయి"యు
భగిని యైన 'రాణుబాయి' గూడ
యహ్మదునగరమున, యౌరంగ జేబుని
'బంది' లగుచు నచట వాసముండ్రి ॥ 1498

ఆ॥వె॥ శంభు భార్య 'దుర్గ జన్మనిడెను నొక్క
యాడు బిడ్డ కనుచు నతడెఱింగె
భార్య, బిడ్డ, యక్క బయటికి వచ్చెడు
ననువు శంభు మదికి యందదయ్యె ॥ 1499

తే॥గీ॥ "ఐదు లక్షల సేన యున్నట్టి 'బాద్ష
నే నెటులెదుర్తు పదివేల సేనతోడ
సాధ్యమగునె - యేండ్ల కొలది సమరమైన"
యనుచు గాఢచింతా మగ్నుడయ్యె శంభు ॥ 1500

తే॥గీ॥ "నాడు మొగలు 'దిలేర్ఖాను' తోడ గూడి
బహదురు గడము నందుండ భార్య "దుర్గ
బాయి", యక్క "రాణూబాయి" వచ్చియటకు
నాకు "బాసటగా నుండ్రి వీకతోడ ॥ 1501

తే॥గీ॥ ఒంటిగా నేను తప్పించు కొంటి గాని
వారలిద్దరు చిక్కిరా 'బహదురుగడి'
'నహ్మదు నగర'మున చేరి రంట యిపుడు
బాద్ష బందీలుగా నట వాసముండి ॥ 1502

(వీక=పట్టుదల)

తే॥గీ॥ దుర్గ నెలతప్పె బహదూరు దుర్గ మందె
యాడు బిడ్డను కనెనట యందు - నేడు
నాపె పెరిగి యైదారేండ్ల "పాప" యయ్యె
ముద్దు ముచ్చట్లుగను దిష్టముడిగె నాకు" ॥ 1503

ఛత్రపతి శంభాజీ పోర్చుగీసులపై యుద్ధ సన్నాహము

సీ॥ అని పనవుచు శంభు నంతలోఁదేరుచు
పిలిపించె ముఖ్యులౌ ప్రెగ్గడలను
"ప్రముఖు "నీలోపంతు" 'ప్రహ్లాద నీరాజి'
'మల్హోజి ఘోర్పడే' 'మానమోరె'
"ఖండోజి బల్లాలు" - దండి మగండైన
"హంబీరరావు' ను నటకు వచ్చె
యన్ని ప్రాంతములందు హాలిక వీరులు
సేనలో భటులుగా చేరుచుండ్రి ॥

తే॥గీ॥ రాయగడమున పద్దెనిమిదాయుధములు
గండరించు శాలలు రేబగళ్ళు విరతి
లేక పనిచేయు చుండె బల్విడిగ నట్లె
కోట యందు వస్తువులన్ని కూర్చ బడియె ॥ 1504

తే॥గీ॥ అటకు 'దౌలతుఖాను' - 'దర్యాసరంగు'
'కవికలశు' వచ్చి చేరిరి - కలయఁ జూచి
ప్రగడల, దణుల నందరి వంక శంభు
సమర వ్యూహములపయిన చర్చఁజేసె ॥ 1505

సీ॥ "జంజిరా" కోట వశపడ లేదైనను
'సిద్దీ'లిక మనలఁ జెనక లేరు
నాదిల్షు, కుత్బుషా లాప్తులౌ కతనను
వారి వల్ల మనకు భయము లేదు

(దిష్టము=అదృష్టము; ఉడిగె=పోయె) బల్విడి=వేగము

'యౌరంగజేబు'ని యగణిత సేనతో
బయల పోరుమనకపాయమగును
పోర్చుగీసులు తీర భూములపై నెంతొ
కాలముగ పదురు కలిగి యుండ్రి ॥

తే॥గీ॥ వారు సిద్దీల, మొగలుల ప్రాపుతోడ
మనకు నష్టము గూర్ప నేమఱరు వారు
ముందుగా వారి యుద్ధతి ద్రుంచజేయ
తరల వలయును వారి సత్త్వమ్ము నడప" ॥ 1506

సీ॥ పోర్చుగీసుల 'తారపూరు' లోబడియెను
"రేవుదండ" పయి పోరితము సాగె
"యంజదీవ" యనెడి యంతరీపము పయి
కోట కట్టదొడగ – "కూడద"నుచు
పోర్చుగీసులటకు పోతముల్ పంపిరి
నిలుప బడియె కోట నిలుపు పనులు
నాదిల్షు రాజ్యము నాక్రమింప మొగలు
లట 'రహమత్పూరు' నాహవమున ॥

తే॥గీ॥ గెలిచె మారాట సైన్య మావల సయితము
నన్ని చోటుల మొగలుల నడ్డు కొనిరి
పోర్చు గీసుల గర్వము మేర మీరె
నపరవార్ధి వారికి కిలహ్రదము నయ్యె ॥ 1507

(పదురు=పెత్తనము)

(పోతము=నావ; నిలుపు=ఆపు; అపరవార్ధి=పశ్చిమ సముద్రము; కిలహ్రదము= క్రీడా సరస్సు)

"ఛత్రపతి శంభాజీ" "అహమదనగర్"లో బందీలుగానున్న తన భార్య, బిడ్డలు, అక్కను విడిపింపవలెనని నిశ్చయించుట - హంబీర రావు హితోపదేశము

ఆ॥వె॥ కాని శంభు మనము కనలుచు నుండెను
'అక్క', 'భార్య', 'కూతు' రంత కాల
"మహమదు నగరము"న యరుల నిర్బంధము
నందు కుందఁ వారి యార్తి తలచి ॥ 1508

కం॥ "అహమదునగరముపై వి
గ్రహమునకుందిగి విముక్తి కల్పించుచు నా
సహధర్మ చరిణిని, భగిని
దుహితలనున్ రాయగడుకు తోడ్కొని వత్తున్" ॥ 1509

కం॥ అని యనియె 'శంభు' 'హంబీ'
రునితో నది వినుచునచ్చెరువున నతడనె
"న్నని సేయగ మొగలులతో
మొనగాడెవడుండు - బయలిబువిపై శంభూ"! ॥ 1510

తే॥గీ॥ అగ్రణివి సాహసమున, శౌర్యమ్మునందు
నీకు నీవె సాటి యనుచు నిశ్చయముగ
యేనెగాదు - నిన్నెఱుగు వారెల్ల రంద్రు
నీవు యుండిననె మరాటనేల యుండు ॥ 1511

తే॥గీ॥ హైందవ స్వరాజ్యమునకు నంకురమ్ము
తండ్రి నాటగ - దాని నుత్తాల సాల
ముగనొనర్చు బాధ్యత నీవె పూని నావు
బయలుపోరపాయమని తెలియదె? నీకు! ॥ 1512

కం॥ సాహసము గొప్పదే - దు
స్సాహసమే ముప్పుదెచ్చు - సమరమ్మున - ని

(బయలి బువి=బహిరంగ ప్రదేశము)

ర్వా ్యహముగ మొగలు బాద్షా
వాహినుల నెదురగ, బయల వశమే మనకున్ ॥ 1513

సీ॥ ఇపుడు ముందుగ మనమెదిరింప వలయును
పోర్చుగీసులందీర భూములందు
బీజపూర్, గోల్కొండ పృథ్వి భాగములను
నాక్రమించెడు బాద్ష నాపవలయు
పోర్చుగీసుల కెందు మొగలుల సాయము
నందకుండగ జేయ నడరవలయు
నాంగ్లేయులు కపటు లాశ పోతులు, దొంగ
లవ్వారి నొక కంట నరయ వలయు ॥

తే॥గీ॥ నేడు మారాటు లైదు రుండికల యందు
నాజి సల్పంగ వలె స్వరాజ్యార్థులగుచు
స్వార్థ పరతను మాని దేశమ్ము కొఱకు
హైందవైక్యత పెనుప నాయత్త పడుదు" ॥ 1514

ఆ॥వె॥ అనుచు బోధ చేయు 'హంబీర రావుజీ'
మాటలన్ని చద్ది మూటలనుచు
నటు మరాట వీరు, లధిపుడు శంభుజీ
తలను దాల్చి రెంతొ తానకమున ॥ 1515

ఔరంగజేబు చిన్నకొడుకు 'షాజాద అక్బరు' తండ్రిని పదభ్రష్టుని చేసి తానె ఢిల్లీ చక్రవర్తి కావలెననుకొనుట

చ॥ ఇది యటులుండ భారత ధరేభ్య కనిష్ఠ సుతుండు నక్బరుం
డెదిరిచి తండ్రినిన్ పద విహీను నొనర్చుచు తానె పాదుషా
పదవిని పొంద గోర - తన వంతు సహాయము చేతు నంచు - స
మ్ముదమున 'దుర్గదాసు' డను మోదము తెల్పెను 'షాహజాదు'కున్॥ 1516

(రుండిక=యుద్ధ రంగము) (తానకము=వినయము) ఇభ్యుడు=రాజు

తే॥గీ॥ మొదట 'బాద్షః' 'రాజస్థాను' భూమిపైకి
తన చిన కొడుకు నక్బరున్ దండునెత్త
పంపె - 'మేవారు', మార్వార్ల వశమొనర్చు
కొనగ - నచట దుర్గాదాసు ననుగుడయ్యె ॥ 1517

కం॥ తన తండ్రి మతోన్మాదము
తనయునిగా తనకు నభిమతమ్మును గామి
న్ననవసరము యుద్ధమ్మని
యనిపించు నుదారుడైన 'యక్బరు' కెపుడున్ ॥ 1518

తే॥గీ॥ కాన 'బాద్షః' యాజ్ఞకు నతిక్రమము చేసి
మొగలుదణి 'తహ్వ్వర్ఖాన'నుమోదమొంది
దుర్గదాసు సైన్యములతో తోడు సూప
బాద్ష యజ్మీరులో నున్న వార్త తెలిసి ॥ 1519

కం॥ పాదుష పై దండెత్త "శి
శోదియ" "రాఠోడు" రాజ సూనులు నొకటై
భేదములను మఱచుచు దు
ర్గాదాసధిపతిగ సేన లాయితమయ్యెన్ ॥ 1520

ఆ॥వె॥ ఖండనమ్ములందు పరిపాలనమ్మున
షష్టి పూర్తి జరిగి చాలకాల
మైన 'బాద్షః' పన్ని నట్టి - వాగురఁజిక్కి
దుర్గదాసు దణి "జితోస్మి" యనియె ॥ 1521

ఆ॥వె॥ అంత "దుర్గదాసు" డక్బరు న్పంపెను
శంభు కడకు నతని సాయమడుగ
తాను గూడ వచ్చె తటివేచి శంభుతో
కలిసి - ఢిల్లి పైన కవియు కొఱకు ॥ 1522

"ఛత్రపతి శంభాజి" "అక్బరు"నకు సైనిక సహాయము చేయుటకు తన నిస్సహాయతను వెల్లడించుట

ఉ॥ చెప్పెను శంభు తెల్లముగ స్వీయమతమ్మును దుర్గదాసుకు
"న్నిప్పటి యీ పరిస్థితిని యేనును పాదుష నడ్డగింపగా
ముప్పులు తిప్పలొౌచు నిట పోరుచు నుంటి మరాటభూమి - కా
సప్పపుకాటు తప్పుటకు శక్తి కొలంది పరాక్రమించుచున్ ॥ 1523

తే॥గీ॥ ఐదు లక్షల సేన 'జహాపన'దగు
మాకు దాన పదవ వంతు మూక లేదు
నొంటె, లేన్గులు, బండ్లును, నుర్వినంత
కొనెదు ధనరాశులున్నవా కూళ కిపుడు ॥ 1524

ఉ॥ అంతటి సైన్యమున్బయలు నందు నెదుర్కొన లేము మేము నే
డింత ధృతిన్రణమ్మునొనరించుచు నుంటిమిరేబవళ్ళు ని
శ్చింతగ నన్న సహ్యగిరి శ్రేణులె పెట్టని కోట లౌట - మా
ప్రాంతపు దుర్గమాటవులు వైరులకు న్జొఅరాని వౌటనున్ ॥ 1525

ఉ॥ ఎందుకు రాజపుత్రులననేకత యున్నది జాతులందు - మీ
రందరు నొక్కటై మొగలు రాజు నెదుర్కొన లేరె? మీరలున్
హిందువులే గదా! శివజి హిందు స్వరాజ్యము గోరి పోరగా
మందునకైన రాట్సుతులు మాట సహాయము సైతమిచ్చిరే?॥1526

సీ॥ ఔరంగజేబు చేయని యవమానము
రాజ పుత్రుల కొక్కరవయు గలదె?
వీరాధి వీరుల న్పేరుండె గద మీకు
నతని కొల్వున బంటులగుట యేల?
వీర రాట్కన్యలు బేగములుగ మారి
తుఱకలై పోవుట పరువె మీకు?
వారి వియ్యంకులై వారి వజీర్లౌచు
శ్మశ్రువుల్దీట పుచ్చటిక గాదె?

సప్పము=పాము; పుచ్చటిక=సిగ్గు

తే॥గీ॥ వారి పక్షమందీరలు పోరునపుడు
ప్రమందు వారలు మీచేత హిందులెగద ।
మీరు హైందవులై యుండి మీదు తోడ
బుట్టులవధింప మీ మన సెట్టులొప్పె? ॥ 1528

ఉ॥ చూడుము దుర్గదాస! రిపు సూదనతాభరధుర్యులైన "రా
ఠోడులు"ను"స్సిశోదియలు" దుల్లగఁజేతురు వైరిమస్తముల్
కూడుచు నొక్కటై కలిసి కోల్తలకున్ దిగిరేని - పాదుషా
వేడదె "రక్షమాం" యనుచు వీకను గోల్పడి మిమ్ము-దీనుడై॥ 1529

ఉ॥ ఏనిక మీకు చేయగల యెట్టి సహాయము లేదు రాట్సుతా !
నాపయి నాత్మ రక్షకయి నన్వహ మున్నని సేయు భారమే
మోపయి యుండె - నైదు రణభూములలో దిగి నేక కాలమం
దే పరసేనలన్నిలుపు దెప్పర మేర్పడె నిప్డు మా కిటన్" ॥ 1530

ఆ॥వె॥ అనుచు శంభు దెలిపె తన పరిమితు లేవొ
దుర్గదాసు కున్న దున్నయట్లు
లేనిపోని యాశ లేల పెట్టు కొనగ
గాలి మాడువులను కట్టినట్లు ॥ 1531

ఛత్రపతి శంభాజీ "హసనలీఖానును" తఱిమివేయుట

తే॥గీ॥ "సిద్ది" పరినడ్డ 'రఘునాథ' జీని నిలిపి
శంభు "కళ్యాణి" దుర్గ రక్షణము కొఱకు
వేగ మరలెను "హసనలీ" మొగలుదణి
దూకుడాకించ తగినంత మూకతోడ ॥ 1532

తే॥గీ॥ "హసనలీఖాను", కళ్యాణి నాక్రమించె
నట్టులే 'భివాండి'గడము నతని వశము

(అన్వహము=ప్రతి దినము; దెప్పరము=కష్టము)
(పరి=సైన్యము; ఆకించు=అడ్డగించు)

నయ్యె - చుట్టు ప్రక్కల నుండు నాళ్ళనన్ని
నాశనము చేసె విలయ కీనాశుడగుచు ॥ 1533

తే॥గీ॥ 'శంభు' కతిపయబలముతో జృంభితుడయి
'హసనలీఖాను' ధాటిని మసిని చేసి
తటిమె 'నహమదు నగరమ్ము'దాక పఱచ
తిరిగి 'కళ్యాణి' వైపుకు మరలనట్లు ॥ 1534

ఛత్రపతి శంభాజీకి పుత్ర జననము

తే॥గీ॥ రాయగడమున కెంతయు దాయి యందు
తనదు మాతామహ నివాస ధామమున్న
యట్టి "గంగోలి" యను నూరనధివసించి
సతి "యశూబాయి" పట్టికి జన్మనిచ్చె ॥ 1535

తే॥గీ॥ 'సాహు' యను పేర భోన్సలే క్షాత్ర వంశ
వర్ధనుడయి పెరుగుచుండె - భావి యందు
తాత తండ్రుల పేరుకు తగిన యట్టి
ఔరసుడగునని మరాట పౌరులలర ॥ 1536

పెక్కురు మరాటా ముఖ్యులు మొగలులతో చేరుట

తే॥గీ॥ "ఫల్తను" దొర "బజాజి నింబాల్కరుండు'
శివజి పెద్ద వియ్యంకుడు చేరె దివము
శివజి పెద్దల్లుడు 'మహద్జి' లవము గూడ
శ్వశురు గౌరవింపక 'బాద్ష' వైపుఁజేరె ॥ 1537

తే॥గీ॥ అటులనే 'యశూబాయి' దాయాదియైన
యట్టి "కన్హోజిషిర్కెయు" నాశ్రయించె
మొగలు రాజును, "మొఖాస" మోహముననను
లొంగి రెందరొ "బాద్ష" ప్రలోభములకు ॥ 1538

(నాడు=ఊరు; విలయకీనాశుడు=ప్రళయాగ్ని)

(పఱచు=పారిపోవు) (దాయి=సమీపము)

తే॥గీ॥ 'ధనము' 'జాగీర్లు' 'వతను' లుదారతమెయి
రెండు చేతుల విసిరేయు చుండ నెవడు
మనుజమాత్రుడు నెగబడి మానముడిగి
కాళ్ళ కెఱగడు? ఆ దాత కరుణ కొఱకు ॥ 1539

ఉ॥ ఎందరినో మొగల్విభుడు నిట్లు ధనమ్ము, వతన్లు, జాగిరుల్
యందియు నందనంత దవునందున వ్రేలగ దీసి ముల్లెల
"న్నందరురండు! నందుకొనుడా శివజీ సుతు నొద్ద 'బూది'యై
నందగునంత చిక్కద"ని యందరి కిన్నతడంపె లేఖలన్ ॥ 1540

తే॥గీ॥ 'శంభుజీ' 'యశూబాయి' ల స్వజనులే – శి
వాజి హైందవీయ స్వరాజ్య వాంఛ లోని
పూతభావమ్ము నెఱుగక పోయి నపుడు
పరులకెట్లేర్పడా దీక్ష పట్ల భక్తి ? ॥ 1541

తే॥గీ॥ ఆ 'యశూబాయి' సొంత పెద్దన్న యగు "గ
ణోజిరావుషిర్కే" యును – నోరునవ్వు
చుండ నొసలు నిప్పులు గ్రక్కు నుక్కివుండు
హిందు స్వాతంత్ర్యమన వాని యెడద మండు ॥ 1542

"పన్హాలా" "కోట వద్ద" "షాజాదా అజము" పరాజయము- కాని తన తండ్రి ఔరంగజేబుకు తాను గెల్చితినని వార్త పంపుట

తే॥గీ॥ 'పన్హాలా' కడ పాదుషా పట్టి "అజము"
వీర 'హంబీర రావుచే' విజితుడగుచు
పారిపోయె "సతారా" కు పరువు మాలి
కాని తానె గెల్చితినని కమ్మంబంపె ॥ 1543

'పోర్చుగీసులతో' మరాటా వారి యుద్ధము

తే॥గీ॥ పోర్చు గీసుల నర్దించె "మొగలు వారి
కెట్టి సాయమ్ము నెచ్చట నీయ వలద"
టంచు శంభాజి – 'వల్లె' యటంచు చెప్పి
మొగలులకు సాయపడు చుండ్రి ముమ్మరముగ ॥ 1544

ఉ॥ "పార్ళికు" కోట పుట్టు సగపాలును కట్టిరి – 'ముం[బ' కొండ ద్యో
స్పర్శిగ నున్నతమ్మగుచు వాలుగ నుండ, నజాళికే పరా
మర్శము నౌచు నెక్కుటకు – మానిసులా గిరి నెక్కగా పరా
మర్శము చేయగావలె (ప్రమాదములందలగంగం జేయగన్ ॥1545

తే॥గీ॥ ఆ గడమునకును నడిమి భాగమందు
దారు వేదిక కట్టిరి – దాని మీద
దంచనలనిల్పి – 'ఠాణె' సం(ద్రంపు పాయ
యందు శ(తు నావల ముంచుటందులకును ॥ 1546

తే॥గీ॥ శంభు 'పార్శికు' కోట పజ్జ చరియించు
సమయ మందె – యతని సేన సమరమగ్న
మయ్యె 'షోలాపురి' పరిసరావని పయి
రాజ్గడు, 'శివపూర్పు'"రందరు' (ప్రాంతములను ॥ 1547

సీ॥ శంభాజి పంపించె సర్దార్ల నప్పుడు
'కేశా(త్రిమలును' – 'మోరేశ నీలొ'
'రూపాజి భోసలే' – రు(ద్రతేజుల నెంచి
'కళ్యాణి' పైకి నాస్కందమునకు
'కలశుతో' చెప్పెను – (క్రచ్ఛు 'హంబీర
మామ' ను పన్హలా భూమి నుండి
'కళ్యాణి' కిని బోయి కదనము సేసియు
'రణమస్తఖాను' బీరము నడంపు ॥

తే॥గీ॥ మనుచు 'చెప్పమని' – తను రాయగడ మరుగ
పోర్చుగీసు నావలు "ఠాణె" పురణ శాఖ
దాటు చుండెననియెడి వృత్తాంత మెఱిగి
'పార్శికు'పరిని వారి నాపమని పనిచె ॥ 1548

(పుట్టు=పునాది; పరామర్శము=ఆటంకము; చక్కగా వివేచించుట; అజాళి=గొఱ్ఱెలు) ద్యోస్పర్శి=ఆకసమును తాకు; ఆస్కందము=యుద్ధము (పురణము=సముద్రము; పనిచె=ఆజ్ఞాపించెను)

ఆ॥వె॥ 'పార్శ్వకు' గడుసేన వైళమ "పోర్చుగీస్"
చిన్న పడవల పయి చిచ్చు చిమ్మ
కడలి పాయ చాల వెడలుపు దౌటచే
దాటె నవలి దరికి దాయతరులు ॥ 1549

రాయగడమున ఛత్రపతి శంభాజీ విశ్రాంతి గొనుట వీర సేనాధిపతి హంబీరరావు మోహితే చూడవచ్చుట, ఆతని వీర కృత్యములు

సీ॥ సంవత్సరపు నీడు "సాహు" నాడించుచు
"శంభు" రాయగడున శ్రాంతిఁ గొనగ
"హంబీరరావ"ప్డు నచ్చటి కేతెంచె
రాజరాముఁగొని శంభాజిఁజూడ
"బుర్హాను పూరు"లో మూడు దినమ్ములు
చ్చావచ సంపదల్ సంగ్రహింప
"ఖాందేషు" "నంకోల" కదనమ్ములందున
విజయ సూచక కేతు వెగురఁజేయ ॥

ఆ॥వె॥ మొగలుల తటుమంగ "ముర్తజా పూర్దా"క
అహ్మదు నగరంపు నాహవమున
"పన్హాలా"కదననిఁబాదుషా సుతు "యజ
ము"ను జయింప చెల్లు "మోహితే"కె" ॥ 1550

ఆ॥వె॥ అనికి వచ్చె ననిన "హంబీర మోహితే"
వెఅపుతోడ వైరి వెన్ను చూపు
మొగలు వారలకును పోర్చు గీసులకును
"హంబిర"నిన గుండె లదరు చుండె ॥ 1551

సీ॥ "కళ్యాణి" కడపోరు గట్టిగా సాగెను
పోర్చుగీసులయిదు పోతములను
మొగలులకు వలయు ముఖ్యమౌ దినుసులు
నందింపగా పంపి రాక లేక

(ఆక=అడ్డము) దాయ=శత్రువు; తరులు=ఓడలు

'పార్శికు' పరి 'ఠాణె' వార్ధి శాఖ పయిని
సాగించు పోరు నిష్ఫలమునయ్యె
'రణమస్తఖాను' పరాజితుఁజేసెను
'విఠ్ఠోజి మానె' మరాట దణిని ॥

ఆ॥వె॥ యచటి వార్త లెఱిగి హంబీర రావును
వింశతి దశ శతిక వీతి దళము
దశ సహస్రముగ పదాత్యనీకినిగొని
కవిసెను రణమస్తఖాను మొనను ॥ 1552

సీ॥ 'రణమస్తఖాను' కు ప్రాపోటకు – 'రుహుల్ల
ఖాను" వచ్చెను 'బాద్షా' యానతిపయి
"రణమస్తఖాను" పఱచెను 'కళ్యాణి' దు
ర్గము నుండి "తిత్వాల" కడకు చేర
"తిత్వాల" లోయలో – దిగెను రెండు తెగల
సైన్యము భీకర సమరమునకు
'శంభాజి' చేరెను "దోంబివిలి" కటన్న
వృత్తాంత మెఱిగె 'హంబీరరావు' ॥

తే॥గీ॥ 'ఠాణె' కడలిపాయ కిరుతటముల పోరు
ముమ్మరించె – మొగలు సేన పోర్చుగీసు
బలము నందు పల్వురు వార్ధి బడిమునిగిరి
బ్రదికియున్న వారెల్లరు పఱచిరపుడు ॥ 1553

సీ॥ మరుసటి దినమున మలి సంజకును ముందు
హంబీర రావెదురాడెనా "రు
హుల్లఖాను" పరిని – యుద్ధమందెందరో
మొగలు యోద్ధలు కనుమూసి రపుడు
"రాజదుర్గాసిం"గి బ్రాహీము బేగు" "న
క్రమఖాను" మొదలగు గండు మగలు
గ్రక్కతిలి "రుహుల్లఖాను" పాఱగ నెంచ
నెదురయ్యె శంభాజి చదల మచట॥

(పరి=సైన్యము) వీతి=గుఱ్ఱము; అనీకిని=సైన్యము

ఆ॥వె॥ నపుడు మొగలు సేన లడకత్తెఱంబోక
లటుల నిఱికి ఱిుకు కటక మందు
కడకు ఖాను లిరువురుడుగుచు దండడి
వెనుదిరిగిరి 'బాద్షా' విధృతి గొని॥ 1554

తే॥గీ॥ పోరు నందు గాయపడె హంబీర రావు
ఎడమ భుజము – శంభాజి యా కడిది వీరు
నకు తగు చికిత్సనందించె, వికలితాత్ము
డై మరాట సేనాని కట్లగుట చూచి ॥ 1555

పోర్చుగీసు రాజప్రతినిధి కపట ప్రవృత్తి

సీ॥ గోవాను నేలెడి "కొండెడి ఆల్వారు"
పోర్చుగీసు ధరణిపుని ప్రతి నిధి
యాయన సచివుడు "లూయిగాన్ సాల్వేసు"
దొరప్రతి పలుకుకు శిరము నూపు
"కొండెడి ఆల్వారు" – కుజనుడు, వ్యభిచారి
స్వార్థపరుండు – కాపట్య వార్ధి
"జావా" సుమత్రాది సర్వప్రాగ్ద్వీప ప
ణ్యతరులు 'గోవ' రేవందు నాగు ॥

తే॥గీ॥ కప్పలుల నుండి రేవు శుల్కములు దండి
సగము నిధి పోర్చుగలు దేశ సార్వభౌమ
కోశమునకు చెల్లించి, తక్కుగల సగము
ప్రతి నిధియు, తది తరులును పంచుకొంద్రు ॥ 1556

ఉ॥ 'పాదుష' గోవ పాలకుని స్వార్థమెఱింగి ప్రలోభ పెట్టె – నీ
వాదురితాత్మ శంభు నెటులైనను లోగొనగల్గితేని దా
రాద తటాంచలావనికి రాజువు నీవగు టేను చూతు నం
చాదిన మేగుదెంచు తఱి కట్టును సాచును గోవ నేతయున్ ॥1557

(గ్రక్కతిలు=భయపడు; చదలము=సేన; కటకము=లోయ; విధృతి=ఆజ్ఞ)
(పణ్యతరులు=వాణిజ్య నౌకలు; కప్పలులు=ఓడలు) (దారాదము=సముద్రము)

తే॥గీ॥ ప్రబలతర సేన, యాత్రికా బానిసలును
తనదు కను సన్న లందుచు పని వినంగ
ప్రేక్షణలనిమిషము చేయు పెద్ద "రాజ
భవన"మందు "కొండెడి ఆలువారు" నుండు ॥ 1558

తే॥గీ॥ గోవ రాట్ప్రతినిధి యతి గోప్యముగను
మొగలు వారికి తగు సాయమొసగు చుంట
శంభు దృష్టికి వచ్చెను - శాంతు డగుచు
రాజప్రతినిధి కొక కమ్మ వ్రాసి పంపె ॥ 1559

ఉ॥ "గోవ నరేంద్ర! మున్ను మిము గోరితి నా మొగలాయి వారికిన్
యే విధమైన సాయమును నీవలదంచును - నా పితాజియున్
మీ విహితమ్మెగోరె - మము మ్రింగ దలంచిన పాదుషా మిమున్
తా విడువన్కతమ్ము కలదా? తగు రీతి తలంచి చూడుడీ" ॥ 1560

గోవా పాలకుడు "శంభాజీ" గత ప్రవర్తనను విమర్శించుట

తే॥గీ॥ రాజ్య విస్తరణాశాభరాత్ముడైన
గోవ పాలుని కాలేఖ కొంచెమైన
నెదకు నించదయ్యెను - శంభు డింతకుమును
పెన్ని మార్లు తమ పయి దండెత్తి వచ్చె ॥ 1561

తే॥గీ॥ "అటు 'కొలోబా' మొదలు 'ఠాణె' యంచు వరకు
కొల్లగొట్టెను శంభాజి యెల్ల సిరులు
మారుగ తను "యేసాజి గంభీర రావు
ను" చెఱనుంచె తగిన శిక్షను విధియింప ॥ 1562

శా॥ "తారాపూరు" "దహాను" "ఠాణె" ల భువిన్ దర్పించి కొల్లాడుచున్
దౌరాత్మ్యమ్మున "చౌలు" పై కవియుచున్నార్వేల పాదాతుల
శ్వారోహుల్ ద్విసహస్రమున్తనకు ప్రాపైరాగ బండారమున్
చూఱంబుచ్చెను-స్నేహ భావమనగా చొప్పియ్యదా యేరికిన్!"॥1563

(ఇంచుట=ఇష్టము కలిగించుట)

(బండారము=ధనాగారము; చొప్పు=విధము)

శా॥ గోవా పాలుడు వేచియుండెతటి-సక్రోధుండు నౌరంగ జే
బావేశమ్మున శంభు రాజ్యము పయిన్నష్టాశలంగ్రమ్ముచున్
యే వీలున్నిడకుండ తప్పుకొన సహ్యేలాధరారణ్యగ
ర్భావాసుండగు శంభు గిట్టి-తమకున్ వార్ధ్యంచలోర్విన్నిడన్॥ 1564

తే॥గీ॥ "ముందు ముందుకె వచ్చుచు మోటు కొనెడు
ఖడ్గమృగమును పోలు మొగలు నరపతి
చిఱుత శశ శిశుకము "శంభుజీ" యనంగ
కొమ్ముతగలక ముందె తాఁగూలుగాదె" ॥ 1565

తే॥గీ॥ అనుచు గోవ పాలకుడు యోచనము చేయ
శంభు "రాజపూరు" న నివాసముగ నిలిచి
'గోవ'పై దాడి కెది యనుకూల మార్గ
మగునొ?-"యేసాజి కంకు"ను యడిగెనపుడు ॥ 1566

తే॥గీ॥ "పోర్చుగీసుల బలమెల్ల పోతములగు
పెను ఫిరంగులు వారి కభేద్య రక్ష
మనది యాశ్విక బలము - దంచనలు నల్ప
శక్తములు - గెల్వలేమటం చనియె "కంకు" ॥ 1567

గోవా పాలకుడు "కొండెడి ఆల్వోరు" ప్రతి వ్యూహము

కం॥ 'పాణాజి' పురాపానము
లో నానా దేశ పాంథులొకచో బృంద
మ్మై నొడివెడు పలు మాటల
లోనఁ దెలిసె - "పొండకోట" లోని విషయముల్ ॥ 1568

(ఇలాధరము=కొండ; వార్ధ్యంచలోర్వి=సముద్రతట భూమి)

(శశశిశుకము=కుందేలు పిల్ల)

(ఏసాజికంకు=ఇతడు "పొండ" కోటకు అధిపతి, (కొంకణు తీరమందలి కోట) పోతములు=నావలు

(పాణాజి=గోవా రాజధాని; ఆపానము=పానశాల)

ఆ॥వె॥ "ఐదు కోట్ల నిధియు, నస్త్ర, శస్త్ర సమృద్ధి
"పోండ" కోట యందు పొసగ జేసె
"శంభు" - ఎప్పుడైన - సైన్యమ్ముతో 'గోవ'
ధరణిపైన దాడి కుఱుకవచ్చు" ॥ 1569

కం॥ అను మాటలు విన వచ్చుచు
యనుకొనె గోవా జనపతి 'యాల్వోర్' - తానే
మునుపడి 'పోండా' దుర్గ
మ్మునేల కొన గూడ దనుచు మొగలుల కంటెన్ ॥ 1570

చ॥ అనుచు తలంచి కన్నడిగులైన పదాతులు రెండు వేలు - కొం
కణులును, పోర్చుగీసులును కాలరులున్నొక వేయి మంది కూ
డిన పరి మాండవీనది తటిన్ వెసఁజేరుచు - మూడు పెద్ద దం
చనల"ను నెడ్లు లాగుచును సాగగ 'నాల్వారు' నొగ్గె పోరికిన్॥ 1571

"కొండెడి ఆల్వోరు" పోండా కోటపై యుద్ధము చేయుట

తే॥గీ॥ దారిలో "దుర్భటి" యనెడు తీర ప్రాంత
దుర్గమున కధిపతియగు "దుల్బనాయ
కుడు" మరాట వీరుడతని కెడముగ జన
మేలగునని చెప్పిరి - హితమెంచి దణులు ॥ 1572

తే॥గీ॥ 'దుల్బ నాయకుడు' మరాట 'ద్రోహి' - వాడు
స్వాగతించె "నాల్వోరు"ను సాదరముగ
వైరి సైన్యముతో చేరి వాడుగూడ
"పొండ" కోటను చేరెను దండుతోడ ॥ 1573

తే॥గీ॥ "పోండ" దుర్గాధి నేతగా నుండె నచట
వృద్ధ "యేసాజి కంకు" దుర్జేయుడతడు
నారితేరె ననేక యుద్ధాజిరముల
నతనిని జయింప రుద్రునికైన గడ్డు ॥ 1574

(ఒగ్గు=సిద్ధపడు) (యుద్ధాజిరము=యుద్ధరంగము)

సీ॥ అంతలో జడివాన యవిరామముగ సాగె
"పోండ" కోట కెదురగ గుండుపైన
"ఆల్వోరు" దంచనల్ బల్విడిఁ జేర్పించి
ప్రేల్పించె గుటివెట్టి భిత్తికలకు
నిచ్చెన లెక్కుచు నెగ బ్రాకు భటులను
నెట్టి వైచిరి "పోండ" నిమిత కాండ్రు
గడము గోడలు వ్రీలి గండ్లు నేర్పడియెను
దూరిరా గండ్ల నాల్వోరు భటులు ॥

తే॥గీ॥ గడమునన్ప్రవేశించిన దడము నడ్డ
సాగె – "కృష్ణాజి కంకు" నేసాజి కొడుకు
గట్టి యత్నము చేసియు గాయపడగ
చేరువగల భటాళి రక్షించిరతని ॥ 1575

తే॥గీ॥ తెఱపి లేకుండ జడివాన కుఱియుచుండె
'పోండ' కోట శతఘ్నులు గుండుల జడి
కురియ – నాల్వోరు సైన్యము పఱిసి పోయి
తిరిగి కూడుచు – పోరికై తివిరె మరల ॥ 1576

సీ॥ శంభాజి వచ్చెను సాయమ్ము చేయగ
నారు వందల సైన్యమంటి రాగ
యాజితుములమయ్యె నాల్వోరు సైన్యము
దిక్కుతోచని పరిస్థితికి లోగె
"మనమిప్డు వెనుకకు మరల కుండక యున్న
నదిని దాటగ నీయ రదిప్రమాద
మ"ని పోర్చుగీసు వారరిగిరి వెన్కకు
"దుర్భట" కోట ప్రాంతోర్విఁజేర॥

తే॥గీ॥ నచటి గిరులందు దాగి యున్నట్టి శంభు
భటులదాటున పైబడి రదరి పడియు
తాము బందూకులను ప్రేల్చి తలగు చుండి
రా "మరాటాల" నోర్చి 'పరంగి' యుధులు ॥ 1577

(తుములము=సంకులము; యుధులు=యోధులు; నిమిత కాండ్రు=సైనికులు)

‘శంభాజీ’తో యుద్ధములో ‘పోర్చుగీసుల’ పరాజయము - పలాయనము - ‘సెయింట్ ఎస్తేవామ్’ కోట మరాటులకు లోబడుట

తే॥గీ॥ ఆ రణమున మరాట భటాసి చేత
గాయపడె ప్రక్కటెముకల చాయయందు
పోర్చుగీసు నాయకుడు ‘నాల్వోరు’ - కాని
యతడు నని కొనసాగింప జతనపడెను ॥ 1578

తే॥గీ॥ ఆత డెంత చెప్పినను భయార్తు లగుచు
పోర్చుగీసులు మాండవీ బురద నీట
దూకి తప్పించుకొనిరి - చిరాకు పడుచు
పరి ననుసరించు - ‘దొర’కాయె - ‘పంకచర్చ’ ॥ 1579

ఉ॥ గోవకుదీచిదిక్తటిని కూలిని ‘మాండవి’ చీలి పోవగా
ప్లావన యుగ్మమౌచు - నడి పట్టున యేర్పడె “జూవె” దీవి యా
తావున దుర్గమున్నిలిపి దానికి పేరు “సెయింతు యెస్తెవామ్”
నీవరు పూత సంస్మృతిగణింపగ నుంచిరి ‘పోర్తగల్’ ప్రభుల్ ॥ 1580

ఆ॥వె॥ కోట చుట్టు నున్న కొబ్బరి తోటల
లోన దాగి శంభు సేన వేచె
ప్రాంశు సుదృఢ కుడ్యవలయితమౌ దుర్గ
మాక్రమించు కొనెడు నదను వేచి ॥ 1581

చ॥ తొలుత తురంగ మెక్కి ధునితోయములందిగి సద్దు సేయకా
వలతటి చేరె శంభుడటుపై నొక నల్వది మంది సైనికుల్
జలధిగ దాటి రెట్టి సడిచప్పుడు సేయక, కోట డాయుచున్
పలపల నిచ్చెనల్ నిలిపి పాకిరి వప్రముపై కదాటునన్ ॥ 1582

(దొర=నాయకుడు; పంకచర్చ=బురద పూత)
(ఉదీచి=ఉత్తరము; ప్లావనము=ప్రవాహము; యుగ్మము=జంట; నీవరుడు=సాధువు; కూలిని=నది; పూత=పవిత్రమైన) పోర్తగల్=పోర్చుగీసు (జలధిగ=నది)

తే॥గీ॥ 'ఖండొ బల్లాలు' వారిని కలిసి కొనియె
కేవలము ఘటిలో కోట చేతఁజిక్కె
నెట్టి ప్రతిఘటనము గూడ యెదురుపడక
భయము నొందిరి 'పానాజి' పౌరులెల్ల ॥ 1583

ఉ॥ రెండవ కోట గూడ యటులే వశమయ్యె మరాట వారికిన్
చండతరాగ్రహుండగుచు చయ్యన "కొండెడియాలవోరు" తా
దండునుఁగూర్చికొంచును శతాధిక వీరులఁ, 'సెంతుయెస్తెవామ్'
దండిగడమ్ము గెల్చుకొన దాడినొనర్చెను విక్రమోద్ధతిన్ ॥ 1584

తే॥గీ॥ కాని పోర్చుగీసు దళమా కదన మందు
నిలువ లేక పఱచు చుండి, నిమ్నగజల
కర్దమమున చిక్కు వడుచు కదల లేక
నిహతులైరి మరాట తీక్ష్ణషహతిని ॥ 1585

మ॥ హత శేషుల్పరుగెత్తిపోవ 'దొర'యౌ 'యాల్వోరు' తానున్నదిన్
చ్యుత ధైర్యుండయి దూకి తప్పుకొని పోజూడన్ ప్లవమ్మొండు యా
గతిలన్దేలుచు వచ్చుచుండ, తదవస్కంభమ్మునన్ దాటగా
జతనమ్ముంబొనరింప – రాట్ప్రతినిధిన్ శంభాజి దృష్టించుచున్॥ 1586

పారిపోవు గోవా రాజ ప్రతినిధిని 'శంభాజి' వెంబడించుట

ఉ॥ "వాడట! నన్సజీవునిగ బంధితుఁ జేయుచు 'ఢిల్లి బాద్షా'కున్
సూడిదగా నొసంగ, తదనుత్తమ సేకము మాఱుగా మొగల్
ఱేడును, 'నబ్బసొమ్మయిన' రీతిగ కొంకణ తీర దేశమున్
వాడికి కాన్కసేయునట! నాచులు నూళ్ళను పంచుకొన్నటుల్॥ 1587

(నిమ్నగ=నది; కర్దమమ=బురద; తీక్ష్ణషు=తీవ్రబాణములు)

(ప్లవము=తెప్ప; గతిల=నది; అవస్కంభము=ఆధారము; దృష్టించు=చూచు)

(సూడిద=కానుక; సేకము=కానుక; నాచులు=దొంగలు)

తే॥గీ॥ ఇటి దుర్మార్గునుఱక పోనీయఁదగునె?
పట్టి పల్లార్తు నిప్పుడీ పఱచ "ననుచు
'మాండవి' నది పాయ సలిలమందు దిగెడు
తటిని, యా యేటి కొక పెద్ద వరద వచ్చె ॥ 1588

చ॥ తురగము నట్టి వఱ్ఱునను దూకగ సంశయ మొందె - కాని త
న్నిరుపమ సాహసుండయిన నేత తలంపు నెఱింగి దూకె - న
ట్లరుగుచు నుండ పెద్ద కెరట మ్మొకటుంకె హఠాత్తుగానదిన్
హరియును, శంభుజీయు మఱుగైరి మునుంగుచు నా పురోటిలో॥ 1589

తే॥గీ॥ 'శంభు' గజయాత గాడయ్యు చరణ మొకటి
యంక వన్నె నిఱుకఁ నిస్సహాయు డగుచు
మునిగిపోఁజొచ్చె వారువమును మునుంగ
'ఖండొబల్లాలు' సాక్ష్యుడై గతిలఁనుఱికె ॥ 1590

కం॥ చరచర ఛురికను దూయుచు
పరపర నాయంక వన్నె పాశములన్నిన్
బిరబిర కోయుచు శంభుని
తొరతొరగా నీటి తొరకు దూరముఁ జేసెన్ ॥ 1591

ఛత్రపతి శంభాజి తనకు ప్రాణ దానం చేసిన 'ఖండోజి బల్లాలుకు ప్రగాఢ కృతజ్ఞత వెల్లడించుట

సీ॥ శంభాజి యెదలోన కుంభితమైన "కృ
తజ్ఞతా భావముత్కటము గాగ
"ఖండోజి"! నీయుప కారమునకు నేను
నాజన్మ మధమర్ణుడైతి జుమ్ము !

(పట్టిపల్లార్చు=శిక్షించు; పఱచ=దుష్టుడు)

(వఱ్ఱు=వరద; ఉంకు=ఎగసిపడు; హరి=గుఱ్ఱము; పురోటి=వరద)

(అంకవన్నె=రికాబు; వారువము=గుఱ్ఱము; గతిల=నది)

(అంకవన్నెపాశములు=రికాబు త్రాళ్ళు; నీటితొర=నీటి వలన కలిగిన ఆపద (జలగండము)

“చేఁజేత నీ తండ్రి “చిట్నీసుఁ” జంపించి
తనుమతో సత్యమ్ము నరయకుండ
యందుకు మారు నా యసులు నిల్పితి వీవు
నీ కన్నను మహా మనీషి యెవరు? ॥

తే॥గీ॥ మొదలు మీ ప్రభుజాతి యొప్పిదమె వేరు
ఆ “మురారిప్రభు” “పురందరం”దు గాని
అట్లె “బాజీప్రభు” “గజ పూర్ణం”దు గాని
నీ విపుడు – సాహస త్యాగ నిధులు గారె” ॥ 1592

కం॥ అని హృత్పూర్వకమౌ శ్లా
ఘనమును ఘనముగను శంభు “ఖండోజీ” ప
ట్ల నొనర్చె – మనిషిని ‘మనీ
షిని’ చేయు, ‘కృతజ్ఞత’ యను శిష్ట గుణమిలన్ ॥ 1593

మహావీరుడు “కృష్ణాజి కంక్” వీర స్వర్గమలంకరించుట

తే॥గీ॥ ‘పోండ’ కోట శైథిల్య సంపూరణమున
కహరహమ్ములు నవిరతిగా శ్రమించు
చుండె – ‘యేసాజి కంకు’ నిస్తుల తరస్వి
వృద్ధుడయ్యు – యువలతని కెంతొలొచ్చు ॥ 1594

కం॥ ఆలో తెలిసెను “కృష్ణా
జీ లేడిక మనకటంచు” – చిత్తోద్వేగా
వాలమునౌ వార్త పిడుగు
వోలె ‘న్నేసాజి’ యెడద పురపురఁ పొక్కన్ ॥ 1595

(అధమర్ణుడు=ఋణగ్రస్తుడు; అనుమ=శంక; ఒప్పిదము=పోడిమి యోగ్యత)

(తరస్వి=వీరుడు; యువలు=యువకులు)

తే॥గీ॥ శంభుజీయు నెఱిగెను – "కృష్ణాజి కంకు"
వీర గతిని పొందిన సమాచార మంత
యంతులేని సంతాపము నతని యెదను
చిమ్మ చీకటి వోలెను క్రమ్ము కొనెను ॥ 1596

ఉ॥ "ఎంతొ భవిష్యమున్న నొక యెక్కటి వీరుడు చిన్న కోటకై
యింతటి త్యాగమున్ సలుప నెంచెనె? యెంత స్వరాజ్య భక్తియో
యెంతటి రాజ భక్తియొ కదే! యటువంటి ప్రవీరులున్కి ని
శ్చింతగ హిందు రాజ్యము సృజింపగ నెంచెనొ? శ్రీ శివాజియున్॥ 1597

తే॥గీ॥ ఎంత పలవించినను గూడ యీ శుటీరు
తిరిగి తేలేము భువికి – తక్కొరులు గూడ
యతని నిస్వార్థ సాహస, త్యాగ, దేశ
భక్తి గుణముల ననుకరింపంగ వలయు" ॥ 1598

తే॥గీ॥ అనుచు నప్పుడె తనదు రాజ్యమ్ము నందు
మంచి జాగీరు నొకటి వ్రాయించి యిచ్చె
'వీర కృష్ణాజి కంకు' కుమారునకును
ఘనముగా సత్కరించె 'నేసాజి' నటులె ॥ 1599

ఉ॥ ఆపయి శంభుజీ తలచె 'నాజినొనర్చి 'పరంగు' లింక తా
మీ పుడమిన్త్యజించి తమ మేదిని కేగెడు నట్లు చేయగా
నోపిననే మరాటు లపరోదధి తీరమునన్స్వతంత్రతా
స్థాపన చేయ గల్గుదురు – తత్క్షణ మాపని చేయగా తగున్"॥ 1600

తే॥గీ॥ అనుచు నిశ్చయించి కలిసి కొనెను శంభు
కవికలశు, దుర్గదాసు నక్బరులనపుడు
"మనము" పానాజి పురములో జొనుప వలయు
షద్భుత భటులం బరిపాటి జనుల వోలె" ॥ 1601

(శుటీరుడు=శూరుడు)
(చొనుపు=ప్రవేశపెట్టు; పరిపాటి=సామాన్య)

తే॥గీ॥ అనగ శంభాజి - షాజాద అక్బరుండు
రాష్ట్రప్రతినిధినియర్థించి రాజధాని
రేవున తనకు నౌక నిర్మించు కొనెడు
సమ్మతిని పొంది - తన పరిజనుల నంపె ॥ 1602

తే॥గీ॥ నావ నిర్మింప 'పానాజి' రేవు నందు
దిన దినమ్మును పెరిగెడి జనుల సంఖ్య
చూచి 'యాల్వోరు' కాశంక తోచి - తక్ష
ణమ్మె యచటి నావ పనుల నాపి వైచె ॥ 1603

తే॥గీ॥ శంభు సేనలు 'మడ్గావు' చర్చి దోచి
రెట్టి హాని జనులకు, చర్చికిని లేని
కరణి, మత సామరస్యము న్నారవించి
యనువు కాలేదు పానాజి నాక్రమింప ॥ 1604

రాష్ట్రప్రతినిధి కొండెడి ఆల్వోరు రాజధానిని పానాజి నుండి "మార్మ గోవా"కు మార్చుట

తే॥గీ॥ రాజధాని "నాల్వోరు" "పానాజి" నుండి
"మార్మగోవా"కు నిధితోడ మార్చి వైచె
కటకముగ నున్న 'పానాజి' కాపుదలయు
కరము దుష్కరమని యెఱుకయ్యె నేమొ? ॥ 1605

తే॥గీ॥ నిండు సామగ్రితో వచ్చి నిలిచె మొగలు
నావ యొక్కటి "వెంగుర్ల" రేవు యొద్ద
యెంత చెప్పినను "పరంగు" లిచ్చి, పుచ్చు
కొనెడు మైత్రి వీడరు "జహాపనుని" తోడ ॥ 1606

(ఆశంక=అనుమానము)

(జహాపనా=ఔరంగజేబు; పరంగులు=పోర్చుగీసులు)

(నిధి=రాజకోశము; కటకము=రాజధాని; కాపుదల=రక్షణ)

"ఛత్రపతి శంభాజీ" భారత దేశము నుండియే పోర్చుగీసులను సమూలముగ పారద్రోలవలెనని నిశ్చయించుట

చ॥ ఇగనొక "పోండ కోట" ను జయించుట కాదు – "సెయింతు ఎస్తెవా
ము" గడము నాక్రమించుచు ప్రమోదము నొందుట గాదు–గోవ రాజ్యమె
ల్ల గెలిచి పోర్చుగీసుదొరలన్ తమ దేశము దాక పారద్రో
ల గలిగినప్పుడే – "పిత"కలన్ యిల 'నిక్కల' చేసినట్లగున్ ॥ 1607

తే॥గీ॥ మరియు 'సాల్సెట్టి' 'బార్దేషు' మండలముల
కొలది దినములలోనె లోగొనుచు పిదప
'మాండవీ' నదిదాటి యామైని గోవ
పృధ్వినెగుర వేయవలె "నారింజపడగ" ॥ 1608

తే॥గీ॥ అనుచు శంభాజి చెప్పుచున్నట్టి వేళ
హైందవులు కొంద రచ్చటి కరుగు దెంచి
తమకు నా పోర్చుగీసు క్రైస్తవుల చేత
కలుగు నిడుమలనన్ని యేకరువు నిడిరి ॥ 1609

చ॥ "తమనణగించి – వారల మతమ్మగు క్రైస్తవమందు చేర్చుటే
తమజని లక్ష్యమన్నటుల దర్పము చూపు 'పరంగి' వారికిన్
తిమురణగింపకున్న నిక దేశము వీడుటొ? 'వ్రాత్యజాతి' వా
రమగుటొ? తప్ప"దంచును మొరన్నిడ శంభు ప్రసన్నుడై యనెన్॥ 1610

(నిక్కల=నిజముగా జరుగుకల)
(నారింజ పడగ=భగవా పతాక; వ్రాత్యులు=సంఘబహిష్కృతులు)
(తిమురు=మిడిసిపాటు)

ఛత్రపతి శంభాజీ మత సామరస్య భావన

ఉ॥ "దేవుని పేర నిల్పబడు దీమములన్ పడగొట్టు టెంతయున్
సావరమౌను నెట్టి మనుజాళికి నైనను, దేవుడొక్కడే
కావున, పేర్లు వేరయిన కారణ ముంగొని యన్యధర్మ వి
ద్రావముకై తెగంబడెడు దస్యుల దైవము మెచ్చడెన్నడున్ ॥ 1611

తే॥గీ॥ కోవెల, మసీదు చర్చియు దైవ చిహ్న
ములుగ నాయా మతమువారు తలతురు గద !
అందు ఎద్దానికేనియు హాని తగదు
మతము పేరిట ద్వేషమమానుషమ్ము ॥ 1612

తే॥గీ॥ పోర్చుగీసు దురాత్ములు – పొలుపఱంగ
సల్పిరంట – "మహాలక్ష్మి" – "శాంతదుర్గ"
మరియు "మంగేషి" దైవత మందిరముల
నని యెటింగితి – పునరుద్ధరణ మొనర్తు ॥ 1613

తే॥గీ॥ మనము హిందువులుగ నన్ని మతములకును
తులిత గౌరవమిత్తు మకలుషమతిని
కాన మీరు "చర్చి"లకు యేహాని సేయ
కూడదు – పరంగులు "గుడుల" న్కూల్చిరనుచు" ॥ 1614

కం॥ అనుచును "కొంకణి" హిందూ
జనుల మనమ్ములలరించి – శాంతోక్తులతో
ధనమును దండిగ నొసగుచు
తనిపెను తజ్జనుల శంభు దయ యొప్పారన్ ॥ 1615

(దీమము=ఆలయము; సావరము=అపరాధము; విద్రావము=నాశనము; దస్యుడు= అనాగరికుడు)

గోవా రాజ ప్రతినిధి 'ఆల్వోరు' తన వరుస ఓటములకు క్రుంగి పోయి "బామ్ జీసస్ చర్చిలో సెయింట్ జేవియరు" మృత దేహమునకు మ్రొక్కుకొనుట

సీ॥ 'కొండెడి ఆల్వోరు' కోల్పడ్డ "సంతెస్తె
వామ్" గడు తిరిగి గెల్వంగ లేదు
మాండవీ తీరాన మండు చుండె మరాట
దివిటీలు రేల దేదీప్య మగుచు
"థాణె" "తారాపూరు" తద్ద "గోవా" దాక
చెల్లు చుండె మరాట శిష్టి యొకటె
"ఫ్రాన్సిస్ డి కోస్ట" – నిర్వర్తిత "చౌలు"కు
లేఖ పంపె 'హములు' లేమి గూర్చి ॥

తే॥గీ॥ పోర్చుగీసు లిక తమను, బ్రోచువాడు
'సంతు జేవియర్' – 'బామ్జీససనె'డి చర్చి
లోని శవపేటిలో సుప్త రూపు డగుచు
నున్నవాడని మ్రొక్కిరే తెన్ను లేక॥ 1616

సీ॥ "సాల్సెట్టి" "బార్దేష" "షాపొరా" కోటలు
వశపడె మారాట వాహిని కని
"కొండెడి ఆల్వోరు" గుండె చెదరి పోవ
"సంతుజేవియరె" రక్షకు డటంచు
"బాముజీసను" చర్చి ధామమున్జేరుచు
శవపేటిలో సంతు సబముయెదుట
"సామి నీవే మాకు సంరక్షకుండవు
కావుము నేటి సంకటము నుండి"॥

తే॥గీ॥ యనుచు ప్రార్థించె – నన్న పానాదికములు
నిదుర గూరుట – మొదలైన నిత్యకృత్య

శిష్టి=శాసనము; నిర్వర్తిత=నిర్వాహకుడు; హము=ఆయుధము; సబము=శవము

ములను యా 'చర్చి'లోనె తా పొంకపరిచె
'శంభు' నామమె కేసరి స్వపము గాగ ॥ 1617

రాయబారి "ఏసాజీ గంభీరరావు" పోర్చుగీసుల నిర్బంధము నుండి స్వేచ్ఛ పొందుట

తే॥గీ॥ అంత వరకు పరంగీల యదుపు లోన
నున్న "యేసాజి గంభీరు" కొదవె స్వేచ్ఛ
యతడు మారాట 'ప్రణిధి' - బంధితుడునయ్యె
'రభువు' గా మున్పరంగీల సభకు వచ్చి ॥ 1618

పోర్చుగీసులు ఛత్రపతి శంభాజితో సంధికై దిగివచ్చుట

తే॥గీ॥ "శంభు" "మ్హాప్సె" లో జొచ్చి ధ్వంసమ్ముఁజేసె
కొనెను "నగువాద" "రోషము గోషు" గడులు
శంభుతోడ పరంగీలు సంధి సంప్ర
దింపులకయి ప్రణిధిని పుత్తెంచిరపుడు ॥ 1619

తే॥గీ॥ జరిగె ద్వావింశి దినములు - శంభుసేన
పోర్చుగీసుల కోటలు ముట్టడించి
పోరొనర్చుట మొదలయి - పోర్చుగీసు
వారు సంధికోరి దిగిరా వలసివచ్చె ॥ 1620

(కేసరి స్వపము=సింహ స్వప్నము)
(ప్రణిధి రభువు=రాయబారి)
(ద్వావింశి=యిరువది రెండు)

పోర్చుగీసులకు సహాయముగా 'షాజాదా మౌజము' లక్ష సేనతో వచ్చుట

తే॥గీ॥ 'అపుడె' "సంతు జేవియరు" మహత్త్వము నట
చూపదలచె కాబోలు పోర్చుగలు ప్రజకు
'షాహజాద మౌజ'మొక లక్ష ప్రమితము
కటకముంగొని "రామ్‌దారు" కనుమఁజేరె ॥ 1621

తే॥గీ॥ మొగలులిటు, పరంగులునటు మోహరింప
నంత తామట నడకత్తెరందు పోక
వలె నిఱుకు కొనెదమని - శంభాజి యపుడు
పరిని మరలించె సామంతవాడి - జేర ॥ 1622

తే॥గీ॥ అట్లు పోర్చుగీసు ధరణి నాక్రమించు
జతన మంతయు విఫలమై శంభుజీకి
కడిదియైన యాశాభంగ మడరె తుదకు
పితను, సుతుని వంచించె దుర్విధియె యిట్లు ॥ 1623

శంభాజీ రాయగడములో లేడని తెలిసి షాబుద్దీను రాయగడముపై దండెత్తుట

తే॥గీ॥ తొలుత "బుర్హానుపురి" నాఱు నెలల వసతి
వదలి "యౌరంగబాదుకు" కదలి వచ్చె
నదియు కాదని వచ్చె "నహమదు నగరు"
కట్లు "దక్కను" కెంతొ దాపయ్యె బాధ్ష ॥ 1624

(ప్రమితము=పరిమితిగల; కటకము=సేన)
(పరి=సేన)
(పిత=శివాజీ; సుతుడు=శంభాజీ)
(దాపు=దగ్గర)

సీ॥ "రామ్సెజు" కోట యాక్రమణము నందున
దెబ్బతిన్న 'షహబుదీను' ఖాను
నపుడు "రాయగడము" నాక్రమించుమటంచు
పంపె వానిపయి విశ్వాసముంచి
"పీరూజి జంగ" ను బిరుదును గొన్నట్టి
షహబుదీను కదలె సమరమునకు
"శంభుజీ కొంకణ సాగర తటమున
'కలడు' - రాయగడు వాకిలి వివృతము ॥

తే॥గీ॥ గ్రామ సింహము వోలె నా గడమునందు
సుళువుగా దూరగలమను చోర బుద్ధి
తోడ - షహబుదీనరుదెంచి తొలుత గడము
చుట్టు గల పల్లెలను కొల్లగొట్ట నడరె ॥ 1625

చ॥ పేద కృషాణులిండ్లపయి బీరముఁజూపుచు కృష్టి కెంతయు
న్నాదరువైన యెడ్లపయి - యర్భుల నోమెడు పాడి గొడ్లపై
వాదర సానబెట్టుచును - పైరులఁద్రొక్కుచు - గడ్డి వాములన్
బూదియొనర్చు చుండి, షహబుద్ది నెలర్చెను దుష్ట బుద్ధియై॥ 1626

ఉ॥ ఐదు దినమ్ములీపగిది నంతక తుల్యుడు షాబుదీను చే
నేదెను నుక్కి రాయగడు నెల్లకు లోపలి పల్లెలన్నియున్
యేదియొ గొప్ప కార్యమొనరించిన రీతిగ కమ్మ పంపె నా
పాదుష "కింక రాయగడు పట్టుటయే తరువాయి" యన్నటుల్॥ 1627

తే॥గీ॥ అరువదారేండ్ల వయసు - పదైదు లేండ్ల
యనుభవము కల్గు పాదుషా - తనను తానె
నమ్మని నిరత సందేహి - కమ్మఁజదివి
"యాబుమహ్మదు" నడిగె - సత్యమును తెలియ ॥ 1628

(వివృతము=తెఱచినది)

(కృషాణులు=సేద్యగాండ్రు; కృష్టి=వ్యవసాయము; అర్భులు=పిల్లలు; వాదర=ఖడ్గము; ఎలర్చు= సంతోషించు)

షాబుద్దీను అధిక ధనములు, బిరుదములు యిచ్చి మరాటా దుర్గాధి పతుల నెందరినో వశపరచుకొనుట

కం॥ ఆబూ మహ్మదు చెప్పెను
"షాబుద్దీనుని విజయ మసత్యమ్మెనన్
లోబఱచుకొనె మరాటుల
లోఁబలు "దుర్గపుల" ధన ప్రలోభము చేతన్ ॥ 1629

తే॥గీ॥ ఇక మనము దుర్గములఁగొన నెత్తిపోవు
నట్టి పనియెల్ల కేవల నాటకమ్ము
మొగలు వారిని దుర్గము మొగనెఁజూచి
తెఱతురు తలుపులు గడుల దొరలు తామె" ॥ 1630

తే॥గీ॥ అనెడు "ఆబు మహ్మదు" "సువార్త"ను వినుచును
మొగలు పాదుషా లోలోన పొంగిపోయె
"శంభుజీ" యేపు మాపెడి సమయ మింక
మిగుల దౌల లేదనెడి నమ్మికయుఁగల్గె ॥ 1631

"షాబుద్దీను" పై కవికలశు విజయము

శా॥ 'గోవా' ముట్టడి పూర్తియై పురిని చేకోఁబోవు సందర్భ మం
దే - వార్త ల్వినవచ్చె 'రాయగడు' పై నెత్తెన్ మొగల్దండు యం
చావేళన్నిక 'గోవపై ఁజను పటాహమ్మున్విసర్జించి తో
డ్తో వాయుత్వర వచ్చె ముందు కలశుండు 'న్రాయరీ' రక్షకై ॥ 1632

తే॥గీ॥ అప్పుడు మరాట శస్త్ర శాలాధిపతి "ము
రారిదంగె" యేతెంచి, మున్నూఱు నాశ్వి
కులను గొని - షహబుద్దీను క్రూరకృత్య
ములను తెలియఁజేసెను కవి కలశునకును ॥ 1633

(దుర్గపులు=దుర్గాధిపతులు) (మొగ=ముందు)

(దౌల=దూరముగా) (పటాహము=ఉద్యమము; రాయరీ=రాయగడు)

తే॥గీ॥ చూచె 'గంగోలి' యడవిని లేచు పొగను
కలశు డాప్రాంతమునకు దగ్గరగఁజనియె
"గంగొలి" "పనాశె" "జోర్గావు" గ్రామములకు
నట్టులే "నిజాంపూరున" కరిగె నతడు ॥ 1634

చ॥ అడవిని దాగియున్న హలికావళులు స్వకుటుంబులై బయ
ల్వడిరి - మరాట సైన్యములు వచ్చిన సవ్వడి నాలకించి - యా
పొడువ మొగల్పడాలు 'షహబుద్దిను' చే పడినట్టి పాటుల
న్నిడుములు చెప్పిరా కలశు డిన్నియు వించు మహోగ్రమూర్తియై॥ 1635

చ॥ తరిమెను మల్క సైన్యమును "తమ్హిని" కోనను చేరుదాక - త
త్పరిసర గ్రామ సైరికులుదాయుధులౌచు తురుష్క సైనికో
త్కరము పయింబడ న్చెదరి కాళ్ళకు బుద్ధిని చెప్పిరందరె
వ్వరికనువైన వారలటు వైపుకు పాఱుచు దిక్కుతోచకన్ ॥ 1636

తే॥గీ॥ అట్లు మొగలులను మరాటు లటిమి తఱుము
కొనుచు కడకు "నిజాంపూరు" కుత్క్రమింప
వారికచట దుఖ్లస్‌ఖాను పట్టుబడెను
వాని క్షమియించి కలశుడు వదలివేసె ॥ 1637

చ॥ వదలెడు ముందు "దుఖ్లసు"కు వారక శ్రీ కలశుండు చెప్పె - "నీ
విది వినిపింపు పాదుషకు - "విశ్వవిజేతగ నీకు నీవె - దు
ర్మదమున "పంగుతైమురును" మా 'కొలసామి' యటంచు నేతులన్
వదరుచు-మా స్వతంత్రతను బాపగ వచ్చిన "పంగువౌ" దికన్"॥ 1638

కం॥ అని చెప్పి 'దుఖ్లసుని' - బం
ధనములు విడిపించి పంపె - తలనుతడుముకొం
చును 'బ్రదుకు జీవుడా' యని
చనియెను పులినోటికండ జారి పడినటుల్ ॥ 1639

(పొడువ=దుష్టుడు; పడాలు=సేనాపతి)
(ఉత్క్రమించు=ఏగు, వెడలు)
(ఉరాయుధులు=పైకెత్తిన ఆయుధములు కలవారు)
(పంగుతైమురు=కుంటి తైమూర్‌ఖాన్; కొలసామి=వంశీకుడు; ఏతులు=ఎచ్చులు; పంగు=కుంటి)

షాజాదు మౌజము లక్ష సేనతో 'గోవా' ను చేరుట

సీ॥ షాజాదు 'మౌజము' శత సహస్ర దళము
చేరెను 'గోవా'కు చేరువగల
'బందా' పురమునకు - సందేశమంపించె
రాజప్రతికి తన రాక గూర్చి
'యాల్వోరు' మారుగా - 'యాల్బుకర్క'రుదెంచె
మౌజముకది యవమతిగఁదోచె
యాయుధపూర్ణము లౌ తరు 'ల్సారతు'
కడనుండి రాగ లంగరును దింప ॥

తే॥గీ॥ 'మాండవీ' నదియందనుమతిని గోర
'మాండవి'ని గాదు - 'కైసూరు' మంచిదనగ
మండిపడె 'నాల్బుకర్కు'పై 'మౌజ' మపుడు
"ఎడ్డనగ తెడ్డనెద" విదియే మటంచు ॥ 1640

తే॥గీ॥ "మాదు కప్పలు" లను నిల్ప 'మాండవి' నది
యందు, 'పానాజి' కుప్పలి యగునటంచు
జంకు చుంటిరి మాపైన శంకతోడ
నమ్మకము లేని మైత్రి యెన్నాళ్ళు నిల్చు"? ॥ 1641

తే॥గీ॥ అనుచు 'మౌజము' తెగనాడె 'నాల్బుకర్కు'
నంత గ్రహియించె - 'శంభాజి' యనిన వీరు
భీతిగొని మరాటాలతో భేదమునకు
సిద్ధముగ లేరని - పిత యాశించినట్లు ॥ 1642

(తరులు=నౌకలు) ప్రతి = ప్రతినిధి
(కప్పలి=ఓడ; ఉప్పలి=అపాయము)

'షహజాదుమౌజము' సేనపై "సామంతువాడి" యొద్ద మరాటులు దాడిసేయుట

తే॥గీ॥ తాము "రామ్దారు" కనుమను దాటి వచ్చి
పిదప "సామంతవాడి"లో విడిసి నపుడు
మధ్యలో మరాటు లడవి మాటు నుండి
తమను బాధించినందుకు తామసమున ॥ 1643

తే॥గీ॥ "బంద", "వెన్గుర్ల" "సామంతవాడి" మండ
లముల గల పల్లెలను రగులంగ జేసి
'గోవ' తీరము న్బ్వాడిద కుప్పఁజేసి
రా మొగలులు-మరాట రాజ్యమని తలచి ॥ 1644

ఛత్రపతి శంభాజీతో పోర్చుగీసులు సంధి చేసికొనుట

తే॥గీ॥ 'శంభు'తో పోర్చుగీసులు సంధి చేసి
కొనిరటు 'వసై'మొదలుగ 'దామను' వరకును
కలుగు సీమలలో 'చౌతు' కరములన్ని
'శంభున' కె యప్పగింప సంశ్రవము నొసగి ॥ 1645

'షాజాదామౌజము' పోర్చుగీసుల నిర్లక్ష్య వైఖరిని నిందించుట

మ॥ మిము రక్షింపగ 'శంభు' నుండి, యిటులంపెన్మమ్ము-యీ 'గోవ' రా
జ్యముకు -న్మీరలు శంభుకు న్బెదరి శాంత్యాకాంక్షులైనట్లు మ
స్తములన్వంచిరి సంధి సేతకు మమున్శంకించుచున్ మాదు పో
తము లన్మాండవి వాహిని న్నిలుప వద్దంచున్నివారింతురే? ॥ 1646

తే॥గీ॥ 'మేము వెఱ్ఱులమై వచ్చి నామె యిటకు?
వట్టి చేతులతోడ పోవలసి వచ్చె"
ననుచు షాజాదు మౌజము నాగ్రహించె
నపుడు 'మౌజము'తో 'దివానా'డెనిట్లు ॥ 1647

(సంశ్రవము=సమ్మతి)

తే॥గీ॥ "వినుము షాజాద! యిప్పుడే మనకు తగిన
సందు - త్వదనుజు నక్బరున్నంది సేయ
నాతడు 'డిఘోలి' లో 'శంభు' కాశ్రితుడయి
యున్నవాడట - యనుచు సముత్సుకతను ॥ 1648

సీ॥ అప్పటికె 'డిఘోలి' యాశ్రయమును వీడి
యజ్ఞాత వసతికి నక్బరరిగె
నన్నవార్త తెలిసి యాగ్రహోదగ్రుడై
ధ్వంసించెను 'డిఘోలి' 'బంగళా'ను
నుద్యాన వనమును నుద్వాంతముల చేత
త్రొక్కింపగాఁజేసి రూపు మాపె
"భట్గ్రాము" "నర్వె" నా పల్లెటూళ్ళను దోచె
"పింపలుగాము"లో వెలసియున్న ॥

తే॥గీ॥ పూత రామాలయమ్మును బుగ్గి ఁజేసె
సప్తకోటీశ్వరాలయాంచలముఁద్రుంచె
గోవ పొలిమేర దక్షిణ కొంకణపు మ
రాట రాజ్యమున్నిష్పచ్ఛరమ్ము చేసె ॥ 1649

కం॥ పఱచగ 'యిరాను' నకు 'న
క్బరు' తా "వెన్గుర్ల" రేవుకడ తరియెక్కన్
పురికొనుట నెఱిగి మౌజము
విరియించెను రేవునెల్ల "వెన్గుర్ల" కడన్ ॥ 1650

తే॥గీ॥ తమకు సూరతు నుండి నిత్యావసరము
లాయుధమ్ములు తెచ్చెడు నట్టి నౌక
లాగురేవు 'వెన్గుర్ల' నాలాగు నాశ
నమ్ము చేయుటచే తామె నష్టపడిరి ॥ 1651

(ఉద్వాంతము=ఏనుగు; అంచలము=అగ్రభాగము; నిష్పచ్ఛరము=నాశనము)

(పఱచుట=పారిపోవుట; తరి=నౌక; పురికొను=ప్రయత్నించు; విరియించు=నాశనముచేయు)

తే॥గీ॥ అంతియే గాక 'సూరతు' 'నవతరణము'
నుండి వచ్చునౌకలు చేరకుండ 'గోవ'
యాన మధ్యమందె మరాట సేన కవిసి
కొల్లగొనుచు నుండె సరకు లకుంఠితముగ ॥ 1652

తే॥గీ॥ అట్లు మారాట ధాటికి నందకుండ
బాయు తరులు పరంగుల పాలబడియె
నావలను నిల్పు కొనుటకు రేవు లేది
మొగలు లమ్మిరి 'పస' నల్ప మూల్యమునకె ॥ 1653

తే॥గీ॥ గోవ ప్రతినిధి పోర్చు గల్కువలయపతి
కతడు "శంభుజీ"తో చేసినట్టి సంధి
పత్రములనిచి తదనుజ్ఞ బడసి, మరల
తానె కొనసాగె ప్రతినిధి స్థానమందు ॥ 1654

గోవాప్రాంతములో షాజాద మౌజము సాగించిన విధ్వంసము, తమకే తీవ్ర నష్టము కల్గించుట

సీ॥ లక్షసేనకు సహస్రాధిక పశుతతి
కాహారము లభింపదయ్యె నచట
సూరతు నౌకలు దారి నడుమ నాగె
పాడు చేసిరి తామె పైర్లనన్ని
కాల్చివేసిరి రేగి గ్రామముల్పురములు
గంజియైన దొరకు గతియె లేదు
మూగపసులకొక పులుపోచ కఱవయ్యె
జంతు లొక టొకటె చావదొడగె ॥

(అవతరణము=రేవు)
(పాయు=తప్పకొను; ఏది=నశించి; పస=సామగ్రి)

తే॥గీ॥ తొలుత కాపాడరమ్మని పిలిచి మమ్ము
నడుమ శంభుతో సంధికి నొడబడుచును
నిపుడు లెక్కింప కుండిరి యీ పరంగి
వారనుచు మౌజమునకు కోపమును వచ్చె ॥ 1655

తే॥గీ॥ తిండి లేనట్టి మొగలుల దండు నెట్లొ
కదలి 'రామ్దారు' కనుమ మార్గమును దాటు
చుండ – నచటి యడవుల దాగుండి – పై బ
డిరి మరాటులు – మొగలులు డిల్లవడగ ॥ 1656

'షాజాదుమౌజము'నకు 'గోవా' దండయాత్రలో కలిగిన తీవ్ర ఆశాభంగము

సీ॥ 'గోవ' ప్రాంతమునందు నావికా కేంద్రము
స్థాపింపగా నెంచ స్వప్నమయ్యె
కొంకణమును గెల్చి కూల్చి 'రాయగడు'ను
శంభు బంధించుట స్వప్నమయ్యె
కొంకణమున తమ కొకరవయు 'పరంగి'
సహకారమబ్బుట స్వప్నమయ్యె
కొడుకులలో నీవె కడు ప్రయోజకుడ వం
చయ్య మెప్పుగొనుట స్వప్నమయ్యె ॥

తే॥గీ॥ పటు నిరాశయు, క్షుత్తు, నీర్వట్లు గలిసి
ఖిన్నునొనరింప "మౌజము" సన్నఁ జేసె
తిరుగు పయనము సాగింప దొరలకపుడు
నహమదు నగరముంజేర, నపజితుడయి ॥ 1657

ఛత్రపతి శంభాజీ తీవ్ర వైఫల్యములు

తే॥గీ॥ "జంజిరాకోట", 'గోవా' వశపఱచుకొన
పట్టు బట్టియు, 'శంభాజి – చిట్ట చివరి
లిప్తలో చెడె కార్యము – లెక్క మీరు
మొగలు సేనలు తమపైన మోహరింప ॥ 1658

ఔరంగజేబు అగణిత ధనముతో పాటు జమీందారీలు బహూకరించియు మరాటా వీరులను ప్రలోభపెట్టి తన వైపుకు త్రిప్పుకొనుట

సీ॥ 'వాసుదేవ్ పంతు'–'యశ్వంతరావ్ దల్వియు'
'రాహుజీ సోమ్నాద్' – 'కనహొజి షిర్కె'
'నాగోజి మానె', 'గంగాధరజి పంతు'
'మానోజి మోరె'యు – 'మాసటీలు'
'నాజిభూమిని' – రిపురాజి నుక్కడగింప
నొక్కడొక్కడె యొక్క యుక్కలుండు
నిచ్చివారలకెల్ల నెనలేని ధనములు
వతనుల్మొఖాసాలు, పదవులుడుపు ॥

తే॥గీ॥ లేన్గులు, గుఱాలు, పల్లకు లెన్నొ యిచ్చి
తిరుగులేని లోభమునకు గుఱినింజేసి
"షాహబుద్దీను" – హైందవ ద్రోహితతిని
వసముజేసె "పాదుషకు" బానిసలు గాను ॥ 1659

'ఛత్రపతి శంభాజి' తన సేనాధిపతులకు దుర్గ రక్షకులకు మ్లేచ్ఛుల దురాగతములను వివరించి తెలుపుచు, లేఖలు వ్రాయించి పంపుట

ఉ॥ "వీర మరాట సైనికులభిక్రమ పార్థులు – నీ స్వతంత్ర భూ
భారవహుండు శ్రీ శివజి పాలన కందరు వెన్నుగాపులై
మేరు సమాన ధీరులు నమేయ వినిశ్చల దేశ భక్త్య కూ
పారులునై ప్రవర్తిలిరి, వారల యారబమే "మరాట" యౌ ॥ 1660

(అభిక్రమము=యుద్ధము, అకూపారము=సముద్రము; ఆరబము=తొలకరి సస్యము)

తే॥గీ॥ అని తలంచుచు శంభాజి యంత కంత
కధిక మౌచున్న స్వీయ హృద్వ్యథ నడంచి
రణపరశురాములౌ దుర్గ, రక్షకులకు
కదన బలులైన దణులకు – కమ్మలంపె ॥ 1661

తే॥గీ॥ “కనుడు మరాట వీర రణ గాండివులార! మొగల్విభుండు – ద
క్కనుపయి కన్నువేయుటయె కాదిట కాలిడె – కోట వాకిటన్
మొనలను మోహరించె – మన ముందర ‘హిందు స్వతంత్ర రాజ్య ర
క్షణమ”ను భూరి బాధ్యత రసాధరమట్టుల నిల్చె తుంగమై ॥ 1662

తే॥గీ॥ ఎవరికి వారు స్వీయధరనేలు స్వతంత్రత పాపమన్నటుల్
యెవడొ ‘విదేశి’ భారతమునే కబళింపగ వచ్చి గెల్చి యీ
యవనిని – యత్త సొమ్ముగొని యల్లుడు దానము చేసినట్లు మీ
ద్రవిణమె మీకె కాన్కయిడి దాసులు కండన వెంట బోదురే ॥ 1663

చ॥ ‘వతను’ ‘మొఖాస’ ‘మన్సబు’ ‘సుబా’ యు ‘జమీనును,’ ‘పర్గణా’ లనం
గ తుఱక పల్కుబళ్ళు – మన కన్నులకున్మన వ్రేళ్ళతోనె – యం
ధత నొదవించు కుట్ర – స్వజనమ్ములపై కడు హెచ్చు పన్నులే
ర్చి, తఱిమి, యేచ – మన చేతికి పెత్తనమిచ్చు పేరులౌ॥ 1664

తే॥గీ॥ మనము కర్షుల కఠిన శ్రమాత్త ధనము
‘పన్ను’లని లాగ, వారల పస్తులుంచి
ఆ ధనమున సగము ‘బాద్ష’ కప్పనమగు
కాకులంగొట్టి గ్రద్దల సాకినట్టు ॥ 1665

ఆ॥వె॥ పాము పడగ నీడ బ్రతికెడు కప్పలు
బాద్షఁగొలుచు హిందు బానిసీంద్రు

(బలులు=బలరాములు; కమ్మలు=లేఖలు)
(తుంగము=ఎత్తైన; రసాధరము=కొండ)
(ఏర్చు=విధించు; తఱుదము=బలాత్కరించు; ఏచు=పీడించు)
(కర్షులు=సేద్యగాండ్రు; అప్పనము=కప్పము)

"వతనుదారు" దను పవాడము గొప్పదే
తుఱకవాని తొత్తు తొత్తు నతడు ॥ 1666

ఉ॥ వేల కొలంది దైవత నివేశనము ల్పడగూల్చె - హిందు పౌ
రాళిని "ధిమ్మి" లంచొక పరాభవ సూచక సంజ్ఞ నిచ్చి యా
పాలసు డెల్ల హిందువులపై విధియించెను "జీజియా" యనన్
నాలితనంపు శుల్కమును-నాడగ భారత జాతి నంతయున్॥ 1667

ఛత్రపతి శంభాజీ మరాటులను స్వాతంత్ర పోరాటమునకై పురికొల్పుట

ఉ॥ ఇప్పటికైన హైందవుల స్వేచ్ఛకు సాగెడి పోరునందు - మా
యప్ప శివాజి రాజు బ్రతుకంతయు నుంకువబెట్టి నిల్పె నే
గొప్ప మరాట రాజ్యమది క్రూర తురుష్క దురాక్రమమ్మునున్
తప్పుకొనంగఁజేయగ, నుదాయుదులై చనుదెండు నాబడిన్ ॥ 1668

తే॥గీ॥ ఈ మరాట దుర్గములకు నీరె ప్రభువు
లేల మొగలులతో చేరి హిందువులను
మీసహోదరులనె చంపు దోసమునకు
పాల్పడంగ - స్వేచ్ఛను మించు పదవి గలదె ॥ 1669

సీ॥ సింహగడము నందు సింహమై రేగిన
"తానాజి మాల్సురే" త్యాగమరసి
మును పురందరు గడమున "మురారిప్రభు"
పగటిన మగటిమి వగనుఁగాంచి
"పావనఖిండు"లో "బాజీ ప్రభు" శరీర
రక్తతర్పణ కేళి రహిని యెంచి
'బీజపూరు' దణిని యాజినెదిరిన ప్ర
తాపరావ్ గుజరు" చేతాకుఁజూచి ॥

(పవాడము=బిరుదు; తొత్తు=బానిస)

(నివేశనము=ఆలయము; సంజ్ఞ=పేరు; నాలి=క్రూరమైన; నాడుట=బాధించుట) పదవి=సంపత్తి

(ఉదాయుదులు=ఎత్తిపట్టిన ఆయుధములు కలవాడు; బడి=వెంట)

తే॥గీ॥ 'పోండ' కోటకై జరిగిన పోరనసువు
లుంకువనిడిన "కృష్ణాజి కంకు" నెఱిగి
ధనముకన్నను నభిమానధనము ఘనము
గాదలంచి రండు మరాట జోదులార" ॥ 1670

తే॥గీ॥ అనుచు 'శంభు' పంపిన యుత్తరాంశములను
చదివి - పెదవి విఱచిరి - యాశా పిశాచ
దుష్ప్రభావాహిదష్టులౌ దుర్గపతులు
శంభు బావయు, మఱదియే జారిరిగద ॥ 1671

ఉ॥ కమ్మలు వ్రాసినంత నధికమ్మగు కాంచన లోభమారునే
కమ్మని భోగ భాగ్యముల కాశ్రయమౌ యధికారలబ్ధి - భూ
స్వమ్ముకు యాజమాన్యమును - సైరికులన్ బెదరించి లెక్క ప
త్రమ్ములు లేక పన్నులను లాగుట కల్గునె? శంభుఁగొల్చినన్ ॥ 1672

తే॥గీ॥ అందుకే స్వరాజ్యమొక తృణాంకురముగ
తీసివైచుచు బారులుఁదీరినారు
పాదుషా ముందర మరాట "వతనుదార్లు"
సిగ్గు, నెగ్గును విడి మొగల్సేవఁజేయ ॥ 1673

ఛత్రపతి శంభాజీ "పోర్చుగీసు" వారితో "ఆంగ్లేయులతో" సంధి చేసికొనుట

తే॥గీ॥ "శంభు" "కెల్వా" యు "దంతోర" "సారగావు"
"మహిమ" "సొపార" లును వశమగుట వలన
గోవ మొగ "వసై" - 'వీరారు' రేవు వరకు
నొత్తడిని పరంగీలపై నుంచగలిగె ॥ 1674

(పగటిన=ప్రదర్శించిన; రహి=విధము; చేతాకు=సాహసము)
(సైరికులు=హాలికులు) (మొగ=మొదలు)

తే॥గీ॥ అట్లె యింగ్లీషు వారి యహమిక నణప
వారు గిడ్డంగులను కట్టు వైఖరిపయి
యాంక్షలను పెట్టె - గిడ్డంగు లనెడి పేర
కోటలను కట్టుటిక పయి కూడదనుచు ॥ 1675

తే॥గీ॥ బాలురను 'మరాటాల' భూ భాగమందు
నుండి - బల్మిగొంపోవుచు 'గుండలు'గనొ
నర్చి వారి మతము బల్మి మార్చునట్టి
చర్యలు సహింప నికనని "శంభు" చెప్పె ॥ 1676

తే॥గీ॥ 'శంభుజీ'కి 'కరంజి' దేశము వశపడి
నందున న్నాంగ్లులకది యిబ్బంది యయ్యె
యాంగిలేయుల కదలిక లదుపు చేయు
వీలు కలిగె మరాటుల పృతనకచట ॥ 1677

"ఔరంగజేబు" "బీజాపురము"పై దండెత్తుట

సీ॥ దర్పమ్ము మెఱయంగ దక్కను కరుదెంచె
ఐదులక్షల సేన యనుసరింప
హిందూ స్వతంత్ర రాజ్యేచ్ఛతో త్రుళ్ళెడు
మారాటులను రూపు మాపి వేయ
పూటకు నొక కోట పుడమి మట్టము చేసి
పగఱకు మొగలుల పటిమఁజూప
యాత్మజులిద్దరు - 'నజమును' 'మౌజము'
సేనాధిపతులౌచు చిమ్మరేగ ॥

ఆ॥వె॥ పైడి నెమ్మిగద్దె యాడంబరము వీడి
జల్లిటోపిలల్లు - ఢిల్లి నేత
దేశమెల్ల మ్రింగు తృష్ణ మీరంగ మా
తంగ మెక్కుచు నవురంగ జేబు ॥ 1678

(గుండలు=బానిసలు) చిమ్మరేగు=విజృంభించు
(దేశము=ప్రాంతము; పృతన=సైన్యము)

సీ॥ 'బుర్హానుపూరు'న పూర్తిగా నొక యేడు
నిలిచియు విజయము కలుగలేదు
పదపడి 'యౌరంగబాదు'కు చనుదెంచి
వేచియు జయము ప్రాప్తించ లేదు
నాపైన వేంచేసి 'యహమదు నగరు'కు
కాచియున్నను గెల్పు కదురలేదు
విసిగి – 'షోలాపూరు' వీటికి చేరిన
కార్యసాఫల్యమగపడు నేమొ ॥

తే॥గీ॥ యనుచు నాశనిరాశలు నబ్ధివీచు
లట్లు ప్రొంగుచు క్రుంగుచు నల్లలాడ
వచ్చి యట్టహాసమ్ముగా పాదుషాహ
యడుగు బెట్టె "షోలాపూరు" పుడమిపైన ॥ 1679

కం॥ ఆదిల్షా, కుతుబ్షాహియు
చేదోడుగ నుండ్రి శంభు జృంభణమునకు
న్నా దోయినణచి వేసిన
ఛేదింపగ వచ్చు శంభు చిందఱననుచున్ ॥ 1680

సీ॥ షాజాదు 'అజము' బీజాపురమును ముట్ట
డించి యుండియు నొక యేడు జరిగె
చిటిప్రేలు కణుపంత క్షితియులోబడలేదు
నెక్కడేసిన గొంగడక్కడుండె
కడపట నొకనాడు "కాహెజహాను" – "మం
గల్వేఢ" "సంగోల" కందువలను
వశపఱచుకొనగ – పాదుషా మురిసె "నా
ల్గేండ్లలో యది తొలి గెలుపటంచు ॥

తే॥గీ॥ నింతలో వేగరులు నెఱిగించిరట – 'వ
జీరసదుఖాను"నకు – "నలంగీరు"నకును
రాత్రి సంగోలపైకి మరాట దండు
వచ్చి పంచశతాశ్వముల్ప్రుచ్చిలిరని ॥ 1681

(చిందఱ=విజృంభణము)

ఔరంగజేబు ఆగ్రహించుట

తే॥గీ॥ ఎట్లు జరిగెనిది యని ప్రశ్నించె 'బాద్ష'
యా మరాటుల సర్వ సైన్యాధినేత
యైన 'హంబీర' రావు కొల్లాడి నాడు
నూచ ముట్టుగ "సంగోలు" నూరి ననిరి ॥ 1682

తే॥గీ॥ అపుడు పాదుషాయనె – "నాదు ఐదు లక్ష
ల పరిలోన "హంబీర రావు" "పయి చేయి"
యనదగిన యట్టి యొక్క జోదైన గలడె?
చేవ చచ్చిన దయ్యె నా సేన యకట" ॥ 1683

మహారాష్ట్ర కఱవు (క్రీ.శ. 1686-87)

చ॥ క్రమముగ కాటకమ్ము మొదలై కొనసాగె మరాట భూమిపై
ఖమున సితాబ్ద దర్శనమె గాని – రవంతయు ప్రావృషేణ్య మే
ఘముల సవేనిలేక, చినుకైనను రాలక యేటికేడు – పా
శి మహిపయిన్దురాగ్రహము చెందినటు ల్వఱపయ్యె హెచ్చుగన్॥ 1684

తే॥గీ॥ చుక్క నీటికి నేకారు చుండె జనము
నెచ్చట గనిన యచట నిప్పచ్చరమ్మె
జనుల కొక మెతుకును, మూగ జంతువులకు
గటిక పరకయు, మఱుగయ్యె కఱవునందు ॥ 1685

ఉ॥ అంత మరాట రాజ్యమున నన్ని ప్రదేశములందు ధాన్యమెం
తెంతగ నెక్కడెక్కడను నిల్వలు నున్నను తీసి రాజ్యమం
దంతట పంచి పెట్టుటకు నాజ్ఞలు పంపెను శంభు – 'రాయరి'
న్నంతియె చేసె ధాన్యముల నందరికిన్ తనివోవ పంచుచున్ ॥ 1686

తే॥గీ॥ అట్లు పంచియు ధాన్యము నందరి గొద
తీరు మార్గము కన్పడ నేరదయ్యె

(ఖము=ఆకాశము; సితాబ్దము=నిర్మల మేఘము; ప్రావృషేణ్య=వర్షపు సవ=జాడ; పాశి=వరుణుడు; వఱపు=కాటకము) (రాయరీ=రాయగడము)

వరుస పోరులతో నెండె బండరువును
నాపి వైచిరి సైరికులప్పనములు ॥ 1687

చిక్కదేవరాయలు మరాటులకు వ్యతిరేకముగా ప్రవర్తించుట

చ॥ కఱవిటులుండ శామనిని – కన్నడ రాజగు "చిక్క దేవరా
యరు" తన మాట తప్పుచు సహాయము సేత మరాట వారికిన్
దొరగి – పదేనువేల మొన తూర్ణముగా మొగలాయి వారి కం
పె – రణమొనర్ప బీజపురి వీటిని పాదుష యాక్రమింపగన్ ॥ 1688

'ఛత్రపతి శంభాజీ' చినబావ 'హర్జీమహాదికు' ఎదురుతిరిగి స్వతంత్రత ప్రకటించుకొనుట

ఉ॥ దానికితోడు కన్నడిగ ధాత్రి 'సుబా' కధినేత 'హర్జి'యున్
తాను స్వతంత్రతత్ప్రకటనమ్మొనరించెను – "జింజి" భూమికి
"న్నేనె ప్రభుండ నంచు"–వగ నించుచు శంభుకు–'శ్యాలు' డన్న గొం
కేనియు లేక – యప్పటికుపేక్ష నొనర్చెను 'శంభు', నా పొరన్॥ 1689

చ॥ మొగలులు బీజపూరు పయి పోరొనరించుచు వారి నెల్ల ముం
దుగ బలహీనులన్సలుపు తొందరలో నిపుడున్నవారు – న
ట్లగుట మరాట వారికి సహాయము నందదు బీజపూరుచే
నిగ బలహీనులౌదురలవేది మరాటులు నన్దురూహతో ॥ 1690

తే॥గీ॥ కాన నిప్పుడు మొగలుల సేన వలన
కదన భయము లేమి – తొలుత కఱవుపైన
యుద్ధమును సేయ కర్ణాట కోర్వి కేగి
తగిన ధాన్యార్జనము సేత తప్పదనుచు ॥ 1691

(గొద=ఆకలి; బండరువు=రాజ్యకోశము; సైరికులు=సేద్యగాండ్రు;; అప్పనములు= పన్నులు)

(శామని=దక్షిణము; దొరగి=వీడి; మొన=సైన్యము; తూర్ణము=శీఘ్రము)

(పొర=పితూరి) (అలవు=బలము)

‘ఛత్రపతి శంభాజీ’ కర్ణాటకలోని ‘చిక్కదేవరాయలపై’ యుద్ధమునకు వెడలుట

మ॥ వెడలెన్శంభుజి చిక్కదేవనృపతి న్విశ్వాస ద్రోహిన్వెస
న్నడగింప ‘న్మహిశూరు’ “ధర్మపురు”ల న్నాపైన “శ్రీరంగ”పున్
గడమున్లోగొన, దూకె ఖేయమున, కంఖాణమ్ము నౌలొడ్డు తా
కిడికిన్క్రమ్మందెను-శంభు కూర్పరము తున్గె న్వాటుకున్సోర్వమిన్॥ 1692

తే॥గీ॥ చిక్కదేవరాయని చేత చిక్కినట్టి
యాదిలుష రాజ్యమును శంభు డాక్రమించె
చిక్కదేవుని సైన్యము చేరియుండె
మొగలులనపుడు బీజపూర్మొగ్గరమున ॥ 1693

తే॥గీ॥ అందుచే చిక్కదేవుడు నాత్మరక్ష
ణమ్మె ముఖ్యముగాగ రణమ్ముఁజేసె
‘జింజి’నుండి శంభుని బావ చేరె సైన్య
యుతముగా – బావ మఱదికి నూత మొసగ ॥ 1694

కరవు నెదుర్కొనుటకు వీలైనన్ని చోటుల నుండి ‘శంభాజీ’ ధాన్యము సేకరించుట

తే॥గీ॥ నెలలు కొలది సాగెను కల నిద్దరికిని
జయమనిశ్చితమై యున్కి శంభు విసివి
స్తంబకరిఁదండి, పదివేల శకటములకు
నెత్తి తరలించెను మరాట పృధ్వీకపుడు ॥ 1695

చ॥ “కొలుచు”ను యెంత తెచ్చినను కొందరికే సరిపోయె – రెచ్చు నా
కలికిని, క్షుద్రజంతువుల కౌచును సైతము నేవగింపకెం

(ఖేయము=అగడ్త; కంఖాణము=గుఱ్ఱము; ఔలొడ్డు=ఆవలి ఒడ్డు; కూర్పరము=మోచేయి; తున్గు=విఱుగు)

(కలను=యుద్ధము; స్తంబకరి=ధాన్యము)

గిలిపడు చంద్రి - శంభుజి ధనిష్ఠుల కాజ్ఞ నొసంగె కొల్చు కొ
ట్టులు తెరపించి కొట్నము కడుంగడు పేదల కెల్ల పంచగన్॥ 1696

తే॥గీ॥ "రాజ పురి" "థానె" "మాహ్లి" "కర్జాత" లాది
ప్రాంతముల బూసపిండ్లు తెఱవగఁబంచి
యపరిమితముగ నచటి ధాన్యాశ్రయముల
నుండి - 'హుండి' విల్చెను శంభు హుండినిచ్చి ॥ 1697

తే॥గీ॥ అటులె 'కుత్బుషా'తోడి స్నేహమ్మువలన
"సోలపూర్" కడ "నాల్దుర్గ" క్షోణి నుండి
కుత్బుషాహీల ధాన్యపు కొట్లు దెరవఁ
బంచి, "కొల్చు" మరాటకు పంపె "శంభు" ॥ 1698

'జింజీ' ప్రాంతము నుండి మరాటకు సరిపడు ధాన్యము వచ్చు వ్యవస్థ యాగిపోవుటకు 'హర్జీమహాదికు' పితూరీ కారణమగుట - 'హర్జీ మహాదికు' పైకి యుద్ధమునకు సైన్యమును పంపుట

తే॥గీ॥ "జింజి" నుండి మరాట రాజ్యేల ప్రజకు
నక్కఱపడు ధాన్యమునందు నర్థభాగ
మచటి నుండియే వచ్చును - 'హర్జి' బావ
యిపుడు "జింజి" నేత - మరి జాగేల యయ్యె? ॥ 1699

చ॥ "హరజిమహాది"కంతరము వ్యక్తమునయ్యెను - "జింజి - కన్నడో
ర్వరలకు తానె రాజునని - రాయగడమ్మునకెట్టి బంధమున్
పొరయదటంచు చాటుకొనె" - పూనకమూనినట్లు శంభు - చె
చ్చెఱ పిలిపించె సన్నిధికి చేరగ "పింగళెకేశొత్రైమలున్ ॥ 1700

(కొలుచు=ధాన్యము; కొచు=మాంసము; ధనిష్టులు=ధనవంతులు; కొట్నము=ధాన్యము)

(బూసము + ఇండ్లు = ధాన్యపు కొట్లు; హుండి=బియ్యపురాశి; విలుచు = కొను; హుండి=సొమ్మిచ్చుటకు హామీ పత్రము)

తే॥గీ॥ కేశొ కాక! 'రామ్సెజుగడు' క్రేవకైన
మలక పరిని రానీయని మాసటీవు
'ననుభవజ్ఞుని "హన్మంతె" నవలనుంచి
బావ 'హర్జికి' పదవీయఁబాపమయ్యె ॥ 1701

మ॥ పదియున్నైదును వేల యాశ్వికులతో పైనమ్ము కమ్మింక, నె
న్మిది ప్రొద్దుల్సమయమ్మవశ్యమగు "జింజీ" కోటకున్జేర - నీ
యెదకుందోచిన యట్లు చేయుమట - కానీ నాకు ధాన్యమ్ములన్
పది పన్నెండు దినమ్ములీ వలనె - పంపన్బాధ్యుడీవేసుమా॥ 1702

ఆ॥వె॥ సమర సింహుడైన "శాంతాజి ఘోర్పడే"
నీకు సాహ్యుడగు ననీక మందు
'హర్జి' నాకు బావయైనంత మాత్రాన
ద్రోహి శిక్ష నెపుడు దొరగలేదు" ॥ 1703

కం॥ అని చెప్పి "కేశొత్రైమలు
ననికిన్పంపించె, బావ 'హర్జీ' పైనన్
తన యక్కగారు "నంబిక"
పెనిమిటి పక్షమ్మె బూనె - "విధిగద! సతికిన్ ॥ 1704

షాజాదు అజము బిజాపురముపై ముట్టడి చేయుట
బిజాపురపు కోట వర్ణనము

సీ॥ బీజాపురముపైన షాజాదు "అజము" తా
దండెత్తి యేడాది దాటి పోయె
బీజాపురపు కోట - పేశస్సు చదరమై
కుడ్య మొండున్నర కోసులాయ
తమ్ము కలిగి - డెబ్బదడుగుల యెత్తును
ముప్పదడుగులడ్డమును కలిగియు
బోర్తలుపులు పది - బురుజులు తొంబదా
రు - బురుజులకు నడుమఁబఱపయిన ॥

(మాసటి=మేటి) కాకా=బాబాయి (గౌరవ సంబోధము)
(సాహ్యుడు=సహాయుడు; అనీకము=యుద్ధము)

తే॥గీ॥ దార్ల యేర్పాటు - వానిపై దంచనముల
నిలుపు - కర్యుష్టముల ఫిరంగుల వహనము
కడు పొడవగు క్రోవుల "బందుకా" దడమ్ము
దండి "మాలికె మైదాను" దంచనున్కి॥ 1705

తే॥గీ॥ శత్రు దుర్భేద్యమై యుండె - షాహజాదు
'యజము', నెంత యత్నించియు నడుగు సైత
మరుగ లేదు ముందుకు - డెబ్బదడుగుల పఱ
పౌ - మొసళ్ళ 'యగడ్త' డెప్పరము దాట ॥ 1706

తే॥గీ॥ కోట చుట్టును కడుగట్టి కాఠమగుట
ప్రేల్చు మందును కూరంగ బెజ్జములను
పొందు పడఁజేయ కష్టమీ సందులోన
గడముపైనున్న రిపులగ్గి జడిని బుఱ్ఱు ॥ 1707

బీజపూరుకు కుత్బుషాహి మరాటాలు సాయమగుట

తే॥గీ॥ బీజపూరుకు నల్బది వేల సైని
కులను సాయము పంపెను 'కుత్బుషాహ'
"నీలొ పంతు పీష్వా" పది వేల సేన
గొనుచు వచ్చెమొగలులతో 'నని' నొనర్ప ॥ 1708

సీ॥ 'పన్హాలా' కోటలో బసచేసి శంభాజి
"యాదిల్షా"కు సహాయ మగుచు నుండె
యేడు వేల బలముతోడుగా "కలశుండు"
తఱివేచి మొగలుల తఱుముచుండె
"హంబీర" దణి పదునైదు వేల పరితో
మొగలులన్ గారింప మొగియుచుండె

(పేశస్సు=ఆకృతి; కోసు=రెండు మైళ్ళు; ఆయతము=పొడుగు; క్రోలి=గొట్టము; బందుకా=తుపాకి; బోర్తలుపులు=కోట ప్రధాన ద్వారము; దంచనము=ఫిరంగి)

(పఱపు=వెడల్పు; డెప్పరము=ప్రమాదము)

(కాఠము=చట్టు; పాషాణము) (జడి=వాన)

"పంతు నీలోజి" తాఁబదివేల సేనతో
'నజము'ను వేధింప నడరు చుండె ॥

తే॥గీ॥ నిట్లు బీజాపురమును రక్షించుటకయి
శంభు మారాట సైన్యము శక్తి కొలది
తమ ధన ప్రాణములు గూడ ధారవోసి
ప్రబలయత్నము చేయుచు శ్రమలఁబడియె ॥ 1709

ఔరంగజేబు తన వరుస యోటములను దలచి తన యుద్ధ వ్యూహములపై పునరాలోచనము చేయుట

ఉ॥ "ఢిల్లీ"ని వీడి దక్కనుకు డిగ్గి షడబ్దములైన గాని, యే
వల్లను నాదు యాశయము పండుగతుల్ కనుచూపు మేరలో
తెల్లముగాక యుండె కనఁదీవ్రపుతప్పిదమున్న వ్యూహముల్
యల్లితిమేమొ? యింత వర"కంచును పాదుష యోచన న్బడెన్॥ 1710

పాదుషా గోల్కొండపై దండెత్త నిర్ణయించుట

సీ॥ "తొలుత 'కుతుబ్షాహ' త్రుళ్ళడంచిన గాని
'యాదిల్ష' మాదారి కరుగు దేడు
గోల్కొండ తానీష మేల్కొని యుండిన
'గాన' బజాన మైకమున నుండు
'నక్కన్న', 'మాదన్న' యను జంట "కాఫిర్ల"
కను సన్నలందు పాలనము జరుగు
'తానాష' అత్తయు, దారయు "కాఫిర్ల"
గాలిసోకిన గూడ కస్సుమంద్రు॥

తే॥గీ॥ నిపుడు గోల్కొండ వారిపై నెత్తి పోయి
"మాదనక్క నల'కు శిరచ్ఛేద శిక్ష
జరిపిననె గాని మాదాడి విరమణమ్ము
కాదనుచు బెదరించుటే కార్యమగును॥ 1711

సీ॥ అరలక్ష సేనకు నధిపతిగా "ఖాన్జ
హాను'నంపెను నబుల్హాసను' పైకి
మాల్ఖేడు కడనాపె మార్గాని మొగలుల
(రెండు మాసములు గోల్కొండ సేన
యిట్లుండ గోల్కొండ యెకిమీని సర్దార్లు
నేదొ విషయమై వివాదపడిరి
యంత నేమాయెనో, హైదరబాద్సేన
పంచ బంగాళమై పారిపోయె ॥

తే॥గీ॥ 'మొగలు సేన' విజృంభించి ముసురు కొనియె
'హైదరాబాదు' సంపదలపహరింప
'భాగ్యనగర' రక్షణకయి పటుతరమగు
కోటలేనందుచే - వైరి ధాటి కొదిగె ॥ 1712

తే॥గీ॥ రెండు నెలలపాటు మొగలు దండు నడ్డి
నట్టి గోల్కొండ సేన తానిట్టు లవిసి
పారి పోయిన కారణ మారయకయె
తానిషా దాగె గోల్కొండ పైన 'గడి'ని ॥ 1713

ఉ॥ మాదన మంత్రి 'తానిష'కు మార్గము చెప్పెను - 'యోరుగల్పురా'
యే దరి యౌను దాగుకొన నేగుడటంచును - కాని తానిషా
కే దెస తోచనట్టిదయి - యెంపిక చేసెను గోలుకొండపై
నౌదల దాచుకో దలచి, నాడెమటంచును నాత్మ రక్షకై ॥ 1714

ఉ॥ మాదన మంత్రిపైన యభిమానము మిక్కిలి తానిషాకు - యా
యాదర మూతగా ననుజుడక్కన సర్వచమూపతయ్యె నా
మాదిరి నెల్ల బందుగుల మంచి పదమ్ముల నిల్పె నెల్లెడన్
వేదము తానిషాకు తన (పెగ్గడ 'మాదన' మాట యన్నచో ॥ 1715

తే॥గీ॥ ఈ విధానము మితిలేని యీసు పెంచె
తానిషా కొల్వున యవనోదాస్థితులకు

(ఎకిమీడు=రాజు; పంచబంగాళము=చెల్లాచెదరై పోవుట)
(పురా=కోట; దరి=ఆధారము; నాడెము=శ్రేష్ఠము)

సచివు "లబ్దు(ల)జా""క్షేక్నిజాము" లెంతొ
వ్యధితులగు చుండిరి నవాబు విధముఁ జూచి ॥ 1716

సీ॥ మొదలె ఔరంగజేబునకు - "షియా" లన
తీవ్రమౌ ద్వేషము - తిట్టుచుండు
"కాఫిరు"లని - "పిన్గుకౌచు భక్షకుల"ని
సామ్రాజ్యమదమున సరకుగొనక
మాదన్న నిరతము మారాట వారికి
శ్రేయమ్ము గూర్పగ సిద్ధుడనుచు
తొలుత "శివాజీ"కి - మలిగ "శంభాజీ"కి
మాదన్నతోడ్పాటె మహితరక్ష ॥

తే॥గీ॥ యనెడు ననుమానమే 'బాద్ష' మనమురగుల
చేయుచుండె గావున పంపె చివరి హెచ్చ
రికగ లేఖ తక్షణమే పటిపటి చేయ
'మాదన'ను దయమాలి సహోదరముగ ॥ 1717

ఉ॥ 'పాదుష' లేఖనాంశముల వైఖరి తీవ్రతకున్ చలించుచున్
'మాదన' తానిషాకు "తన మంత్రి పదమ్మును తీసివేయు డీ
మీద నుదాసిగా మనెద మేదిని" నంచు వచింప, తానిషా
"నాదు ప్రధాన మంత్రి వెటునన్విడెదీవు, వచింపు వ్యూహము"ల్॥ 1718

తే॥గీ॥ అనిన, సవినయుడౌచు - మాదన్న యనియె
"మనము నాదిల్ష, మారాట మొనలు కలిసి
పాదుషానెదిరించుటే భావ్యమగును
మ్రొక్కు కొలదిని యాతడు త్రొక్కుమనల" ॥ 1719

తే॥గీ॥ అని వచించెడు మంత్రి మాదన్న నరసి
షేక్నిజాము నిజముగ నిశ్చేష్టుడయ్యె
"ఈనవాబు, వజీర్లకు యేమి పూనె
మొగలులీ రాజ్యమును చుట్టు ముట్టిరెపుడొ" ॥ 1720

(ఉదాస్థితులు=ఉద్యోగులు; తుఱక సచివులు=అబ్దుల్ రజాక్, షేక్ నిజాము) (పిన్గు=శవము; కౌచు=మాంసము; పటిపటిచేయు=చంపు)

(ఉదాసి=సాధువు, సన్న్యాసి)

తే॥గీ॥ అని వగచు – షేక్నిజాముని కాజ్ఞయిచ్చె
తానిషా – "నీవు హైద్రబాదందె నిలచి
"నాల్పదుల వేల యశ్వ సైన్యమును గొనుచు
నుగ్గు సేయుము మొగలుల మొగ్గర" మని ॥ 1721

తే॥గీ॥ 'అబ్దులు రజాకు'నుగని – "నన్ననుసరించి
గోలకొండ కోటకురమ్ము – కూర్తు సభను
నందరమును నాలోచించి, యాపయినిక
చేయదగు పని గూర్చి చర్చింత మనియె ॥ 1722

"అక్కన", "మాదన్న"ల హత్య

చ॥ "బరమదుఖాను" "తానిషహ" భార్యకు, నత్తకు నూతిపోసె – ని
ట్లరులయనీకినుల్కవిసి హైదరబాదును దొద్దలాడ – ము
ష్కరుడగు 'మాదన ప్రగడ' కారణమమ్మ – భటాళిఁ బంచు డీ
శిరములఁదీయ "మాదన" కు–స్వీయ సహోదరు డక్కనాఖ్యుకున్" ॥ 1723

తే॥గీ॥ తానిషా అత్త, భార్యల యానతి పయి
భాగ్య నగరము నందున పట్టపగలు
నట్ట నడి వీధి లోననే నఱికె నపుడు
"మాద, నక్కనలను తుర్క మాంసికాళి ॥ 1724

"మౌజము" సారధ్యములో మొగలు భటులు హైదరాబాదును దోచుకొనుట

ఉ॥ ముప్పది వేల ఘోట బలముంగొని "మౌజము" వచ్చి, కుత్బుషాన్
ముప్పులఁ బెట్టి ముట్టడిని మోపొనరించెను – భాగ్యవంతమౌ
యప్పురి "హైద్రబాదు" నెవరైనను దోచెడు వీలు నిచ్చుచున్
చొప్పడి యుండె బైల నొక సుంతయు రక్షణ లేని యట్టిదై ॥1725

(దొద్దలాడు=దోచుకొను)
(మాంసికుడు=కటికవాడు)

ఉ॥ దోచిరి యెల్లవారు తమ దోర్బల మోపిన యంత మట్టు-త
మ్మాచెడు వారు లేమి - నగరౌకసు లేరికి వారె ప్రాణముల్
కాచు కొనంగ పారిరి వికావికలై కనవచ్చు దారులన్
మోచిన యంత సొమ్ము కొనిపోయిరి దోపిడి గాండ్రు స్వేచ్ఛగా। 1726

సీ॥ విత్త వంతుల వౌ "హవేలీలు" "బంగ్లాలు"
సాధారణ ప్రజ సదనములను
వెండి బంగారము ల్వెలలేని రత్నము
ల్కళ్కు తగ్గని రత్న కంబళములు
హయ, మయ, గజ, శకటాందోళికాసన
కంకటి, కట, పట గార్హ్యవస్తు
సమితిని గొంపోవు చక్కట తీరంగ
తక్కిన వానిని తగుల బెట్టి ॥

తే॥గీ॥ వీటి నంతయు పెను వల్లకాటి వోలె
మార్చి వేసెను శాత్రవ మహిష కులము
భాగ్య నగరముఁ జూడ నభాగ్య నగర
మయ్యె - విధి చేయు వింతల కంతమున్నె? ॥ 1727

బిజపూరుకోట ఔరంగజేబునకు లోబడుట

సీ॥ బీజపూరు 'పురా' యభేద్య నిర్మితిఁ జూచి
'షాజాదు అజము' నిచ్చలము సడలె
దారాసుతులతోడ దర్పము వెలయంగ
కోట వెల్పల పట కుటుల నిలిచె
"బీజాపురము" నాకు వెరవుపడక యున్న
మరణింతునే గాని తిరిగి చనను"
నని ఘోర శపథము నందరి ముందర
చేయంగ - యౌరంగ జేబు మెచ్చి ॥

(ఆచు=అణగించు; నగరౌకసులు=పౌరులు)

(మయము=ఒంటె; కంకటి=మంచము; కట=చాప; పట=వస్త్రము; గార్హ్య =గృహ సంబంధమైన; మహిష కులము=దున్నల గుంపు)

తే॥గీ॥ ఎట్టకేలకు నాపుత్రు డింత గొప్ప
శౌర్యమును ప్రకటించెనంచప్పటి కపు
డైదు వేల యెద్దుల పయి నంపె ధాన్య
మిరువురు మనసబ్దార్లతో నరుగ సాతు ॥ 1728

శా॥ ముందే పంపెను లేఖ బీజపురపు న్మూలేరుకుం బాద్షు – తా
నందున్నాతని హెచ్చరించె నికనే యాలస్యముల్లేక నా
హిందూ కాఫిరు 'శంభు'పైకి జని బంధింపంగ నా పైన యా
బందిన్నొప్పనఁ జేయగా తనకు సేవా ధర్మ నిర్వర్తిత్తె ॥ 1729

బీజపూరు సైన్యాధ్యక్షులు "షార్జఖాను"ను కొల్వునుండి తొలగించమని ఆ లేఖలో 'ఆదిల్షా'ను 'ఔరంగజేబు' ఆదేశించుట

శా॥ బీజాపూరు గడమ్ము నెట్లు రిపుదుర్భేద్యమ్మునై యుండెనో
యాజోకన్గలడా బిజాపురము సైన్యాధ్యక్షుడౌ షార్జఖా
నాజి వ్యూహములందు వానికెనయౌ నాయంకుడే లేడు – 'యి
ప్డాజోదున్బహి వెట్టఁ బీజపురికి న్బాద్షా "దురా" వెట్టగన్' ॥ 1730

కీ॥శే॥ ఆదిలుషా పుత్రి షహ్రాబాను ఔరంగజేబు లేఖ చూచి మండిపడుట

ఉ॥ 'పాదుష' లేఖలో బయలు పడ్డ యహంకృతి కెంత మాత్రమా
మోదము లేని యాదిలుష పుత్రి దణాయని వెన్ను దన్నునై
సోదరుడౌ "సికందరుకు" సూటిగ జెప్పెను "షహ్రబాను", 'నా
పాదుష లేఖ కెట్టి విలువన్నిడ వద్దది కాల్ప నర్హమౌ ॥ 1731

(పురా=కోట; నిచ్చలము=ధైర్యము; వెరవుపడు=వశపడు; సాతు=సార్ధము)
(ఒప్పనజేయు=అప్పగించు; నిర్వర్తిత=నిర్వహించువాడు)
(జోక=పద్ధతి; నాయంకుడు=నాయకుడు; బహివెట్టు=బహిష్కరించు;
దురా=ఆజ్ఞ) (దణాయ=సైన్యాధిపతి) మూలేరుడు=రాజు

తే॥గీ॥ 'షార్జఖాను' మనపిత రాజ్యమున కచల
మైన యాలంబన స్తంభ మన్న నతిశ
యోక్తి గాదతని వెలివేయుడని చెప్ప
పాదుషా వేడు? వానికీ మాదమేమి? ॥ 1732

చ॥ మనము మరాట వారి యెడ మైత్రిని చూపుచునుంటి మన్న వా
రనయము "బీజపూరు"కు సహాయము చేయుచు నుండ్రి గావునన్
మునుపు దిలేరుఖాను మన భూముల నాక్రమముంబొనర్ప నా
తనిని శివాజి మార్కొనుచు దౌలగఁ దోలెను-విస్మరింతుమే? ॥1733

తే॥గీ॥ శంభుజీయును తన తండ్రి జాడయందె
మన యెడల మైత్రి పాటించు నసుమ లేక
యతనిని మనము బంధించి యప్పగించ
వలెనట! మనము పాదుషా బానిసలమె? ॥ 1734

చ॥ సమరము తప్పదింక యని షారజఖానుకు "షహ్రబాను" - తె
ల్లము నొనరించె - తమ్ముని తలంపును నట్టిదె యంచు-షార్జఖాన్
విమతుల నుగ్గుసేయ పరువెత్తెను దుర్గము పైకి - బాద్ష య
త్నములకు కోట లోబడెడు దారియె తోచక యుండె నత్తతిన్॥ 1735

తే॥గీ॥ మట్టి ముద్దలు - బండలు - చెట్టు లేసి
పరిఖఁ బూడ్చెడు వారికి పసదనమిడె
నపుడు కుటిల తంత్రములలో నారి తేరి
నట్టి పాదుషా, బంగరు నాణెములను ॥ 1736

తే॥గీ॥ కోట బురుజులనుండి నిర్ఘోష మొదవ
దంచనముల ఆ గుండులు దంచి వేసె
యాశుగాసారమసువుల నార్పి వేసె
ఖాతమునుఁ బూడ్చు వేలాది కార్మికులను ॥ 1737

(వేడు=ఎవడు? మాదము=మదము)

(ఆశుగాసారము=బాణవర్షము; ఖాతము=పరిఖ)

చ॥ కడకొక దారి యేర్పడె నగడ్త పయిన్గడి గోడ దాపుకున్
నడువగ - పాదుషా బలమనంతము - బీజపురమ్ము కోటలో
దడమొక-రెండు వేలకు, మితంబయి యుండెను గెల్వగా గడుం
గడుబరు వౌనటంచు తటకా పడుచుండిరి బీజపూర్ దొరల్॥ 1738

ఆ॥వె॥ పాదుషా బలమటు హైదరాబాదు పై
బీజపూరు పైకి వెడలి యుండ
నపుడు బుర్హానుపురి కౌరంగబాదుకు
దాడి చేయ శంభు దడము నంపె ॥ 1739

ఆ॥వె॥ మొగలు పరికి బయలి భూభాగముల నుండి
వచ్చు ధాన్యములను వస్తువులను
శంభుజీ యొక యెడ - షార్జఖానొక యెడ
కొల్లగొనిరి - 'యజము' కొదవ కుండ ॥ 1740

ఆ॥వె॥ పట్టుదలకు పేరు పాదుషా యనినను
గడ్డు రిపులకతడు కాలయముడు
'షాహజాదు అజము' శక్తి నెఱుగు పిత
పూనె తానె బీజ పురము నణప ॥ 1741

ఆ॥వె॥ బీజపూరు గూడ బింకముఁ గోల్పోయె
ముగియుటనుట లేని ముట్టణముకు
దుర్గమందు తిండి దొరకుట కష్టమై
ఓటమిని నవాబు నొప్పుకొనెను ॥ 1742

ఉ॥ శ్వేత పతాకమున్నెగుర వేసిరి - దుర్గము పైన సంధి సం
కేతముగా బిజాపురపు నేత, యమాత్యులు, సైన్య నాయకుల్
ప్రీతులు నైరి మోగలులు - "భీకర సంగర పీడ బాసె - మే
మీతటి మాకుటుంబముల మేలమున న్సుఖియింతు"మంచునున్॥ 1743

(బింకము=పట్టుదల; ముట్టణము=ముట్టడి)
(మేలము=సాంగత్యము)

సీ॥ అట్టహాసమ్ముగా యౌరంగజేబు స
భకు శిబిరమ్ము నేర్పాటు నయ్యె
దీర్ఘ చరిత్రతో తేజరిల్లిన బీజ
పూరు 'నాదిల్షాహి' యౌరసుండు
నూనూగు మీసాల నూత్నయౌవనుడు – 'సి
కందరుషా' 'బాద్ష' ముందు మోక
రిలె తల తత్పదములను తాకెడు నట్లు
నతని నమ్రత గని యలరె బాద్ష ॥

తే॥గీ॥ యతని యక్క 'షహర్బాను', 'నజము' రాణి
వాసమున చేరి నూత్న సపత్ని యయ్యె
'షార్జఖాను' శౌర్యము – సాహసమును మెచ్చి
బాద్ష గొప్ప మన్సబుదారు పదవినిచ్చె ॥ 1744

శా॥ స్వాతంత్ర్యమ్మును కోల్పడెన్బహు శతాబ్ద శ్రామ చారిత్ర వి
ఖ్యాతమ్మాదిలుషాహి రాజ్యము – సమైక్యమ్మొప్ప 'హిందూ' మన
ప్రీతిన్గల్గగఁ జేయ – కొల్వులు మతాభిన్నమ్ముగా నిచ్చి – సౌ
భ్రాతృత్వమ్మును చూపుటే కతమునై, 'బాద్షా' విరోధమ్ముకున్ ॥ 1745

బీజపూరు రాజ్యములో వెల్లివిరిసిన మత సామరస్యము

చ॥ తరముల నుండి బీజపురి ధారుణి నాథుల కొల్వులన్చమూ
చరులుగ, దండనాథులుగ, సర్వ విధమ్ముల నెచ్చు, తగ్గ నం
తరువుల సేవఁజేయుచును తత్ప్రభుసుస్థిరతావలంబులై
పొరయ "వతన్లు" "జాగిరులు"–ముఖ్యులు నైరిమరాటులచ్చటన్॥ 1746

శా॥ "షాజీ భోన్సలె" కన్న ముందె కొలువుల్ సాధించి రాదిల్షహా
రాజాస్థానమునందు వీరులగు మారాటుల్ – మతాభిన్నతన్
రాజే పాటి యొనర్చు చుండ – జనులా రథ్యన్ ప్రయాణించుటల్
సాజమ్మేగదా! రాజ్యమందు వెలసెన్ శాంతి స్థిరత్వమ్ములున్॥ 1747

(శ్రామము=కాలము; వృత్తాంతము=సంఘటనల ప్రోవు)
(చమూచరుడు=యోధుడు, పొరయు=ప్రాప్తించు)
(పాటియొనర్చు=లక్ష్యము చేయు; సాజము=సహజము)

తే॥గీ॥ ఆత్మ మతమందె "సున్నీ", "షియా" విభేద
మెంతయును పట్టుదలగ పాటించు 'బాద్ష'
హిందు - తుఱక సమరసత యెదకు వెతను
గూర్చ - యాదిల్ష రాజ్యము న్గూల్చనెంచె ॥ 1748

తే॥గీ॥ 'ఆదిలుషహో" - "కుతుబ్షా" - "షియా" లనియెడు
ముస్లిము మత శాఖా చారములకు చెంది
నట్టి వారు - హిందువులపై నెట్టి విమత
భావము కనపఱచరదె - బాద్ష బాధ ॥ 1749

మ॥ "శివజీ, శంభుజి హైందవావని పయి న్స్వేచ్ఛాప్రభుత్వమ్ము ని
ల్ప - విరామమ్మును లేని యత్నములు సల్ప న్వారి సంరంభ మా
చి - విరోధింపక - వారు తోడుగ మొగల్సేనన్ని రోధింతు - రీ
కవ కాఫిర్ల - షియానవాబుల-సమైక్య వ్యూహమద్రమ్మునౌ" ॥ 1750

తే॥గీ॥ అనుచు నౌరంగజేబు కట్టల్కఁబూని
వీరి యునికినె పూర్తిగా పిలుకు మార్చి
'మొగలు బాద్షాయె' భారత భూమి కంత
'శాస్త' యని చెప్ప విచ్చేసె శామనికిని ॥ 1751

తే॥గీ॥ బాద్ష లక్ష్యము లందొండు పడెను చేత
మిగిలియున్న 'కుతుబ్షా'ను ముగియఁజేసి
శక్తి యుక్తుల నన్నిటి న్శంభు పైకి
బారు చేయంగ దలచెను 'బాద్ష'యపుడు ॥ 1752

ఔరంగజేబు గోల్కొండ ముట్టడి - విజయము

సీ॥ దక్కను భూమిపై దండయాత్రకు వచ్చి
యారేండ్లు పోరాడ యబ్బె ఫలము
'నాదిల్నవాబు' రాజ్య మదృశ్య మయ్యెను
బీజపురమ్ము నిర్బీజమయ్యె

(పిలుకుమార్చు=నాశనముచేయు; శాస్త=శాసకుడు; శామని=దక్షిణము)

ద్రోహియౌ 'శంభాజి' దోస్తంభయుగమున
నుత్తరింప బడియె నొకటి యిపుడు
నింక 'కుతుబ్షాహి' క్రుంకిన దానితో
బాహుహీనుడగు, శంభాజిఁబట్టి ॥

ఆ॥వె॥ తలను త్రుంచుట యొక్కటే తనకు మిగిలి
యున్న గొప్ప చారిత్రాత్మకోద్యమమ్ము
నొక్క 'శంభాజి' పడినచో, యుర్వియంత
తనకు వశమైన యట్లని తలచె 'బాద్ష' ॥ 1753

ఆ॥వె॥ బీజపురము వీడి వేంచేసె పాదుషా
భాగ్య నగరమునకు, బయలు నందు
గొప్ప శిబిరమొకటి కూర్పంగఁ జేయుచు
సమరమెల్ల తాను జరుపఁబూనె ॥ 1754

ఆ॥వె॥ ఆత్మ రక్షణకయి 'అబులు హాసను' దాగె
'గోలుకొండ' పైని కోట యందు
నంగరక్షకుడయి 'యబ్దుల్రజాకు'ండె
గట్టి ప్రత్యయమ్ము గల దళపతి ॥ 1755

గోల్కొండ కోటపై యుద్ధము

సీ॥ "పీరూజి జంగ"ను బిరుదు మగండొండు
మొగలు పక్షమ్మున ముందు నిలిచి
కందకములు త్రవ్వె మందుగుండును కూర్చి
కోట కుద్యములను కూల్చు కొఱకు
"నబ్దుల్రజాకు" తా నట్టులే త్రవ్వించె
యెదురు ఖాతికలు కూర్పించి మందు
నట్టి ప్రేలుడులకు హతమైరి మొగలులే
యెదురు దెబ్బ తగిలి యెక్కువగను ॥

(ప్రత్యయము=విశ్వాసము)

తే॥గీ॥ క్షత శరీరుల యార్త నాద తతి శిబిర
సంస్థితుండగు పాదుషా శ్రవణ యుగము
దాక సోకెను – భయద యుద్ధమ్ము సాగు
చుండె – నిరు పక్షములను గోల్కొండ చుట్టు ॥ 1756

తే॥గీ॥ మొగలు సేనకు వలసిన ముఖ్యమైన
ధాన్యమును, పశుగ్రాసము, దళప సమితి
బీజపూర్నుండి "అజము" పంపించు చుండ
"కుత్బుషా" దణి "షేక్నిజామ్" కొల్ల గొట్టె ॥ 1757

తే॥గీ॥ అనిలమనలమునకు సాయమైన యట్లు
శంభు పంపె "రూపాజి భోసలె"ను – షేక్ని
జామునకు తోడ్పడ – మొగలు సరకులన్ని
దొద్దలాడ – మొగలులకు దొరక కుండ ॥ 1758

నైఋతి ఋతుపవనముల వర్షములకు మూసీ నదికి వరదలు వచ్చుట - మొగలుల కష్టములు

తే॥గీ॥ ఇంతలో వచ్చె యామ్యాపరర్తు పవన
ము, లెసలారె వర్షాభ్ర మండలము చదల
హైద్రబాదు – గోల్కొండల యంతరమున
పారు "మూసీ" తటిని పొంగె వరద వచ్చి॥ 1759

శా॥ "మూసీ" వాహిని గట్లు త్రెవ్వ – నిముసమ్మున్తెంపు లేనట్టి సాం
ద్రాసారమ్మునకు న్జలప్లవమవార్యంబైన వేగోద్ధతిన్
మూసెన్నేలను మిట్ట పల్లములొకేముద్రన్సముద్రమ్ముగా
భాసిల్లన్కను వారలందరికి – నిల్వన్చోటు లేకుండగన్ ॥ 1760

(ఖాతికము=కందకము)

(దళపము=ఆయుధము)

(దొద్దలాడు=దోచుకొను)

(యామ్యాపరర్తు పవనములు=నైఋతి ఋతుపవనములు; ఎసలారు=అతిశయించు; తటిని=నది)

ఉ॥ కొట్టుక పోయె వస్తువులు – కూలెను యిండ్లు ననేక జీవులున్
గిట్టెను నీళ్ళలో మునిగి – గింజలు నానుచు మొల్కలెత్తె – చూ
పట్టవు నే గృహమ్మునను వంటయు వార్పును – నెండు కట్టెలే
తట్టును లేమి – జీవనము దారిని తప్పె కకావికమ్మునై ॥ 1761

సీ॥ కోట చుట్టును ఫిరంగుల నిల్ప కట్టిన
మంచెల గట్టులన్ముంచె వరద
వేలగుడారము ల్వీచెడు పెనుగాలి
వేగోద్ధతి కెగిరి విన్నుఁజేరె
యరుల దంచన గుండ్ల నరికట్ట త్రవ్విన
గోతుల గోడలు కూలి పోయె
మందుగుండుగల సామగ్రి సాధనములు
చప్పగా తడిసి నిశ్శక్తమయ్యె ॥

ఆ॥వె॥ నేల నెల్ల యెడల నిండెను ఱొంపితో
కలుష జలము త్రాగ గ్రహణి రేగె
కరి, వృషభ, హయ, మయ కాయమ్ము సమసెను
పూరి పోచ లేక యోరెమునకు ॥ 1762

తే॥గీ॥ నెలల తరబడి వానలు నిలుపు లేక
కురియు చుండగ హెచ్చెను మరణములును
మృత మనుజ, జంతు కాయ సమృద్ధిగనుచు
కాక, కంక, గృధ్ర, మకర, కాండ మలరె ॥ 1763

తే॥గీ॥ గొల్లెనలునిల్ప త్రవ్విన గోతులందు
నీరు నిల్చుటచే నట నిల్వ లేక
పాదుషా శిబిరమును యా ప్రాంతమునకు
కొంత దవ్వుగ నిల్పిరి క్రొత్త చోట ॥ 1764

(గహణి=నెత్తురు బేదులు; మయము=ఒంటె)

షాహజాద "మౌజము"ను పాదుషా కఠినముగా శిక్షించుట

తే॥గీ॥ 'షాహజాద మౌజము' పయి శంక చేత
యతనిని సకుటుంబముగ గుయ్యార మందు
బందిఁజేయుచు నతని సంవదల నెల్ల
'పాదుషా' బండరమునకు పంపె నపుడు ॥ 1765

తే॥గీ॥ 'మౌజ' ముండెడు 'చెఱ' నవగోజు గూడ
కందకము నందె యుండెను గాని – యందు
బురద చేరిననచటనే మూసియుంచె
నతనిని సకుటుంబముగ, 'జహాపనా'యె ॥ 1766

తన కుమారుడు మౌజము పయి ఔరంగజేబునకు తీవ్రమైన అనుమాన ముండుటచే నతనిని ఘోరముగా శిక్షించుట

తే॥గీ॥ రాట్ప్రతినిధిగ 'మౌజ' మౌరంగ బాదు
నందు నుండ – శివాజీని యచటి కెటుల
నైన రప్పించి బంధింప నాజ్ఞ చేసె
బాద్ష – కాని మౌజము తప్పె వప్త శిష్టి ॥ 1767

ఆ॥వె॥ పిత దురూహములను వెల్లడి చేయుచు
సపరివారముగను శంభుజీని
యంపె 'రాయగడు'కు – నౌరంగబాదును
వీడజేసి తొరగ విపదఁబాయ॥ 1768

ఆ॥వె॥ 'బాద్ష' దౌష్ట్యమునకు ప్రతికారమునుఁజేయ
జతనపడియె శివజి జాగృతుడయి

(నవగోజు=శిబిరము)

(వప్త=తండ్రి; శిష్టి=శాసనము)

నాటి నుండి తనదు కోటలనన్నిటి
స్దృఢము చేసి యనికి నడుము కొనియె ॥ 1769

శా॥ "గోవా' యుద్ధము నందు గూడనటులే కూలార్పగా శంభు నెం
తో వైనమ్మగు వ్యూహమల్లుచు నట న్పోరాడగా నేగి - య
చ్చో వైఫల్యము చెంది కారణముల న్యూపించె - నిక్కమ్ముగా
ప్రోవుత్రొక్కములిచ్చి యుంద్రతనికిన్ పోర్చ్గీసులున్, శంభుడున్"॥ 1770

ఆ॥వె॥ అనెడి శంకయే తుషాగ్ని చందమ్ముగా
నేర్చుచుండె బాద్ష నెడద నెపుడు
నట్టి యనుమతోనె యపరాధిగా నెంచి
మౌజమునిడె చెఱ నమానుషముగ ॥ 1771

"మూసీ" నది వరదల వలన మొగలు సైనికులు యిబ్బంది లెదుర్కొనుట

తే॥గీ॥ వరద బురదలో చిక్కిన పాదుషాహ
సేనలను తల్లడపరప సిద్ధపడుచు
కుతుబుషాహ సైనికులు గోల్కొండ నుండి
దంచనలంబ్రేల్చి మొగలులదంచు చుండ్రి ॥ 1772

తే॥గీ॥ 'అసదుఖాను" "రుహుల్లఖాన్ "అజము" "కాము
బక్ష్" - తగిన సామగ్రిని బయటి నుండి
యందచేసి రదియు చాలి నంత లేక
"గొద" 'దగ' లతోడ మొగలులలదురవలసె ॥ 1773

చ॥ మృతుల కళేబరమ్ములను - మేఁగొన ప్రాణములున్న జీవులన్
మతి నెటువంటి యేవ మణుమాత్రము నైనను లేక క్షుత్త డం
ప - తినుట కుద్యమించిన విపత్తునకప్పుడు లోబడెన్జన
ప్రతతులవార్యమైన జడి వానలు తెచ్చిన కాటకమ్ముచే ॥ 1774

(అని=యుద్ధము; నడుముకొను=సిద్ధపడు) (గొద=ఆకలి)
(తుషాగ్ని=వరిపొట్టులోని నిప్వ; అనుమ=శంక) (అలదురు=బాధపడు)

కం॥ మోగలులు గూడ 'తానీ
షా'గడి కేగిరి రవంత సాపాటునకున్
రేగెడి యాకటి వేళను
గొంగయొ! సంగాతికాడొ! కూడిడ వేల్పొ ॥ 1775

శా॥ ఈలో పాదుష యాజ్ఞతో 'కుతుబుషాహీ' రాజ్యమందెల్ల – ద
క్కోలైనట్టి సమస్త పట్టణముల న్కుప్పమ్ముల న్కోటల
న్నాలస్యమ్మును లేక గ్రామణులు, దుర్గాధ్యక్షులు, న్నాయకుల్
పాలింపన్తమ 'సున్ని' ముస్లిములె యేర్పాటైరి నిక్కచ్చిగా ॥ 1776

తే॥గీ॥ గోలుకొండ కోటను వల గొనెడు విధిని
దారుకుడ్యము నిర్మింప తలచె 'బాద్ష'
తమ పృతన నుండి యెవరును తనను వీడి
పారిపోకుండ – తానిషాన్ చేరకుండ ॥ 1777

చ॥ మరియును కోటచుట్టుగల మార్గములన్నియు మూసివేసి యే
యిరవును నైన నడ్డుకొను యెత్తుగడౌ నిదిగాన వెంటనే
వరవుల కాజ్ఞ యిచ్చె – తగు వర్ధకుల న్పిలిపించి కుడ్యమే
ర్పరుపగ – దానితో గడము పైకిని బండము జేరకుండగన్ ॥ 1778

తే॥గీ॥ "బాలహిస్సార్ బరాదరి" ప్రథిత నామ
మున "యబుల్హస న్దర్బారు" గణుతి కెక్కె
అచట కూర్చుండెడి "అబులు హసను" తీరు
సోలి నేలకు వ్రాలు పిచ్చుకను బోలు ॥ 1779

ఆ॥వె॥ అబులు హసను మంత్రి "అబ్దుల్లపాని" న
వాబున కెఱిగించె వాస్తవమ్ము
"బయటి నుండి మనకు వస్తువుల్రాకుండ
కొయ్య యిడుపు మూసె కోట" నిపుడు ॥ 1780

(సాపాటు=భోజనము; గొంగ=శత్రువు; సంగాతికాడు=మిత్రుడు)
(దక్కోలు=వశపడినట్టి)
(ఇరవు=చోటు, వరవులు=సేవకులు; వర్ధకులు=కొయ్యపనివారు;
బండము=సామగ్రి) (ఇడుపు=గోడ)

ఉ॥ హెచ్చుగ సైన్యముల్గొనుచు నీగె 'యజమ్' మన హైద్రబాదులో
యిచ్చట వస్తువుల్మనకు నిప్పటి యక్కఱ తీర్చు - క్రొత్తగా
వచ్చెడి దారిలేదు నిక - 'బాద్షు' భవత్పురి పాలితావనిన్
పుచ్చుకొనె న్స్వకీయమని - పోష్యుల కున్నగు కొల్వు లిచ్చుచున్ ॥ 1781

తే॥గీ॥ కడకు మిగిలె నీ గోల్కొండ గడము నొకటె
భాగ్య నగరము మొగలుల పాలఁబడియె
"కుత్బుషాహి" సంపదలెల్ల కొల్ల గొనిరి
తిండి లేకుండ యెన్నాళ్ళు నుండగలము? ॥ 1782

ఆ॥వె॥ అనుచు చెప్పునట్టి 'అబ్దుల్ల పాని' కి
మారు పలుక కుండ యూరకుండె
'యబులు హసను' - మదిని 'యని' కొన సాగింప
తలచె - 'బాద్షు' యనిన తలకు లేక ॥ 1783

ఔరంగజేబు తానిషా అబులుహసను ను భయపెట్ట జూచుట

ఉ॥ దక్కనులో "షియా" ప్రభులు - తద్దయుతోడి 'మరాట' కాఫిరుల్
యొక్కటెగాన - వారలకు నుర్విని యేలు స్వతంత్రతాస్థితిన్
దక్కగ నీక - "సున్ని" తెగ నాయకులే తన యాజ్ఞ కెప్పుడున్
తక్కక నిల్చి పాలక పదమ్ముల నుండ తలంచు పాదుషా ॥ 1784

సీ॥ "మాదన్న", "యక్కన్న" మరియు "యక్కన పుత్రు
"రుస్తుము రావు"ల మస్తకములు
అంపపు పొట్టును గుంపించి దండిగా
"తానషా"కు మహోపా దానమట్లు
పంపించె పాదుషా - కంపించి యవిఁగని
'తానషా'తన కాళ్ళ పైనఁబడుచు

(ఈగు=ప్రవేశించు; పోష్యులు=భృత్యులు)
(కుత్బుషాహి=కుత్బుషా సామ్రాజ్యము)
(అని=యుద్ధము; తలకు=భయము)

'నపరంజి తళియ' లో యప్పనమ్ముకు జేయు
స్వయముగా స్వీయ రాజ్యమ్ము నసుచు ॥

తే॥గీ॥ తలచి "యౌరంగజేబు" – నా కలుష బుద్ధి
'తానషా' యెఱుంగును గాన తలక లేదు
యుద్ధమే చేయఁదానును సిద్ధమయ్యె
పాదుషా కుత్సితపు యుక్తి భంగపడగ ॥ 1785

"అబులుహసను తానిషా" కు అత్యంత విశ్వాస పరుడైన సచివుడు "అబ్దుల్లపాని" రాజద్రోహమునకు కడంగుట

సీ॥ "అబ్దుల్లపాని" తా "నబులుహసను" కతి
విశ్వాస పరుడైన ప్రెగ్గడగును
తక్కిన వారు – మాదన్న, యక్కన్నలు
షేక్నిజామ బుద్రుల జాకు – పంచ
సచివులత్యంత విశ్వాస పరులు వీరు
కాని నే "డబ్దులుపాని" తలపు
భిన్నమయ్యె – రహస్య 'బిల' మార్గమున పోయి
గడము నడుగున యగడ్త చెంత ॥

తే॥గీ॥ గల యొక చిఱుతదైన వాకిలిని తెఱచె
నట 'యగడ్త' లోతొక రెండు నడుగులుండు
వైరి భయమెక్కువైన – నవాబు తన "కు
టుంబమును" గొని తొలగు ద్వారంబు నద్ది ॥ 1786

తే॥గీ॥ ఆ రహస్య మెఱుగువారు – 'అబులుహసను'
నలుగురు సచివులం "దక్కన" యును "మాద
న" యుగతించిరి – ముప్పురే గలరు – వారి
లోన "యబ్దుల్లపాని" విద్రోహియయ్యె ॥ 1787

(ఉపదానము=కానుక)

"అబుల్‌హసను తానీష" కు అత్యంత విశ్వాసపాత్రుడైన మరియొక మంత్రి "షేక్‌నిజాము" రహస్యముగా ఔరంగజేబును కలిసికొనుట

తే॥గీ॥ "షేక్ నిజాము"గూడ కడు నచ్చిక గలట్టి
సచివుడై మెలంగును "తానిషా" కు - నేడు
కూహకము చేయజనె 'పాదుషా'హ తోడ
యర్ధరాత్రమ్ము నందొరు లరయ కుండ ॥ 1788

తే॥గీ॥ బట్టతల 'బాద్ష' సప్తతి వర్ష ప్రాయు
డయ్యును - తనువుడయ్యక కొయ్యరాట
వోలె - నిట్ట నిల్వున నిల్చె తేలికగను
పట్టుదలఁజూడ కడు గట్టి చట్టునయ్యు ॥ 1789

ఔరంగజేబు తలపాగ ధరింపకుండుటకు కారణము

తే॥గీ॥ 'పాదుషా' నేడు తన తల పాగ లేక
నందరికి దర్శన మొసంగుటందున కొక
కతము కలదు - దక్కను వచ్చి గడచె నబ్ద
షట్కమయ్యు, దక్కమినొక జయము గూడ ॥ 1790

తే॥గీ॥ ఒక్క "రామ్సెజు" గడుఁగొన నొడ్డి నారు
సర్వశక్తులు మొగలులు - శకము పైన
గడము వశపడలేదైన - గడ్డి కఱచి
నారు పడవాళ్ళు - వైరులు నవ్వ కొనగ ॥ 1791

తే॥గీ॥ అంతకంతకు నసహన మతిశయింప
"శౌర్య నిధులైన మొగలాయి సైన్యపతులె
తూలిపోయిరి 'మారాట' నేలపైన
యంతవీరుడా? "శంభాజి' యనుచు కనలి॥ 1792

(నచ్చిక=నమ్మకము) (సప్తతి వర్షములు=డెబ్బది యేండ్లు)
(శకము=సంవత్సరము; గడ్డికఱచు=ఓటమిని అంగీకరించు)

ఉ॥ ఎన్ని సమల్గతించినను నెక్కడ నొక్క మరాట కోటయున్
కొన్నది లేదటంచు నతి క్రోధనుడై యవురంగజేబు - తా
నున్నటులుండి వేష్టనము నూడగబీకి సభాంతరమ్మునన్
క్రన్నన నేలగొట్టె - తన ఖల్వట మందరు చూచుచుండగన్॥ 1793

ఉ॥ దక్కను నేల యార్ద్రమగు దాకను కాఫిరు 'శంభు' మేనిదౌ
చిక్కని శోణిత స్రుతిని - చీలిచి, చెండుచు వాని యంగముల్
కుక్కలకేయ కుండ - తలకున్నవరింపను "పాగ' యంచు - దు
ర్వాక్కులుకూసె-వృద్ధ'కిగి' వైఖరి బొంగురు గొంతుతో సభన్॥ 1794

తే॥గీ॥ క్రూరు డౌరంగజేబుని ఘోర శపథ
వార్త దేశమెల్ల దిశల ప్రాకెగాన
స్వామి విద్రోహి "షేకు నిజాము" గూడ
నాయుదంతము విని యుండి నాడొ! యేమొ? ॥ 1795

తే॥గీ॥ "షేక్నిజాము" తానవురంగ జేబుతోడ
ననె "జహాపనా! గోల్కొండ నాక్రమింప
దక్కను ధర యంతయు మీకు దక్కినట్లె
గాదె! యని యన్న - కాదనె పాదుషాహ ॥ 1796

తే॥గీ॥ "మిగిలియున్నది" మారాట మేదిని యట
కోట యొకటైన వశ పడకుండ యుండె
యన్నియును కాఫిరు శంభు నస్రధార
తోడ తడిపియే ధరఁబడద్రోయఁజేతు ॥ 1797

(సమ=సంవత్సరము; వేష్టనము=తలపాగ; ఖల్వటము=బట్టతల)
(స్రుతి=ప్రవాహము; కిగి=కొంకినక్క)

‘షేక్ నిజాము’ ‘శంభు’ని బంధింతునని శపధము చేయుట

తే॥గీ॥ అనెడు పాదుషా నుడుల క్రౌర్యమ్ము నరసి
‘షేక్నిజాము’ మదిని మెఱసె నొక తలపు
“శంభు బంధింతు“ నల్లాయె “సాక్షిగాగ”
అనుచు శపధము చేసె జహాపనెదుట ॥ 1798

తే॥గీ॥ ప్రతినకే బాద్ష మురిసి ముప్పందు మయ్యె
శంభు బంధితుడై సమక్షమున నున్న
యట్లె భావించి – సంబర మభ్రమంట
శ్లాఘనములు గుప్పెను – షేక్నిజాము పైన ॥ 1799

శా॥ “శాబాసోయి” ‘నిజాము షేకుదణి’! నీ శౌర్యోక్తులన్ మెచ్చితి
న్నా బండన్పడగొట్టి పట్టుకొనియు న్బంధించి నా యొద్ద కా
ద్రాబన్దెచ్చెదనంటి – రూప్యముల నందంజేతివే ‘లక్ష’ – ముం
దీ బట్టిన్గైకొను మిప్డు–ముందుగల వెన్నెన్నో పురస్కారముల్ ॥1800

ఉ॥ కత్తిని దూసినావు నొక కాఫిరుపై తడబాటు లేక నీ
యుత్తమ మౌ ప్రవర్తనకు నుబ్బును తుర్కల దైవమెంతయు
న్నిత్తఱి మల్కదైవమున కెంతయు నిష్టుడవైతి గాన – నే
నిత్తును శ్రేష్ఠమౌ బిరుదు నీకు “ముకర్రబు ఖాన”టంచునున్॥ 1801

శా॥ ‘అల్లా’ నెవ్వడు విశ్వసింపడతని న్నత్యుగ్రతన్జంపిన
‘న్నల్లా’ సంతసమందు నాతడనుకంపాంబోధి – కాఫిర్లపై
బల్లెంబెత్తిన, వాలు దూసిన నొగిన్బందూకులన్పేల్చిన
‘న్నల్లా’ యెప్పుడు నట్టి యోధుల పయిన్హార్ధమ్ము చూపించెడున్॥ 1802

ద్రాబ=అవివేకి; బండ=దుష్టుడు; బట్టి=కానుక
(మల్కా=తుర్కా)
(అనుకంప=దయ; హార్ధము=ప్రేమ)

తే॥గీ॥ విజయ మందిన "ఘాజి" - కివ్విన 'షహీదు'
నెటులనైనను ముస్లిము భటుల కెపుడు
కీర్తియేగాని యపకీర్తి కలుగ బోదు
"దారులిస్లాము" స్థాపింప పోరునపుడు" ॥ 1803

ఆ॥వె॥ అనుచు బాద్ష పలుకు నమృతమయమ్ములౌ
జ్ఞాన పూరిత ప్రవచనములు విని
యింత వేత్త యున్నె! యీవిశ్వమందని
చేష్టలుడిగె 'వెఱ'ను 'షేక్నిజాము' ॥ 1804

ఉ॥ ప్రజలను దోచ వచ్చి పడు పైకము పాదుష కొక్క లెక్కయా?
వృజినములంబొనర్చ మును వెన్కలు చూడని దుష్ట బుద్ధులన్
బుజములు తట్టి - పేటికల భూరి నొసంగుచు ప్రోత్సహించు యీ
'బజిగెడి' ఢిల్లి నేత కొక పాపము పున్నెమునంచు యున్నవే?॥ 1805

ఉ॥ "షేకు నిజాము" నచ్చెరువు చెందెను - "శంభుని పట్టు కొందునన్
వాకునకే - ధనాఢ్యులనొనర్చగ నన్నును - నా కుటుంబమున్
చేకొనె - మాట నిల్పుకొని చేసియు చూపిన - నెమ్మిగద్దె పై
నాకు సగమ్ము చోటిడునొ! నమ్మనశక్యము నీ యుదారతన్"॥ 1806

తే॥గీ॥ అని కృతజ్ఞతా భరమున నవనతుడయి
'పాదుషా' పాదములు తలవంచి తాకి
శంభుజాడలు నెమకంగ సత్వరముగ
వేల మంది చారకులఁ బంపించె 'షేకు' ॥ 1807

(కివ్విన=మరణించిన, ఘాజి=పుణ్యవీరుడు; షహీదు=అమరవీరుడు; దారుల్ ఇస్లాము=తురుష్క సామ్రాజ్యము) వెఱ=ఆశ్చర్యము

(వృజినము=పాపము; భూరి=బంగారం; బజిగెడి=నీచుడు)

(చేకొను=చేరదీయు; నెమ్మిగద్దె=ఢిల్లీ నెమలి సింహాసనము)

(చారకులు=వేగులవాండ్రు)

రాజద్రోహి 'అబ్దుల్లపాని" తెఱచి యుంచిన బిలమార్గమున మొగలులు గోల్కొండలో ప్రవేశించుట - "తానిషా" పరాజయము

తే॥గీ॥ స్వప్రభుద్రోహి "అబ్దుల్లపాని" – తెఱచి
యుంచిన రహస్య మార్గపు నోల మిపుడు
బట్టబయలయ్యె – మొగలులు నెట్టుకొనుచు
చేరి పోయిరి గోల్కొండ శిఖరమునకు ॥ 1808

తే॥గీ॥ "అబ్దులు రజాకు" తానిషా కగ్రసచివు
డడ్డగించుచు వైరుల నంతిమక్ష
ణమ్ము వరకు పోరెను గాని, నభసము వలె
పొంగివచ్చు మొగలులకు లొంగిపోయె ॥ 1809

తే॥గీ॥ హైదరాబాదుకు నవాబు 'నబులుహసను'
తలనువంచెను ఢిల్లి సుల్తాను ముందు
కచ్చకైన వెచ్చమును తా నచ్చు కొనుచు
నేడు కోట్ల నిష్కములు చెల్లించె నపుడె ॥ 1810

తే॥గీ॥ వేలబండ్లకు నిండుగ వివిధ రత్న
హేమరజత భూషలు తరలించ బడియె
హైద్రబాదు సాంవత్సరికాయ మపుడు
మూడు కోట్ల హొన్నులు, ముట్టు మొగలు పతికి ॥ 1811

(ఓలము=రహస్యము)

(నభసము=సముద్రము)

(ఆయము=ఆదాయము; హొన్ను=బంగరు నాణెము)

హైదరాబాదు నవాబు అబులుహసను, బిజపూరు నవాబు 'సికందరుషా' దౌలతాబాదు చీకటి కొట్లలో బందీలగుట

తే॥గీ॥ అట్లు దక్కనులోని "షియా ప్రభుత్వ
ములను కూల్చి 'కుతుబ్షా' 'యబులు హసను'ని
'యాదిలుషహా' 'సికందరు' నపుడె బంపె
దౌలతాబాదు చీకటి సాలలకును ॥ 1812

'ఛత్రపతి శంభాజీని' పట్టుకొనుటకు పాదుషా పన్నిన వల

తే॥గీ॥ బీజపూరు, హైద్రాబాదు వెరవు పడగ
యంతు లేని ధనము "బాద్ష" సొంతమయ్యె
కుడి యెడమలను పిడికిళ్ళు విడిచి చల్లె
రొక్కమును - మరాటాలను లోగొనంగ ॥ 1813

"వాయ్" యుద్ధము - హంబీరరావు మోహితే అస్తమయము (క్రీ.శ. 1697)

తే॥గీ॥ పాదుషా గోలుకొండపై బవరమందు
నచటె శిబిరమ్ములోనున్న యవసరమున
"సర్జఖాను" దణాయడై సమితికడర
మొగలుసేన "సతారా" ను ముట్టడించె ॥ 1814

కం॥ ఈ "సర్జాఖా" నాది
ల్షా సేనాధిపతి యయ్యు - సమరములో ఢి
ల్లీ సుల్తాన్బిజాపురి
నే సాధింప - మొగలుల పనిగొనెను నటుపై ॥ 1815

(దణాయ=సేనాధిపతి; అడరు=పూను) సమితి=యుద్ధము
(సాధించు=గెలుచు; పనిగొను=సేవించు) వెరవుపడు=వశపడు

తే॥గీ॥ వీర హంబీర రావప్పు పోరు చుండె
నపరదిశc "గొంకణు"న – నుద గాశ పర్వ
తోర్వి 'బగ్లాను' నందున – తూర్పునందు
'హైద్రబాదు' 'గుల్బర్గా'ల యంతరమున ॥ 1816

తే॥గీ॥ మొగలు మూక లెల్ల యెడల ముసరు కొనగ
రా బడులు తగ్గె మారాట రాజ్యమునకు
సేనలకు నీయ వలసిన జీతములకు
ధనము సేకరించుట యసాధ్యమ్మునయ్యె ॥ 1817

మ॥ అపుడా 'వాయి' సమీపమందు మొగలుల్లభ్యాగమాయత్తులై
రిపు దుర్జేయుడు 'సర్జఖాను' దణిగా రేగంగ, దుర్వారులై
యపసర్పుల్ మొగలాయి తాకుదల నా"హంబీరు కుం"దెల్ప, తా
ను పరింగొంచును వచ్చి ముట్టెనరులన్నుగ్గాడ జన్యుక్షితిన్॥ 1818

మరాటులు ప్రాతబడిన ఆయుధములతో యుద్ధము చేయుట

ఉ॥ ఆవల 'వాయి' ప్రాంతమున యాహవమున్తుములమ్ము నయ్యె – శ
స్త్రావళియు న్మరాటులవి ప్రాబడె – తేలికపాటి దంచనల్
మావుల పైన మోపి సుగమమ్ముగ ప్రేల్చగ దొలనుండియే
చేవలతైన వొక్కటియుcజేరమి సేనకు లోటు గల్గియున్ ॥ 1819

తే॥గీ॥ శత్రులు హరులపైన దంచనలు నిల్పి
త్వరగ కదలుచు గుండ్లను కురియుచుండ
ప్రాత గిల్లిన శస్త్రాళి ప్రాపుతోనె
యెదురుచుండ్రి మరాటులు నదరకుండ ॥ 1820

(అపరదిశ=పశ్చిమము; ఉదగాశ=ఉత్తరము; అంతరము=మధ్య)

(అభ్యాగమము=యుద్ధము; అపసర్పులు=గూఢచారులు; జన్యువు=యుద్ధము) హరము=గుఱ్ఱములు

‘వాయి’ రణ క్షేత్రములో ‘బహిర్జీనాయకుడు’ ‘హంబీర రావుకు’ కన్పించి, ‘శంభుజీ’ని బంధించుటకు ‘పాదుషా’ పన్నిన కుట్రను చెప్పుట

తే॥గీ॥ అపుడు హంబీర రావుకు నచట నొక
వృద్ధ భిక్షుకుడగుపింప నొద్దకేగ
నతడెవండొ కాదు – ‘బహిర్జి నాయకుండె’
సర్వ ప్రణిధివ్యవస్థకు సంప్రణీత ॥ 1821

ఉ॥ “ఏమి బహిర్జి! యొంటిగను నిచ్చట నుంటివి యేలనన్న” – ‘నీ
తో మఱిమాటలాడ నిటు తూర్ణముగాఁజనుదెంచి నాడ – నే
డా మొగలాయి జృంభణకు “నాదిలుషాహి”యు–“కుత్బుషాహి”యున్
మోములు వంచి మోకరిలి, బోరగిలంబడె ‘బాద్షః’ ముందరన్॥ 1822

తే॥గీ॥ మూసి నది పొంగి వెల్లువ ముంచెధరను
నాయనుచరులందరు చని పోయి రేమొ!
యన్ని దిక్కులన్మొగలాయిలున్న కతన
యెటులొ తప్పించుకొని వచ్చి తిటకు నేడు ॥ 1823

ఉ॥ ‘ఆదిలుషాహి’ సుస్థిరత కాదరువై యశమంది – నేడు పెం
పేదియు – పాదుషా కొలువు నీయగ నిక్కుచు – ‘షార్జఖాను’డు
న్మాదిగమారి ‘శంభుజి’ని – ‘మాయలు పన్నుచు పట్టి తెత్తునం
చా దొడ వేదొవాగ కొనియాడెను పాదుష ‘రుస్తుమం’చునున్॥ 1824

ఉ॥ హైదరబాదు రాజ్య సచివాగ్రణి “షేకు నిజాము” – ‘తానిషా’
ప్రోదిని గోలుపోయి, స్వవిభున్విడనాడి – మొగల్ప్రభుండ మ
ర్యాదుడు దోచుకొన్న ధనమందున నించుక రాల్ప క్రొవ్వి – యా
‘పాదుష’ మెప్పు కేతులనుఁబల్కెను “శంభుని” పట్టెదంచునున్॥ 1825

(ప్రణిధి=వేగు; సంప్రణీత=అధికారి) (షాహి=సామ్రాజ్యము)
(దొడవ=నీచుడు; “రుస్తుమ్”=వీరుడు అను బిరుదు)
(ప్రోది=పోషణము; ఏతులు=డంబములు)

తే॥గీ॥ వాని డంబమ్ములన్విని పాదుషాహ
యా ఖలుని "ముకర్రబుఖాన్స" మాఖ్య తోడ
సన్నుతించి సంపదలిడ - శంభు కొఱకు
వాడు మాటేసె - 'యేటకై తోడెలట్లు'॥ 1826

చ॥ కనుఁగలిగుండి "రుస్తుము" ముకర్రబు ఖానులు - సహ్య భూధ్రకా
ననములఁరేబవళ్ళొకక్షణమ్మును చూపును త్రిప్పకుండ శం
భునికయి దేవులాడుటకు వ్యూహము పన్నిరి - శంభుకీ పొరన్
వినికిడి సేయగా వలెను-వేగమె వేగుల పంపు మంచనన్" ॥ 1827

సీ॥ ఇంతలో దూరాన యిర్వురును వినిరి
గుఱ్ఱాల గిట్టల ఘోషణమ్ము
విశ్రాంతి గైకొను వీర మరాటులు
చిటికలో యుద్ధ సంసిద్ధులైరి
రావుతుల్కనరారు - రంహమ్ముతో వచ్చె
యశ్వదంచనముల యగ్గి గుండ్లు
వీర మారాటుల విండ్లు తుపాకీలు
శరముల్, గోళముల్ కురియుచుండె ॥

తే॥గీ॥ గుఱ్ఱములపయి 'లఘు'ఫిరంగులను బెట్టి
ప్రేల్చుటకు నట్టివి మరాట పృతనయందు
లేవు - నాంగ్లేయులనడుగ నీయలేదు
నట్టి లోపము కనబడె నాహవమున॥ 1828

తే॥గీ॥ శంభుజీయును, హంబీర సైన్యపతియు
'లఘు' ఫిరంగుల కోసము లక్ష సార్లు
ధనములిచ్చి కొనెదమని యనినగూడ
మారు చెప్పక అంగ్లేయు లూరకుండ్రి ॥ 1829

(ఏట=గొర్రె; తోడెలు=తోడేలు)
(దేవులాడు=అన్వేషించు; పొర=అపాయము)

మరాటులు షార్జఖాను సైన్యమును యడవులలోని కాకర్షించుట

చ॥ క్రమముగ యుద్ధము న్జరిపిరల్లన కానల లోకి సాగున
ట్లు – మలకలీరణాజిరములో గల మార్పు నెఱుంగ గల్గిరో!
సమరపు యొత్తడి న్నరయ జాలక పోయిరొ? యా మరాట వ్యూ
హము ప్రతి కూలమయ్యె, గహనాంతర యుద్ధము నౌట 'ఖానుకున్'॥ 1830

వీర హంబీరరావు మోహితే అస్తమయము

తే॥గీ॥ తుముల మయ్యెను సమరము – త్రుంగిరెంద
రో భటులిరువైపుల – నకుతోభయులయి
పోరు చుండగ మొనలు – "హంబీరరావు"
తలకు తగిలె నపుడొక – శతఘ్ని గుండు ॥ 1831

తే॥గీ॥ రాలిపోయెను మహరాష్ట్ర రక్షకుండు
పడెను నేలపై శంభాజి కుడి భుజమ్ము
నోటమియె యెఱుంగని యట్టి పోటు మగడు
వీర "మోహితే" కులుడు "హంబీరరావు" ॥ 1832

తే॥గీ॥ ఆతనికి వార్త లందింప నరుగు దెంచి
నట్టి – చారనేత బహిర్జి నాయకుండు
రుండికను మరణించెను గుండు తగిలి
'శంభు'పై కుట్ర వార్తయు సహగమించె ॥ 1833

(రణాజిరము=యుద్ధక్షేత్రము; గహనాంతరము=అడవి లోపలి)
(అకుతోభయులు=భయమెఱుగని వారు) రుండిక=యుద్ధ రంగము

వీర 'హంబీరరావు మోహితే వ్యక్తిత్వము' 'ఛత్రపతి శంభాజీ' పట్టాభిషేకమున వెన్నుదన్నుగ నిల్చుట

ఉ॥ నాడు 'శివాజి' రాజుకు దణాయడునై, 'రణదుర్జయుండు' నం
చాడగ భూప్రజల్, రిపులు సైతము – హంబిర రావు మోహితే
వాడని రాజభక్తి కుపపత్తిగ శంభుని యౌరసత్వపున్
మేడెము నందు దోషులందమించుచు శంభుని చేసె రాజుగన్॥ 1834

తే॥గీ॥ సొంత తోబుట్టువైనను "సోయరా"ను
భగిని పుత్రుడు 'రామరాజ'గుటగాని
దవ్వులనె యుంచి – దేశ భద్రతందలంచి
'వీర శంభాజి'నే సింహ పీఠిందనిల్పె ॥ 1835

"వాయ్" యుద్ధములో మొగలుల ఓటమి

కం॥ షార్జా ఖానుని సైన్యము
నిర్జింపంబడియె సహ్యనిబిడాటవులన్
దుర్జయుడు "మోహితే" దో
ఖర్జువు తీరంగ రిపుల కసిమసగుటచే ॥ 1836

శా॥ "వీరస్వర్గ మలంకరించె" నని, హంబీర్రావుజీ మోహితే"
చారుల్విన్చిన వార్త – శంభుజికి వజ్రాఘాతమై సోకె – దు
ర్వారార్తమ్మొక కొండయై యెదను మోపంబడ్డ చందాన, నే
దారుల్లిక లేనియట్లు కనుల స్దట్టంపిరుల్గ్రమ్మగన్॥ 1837

(దణాయుడు=సేనాని; ఉపపత్తి=ఉదాహరణము; మేడెము=యుద్ధము)
(భాగినేయుడు=మేనల్లుడు)
(ఆర్తము=దుఃఖము; ఇరులు=చీకట్లు)

హంబీరరావు మృతికి ఛత్రపతి శంభాజీ తీవ్రముగా దుఃఖించుట

ఉ॥ "ఎందరు వీరులున్న సరియే" తన మామకు! గుబ్బమెక్కి - వే
గందరవారి దూసి - చిఱుకందువఁజేసిన సైనికాళికిన్
డెందమునందు మేరువునె ఢీకొను నంతటి ధైర్యమెచ్చు - శ
త్రుందముడన్న పేరతనితోనె లయించె మరాట భూమిపై ॥ 1838

తే॥గీ॥ ఆమహాదేవుడేమి చేయంగఁ దలచు
నో యదియె జరిగియె తీరు - నుతులొనర్చి
యా జగత్పితదయకు - సమర్థులమగు
టొక్కటేదారి - విపదల నుత్తరింప" ॥ 1839

తే॥గీ॥ అనుచు శంభు పెద్దయుఁబ్రొద్దు పనవి పనవి
యపుడు "మల్హోజి" ఘోర్పడే ననుభవయుతు
సర్వ సేనాధిపతిగను చాటఁబంచె
సర్వ దిశల మరాట రాజ్యోర్వి యందు ॥ 1840

రుస్తుమ్‌ఖాను (షార్జఖాను), ముకర్రబుఖాను (షేక్ నిజాము) తనను బంధించుటకు చేయు యత్నముల గురించి శంభాజీకి యెట్టి వార్తయు లేకుండుట

తే॥గీ॥ తనను బంధింప - పాదుషా - ధనము లొసగి
పనుపగా "ముకర్రబుఖాను" - వాని వలెనె
కాసులంగొని "రుస్తుము ఖాను" - పొంచి
తిరుగు చున్నట్లు శంభుజీ కెఱుక లేదు ॥ 1841

(కందువ=సైగ)

ఔరంగజేబు బీజాపూరుకు వచ్చుట

తే॥గీ॥ 'పాదుషా' మొగల్రాజ్యము పాదు గొలిపె
"కుత్బుషాహి" ని తొలచి తతో్క్షణియందు
'హైదరాబాదు' వీడి తా నరుగుదెంచె
'బీజపూరు'కు విజయ గర్వితుడు నగుచు ॥ 1842

ఆ॥వె॥ శేషమిక 'మరాట సీమ' వశమ్మౌట
దక్కె తక్కినట్టి 'దక్కను' ధర
శంభు జృంభణమ్ము సాగఁ బోదింకపై
యాదుకొనెడి వారలంతమైరి ॥ 1843

'షాజాదా అక్బరు' 'కలలు కల్లలై' 'పారశీక దేశము'నకు ప్రవాస మేగుట - దుర్గాదాసు రాఠోడు ఆశాభంగము

ఆ॥వె॥ హెచ్చు ధనము లిచ్చి యింగ్లీషు వారిదౌ
"నౌక' యందు పారశీకమునకు
సాగిపోయె "షాహజాదు అక్బరు" కల
లన్ని కల్లఁగాగ ఖిన్నుడగుచు ॥ 1844

తే॥గీ॥ "దుర్గ దాసురాఠోడు' వృద్ధుండు నగుట
బుద్ధి నైశిత్యమటె పోను పోను తుదకు
"ఎట్లు శంభు 'నాలంపనా' నెదురగలడు"?
నని తలంపక గిరి నెత్త మునుకొనెగద" ! ॥ 1845

ఔరంగజేబు హెచ్చుగా ధనము, వతన్లు, జాగీర్లు, పదవులు వాగ్దానము చేసి మరాటా దుర్గ పతులను లోబఱచుకొనుట

శా॥ ఆరేండ్లాయెను వచ్చి "దక్కనునకును" న్నౌరంగ జేబాత్మలో
పేరాసన్ వహియించి - పూటకొక దుర్భేద్యమ్మునౌ దుర్గమున్
పూరిండ్ల న్నడగొట్టి నంత చులుక న్పొందంగ నౌనంచు - నే
డీరీతిన్ధన మిచ్చి పొందవలసెన్నే చిన్న కోటైననున్ ॥ 1846

కం॥ "మారాట కొండ కోటలు
పోరాటము చేసి గెల్వఁబోల దెవరికిన్
భూరిధనము, పదవుల పం
దేరముతో దుర్గపుల మదిని గెలువ వలెన్" ॥ 1847

చ॥ అని పనిచెన్ధణాయలను నశ్వదళమ్ములనిచ్చి - "మీరు ద
వ్వున విడియన్వలెన్గడము పొంతను వీడుచు, 'దుర్గనాయకున్'
మనప్రణిధుల్విధేయులయి, మన్నన చేయుచు - వాడునేది కో
రిన నది యిత్తుమంచు నపుడే ధనము 'స్సనదు'ల్లిడన్వలెన్॥ 1848

సీ॥ అట్లు చేసెడి "బాద్షః" యద్భుత వ్యూహము
సద్యోఫలితము లొసంగసాగె
"పూణే" పురము "శివపూరు" "పురందరు"
"రామ్సెజు" గడి "సతారాపురా" యు
"కొల్హాపురి" "కరదు" "సాల్హేరు" దుర్గము
"మిరజు"ను మొదలైన మేలి కోట
లన్ని మొగలులనాయాసముగ నొడిచి
రిసుమంతయును నిగ్రహీతిలేక ॥

తే॥గీ॥ ఇట్లు గడము లొకొకటి యదృశ్యమయ్యె
నపుడు "రామ్సెజు" గడము "సూర్యాజి యున్కి
తొరగలేదు - నే"డాసుజీ" దుర్గ పతిగ
యధిక ధనమును గొని గడమప్పగించె ॥ 1849

(ప్రణిధులు=రాయబారులు; సనదు=దానపత్రము)

(పురా=కోట; తొరగు=వశమగు; నిగ్రహీతి=అవరోధము)

కం॥ "హంబీర మోహితే" తో
డంబోయెను - శిక్షణము కటకమందు, సుఖా
డంబరములపయి గల మో
హంబును, ద్రవ్యాశ వారి నవశులంజేసెన్ ॥ 1850

తే॥గీ॥ ప్రొద్దు ప్రొద్దుకు మారాట భూమి 'మేర'
తగ్గు చుండెను - నాయమ్ము తగ్గు చుండె
పలుగడమ్ములు మొగలుల పాలబడియె
ముందునుయ్యి - వెనుక గొయ్యి - మోస్తరయ్యె ॥ 1851

మరాటా రాజ్య విస్తీర్ణము తగ్గిపోవుట - ఆదాయము తగ్గుట - శంభాజీ కదలికలకును స్వేచ్ఛ తగ్గుట

తే॥గీ॥ రాయగడము - పన్హాలకోట - రాజగడము
వీని మధ్యనే శంభాజి విధృతి చెల్లు
ఈ త్రిభుజముదాటి యడుగు నిడుట గూడ
యతి ప్రమాదమనెడు పరిస్థితియు వచ్చె ॥ 1852

శంభాజీని బంధించుటకు 'ముకర్రబు', 'రుస్తుముఖాన్ల' తీవ్ర ప్రయత్నము

ఉ॥ గ్రద్దలవోలె వేచియు ముకర్రబు, రుస్తుము ఖాను లిద్దరున్
నిద్దురవీడి - వేగులు గణేయపు సంఖ్యను దేవులాడగా
ప్రొద్దులు రేలు శంభు పొలపుందెలియంగ మరాట భూములన్
సద్దొక యించుకంతయిన - చారులు వచ్చిరటంచు కాద్పడన్॥ 1853

ఉ॥ 'పాదుష' మున్నె చెప్పెగద పర్వత దుర్గములందు - కాననా
ఛ్ఛాదిత భూములందతడసాధ్యుడు - బైలప్రదేశ మందు తా
నేదొ పరాకుగా తిరుగ నేగిన నప్పుడు పెక్కు రొక్కటై
మీదికి దూకి పట్టుకొని మేను నడంచియు కట్టివేయనౌ ॥ 1854

(కటకము=సేన; విధృతి=ఆజ్ఞ)

(గణేయము=గణనీయము; పొలపు=ఆచూకీ; కాద్పడు=కలవరపడు)

ఉ॥ ఆతని పోబడిందెలియ - నాతని బందుగు లందె యెందరో
నాతని పేర్మి నోర్చుకొన కక్షమమై పెను కీడు సేయ తా
మే తలకొంచు నుండిరని యెల్ల రెరుంగుటచేత - యట్టి వా
రీతతి శంభు నొంప మన కెంతయు సాయము నౌదు రంచునన్॥ 1855

ఉ॥ అప్పుడె శంభుజీ స్వజనులందున కొందరు 'శంభుజీ'కి తా
మొప్పమి సేయు పూనికను నుండి రటంచును యందు 'షిర్కె' వా
రెప్పుడు సిద్ధమన్న దెదకించెడు వార్త నెఱింగె పాదుషా
చెప్పుటకేమి యున్నదిక 'షిర్కె' 'గృహమ్ములు నిండె 'పైడి'తో ॥ 1856

తే॥గీ॥ సర్వ భూపాలురకు వలె శంభుజీకి
బయల, లోపల రిపులున్కి బ్రాతి గాదు
'శ్రీ శివాజీ' యెడ సహిత మీసు బూని
కీడు తలపెట్టిన ఘను లానాడె గలరు ॥ 1857

'శంభాజీ'పై మరాటా జమీందార్ల ద్వేషమునకు కారణము

తే॥గీ॥ 'వతనులు' 'జాగిరు'ల్గలుగు వారలు కార్షుల బాగుపట్ల యా
దృతి లవమైన లేక తమ యిష్టము వచ్చిన రీతి సుంకముల్
'మితి' యని లేక లాగుకొని మేడలు, మిద్దెలు, వస్తు వాహన
ప్రతతులు కూర్చుకొంచు తమ 'రైతులఁ'బస్తుల నుంచుచుండగన్॥ 1858

తే॥గీ॥ శ్రీ శివాజి హలికుల సంక్షేమమునకు
వతనుదార్ల జమీందార్ల ప్రతినియమము
పనికి రాదని తొలగించి - పన్నులన్ని
నేరుగా బొక్కసము చేరు నియతి చేసె ॥ 1859

(పేర్మి=కీర్తి; తలకొను=ప్రయత్నించు; ఆదట=ఆసక్తి)
(ఒప్పమి=హాని; పైడి=బంగారము)
(బ్రాతి=అరుదు) అక్షమ=ఈర్ష్య
(ప్రతి నియమము=ఏర్పాటు; నియతి=నియమము)

తే॥గీ॥ శంభు చనియెను పితరుని జాడలందు
హలిక బాంధవుడన్నట్టి యశము గాంచె
దానితో నాటి శివ ప్రభు దాయలిపుడు
కత్తిగట్టిరి శంభుపై కక్షఁబూని ॥ 1860

తే॥గీ॥ నాడు 'ఔరంగజేబ'ట లేడుగాన
శివజి సంక్షేమ రాజ్యము చెదరకుండె
నేడు ఔరంగజేబు శని గ్రహమ్ము
నావులించెను 'శంభుని' 'గావు' గొనగ ॥ 1861

బిజపూరులో మహమ్మారి వ్యాధి చెలరేగుట (ప్లేగు) ఔరంగజేబు అహ్మాద్ నగరుకు తరలుట

తే॥గీ॥ బీజపూరున చెలరేగె "ప్లేగు" వ్యాధి
పాదుషా నాలుగవ భార్య బాసె యుసురు
మఱియు పీరూజి జంగున కఱెను చూపు
పీన్గు పెంటగ మారెను బీజపూరు ॥ 1862

తే॥గీ॥ "ప్లేగు" పీడకు పాదుషా బెదరి పోయి
తరలె యహమదు నగరుకు తక్షణమ్మె
నట "ముకర్రబుఖాను"కు నాజ్ఞయిచ్చె
"కొల్హాపురి" చేరి శంభునకురులుబిగుచ ॥ 1863

తే॥గీ॥ "శంభునే గాదు – నాతని షడ్వసంత
ప్రాయుడౌ సుతు 'సాహు' – శంభాజి తమ్ము
డైన 'రాజరాము'ని గూడ యదుపు సేయ
'భోన్సలే' పాలక కులమె బ్రుంగుననియె" ॥ 1864

(అఱు=నశించు)
(ఉరులు=ఉచ్చులు; బిగుచు=బిగించు)

‘ఛత్రపతి శంభాజీ’కి గాని, ‘కవికలశునకు’ గాని తమపై జరుగు కుట్రను గురించి తెలియక పోవుట

ఆ॥వె॥ శంభునకు, కవికలశామాత్యునకు గూడ
అరులు తమ పయిన విసరిన యురుల
గూర్చి రవయు తెలియ కుండుట వింతయ్యె
గూఢచరులు గూడ గ్రుడ్డియైరి ॥ 1865

‘ఛత్రపతి శివాజీ’, ‘ఛత్రపతి శంభాజీల’పై ‘షిర్కె’ కుటుంబము వారి కోపమునకు కారణము

తే॥గీ॥ శివజి ము“న్పిలాజీరావు షిర్కె” కూతు
రౌ “యశూబాయి”ని తనకోడలుగను – తన
సుతను “రాజకుమారి” ని స్నుషగ, శ్రీ ‘పి
లాజికి’ని చేసికొనగ మాట్లాడు కొనిరి ॥ 1866

తే॥గీ॥ అప్పటికి “దభోలు” “సుబా”ను “హైందవీస్వ
రాజ్య” భాగమొనర్చి – శివాజి చెప్పె
‘నాదు కొమరిత కొక మగనలుసుఁ గలుగ
తక్షణమె “పిలాజి”కి “దభోల్” దక్కుననుచు’ ॥ 1867

తే॥గీ॥ “శివజి” “నప్త” పుట్టక ముందె చేరె దివము
మనుమడైదేండ్ల వాడయ్యె – మాట నిల్పు
కొనెడి బాధ్యత శంభాజి కుండె గాని
‘వతను’ పద్ధతి శంభు కొప్పనము గాదు ॥ 1868

(నప్త=మనుమడు, ఒప్పనము=అంగీకారము)

శ్రీ శివాజి యల్లుడు గణోజీరావు షిర్కె తన బావ మరిది యైన ఛత్రపతి శంభాజీని తన సుబా దబోలు ను తనకీయమని యడుగుట

తే॥గీ॥ శ్రీ శివజి యల్లుడును - శంభుజీకి బావ
శంభు భార్య కన్న యగుట - శ్యాలకుండు
ఆ 'గణోజి' షిర్కె తా నడుగు చుండె
'ఏల నా 'వతను దభోలు' నీయ' వనుచు ॥ 1869

ఛత్రపతి శంభాజి 'వతందారీ'కి వ్యతిరేకి యగుట

తే॥గీ॥ 'వతనుదార్లు', 'జమీందార్లు' స్వార్ధపరులు
దండిగా పన్నులని సొమ్ము దండు కొనుచు
పేద కాపుల రక్తమ్ము పీల్చి - ధనము
భోగములకు వెచ్చించు 'నృభోగు'లైరి ॥ 1870

చ॥ "వతనులు జాగిరుల్లొసగు పద్ధతి లేదిట హైందవస్వతం
త్రతకయి నిల్పబడ్డ తమ రాజ్యము నందున - భూమి దున్ను కా
ర్ష తతిదె భూమి - వారిదు విరాడము చెల్లును దేశ రక్షకున్
క్షితిపయి పెత్తనమ్మెపుడు సేదువ కాంద్రదె - సైనికాళిదే" ॥ 1871

చ॥ అని కఠినమ్ముగా పలుక యక్కయు, భార్యయు మిన్నకుండ్రి - శం
భునకు - 'గణోజి' పక్షమును పూని వచింపగ నోడి - "తండ్రి మా
టను" నిలబెట్టకుండ టక టం కొనరించుట "శంభుజీదె త
ప్పనుచు 'గణోజి' క్రుద్ధుడయి - పాములెన్ పగబట్టె బావపై॥ 1872

(నృభోగులు=మనుష్యరూప సర్పములు)
(విరాడము=పన్ను)
(టకటంకు=మోసము)

‘కవికలశు’ ‘షిర్కే’ల మధ్య వివాదము - ‘కలశు’పై గణోజి దాడి చేయబూనుట - ‘శంభాజీ’ కవికలశుని పక్షమును వహించి ‘విశాల గడము’నకు వెడలుట

తే॥గీ॥ ‘కలశు’ నంపె శంభాజి మల్కాపురమున
కచట ‘షిర్కె’ - ‘దేశాయి’ల యంతరమున
యేవొ తగవులొదవ సవరించుటకును
నట ‘కలశుపై’ షిర్కె పోట్లాట కదరె ॥ 1873

తే॥గీ॥ అంత ‘కలశు’ రాయగడము కరుగ వలసి
గూడ నచట ‘షిర్కే’ను తప్పుకొన “విశాల
గడము” నంజేర, నతని వెన్నాడి చనియె
నా ‘గణోజి’ - యని విని ‘శంభాజి’ వచ్చె ॥ 1874

‘షిర్కె’ - ‘మొగలులు’ కలిసి చేసిన మోసపూరిత పన్నాగము

ఆ॥వె॥ రాయగడము నుండి రప్పింప వెలికిని
మోసపూరితముగ మొగలు దణులు
నా ‘గణోజి కలిసి యాడిన’ నాటక
మిదని కనని శంభు ‘నెరను’ మ్రింగె ॥ 1875

రాయగడమును వీడుట ప్రమాదమని శంభాజీని భార్యయశూబాయి ఆప ప్రయత్నించుట - అదియె ‘యశూబాయి’కి భర్త కడ చూపు నగుట

చ॥ కలశునిఁగావగా వెడలు కాంతుని కన్గొని - “బాధ్న” యన్ని వై
పుల కడు గట్టి కాపుదల పొందిక చేసెను మిమ్ము పట్టగాఁ
దలమొకొ ! యీ యపాయమును తప్పుకొనన్నిపుడంత చుల్కగా
నిలచి తలంచుడొక్క పరినేని యటంచు యశూ వచింపగన్॥ 1876

(తలము=సాధ్యము)

మ॥ “నిజమే! నీవని నట్టి మాట – యిపుడేనే ‘బాద్ష’ లక్ష్యమ్ము, కా
ని – జనానీకము నన్ను నమ్ముకొని యుండెనోక్కోట బైలన్బటుల్
ఖజరంగమ్మున ప్రాణముల్పణముగా కచ్చించుచున్నారరిన్
నిజమిత్రావనముం బొనర్ప నిపుడే నేగన్వలెన్ ప్రేయసీ ॥ 1877

తే॥గీ॥ బయలునందున నే నెప్డు బసను చేయ
నెప్పుడైనను కోటలన్నిలుచువాడ
గట్టి రక్షణ లేనిదే కాలు కదప
నొట్టు” నని శంభు తన సతినూఱడించె ॥ 1878

తే॥గీ॥ అన్న పోబోవ “రాజరామ” నుసరింపఁ
దలప – వలదని వారించి పలికె శంభు
“రాయగడమున కీవిప్డు రక్షకుడవు
నాకు మారుగ నీవిట నాయకుడవు” ॥ 1879

తే॥గీ॥ ‘రాయగడు’న ‘యశూబాయి” – రాజరాము
దారలిర్వురు – ‘తార’ ‘హంబీర రావు’
తనయ – జానకి “వీరప్రతాప రావు
గుజరు” సుత – ‘సాహు’ శంభుజి కొడుకు గలరు॥ 1880

తే॥గీ॥ అదియె పతి కడచూపని ‘యశుజి’గాని
‘యన్న’యిక కనపడదని యనుజు డేని
ప్రభువు చివరి దర్శనమని రాయగడము
ప్రజలుగాని, లేశ మెదఁదలంప లేదు ॥ 1881

(ఖజరంగము=యుద్ధరంగము; కచ్చించు=ఎదిరించు; మిత్రావనము=
మిత్ర రక్షణము)

ముకర్రబుఖాను (షేక్‌నిజాము) శంభూజీ కదలికలపై గట్టి కాపుదల యుంచుట

తే॥గీ॥ అప్పటికె "షేక్నిజాము" కొల్హాపురమ్ము
చేరి, 'రాయగడ్' 'పన్హాలా' సీమలందు
నటులె 'రాయగడ్' 'తోరణా' యంతరమున
గట్టి కాపును నుంచె వేగరులఁబంచి॥ 1882

తే॥గీ॥ 'చెంజి', 'వెల్లూరు' సీమల చేరునేమొ
'శంభు'డని – పూర్వ దక్షిణాశా ప్రదేశ
ములను గల మార్గములనన్ని – మూసివేయ
సేనలకు కట్టడిని చేసె – షేక్నిజాము॥ 1883

'శంభాజీ' కొద్ది సేనతో 'విశాల' దుర్గమును చేరుట

చ॥ కతిపయ సైన్యము న్గొనుచు గ్రచ్ఛఙ శంభు 'విశాలదుర్గ' చే
రె – తెరువునందు సంకటము లేమియు లేక – 'కలశ్‌బుధుండు' తా
నతి ముదితాత్ముడయ్యె తనకై యతి సాహసమొప్ప శంభుడి
ట్టి తరుణమందు వచ్చెనని, ఢీకొన శత్రువు వేచి యుండగన్॥ 1884

సీ॥ అపుడు 'కవికలశు' డనియె తానా 'సంగ
మేశ్వర మందు వేంచేసియున్న
తల్లి 'మహాకాళి' దయఁజూప మనపైన
పూజ లెన్నియొ చేయ బూనితనగ
స్వయముగా 'జగదంబ' భక్తుడౌ శంభాజి
'వల్లె' యనె కవి యభ్యర్థనకును
"నదితి" దేవత లోని యాదిమశక్తియు
పూజలతోడ యుద్బుద్ధ మగును ॥

ఆ॥వె॥ నట్టి శక్తి మనకు ననుకున్న కోర్కెలు
సఫలమునొనరించు క్షణములోన"
యనుచు 'చెప్పె' తాంత్రికాగ్రణి – శాక్తేయ
మౌళియైన 'కలశు' మంత్ర వేత్త ॥ 1885

(పూర్వదక్షిణాశ=ఆగ్నేయదిశ)

ఛత్రపతి శంభాజీ తనకు యెదురగుచున్న యిబ్బందుల నన్నింటిని తలచుకొని జగదంబ కరుణను కోరి ప్రార్థన చేయుట

ఆ॥వె॥ "దేవరూఖు" నందు దేవత 'సోల్జాయి'
భక్త సులభ యైన పరమ శక్తి
యట్టి తల్లి కరుణ యణువంత కల్గిన
మన తనకలులన్ని మాసిపోవు॥ 1886

సీ॥ ఔరంగజేబు తా 'నాదిల్ష' కుతుబుషా
కోశముల్తెఱపించి కొనిన ధనము
విచ్చలవిడిగను వెదజల్లి మారాట
వీరులఁ దనకొల్వుఁజేరఁజేసె
యాంగిలేయులును, పరంగీలు, సిద్దీలు
కప్పము 'ల్బాద్షా'కె కట్టు చుండ్రి
"వతను దార్లును" స్వేచ్ఛ వచ్చుట చే వారు
హలికులఁబీడించి యధిక ధనము ॥

తే॥గీ॥ గొనుచు, నందుకొంత ధనమప్పనము లిడుచు
రాజ కోశమునకు తక్కు'రై'ని తమ వి
లాస జీవితములకు దుర్వ్యయము చేసి
పేద సాదల రక్తమ్ము పీల్చు చుండ్రి ॥ 1887

తే॥గీ॥ కొంకణము నుండి తమకొక గ్రుడ్డి గవ్వ
యైన సుంకము వచ్చుట యరుదుయయ్యె
నచటి 'వతనుదార్లు' మొగలు నాధిపత్య
మే తలను దాల్చి కప్పము లిచ్చు చుండ్రి ॥ 1888

తే॥గీ॥ ఎచట చూచిన ధనలోపమెదురు పడియె
చేయ వలసిన మొన లసంఖ్యేయములగు

(తనకలి=కష్టము)
(రై=ధనము) మొన = యుద్ధము

వేల కొలది పదాతులాశ్వికులు వలయు
కొనవలసిన యాయుధరాశి కొండ యంత" ॥ 1889

ఛత్రపతి శంభాజి సర్వ సేనాపతి మల్హోజి ఘోర్పడేను ఇతర మంత్రులను సంగమేశ్వరమునకు రమ్మనుట

తే॥గీ॥ అని తలంచుచు పన్హాలా కనిచె వార్త
కోట యధిపతి 'మల్హోజీ ఘోర్పడే" ను
నతని కొమరుడు "సంతాజి" ఘోర్పడేను
సంగమేశ్వరమునుఁజేర సైన్యము గొని ॥ 1890

ఆ॥వె॥ రాయగడము నుండి రమ్మని పిలిపించె
'నీల కంఠ పీష్వ' నీతి వేత్త
ప్రాడ్వివాకుడైన "ప్రహ్లాద నీరజిన్"
కరముల కధికారి "ఖండొబా"ను ॥ 1891

ఆ॥వె॥ సంగమేశ్వరమున చర్చింప దలచెను
భావి రాజ్య కార్య పద్దతులను
నన్నిటికిని ముందు నర్థలోపము తీరు
వ్యూహములను గూర్చి యూహసేయ ॥ 1892

ముకర్రబుఖాను (షేక్‌నిజాము) వ్యూహము

చ॥ కనిరి మరాట వేగులు మొగల్శిబిరమ్ములు - 'కొల్హాపూరుకున్'
'పనహల' కోట మధ్య - పరిపాటిగ యింతకు ముందు గూడ మ
ల్క నుతిక యీ ప్రదేశమున కష్టపుదు న్విడియంగ వచ్చుటన్
కనిన మరాట వేగులకు కారణమేదెను శంక నొందగన్॥ 1893

(మొనలు=యుద్ధములు)

(నీతివేత్త=నయ విశారదుడు; ప్రాడ్వివాకుడు=న్యాయమూర్తి; కరములు=శుల్కములు)

(మల్క=తుఱకు; నుతిక=సైన్యము; ఏదు=లేకుండు)

ఆ॥వె॥ సంగమేశ్వరమ్ము చక్కటి వైపుకు
'పన్హల' గడునుండి వచ్చు చుండె
బలము లవి మరాట వై యుండ వచ్చుని
సోద "షేక్నిజాము" శ్రుతులకందె ॥ 1894

చ॥ సరగున జాగరూకుడయి సైన్యము నాయితముంబొనర్చి – భీ
కరగహనావనీధ్ర కటకాంతర కంటక పూర్ణ సీమల
న్జొరబడు శిక్షణమ్ముగల శూరులు రౌతులు రెంచ వేవుర
త్తతి తన వెంటరా గదలె తద్ద 'ముకర్రబుఖాను' గుట్టుగన్॥ 1895

ఛత్రపతి శంభాజి పోబడి గూర్చి ముకర్రబుఖానుకు గల యెఱుక

తే॥గీ॥ పటము లందు వ్రాయబడె ప్రస్ఫుటము గాను
ఆ ప్రదేశపు గిరులు – లోయలును, ఝురులు
నదులు – పల్లెలు – పట్నము లది యిది యని
గాక సర్వ వృత్తాంతము కానఁబడగ ॥ 1896

తే॥గీ॥ సావధానుడై పటముల నరసి యరసి
యాకళించెను నా నేల యాను పాను
లవల మిగిలి యున్న దొక కార్యాచరణమె
చిన్న పొరఁబాటయిన 'యెర' చిక్కదింక ॥ 1897

ఛత్రపతి శంభాజీ కవి కలశునితో కలిసి సంగమేశ్వరమునకు వచ్చుట

తే॥గీ॥ శంభు కవికలశులు నా 'విశాల గడము'
వీడి – సంగమేశ్వర పూత పృథివి మెట్టి
యచట గిర్యాటవీ సరిదాభగనుచు
నతులిత ప్రశాంత్యానందితాత్ములైరి ॥ 1898

(చక్కటి=ప్రదేశము; బలము=సైన్యము; సోద=వార్త; శ్రుతి=చెవి)
(గహనము=అడవి; కటకము=లోయ; రెంచవేవురు=రెండు వేల మంది)
(ఆభ=శోభ)

‘శంభాజీ’ విజయమునకు ‘కవి కలశుడు’ ‘కాళికామాత’ పూజ చేయుట

ఉ॥ ముందుగ సంగమేశ్వర ప్రపూత మహిన్తనకంతికమ్ముగా
మందిర మొందు నిల్పుకొనె - మాతను “కాళిని” గొల్వ ముందుముం
దందె వసించి నిచ్చ జగదంబకు నర్చ యొనర్చు కోర్కెతో
దందటి వేచె యా కలశు-డాతని లక్ష్యము “శంభు” సేమమే॥ 1899

ఆ॥వె॥ ఇప్పుడటులె ‘కలశు’దేగెను తనయింటి
కచట శాక్త్యతంత్ర మనుసరించి
‘కాళికాంబ’ మనసు కరగింప పూజతో
జనని దయనుఁ ‘శంభు’ జయినిఁజేయ॥ 1900

శంభాజీ కవికలశుల గాఢ మైత్రి

చ॥ ‘మధుర’ భువీసురావసథ మందున చూచెను “శంభు బాలునిన్”
ప్రథమ నిరీక్షణమ్ముననె పాదుకొనె న్నవగాఢ మైత్రి - యా
విధియె యిటుల్లలిపె - విద్వరుడౌ కలశాఖ్య కాన్యకు
బ్జ ధరణి దేవ, శంభులను-ప్రాయమునంగడు భేదముండియున్॥ 1901

ఆ॥వె॥ పాతికేండ్ల కలశ పండితునకు - దశ
వత్సరముల శంభు బాలునకును
భిదుర ఘాతయైన విడదీయ లేనట్లు
నతుకు కొనియె వారి యంతరములు ॥ 1902

ఆ॥వె॥ సంస్కృతోక్త్యధీతి - శాక్తేయ, తాంత్రిక
కర్మ కాండలందు ఘన మనీషి
కలశుడనిన శంభు కత్యంత విశ్వాస
మట్లె కవికి శంభుడనిన ప్రీతి ॥ 1903

(జయి=జేత) అంతికము=నివాస స్థానము

కవికలశుడు కాళికాంబను పూజించుటకు వెడలుట - శంభాజీ దేవరూఖు లో "సోల్జాయి" మాతను కొల్వఁ బోవుట

ఆ॥వె॥ 'కలశు' డట్టులేగ కాళికాంబనుఁగొల్వ
తీవ్ర భక్తితోడ – "దేవరూఖు"
కరిగె 'శంభుజి' జగదంబను 'సోల్జాయి'
కొలిచి వరము వేడ గెలుపునకును॥ 1904

కం॥ కేవలము నాల్గు వందల
రావుతులట నుండ్రి "శంభు' రక్షణకయి – సే
నావాహుడు "మల్హోజీ"
తా వాహినితోడఁజేరి దాపున నుండెన్ ॥ 1905

ఆ॥వె॥ సైన్య నాధు సుతుడు "శాంతాజి ఘోర్పడే"
వచ్చి యుండె జనకు పజ్జఁజేరి
"నీలకంఠ పీష్వ" – "నీరజీ ప్రహ్లాదు"
విప్రగేహములకు విందులైరి ॥ 1906

ఆ॥వె॥ దేవరూఖునందు దేవియౌ 'సోల్జాయి'
మాత కర్చఁజేసి మరలి వచ్చి
తెరలెనంత 'శంభు' 'దేశాయ్' హవేలీకి
కాళికార్చ యందు 'కలశు'డుండె ॥ 1907

'ముకర్రబుఖాను' సంగమేశ్వరమును చుట్టుముట్టుట

సీ॥ 'పన్హాలా' గడునుండి పడమటి కనుమలు
క్రమముగా డిగ్గ కొంకణము లోకి
'పన్హాలాగడు' నుండి పయనమై కతిపయ
సైన్యము కొంకణు చాయ కదలు

(రావుతులు=అశ్వికులు, సేనావాహుడు=సేనాధిపతి)
(విందు=అతిథి) (తెరలు=వెడలు; హవేలి=బవంతి)

చున్నట్లు వేగులు సూచించి రటు వైపు
సంగమేశ్వర పుణ్య జగతి కలదు
సంగమేశ్వరమున సైన్యము కొలదిగా
కనపడెనని "కోటికాంద్రు నవగ॥

ఆ॥వె॥ సంగమేశ్వరమున శంభుయున్కిని గూర్చి
గట్టి యఱ పొడమె "ముకర్రబు"నకు
సంగమేశ్వర దిశ సర్వగిర్యారణ్య
పథములన్ని నెమకఁ బనిచె భటుల ॥ 1908

ఆ॥వె॥ "కొల్హాపూరు" నుండి కొంకణమ్మున కేగు
మార్గ మద్ర్యరణ్య మయమునగుట
"చాటుపోరు" నందు సాటిలేని మరాట
యోధులచట దాగి యుందు రనుచు ॥ 1909

ఆ॥వె॥ అనుమ తోడ ముందు ననుచరులను పంపి
యొక్క యంగుళమును తక్కకుండ
దేవులాడఁబంపె - తెరువులన్నియు గూడ
నిరవరోధములని యెఱుక యయ్యె ॥ 1910

పడమటి కనుమలలోని భయంకరారణ్య మార్గములు

సీ॥ "పన్హాలా" "రాయగడ్" ప్రాంత భూముల నుండి
కొంకణునకు చను ఖుల్లమమ్మ
గహన కాననముల - గగన చుంబి గిరుల
నిఱుకైన దగుచును చొరుట గడ్డు
నశ్వములచ్చట నడుగేయ కష్టమౌ
సాదులు తలలెత్తి సాగ లేరు

(అద్రి+అరణ్యము=కొండలు, అడవులు)
(కోటికాంద్రు=వేగులు; అఱ=సందియము)
(అనుమ=శంక)

చెట్టు కొమ్మలు తాకి శిరములు తెగిపడు
కాన దేహమణచి కదల వలయు ॥

తే॥గీ॥ వాడి ముండ్లచే నొడలెల్ల వ్రణములగును
వృక్షశాఖల వ్రేలుచు విషఫణి తతి
కఱచి చంపు – గుల్మములను, కాలరులను
జాంగలము దాటుటే పునర్జన్మ మట్లు ॥ 1911

తే॥గీ॥ అచట నలవాటుగా తిరుగాడు వారి
కే – యచటనున్న దారులు యెఱుక పడును
వంద కనుమ మార్గములున్న ప్రాంత మద్ది
క్రూర మృగముల బెడదయు గుర్వునచట ॥ 1912

చ॥ తన భటులెంత గొప్ప రణతంత్ర విచక్షణులయ్యు నిచ్చటన్
వనముల, కొండలంజనుట వారికి బొత్తుగ క్రొత్త యౌటచే
ననుభవశాలు రెవ్వరయిన న్పథదర్శకులున్న మేలటం
చును–"ముకరబ్ద" ణాయుడు–"గణోజి" సహాయము కోరె నత్తఱిన్॥ 1913

ఉ॥ బేలుతనమ్ముతో గళిత వీర్యుని చేయుచు 'శంభుజీ'ని – మే
చ్ఛాళి యదాటున న్నదిమి–సంకెలల న్బిగియింప నెంచగా
శ్యాలకుడయ్యు శంభునకు, నాయితుడయ్యె 'గణోజి షిర్కె'యున్।
బాలిశుడై "ముకర్రబు"కు బాసటగాగ దలంచి – దుర్విధిన్॥ 1914

(ఖుల్లమము=బాట, సాది=అశ్వకుడు; కాలరి=పదాతి; ఉరవు=అధికము; జాంగలము=అడవి) గుర్వు=అధికము

(బేలుతనము=మోసము; బాలిశుడు=మూర్ఖుడు)

తనకు బావ, బావమరది యైన 'ఛత్రపతి శంభాజి'పై 'గణోజిషిర్కె'కు గల వైమనస్య మునకు కారణము

తే॥గీ॥ తమకు ముని బీజపూరు సుల్తానొసంగి
నట్టి వతను 'దభోలు' ను నాది యందు
శ్రీ శివాజీయె తొలగింపఁజేసె - 'హైంద
వీ స్వతంత్ర రాజ్య పరమౌ పృథివి' యనుచు ॥ 1915

తే॥గీ॥ ఇట్లు 'వతను దారి' నియమమే తొలంచె
శ్రీ శివాజి - శంభాజియు స్వీయ పితరు
తెన్నుననె బోయె - 'షిర్కె' తా నెన్ని మార్లు
నడిగినను వతనును తమ కిడక నుసిగె ॥ 1916

ఉ॥ ఆ వగ డెందమందు దగయై, సెగయై, పగయౌచు నింకపై
'బావమఱంది, బావయను బాంధవమెంచక శంభుజీ యహం
భావమణంపగాఁదివిరె బాలిశుడౌచు 'గణోజిషిర్కె' - తా
నీవిధి ద్రోహియయ్యె-భగినీముఖ కుంకుమదీప్తి నార్పగన్ ॥ 1917

చ॥ అనుచరులందు దట్టులను నంపె 'ముకర్రబుకున్' తగు తోడుసూప-వా
రనుభవశాలురా యడవులందున మార్గముచూపి - సంగమ
మ్మునకు ప్రవేశమున్సుగమ మున్నొనరించిరి షిర్కె బంట్లు - యిం
కనటనిరోధమేదగ - "ముకర్రబు" వచ్చి పడెన్ససైన్యుడై ॥ 1918

ఆ॥వె॥ అన్యు లెఱుగనట్టి 'యంబెఘాటు' కనుమ
మార్గమొక్క 'షిర్కె' మనుజు లెఱుగు
దురు - "ముకర్రబు" పరి దూరి వచ్చెను దాన
బంధు ఘాతి "షిర్కె" వలన నాడు ॥ 1919

చ॥ "మొగలులకీ మహాటవుల పుంతలు క్రొత్తలు నౌట రారు యీ
జగతికటంచు - కేవలము సైన్యము నాలుగు వందలుండ - యే
వెగడును లేక యున్నతఱి - విచ్చు కృపాణములున్ - తుపాకులున్
పగటుచు నా "ముకర్రబు"ని వాహిని తాకె మరాట సైన్యమున్॥ 1920

(నుసుగు=తిరస్కరించు) (వగ=బాధ)
(వెగడు=భయము; పగటు=ప్రదర్శించు) పరి=సేన

ఛత్రపతి శంభాజీకి ముకర్రబుఖాను ఆకస్మిక దాడిని గూర్చి చారులు యెఱింగించుట - శంభాజీ విస్మితుడగుట

సేనాధిపతి మల్హోజి ఘోర్పడే శంభాజీని తక్షణమే అ ప్రదేశము వీడి పొమ్మని చెప్పుట

ఆ॥వె॥ "దేవరూఖు" నుండి దేవత "సోల్జాయి
మాత" పూజఁజేసి మరలి వచ్చు
శంభు నాపిరచట సైనికుల్కొందరు
తాము మొగలులఁగని నామటంచు॥ 1921

ఆ॥వె॥ ఇంత దూరమెట్లు నేతెంత్రు మొగలులు
ననుచు శంభురాజు దణిని డాసె
"మనకపాయమిదని" 'మల్హోజిఘోర్పడే'
"వీడుమిచటు శంభు! వేగిరమనె॥ 1922

ఆ॥వె॥ "నీలకంఠు పీష్వ", "నీరజీ ప్రహ్లాద"
"ఖండొబా" లిచటికి కదలిరాగ
యందరు నిటనుండి యాగ మేఘాలపై
వెడలవలయు రాయగడమునకును ॥ 1923

ఆ॥వె॥ "పన్హాలా" పథమున ప్రణిధులుఁజూచిరి
"మోగలులను, నింక జాగువలదు
నిఱుకు దారి కలదు - నిన్నూఱు భటులతో
దానఁజనిన, "రాయరీ"నిఁజేరు ॥ 1924

తే॥గీ॥ ఆజికై నాకొమరుడు "సంతాజిఘోర్ప
డే" నిలచి నాకుతోడ్పడు నేను నిలువ
రింతు మొగలు దండును - మీరలేగ వలయు
క్షణము నాలసింపక రాయగడముఁజేర ॥ 1925

తే॥గీ॥ అనుచు మల్హోజిఘోర్పడే యరుల నెదుర
చనియె - శంభు యడిగె "కలశకవి" యేడి?
యనుచు - "కాళికామాత సమర్చ సేయ
నరిగె"నని చెప్ప - "శంభాజి" యాగిపోయె ॥ 1926

తే॥గీ॥ "మీర లేగుచుండుడు - నేను బోరన జని
'కలశు'తోగూడ మిమ్ముల కలిసి కొందు
ననుచు - మఱుమాట వినకుండ చనియె శంభు
యాన సన్నద్ధులై భటులరుగు చుండ్రి ॥ 1927

మరాటా సర్వసైన్యాధిపతి "మల్హోజి ఘోర్పడే" వీర స్వర్గమలంకరించుట

చ॥ అళుకు యెఱుంగనట్టి సుభటాగ్రణి "మల్హాజి ఘోర్పడే" - యచం
చలమగు వాడిసూపి రిపు సంహతులన్తెగ టార్చు చుండియు
న్నిలిగి, శుటీర నాకమునకేగెను - మ్రందె మరాట సేనయున్
గెలిచిరి మోగలుల్ కువిధి కృత్యములన్నెఱుగంగ శక్యమే! ॥ 1928

ఛత్రపతి శంభాజీ మొగలులు కొంకణములో ప్రవేశించినచో వారి యునికిని గూర్చి తన బావమరిది షిర్కే తనను హెచ్చరించునని విశ్వసించి యుండుట

తే॥గీ॥ షిర్కె పాలనలో నున్న సీమలకును
మొగలు సైన్యము వచ్చిన ముందె తనకు
తనదు "బావ మఱది" "షిర్కె", తనకు వార్త
లంద చేయుననుచు శంభు డలసుడయ్యె ॥ 1929

(అళుకు=భయము; సుభటుడు=వీరుడు; ఇలిగి=మరణించి; శుటీర నాకము=వీరస్వర్గము)

(అలసుడు=ప్రమత్తుడు)

కవి కలశునిపై మొగలులు దాడి చేయుట

చ॥ కలశుడు కాళికాప్రతిమకర్చన సేయుచు ధ్యానమగ్నుడై
తలపక బాహ్యలోకమును స్థాణువునై యట కూర్చొనుండగన్
పిలుచుచు గోపకుండొకడు "పెద్దయగారు"! పురమ్ము లోపలన్
కలకలమేదొ రేగెననఁ గన్నులు విప్పె "కలశ్"ద్విజుండటన్ ॥ 1930

తే॥గీ॥ పూజ యసమగ్రమై యాగి పోవ - దుశ్శ
కునమిదియని కలశకవి - మనమునందు
కలతపడుచును జూడగ కలను జరుగు
చుండె - ఖడ్గ హస్తుడగుచు యుతికె నతడు ॥ 1931

మ॥ ద్విజుడయ్యున్ఖజరంగ మందు నెపుడు న్వెన్దీయుటే లేక - య
క్కజమౌ శౌర్యము జూపి గెల్పుకొను దీక్షైకాగ్రత న్నిల్పి - యో
ర్చు జమున్నైనను నళ్కెఱుంగక నెదుర్కొంచున్ననిన్, 'న్యక్షు'తో
డ జతౌనన్న యశమ్ముగొన్న కలశుండా శంభుకున్ ప్రాణమౌ॥ 1932

ఆ॥వె॥ ఒకరి నొకరు విడిచి యుండ లేరొకలిప్త
భాషణమ్ము దైవ భాష యందె
కలశు మాట యనిన తొలి మిన్కులగు శంభు
కరయమైలు రెండు - నసువు లొకటె ॥ 1933

ఆ॥వె॥ విచ్చుకత్తి తోడ వెలువడి కోవెల
కలశు వచ్చు సరికి - కలను ముగిసె
యింతలోన నొక్క యిషువు తాకి కలశు
బాహువునట - గాయపఱచె లెస్స ॥ 1934

(గోపకుడు=పసులకాపరి) (కలను=యుద్ధము)

(ద్విజుడు=బ్రాహ్మణుడు; ఖజ=యుద్ధము; జముడు=యముడు; న్యక్షుడు= పరశురాముడు)

(దైవభాష=సంస్కృతము; తొలిమిన్కు=వేదము; మై=శరీరము; అసువు=ప్రాణము) (కలను=యుద్ధము; ఇషువు=బాణము)

తే॥గీ॥ 'కలశు' 'మహరాజ' యనుకేక వెలువరించి
పడియె నేలపై 'బుజ' గాయ పడుట వలన
యప్పటికి మరాటాసేన లరుల చేత
చిక్కి, శస్త్ర విరహితమై చేతులెత్తె ॥ 1935

తే॥గీ॥ 'శంభు' 'దేశాయి' యింటికి చనియె ముందు
పడక గది చేరు సరికి విన్పడెను 'కలశు'
పిలుపు 'మహరాజ' యనుచు - పర్వెత్తె వెలికి
నప్పటికె మొగలుల వశమయ్యె పురము ॥ 1936

ఛత్రపతి శంభాజీని మొగలులు బంధించుట

తే॥గీ॥ మొగలు సైనికుల్శంభాజి పోబడికయి
వీట నిల్లిల్లుఁ దిరుగుచు వెదకు చుండి
"శంభుజీ యెక్కడనుచును సర్వజనుల
జుట్టు పట్టీడ్చి మొగములఁజూచుచుండ్రి ॥ 1937

తే॥గీ॥ అంత నపుడె దేశాయి బవంతి నుండి
వెలికి పరువెత్తి వచ్చుభూస్పృక్కును గని
యతడు 'శంభురాజే'నను ననుమతోడ
వైళమఁభటుల వ్వానిని పట్టుకొనిరి ॥ 1938

ఉ॥ కప్పరపాటుఁ దోపగ 'ముకర్రబు' సైన్యము 'శంభు రాజు'నున్
ముప్పిరియౌ కుతూహలము పొంగులు వారగ చుట్టుముట్టుచున్
తప్పకఁజూచి పోల్చి తమ దగ్గర యున్న పటమ్ము బొమ్మతో
తప్పిద మేమిలేదిక, యితండె యతండని నిశ్చయించుచున్ ॥ 1939

తే॥గీ॥ "అతడె యీతడు - జంపు నారడుగులున్న
మనిషి - కనులవే - యదెగడ్డ మదియె ముక్కు
మొగము - తీరును - వీడచ్చు బొమ్మలోని
మనిషి పోలిక నుండె - 'శంభాజి' యితడె ॥ 1940

(బుజ=భుజము) కప్పరపాటు=సంభ్రమము; పోబడి=ఆచూకీ
(భూస్పృక్కు=మనుష్యుడు)

తే॥గీ॥ అదియెగాక యొకడెవండొ యఱచి నాడు
నో మహారాజ! యనుచు - నా యులివు వినుచు
వీడు పరువెత్తి వచ్చె హవేలి నుండి
కాన శంభుడే యగు వీడు కచ్చితముగ" ॥ 1941

తే॥గీ॥ అనుచు 'కలశుని' 'శంభుని' యంగములను
గట్టి యినుప గొలుసులతో కట్టి వైచి
నోట గుడ్డలు కుక్కుచు మాట నడచి
గుఱ్ఱములపై 'యకులుజు'కు గొంచుపోవ ॥ 1942

ఉ॥ పల్లెల, పట్టణమ్ములను పౌరుల కందమి నెట్టి వార్తలు
న్నెల్లపుడున్ మరాటులకు నెందరి తోడనొ యెక్కడైననున్
పెల్లిదమౌ రణమ్ములగు పెల్లలవాటయి సంగమేశమం
దల్లరి యెందుకో తెలియదయ్యెను వారికి నెంత మాత్రమున్॥ 1943

సీ॥ పాదుషా బందీలఁ బహదూరు గడమున
చూడ దలిచె గాన చోటు మార్చి
తరలించి లిద్దరి న్తక్షణమేఁ జేర్చ
బహదూరు గడముకు 'బాద్ష' కొఱకు
'నకులుజు' గడివీడి 'యాలంపనా' వచ్చె
తనమది నెనలేని తనుపు నింద
శృంఖలాబద్ధులై చిఱుగు పేలికలతో
రక్తమ్ము లొలుకు పరాజితులను ॥

తే॥గీ॥ "నక్లుజు" గడము నుండి వారరుగు దెంచు
నపుడు - "బహదూరు" గడము కల్లంత దవ్వు
నందు నిల్పి గుడారుల యందు - వారి
కేసిరి "ఇరాన్ ప్రహాసుల" వేసములను ॥ 1944

("అక్లుజ్"=అనుపేరుగల యూరిలోని కోటకు అని అర్థము)

(పెల్లిదము=అధికము; పెల్లు=విధానము)

(గుడారు=గుడారము; ఇరాన్=పారశీక దేశము; ప్రహాసులు=విదూషకులు)

సీ॥ శంభాజి కదనపు సమధిక 'శిక్ష'గా
మెడవెన్క దృఢమైన నిడుపు కఱ్ఱ
పెట్టి, చేతులను జాపించి ఱెక్కలవోలె
వెనుక దుడ్డుకు వానిఁవిఱచి కట్టి
కలశుకు, శంభుకు తలలపైన త్రిభు
జాకార దారు కోహళుల నునిచి
దాసేరములపైన తలక్రిందులుగ వ్రేల
గట్టి త్రిప్పగ వాడ కట్టులందు ॥

తే॥గీ॥ ఊలు విసరుచు తుఱకలు రచ్చసేయ
హైందవప్రజ యెదలందు నగ్గి రగుల
రెండు క్రోసుల దూర మీఱెండ యందు
త్రిమ్మరగఁజేసి గడినిఁ జొత్తెంచిరవల ॥ 1945

ఉ॥ ఊలను రువ్వినన్ తుఱక ఊగలు, తిట్టిన, పేడ ముద్దలన్
హేలను వేసినన్ మయము లేగుచునుండ మెలేసి తోకలన్
భోలులు నొప్పితో తిబిరి పోవగ వాని దువాళిఁదోలినన్
దోలల నూపి నట్లగుచు తూలియు నూల్కొని యుండ్రి బంధితుల్॥ 1946

తే॥గీ॥ ఆలకును వేయు మెడగంట లఱుతవేసి
పటహ, డిండిమ, కాహళ రటన మొలయ
నూయుచును మీద యుచ్చలు పోయుచునట
యవనులు యొనరింపని యకృత్యములు లేవు ॥ 1947

(సమధిక=అత్యధికమైన; దుడ్డు=కఱ్ఱ; దారుకోహళి=కొయ్యటోపి; దాసేరము = ఒంటె; వాడకట్టు=వీథి)

(ఊగలు=ధూర్తులు; హేల=ద్వేషము; మయము=ఒంటె; భోలి=ఒంటె; తిబిరిపోవు=అడ్డదిడ్డముగా పోవు; దువాళితోలు=పరువెత్తించు; నూల్కొను=స్థిరముగా నుండు; దోల=ఊయల)

(కాజీలు=న్యాయమూర్తులు; అఱు=లేకపోవుట)

ఔరంగజేబు న్యాయ నిర్ణయ సభను చేయుట

మ॥ సభ దీర్చెన్నట విశ్వజేతవలె 'బాద్షా' - వెంట "కాజీలు"నున్
సభలో న్యాయ విచారణమ్మనెడి హాస్యాస్పద క్రీడలో
సభికాళిన్ మురిపింప, చేరగ - ప్రవేశమ్మైరి బందీలు - భూ
విభుడు న్లేచెను - వింజమాకిడినచొప్పేపార శబ్దమ్మటెన్॥ 1948

తే॥గీ॥ గద్దెదిగి 'బాద్ష' సభలోన కాలునూది
తాను నమ్మెడు దైవమున్దలచు కొనుచు
మోకరిల్లె కృతజ్ఞతా పూర్వకముగ
విజయ గర్వము వినయమ్ము పెనగొనంగ ॥ 1949

ఉ॥ "తాము సభా ప్రవేశమగు తత్క్షణమే యవురంగజేబు తా
భూమికి డిగ్గి మోకరిలెపో" యనుచు'న్కలశుండు' శంభుతో
"స్వామి! భవత్సభాగతికి స్వాగత మంచును మోకరిల్లె" బా
ద్షా మన ముందె గద్దెదిగి - శంభునికిన్ తలవంచు విశ్వమే"॥ 1950

ఆ॥వె॥ అనుచు హింది భాష యందొక పద్యమ్ము
అల్లె నాశువుగ సభాంగణమున
కలశు - డదివిని యెద నలరె శంభు- స్వయము
కవియు, పండితుడును నవుట వలన ॥ 1951

కం॥ ఆ పద్యము విని పాదుష
కోపించుచు బంధితులను గుయ్యారమునన్
త్రోపగ పంచెను భటులను
పాపాత్ముడు మంచి చెడులు పాటించునొకో॥ 1952

శత్రులచేత చిక్కినందులకు 'శంభాజీ' పశ్చాత్తాపము

చ॥ అరులకు చిక్కి నప్పుడె యథార్థము తెల్లమునయ్యె 'శంభుకున్'
సురుగగ నే యుపాయమును చొప్పడ దిప్పుడటంచు - మృత్యువా
తుఱక దొరన్తలమ్మున నెదుర్కొన లేరెవరైన గాని - రూ
పఱెగద యొక్క వ్రేటునకె 'యాదిలుషాహి'యు 'కుత్బుషాహియు'న్॥ 1953

(సురుగు=తప్పించుకొను; చొప్పడు=ఘటించు; తలము=బయలున; మృత్యువు=యముడు)

ఉ॥ కోటను వీడుటే మరిమ కోరల చిక్కిన యట్టులయ్యె - న
ట్లోటకె వేచియుండె మొగలాయి ప్రభుండును నిన్నియేండ్లు - తా
కోటులకొద్ది హొన్నులను గుప్పె మరాటుల లౌభ్య శాంతికిన్
పోటరు లెల్లరు న్ధనము పోటుకు విచ్చిరి, యాప శక్యమే?॥ 1954

చ॥ హితుడును, మార్గ దర్శకుడు - ఋగ్యజురాది చతుశ్రుతుల్ పురా
యతి వర ప్రోక్త సర్వ వివిధాగమ శాస్త్ర పురాణ వైఖరుల్
యతులిత మంత్ర తంత్రయుత యాజ్ఞిక కర్మ లెఱింగి నట్టి పం
డిత కలశుండు నన్విడువ నేరక మారికి చిక్కె నయ్యయో! ॥ 1955

ఉ॥ ఆలిని "దుర్గబాయి" నపు డమ్మాదు పూరునయున్న యప్డు - "ప
న్హాలకు" పోయి తొంటిగను, యాపెనట న్విడి - 'రాణు యక్క' న
న్మాలిమింఁజేయు మాతవలె - నాయమ యక్కడె బందియయ్యె నా
మాలిక యౌ "భవాని" - భవమందిన దాదిగ చూడ నైతినిన్॥ 1956

తే॥గీ॥ గతము గతమింక నేఁజేయ గలిగినట్టి
దేమియును లేదు - "హంబీర" మామ పోయె
దోరె 'మల్హోజి ఘోర్పడే' వీర దణియు
నాకు జగదంబయే యింక నాశ్రయమ్ము" ॥ 1957

తే॥గీ॥ అని తనను తానె యోదార్చు కొనుచునున్న
శంభు - కవికలశుడు నభిశంక లేక
యేది యేమైన కాని - తమ్మాదు కొనగ
కలరు జగదంబ, శివుడని కలత విడిరి ॥ 1958

(మరిమ=మృత్యువు; హొన్నులు=బంగారు నాణెములు, లౌభ్యము=ధన వ్యామోహము)

(మారి=మృత్యువు)

(మాలిక=కూతురు, భవమందు=జన్మించు)

(దోరె=చనిపోయెను)

ఛత్రపతి శంభాజీ కవికలశు బంధితులైన మరునాటి సూర్యోదయము

సీ॥ శంభాజి, కవికలశాగ్రహ జ్వాలలు
నిండిన శోణిత మండలమన
'యాలంపనా' యైన యౌరంగజేబుని
'గోరంట' పులిమిన కూర్చుమట్లు
బాద్షా 'జనానా'ల పైడి పల్లకి పైన
పఱచిన కెంబట్టు వస్త్రము వలె
శంభుజీఁ న్బంధించు సర్దార్లకు 'న్బాద్ష'
బహుమతిడిన పైడి పదకమనగ ॥

తే॥గీ॥ కూర్కు నాగ చౌకీ దార్లు కోర్కెదీర
నమలి, నమలి యుమిసిన విడె మనునటుల
'శంభు' చేద్పాటు, 'పాదుషా' స్మయముఁగనుచు
లజ్జితాస్యారుణుడు ప్రాగిలాద్రమెక్కె ॥ 1959

తే॥గీ॥ చీకటి కొట్టులోన గల సింహ పరాక్రముఁ శంభుఁజూడగా
వాకిలి యెద్ద నిల్వబడె పాదుష – శంభుడు లెక్కలేనియ
ట్లా కలు షాత్ముఁ ధీరుడయి యట్టులె కన్నులలోకి చూచె – ని
ర్భీకుని శంభుఁ జూచి యదరెన్నెద యా యవురంగజేబుకున్॥ 1960

ఔరంగజేబు శంభూజీతో గర్వోక్తులు పలుకుట

తే॥గీ॥ "దక్కను భువియంతయు నాకు దక్కె శంభు!
నీ మరణ మంతఁజుల్కు రానీయ నేను
నేమియను కొంటి వేనన? నేనె సకల
భరత భూమికీనాడు భూ భర్త నెఱుగు" ॥ 1961

లజ్జి = సిగ్గుతో నిండిన మొగము కలిగిన సూర్యుడు; ప్రాగిలాద్రము= తూరుపు కొండ)

ఛత్రపతి శంభాజీ పాదుషాను తీవ్రముగా ఉపాలంభించుట

తే॥గీ॥ అనిన శంభాజి నవ్వి తా ననియెనిట్లు
"నీవతి క్రూరుడ వనుచు నేనెఱుగుదు
'సర్మదు ఫకీరు' నదయత చంపినావు
"గురుజి తేగ్బహదూరుని" కూల్చినావు ॥ 1962

తే॥గీ॥ తోలు నొలిపించి యత్యుష్ణ తైలమందు
ముంచి - యవయవ చ్ఛేదనము నొనరించి
కనులఁబొడిపించి మురిసిన కాకి వీవు
కుణపముల దిను రాబందు - క్రోష్టు వీవు ॥ 1963

సీ॥ "కాబూల్" మొదలు నీదు బాబు సొమ్మైనట్లు
భరత వర్షము గిలు బాడినావు
ప్రాచిని బంగాళ - పడమట గుజరాతు
నీయడ్గులన్నాకు నాయిలయ్యె
"రాజపుటాన" సరోజాక్షు లెందరో
తురక సర్దారుల తొత్తులైరి
నలుగురు సుతులుండి - నిలబెట్ట నీ పేరు
దుష్టత్వమున నీకు తూగరైరి ॥

ఆ॥వె॥ మంచి చెడులు లేక మతము మార్పిడికినై
పుడమి నెత్రు టేట తడిపినావు
మత సమరసత నెద మన్నించు "దారాషి
కో"ను 'యన్న' యనక కూల్చినావు ॥ 1964

(కూల్చుట=చంపుట)
(కుణపము=శవము; క్రోష్టువు=నక్క)
(నాయి=కుక్క) అన్న=అగ్రజుడు

ఉ॥ దక్కను భూమిపై తెగని దాహముతో పరుగెత్తి వచ్చి – నీ
వొక్కడవే యవేలముగ యుర్విని యేలెడి లౌభ్య పూర్ణ దు
ర్ధు ృక్కుడవై జయింప తలతిచ్చుట నుండెడు నెల్ల భూపులన్
నిక్కపు పాలనమ్మనగ నెల్లరి మంచిని కోరుటేకదా! ॥ 1965

శా॥ నీ రాజ్యాశకు నీ కుటుంబమును నీవేగా బలింజేసి యా
పై రారాజువు కాదలంచితివి – త్వద్భ్రాత్రాస్ర సిక్తుండవై
కారుణ్యమ్మొక సుంత లేక పితనే కాల్సేతులన్గట్టి నా
వేరీతి న్భువ దీయ పుత్రతతి సేవింపన్నిను న్గోరెదో ॥ 1966

తే॥గీ॥ దక్కనంతయు నీకిప్డు దక్కెనంటి
వింక నిన్నాట యేబది కెక్కుడైన
కోటలున్నవి మారాట పోటరులకు
నిగుడ బోకుము పాదుషా ! పొగరు విడుము" ॥ 1967

తే॥గీ॥ అనిన నల్కతో గడగడ వణకె 'బాద్ష'
సన్న చేయుచు చనె యనుచరుల కపుడు
వచ్చి నొప్పించిరి – మొగలు భటులు రేగి
కర్రలను మోది – పాపోసు కాళ్ళఁదన్ని ॥ 1968

'ఔరంగజేబు' అమాత్యులు పెదబావ 'మహద్జినింబాల్కరు' శంభాజీకి హితోప దేశము చేయుట

తే॥గీ॥ మొగలు సామ్రాజ్య మందతి ముఖ్యుడైన
యార్థిక వ్యవహార శాఖాధి నాథు
డౌ సచివుడు "రుహుల్లఖాన్" యాత్మజుండు
"జుల్ఫికరు" వచ్చి శంభునిఁజూచె నపుడు ॥ 1969

(అస్రము=రక్తము)
(పాపోసు=పాదరక్ష)

ఆ॥వె॥ చూచి తండ్రి రాక సూచించె "శంభు"కు
నల్లన కదిసెను "రుహుల్లఖాను"
"నీకు యెట్టి శిక్ష లేకుండ 'బాద్షా' ను
నొప్పుదలను చూప చెప్పినాను" ॥ 1970

ఆ॥వె॥ అనుచు చూపె శంభు కతని బావను "మహ
దాజి" నాయకుని నతండు 'బాద్ష'
యైదు వేల సంఖ్య హయదళాధిపుడగు
నశ్రులొలికె శంభు నరసి యచట॥ 1971

ఆ॥వె॥ పలికె శంభుతోడ బావయౌ మహదాజి
"శంభురాజ! సంధి శాంతి యిడును
పంతమేల నీకు – పాదుషా మాటల
నిచ్చగింపు – మసులు నిల్పు కొనగ" ॥ 1972

తే॥గీ॥ అనగ, నంత రుహుల్లఖా ననియె "శంభు"!
నీదు బావహితోక్తులంగీకరింపు"
మనగ – శంభు "రుహుల్లా"ను నడిగె నంత
"యేమి చెప్పె బాద్షా యెఱిగింపు" మనుచు ॥ 1973

పాదుషా ఆర్థిక శాఖా మాత్యుడు 'శంభాజీ'కి పాదుషా నిబంధన లెఱిగించుట

సీ॥ అంత రుహుల్లఖాననియె నీ రీతిగా
"నీదు దుర్గపతులు నెయ్యమొప్ప
కోటలన్నిటిని మా కొప్పగింప వలయు
యుద్ధమనెడి మాట వద్దు మనకు
నీవు కొల్లాడిన యెల్ల ధనమ్ములు
నేడదాచితొ యెఱిగింప వలయు
గిరుల, వనుల నీదు పరి దాగుకొనియెడి
చోటుల మర్మమ్ము చాట వలయు ॥

తే॥గీ॥ మాదు పడవాలులందు నీ మాట వినుచు
నీకు తోడ్పడియెడు, యా యనీతి పరుల
గుట్టు మట్టులు మాకిప్డు రట్టు చేయ
వలయు - కలదు మరియొక నిబంధనమ్ము ॥ 1974

తే॥గీ॥ నీదు దుర్గాధి పతులందు నెవ్వడైన
గడము మాకీయకుండ యాగడము సేయ
నీవు ఆ కోట చేరెడు తావులన్ని
తెలిపి - మాకు ఆ గడము నందింప వలయు" ॥ 1975

ఛత్రపతి శంభాజి రుహల్లాఖానుకు తన బావ మహారాజికి యిచ్చిన ప్రత్యుత్తరము

మ॥ విని శంభుండనె - "నిట్లు "బాద్షు" సకలాభీష్టమ్ములన్ తీర్ప నా
వెనుకన్ నేనిక జీవితుండ నయినన్ప్రేతమ్ముగా మారినన్
గణనీయమ్మగు భేదముండు నొకొ? నాకై ప్రాణమర్పించు వా
రిని, మారాటుల భూమి నేనెటుల నర్పింపన్గలన్ ద్రోహినై" ॥ 1976

తే॥గీ॥ అనుచు - "మహదాజి" బావనుఁగనుచు శంభు
"పాదుషా యీ భరత భూమి పాలనమును
చేయఁబూనిన యంకిలి' చెప్ప బోను
ప్రజలు సుఖియింప నింకేమి వలయునాకు? ॥ 1977

శా॥ పోనీ యీ యవురంగజేబు నొకడే భూమండలం బెల్ల తా
నే నిస్పర్ధిగ నేలగా వలతి యౌ నేనిన్ ప్రశంసార్హుడౌ
తానే భూపుల నందరింబఱచి తద్రాజ్యమ్ము లన్నానెగా
కానీ యభ్యుదయమ్ము నేదె 'భరతక్ష్మా' క్షామసంక్షుబ్ధమై ॥ 1978

(పరి=సైన్యము)

(నిస్పర్ధి=పోటీ లేకుండా, వలతి=సమర్థుడు; ఏదు=నశించు పఱచు= అణచివేయు; ఆను=ఆక్రమించు)

సీ॥ వందకు తొంబది మంది హిందువులుండ
"ధీమ్మ" లనుచు వారి ధృతిని చెఱచి
జుట్టుపై, కట్టుపై శుల్కములు విధించి
యాచారపరులను నణగద్రొక్కి
పన్నిదములు వేసి జన్నిదములు కోసి
మతమును మార్చు నీచతకు డిగ్గి
అద్భుతావహమైన యాలయ శిల్పముల్
కట్టిడి తనముతో మట్టగించి ॥

తే॥గీ॥ మతము పేరిట రాజె యున్మాదియైన
వాడు భరత భూమికి పెద్ద పీడ గాదె
'యుప్ఫు' మనియూద నెగిరిపో నూదరగునె?
తత సనాతన ధర్మ శాశ్వత మహస్సు ॥ 1979

చ॥ మతమును మార్చుకొమ్మనుచు మాటికి మాటికి చెప్పుచుండిరే!
మతమును మార్చుటన్న యది మాతనె మార్చిన యట్లుగాదె – జీ
వితమున మాత యొక్కతయె వేరికి నైనను నుండు పూజ్యయై
మతియుతు లెవ్వరైన నిలమార్చరు స్వీయ మతమ్ము నెప్పుడున్॥ 1980

చ॥ తన మతమే జగమ్మున యుదాత్త మటంచును నమ్మియున్న యా
తనికది తృప్తి గూర్చు – పరధర్మములంబని పూని లొచ్చటం
చనుటకు తానెవండు? తన శాసన కర్తృత రాజ్య పాలన
మ్మునకె మితమ్ము కావలెను–భూజనతాత్మమతేచ్ఛ నొప్పుచున్॥ 1981

సీ॥ నీవు మా కోవెల ల్నేలఁగూల్చితి గాని
యేను మస్జిదుల తట్టేగ లేదు
నీవు యర్చకులను గావు గొంటివి గాని
యేను 'ముల్లాల' స్పృశింప లేదు
ఈవు మా నెలతల యీలు వాచితి గాని
యేను మీ 'స్త్రీ'లెడ కేగలేదు
నీవె మాపైన దండెత్తి వచ్చితి గాని
యేను గా మీ పయి కెత్తలేదు ॥

(ఊదర=గడ్డి; మహస్సు=తేజస్సు)

తే॥గీ॥ జరిగినది యంతయును నీ దుర్జనత వలన
దుండగములన్ని నీదు పద్దుననె యుండె
నీవు మాకు నీతులుఁజెప్ప నేర్తువోయి?
భరత భువిఁబిశాచము వలె పట్టినావు ॥ 1982

ఉ॥ ఈ ఔనరించు దుష్కృతుల నెంతయుఁజూచుచునున్న నేను ని
ష్టేవిధి నెంతు నీ మతము నెంతొ పవిత్రమటంచు – పాదుషా
వీవె సమస్త పాపములకిక్కవు – హింసకు మూలమైన నీ
భావన లెల్లనీ మతముబట్టియెపుట్టునొ? నీ స్వభావమో?॥ 1983

తే॥గీ॥ అనుచు ప్రత్యుత్తరమిడె మహద్ధి బావ
కట్లె బాధ్ష నుద్దేశించి కఠిన వాస్త
వముల నేకరువును బెట్టె స్పష్టఫణితి
జంకు యే కోశమున లేని శంభు రాజు ॥ 1984

చ॥ "కలశుడు" గూడ 'సై' యనెను – గాదిలి మిత్రుడు శంభురాజు తా
పలికెడు పల్కులన్నిటికి – పాదుషయే వినగాననెన్ – "భవ
త్తులితనిపాత కాత్ములరుదోయి! ధరాతలి కోటి కొక్కడున్
కలడని చెప్పలేము యధికారముకై పెను భూతమైతివే" ॥ 1985

ఆ॥వె॥ 'కలశు' డపుడు 'శంభు' కన్నను హెచ్చుగా
ప్రాక్త నార్ష ధర్మ ఫణితిఁ దెల్పె
యెదిరి మతము గూర్చి యేమియు పలుకక
స్వీయ ధర్మ మహిమ తెలియఁజెప్పె ॥ 1986

ఛత్రపతి శంభాజీ కవికలశు నాల్కలను మొగలు భటులు ఛేదించుట

ఉ॥ పాదుష పైననే పరుష భాషలు పల్కెడు వీరి నాల్కలన్
ఛేదము చేయ నాజ్ఞయిడ సేవకు డాపని నొక్కయూపులో

(నిపాతకము=పాపము) ఏకరువుబెట్టు=వరుసగా చెప్పు

సాదన చూపి చేసిచనె - శ్వానములందెను నాటి భక్తమున్
వేదన తాళలేక వెస బిమ్మిటి పోయిరి శంభు డాప్తుదున్॥ 1987

చ॥ ఇగcబదిహేను ప్రొద్దులిటులే యపరాధులపైన హింస సా
గగ నవురంగజేబచట కావలి వారికి నాజ్ఞనిచ్చె - వా
రెగవడి చేయబూనుకొని రేలిక జుట్టున దూరిపోవు, - భృ
త్యగణములున్న నేమి యిక తక్కువ హింసకు-బందిదోయిపై॥ 1988

చ॥ మరియొక నాడు శంభు నవమానము సేయగవచ్చె బాద్ష "కా
ఫిరులను" హింస బెట్టుతటి బిట్టుగ క్రౌర్యము చూపనౌనటం
చరయ పవిత్ర గ్రంథమున యా మన 'దైవము' చెప్పెనంచు - నా
తురక వివాకు డెంతయు మతోచిత రీతిని యాజ్ఞ సేయగన్॥ 1989

ఉ॥ నోటను నాల్క లేక "యుమ" నుల్లము నన్జపియించు శంభు చే
డ్పాటును చూచి సంతసిల దగ్గరె చీకటి కొట్టు వాకిలి
న్నోటమి యెట్టిదో యెఱుగ కుండిన గండడు సాటిలేని యా
పోటరి శంభు - పాదుషను "పుర్వువు నీవ" నురీతి చూడగన్॥ 1990

'వీర శంభాజీ' 'కవికలశుల'కు కనులు పొడిపించుట

చ॥ కనలెను నగ్గియై మొగలు కాంతుడు - చెచ్చెఱ బంధితద్వయిన్
కనులు దొలంచి యంధులనొనర్పగ నాజ్ఞలనిచ్చె - వేగ - నా
చెనటి పనుల్లొనర్చుటయె జీవికయై మనుచుండు నిష్ణులా
పని నొకలిప్తలో జరిపి పాదుష మెప్పును పొంది రెంతయున్॥ 1991

(ఛేదము=ఖండించు; సీవకుడు=కటికవాడు; సాదన=నైపుణ్యము; భక్తము=తిండి; బిమ్మిటిపోవు=మూర్ఛపోవు; ఆప్తుడు=స్నేహితుడు)

(వివాకుడు=న్యాయాధికారి)

(ఉమ=జగదంబ పార్వతి; గండడు=వీరుడు; చేడ్పాటు=దురవస్థ)

(చెనటి=క్రూరమైన, నిష్ణులు=నిపుణులు)

నిరంతర జగదంబ నామ జపము శంభు కలశులకు నొప్పిని తెలియ కుండ చేయుట

ఆ॥వె॥ మాట, చూపు, రెండు మాయమై పోయెను
నంతరంగమందు 'నంబ' నిలిచె
'యంబ' నామ జపము నణగించె వేదన
నపుడు శంభు, కలశు యమళమునకు ॥ 1992

'వీర శంభాజీ' 'కవికలశు'లకు పాదుషా పెట్టించిన చిత్ర హింస

సీ॥ "ప్రతి దినమును కొంత భాగము తనువున
త్వచము నొలువ బాద్ష పనుపుఁ జేసె
చర్మ రహిత మైన స్థలముల నుప్పు కా
రముల నద్దుడని "దురాయి" చేసె ॥
ప్రతి పొద్దునొక ప్రేలు పల్లాడ మని చెప్పి
ప్రత్యహ మొక గోరుఁబ్రామమనెను
ప్రతిఘస్రమందును పచ్చి గాయములపై
పచ్చి కారమునుప్పుపామమనెను ॥

తే॥గీ॥ తన మతాచారములు తూచ తప్పకుండ
యాచరణ యందు పెట్టె "జహాపనుండు"
నింత గొప్ప "జిందాపీరు" యొసగి యున్న
మతము కన్నను గొప్పవా? మంచి చెడులు ॥ 1993

(త్వచము=చర్మము; దురాయి=ఆజ్ఞ)

(తనువు=శరీరము; త్వచము=చర్మము; పనుపు=ఆజ్ఞ; దురాయి=ఆజ్ఞ; పల్లాడు=ఖండించు; ప్రాము=ఊడబీకుట; ఘస్రము=దినము; పాముట=అద్దుట; జిందాపీరు=సజీవ, వృద్ధ మత విజ్ఞాని (ఔరంగజేబు బిరుదము)

దారుణ శిక్షలు ఆచరణలో పెట్టు భటులు శంభాజీని లొంగి పొమ్మని బ్రతిమాలుట

ఉ॥ చర్మము నొల్చు వారలట శంభుని చూచుచు బాధ చెంది – "నీ
భర్మము వంటి మేను చెడ బారగ నెందుకు మంకు పట్టు? నీ
ధర్మముఁజూడు నిన్నెటుల దారుణ బాధలు పెట్టు చుండె – మా
ధర్మముఁలోకి రమ్ము – ధనదాభుని చేయును నిన్ను పాదుషా"॥1994

వీర శంభాజీ ప్రత్యుత్తరము

తే॥గీ॥ అనుచు సూనరు లనుకంప యెనయ ననగ
శంభుడు "స్వధర్మమున చావు స్వర్గమిచ్చు
పరుల ధర్మము నతి భయావహము నగును"
ననుచు మా ధర్మ శాస్త్రము లానతిచ్చు" ॥ 1995

తే॥గీ॥ అందువలన మీ కర్తవ్య మధిపు నాజ్ఞ
చే నొనర్చు చుంటిరదియె చేయుడిపుడు
జరిగె ముప్పాళ్ళ సమయము చావు వైపు
నింక నొకపాలు యెంతలో క్రుంకు నోయి" ॥ 1996

తే॥గీ॥ అనెడు శంభాజి ధైర్య శౌర్యముల నరసి
"యిందు వలననె కాబోలు నెపుడు బాద్ష
'శంభు' పేరు వినిన చాల సంచలించు
గాలి తాకుకు వగుడాకు తూలునట్లు ॥ 1997

తే॥గీ॥ అటులనుకొనుచు చనిరి యా కటిక వాండ్రు
గోళ్ళుయూడెను – పూర్తిగా వ్రేళ్ళు తెగియె
స్కంధ చర్మమ్ము తొలగెను చాల వరకు
మిగిలె వ్యాఘ్ర నఖప్రయోగ మిగ చివరగ ॥ 1998

(భర్మము=బంగారము; ధర్మము=మతము (సంకుచితార్థములో); ధనదుడు=కుబేరుడు)

(స్కంధము=దేహము)

వీర శంభాజీ కలశుల చర్మ రహిత దేహములను ఇత్తడి పులిగోళ్ళతో చీల్చుట

మ॥ చివరన్ వచ్చు పతాక ఘట్ట మొకటే శేషింపగా – దాని ముం
దవు ఘట్టమ్మున బంధితద్వయనిరస్తత్వక్చరీరమ్ములన్
మివుల న్వాడిని గల్గు నిత్తడివినౌ మేలైన'వాఘ్నఖ్లు'తో
డ విదారించిరి వెన్ను వక్షము పిచండమ్మస్రముల్చిందగన్॥ 1999

చ॥ తొలుత శివాజి పిత్తలపు దువ్వ నఖమ్ములఁ బొట్ట జీల్చె – 'న
ఫ్జలుని' దురాగతమ్ములిల సాదును లేని విధాన రేగ – కో
వెలలను గూల్చి – పట్నములు వీడులు కాల్చుచు సాగుచుండ – నా
తులువను మాల్చె లోక జనతోపకృతిన్ పొనరించు దీక్షతో ॥ 2000

తే॥గీ॥ నాటి ఘటనను మరల యీ నాడు 'బాద్ష'
శివజి సుతునకు రుచిచూపు సవురుఁ దోప
సేనమునె పులిగోళ్ళతో చీల్చ మనియె
నోయి గూర్చుటయే బాద్ష ధ్యేయమగుట ॥ 2001

వ్యాఘ్రనఖ ప్రయోగ ఘట్ట పరిసమాప్తి

తే॥గీ॥ వ్యాఘ్రనఖ ఘట్టమునకు యవనిక పడియె
పడిరి మాంసపు ముద్దలై బంధితులిల
గోళ్ళు, వేళ్ళును, నాల్కయు, కళ్ళు పోయి
చర్మరహిత దేహముల మాంసములు మిగిలె ॥ 2002

తే॥గీ॥ స్పృహను గోల్పోయె బంధిత ద్వయము – కాన
బాధ తెలియక మరుసటి ప్రధ్న వరకు
నిశ్చలమ్ముగ పడియుండ్రి – నీరు వట్టు
నాకలిని జయించెను తత క్షతాంగ యుగము ॥ 2003

(పిచండము=కడుపు; 'వాఘ్నఖ్లు'=పులిగోళ్ళు; అస్రము=రక్తము; విదారించు = చీల్చు) (పిత్తలము=ఇత్తడి; దువ్వ=పులి; సాదు=ఎల్ల)
(సేనము=శరీరము; నోయి=నొప్పి) సవురు=విధము

అంత్య ఘట్టము - శంభాజీ కలశుల కాళ్సేతులు నఱకించుట

శా॥ వచ్చె న్నంతిమ ఘట్ట మంతికముకు న్బందీల తర్లించుచు
న్నచ్చోనుండి - 'వఢూతులాపురము'కు, న్నవ్వారి కాళ్సేతులన్
విచ్ఛేదించుచు చిన్న ముక్కలుగను న్చెండాడి తత్ఖండముల్
యచ్చోనుండెడు కుర్కురమ్ములకు నాహారమ్ముగా వేయుచున్ ॥ 2004

'ఛత్రపతి శంభాజి', 'కవికలశు'ల శిరచ్ఛేదము

తే॥గీ॥ తలలు, మొండెములు మిగిలి ధరణి బడిన
నెత్రు ముద్దలగు మరాట నేత 'శంభు'
'కవికలశు' శిరమ్ములను - కర్కశ పరశ్వ
ధారమున నఱకిరి మొగల్ క్రూర భటులు ॥ 2005

తే॥గీ॥ రాక్షసానంద మొందుచు రాజభటులు
రేగి కేరింతలన్ గొట్టి క్రేళ్ళు దాటి
ఖండిత శిరద్వయి నపుడు గడ్డి యందు
చుట్టి - పగటిరి పల్లెలఁబట్టణముల ॥ 2006

తే॥గీ॥ ఎవరి కెవ్వరిన్తమ యూరి కేగు దెంచి
నఱకి ముక్కలు చేయుచు నాయిలకును
పారవేసెడి యక్కఱ వచ్చె ననుచు
విస్మయ భయము లొందిరా వీటిజనులు ॥ 2007

కం॥ హిందూ స్వతంత్ర రాజ్యము
పొందింపగ శ్రీ శివాజి మూలము గాగ
న్నందుకొని శంభుజీయును
నందించుచు హిందు రాజ్యమసువులు బాసెన్ ॥ 2008

(కర్కశపరశ్వధారము=వాడి గండ్ర గొడ్డలి అంచు)
(పగటు=ప్రదర్శించు) (నాయి=కుక్క)

ఉపసంహారము

వధు బదురుక్ - తులాపూరు

తే॥గీ॥ భీమ, భామ, యింద్రాయణ వేణులచట
కలసిన త్రివేణి సంగమ స్థలము నందు
"వధు బదురుకు" – "తులాపూరు" పల్లెటూళ్ళు
కలవు – అచట తులాపూరు గ్రామ మందు ॥ 2009

తే॥గీ॥ మొగలు ప్రభువు శంభాజీని పోనడంచె
నలుబది దినములతుల హింసలను బెట్టి
కనులు పొడిపించి – నాలుక కత్తిరించి
పెయిని నఱకించి నదియందు విసరి వేసి ॥ 2010

'బాపుబువా' 'శ్రీ శంభాజి' శరీర శకలముల ప్రోది చేసి అంత్య క్రియలు జరిపించుట

కం॥ పాదుష కళ్కుచు – శంభూ
భూదారుని ప్రేత ఖండములను – నెవండున్
ప్రోది యొనర్పమి – "బాపు బు
వా" దిటమున తెచ్చి చేసె పరలోక క్రియల్ ॥ 2011

తే॥గీ॥ పాదుషా బిభీషికలను పాటిఁ గొనక
యచటి జనులు శంభు ప్రభుని యంగ శకల
ప్రతతులను కూర్చి – కుట్టి – రూపమ్ము నిచ్చి
నందున 'శివాలె' తద్గృహ నామమయ్యె ॥ 2012

తే॥గీ॥ శంభు హత్య "తులాపూరు" క్ష్మాతలమున
'భీమ' నది తటినైన – నా వీర వరుని
చిత్యము 'వధు' సంవసధము క్షితి తలమున
నిలిపి రా వీరు సంస్మృతి నిత్యమవగ ॥ 2013

(అళ్కు=భయపడు; భూదారుడు=రాజు; దిటము=ధైర్యము)

(బిభీషికలు=బెదిరింపులు)

(చిత్యము=సమాధి) సంవసధము=గ్రామము

సింహావలోకనము

ధర్మవీర, మహావీర, ఛత్రపతి శంభాజీ భోస్సలేకు మొదటి నుండియు అనుకూలింపని రాజకీయ వాతావరణము

తే॥గీ॥ ఎత్తుకొనగానె వెంటనే మొత్తుకోలు
యనెడు సామెతయయ్యె రాయగడమందు
జనకుడే విశ్వసించు యష్ట ప్రధాను
లందు నెఱసులెన్నగ శంభు లౌక్యమేది ॥ 2014

శా॥ దాదాపెల్ల మరాట మంత్రులు, పురాధ్యక్షుల్, దణుల్కొందరు
న్నేదో రూపము నన్నసీతికిని తామెప్డోయొకప్డర్థలో
భాదంశక్షత బుద్ధి గడ్డిఁదిను లోపంబున్కి - శంభాజికిన్
లో దద్దిర్లుచు - పూని రాతని పయిన్నొడ్డారమున్దండిగా ॥ 2015

తే॥గీ॥ "వతనుదార్ల", "జమీందార్ల" బలిమి నుండి
సేద్యగాండ్రను తప్పింప శ్రీ శివాజి
తొలచె 'వతను', 'జమీన్దారి' దుర్వ్యవస్థ
"శంభుజీ" తండ్రి జాడనే చనదలంచె ॥ 2016

తే॥గీ॥ శంభునకు భావుకుడె గాక శ్యాలకుండు
నగు "గణోజిషిర్కె" "దభోలు" నవని భాగ
మాదినుండి తమ వతను నగును గనుక
దానిపై యధికృతి కోరె తనకె మరల ॥ 2017

ఉ॥ "శ్రీ శివజీ ప్రభుండు నొనరించిన నిర్ణయముల్ వినీతిమై
నే శిరసావహింతు - పితయే మన కార్షుల సేమమెంచి - ని
ర్దేశము చేసె - పేదలను తిప్పలు బెట్టు జమీను దారులన్
లేశము గూడ రేగ బయలీని విధి-న్నదె నాదు మార్గమౌ " 2018

(దద్దిర్లు=భయపడు; ఆదంశము=పల్లు; ఒడ్డారము=ద్వేషము)
(నిర్దేశము=యేర్పాటు; రేగు=విజృంభించు; బయలు=అవకాశము)

కం॥ అని యొత్తి చెప్పు శంభా
జి నెదిర్చు బలమ్ము లేమి - చిడిముడి పడుచున్
మునుమగు కసితో శంభుని
వినష్టికిని "వతనుదార్లు" వేచిరి తతికై ॥ 2019

ఉ॥ ఈ విధి నార్జవమ్మనగ నేమొ యెఱుంగని నీతి హీనులే
యే వలన న్కనుంగొనిన - నెల్ల ప్రభుత్వపు కొల్వులందునన్
తావగొనంగ వేసరిలి తద్దయు శంభు మరాటకార్యులన్
క్రేవకునెట్టి - శ్రీ కలశునే విసువాసిగ నెంచె తామదిన్ ॥ 2020

చ॥ ఇటుల 'సుదీచి భారత' మహీసురుడే తమకన్న గొప్ప బా
సటగను శంభుజీ తలచు చాడ్పునకున్ - కలశాఖ్య విప్రుపై
పొటమరిలెన్నసూయ - తమభూపునిపైన మరాటులందు - ప
ల్లటిలెను భక్తి - శంభుడిటు లాతిజనున్ తలకెత్తుకున్కికిన్॥ 2021

తే॥గీ॥ ప్రగడ, లధికార్లు శంభాజి పైన తీవ్ర
మౌ యసంతృప్తితో లోన మండిపడగ
వతనుదార్లు, జమీందార్లు - గత చరిత్ర
యైన తమపెత్తనము లెంచి యల్క గొనిరి ॥ 2022

శా॥ పైపై ప్రశ్రయమున్నటించుచెదలన్ భగ్గంచు మారాటు లే
వైపుంగన్న యతృప్తులై తన యెడన్ వైరమ్ము పాటించు చో
యే పాటన్ తన వారలన్ముదితులన్జేయంగ నౌనంచు - యో
చింపన్బూనిన శంభుజీ మనసుకున్చీకట్లె తోచెందుదిన్ ॥ 2023

(వినష్టి=వినాశనము; తతి=సమయము)

(తావగొను=స్థిరపడు; కార్యులు=అధికార్లు; విసువాసి=విశ్వాసి)

(బాసట=స్నేహితుడు; పొటమరిలు=ఉదయించు; పల్లటిలు=నశించు; లాతి=పరాయి)

శ్రీ కవికలశ్ వృత్తాంతము

చ॥ కవి కలశుండు పండితుడు - కాళిక భక్తుడు - కాన్యకుబ్జ వి
ప్రవరుడు - నైక శాస్త్రముల వైదుషితోడుగ - శస్త్రవిద్యలన్
స్తవస సమర్థనైపుణము శత్రుగజాంకుశమై తనర్చ సం
శ్రవమును గాంచె బ్రాహ్మమును క్షాత్రము నొక్కట గూడు మూర్తిగా॥ 2024

చ॥ కలశు కనోజి బాప దరికంత విలుంతన విక్రమ క్రియా
తులిత కుఠారభార్గవుడు - తోరపు ప్రేమను శంభుజీపయిన్
నులుమని నీడయైనిలిచి - నొవ్వినఁ దేర్చుచు నవ్వ నవ్వుచున్
మెలగెడు నట్టి వాని పయి నిందలు వేసిరి దుర్విమర్శకుల్ ॥2025

కం॥ ఔరంగజేబు పంపిన
చారుడు కవికలశుడనెడి జనవాదమ్మా
మారాట నేలపై సం
చారము చేయును - నిజానిజములజుడెఱుగున్ ॥ 2026

ఉ॥ పాదుష పిల్వగా శివజి వచ్చెను, 'నాగ్ర'కు పుత్రుతోడ - పూ
ర్వాదరమేద 'బాద్ష', యొక బందిగ నుంచె బవంతిలో శివు
న్నా దురదృష్టము న్దొలచ నొపయికమ్మను పన్నినట్టి దీ
భూదివిజుండునౌ "కలశె", బుట్టను వేయుచు "పాదుషాహ"నే ॥ 2027

కం॥ అనియెడు ప్రవాదమున్నది
తనకేమి ప్రయోజనమగు? తప్పింప శివా
జిని - కలశున కా శంభుడ
నిన యంతటి మమతయేల! నిజమెవడెఱుగున్? ॥ 2028

చ॥ కలశునిపైన నమ్మకము గట్టిగ నేర్పడె శంభుజీకి - యా
కలశుని మాట వేదముగ కన్నుల కద్దుకొనున్నతండు - వే
ల్పుల నుడి యందు విప్రుడు సభోచితుడంచును మెచ్చు నెప్డు, న
ట్లలమెను ప్రేమ వారల నొడళ్ళపరమ్మను-ప్రాణమొక్కటై ॥ 2029

(స్తవనము=స్తుతి; సంశ్రవము=కీర్తి) (నులుమని=వీడని; నవ్వుచున్=సంతోషించుచు) (వేల్పులనుడి=సంస్కృతము; సభోచితుడు=పండితుడు; అపరము=వేరు, భిన్నము)

తే॥గీ॥ పుండుపై యుప్పు కారమ్ము పులిమినట్లు
నిపుడుదగ్భారతీయు నెన్నిక నొనర్చి
తనకు నాంతరంగిక సచివునిగ శంభు
'కవికలశు'డనెడి 'కనోజి' యవని సురుని ॥ 2030

కవికలశునిపై మరాటా మంత్రుల యీర్ష్యా ద్వేషములు

ఉ॥ మేము మరాట భూజనుల మిప్పటిదాక శివాజి రాజుకే
మామనికిన్కదించితిమి - మాదురదృష్టముచే శివాజి రా
జామృడు పాలికేగె నటులైనను నంజక శంభుసేవ కే
యేమిట నంటి పెట్టుకొన నిట్లవమానము సేత పాడియే ॥ 2031

మ॥ తలపైఁబెట్టుకొనె న్హితుండని - యమాత్యాగ్రేసరుండంచు - యే
వలనైన్కలశుండు కోరిన ప్రభుత్వాధి క్రియాయుక్త చ
ర్యలు నిర్వాహము చేయబంచె - తమ మిత్రత్వమ్ము కే చేటు వా
టిలనట్లొద్దిక చూపె శంభు డిక నట్లే యుండె నావిప్రుడున్ ॥2032

మ॥ ఎవడో? వాడు 'కనోజి' బాపడట! శాక్తేయమ్ములౌ తంత్రముల్
యవిరామమ్ముగఁజేయు - జంతుబలి హింసాతంకమే లేక తా
సవనార్థమ్మని చేయు - వాని పలుకే శాస్త్రమ్ముగా శంభు డెం
చి వరాంగము నూపు-నెంతకును మా సేవ్యుండు నా విప్రుడా?॥ 2033

శా॥ త్యాగమ్ము ల్పొనరించి హైందవ స్వతంత్రక్ష్మాధిరాజ్యార్జనో
ద్యోగవ్యగ్రుడునౌ శివాజి ప్రభుకు న్తోడైతి మిందాక - నే
డాగంతుండెవడో 'కనోజి ముఖజున్నాహ్వానమున్జేసి - "ఛాం
దోగామాత్యు"డటంచు పట్టమిడి-క్రిందుంజేసె మా స్థాయినిన్॥ 2034

చ॥ అని సచివాష్టకమ్ము హృదయ వ్యథ నొందగ నందు - 'నణ్ణజీ'
తన యవినీతి మీదనె ప్రధానముగా తన దృష్టిమోపు, శం
భునిపయి కక్షతో, నతని పోకడలందు దొసంగులెన్ని, త
జ్జనకుడు శ్రీ శివాజికె నసమ్మతి కల్గగఁజేసె పుత్రుపై ॥ 2035

(ఉదక్+భారతీయుడు=ఉత్తర భారత దేశీయుడు) ముఖజుడు=బ్రాహ్మణుడు
(ఆతంకము=భయము; సవనము=యజ్ఞము; సేవ్యుడు=రాజు; వరాంగము=శిరస్సు

మ॥ "అవినీతి న్మొదలే సహింప నెపుడు న్నట్లే "జమీందారి" నిం
క "వతన్దారి" విధానసుప్తఫణులన్నన్విప్పగా నీయ నా
స్తవనీయోత్తమ శ్లోకుడైన పితయే జాడన్ ప్రవర్తిల్లెనో
రవయున్మారక సాగు హైందవ ప్రజారాజ్యమ్ము మున్ముందునున్"॥ 2036

మ॥ అను యాలోచన విన్కిజేసె తన కత్యంతాప్తుడైనట్టి యా
యనుగున్నెచ్చెలి - మంత్రి శేఖరుడునున్ యాచార్యుడౌ "కాన్యకు
బ్జ" నగాధారసురుండు శ్రీ కలశుకున్ - "శాబాస"టంచాతడున్
"ఘన భూద్రమ్ము చలించునే హితుడ! ఝుంఝూధాటికం"చెంచగన్॥ 2037

వీర శంభాజీకి సంభవించిన సంకటములు

చ॥ గణనకు మీరునంతటి మొగల్వరి రేగి మరాట రాజ్య ధా
రుణిని హరించు చుండగ వరుంబడి పూర్తిగ తగ్గె - కార్షుల
ప్పనముల నేడనుండిఁగొని వత్తురు? సేద్యము సేయు భూమినే
కనుగొనుచుండగానె తుఅకల్ వడిపైబడి నాక్రమింపగన్ ॥ 2038

శా॥ కానీ శంభునిఁ బట్టఁ బాద్షదశ దిగ్బంధమ్ము కావింపగా
సేనల్నిల్పెనటంచు శంభునకు నూసే చేర లేదన్నచో
న్యూనంబై చెడె గాదె। గూఢచర సంవ్యూహమ్ము - శంభాజికిన్
హాని న్సేయగ పొంచి యుండ పరులుప్పందీయ లేదొక్కడున్॥ 2039

తే॥గీ॥ వెలిదురమ్మున మొగలులఁ గెలువలేమి
సేద్యపున్నేల వైరుల చేతఁ జిక్కి
వార్ధి తీరమౌరంగజేబ్ వశము గాగ
కృషియు, వాణిజ్యముల్తగ్గి - రిక్థ మిగిరె ॥ 2040

తే॥గీ॥ వీర సేనాధినేత "హంబీర రావు"
"వాయి" యుద్ధమునందు గతాయువగుట
సేనలో క్రమశిక్షణ ఛిన్నమయ్యె
ధన పిపాస స్వదేశ భక్తిని హరించె ॥ 2041

(ఊసు=వార్త; సంవ్యూహము=వ్యవస్థ) ఎంచు=పొగడు
(వెలిదురము=బయలిపోరు; రిక్థము=ధనము)

తే॥గీ॥ వేయి చేతులతో డబ్బు వెదనుజల్లి
విలిచె యంగడి సరకుల వలెను 'బాద్ష'
వీర మారాట యోధులున్వెంగలులయి
చొంగc గార్చుచు మొగలుల లెంగిలైరి ॥ 2042

మ॥ గిరి దుర్గమ్ము లరణ్య ప్రాంతములు దక్కెంగాని - బైలన్ మొగ
ల్వరి రేగెన్ చదునైన భూతలమునన్ పల్లెల్ పురమ్ముల్ - తమ
న్నరికట్టంగల వారు లేమి, యులకన్ స్వాధీనమైపోవ - యే
పఱె మారాట స్వతంత్ర రాజ్య మహమబ్ధాక్రాంత రవ్యంశువై॥ 2043

తే॥గీ॥ రాజ్య విస్తీర్ణమును తగ్గె - 'రై' కృశించె
కృషికి నేల లేదు - మరాట క్షేత్రి తతికి
క్రేతలేలేక అంగళ్ళు మూత బడియె
నింట బయటను హెచ్చెను నింటరమ్ము ॥ 2044

వీర శంభాజీని బంధించుటకు శత్రువుల పన్నాగము

ఉ॥ పాదుష పంపు నన్తరలి వచ్చె "ముకర్రబుఖాను" శంభుజీ
నే దెసనైన యుచ్చుముడులేసి యదాటున బందిసేయ - "షి
ర్కే" దుడుకున్ 'గణోజి' నడిగెన్తన కిమ్మని తోడు పాటు - వా
డీ దురితమ్ము సేయ మునుపే తటివేచెను గాన యూకొనెన్॥ 2045

ఉ॥ రాయగడమ్ము నందు 'పరి' రక్షణలో గల 'శంభుజీ'ని యే
దో యొక యుక్తిపన్ని బహిరుర్వికి రానొనరింతు మేని - యా
పై యదనేదొ చూచి వలపన్ని వశున్బొనరించ వచ్చు నా
దాయల తంత్రమున్దెలిసి, తానును తోడ్పడ 'షిర్కె' నూల్కొనెన్॥ 2046

(లెంగి=బానిస)

(ఉలక=తేలిక; రవ్యంగువు=సూర్యకాంతి)

(రై=ధనము; క్షేత్రి=కర్షకుడు; క్రేత=కొనుగోలుదారు; ఇంటరము=ఎటూ కదలలేని స్థితి)

(దుడుకు=దుష్టుడు) దాయ=శత్రువు

తే॥గీ॥ "శంభుజీ" తండ్రి నియమానుసారముగను
"ఖండొబల్లాలు చిట్నీసు" కప్పగించె
'రాజప్రతినిధి' గా "దభోల్" ప్రాంత మేల
మొదట 'షిర్కే'ల 'వతను' - ఆ భూమి యెల్ల ॥ 2047

చ॥ తనవతనిట్లు నన్యులకు దత్తము నయ్యె నటంచు - శంభుపై
కనలి 'గణోజిషిర్కె' ప్రతి కారముకై తటివేచి యుండ - నే
డనువగు వేళ వచ్చె - మొగలాయి దణాయడు "షేక్నిజాము" "శం
భుని" కదియింప వచ్చుటను-పోయిన యాశచిగిర్చె 'షిర్కెకున్'॥ 2048

తే॥గీ॥ "'కవికలశుడు' 'శంభు'నకు ముఖ్యానుచరుడు
అతడె చూచు రాజ్యవ్యవహారములను
'వతనుదార్లకు' వ్యతిరేకి యతడు - దాన
శంభు 'షిర్కే'లకు వతనొసంగ లేదు" ॥ 2049

చ॥ అనెడు దురూహచే 'కలశు'దన్న 'గణోజి'కి తీవ్ర కోపమా
తని తొలగించు మార్గములెదన్ తలపోయుచు నుండ - "మల్కపూ
రు"న గల "దేశి" వారికి విరోధము 'షిర్కెల' తోడ కల్గ - నా
పెనపును నాపగా "కలశ" విన్మణి వచ్చెను కొద్ది సేనతో ॥ 2050

చ॥ అదనిదె వచ్చెనంచు కలశాఖ్యునిపట్ట, 'గణోజి' సేనతో
కదురుకొనన్ 'కలశ్' తనకు కల్గిన సైన్యము నల్ప మౌటచే
నదనువు మాని వెన్కకు చనన్ తలకొంచు "విశాల" దుర్గమం
దొదిగి-పురోణి పంపె తనదుస్థితి తెల్పుచు "శంభు రాజుకున్॥ 2051

చ॥ గురుడు, హితుండునౌ కలశుకున్ విపదేర్పడె నంచు కుంది - చె
చ్చెఱ సమరాయితుండయి - త్యజించుచు రాయగడమ్ము రక్షణన్
పరిపరి భార్యయెంతొ పొదువన్ చనవద్దని, "బైలవైరి దె
ప్పరముగ పొంచె"నంచు-తగు పల్కులఁ దేర్చుచు వెళ్ళె శంభుజీ॥ 2052

(కదియించు=బంధించు)
(దేశి=దేశాయి; పెనపు=కలహము; విన్మణి=పండిత శ్రేష్ఠుడు)
(కదురుకొను=ఎదిరించు; నదనువు=యుద్ధము; పురోణి=జాబు)
(విపద=ఆపద; పొదువు=బ్రతిమాలు; దెప్పరము=ప్రమాదము; తేర్చు=ఊరడించు)

విద్వన్మణి కవి"కలశ్" క్షాత్ర పార్శ్వము

శా॥ 'గోవా' పై యని చేసి 'శంభుజి' పరంగుల్ చేయు దుష్కార్యముల్
తావారింప ససైన్యుడై చనిన కాలమ్మందు "షాబుద్దినుం
డా" వీలున్గమనించి రాయగడము న్నాక్రాంతమున్జేయగా
వే వచ్చెన్ మొనతో నుపత్యకదరి న్వీళ్ళన్నగుల్కొల్పుచున్॥ 2053

శా॥ ఆ వార్తల్ వినవచ్చినంత కలశున్నంపించె – "షాబుద్దినున్"
వేవేగన్ దమియింప – వచ్చెను మనోవేగమ్మునన్ 'శ్రీకలశ్'
వే వక్రించె షహాబుదీన్పరిని నిర్వేలాతి శౌటీర్యుడై
రావుల్ తప్పగ 'షాబుదీన్' దణికి, వేటాడెన్ మొగల్సేనలన్॥ 2054

తే॥గీ॥ అన్ని దిక్కుల మెఱపులాగడరునట్టి
కలశుధాటికి 'షాబుదీన్' బలము గ్రుంఁదె
చెదరి పాటిపోయెను హత శేషసేన
బుద్ధివచ్చె 'షాబుద్దీను' వృద్ధ దణికి ॥ 2055

రాయగడము నుండి 'శంభాజీ' కలశునికి సాయపడుటకై బయలుదేరుట

చ॥ అదె కడ 'శంభుఁ'జూచుటని ఆ'యశు' కూహయెలేదు, 'రాజరా'
మెద నొక లిప్తయైనను గణింపగ లేదదె "యన్న గారి" యం
త్యదృశియటంచు – 'రాయరి' జనాళియు నెంచగ లేదదేప్రభున్
తుదిగను కాంచు చుంటిమని – త్రోసుక వచ్చె విధాత తీర్పటుల్॥ 2056

ఉ॥ "రాయరి" నుండి శంభు బయలంబడుటే తన లక్ష్యమౌట 'షి
ర్కే' యని సేత వీడియరిగెన్తన వీటికి – శంభుజీ చనెన్
నేయుని కండగా నిలువ నెంచి 'విశాల గడమ్ముఁ',కా 'కలశ్'
తాయువరాజునుంగని ముదమ్రుల వెల్లిగనయ్యె ప్రేమతో ॥ 2057

(అని=యుద్ధము; పరంగులు=పోర్చుగీసులు; వీలు=అవకాశము; ఉపత్యక=పర్వత పాద ప్రాంతము; వీళ్ళు=వీడు+లు=ఊళ్ళు, ఇండ్లు)
(పరి=సేన; వక్రించు=ఎదిరించు; శౌటీర్యుడు=వీరుడు)
(కడ=చివర; యశు=యశూబాయి (శంభాజి పెద్ద భార్య)

తే॥గీ॥ ఇయ్యదె "గణోజిషిర్కె" యాశించినట్టి
ఫలిత మాతని దాంభిక స్పశమునకును
'శంభు' మరల "రాయగడు"కు చనెడు లోపె
వానింబట్ట "ముకర్రబ్ఖు" వార్తనంపె ॥ 2058

తే॥గీ॥ విధిప్రచోదితుడౌచు నా వేళయందు
'కలశు'డొక గొప్ప కోర్కెను వెలువరించె
సంగమేశ్వరమున – జగజ్జనని కాళి
కాంబ నర్చింప – భావి కార్యావజితికి ॥ 2059

తే॥గీ॥ చీమయుంజొఱం సరె లేని చిక్కనైన
యపర భూధరారణ్య గర్భాంత రస్థ
మైన "సంగమేశ్వరపుర" మందు సభను
గూర్చదలచె 'శంభు' 'స్వరాజ్యచర్చ' కొఱకు ॥ 2060

తే॥గీ॥ సంగమేశ్వరము "గణోజి" జన్మభూమి
యైన "శృంగారపూరు" ప్రాంతావనికిని
సవిధమందున్కి – 'శంభు' విశ్వాసముంచె
శ్యాలుపై, 'షిర్కె' తన సేమ మరయుననుచు ॥ 2061

శా॥ 'అంబేఘూట్' కనుమారి మార్గమున సహ్యాక్ష్మాధ్ర సాంద్రాటవి
'న్నంబేదౌ'చు 'గణోజిషిర్కె' సుకరమ్మౌరీతి దాటించు వా
రింబంపె "న్మకరబ్బుఖాను"నకు – దుర్నీతుండునై–'శంభునో'
లంబౌరీతి నదాటుగా గవిసి – యాలానమ్ములన్గట్టగన్ ॥ 2062

ఉ॥ ఆశకు లోగి బావమఱదయ్యును శంభుని పట్టియిచ్చె – "షి
ర్కే" – శఠుడౌచు – "పాదుషహ" రిత్తవచస్సుల కుచ్చుటోపికిన్
తా శిరమున్ముఖానతిని తప్పి – నతమ్మొనరించె గాని – తా
లేశమునెంచెనే చెలియలిన్ 'హృతరక్తలలాట' జేయుటన్॥ 2063

(దాంభిక స్పశము=కృత్రిమ యుద్ధము; ముకర్రబ్=శంభుని బంధించుటకు పాదుషా నియమించిన వారు) (అవజితి = సాఫల్యము)

(కనుమారి=కనుమ (రెండు కొండల నడిమి ప్రదేశము) అంబేద= అవివేకి; డంబు=మోసము; అదాటుగా= హఠాత్తుగా) సరె=సందు; ఓలము= గుట్టుగా (ముఖానతి=సిగ్గు; రక్తము=కుంకుమ; లలాటము=నొసలు)

వీరశంభాజీ ఆర్జవగుణమే యతని శత్రువగుట

చ॥ మునుముగ దౌర్హృదమ్ము నెదమోయుచు శంభునిపట్ల - షిర్కె-తా
ననయము చెల్లికిన్గుఱుతొనర్చుచు నుండె "వతన్" గుఱించి - భ
ర్తను కదలించ మంచు - తన దారకు చెప్పెను - "తమ్ముడైన శం
భునకును నచ్చచెప్పియు 'దభోలు' నొసంగగ జేయుమంచునున్" ॥ 2064

తే॥గీ॥ చెల్లెలు "యశస్విని" పతికి చెప్పలేక
భార్య "రాజకుమారి" యవరజునేమి
యడుగ లేక - తామిట యసహాయులమన
మండిపడె గణోజి - నిదాఘమర్కువోలె ॥ 2065

మ॥ "ఇగ సామమ్మున కాదు కార్యమని యోచించెన్సుదీర్ఘమ్ముగా
మొగలాయీల సహాయమున్గొనుటె నాముందున్న మార్గమ్ము - ఆ
మొగలుల్గట్టిగ పట్టుబట్టిన వతన్ మూడంగలన్ రాదొకో?
పగసాధింతును 'శంభుజీ కఱం ప్రభుత్వైకాప్త గర్వాంధ్యమున్"॥ 2066

తే॥గీ॥ గడ్డిలోదాగి ప్రాకెడి కాలనాగు
నిండుగా పూరి కప్పిన నేల బావి
పొదలలో పొంచియున్న బెబ్బులియు - కప్ప
యెలుగు పాము - మధువిలిప్త హేతి - షిర్కె ॥ 2067

తే॥గీ॥ నిల్వునను మేన విషమును నింపుకొన్న
'షిర్కె' వారు తుర్కుల బాని సింద్రు రనుచు
చెప్పె చెవినిల్లు గట్టుక శివజి సుతున
కదిమఱచె - నేమఱెనిప్పుడాత్మ రక్ష ॥ 2068

తే॥గీ॥ బావమఱది పన్నిన యుక్కువలలం జిక్కి
యుక్కె వీర మారాట మహోగ్ర కేశి

(యశస్విని=శంభాజీప భార్య (గణోజి షిర్కె చెల్లెలు) రాజకుమారి= శివాజీ చిన్నకూతురు (గణోజి షిర్కె భార్య, శంభాజీకి చిన్నక్క) నిదాఘమర్కుడు= వేసవి కాలపు సూర్యుడు)

(అఱు=నశించు; అంధ్యము=గ్రుడ్డితనము)

ఉక్కివులకిక్కురునకుక్కు మొక్కబోవ
దిక్కఱి మరాట స్వాతంత్ర్య రుక్కుకగ్గె ॥ 2069

ఉ॥ నమ్మిన నేలవిచ్చి తన నడ్డునకుంపడబోవచేయునం
చుమ్మది నెంచునే యెవరునున్ భువిపైన - విధాత చేతలం
దుమ్మిళితమ్ముగౌ నొక యనూహ్యా విధమ్మిది - విజ్ఞులజ్ఞులే
కమ్మగు మాయఖేలనము-కట్టకడన్ గెలుపా "విధాత" దే ॥ 2070

వీర శంభాజీ - కవికలశుల ప్రగాఢ మైత్రీ బంధము

శా॥ వేద ప్రోక్త విధానుసారముగ దేవీ పూజలంజేయుచున్
భూదేవుండు "కలశ్" త్రిశుద్ధిగను శంభూజీ శుభాకాంక్షియై
దాదాపన్నిరణమ్ము లందు కుడి దోస్తస్సంభమ్మునై శంభుకున్
తాదోర్వీర్యము చూపె శత్రులకు ప్రత్యక్షార్కి రూపుండునై ॥ 2071

తే॥గీ॥ అట్టివానిని 'కలశు' బ్రాహ్మణ వరేణ్యు
ద్రోహిగా చిత్రణము చేయు తుచ్ఛతకును
కొందరతగులు దిగజారి నందువలన
మాయునే! ఆ - మహాత్యాగి మహిత చరిత ॥ 2072

చ॥ బ్రదికిన 'శంభు'తోనె యగు - పంచత నొందిన వానితోనె - యే
'భిద' యును మాకు లేదనుచు వెల్లడి చేసె 'కలశ్' జగత్తుకున్
బ్రదికిన యన్నినాళ్ళు యెడబాయగ లేదొకనాడు - శంభునిన్
తుదకవురంగజేబ్ కసికి త్రుంగుట యయ్యెను శంభుతోడనే ॥ 2073

కం॥ కవి "కలశు"డు "కలుషు"ండని
వివర మెఱుగకుండ పలుకు వీఱిడులున్నన్
భువి నిజమెప్పటికైనను
ఇవము తొలగ సవితవెలుగు నెసపస నెసగున్ ॥ 2074

(ఉక్కు=మరణించు; కేశి=సింహము; ఉక్కివులు=వంచకులు; కిక్కురు=మోసము; అఱు=నశించు, రుక్కు=కాంతి, కగ్గు=తగ్గు) (అర్కి=యముడు) (వీఱిడి=అవివేకి; ఇవము=మంచు; సవిత=సూర్యుడు; ఎస=విధము; పస=కాంతి; ఎసగు=అతిశయించు)

తే॥గీ॥ కలిసి పోయిరి "శంభుజీ" కవి కలశులు
ఖ్యాతులౌ నరనారాయణాఖ్యులట్లు
వారు ధ్రువతారలై వెల్గువారె సతము
భరతదేశ చరిత్రాభ్రపథము నందు ॥ 2075

నిరాధారమైన అపోహలతో 'ఔరంగజేబు' 'శంభాజీ'పై కక్ష పెంచుకొని శిక్షింప బూనుట

చ॥ తన జనయిత్రి సంస్థితికి తావు – పవిత్ర సమాధి నేర్పరిం
చిన పరిపూత భూమి – మనసెప్డు "ప్రసత్వరి" దివ్య సంస్మృతిన్
మనన మొనర్ప పొంగు కడు నర్మిలి–నార్తిని క్రుంగు–నట్టి యూ
రిని బురుహాన్పురిన్సిరి హరింపగ–పాదుష యల్గె శంభుపై ॥ 2076

చ॥ తన కడగొట్టుపట్టి "సులతానిక ఢిల్లికి తానె" యంచును
న్జనకుడటంచు సైతము తనన్గణియింపక రేగు – 'నక్బరున్'
నెనరున నండ జేర్చుకుని నెయ్యము చూపుచు "దుర్గదాసుడున్"
తనను పదచ్యుతున్ సలుపు – దారి ప్రబోధము చేసె వానికిన్॥ 2077

చ॥ వానికి ప్రాపునీయ తన పాలుగ శంభుజి యొప్పెనన్న యా
వైనము "బాద్షా" తానెటిగె – వార్తను చారులు చేరవేయగన్
కాని "యసత్యవార్త"యది – కాదని చెప్పక, దుర్గదాసు య
వ్వానినితోడుకొంచు తన ప్రాంతముంజేరగ, మంచె శంభుజీ ॥ 2078

చ॥ తన ప్రసవిత్రి చిత్యమును స్థాపన చేసిన పూత భూమి "బు
ర్హానుపురి" సంపదల్ యొడిచి, యాకయెఱుంగక నిర్భయమ్ముగా
చనిన మరాట మేటి యువ శంభుని సాహసవృత్తి – పాదుషా
కనియె–నవోదితైణ శిశుకమ్ములగంతులు చూచు దువ్వటుల్॥ 2079

మ॥ మొదలే శంభునిపైన కోపమున నామూలాగ్రమ్ముగా పాదుషా
సొదయై మండగ నగ్ని నాజ్యమటు తత్సూనుండునౌ "యక్బరే"

సంస్థితి=మరణము (ప్రసవిత్రి=తల్లి; చిత్యము=సమాధి; ఒడుచు=దోచు; ఆక=ఆటంకము; ఏణ శిశుకము=జింకపిల్ల; దువ్వ=పులి) (కొల్పు=ప్రేరేపించు) మంచు=ఆదరించు.

పదవీ విచ్యుతుచేసియున్తనను, తా "బాద్షా" పదమ్మందగా
కదిలెన్మందు కటంచు తావినియె-దుర్గాదాసు తోడ్పాటిడన్॥ 2080

శా॥ "షాజాదక్బరు" దుర్గదాసులటుపై సాహాయ్య మర్థించి, శం
భాజి న్వాదుషపైన యాజియొనరింపంగొల్ప "బాద్షా" వినె
న్వాజన్మాంతము కుట్రలన్ సలిపియే యౌరంగజేబింత వా
డై - జిహ్వారద పీఠమెక్కె - 'హనుమానగ్రమ్మునన్ గంతులా'?॥ 2081

మ॥ వెలిపోరన్ యవురంగజేబు పయి సంవిత్క్రీడయన్నన్ శిఖిన్
శలభమ్ముల్ వడిదూకి దోరు టనుచున్ శంభాజి యావంతయున్
వలనున్నీయగ లేదు సాయపడగా - బాద్షాకు ఆ వార్తయే
తెలియన్ వీలును లేమి-శంభుజిని నిందించెన్ కసిన్ పాదుషా॥ 2082

శా॥ ఆనాడే స్థిరనిర్ణయమ్ము చేసికొనెనా యౌరంగజేబల్కతో
తానెట్లైనను శంభుజీనిక తలెత్తంజేయ నీకన్ దశా
శానిర్బంధము చేసి - యాతని పరిస్పందమ్ము నర్థాశకున్
లోనుంజేయుచు సొన్నమున్గురిసి-శంభున్బంధితున్జేయగన్॥ 2083

శా॥ స్వాతంత్ర్యమ్మును కోరుటే ప్రథమ దోషమ్మౌను, "బాద్షా" తనూ
జాతుండక్బరు కాశ్రయమ్మిడుట నక్షమ్యద్వితీయాత్యయం
బౌ, తేజాసనమెక్కి "ఛత్రపతిగా" పట్టాభిషిక్తాంగుడై
చేత న్బూనుట రాజదండమది యాక్షేపించుటౌ పాదుషన్॥ 2084

ఉ॥ రమ్మని పిల్వలేదెపుడు రమ్ము "మరాటక"టంచు "నక్బరున్"
నెమ్మిని "దుర్గదాసు" తననెక్కొలుపన్పదవీ ప్రలోభత
న్నమ్మొగలు క్షితీశసుతు "దక్బరు" తానయివచ్చె - శంభు సా
యమ్మునుగోరఁ శంభుడెఱుగయ్యది మృత్యువుతోడ క్రీడగా ॥ 2085

కొల్పు=ప్రేరేపించు (జిహ్వారదము=నెమలి; హనుమాన్+అగ్రము=ఆంజనేయుని ముందు)

(దశాశలు=పదిదిక్కులు; సొన్నము=బంగారము; పరిస్పందము=అనుచర వర్గము)

(అత్యయము=అపరాధము; తేజము=బంగారు; ఆక్షేపించుట=తిరస్కరించుట)

చ॥ తలపున గూడలేని యొక తప్పును మోపెను శంభుపైన - వెం
గలియయి యాత్మజాతుడె తనన్నెదురన్నవిమృశ్యకారియై
ఖలుడవురంగజేబు దొసగంతయు శంభుని దంచు - కచ్చతో
వలలను పన్నె శంభుని నిబంధితుఁజేయ - విషాహిబుద్ధియై ॥ 2086

ఉ॥ చేయని తప్పులే తనకు శిక్షగమారెను బాల్య మాదిగా
స్వాయతనమ్మునన్, బయల నందరు శత్రులె - సత్య శీలతే
పాయని పాపమై తనను బాముల పాలొనరింప - జీవితా
ఖ్యాయిక శంభుకయ్యెను-యకాంతము ముప్పది రెండు నేండ్లకే॥ 2087

ఆ॥వె॥ నీటి చుక్కలెన్ని యేటఁ గలసిన గాని
ముత్యమగుచు యొకటి భూష యగును
మఱపు రాని పోటు మగలు - మహారాష్ట్ర
చరితయందు - "శివజి" - "శంభుజీ"లె ॥ 2088

అనుబంధం - 1

సర్వ సైన్యాధిపతి శ్రీ ప్రతాపరావు గుజర్

(క్రీ.శ.1615 - 1674)

తే॥గీ॥ శ్రీ శివాజీ స్వరాజ్య సుస్థిరత కొరకు
పోరులందు శౌటీర్యవిస్ఫూర్తిఁ జూపి
ఛత్రపతి నుండి వేవేల శ్లాఘనములు
గొన్న దణియౌ ప్రతాపరావ్ గుజరు ద్యుమణి ॥ 2089

మ॥ ఖలుడా "యాదిలుషా పడాలు" బహలోల్ఖానుండు" "సాల్హేరుగడ్"
యలవోకంగొననెంచి ముట్టడిని వేయ న్భీకరాజి న్రిపున్
మలపన్, ఖానుడు లొంగిపోయి "శరణమ్మన్నన్ "ప్రతాప్రావ్‌గుజర్"
నులిమెన్ పొమ్మని-శ్రీ శివాజి కిది యెంతో క్రోధమూలమ్ముగాన్॥ 2090

(ఆఖ్యాయిక=చరిత్ర; అకము=దుఃఖము; కడముట్టు=ముగియు)
(మలపు=ఓడించు; నులుము=వదలివేయు (పింగళి సూరనగారి ప్రయోగము)

తే॥గీ॥ సత్వరమె "ప్రతాప దణి"కి జాబు పంపె
"చేత చిక్కిన రిపుని త్యజించుటెపుడు
నాత్మహత్యా సదృశమగు" ననుచు తెలిపి
వడిగ "బహలోలు ఖానుని" పట్టమనుచు" ॥ 2091

చ॥ విడువఁదనప్రతాపదణి వీకను, బెబ్బులి నోటి కండజా
రెడు విధి స్వేచ్ఛనొందియు - స్మరింపక దానిని "ఖాను" సేనతో
నడుముకొనెన్ "నెసారి" కడ నాజి నొనర్ప మరాట వారితో
వడిగ "ప్రతాపరావు" దళవాయియు-నాయిత మయ్యె పోరికిన్॥ 2092

కం॥ తనసేన "నూట్లై"కాగా
గణింప 'బహ్లోలు ఖాను' కటకము వేలౌ
యనుగలము గాని సంఖ్యను
నని సేయుట యాత్మ హత్య యగుట నెఱిగియున్ ॥ 2093

ఉ॥ కేవల మార్గురే భటులు క్రేవల రా-నసిదూసి "శ్రీ ప్రతాప్
రావుగుజర్" రణావనిఁజొఱన్ - మిగిలున్న మరాట సైనికుల్
గావుగొనంగ దూకిరి మొగల్పరి నైనను యల్ప సంఖ్యలే
కావున వారి శౌర్యమటె కాకుగ, 'నగ్ని-త్రిశంకు' న్యాయమై॥ 2094

మ॥ వీరుండైన 'ప్రతాపరావు గుజరా'భీలాజి రంగమ్మునన్
వీరస్వర్గతుడయ్యెనన్న యుబుసున్విన్నట్టి మారాట భూ
దారుండా శివజీ యొకింత తడవత్యాశ్చర్య స్తంభీకృత
స్మారుండై - తెలివొంది డెందమతి నిష్టాపమ్ముతో-డిందగన్ ॥ 2095

మ॥ ఆవేశమ్మున మందలించితతడిట్లొటన్ స్వపమ్మందునున్
భావింపంగనె లేదు - భీకర సమిత్పార్థుండు - మాయీ "ప్రతా

(వీక=ఔదార్యము; నడుముకొను=సిద్ధపడు) ఉబుసు=వార్త
(కటకము=సేన; అనుగలము=సమానము)
(పఱి=సైన్యము, అఱు=నశించు; కాకు=వృథా; త్రిశంకు=మిడుత)
(స్తంభీకృతము=స్పందింపకుండుట; స్మారము=స్పృహ; నిష్టాపము=దుఃఖము; డిందు=క్రుంగు)

పీ" వేళన్ మన మధ్య లేడనినచో యేమయ్యెడిన్ "యీమరా
టా" వర్షస్థితి నింకపై - నతని తోడన్ పోయె నా ధైర్యమున్॥ 2096

చ॥ చనిరి "మురారి" "బాజిప్రభు" - శౌర్యనిధానులు నట్లె "తానజీ"
యనుపమ వీరసింహు దమరాలయ సీమల నేల - నేడిటుల్
యనితర సాధ్య సంగరకళాపటువైన "ప్రతాపరావ్ గుజర్"
ప్రణిధియునయ్యె స్వర్పతికి భవ్యమరాట యశమ్ముచాటగన్॥ 2097

తే॥గీ॥ అనుచు శ్రీ శివాజీ ప్రభు వార్తిఁగూరె
నపుడట బహలోల్ఖానుని యాహవమున
యెదురుకొనెను మరాటాల పృతన యనుచు
వార్తవచ్చె - గెల్పు మరాట వారిదయ్యె ॥ 2098

తే॥గీ॥ దారుణ రణస్థలమున ప్రతాప రావు
మ్రందెనని యెఱిగి దఱు "లానందరావు
మోహితే", "హంస మోహితే" మొగ్గరమున
కసిమసంగిరి "బహలోలు ఖాను" నపుడు ॥ 2099

"జానకీ" "రాజారామ" పరిణయము

చ॥ అపుడు "ప్రతాపరావు" "ఋణ" మంతట నింతట తీరదంచు ఛ
త్రపతి "శివాజి" యత్తఱి "ప్రతాపుని" ముద్దుల కూతు "జానకి
న్నుపయమనమ్మునన్ తన తనూజు వధూటిగ "రాజరాము"కు
న్నుపదనొసంగి హర్షమున నుబ్బెను చూచుచు క్రొత్తకోడలిన్॥ 2100

(పృతన=సైన్యము)
(ఉపయమనము=వివాహము)

అనుబంధం - 2

సర్వసేనాధిపతి, మహావీర హంబీరరావు మోహితే

(క్రీ.శ.1630 - 1687)

శా॥ "హంసాజీ" యను మోహితేకుల సముద్రాబ్జారి – "హంబీరు"డన్
శంసన్బొందెను నైకఘోర సమరాజయ్యుండునౌ సైనికో
త్తంసుండౌటను నా పవాదము సుసార్థక్యమ్ము కాగా– సదా
సంసక్తిన్నివ, శంభుజీల గొలిచెన్ సైన్యాధి నాథుండునై ॥ 2101

సీ॥ కన్నడ భూమిపైగల "కొప్పలు" ననెడు
ప్రాంతము – బీజాపురపు ప్రభుత్వ
వశమునందున్కిచే – పన్నుల యధికార్లు
"నబ్దుల్రహీమ్ఖాను – నతని సహజు
డౌ "హుసేను మియాన" – హాలిక తతినెల్ల
భయపెట్టి బల్మి 'నంబారు' గొనుచు
కృషిక కంటకులునై – రేగు చుండగ వారి
దౌర్జన్య వృత్తిని తాళలేక ॥ 2102

తే॥గీ॥ సైరికులు శివాజీ ప్రభు శరణు గోర
వీర హంబీర రావుకు విధృతి నొసగె
'శివజి' బీజపురధికార్ల చెయ్దములను
నణప – చెచ్చెఱ "హంబీరు" డనికి పూనె ॥ 2103

చ॥ తనకు "ధనాజి జాధవు" ప్రతాప కుధాకువు – సవ్య బాహువ
ట్లనిని సహాయుడై నిలువ – నంతక తుల్యుడు నౌచు 'మోహితే'
హనన మొనర్చె "నబ్దులు మియాన"ను – హుస్సెను ఖాను న్చెఱ
న్నునిచెను – నిట్లు కొప్పలున యూఱట కల్గెను హాలికాళికిన్॥ 2104

సంసక్తి=శ్రద్ధ; (అంబారు=ధాన్యరాశి; విధృతి=ఆజ్ఞ; చెయ్దములు=దుశ్చేష్టలు)
(కుధాకువు=సూర్యుడు; ఊఱట=ఓదార్పు) శంస=పొగడ్త

మ॥ 'శివజీ' దక్షిణ దేశమున్గెలువగా చేరెన్నవాచీ భువి
న్నవనీశుండపుడా 'విలాయతికినిన్ "వ్యాంకోజి" - వైమాత్రుడౌ
'శివజీ'కిన్ - తమతండ్రి రాజ్యమును పంచీయంగ తానొప్పమిన్
బవరంబయ్యెను - నన్నదమ్ములకు-నిర్వార్యంబైన రాజ్యాశచే॥ 2105

ఉ॥ ఆరయ శ్రీ శివాజియును - నట్టులె "వ్యాంకొజి" బావలౌట - హం
బీరున కప్పు డింటరము మెక్కొనె నెట్టుల చిన్నబావతో
పోరుటయంచు - కాని తన భూపతి శ్రీ శివజీయు నౌట - యా
మేరకు భృత్యధర్మమునె మేకొని చేయుట లగ్గటంచునున్ ॥ 2106

మ॥ శివజీకిన్ దణి "మోహితే" తొలుత గెల్చెన్ పెక్కు ప్రాంతమ్ములన్
సవ౦"వృద్ధాచలమున్", "చిదంబరమును"న్, "జగ్దేవగడ్"-వెండియ
ట్టి విధిన్ "కావెరి పట్టణమ్ము", నటులౌ టీక్షించి "వ్యాంకోజి"-వే
చి, విజృంభించుచు పోరిలోగొనె శివాజీ గొన్న 'క్ష్మా'నంతయున్॥ 2107

మ॥ అది తాత్కాలికమైన యోటమియెనై హంబీర రావంతటన్
యెదతాల్మిన్ వహియించి వేచి-యనికిన్ యేవేళ పొందొందునో
తుదినట్లే యనుకూలమౌ తరుణ మందుగ్రాజిలో "వ్యాంకొజీ"
యెది తాగెల్చెనొ దానినే మరల, సాధించెన్ప్రభుందేర్చుచున్॥ 2108

వెల్లూరు కోటపై విజయము

(క్రీ.శ. 22 జూలై 1678)

శా॥ ఆపై "వెల్లురు" కోటపై నడపె సైన్యమ్మప్డు - నాదిల్ష సే
నాపాతచ్చుట దుర్గరక్షకునిగా 'యబ్దుల్ల ఖాను'ండె - నా
డా పోరాటము నందు 'మోహితె' మహొగ్రాటోపుడై రేగ - త
న్నాపంగల్గెడి వాడులేమి-తొరగెన్ ఆ కోట "హంబీరు"కున్॥ 2109

(అవాచీభువి=దక్షిణదేశము; విలాయతి=రాజ్యము; వైమాత్రుడు=సవతి తల్లి కొడుకు; బవరము=యుద్ధము; నిర్వార్యము=అపుటకు శక్యముగానిది)
(ఇంటరము=చిక్కుసమస్య; మేకొని=పూనుకొని) మెక్కొను=సంభవించు
(సవ=క్రమముగా; వెండి=మరియు)
(సేనాపాతి=దళవాయి; తొరగు=వశపడు)

వీర శంభాజీకి హంబీరరావు మోహితే సర్వసైన్యాధిపతి యగుట

(క్రీ.శ.1680)

మ॥ శివజీ స్వర్గతి వెన్క గద్దెపయి తజ్జ్యేష్ఠస్వజుండెక్కె - యో
ధవరేణ్యుండగు 'శంభుజీ' పిత పదాధ్వమ్ముందె నడ్గేయుచున్
స్తవనీయమ్ముగ పాలనమ్ము నడుపన్ - తత్సేనకధ్యక్షుడై
శివజీ నెట్టులొ - శంభుజీని యటులే సేవించె "హంబీరుడున్॥ 2110

వీర 'శంభాజీ', హంబీర రావు మోహితే బుర్హానుపూరును దోచుట

(క్రీ.శ.1681)

మ॥ 'బురుహాన్పూరు'ను కొల్లగొట్టుటకు శంభూజీకి, హంబీరుడున్
చిరికిన్ గాలివలెన్ సహాయుడయి దండెత్తంగ - ఆ యూరిని
న్నరయన్ సైన్యము స్వల్పమౌట తమకున్నడ్డంకియే లేక - దో
చిరి పట్నమ్మును నూచముట్టుగ మొగల్సేనల్ వితాకొందగన్॥ 2111

'వీర హంబీర రావు' 'రణమస్తఖాను'తో జరిగిన యుద్ధములో గాయపడుట - ఓటమి

(క్రీ.శ.1679)

మ॥ శివజీ 'జల్న' పురమ్ము కొల్లగొని వేం చేయంగ, నా దారికి
న్నవబాధ్తై రణమస్త ఖానటనసంఖ్యాకమ్ము నౌ సేనతో
కవియన్నల్పమరాట సేనకికి మార్గమ్మేమి లేకున్కి - రె
చ్చి - విరోధిన్నెదిరింప, నీల్గె దణియౌ "సిద్దోజి నింబాలుకర్" 2112

(చిరి=అగ్ని; వితాకు=భయము)

(వేంచేయు=వెడలిపోవు; అవబాధ=అడ్డగించు; యీల్గు=మరణించు)

తే॥గీ॥ మరియు నిరువేల మారాట పరియు కివ్వె
యట్టులే కొందరట బందిలైరి భటులు
పాటె "సంతాజిఘోర్పడే" పడవ విడిచి
గాయపడియె హంబీరుడా కయ్యమందు ॥ 2113

కం॥ మూడహములు జరిగిన యా
మేడెమునందు న్శివాజి మెల్లగ నెటులో
వీడుచు రణరంగమ్మును
తోడై భటులుండ రాయదుర్గము చేరెన్ ॥ 2114

మహావీర "హంబిరరావు" విజయము - వీరస్వర్గతి

('వాయ్' యుద్ధము - డిసెంబర్ 1687)

తే॥గీ॥ "షార్జఖాను" నాదిలుషహా సైన్యనేత
యయ్యు మొగలుల చేతిలో నపజితుడయి
"బాద్ష", "రుస్తుముఖాన"ను పట్టమిడగ
రెచ్చి - మారాట వారిపై కచ్చె కదరె ॥ 2115

తే॥గీ॥ "వాయి" యను మరాటారాజ్య ప్రాంతమందు
రణము జరిగెను 'హంబీరరావు' తోడ
మొగలు వారి నవ్యాయుధములు తమకట
లేమి యయ్యును, హంబీరుడే జయించె ॥ 2116

చ॥ గెలిచితి మన్నసంబర మొకింతటి సేపును లేనిదై - మరా
టులకును, శంభుజీకిని కఠోరనిజమ్మొకటగ్రదృష్టమై
నిలిచెను - సర్వసైన్యముల నేతగు 'హంబిరరావు మోహితే'
యిలిగె-ఫిరంగి గుండు కలిగించిన యాహతి చే శిరమ్ముకున్॥ 2117

(ఇరువేలు=రెండువేలు; కివ్వు=మరణించు; పడవ=యుద్ధము)
(అహము=దినము; మేడెము=యుద్ధము; రాయదుర్గము=రాయగడ్)
(కచ్చె=యుద్ధము)
(అగ్రదృష్టము=ముందర చూడబడినది; ఇలుగు=మరణించు; ఆహతి= దెబ్బ)

చ॥ తొలగె మరాట పెంపతని తోనె యటంచును కుందె శంభుడున్
చలమును తప్పి బెండువడె సైన్యము సక్రమ శిక్షణేదుటన్
దళమున యోధ సంఖ్య వెలితయ్యెను మెల్లగ నాడు నాటికిన్
వెలకును నమ్ముడై చనిరి వీరులు శాత్రవుల న్భజింపగన్॥ 2118

తారాబాయి, రాజారాముల పరిణయము

ఉ॥ జీవితమెల్ల యప్పనముఁజేసె స్వతంత్రమరాట సర్వసే
నా విభుడౌచు - శ్రీ శివజి నట్టులె శంభుని కొల్చు చుండి - యు
ద్ధావని యందె వీరగతి నందెను - "హంబిరరావుమోహితే"
యా వినుత ప్రతాపుని ఋణాపనయమ్మొద నెంచి శంభుడున్॥ 2119

కం॥ హంబీర రావు ప్రియసుత
యంబుజముఖి "తార" యనెడు నన్నుకు ననుగుం
దంబునగు "రాజరాము"న
కుంబరిణయముం బొనర్చె - కొండాడ జనుల్ ॥ 2120

తే॥గీ॥ నేడును మన "మహారాష్ట్ర" నేలపైన
ప్రధన దుర్జయులు "ప్రతాపరావు గుజరు"
"వీర హంబీరరావుల" విగ్రహములు
చూపఱ కనుదినము నవస్ఫూర్తి నొసగు ॥ 2121

(అన్ను=కన్య; తంబు=తమ్ముడు)

ధర్మవీర, మహావీర, శ్రీ శంభాజీ భోసలే మహారాజే - చేసిన ఆత్మార్పణము మరాట రాజ్యముపై ప్రత్యేకముగా భారత భూమిపై సార్వజనీనముగా కల్గించిన సాంస్కృతిక, చారిత్రక, ధార్మిక - ఔరసత్వ ప్రభావము

సీ॥ నవవర్ష పర్యాప్తమవు పాలనమ్మైన
పదిలించె హైందవ పట్టమవని
సైరిక కృషికెన్నొ సౌకర్యములు కూర్చె
పంట దిగుబడి ముబ్బడియుగాగ
స్థిరరాజ్య వృద్ధికి ధృఢ దుర్గములు నిల్పి
యరుల దౌర్జన్యము నణచి వేసె
యోటమే యెఱుగక నౌక యుద్ధమందైన
మొగలు "బాద్ష"కు గుండె దిగులునయ్యె ॥

తే॥గీ॥ "యాదిలుషహా", "కుతుబుషాహా"లాది మలక
లనుగులై తనకు సహాయ మందఁజేయ
కన్నడపు దేవరాయని బన్నపఱిచె
సిద్ది, పోర్చుగీసులకును బుద్ధి గఱపె ॥ 2122

శా॥ నౌసేనన్ పిత దీర్ఘదర్శి యగుచున్ భావించి నిర్మింపగా
వాసిన్ రాశిని పెంచె శంభు శివజీ భావాను సారమ్ముగా
నా - సాముద్రుల యందు నిష్ణులగు "మైనాకుండు", "దర్యాసరం
గా" సేనన్ నడిపించు చుండ-"దవులత్ఖానుండు" తోడ్పాటిడన్॥ 2123

మ॥ తనకున్ "జంజిర" కోట లొంగనిదియై దర్పించియున్ - కోటలో
జన సంఘమ్ము లెఱింగె "శంభుని" తరీషాగ్న్యస్త్ర ధాట్యుద్ధతిన్
మునుపట్లిప్పుడు సిద్దివారల బలమ్ముల్ గ్రామముల్, పట్నముల్
మునుముంబెట్టుచు దోచు నేరములు నిర్మూలమ్ము నయ్యెన్ తుదిన్॥ 2124

నౌ సేన=నావికా సైన్యము (తరీషము=నౌక; అగ్ని+అస్త్రము=ఫిరంగి)

మ॥ బలిమిన్ ధర్మము మార్చు వైఖరి సహింపన్నంచు తర్జించు చ
ట్టుల బల్మిన్నెవరైన స్వీయమత భ్రష్టుల్గాగ నవ్వారి నా
మలినమ్మీగుచు పూర్వధర్మమునకున్ మళ్ళింప, శాస్త్రోక్త క
ర్మలు చేయించెను వేత్తలన్ పిలిచి ధర్మత్రాతయై శంభుజీ॥ 2125

చ॥ విమతులు కూల్చినట్టివగు వేలుపుటిండ్లనె గాక - దీర్ఘకా
లము తమ బాగు, నోగు లెదలందలపోయని వారివల్ల - జీ
ర్ణములగు దేవతాయతన రాజిని బాగొనరింపఁజేసె - ధ
ర్మమునకు రక్షగూర్చనది రక్షణ చేయును తమ్మటంచునున్ ॥ 2126

చ॥ "స్వమతము మార్చుకొన్న-నతిబాధమునౌ యొక గౌరవమ్ము నీ
కమితముగా లభించును-మొగల్ప్రభు కొల్వున యంచు" చెప్పినన్
స్వమతము వీడుటన్న యది ప్రాణము వీడుటె యంచు - తండ్రి మా
ర్గము విడజాలనంచు తొణకండణు వంతయు-ధర్మ రక్షియై॥ 2127

ఉ॥ నెత్తురు కారు గాయముల నేకము లున్నను కాయమెల్లెడన్
మొత్తుచు కర్రలన్ కటిక మోగలు బంటులు మేనికండలన్
తుత్తుమురున్నొనర్చిన - కనుల్ పెకలించిన - నాల్క చెండినన్
చిత్తము నందు శంభునకు చింత స్వరాజ్య, స్వధర్మ, రక్షణే॥ 2128

ఉ॥ అంతటి "ధర్మవీరు"డటు లంతముగాగ - 'మరాట వీరు'ల
త్యంతము దుఃఖితాత్ములయి - యా - కలుషుండవురంగజేబుకా
వంత 'మరాట భూమి'యును పాల్పడ కుండగ - జీవితాంతమున్
చింతిలునట్లు చేసిరిక చేరుట; 'ఢిల్లి' దివాస్వపమ్ముగాన్ ॥ 2129

ధర్మవీర, మహావీర, "ఛత్రపతి శ్రీ శంభాజీ మహరాజే" చరిత్ర సంపూర్ణం.

ఉ॥ ఈ కృతి యాంధ్రభూజనుల కెల్లరకున్నొక మేలుకొల్పునౌ
'యేకత'యొందె భారతమహీతలికెల్లను రక్షయంచు - ధ
ర్మైక నిబద్ధ బుద్ధులయి - యార్ష ప్రబోధిత మార్గ చారులై
మేకొని నిల్పగా భరత మేదిని స్వేచ్ఛ ననశ్వరమ్ముగన్ ॥ 2130

(ఏకత=ఐక్యత) "ధర్మోరక్షతి రక్షితః

కృతికర్త ప్రవర

సీ॥ 'శ్రీవత్స' గోత్ర సుశ్రీక 'మాపస్తంభ'
సూత్ర, "కృష్ణయజు"ర్ప్రచోదితమ్ము
"నారు వేలనియోగి" యాన్వవాయిక శాఖ
"శింగరాజు" గృహప్రసిద్ధ సంజ్ఞ
మజ్జనకుడు "సుబ్రహ్మణ్యము" నిరతస
దాచారనియతు డౌదార్య ధనుడు
రామచంద్రుని వంశ రత్నము మత్ప్రస
విత్రి – "సీతారామ" వినుతశీల ॥

తే॥గీ॥ నాదు యభిద "శ్రీరామకృష్ణ ప్రసాదు"
"సింహరాజ్" యను లేఖినీ చిహ్న తోడ
వ్రాసినాడ "శంభాజి ప్రబంధ" మిపుడు
తెలుగు ప్రజ దేశ భక్తి కుత్ప్రేరకముగ ॥ 2131

మిత్ర పరామర్శ

సీ॥ పట్టుమటంచు పాతికయు పద్యములన్ కయికట్టు ముందె – న
న్గట్టి కయీసరుండని పొగడ్తలు గుప్పిన మిత్రులార! ము
న్పట్టులఁ "పంచతంత్ర" మనువాదము చేసితి పద్యప్రక్రియన్
నెట్టన "శంభు" పద్య కృతినిప్పుడు వ్రాసితి నాదరింపుడీ ॥ 2

కృతికర్త పరిచయం

పూర్తి పేరు : **శింగరాజు శ్రీ రామ కృష్ణ ప్రసాదరావు**

అమ్మ, నాన్న : **సీతారామమ్మ, సుబ్రహ్మణ్యం**

స్వగ్రామము : మేకపాడు గ్రామం, కందుకూరు (తాలూకా)
నెల్లూరు జిల్లా.

చదువు :

5వ తరగతి : వీధి బడి, మేకపాడు

7వ ఫారమ్ : జిల్లా పరిషత్ హైయ్యరు సెకండరీ స్కూలు,
కందుకూరు

ఎం.బి; బి.యస్. : కర్నూలు వైద్య కళాశాల, కర్నూలు

సాహితీ గురువులు

1) మా నాన్న గారు

2) శ్రీ పొన్నలూరు సీతారామాంజనేయమూర్తి గారు (సీతాపతి)
మా వీధిబడి పెద్దయ్య వారు

3) శ్రీమాన్ కొమాండూరి రామానుజాచార్యులు గారు
ఉభయ భాషా ప్రవీణ, తెలుగు పండిట్ (జూ)

4) అఖిలాంధ్ర పద్య గ్రంథ సందోహం.

ఏతద్గ్రంథ రచనకు ఆధార గ్రంథములు

1) హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్ (ఇంగ్లీషు) - శ్రీ జదునాధ సర్కార్
2) హిస్టరీ ఆఫ్ మరాటాస్ (ఇంగ్లీషు) - శ్రీ జి. ఎస్. సర్దేశాయ్
3) హిస్టరీ ఆఫ్ మరాటాస్ (ఇంగ్లీషు) - జేమ్స్ గ్రాంట్ డఫ్
4) శంభాజీ (ఇంగ్లీష్ నవల) - శ్రీ విశాల్ పాటిల్
5) శంభాజీ (ఇంగ్లీష్ నవల) - మేధా దేశ్‌ముఖ్ భాస్కరన్
6) అంతర్జాలం - గూగుల్ సెర్చ్, వికీ పీడియా

కృతికర్త ఇతర రచనలు

(ముద్రితములు)

1) పంచతంత్రం లో ప్రపంచతంత్రం (పద్యానువాద గ్రంథం)
2) ఆశుకవి సమ్రాట్టులు, అవధాన సార్వభౌములు
శ్రీ కొప్పరపు సోదర కవుల చరిత్ర
(లఘు వచన కృతి)

(అముద్రితములు)

1. కోదండరామ ప్రభూ (శతకం)
2. నంద నందనా (శతకం)
3. శర్వ శరణు (శతకం)
4. వేదనా జాంతవం (ఖండకావ్యం)
5. 'నారీ' శతకం
6. ముక్తక ముక్తావళి (సప్తశతి)

సహృదయ హృదయం

మరుగునపడిన మాణిక్యాన్ని వెలుగులోకి తెచ్చిన చారిత్రక కావ్యం

"వీర గాథా వాఙ్మయ విరించి"

ప్రొఫెసర్ తంగిరాల వెంకట సుబ్బారావు

యం.ఎ., పి.హెచ్.డి., (తెలుగు)

బెంగుళూరు

ఛత్రపతి శివాజీ మహారాజును గురించి తెలియని వారు లేరు. అతని జ్యేష్ఠ పుత్రుడు శంభాజీని గురించి తెలిసినవారు మిక్కిలి తక్కువ. ఆ శంభాజీని గురించిన సమగ్ర చరిత్ర ఈ చారిత్రక కావ్యంలో ఎంతో విశదంగా, చారిత్రక సంఘటనలకు ఏ విధమైన భంగమూ వాటిల్లకుండా, 2130 పద్యాలతో (నిర్వచనంగా) వ్రాయబడ్డ వీర మహాకావ్యం ఈ "ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే మహారాజే చరిత్ర". దీని రచయిత సింహరాజ్ అనే కలం పేరుగల డా॥ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు గారు గొప్ప దేశభక్తుని చరిత్రను కావ్య బద్ధం చేసిన వీరిని ముందుగా అభినందిస్తున్నాను.

చరిత్రలో ఛత్రపతి శివాజీ ఎంత గొప్పవాడో, అతని కుమారుడు శంభాజీ కూడా అంతే గొప్పవాడు. భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు, తండ్రి స్థాపించిన స్వతంత్ర హిందూ రాజ్య సుస్థిరత్వానికి ఎంతో కృషి చేసిన వాడు. కాని చరిత్ర కారులు అతని కృషిని గుర్తించలేదు. అందువల్ల చరిత్రలో శంభాజీ మరుగున పడిన మాణిక్యంగా ఉండిపోయాడు. ఆ మాణిక్యాన్ని వెలికి తీసి, మనకు చూపిన వారు కవి "సింహరాజ్" గారు.

ఈ కావ్యాన్ని కల్పిత గాధగా వ్రాయలేదు. ఎన్నో చారిత్రక గ్రంథాలను అధ్యయనంచేసి తనకన్నా పూర్వం వచ్చిన చారిత్రక వీర మహాకావ్యాలను పరిశీలించి ఈ కావ్యాన్ని నిర్మించారు. ఎంతో పకడ్ బందీగా, చారిత్రక సంఘటనలను క్రొనలాజికల్‌గా వర్ణించారు.

కన్నడ సాహిత్య సంప్రదాయంలో కావ్యాలు రెండు రకాలు. "వర్ణన ప్రధానమైనది - "వర్ణక కావ్యం". వస్తు ప్రధానమైనది "వస్తుక కావ్యం". కవిత్రయ భారతం "వస్తుక కావ్యం". పెద్దన మనుచరిత్ర "వర్ణక కావ్యం". సింహరాజ్ గారు రచించిన ఈ కావ్యం "వస్తుక కావ్యం". ఈ కన్నడ కావ్య సంప్రదాయాన్ని అనుసరించే, పూర్వకవి నన్నెచోడుడు తన కుమార సంభవ కావ్యాన్ని "వస్తు కావ్యం" అన్నాడు.

ఈ వస్తు కావ్యాలు కథా కథన ప్రధానంగా ఉంటాయి. వీటిలో వర్ణనలకు అవకాశాలు చాలా తక్కువ. వర్ణన లేనిదే కవిత్వం ఉండదు. కాని సింహరాజ్‌గారు ఆయా సందర్భాలలో అవకాశం కల్పించుకొని చక్కని వర్ణనలు చేశారు. శంభాజీ మహావీరుడే కాక, బహుభాషా పండితుడు. రసవంతమైన కావ్యాలు వ్రాసిన మహాకవి కావడంతో అతని పరంగా ఎంతో చక్కని వర్ణనలు చేశారు. శంభాజీ కర్షక పక్షపాతి అని చెపుతూ మట్టిని బంగారంగా మార్చే రైతును ఎంతో స్వభావ సుందరంగా ఒక సీసపద్యంతో వర్ణించారు. ఇలాగే అనేక వర్ణనలు చేశారు. (ఈ కావ్యంలోని సుందరమైన వర్ణనలు గురించి పండిత కవిమిత్రులు శతావధాని "శ్రీ కొండపి మురళీకృష్ణగారు తను పీఠిక "ప్రబంధ సుగంధం" లో చక్కగా వివరించారు). చిన్న తనంలో ఎన్నో కష్టాలు పడిన శంభాజీని శ్రీకృష్ణునితో పోల్చి, ఆ బాల కృష్ణలీలలను వర్ణించారు కవి.

ఈ చారిత్రక కావ్యంలో రెండు వేలకు పైగా పద్యాలున్నా ఆశ్వాస విభజన లేదు. అయినా ఈ కావ్యంలో వచ్చే అనేక సంఘటలను ఒక చక్కటి క్రమంలో ఉపశీర్షికలుగా చేసి ఇచ్చారు. ఈ ఉపశీర్షికలు 400కి పైగా ఉండడంతో పాఠకుడు మొత్తం శంభాజీ చరిత్రను సమగ్రంగా గ్రహించడానికి వీలుగా ఉంది. హిస్టరీ పుస్తకం చదివినంత స్పష్టంగా ఉంది.

క్రీ.శ. 1000లో ప్రారంభమైన గజనీ మహమ్మదు దండయాత్రలు మొదలుకొని క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణించేంత వరకు 700 సంవత్సరాల పాటు భారత దేశాన్ని ఢిల్లీ సుల్తానులు, మొఘల్ చక్రవర్తులు పాలించిన కాలంలో హిందువులు రౌరవాది నరకాలు అనుభవించారు. కొన్ని కోట్ల మంది హిందువులు చంపబడ్డారు. మరి కొన్ని కోట్ల మంది హిందువులు

మతం మార్చబడ్డారు. లక్షల కొద్దీ, కోట్ల కొద్దీ హిందూ స్త్రీలు, పిల్లలు ఆఫ్ఘనిస్థాన్‌కు ఇతర అరబ్బు దేశాలకు బానిసలుగా తీసుకుపోబడ్డారు. "రాణా ప్రతాప్ సింగ్", "ఛత్రపతి శివాజీ" మొఘల్ చక్రవర్తులను ఎదిరించారు. శివాజీ ఔరంగజేబు ప్రక్కలో బల్లెంలా తయారయ్యాడు. ఔరంగజేబు శివాజీని, బాలుడైన శంభాజీని ఆగ్రా కోటలో బంధించాడు. కాని శివాజీ చాకచక్యంగా తప్పించుకున్నాడు. శివాజీ మరణానంతరం ఛత్రపతి యైన శంభాజీపై ఔరంగజేబు కత్తికట్టి, ఆతని మంత్రులకు లంచాలుపెట్టి కపటంగా అతనిని బంధించాడు. మతం మార్చుకోమని బలవంతం చేశాడు. శంభాజీ అంగీకరించలేదు. ఔరంగజేబు హిందువుల ఎడ మహాక్రూరుడు. శంభాజీ కన్నులు పీకించాడు. చర్మం ఒలిపించాడు. చిత్రవధ చేశాడు, ముక్కలు, ముక్కలుగా నరికించాడు. చివరికి శిరశ్ఛేదం చేయించాడు - ఆ ఘోర రాక్షసుడైన ఔరంగజేబు, సిక్కులకు గురువైన తేజ్‌బహదూర్‌ను కూడా ఈ విధంగా ఔరంగజేబు మతం మార్చుకోమని నిర్బంధించి, అతడు అంగీకరించక పోవడంతో శిరశ్ఛేదం చేయించాడు. అప్పుడు తేజ్ బహదూర్ సింగ్ "శిర్‌దియా! శిర్‌నే దియా" - "శిరస్సు ఇచ్చాను కాని రహస్యం చెప్పలేదు" అన్నాడు. ఈ విధంగా హిందూ రాజ్య పరిరక్షణ, హిందూ మతం కోసం ఆత్మబలిదానం చేసిన మహావీరుడు శంభాజీ! ఈ కావ్యకర్తయైన సింహరాజ్ గారు శంభాజీని "ఆర్ష ధర్మ రక్షక" - "స్వరాజ్య వర్ధన" - " ధర్మ వీర" - "మహావీర" అని సంబోధించడం ఎంతో సముచితంగా ఉంది.

మహాభారతానికి హరి వంశం "ఖిలపురాణం" అంటారు. "ఖిలము" అంటే "గ్రంథాంతమున చేర్చబడినది" - "శేషము" అనే అర్థాలున్నాయి. ఎఱ్ఱా ప్రగడ అరణ్యపర్వ శేషాన్ని పూరించినందుకే అతనిని "కవిత్రయం"లో చేర్చలేదు. వ్యాసుని "హరివంశాన్ని"కూడా అనువదించిన మహాకవి కాబట్టి కవిత్రయంలో ఒకడైనాడు. అలాగే గడియారం వేంకట శేషశాస్త్రి 1943లో ఛత్రపతి శివాజీ చరిత్రను పద్య కావ్యంగా రచించాడు. శివాజీ పుత్రుడైన శంభాజీ చరిత్రను డా॥ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాద్ గారు పద్య కావ్యంగా రచించారు. గడియారం వారిది "శివ భారతము" - ఇది దాని ఖిల పురాణమైన "హరివంశము". ఈ విధంగా ఎఱ్ఱాప్రగడలా, (శివ) భారతాన్ని పూర్తి చేసిన

మిత్రులు "సింహరాజ్" గారిని మనసారా అభినందిస్తున్నారు.

అసలు తెలుగు సాహిత్యానికి సేవ చేసిన వారిలో తెలుగు భాషను "వృత్తిగా" పెట్టుకున్న తెలుగు పండితులు, కవులు, ఉపన్యాసకులు, ఆచార్యుల కన్నా - ఇతర వృత్తులవారు (లాయర్లు, డాక్టర్లు మొదలైనవారు) తెలుగు సాహిత్యానికి ఎక్కువ సేవచేశారు. అటువంటి వారిలో "సింహరాజ్"గారు ఒకరు. ఈ డాక్టరేమిటి? ఈ పద్య రచన ఏమిటి? ఈ ధారా శుద్ధి ఏమిటి? ఈ శైలీరమ్యత ఏమిటి? ఈ చారిత్రకత ఏమిటి? అహెూ! ఆశ్చర్యం !!

మన్ను తిన్న కృష్ణుడు నోరు తెరిచి చూపిస్తే, తల్లి యశోద పడిన సంధిగ్ధావస్థలో పడ్డాను నేను. "కలయో! వైష్ణవ మాయయో!!" అని ఆశ్చర్య పోతున్నాను . . .

బెంగుళూరు — *- ప్రొఫెసర్ తంగిరాల వెంకట సుబ్బారావు*

11-05-2023 — యం.ఎ., పి.హెచ్.డి., (తెలుగు)

1708, సీతావధానం, 11వ క్రాస్,

1" జి. మెయిన్, కెంగేరి సాటిలైట్ టౌన్,

బెంగుళూరు - 560 060.

సెల్ : 9945422742

చారిత్రక కథా కధన చాతురి

డా॥ రేవూరు అనంత పద్మనాభరావు,

యం.ఎ., పి.హెచ్.డి., (తెలుగు)

విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్

దూరదర్శన్, ఢిల్లీ.

సెల్ : 9866586805

పద్య కావ్య నిర్మాణం ఆలయ నిర్మాణంతో సమానం. ఆలయం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం వుంటుంది. ఇతివృత్త స్థాపన, అంతరాలయ నిర్మాణం మూల కథకు సొగసులు దిద్దడం. కథానాయకుని గుణగణ గాంభీర్యతను సమకూర్చి మూలవిరాట్టుగా ప్రాణ ప్రతిష్ఠ చేయడం మహాద్భుత శిల్ప చాతుర్యం. పౌరాణిక గాథల ఆధారంగా కావ్యసృష్టి నన్నయ నుండి ఆధునిక కవులు పలువురు చేశారు.

"కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము లాద్య సత్కథల్
వావిరి పుట్టు రత్నము, లవారిత సత్కవికల్పనా విభూ
షావహ పూర్వ వృత్తములు సానల దీరిన జాతిరత్నముల్".

అన్నాడు రామరాజ భూషణ కవి వసుచరిత్రలో. అట్టి జాతి రత్నాన్ని ఎన్నుకున్నాడు "సింహరాజ్".

కవి సింహరాజ్ సరస్వతీ దత్తపుత్రుడు. మహావీర శంభాజీ జీవన గమనానికి సంబంధించిన అనేకానేక చారిత్రక విషయాలను అవలోడనంచేసి సముద్రమథనానంతరం అమృతాన్ని దేవతలకు పంచిన మోహినీ దేవతవలె పాఠక దేవుళ్ళకు సారస్వతామృతాన్ని పంచాడు. చారిత్రక రచన కష్టము, క్లిష్టము. వెయ్యేండ్ల తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక కాలం వరకు ఎవ్వరూ ఆ పనికి పూనుకోలేదు. రఘునాథ చరిత్ర వంటి కొన్ని కృతులు యాదృచ్ఛికంగా కన్పిస్తాయి, దక్షిణాంధ్ర యుగ సాహిత్యంలో.

శ్రీ ప్రసాదరావు సూచించిన 25 ఆధునిక కావ్యాలలో పెక్కింటిని నేను ఆమూలాగ్రంగా చదివి ఆస్వాదించాను. శివభారతము, రాణా ప్రతాప

సింహ చరిత్ర, రాయలసీమ మహాకవులందించిన అద్భుత కావ్యాలు, శివాజీ తనయుడైన శంభాజీని గూర్చి చాలమందికి తెలియదు. ఆయనను ఎవరూ కథానాయకుడుగా చిత్రించలేదు.

గాథ పరిశోధన : చారిత్రకాంశాలను ఒక చోట గుదిగుచ్చడానికి ఎంతో పరిశ్రమ కావాలి. ప్రసాదరావు పారిశ్రామికుడు. సూక్ష్మాంశాలనుకూడా వదలిపెట్టలేదు. ఈ బృహత్ కావ్య నిర్మాణానికి ఆయన విశేష కృషిచేశాడు. మరాఠా వ్యక్తుల నామాలు, ప్రదేశాలు, ఛందో నియమాలకు ఇమడవు. కవితా సర్కస్‌లో, సింహంనోట్లో చేయి పెట్టిన గడుసరి ఈ సింహరాజ్, ధిషణాహంకార చాంద్రీమయమూర్తి.

ప్రామాణిక గ్రంథాలను పరిశోధించి, పరిశీలించి, పరీక్షించి భావి తరాలకు పరిరక్షించే గురుతర బాధ్యతను ఈ కవి తలకెత్తుకున్నాడు. కృష్ణుడి కథో, రాముడి కథో చెప్పడానికి ఆ శ్రమ అక్కరలేదు. ఆంగ్లంలో చరిత్రకారులు రచించిన హిస్టరీ ఆఫ్ ఔరంగజేబ్, హిస్టరీ ఆఫ్ మరాఠాస్, "సర్దేశాయ్", "జేమ్సుగ్రాంట్‌డఫ్"ని గ్రంథాలను అవలోడనం చేసి సింహరాజ్ అద్భుత కావ్య శిల్పాన్ని నిర్మించారు. 108 అడుగుల ఎత్తుగల శంభాజీ "కవితా విగ్రహాన్ని" తెలుగు సాహిత్య నందనోద్యానంలో ప్రతిష్ఠించిన ధీశాలి ప్రసాదరావు.

పద్యపద వైచిత్రి : వనంలో సింహం మృగరాజు. కవితా వనంలో సింహరాజ్ కవిరాజు. సింహరాజ్ పద్యం అశ్వధాటితో కదనుత్రొక్కుతూ ముందుకు సాగుతుంది. అహమహమికతో పదాలు దొర్లిపోతాయి. ఇతివృత్త నిర్వహణకు ఛందోరీతులు వొదిగి పోతాయి. పద్యాలు ఉదాహృతులుగా చూపి నా వాచాలత్వాన్ని ప్రకటించు కోదలచుకోలేదు. ద్విసహస్రాధిక పద్యములతో నిర్వచనంగా కథను కదం తొక్కించడం కత్తి మీద సాము.

యశోమూర్తి "యశూబాయి" : మరాఠా వీర పత్ని యశూబాయి శంభాజీ ధర్మపత్ని. భర్తకు హితవు పలికి ఒక్కసారి ఆలోచించి ముందుకు సాగమంది. అదే భర్త కడచూపు అని ఊహించలేదు. "బాధ్న అన్ని వైపుల కదు గట్టి కాపుదల పొందిక చేసెను మిమ్ముపట్టగా, తలమొకొ! ఈ అపాయమును తప్పుకొనన్ ఇపుడంత చుల్కగా, నిలచి తలంచు డొక్క పరినేని" అని ముక్త సరిగా మూడు ముక్కలలో భర్తకు కర్తవ్య బోధ చేసింది. అశ్రు పూరిత

నయనాలతో భర్తకు వీడ్కోలు పలికిన వీర పత్ని ఆమె. మగువ మాంచాల గుర్తుకు వచ్చే సున్నిత సన్నివేశమది.

కథా కథన చక్రవర్తి : కథ చారిత్రకం. ఇతివృత్తం నూతనం. పాఠకుడు ఏమరుపాటులో వుంటే కథా సూత్రం పట్టు తప్పుతుంది. దీర్ఘ కావ్య రచనా ధురీణులు తక్కువైన ఆధునిక కాలంలో ప్రసాదరావు సాహసమే చేశాడు. శివాజీ ఎంతటి ఘనుడో, అతని కుమారుడు శంభాజీ కూడా అంతే ఘనుడని "డడాండ డాండ నినదంబులతో" ఎలుగెత్తి చాటాడు కవి. రామణీయకతతో బాటు ప్రామాణికతకు ప్రాధాన్యమిచ్చి నేర్పరియైన రౌతు కదనరంగంలో అశ్వాన్ని నడిపినట్లు ఛందో గతులను పరవళ్ళు తొక్కించాడు. భవిష్యత్తు తరాలకు శంభాజీని ఆదర్శప్రాయం చేసిన విద్వత్కవి సింహరాజ్ - యశో సింహరాజ్.

మాతృ దినోత్సవం — ***డా॥ ఆర్. అనంత పద్మనాభరావు***
హైదరాబాదు.

వౌషట్

డా॥ బేతవోలు రామ బ్రహ్మం, యం.ఎ.పి.హెచ్.డి.,(సంస్కృతం)
వ్యాకరణ విద్యా వారిధి,
విశాఖపట్టణం, సెల్ : 9848169769

శతకంబులు ఖండికలును
కతిపయ శత పద్య కలిత కావ్యంబులునున్
మతిమంతులు కసిగాటుల
గతికెడు నెద్దడి యలమిన కాలమునందున్॥

సాహితీ సమరాంగణ సార్వభౌము
చరిత చతురధిక సహస్ర సంఖ్య నలరు
పద్యకావ్యంబు నాపోవ వ్రాసి యొసగె
నిన్న మొవ్వ వృషాద్రి పతన్న సుకవి ॥

అట్టిదేయైన కవితా మహత్త్వదీప్తి
ఛత్రపతి భోసలే గాథ సంతరించి
రెండు వేల పద్దెములపై నుండు కృతిని
జేసి సింహరాజు చరిత్ర సృష్టిజేసె ॥

కవితా సృష్టికి ముడిసరు
కవు ప్రతిభగలిగి సరిపడగా పాండితి వై
భవము గలిగి యభ్యాసము
హావణించిన సింహరాజు కభినందనముల్ ॥

కవనమందు ప్రౌఢిమ, కథా కథనమందు
చారిమ, చతుర మధుర భాషణము లందు
నవరసోద్గారిమ, సమాస నైక ఘటన
ధీరమ, పొసగె సింహరాజ్గారి కృతిని ॥

ఉన్న పళముగ నీ ఫక్కినున్న గుణము
లెల్ల నేకర్వు పెట్టలే రెవరు గాని,
సాభినందన వందన చందన మిది
నిలుకడగ దీని పఠియించి పలుకరింతు ॥

ఒక నిశ్చల ప్రవాహం

డా॥ సూరం శ్రీనివాసులు, ఎమ్.ఎ., పి.హెచ్.డి., (సంస్కృతం)
శతావధాని.

భరతభూమి చిన్న చిన్న రాజ్యాలుగా భిన్న భిన్న రాజుల ఏలుబడిలో వున్న నాటినుండి కూడా స్వధర్మం మీద ఆసక్తితో, అనురక్తితో నిండి వున్నది. మన చారిత్రక పురుషులైనా ధర్మమూర్తిమత్వానికి పట్టం గట్టినవారే. మనమెరిగిన సన్నిహిత భూతకాలంలో ఒక శివాజీ, ఒక రాణా ప్రతాప్, ఒక ఝాన్సీ లక్ష్మీబాయి, ఒక సీతారామరాజు దేశంలోని విభిన్న ప్రాంతాలలో ఉద్భవించి, ఉద్యమించి స్వధర్మ ప్రతిష్ఠాపనకు నడుం కట్టినవారే. అటువంటి వారి జీవితం చరిత్రకు సాక్ష్యంగా, అప్పటికి ఆటగా, భవిష్యత్తుకు బాటగా నిలిచి జాతి నిర్మాణంలో పాలు పంచుకుంటున్నాయి. అటువంటి వారిలో మరొక ధర్మవీరుడు ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే. జగత్ప్రసిద్ధుడైన ఛత్రపతి శివాజీకి పెద్ద కొడుకై, తండ్రి బాటలోనే నడిచి ధర్మవీరతకు నిలువెత్తు రూపమై నిలిచిన వాడు. ఈ కావ్యం ముగింపులో ఆయన గురించి కవి పలికిన మాటలు –

> "నెత్తురు గారు గాయములనేకము లున్నను కాయమెల్లెడన్
> మొత్తుచు కత్రలన్ కటిక మోగలు బంటులు మేని కండలన్
> తుత్తుమురున్నొనర్చిన కనుల్‌పెకలించిన నాల్క చెండినన్
> చిత్తము నందు శంభునకు చింత స్వరాజ్య, స్వధర్మ రక్షయే."

అదీ వ్యక్తిత్వం. ప్రాణాలు విలవిలలాడుతున్నా ధర్మాన్ని గురించియే ఆలోచించ గలగటం "ధర్మవీర" లక్షణం.

స్వరాజ్య స్వధర్మ రక్షణను గమ్యంగా భావించిన శంభాజీ భోసలే జీవితాన్ని ప్రబంధీకరించినవారు శ్రీ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు గారు. 'సింహరాజ్' వీరి కలం పేరు. నెల్లూరులో కవిలోకానికి సన్నిహితులు, ఆత్మీయులు, హితాభికాంక్షులు అయిన ప్రసాదరావుగారు వృత్తి రీత్యా వైద్యులు.

స్వదేశంలోనే కాక విదేశాలలో కూడా వైద్య సేవలందించిన డాక్టరు గారు భిన్న సంస్కృతులను, భిన్న చరిత్రలను అధ్యయనం చేశారు. చారిత్రక సాంస్కృతిక విషయాలపై అభిరుచి, సునిశితమైన అధ్యయనశీలత గలవారు. అటువంటి అధ్యయన ఫలితమే ప్రకృత పద్య ప్రబంధం.

మృదువుగా, సూటిగా, స్పష్టంగా కనిపించే వ్యవహారశైలీ, ప్రవృత్తీ డాక్టరుగారిది. అవే లక్షణాలు వీరి కవితాశైలిలోనూ కనిపిస్తాయి. నిరాడంబరంగా, సూటిగా ఒక చారిత్రక కథా ప్రబంధానికి తగిన విధంగా, వర్ణనాత్మకంగా కాక కథాకథనాత్మకంగా, ఈ ప్రబంధ శైలి అలరారుతోంది. కథా విషయానికి సంబంధించి ప్రతి స్వల్ప విషయాన్నీ ప్రత్యేక శీర్షికతో తెలియబరుస్తూ, వాటికి సుందరమైన పద్యరూపాన్ని ఇవ్వడం ఈ ప్రబంధ రచనా ప్రణాళిక. ఇది పాఠకులకు అత్యంతమూ అవసరమైన ప్రణాళిక. చారిత్రక కావ్యాలలో చాలా చోట్ల ఇటువంటి స్పష్టత కొరవడి, పాఠకుడిని అయోమయానికి గురిచేస్తున్నాయి. కాని ఈ కావ్యంలో కవి డాక్టరు కాబట్టి, పాఠకుల నాడిని ఒడిసిపట్టి, అవసరమైన వైద్యాన్ని ఈ రచనారూపంలో అందించారు.

చారిత్రక కథాకావ్యం కాబట్టి పద్యరచన కేవలం ఆలంకారికంగా కాక వాస్తవిక దృక్పథంతో సాగిపోతుంది. ఆ కారణంగా నిశ్చల ప్రవాహంగా కనిపిస్తాయి పద్యాలు. హృదయానికి సూటిగా హత్తుకుంటాయి.

చారిత్రక కావ్యాల మణిహారంలో మరో మంచి ముత్యం జతపడటం తెలుగు పాఠకులకు ఒక చారిత్రక యోగం. డాక్టరుగారిని మనసారా అభినందిస్తూ...

డా॥ సూరం శ్రీనివాసులు

ఎం.ఏ.,పి.హెచ్.డి.,

ఉభయ భాషా వాఙ్మయ పయోనిధి

పద్య జలపాతం

డా॥ నరాల రామారెడ్డి
హంస పురస్కార గ్రహీత
ప్రముఖ అవధాన కవి

"సింహరాజ్" గా ప్రసిద్ధి వహించిన శ్రీ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాద రావుగారు రచించిన "శంభాజీ పద్య ప్రబంధం" అందుకొన్నాను. అంతరంగం నిండా ఆనందం నింపుకొన్నాను.

ఛత్రపతి శివాజీ గారి కుమారుడైన ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలేను కథానాయకునిగా ఎన్నుకొని 386 ఘట్టాలతో రెండు వేలకు పైగా పద్యాలతో శంభాజీ పద్య ప్రబంధంగా తీర్చిదిద్దిన సింహరాజ్ గారిని హార్దికంగా అభినంది స్తున్నాను.

సింహరాజ్ గారు చెప్పినట్లు ఆంధ్రసాహిత్యంలో దేశభక్తులైన వీరాగ్రేసరుల చరిత్రను గూర్చి ఎన్నో కావ్యాలు వచ్చాయి. ఆంధ్ర పురాణం, రాణా ప్రతాప చరిత్ర, శ్రీ శివభారతం మొదలైన వీరరస ప్రధానమైన కావ్యాలు దాదాపు 25 దాకా వున్నాయి.

"శంభాజీ మహారాజు చరిత్ర" రచన పద్య ప్రబంధంగా ఎందుకు రచింప వలసి వచ్చిందో సింహరాజ్ గారు వివరించారు. మహాకవి గడియారం వేంకట శేషశాస్త్రిగారి శివభారతం ప్రసాదించిన స్ఫూర్తితో తండ్రిని మించిన మహా వీరుడు శ్రీ శంభాజీ చరిత్రను పద్యప్రబంధంగా రచించి ఆంధ్రులకు అపురూప మైన కానుకగా అందివ్వాలని సంకల్పించిన సింహరాజ్‌గారు కృతకృత్యులయ్యారు.

శంభాజీ పద్య ప్రబంధంలో సింహరాజ్ గారు సరళమైన, మృదులమైన శైలిలో రచించిన పద్యాలను ప్రశంసించాలంటే వారు చెప్పిన పద్యమే స్వీకరింపవచ్చు.

ఉ॥ వైరుల యంపగాతలకు, బల్లెపు పోట్లకు, కత్తి వ్రేట్లకున్
జీరుకులేక రక్తమున జీర్వియునుంగగ, శత్రుసేనపై
మీరుచు దేశరక్షణకు మేనును, ప్రాణములొడ్డి పోరు - ఆ
వీరులు చేయునట్టి రిపు భీకర నాదము లాంధ్ర పద్యముల్ ॥

- నరాల రామారెడ్డి.

శంభాజీ పద్య ప్రబంధం - ఒక ప్రశంస

డా॥ సి. వి. రామచంద్ర రావు,
యం.ఎ., పి.హెచ్.డి., (హిస్టరీ)
చారిత్రక గ్రంథకర్త, ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులు
అమూల్య గ్రంథ ప్రకాశకులు.

1) తెలుగు పాఠకులలో చాలామందికి శంభాజీ చరిత్రను గూర్చి ఏమీ తెలియదు. "శంభాజీ పద్య ప్రబంధం" మహా ప్రబంధం. 'ధర్మవీరుడు', 'మహా వీరుడు' అయిన శంభాజీని గూర్చి తెలుగు పాఠకులు తెలుసుకొనుటకు చక్కటి అవకాశము కల్పించుచున్నది.

2) అలతి, అలతి తెలుగు పదములతో, సంస్కృత భూయిష్ఠ సమాసములతో పద్యములను రమ్యముగా వ్రాయగల సవ్యసాచి "సింహరాజ్" గారు.

3) వివిధ ఘట్టములకు వీరు సమకూర్చిన శీర్షికలు, పాఠ సూచికలు, పాఠకుడు పద్యములను సులభముగా అర్థము చేసుకొనుటకు తోడ్పడుచున్నవి.

4) "శంభాజీ పద్య ప్రబంధం" మహా ప్రబంధం. శంభాజీ చరిత్ర మీద వీరు చేసిన సునిశిత పరిశోధనకు, అధ్యయనానికి దర్పణముగా ఉన్నది.

5) వీరు ఆంధ్ర భాషలో మహా వీరుల చరిత్రపైన కావ్యములను రచించిన మహాకవులను, కవులను పేర్కొనుచున్నారు (పుట 25). "శంభాజీ పద్య ప్రబంధం వీరి ప్రక్కన వీరికి సుస్థిరమైన స్థానము కల్పించుతున్నది. ఆధునిక ఆంధ్ర కవుల చరిత్రలో ఆంధ్రకవులు, చరిత్రలో ఒక మహా ప్రబంధ రచయితగా "శంభాజీ పద్య ప్రబంధం" శాశ్వతమయిన స్థానమును వీరికి సమకూర్చుతుంది.

అభినందనలతో . . .

మీ,

డా॥ సి. వి. రామచంద్రరావు

మట్టిలో మాణిక్యాలు

డా॥ సి. వసుంధర,

ఎమ్.ఎ., పి.హెచ్.డి. (తెలుగు)

చెన్నై.

గొప్ప విషయాలను, వ్యక్తులను గూర్చి వ్రాయడం, మాట్లాడడం అందరికీ ఆమోదమే. కాని ఎనలేని శక్తి సామర్థ్యాలు, మానవత్వం మొదలైనవి ఉన్నప్పటికీ ప్రజా హృదయాలను తాకని, పేరుకూడా వినిపించని వారు ఎందరో ఉన్నారు. అలాంటి వారిని చరిత్ర పొరలలో నుండి బయటకు తీసి పదుగురికి పరిచయం చేసిన వారే నిజమైన చరిత్రకారులని చెప్పవచ్చు. అట్టి శ్రమకోర్చి మన దేశ చరిత్రలో మరుగున పడివున్న అత్యంత విలువైన మాణిక్యాన్ని ఆంధ్రు లందరికి పద్య ప్రబంధ రూపంలో అందించిన సింగరాజు రామకృష్ణ ప్రసాదు రావు (సింహరాజ్) గారు ధన్యులు.

సింహరాజ్ గారు బహుభాషా కోవిదులు. తెలుగు భాషపై మంచి పట్టున్న వారు. వీరు రాసిన ప్రస్తుత గ్రంథం మహారాష్ట్రలో అఖండ ఖ్యాతి గల్గినవాడు, మహా వీరుడు అయిన ఛత్రపతి శివాజీ యొక్క కుమారుడైన "ఆర్ష ధర్మ రక్షక", "స్వరాజ్య వర్ధన", "విద్వత్కవి" ధర్మవీర, మహావీర "ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే మహారాజ్ చరిత్ర". విచిత్ర మేమిటంటే శివాజీని తెలియని వారు లేరు. శంభాజీ భోసలేను తెలిసిన వారు లేరు. అతని శక్తి సామర్థ్యాలను గూర్చి అతనికున్న బిరుదాలు చదివితే, పేద కర్షక, కార్మిక వర్గ ప్రజల పట్ల అతను చూపించిన దయ, అందుకై శంభాజీ అధికారులను, చివరకు తండ్రిని గూడా ఎదిరించి పోరాడడమే ఆయన చేసిన నేరం అన్నది సారాంశం. అందుకు ఆయన ఆవేశం తోడై ప్రతి పక్షాల వారి కుట్రకు బలియై ఔరంగజేబు చేత చంపబడ్డాడు. బాగా ఆలోచిస్తే అతను చేసిన తప్పు ఏంటి? చరిత్ర కారులందరూ ఆయన పట్ల మౌనం వహించారు !.

శంభాజీ గొప్ప వీరుడు, తన ఎనిమిదవ యేటనే రాజా జయసింగ్ నేతృత్వంలో కొన్ని వేల గుర్రాలకు మన్సబుదారుగా నియమింప బడ్డాడు.

రాజ్యం చేసింది తొమ్మిది సంవత్సరాలే అయినా రాజ్యాభివృద్ధికి పాటుబడ్డాడు. ఇటువంటి వ్యక్తిని గూర్చి మన దేశంలో ఎవరికీ తెలియక పోవడం దురదృష్ట కరం. ఆ కొరత తీర్చడానికే మన సింహరాజ్ గారు ఆయన (శంభాజీ) జీవిత చరిత్ర చదివి, అల్లూరి సీతారామరాజు వంటి ఒక విప్లవ వీరుణ్ణి మనసుకు తెచ్చుకున్నారు. ఇప్పుడూ, ఎప్పుడూ జరిగేది అధికార దుర్వినియోగమే. దానిని ఎదిరిస్తే ధనిక వర్గం సహించదు. శివాజీ కుమారుడై మంచి కోసం పోరాడిన ఆ యోధుని చరిత్ర ఆ శారదాదేవి ఆశీస్సులతో సింహరాజ్ గారు తన భాష – ముఖ్యంగా తెలుగు భాషా పటిమనంతా ఉపయోగించి అత్యంత సులభ శైలిలో రాయడానికి ప్రయత్నించి కృతకృత్యులయ్యారు. అవసరమైన చోట అర్ధ వివరణ, అలాగే ఉప శీర్షికలు 411గా రాసి పాఠకునికి కథ అర్థం కావడానికి అవకాశం కల్పించారు.

వారి రచన నుండి రుచికి ఒక పద్యం –

తన రెండవ యేటనే కన్న తల్లికి దూరమైన నిసుగు "శంభాజీ" పాలన గూర్చిన పద్యం, జిజియా బాయి అపురూపంగా చూచుకొంది శంభాజీని

సీ॥ అడ్డాల బిడ్డని యచ్చట ముచ్చట
నల్లారు ముద్దుగా నరయు పెరిమ
వేళకు పాలును విహితమౌ బువ్వను
త్రావింప తినిపింప తగిన యోర్పు
మెత్తని వెచ్చని పొత్తుల ననువుగా
మార్చి మార్చి పరచు మంచి శ్రద్ధ
. . . .

విహితమౌ బువ్వ, పొత్తిళ్ళ బిడ్డకు పొత్తి గుడ్డలు మార్చి, మార్చి తడి లేకుండా హాయి కల్పించడం ఎంత సహజ వర్ణన. ఎంతటి మాతృ భావన.

అలాగే కావ్యరూపం, కావ్య ప్రయోజనం రెంటిని రెండు రత్నాల్లాంటి పద్యాలో తెల్పిన సింహరాజ్ మహాకవి.

"ఇవి సిరాతో లిఖించిన యక్కరములు కావు" అంటూ, శంభాజీ రక్త బిందువులు లిపిగా మారి తెలుగు వారికి తమ గాధ తెలియచేశాయి, అని అన్నప్పుడు కవి మనో వేదన ఎవరు లెక్కగట్టగలరు?

అలాగే . . .

హింధూ ధర్మ రక్షణకు ఎలా చెయ్యాలో శివాజీ తెల్పితే "హిందూ ధర్మము రక్షింప నెట్టులుండ వలెనో మరణించి చూపె శంభాజీ భోస్లే! అంటూ ఒక కవిగా, ఒక చారిత్రక విషయ జ్ఞానిగా, మనందరికి ఒక మహారాష్ట్ర వీరుని చరిత్ర అద్భుతంగా అందించిన సింహరాజ్ గారు ధన్యులు, ధన్యులు. వారికి నా అభినందనలు.

– డా॥ సి. వసుంధర

ప్రమోదము

విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు
దేవీ భాగవత పద్య గ్రంథకర్త

శ్రీయుతులు డాక్టర్ సింగరాజు రామకృష్ణప్రసాదు రావు గారు నాకు మిక్కిలి సన్నిహితులు. వారు వైద్య వృత్తిని స్వీకరించియు మిక్కిలిగ సాహిత్య సేవను కొనసాగించు చుండుట ముదావహము. సాధారణంగా వైద్య వృత్తిలో నుండువారు మరల సాహిత్యంలో గొప్ప కృషి చేయడం చాల కష్టమైన విషయమే. వారు ఆంధ్ర ఆంగ్ల సాహిత్యములలోని అనేక గ్రంథములను నిరంతరము చదువుచూ వాటిలోని సారాంశములను కూలంకషంగా గ్రహిస్తుంటారు. వారు చక్కని విమర్శకులు గూడ. వారి ఉపన్యాస విషయములు సాధికారికంగా ఉంటాయి. వారు ఇది వరలో రచించిన పంచతంత్రము - ప్రపంచ తంత్రము అనే పద్య కావ్యాన్ని నేను చూచాను. పంచతంత్రములోని విషయాలను చిన్నచిన్న పద్యములలో రచించి వారు పండితప్రశంసల నందుకొన్నారు.

ప్రస్తుతం వారు రచించిన "ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే మహారాజె చరిత్ర" అనే గ్రంథమును నేను ఆమూలాగ్రము చదివితిని. చరిత్రలోని ప్రసిద్ధ పురుషులు కొందరు జనబాహుళ్యమునకు తగినంత పరిచయము లేక మట్టిలో మాణిక్యములవలె నేటికిని మరుగున పడియున్నారు. ఛత్రపతి శివాజీని గురించి పెక్కుమందికి తెలుసు కాని వారి కుమారుడైన "శంభాజీ" చరిత్ర చాల మందికి తెలియదు. అట్టి 'శంభాజీ చరిత్ర'ను ఆయన పాండిత్యమును దేశభక్తిని గూర్చిన విషయములనన్నింటిని సేకరించి ఒక గ్రంథరూపముగా వెలువరించిన శ్రీ సింహరాజు గారి కృషి అత్యంత అభినందనీయము. చరిత్రను ప్రతి యొక్కరు తెలిసికోవాలి. మన పూర్వులు ఏ విధమైన జీవితాన్ని గడిపారు, వారు ఏ విధంగా ప్రజలకు సేవ చేశారు,

వారి దేశభక్తి, సనాతన ధర్మమునందు వారికి గల అనురక్తి, వారి క్రమ శిక్షణ, వారి పరిపాలనా పటిమ, ఆనాటి సాంఘిక పరిస్థితులు తెలిసి కోవాలి. అందువలన భావి తరాల వారికి వారి జీవన విధానము ఆదర్శ ప్రాయమై ఏయే విషయాలలో ఎట్లు ప్రవర్తించాలో అర్థం చేసుకోవడానికి వీలౌతుంది. అట్టి జీవన విధానాన్ని మన మెందుకు అవలంబించ కూడదు అనే విచారణ మొదలై మనము సైతము ఉన్నత స్థితికి ఎదగాలనే ఆకాంక్ష కలుగక మానదు. పురాణ పురుషుల జీవితాలను తెలుసుకొని ఎందరో మానవులు మహనీయులైన విషయము మన మీకాలంలో కూడా చూస్తున్నాము.

డా॥ సింహరాజుగారు రచించిన ఈ గ్రంథము పాఠకులకు ఎంతో ఉపయోగ పడగలదు. మనకు పరిచయములో లేని అనేక తెలుగు పదాలను వీరు ఈ గ్రంథములో పొందుపరచి మరుగున పడిన తెలుగు పదాలను వెలుగులోకి తెచ్చారు. వీరి శైలి కొన్ని చోట్ల ప్రౌఢంగాను మరొక చోట సరళంగానూ సాగుతుంటుంది. కొండొకచో పద్యము యొక్కనడక ప్రాచీన కవుల పోకడలను సంతరించుకొని ఉంటుంది. మచ్చున కీ క్రింది పద్యమును గమనించుడు.

సీ॥ నిద్రాణ వహ్న్యద్రి నిప్పలం జిమ్ముచు
నాకస్మికస్ఫోట మైనయట్లు
ఉదధి యొక్కుమ్మడి యుడ్డామరమ్ముగా
ఉప్పెనయై భూమి నూడ్చినట్లు
వివిధ వల్లీగుల్మ వృక్షసాంద్రాటవి
చండదావాగ్నిని మండునట్లు
కొండలన్ సైతము బెండుల ట్లెగ మీటు
ఝంఝూ ప్రభంజనోచ్చలన మట్లు ॥

స్వర్ణ కశిపు రాణ్మందిర స్తంభ సంభ
వోగ్ర నరసింహరూప ధేయోగ్రశర్థ
దుర్నిరీక్ష్య క్రుద్ధానన దూర ధూత
పరిజనుండౌచు శంభాజి ప్రజ్వలించె ॥ 187పుట 934 ప.

ఈ పద్యమున శంభాజీ ఉగ్రరూపాన్ని నరసింహస్వామి రూపంగా పోల్చి చెప్పట అత్యంత హృద్యంగా ఉన్నది.

కొన్నియెడల చిన్న చిన్న పద్యముల ద్వారా సులభమైన శైలిలో మనకొక సందేశ మిచ్చినట్లుగా వీరి రచన కన్పించును. తేలిక భాషలో వీరు రచించిన పద్యమును గమనింపుడు.

మనము చూచు వస్తువు పరిమాణ మింత
యనుచు నొక్కచూపున కొల్వ గనుటఁ తప్ప
పయి పయిన కనరాదన్ని పార్శ్వములను
తఱచి తఱచి చూడ నిజతత్త్వమ్ము తెలియు ॥

213పేజి, 1066 పద్యం

పై పద్యము సులభంగా అర్థమౌతూ మనకొక సందేశ మిచ్చినట్లున్నది. ఈ విధంగా మొత్తము 2130 పద్యములతో 'శంభాజీ' జీవిత చరిత్ర నంతయు మన కెఱుక పరచినారు శ్రీ సింహరాజు గారు. ఎక్కువ భాగము మరాటుల మరియు ముస్లిముల పేర్లు, వారికి సంబంధించిన స్థలములు పద్యములలో ఇరికించుట చాల కష్టము. ఆ విషయములో వారు చాల పరిశ్రమ చేసి యుండ వచ్చును.

వారి లేఖిని నుండి యింకను అనేక గ్రంథములు వెలువడి యిట్లే పెక్కురు చారిత్రక పురుషుల గాథలు మరెన్నో తెలియ పరచగలరని ఆశించుచున్నాను. వారికి భగవంతుడు ఆయురారోగ్యములు ప్రసాదించు గాక !

ఇట్లు,
తేదీ : 16-1-2023

బుధజన విధేయుడు

నెల్లూరు.

విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు
దేవీ భాగవత పద్య గ్రంథ కర్త.

ధర్మ దీప్తి

డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు

చక్కని చారిత్రక నేపథ్యం గల పద్య ప్రబంధమైన శ్రీ శంభాజీ భోసలే మహారాజె చరిత్రను సింహరాజ్ అనబడే శ్రీ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాద రావు గారు రచించడం ముదావహం. హిందూ ధర్మరక్షణకు కంకణం కట్టుకున్న మహావీరుడు ఛత్రపతి శివాజీ గారు. ఆయన జ్యేష్ఠ పుత్రుడు శ్రీ శంభాజీ గారు. ఇతను గూడా ఛత్రపతిగా 9 సంవత్సరములు రాజ్యాన్ని పాలించాడు. ఒక శతాబ్దంపాటు చరిత్రలో మహారాష్ట్రులకు స్ఫూర్తి దాయకంగా నిల్చాడు. ఇటువంటి మహావీరుడు, ఆర్షధర్మ రక్షకుడు, స్వరాజ్య వర్ధనుడు, విద్వత్కవి, ధర్మ వీర, మహావీర, ఇత్యాది బిరుదులను గడించిన 'శ్రీ శంభాజీ భోసలే' గారి చరిత్రను పద్యరూపంలో దాదాపు 480 పేజీలలో లిఖించి, ఆంధ్ర సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానాన్ని ఏర్పరచి, తాను చక్కని పద్యకవిగా, చారిత్రక పండితునిగా, పేర్గాంచిన శ్రీ సింహరాజ్ గారు సర్వథా అభినందనీయులు.

ఆధునిక కాలంలో పద్యాన్ని బ్రతికించి, వ్యాప్తిచెందించే ఒక యజ్ఞంలో భాగంగా శ్రీ సింహరాజ్‌గారు తన వంతు కృషిని చేస్తున్నారు. ఏదో ఒక పద్య రచన అని కాకుండా, హిందూ ధర్మ రక్షకుడైన ఒక మహారాజు చరిత్రను వెలుగులోకి తీసుకరావడానికి పద్యరూపంలో తనకు తను ప్రకాశింపజేసిన విద్వత్కవి శ్రీ సింగరాజు రామకృష్ణ ప్రసాదు గారు. వీరు వృత్తిపరంగా వైద్యుడైనప్పటికీ, డాక్టరేట్ పట్టా లేకున్నా డాక్టర్ అనే ఉ పపదాన్ని సార్థకం చేసుకున్నారు. తన వృత్తిని చాలించినా సాహితీ వ్యా సంగాన్ని మానలేదు. ప్రాచీన కావ్యాలను భద్రపరచి, నిరంతరం పఠిస్తూ, అంతర్జాలంలో ప్రవచిస్తూ వీరు, సాహిత్యాన్ని పరిరక్షిస్తూ ఉన్నారు. ఎంతో పట్టుదలతో, కృషితో చారిత్రక పరామర్శతో నిరంతర పరిశ్రమతో ఈ గ్రంథం రచించి ఆంధ్ర సాహిత్యలక్ష్మి కిరీటంలో మరొక రత్నాన్ని పొదిగారు.

తన ముందు మాటలో శ్రీ సింహరాజ్‌గారు శంభాజీ జీవితాని పరిచయం చేశారు. ఇతడు కర్షక పక్షపాతి అనీ, కార్మికుల పట్ల అతనికి గాఢమైన సానుభూతి ఉన్నదని చక్కగా వివరించారు. మహారాష్ట్ర చరిత్రలో ఇతనికి సుస్థిరమైన స్థానం రావలసి ఉన్నా, అతని దురదృష్టం వల్ల విధి అనుకూలించక దుర్మరణం పాలైనాడని వీరు వివరించారు.

ఈ కావ్యం ప్రాచీన కవుల పరిచయంతో, దైవ స్తుతితో ప్రారంభమైంది. తెలుగు పద్యాల వైభవాన్ని ముందుగా పాఠకులకు నేత్ర పర్వం చేశారు.

చండ గదాప్రహారములు చంపక హారములట్లు లెంచుచున్
తొండము లెత్తి ఘీంకృతుల దుస్సహనాదము వైరి గుండెలన్
పిండి యొనర్ప నేలపయి పేరెము దీసెడు కొండలట్లు, వే
దండవిహార ధోరణుల దార్చు తలంపున కాంధ్ర పద్యముల్ ॥

12వ పద్యం

అన్ని విధములైన వృత్తములతో, పద్యాలతో ఈ కావ్యం మనో రంజకంగా ఉండి యుద్ధ ఘట్టములు చక్కగా వర్ణింపబడినవి. తెలుగు పదాలను విశేషంగా వాడి, భాషామతల్లికి సంతోషాన్ని కల్గించారు. ఇతి వృత్తమును బట్టి ఇతర భాషాపదాలు వాడబడినవి.

సందర్భోచితంగా శ్రీ కృష్ణ జననము చక్కగా వర్ణింపబడినది.

పుట్టిన వెంటనే జనని మోమయిన న్గనకుండ పెన్జడిన్
పుట్టిక పొత్తులన్ నిదుర పోయెడు పట్టిని మోచుకొంచు తా
గట్టులు రెండు దన్ని వడిగా ప్రవహించు కళిందవాహినిన్
నెట్టుచు రెండు పాయలుగనేగెను నా వసుదేవుడద్దరే ॥

662వ పద్యం

వసుదేవుడు కుమార్తెను తీసికొని పోయెడు ఘట్టాన్ని అందమైన తెలుగు పదాలతో వర్ణించడం ఆహ్లాద జనకంగా ఉంది. మోము పెన్జడి,

పుట్టిక, పొత్తులు, గట్టులు పాయలు ఇటువంటి తెలుగు పదాలు మరల మనస్మృతిలోకి తేగలిగారు.

ఈ విధంగా ఈ చారిత్రక ప్రబంధం మఱుగున పడిన చరిత్రను తెలుపుతూ చక్కని తెలుగు నుడికారాలతో కమనీయమైన వర్ణనలతో, ప్రబంధ పోకడలతో అలరారుచూ, పద్య సాహిత్యానికి ఊపిరి పోసినట్లు ప్రకాశిస్తూ ఉంది.

శివాజీ వలె అతని కుమారుడు కూడా గొప్పవాడని తెలపాలనే కవి యొక్క పట్టుదల, చారిత్రక పరిశోధన, నిరంతర కృషి, కవితా పటిమ ఈ గ్రంథం ద్వారా స్పష్టం అవుతూ ఉన్నాయి. మంచి ప్రబంధాన్ని అందించిన శ్రీ సింహరాజ్ గారికి ధన్యవాదములు, వారి మాటలలో వారి భావన -

"ఇవి సిరాతో లిఖించినట్టి వగుయక్క

రములుగావు - ఆశంభాజీ రక్త బిందువులె - లిపిగ మారి తెలుగు నందు తెలియజేసె......" ... సింహరాజ్.

ధన్యవాదములు.

నెల్లూరు. **డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వర రావు**

స్పందన

పోలవరపు లక్ష్మీనరసింహారావు
విశ్రాంత సీనియర్ ఉపన్యాసకులు
ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ, పల్లిపాడు
ఆంధ్ర పద్య సారస్వత పరిషత్ అధ్యక్షుడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

డా॥ శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు (సింహరాజ్) గారు వృత్తి రీత్యా వైద్యులు, ప్రవృత్తి రీత్యా పద్యకవులు. వారు రచించిన "ఛత్రపతి శ్రీ శంభాజీ భోసలే మహారాజు చరిత్ర" ఆంధ్ర పద్య సారస్వతంలో పద్య రూపంలో వచ్చిన చారిత్రక ప్రబంధం. రెండు వేలకు పైగా పద్యాలతో సరళ శైలిలో పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో నున్న పద్య గ్రంథము. ఈ గ్రంథములో వివరములను తెలుపుతున్న ముఖ్య శీర్షికలు, గ్రంథాన్ని సమగ్రంగా పరిచయం చేస్తూ ప్రబంధానికి శోభను గూర్చాయి.

అభవస్తవం (1) ద్వారా అచ్చతెలుగు పద్యాన్ని అందించిన సింహరాజ్ గారు సుకవి ప్రశంస (16)లో కవిత్రయాన్ని చక్కగా అర్చించారు శ్రీ సింహరాజ్ గారి పాతికేండ్ల బలమైన కోరికే నేడు ఈ పద్య ప్రబంధముగా రూపు దిద్దుకొన్నది.

వర్ణనలు కూడ సందర్భోచితంగా ఉండి రచయిత యొక్క భావ చిత్రణా నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి.

వివాహ విందు (98వ పద్యం), శివాజీ గెల్చిన కోటలు (117వ పద్యం), జీజియబాయి మనుమని లాలించుట 174, 180 పద్యాలు జీజియాబాయి మనుమనికై పరితాపము (306వ పద్యం), శివాజీ పట్టాభిషేకం (360వ పద్యం) శ్రీ శంభాజీ గారి కవితా పాండిత్యం, హోలిక పక్షపాతము గూర్చి వివరించిన (588, 589 మరియు 608 పద్యాలు)

శ్రీ సింహరాజ్‌గారి కవితా శైలికి నిదర్శనాలు, మచ్చుతునకలు. ఇంకా యుద్ధ ఘట్టము వర్ణనలూ కూడా వన్నె తెచ్చాయి.

ఛత్రపతి శివాజీ తనయుడు ఛత్రపతి శంభాజీ, ధర్మ రక్షకుడు, ధర్మ వీరుడైననూ అదృష్ట హీనుడు. జన్మించగనే జననిని పోగొట్టుకున్నాడు. యుక్త వయసులోనే ఆర్ష ధర్మం కోసం ప్రాణాలర్పించాడు. దాదాపు ఒక శతాబ్దంపాటు తన ప్రభావాన్ని ప్రజలకు పంచిన వాడైనా, చరిత్ర మరచిన మహాయోధుడు.

సింహరాజ్ గారు "ఛత్రపతి శంభాజీ" ఉత్థాన పతనాలను చాల చక్కగా వివరించారు. దురదృష్ట వంతులగు శ్రీ శంభాజీ, కవికలశులను (1933, 1999) చిత్రహింసలకు గురిచేయు వర్ణనలు హృదయ విదారకములు. నాటి ఘటనలను 'కవి' దర్శించి వ్రాసినట్లున్నారు. సింహరాజ్ గారు నవరసాలను తన పద్యములతో పలికించినారు. వారి కవితా పటిమ, సామర్థ్యము, సహజత్వము, వర్ణనాత్మకత బహుథా ప్రశంసనీయము.

శుభాభివందనములతో . . .

9-2-2023 **పోలవరపు లక్ష్మీనరసింహారావు**

భావానుభవం

దేవరకొండ మురళీకృష్ణ

రచయిత, వాగ్గేయకారుడు

డాక్టర్ సింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాద్ : ఈ పేరు చెపితే ఎవరూ గుర్తించ లేరు. "సింహరాజ్" అంటే ... వీరిని గుర్తించలేని వారికి వీరి రచనలు ఒకదాని వెంబడి మరొకటి వరుసలో నిలబడి వీరంటే ఏమిటో వివరిస్తాయి. కథావస్తువు ఏదైనా గానీ, సరసత, సరళత, లోకహిత కావ్య నిర్మాతగా ముందుగా "సింహరాజ్"నే ప్రస్తావించుకోవాలి. వీరి సాహిత్యంలో పదనిర్మితి ఆ కథా సన్నివేశానికి ఎంత సన్నిహితంగా ఉంటుందో వీరి పలకరింపులో మైత్రీపరిమళం అంత పులకరింప జేస్తుంది. ఇక వీరి ప్రకృతిలో మనకు గోచరం కాని ఎంతో నిగూఢమైన కృతి కర్తృత్వం దాగివుంది. అంత అతి సామాన్య వేషధారణ వీరిది.

వీరితో ఒకసారి సంభాషిస్తే చాలు వీరిలో నిక్షిప్తమైన అద్భుత పరిశీలన, అమోఘ పరిశోధనతో పాటు ఆశ్చర్యంగా వీరి ముఖ మండలంలో ఒక గురువు, ఒక శిష్యుడు కూడా ఇలా కనపడి అలా వెళ్ళిపోతుంటారు. అంటే వీరు చెప్పే విషయం ఏదైనా ఒక గురువు బోధిస్తున్నట్టు (ప్రామాణికంగా), మనం చెప్పే విషయం వారికి తెలిసివున్నదైనా, ఒక విద్యార్థిలాగా ఆసక్తిగా వింటున్నట్లుండటం! కేవలం వీరితో నాకున్న స్వల్పకాలిక పరిచయమే వారి గురించి ఇంత చెప్పిందంటే, ఇక ఆపై అనుభూతిని ఊహించగలమా!

దేవరకొండ మురళీకృష్ణ

"షట్చక్రవర్తి చరిత్ర వచన ప్రబంధ కర్త"

ధర్మ వీరము

ఉన్నం జ్యోతివాసు
ప్రసన్న కవి, విమర్శకాగ్రేసర, విశ్లేషకశేష,
వేములవాడ, ప్రకాశం జిల్లా.

ఏ యుద్ధం ఎందుకు జరిగెనొ – ఏ రాజ్యం ఎన్నాళ్లుందో
తారీఖులు దస్తావేజులు – ఇవి కావోయ్ చరిత్ర కర్థం
ఈ రాణీ ప్రేమ పురాణం – ఆ ముట్టడికైన ఖర్చులూ
మతలబులూ, కైఫీయతులూ – ఇవి కావోయ్ చరిత్ర సారం
ఇతిహాసం చీకటి కోణం – అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు ! – దాచేస్తే దాగని సత్యం ॥

– అన్నాడు మహాకవి శ్రీశ్రీ. మహాకవి ఇలా నిర్వచించడానికి కారణం లేకపోలేదు. ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు కార్లైల్ 'చరిత్ర అంటే గొప్పవారి జీవిత చిత్రణ' – అన్నాడు. దాంతో చరిత్ర అంటే రాజుల జీవిత చరిత్ర, రాజవంశాల వృత్తాంతమన్న భావన ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని ఖండిస్తూ శ్రీశ్రీ చరిత్రకుగల విశాల దృక్పథాన్ని సరికొత్త చూపులతో ప్రదర్శించాడు.

చరిత్ర మానవ జాతి క్రమవికాస పరిణామాలను వివరిస్తుంది. చరిత్రకు మనిషి కేంద్ర బిందువు. అతని మాటలు, చేతలు, ఆలోచనలు, వివిధ కోణాల్లో పరిశీలింపబడినప్పుడు అది చరిత్ర అవుతుంది. దేశాభ్యుదయం కోసం శ్రమించిన మహనీయుల ఇతివృత్తాలే కాకుండ దేశద్రోహుల ప్రసక్తి కూడా చరిత్రలో కన్పిస్తుంది. ఒక దేశ చరిత్ర అంటే ఆదేశం యొక్క ఆర్థిక, రాజకీయ, మత, సాంఘిక, నైతిక ప్రవర్తనల సమాహారమే.

History is His Story – అని చమత్కరించారొక మేధావి. ఒక హాస్యగాడి తల క్రింది దిండు ఎప్పుడూ కన్నీటితో తడిసి ఉటుందని 'చార్లీ చాప్లిన్' అన్నట్లుగా ఇందులో కూడ లోతైన సత్యం లేకపోలేదు. తమ స్వీయ అభిప్రాయాలను

నమ్మకాలను ఆమోదింపజేయడం కోసం బుద్ధి పూర్వకంగా చరిత్రనూ, సిద్ధాంతాలను వక్రీకరించడం దాదాపు అన్ని దేశాల్లోను జరిగింది.

చరిత్రను సంస్కృతి పెనవేసుకుని ఉంటుంది. చరిత్ర వెన్నెముక అయితే సంస్కృతి ఒక నిండైన దేహం. చరిత్ర చెట్టుబోదె అయితే సంస్కృతి శాఖోప శాఖలు. ఇంకా చెప్పాలంటే చరిత్ర రాజనాయకం. సంస్కృతి ప్రజానాయకం. చరిత్రలో గాని, చారిత్రక కావ్యాలలోగానీ ఇవి రెండూ ఒకదాన్నొకటి పెనవేసుకుని ఉంటాయి.

స్వభావతః చరిత్ర, కావ్యం పరస్పరం విరుద్ధాలు. చరిత్ర జరిగిపోయిన మహాయుద్ధాలను, శిథిల నగరాలను, కట్టడాలను, ఒకనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను గురించి చెప్తుంది తేదీలతో సహా. కానీ ఆ వీరుల భావోద్రేకాలను, నాటి ప్రజల హృదయ స్పందనలను చరిత్ర చెప్పదు. భావుకుడైన చరిత్ర కారుడు తన భావనాబలంతో ఆ సజీవ దృశ్యాలన్నిటిని తన రచనలో చిత్రిస్తాడు. అప్పుడు అది చారిత్రక కావ్యమవుతుంది. అది పాఠకుల్లో దేశభక్తిని రేకెత్తిస్తుంది. తమ సంస్కృతీ సంప్రదాయాలపట్ల ఆసక్తిని కలిగిస్తుంది. జాతిలో జాతీయతను, ఐకమత్యాన్ని, ఆత్మాభిమానాన్ని రేకెత్తిస్తుంది. అదే చారిత్రక కావ్య ప్రయోజనం.

చరిత్ర కారుడు వేరు, కావ్య కర్త వేరు. కవి మొదట ఒక చరిత్ర ఘట్టాన్ని కావ్య వస్తువుగా మలుచుకుంటాడు కవి యొక్క దర్శనం నుండి పుట్టే ఒక ప్రయోగ భూమిక వస్తువు. దానికి కవినేర్పిన స్వభావం ఒంట బడుతుంది. కవి అలవరచిన కవి కృత స్వభావాలను బట్టి కొండొకచో అతిదేశాలు తప్పవు. అభినయం అలవడుతుంది. చరిత్ర కన్నా చారిత్రక కవిత్వానికే, అనుభవాన్నిచ్చే ఆలోచనా శక్తి ఎక్కువ. జీవిత తత్వాన్ని వ్యాఖ్యానించే వివేచనా శక్తి ఎక్కువ.

చరిత్ర రచన ఎంత కళా సౌందర్యాన్ని ఒలకబోసినా అది కావ్యం కాదు, కాబోదు. అలాగే కావ్యరచన కూడ ఎంతటి సత్యనిష్ఠను ప్రకటించినా చరిత్ర కాబోదు. చారిత్రక కావ్యకర్తకు చరిత్రలోని ఒక ఘట్టాన్ని కళాత్మకంగా వ్రాద్దామన్న దృక్పథం కన్నా ఆ వస్తువు ద్వారా జాతికి ఒక కొత్త సందేశాన్ని అందిచాలన్న ఆకాంక్ష బాగా ఉంటుంది.

సనాతన ధర్మాన్ని స్థాపించడానికి కంకణం కట్టుకుని పాటుపడ్డ వాళ్ళలో రాజపుత్రులు, మహారాష్ట్రులు ముఖ్యులు. రాజ పుత్రులు కొందరు కాలక్రమంలో శత్రువులను ధిక్కరించి ప్రాణాలు కోల్పోయారు. కొందరు శత్రు సింహాసనాలకు మోకరిల్లారు. కొందరు వాళ్ళ అభివృద్ధికి పట్టుగొమ్మలయ్యారు. కొందరు రాజపుత్ర స్త్రీలు మొగలు జననాల్లో ప్రవేశించారు. అది కాల మహిమ.

కానీ మహారాష్ట్రులు మాత్రం లొంగలేదు. వాళ్ళు కార్యశూరులు, కార్య సాధకులు. భారతీయ ధర్మం కోసం తమ ప్రాణ, మానాలను అర్పించారు. వాళ్ళ జీవిత చరిత్రలు చాలా కలవు. విషాదాంతాలు ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని రగిలించాయి.

కొందరు రాజపుత్ర వీరుల గాథలు కూడ విషాదాంతమే. బానిసత్వాన్ని ధిక్కరించే ఉద్యమానికి ఊపిరి పోసిన ఉజ్వల గాథలవి. వాటిలో భారతీయమైన వీర రస సిద్ధి, పాశ్చాత్య విషాదాంత గాథా స్ఫూర్తి రెండూ ఉన్నాయి. ఇవి రెండూ మాటల కందని ఒక వింత అనుభవాన్ని అందిస్తాయి. దుర్భాక రాజశేఖర శతవధాన్ని గారు రాజపుత్రుల గాథలను రాణాప్రతాప సింహ చరిత్ర, రాణా అమర సింహ చరిత్ర, చంద్ర నృపాల చరిత్ర మొదలైన కావ్యాలుగా సంతరించారు. వీటిలో 'రాణాప్రతాప సింహ చరిత్ర' జాతి రత్నంలా మెరిసింది.

మరాఠా వీరుడు శివాజీ వీరగాథను గడియారం వేంకట శేషశాస్త్రి గారు. 'శివ భారత' మహా కావ్యంగా చిత్రించారు. చారిత్రక కావ్యాల్లో ఇది తలమానికం. దుర్భాకవారు కవిత్వంలో జాతిలో ఆవేశం మొలకెత్తించారు. గడియారం వారు కవిత్వంతో జాతిని ఆలోచింపజేశారు. శివాజీ చరిత్రలో ఎంత యుద్ధగాథ ఉందో అంత ధర్మబోధక్కడ ఉంది. జాతికి వీరమాతలు కావాలి. ధర్మ వీరులు కావాలి. ధర్మం త్యాగశీలంతో తేజరిల్లాలి. భక్తిగా మొదలై శక్తిగా రూపొందాలి. ఈ సూత్రంతో శివభారతం దేశభక్తిని, ధర్మ శక్తిని ప్రబోధించింది.

శివాజీ కొడుకు శంభాజీ. అతడు కూడ సనాతన ధర్మ రక్షణ కోసం తన శరీరంలోని ప్రతి కణాన్ని తన రక్తంలోని ప్రతి రక్త కణాన్ని దాచుకోకుండా

ఖర్చుపెట్టి ప్రాణాలర్పించి ధన్యుడైన దేశభక్తుడు. కానీ అతని చరిత్ర ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగునపడి కన్పించకుండా పోయింది. జ్ఞానకాంతులు సారించి, చీకటి పొరలను ఛేదించి, శంభాజీ చరిత్ర శక్తులను వెలికితీసి, ఇదిగో! ఇప్పుడు సింహరాజు గారు ఒక మహాకావ్యంగా రూపొందించారు. శంభాజీ కీర్తిచంద్రికలను తెలుగు నేలపై ప్రసరింపజేసారు. అతని త్యాగశీలంలో తెలుగు పద్యాలు తడిసిపోయాయి. మొట్టమొదటిసారి తెలుగు జాతికి 'ధర్మవీర ఛత్రపతి శంభాజీ చరిత్ర'ను పరిచయం చేస్తున్నది శ్రీ సింహరాజ్ గారే.

భారత దేశం ఇస్లాం దేశంగా మార్చాలన్నది ఔరంగజేబు కల. అతనికి ముందు అటువంటి కలలు చాలామంది కన్నారు. కానీ, భారతీయ ప్రభువుల ధర్మనిరతి వల్ల అవి పగటి కలలుగా మిగిలిపోయాయి. ఈ సందర్భంగా జరిగిన "మారణహోమం"లో రెండు వైపులా యోధానుయోధులెందరో మట్టి కరిచారు. అచ్చంగా ఔరంగజేబు ప్రయత్నాల్లోనే లక్షలమంది వీరులు ప్రాణాలు కోల్పోయారు.

ఔరంగజేబు స్వయంగా దక్షణాదిపైకి దాడికి వెళదామనుకున్నాడు. కానీ అతను తన నీరసతను నమ్మాడు. ఆ ప్రాణ భయంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు. శివాజీ జీవిత కాలంలో, అతడు దక్షిణ భూములవైపు కన్నెత్తి చూడడానికే వణికిపోయాడు. క్రీ.శ. 1680లో శివాజీ గతించాక అతనిలో మరల ఆశలు చిగురించాయి.

శివాజీ పెద్దగా చదువుకోకపోయినా చాలా ముందు చూపు కలవాడు. గొప్ప యుద్ధవ్యూహ చతురుడు. రాజనీతి కోవిదుడును. తన నేర్పరితనంతో హిందూ రాజ్యాన్ని బాగా పటిష్ఠ పరిచాడు. అతడింకొక పదేళ్లు బ్రతికినట్లయితే దాన్నింకా నిలబెట్టి వుండేవాడు. ఆ బాధ్యతను శంభాజీ తీసుకున్నాడు. అతడనేక భాషలలో పండితుడు. గొప్ప యుద్ధ వీరుడు. నాయనమ్మ జీజియాబాయి పోషణ, గురువుల శిక్షణ, తండ్రి అడుగుజాడల్లో సుశిక్షితుడయ్యాడు. ఆర్ష ధర్మ రక్షణకు పూనుకున్నాడు.

చిన్నవయస్సులోనే యుద్ధాల్లో పాల్గొన్నారు. పదేళ్ల ప్రాయంలోనే

తండ్రితో పాటు తాను ఔరంగజేబు చేసిన మోసంవల్ల చెరలో ఉండవలసి వచ్చింది. తండ్రి ఉపాయంవల్ల తామిద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. తండ్రి తర్వాత తాను ఛత్రపతి అయ్యాడు. మొఘల్ పాలకులకు చుక్కలు చూపించారు. మొగలుల వలన హిందూ స్త్రీల మాన ప్రాణాలను కాపాడారు. శివాజీ తర్వాత దక్షిణాదిని ఆలవోకగా ఆక్రమిద్దామనుకున్న ఔరంగజేబుకు సింహస్వప్న మయ్యాడు.

శంభాజీని అణచివేయడానికి ఔరంగజేబు తన పెద్దకొడుకును ససైన్యంగా వెళ్ళమని ఆదేశించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో వున్న అమీర్‌ఖాన్ తోడుగా వస్తేగాని వెళ్ళలేనన్నాడతడు. అమీర్‌ఖాన్‌ను పంపిస్తే ఆఫ్ఘనిస్థాన్ చేజారి పోతుంది. శంభాజీ విక్రమం తెలిసిన మొగలు సైన్యం అతనిపై దాడికి సిద్ధంగా లేదని ఔరంగజేబుకు ఆలస్యంగా తెలిసి వచ్చింది.

శంభాజీ ఎంత యోధుడైనా, ఎంత విద్యావేత్తయినా తండ్రి కున్నంత ముందు చూపులేదు. ఔంరగజేబు బీజాపూరు, గోల్కొండ సుల్తానులను లొంగ దీసుకున్నప్పుడు శంభాజీ అతన్ని ఎదిరించి తరిమినట్లయితే తన జీవితం అర్థాంతరంగా ముగిసేదికాదు. తనపైకి వచ్చినపుడు చూసుకుందాంలే అని అతడు తన ఆంతరంగిక వ్యవహారాలను చక్కదిద్దుకోవడంలో మునిగిపోయాడు. ఔరంగజేబు అది గ్రహించాడు. పావులు కదిపాడు. మహారాష్ట్రలో కొన్ని హిందూ స్వరాజ్య భాగాలపై దాడిచేసి, ఆక్రమించాడు. అయినా శంభాజీ బ్రతికున్నంత వరకు మహారాష్ట్ర తనకు అందదని అర్థమయింది. శంభాజీని తన వైపుకు తిప్పుకోవడానికి వ్యూహాలు రచించారు.

శంభాజీ శివాజీ వంటి వ్యూహకర్త కాదు. తండ్రి గతించాక మంత్రులు, సేనాపతులు, అందరి సమ్మతితో సింహాసనం ఎక్కవలసి వచ్చింది. అది పాటించ కుండా అభిషిక్తుడు కావడం వల్ల అతనికి వాస్తవ పరిస్థితి తెలిసిరాలేదు. పుస్తకాల్లో చదువుకున్న రాజనీతిని నిజజీవితంలో అవలంబించ లేక పోయాడు. శివాజీ వద్ద పనిచేసిన అనుభవజ్ఞుల అభిప్రాయాలను మన్నించకుండా ఔరంగజేబుతో నిరంతర యుద్ధాలు చేశాడు. శివాజీ ఏర్పాటు చేసిన పటిష్టమైన రక్షణ వ్యవస్థల కారణంగా ఔరంగజేబు ఎత్తులు పారలేదు.

శంభాజీ అంతఃపురంలోని రాజకీయ వారసత్వ కలహాల గురించి ఔరంగజేబుకు ఉప్పందింది. జిత్తులు ప్రయోగించాడు. దాంతో శంభాజీ ఆంతరంగికులు ఔరంగజేబుకు అమ్ముడు పోయారు. ఇంటి దొంగల కారణంగా 1689 ఫిబ్రవరిలో ఔరంగజేబు సేనాని ముకర్రబుఖాన్ శంభాజీని, అతని సలహాదారుడు కవికలష్‌లను మోసపూరితంగా బంధించాడు. తన ఏకపక్ష నిర్ణయం వలన శంభాజీ అప్పుడు పశ్చాత్తాప పడ్డాడు. కానీ అప్పటికే సమయం మించిపోయింది.

ఇస్లాంలోకి మారితే ప్రాణభిక్ష పెడతానన్నాడు ఔరంగజేబు. తన తనువు లోని కణకణం, తన జీవితంలోని క్షణక్షణం ఆర్షధర్మరక్షణకేనని ఉద్ఘాటించారు శంభాజీ. ఔరంగజేబు క్రుద్ధుడయ్యాడు. 40 రోజులపాటు శంభాజీని చిత్ర హింసలు పెట్టారు. ఒళ్లంతా తూట్లు, తూట్లుగా పొడిచారు. గోళ్ళు పీకారు. కళ్ళు పొడిచారు. నాలుక కోశారు. చర్మం వలిచారు. అయినా శంభాజీ చలించ లేదు. నీకూతురునిచ్చి పెళ్ళి చేసినా ఇస్లాంలోకి మారనన్నాడు. అప్పటికీ అతని దేహం పచ్చి మాంసం ముద్ద అయింది. ఈగలు, చీమలు పట్టాయి. అంతులేని యాతనతో విలవిలలాడిన అతని ప్రాణం 1689 మార్చి 11న శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంది.

శంభాజీ ఇస్లాంలోకి వస్తే దక్షిణ భారత మంతా సులువుగా ఇస్లామీకరణ మవుతుందని ఔరంగజేబు నమ్మారు. శంభాజీ బలిదానంతో ప్రజల్లో ఆర్షధర్మ రక్షణ బలపడింది. అది ఔరంగజేబును ఉన్మాదిని చేసింది. శంభాజీ శవాన్ని ముక్కలు ముక్కలుగా నరికించి నదిలో పారేయించారు. ప్రజలు నదిలో పడిన అతని మాంస ఖండాలను ఏరితెచ్చి, కుట్టి పూణె దగ్గర ఉన్న భీమానది ఒడ్డున అంతిమ సంస్కారాలు చేశారు. ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు.

శంభాజీ చరిత్రను ఎంతో పరిశోధించి డా॥ సింహరాజుగారు ఒక చారిత్రక కావ్యంగా వ్రాశారు. ఇందులో దాదాపు 2130 పద్యాలున్నాయి. ఒక మహాకావ్యానికి కావలసినంత రాశిఇది. ఇందులో ఒక విషాదాంత కావ్యానికి కావలసినంత బరువైన వస్తువుంది. ఆయా సందర్భాలో కవి ఆ విషాదాంత వాతావరణాన్ని తగినంత మేరకు ప్రదర్శిస్తూ ఈ కావ్యాన్ని నిర్మించారు.

లోకం శివాజీని ఛత్రపతిగా గౌరవించింది. శంభాజీని ధర్మ వీరునిగా కీర్తించింది. అతని ధర్మ వీరత్వాన్ని ప్రదర్శించడానికి కావలసినన్ని సందర్భాలు అతని జీవితంలో చాలా ఉన్నాయి. వాటన్నిటిని సింహరాజుగారు తమ కావ్యంలో గుదిగుచ్చారు. అతన్ని ధర్మ వీరునిగా చిత్రించారు.

మహాభారతంలోని రసం ధర్మవీరం. అందలి నాయకుడు ధర్మరాజు. ప్రాణాంతకమైన కురుక్షేత్ర సంగ్రామంలో విజయం అతన్ని వరించింది. శంభాజీ కూడ ధర్మవీరుడే. తన సుఖం కన్నా తన మాతృభూమి, తన ప్రజలు, తన స్వధర్మ రక్షణనే ప్రాణంకన్నా మిన్నగా నమ్మిన ధర్మవీరుడతడు. ఔరంగజేబు తనను ఇస్లాంలోకి మారమన్నపుడు

మతమును మార్చుకొమ్మనుచు మాటికి మాటికి చెప్పుచుంటిరే
మతమును మార్చుకున్న యది మాతనె మార్చినయట్లు గాదె-జీ
వితమున మాత యొక్కతయె వేరికినైనను నుండు పూజ్యయై
మతియుతు లెవ్వరైన నిలమార్చరు స్వీయ మతమ్ము నెప్పుడున్॥(1980ప)

బుద్ధున్న వాడెవడూ అమ్మలాంటి మతాన్ని మార్చుకోరు అంటారు శంభాజీ. శంభాజీ దృష్టిలో మతమంటే - ప్రేమ, అహింస, త్యాగం, పరోపకారం వంటి ధర్మవైశాల్యం గల ఒక అందమైన ఆలోచనా మార్గం. అది భరత క్షోణిని అందరికీ అమ్మను చేసింది. ఔరంగజేబు దృష్టిలో మతమంటే స్వార్థం, పగ, హింస, విధ్వంసం వంటి పదునైన భావాల మార్గం. అది రాజ్యాన్ని సవతి తల్లిని చేస్తుంది. మతం మారడమంటే కన్న తల్లికి కూడు పెట్టకుండా పిన తల్లికి కడియాలు చేయించినట్లే గదా! "బుద్ధున్న వాడెవడైనా మతం మారతాడా" అని ఔరంగజేబుతో అంటాడు. అందుకు ఫలితంగా దారుణంగా శిక్షింప బడ్డాడు. ఆ యాతనలను ఇష్టంగా భరించాడు. నిజమైన ధర్మవీరుడయ్యాడు. దాన్ని కావ్యాంతంలో కవి స్పష్టంగా చెప్పాడు.

నెత్తురు కారు గాయము లనేకము లున్నను కాయమెల్లెడన్
మొత్తుచు కర్రలన్ కటికమోగలు బంటులు మేని కండలన్
తుత్తుమురున్నొనర్చిన-కనుల్ పెకలించిన-నాల్క చెండినన్
చిత్తమునందు శంభునకు చింత స్వరాజ్య, స్వధర్మ రక్షణే ॥

మేని కండలన్ తుత్తుమురున్నొనర్చిన, కనుల్ పెకలించిన, నాల్క చెండినన్ – అన్న వాక్యాలు మాంసపు ముద్ద అయిన శంభాజీ దేహస్థితిని, ఆత్మ వ్యధను హృదయ విదారకంగా చిత్రించాయి. అంతటి కక్కసపాటును స్వరాజ్యం కోసం, స్వధర్మం కోసం ఓర్చుకున్నాడు. అదీ ధర్మ వీరం. అతని బలిదానం. గడ్డిపోచకు కూడ చేవను తెచ్చింది. మాతృభూమి కోసం ఆర్షధర్మరక్షణ కోసం కత్తులు దూయించింది. ఔరంగజేబును పొలిమేరలదాక తరిమి కొట్టింది. జీవితాంతం అతనికి అశాంతిని మిగిల్చింది.

దీన్ని చారిత్రక కావ్యంగా వ్రాయడానికి సింహరాజుగారు యథాశక్తి శ్రమించారు. చరిత్రను చరిత్రగానే చెప్పారు. ఎక్కడా వక్రీకరణలు, పూర్వాపర విరుద్ధాలు, పక్షపాత ధోరణులు ప్రదర్శించలేదు. అలంకారిక ఆడంబరాలు, దీర్ఘసమాసాడంబరాలు, అసందర్భ వాగ్విజృంభణలు వంటివి ఇందులో కన్పించవు. చరిత్ర కావ్యాల్లో ఒక్కోసారి కథ ఎటు నుంచి ఎటుపోతుందో పాఠకులు బుర్రగోక్కునే సందర్భాలూ అక్కడక్కడా తగులుతాయి. ఈ కావ్యంలో ఆ గజిబిజి కన్పించలేదు. కథా సంఘటనలన్నీ ఒక క్రమోన్మీలనంతో చక్కగా సాగుతాయి.

గడ్డిలో దాగి ప్రాకెడి కాలనాగు
నిండుగా పూరి కప్పిన నేలబావి
పొదలలో పొంచియున్న బెబ్బులియు – కప్ప
యెలుగు పాము, మధు విలిప్త హేతి – షిర్కె ॥

అంటూ దుర్మార్గుడైన షిర్కె స్వభావాన్ని వర్ణించినప్పుడును –

నీటి చుక్కలెన్ని యేట గలసిన గాని
ముత్యమగుచు నొకటి భూషయగును ॥

అంటూ మరాఠా యోధులు శివాజీ, శంభాజీలను కావ్యాంతంలో వర్ణించినప్పుడు ఇలా అక్కడక్కడా కథా రచనలో కొంత కవితా కస్తూరి పరిమితంగా పరిమళించింది.

ఈ చారిత్రక గాథలో చాలా గాఢమైన విషాద వాతావరణం ఉంది.

శంభాజీ, కవికలషులను ఔరంగజేబు చిత్రహింసలు పెట్టాడు. దాన్ని కవి స్వభావోక్తులలో ఒక చరిత్ర కారునిగా కథనం చేశారు. కానీ అందులో ఆ విషాద వాతావరణాన్ని ఆ విషాదాంతాన్ని ఇంకొంచెం గాఢంగా చిత్రించ దగినంత అనుకూలత ఉంది. కరుణ రసప్లావితం చేయదగినంత రస స్ఫోరకమైన స్పేస్ మిగిలిఉంది. సింహావలోకనంలో కొంత చరిత్ర సమీక్ష కూడా కన్పిస్తుంది. అయినా ఇంత పెద్ద పద్య కావ్యం వ్రాయడానికి ఓర్పు, నేర్పు ఉండాలి. అందులో సింహరాజుగారు కృతకృత్యులయ్యారు.

ప్రాచీన చరిత్ర అంతా భిన్నవర్గాల ఘర్షణే నని 'మార్క్స్' సిద్ధాంతీక రించాడు. దాన్ని మహాకవి శ్రీశ్రీ -

పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను

–అని కవిత్వీకరించాడు. అది శంభాజీ చరిత్రలో స్పష్టంగా కన్పిస్తుంది.

సింహరాజ్ అన్న కలం పేరుగల శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాద రావు గారు వృత్తి రీత్యా వైద్యులు. ప్రవృత్తి రీత్యా మంచి పద్యకవి. ఉత్తమ అభిరుచిగల సాహిత్యవేత్త. చాలా సరళ స్వభావులు. ఆయన మాటలో లోతు ఉండదు. స్పష్టత, మృదుత్వం పరిమళిస్తాయి. నిరాడంబరత, ముక్కుసూటిదనం, వాస్తవిక దృక్పథం ఆయన వ్యక్తిత్వానికి అదనపు అలంకారాలు. ఈ లక్షణాలు ఆయన కావ్య కన్యలోనూ కన్పిస్తాయి.

సంప్రదాయ సాహిత్యం పట్ల సద్భక్తి, సనాతన ధర్మం పట్ల అనురక్తి ఆయన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దాయి. గతంలో ఆయన 'పంచ తంత్రంలో ప్రపంచతంత్రాన్ని' దర్శించారు. ఇప్పుడు ఒక మరాఠా యోధుని వీరగాథలో చారిత్రక మూల్యాలను కొల్లగొట్టారు. గతి శీలకమైన వారి మేధకు నా అభినందనలు.

శోభన నామ సంవత్సరం
జ్యేష్ఠ కృష్ణ పంచమి
గురువారం, 08-06-2023

ప్రసన్న కవి
ఉన్నం జ్యోతివాసు
వేములవాడ, ప్రకాశం జిల్లా.

సీ॥ శివసమారబ్ధ హైందవ ప్రజా స్వాతంత్ర్య
సామ్రాజ్య రక్షాద్రిసార దుర్గ
మొగలు దుష్ప్రాభవామూల శిఖాసము
త్ఖాతక్రియా చణ ఖాత్ర కోటి
కీనాశ, కీనాశ కీలాల పానతుం
దిల భూప వన దవ దీదివిశిఖ
యవినీతి మార్గ సమార్జిత ధనమత్త
దురధికృతజనాబ్ధ ధూననమ్ము ॥

తే॥గీ॥ 'కన్నడ' 'విజపుర' 'హ్మాద్నగ' 'ర్మొగలు'నృ
పాళి రాజ్యకాంక్షా దివాస్వప్న భంగ
కరణ దారుణ రణ రణత్కాంస్య భేరి
వీర శంభాజి దూసిన విచ్చుకత్తి ॥

సీ॥ నిర్నిరోధమ్మొగ నింగికి నెగసెడు
మేచ్ఛాగ్నికి యుగాంత మేఘకోటి
పంచమకార దుర్వ్యసనమత్తమలక
గజమదమణచు సింగంపు కొదమ
మహరాష్ట్ర భారమ్ము మాంసలాంసముపైన
కడదాక మోసిన కర్మయోగి
వేద ధర్మాపగ వేగమ్ము నాగెడు
కుటిల తౌరుష్క్యాద్రి కులిశ ధార॥

ఆ॥వె॥ యోధనమ్మె గాదు బోధమందును గూడ
అగ్రగణ్యుడగు కుశాగ్ర బుద్ధి
కదనకర్తయయ్యు గ్రంధకర్తయు గూడ
'శంభుజీ'కి సాటి శంభురాజె॥

సీ॥ ఔరంగజేబును యామ్యాశ కీడ్పించె
ఢిల్లి భోగముల మాటెత్త కుండ
వెలలేని శిఖిరత్న పీఠిని విడనాడి
యున్ని కంబళుల కూర్చుండ బెట్టె
చదలంటు మణి మయ సౌధముల్ స్వప్నమై
మొరటు చప్రములందు మునుగ జేసె
చీకిరి మంగోలు చిన్న కండ్ల కపటి
చోరేక్షణముల కన్నీరు నింపె॥

తే॥గీ॥ పుడమి యంతయు నోడిలోన పడతలంచు
నెల్లలేని దాహర్తు గొంతెండ బెట్టె
యెడ తెగని యుద్ధములకు ప్రేరేచి యతని
పృతనలను గొప్ప చీకాకు పెట్టె శంభు॥

ఉ॥ నెత్తురు కారు గాయముల నేకము లున్నను కాయమెల్లెడన్
మొత్తుచు కర్రలన్ కటిక మోగలు బంటులు మేనికండలన్
తుత్తుమురున్నొనర్చిన - కనుల్ పెకలించిన - నాల్క చెండినన్
చిత్తము నందు శంభునకు చింత స్వరాజ్య, స్వధర్మ, రక్షణే ॥ 2128